

సర్వ మానవాళికి శివపరమాత్ముని సలహాలు
భగవంతుని సత్య స్వరూపం
దాదీ హృదయ మోహిని గారు
(ప్రస్తుతం ఈమె శరీరంలోకి భగవంతుడు ప్రవేశించి జ్ఞానాన్ని తెలియపరుస్తున్నారు)
సకల చరాచర సృష్టి యొక్క
సృష్టికర్త జ్యోతిబిందు శివపరమాత్మ

# సర్వ మానవాళికి
# శివపరమాత్ముని సలహాలు

ఈ భూలోకంలో మానవులతో పాటు అనేక జీవరాశులు భగవంతుడు నిర్ణయించిన ప్రదేశాలలో తమ జీవనాన్ని సాగిస్తున్నాయి. వీటిలో మానవజన్మ ఉన్నతమైనది, ఈ భూమి మానవులకు కర్మక్షేత్రం. ఈ క్షేత్రం ప్రతీ 5000 సం॥లకు ఒకసారి పాతదిగా, పనిచేయలేని స్థితిలో, లోకధర్మానుసారం నిస్సారం అయిపోతుంది. 5000 సం॥లు అయ్యేసరికి భిన్న భిన్న శరీరాలు ధరించి పాత్రను అభినయిస్తున్న ఆత్మ కూడా అలసిపోతుంది. ఈ విషయాలు సృష్టికర్త ఒక్కరికే మాత్రమే తెలుసు. ఆయనే సూక్ష్మాతి సూక్ష్మ జ్యోతిస్వరూపుడు శివపరమాత్మ. పరమాత్మ సూర్య చంద్ర నక్షత్ర మండలాలకు పైన పరంధామంలో ఉంటారు. శివపరమాత్మ కర్మలకు అతీతుడు. శివపరమాత్మ ప్రతీ కల్పానికి ఒకసారి అనగా 5000సం॥లకు ఒకసారి ఒక వృద్ధ మానవ శరీరాన్ని ఆధారంగా తీసుకుని సృష్టి ఆది మధ్యాంత రహస్యాలు, ఆత్మ-పరమాత్మల జ్ఞానాన్ని తెలియజేస్తారు. దీనినే అవతరణ అని అంటారు. కలియుగం చివరలో తమోప్రధానం అయిపోయిన ఆత్మలకు జ్ఞానాన్ని ప్రభోదించి పావనం చేస్తారు. శివపరమాత్మ గురువులకు గురువు సద్గురువు.

ఈ పుస్తకంలో పొందుబరిచిన ప్రతీ వాక్యము స్వయం భగవంతుడు చెప్పిన మహావాక్యం. వాక్యం అర్థమయ్యేరీతిలో కాస్త వివరణ ఇవ్వటం జరిగినది. ఈ వాక్యాలు అందరికీ అందాలని, మాకు భగవంతుని వాక్యాలు అందలేదు అనే నింద రాకూడదని సద్భావనతో మీ ముందు ఈ పుస్తకాన్ని ఉంచుతున్నాము. ఈ పుస్తకంలోని మహావాక్యాలను ప్రతీరోజూ కనీసం 5 నిమిషాలు చదివినా 500 నిమిషాల పుణ్యం మనకు వస్తుంది. ఈ మహావాక్యాలు ఆచరిస్తే మీ ఆత్మ దేవాత్మగా అవుతుంది. ఇది పరమ సత్యం.

మేము ఉద్యోగస్తులం, వ్యాపారస్తులం, కర్షకులం, కార్మికులం, రాజకీయనాయకులం... మాకు సమయం లేదు అని ఎవరూ అనకూడదని శివపరమాత్ముని ఆజ్ఞ. కారణాలు చెప్తే మనల్ని మనం కారాగారంలో బంధించుకోవటం. అంటే మాయా బంధనాలకు లోబడి పోతాం. కష్ట సమయంలో కూడా ఈ పుస్తకంలోని మహావాక్యాలు చదువుకుంటే మీకు ఊరట లభిస్తుంది. అనారోగ్య సమయంలో చదువుకుంటే ఆరోగ్యం కుదుటపడుతుంది, మానసిక ఆందోళన తగ్గుతుంది. బంధువర్గ వైరం, ప్రకృతి ఆపదలు, ఆత్మహత్యా తలంపులు, దుర్ఘటనలు ఇంకా ఎన్నో లెక్కలేనన్ని ఆపదలు దూరం నుండే వీడ్కోలు తీసుకుని వెళ్ళిపోతాయి. ఎందుకంటే పాపం కారణంగా దు:ఖం వస్తుంది. భగవంతుడు ఉన్న చోట పాపం ఉండదు, పాపం లేనప్పుడు దు:ఖం ఉండదు. కావున ఈ పుస్తకాన్ని మీ వెంట ఉంచుకుని ప్రతీరోజూ తీరిక సమయంలో చదవండి.

ప్రతీరోజూ శరీరానికి నీరు, ఆహారం ఎలాగైతే అవసరమో ఆత్మకి పరమాత్మ శివుని జ్ఞానం అంత అవసరం. గమనించుకోండి, గమ్యం చేరండి. శివపరమాత్ముని అవినాశి ఆశీర్వాదాలకు పాత్రులవ్వండి. శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు అని అంటారు. శివ శబ్దం శుభ కరమైనది. ఇది ఆయన కర్తవ్య నామం తప్ప కేవలం ఒక మతానికి చెందిన పేరు కాదు. అన్ని మతస్థులు, అన్ని రకాల ఆచార పద్ధతుల వారు నిర్భయంగా ఈ మహావాక్యాలు చదవవచ్చు. నచ్చితే ఆచరించవచ్చు. లేనిచో చదివి ఆనందించవచ్చు, ఆనందం అందరి సొంతం. భగవద్గీత, ఖురాను, బైబిల్ అన్నింటిసారం ఒక్కటే. భగవంతుడు ఒక్కరే. తండ్రి అయిన భగవంతునికి లేని భేదం పరస్పర సోదరులైనమైన మనకెందుకు? భేదాలు - క్రోధాలు విడనాడి అందరూ కలిసి భగవంతుని ఆజ్ఞలను పాటిద్దాం.

## 1. యోగబలం ద్వారా కర్మభోగాన్ని ఎలా జయించాలి?

యోగబలం అనగా సృష్టికర్త భగవాన్ శివపరమాత్మను స్మృతి చేయడం ద్వారా లభించే శక్తి. శివపరమాత్మను స్మృతి చేస్తున్నా కూడా వెనుకటి జన్మల కర్మలఖాతా శారీరక రోగం రూపంలో కానీ, మానసిక ఆందోళన రూపంలో కానీ, రక్త సంబంధీకులు లేదా స్నేహితుల మధ్య గొడవల రూపంలో కానీ ఎదురవుతూ ఉంటుంది. ఆ సమయంలో వెనుకటి జన్మల ఖాతా పూర్తవుతుందని భావించి, ఆ భారాన్ని తేలిక చేసుకుంటూ శివపరమాత్మతో మధుర సంబంధాన్ని జోడిస్తూ ఉంటే, బలీయంగా ఉన్న కర్మలఖాతా బలహీనపడి కొన్ని రోజులకి పూర్తిగా భస్మం అయిపోతుంది. శివపరమాత్మ స్మృతిని మర్చిపోతే, కర్మలఖాతా భస్మం అవ్వదు, అప్పుడు మనకు మరింత భారంగా అనిపిస్తుంది.

## 2. దేహీ అభిమాని స్థితి అంటే ఏమిటని శివపరమాత్మ తెలియజేసారు?

శరీరాన్ని నడిపించేది "ఆత్మ" అని మనం పక్కాగా తెలుసుకోవాలి. ఉదాహరణకు – ఆత్మ శరీరంలో ఉన్నప్పుడు, నోటిలో తీపి పదార్థం ఉంచుకున్నప్పుడు, నాలుక ప్రక్కన ఉన్న రసగ్రందుల ద్వారా ఆ తీపి యొక్క అనుభూతిని "ఆత్మ"యే అనుభవిస్తుంది. శవం నోటిలో తీపి పదార్థాన్ని పెడితే, ఆ శరీరం ఏవిధమైన అనుభూతిని పొందలేదని మనకి తెలుసు. దీపం ఉండగానే ఇల్లు చక్కపెట్టుకోవాలని పెద్దలు సూక్తి చెపుతారు. అదేవిథంగా, మరణానికి ముందే, "నేను ఆత్మను!" "నేను ఆత్మను!" అనే స్మృతి ఎక్కువసార్లు జ్ఞాపకం ఉంచుకుని, ఆత్మ స్వరూపాన్ని అభ్యాసం ద్వారా అనుభవం చేసుకోవడమే "దేహీ అభిమాని" స్థితి.

## 3. ఒకరికొకరు గౌరవం ఏవిధంగా యిచ్చుకోవాలి?

ఒక విషయం గురించి ఒకరు చెప్తున్నప్పుడు, పూర్తిగా ఆ విషయాన్ని వినాలి. మధ్యలో త్రుంచేయకూడదు అప్పుడు వారి భావన పూర్తిగా మనస్సు నుండి బహిర్గతమై, వారి మనస్సు తేలిక అయిపోతుంది. వారు చెప్పే మాటలకు, మంచిది, మంచిది, అలాగే అంటూ సావధానపరచవలెను. మనకు ఇష్టం ఉంటే, ఆ విషయం శ్రీమతానుసారంగా ఉంటే ఆ కార్యాన్ని చేయవచ్చు లేదా వదిలివేయవచ్చు.

**4. స్నేహంతో పాటు వాయుమండలంలో ఏ పునాది అవసరం అని శివబాబా తెలియజేసారు?**

అందరు కలసి స్నేహంగా కాలాన్ని గడపాలి. మనందరం ఆత్మలం, శివపరమాత్మ సంతానం అనే జ్ఞానయుక్తమైన భావంతో కలిసిమెలసి ఉంటూ ఒకరికొకరు స్నేహం యిచ్చిపుచ్చుకోవాలి. ఈ భావనా తరంగాలు మన స్థూల కంటికి కనపడకుండానే గాలిలో ఉన్న అణువులలో చేరిపోతాయి. అప్పుడు ఆ స్థానంలోకి ఇతరులు ఎవరు వచ్చినా, వారికి తెలియకుండానే ఆత్మిక భావంతో ప్రవర్తిస్తారు. శరీరపు భావన, స్వార్థ భావనతో స్నేహం చేస్తే, అక్కడికి వచ్చేవారు కూడా స్వార్థంలోకి వెళ్ళిపోతారు. ఈ విషయంపై ప్రతీ ఒక్కరు ధ్యాస పెట్టుకుని, ప్రకృతిని కూడా పావనం చేయాలని శివపరమాత్మ తెలియజేసారు. ఉదాహరణకు – అడవిలో తపస్సు చేసుకునే మునీశ్వరుల తపస్సు యొక్క తరంగాలు వాయుమండలం ద్వారా క్రూరమృగాలకు కూడా చేరి, అవి సాధు జంతువులుగా ప్రవర్తిస్తాయి. కాబట్టి, ఇంటి వాతావరణం అయినా, పవిత్ర స్థానాలైనా, గుడులైనా, విభిన్న మతాలలో ఆధ్యాత్మిక స్థానాలైనా, రాజకీయ భవనాలైనా పైన తెలిపిన ఈ ఒక్క సూత్రం ద్వారా పావనం చేసుకోవచ్చునని – శివపరమాత్మ తెలియజేస్తున్నారు.

**5. శివబాబాతో అంతిమం వరకు ఎవరు ఉండగలరు?**

వర్తమాన సమయం భగవంతుడైన శివపరమాత్మ అవతరించిన సమయం, దీనినే సంగమయుగం అంటారు. తెలుసుకున్నవారికి సంగమయుగం, తెలియని వారికి కలియుగం. శివబాబా తెలియజేసిన జ్ఞానంలో నడుస్తున్నవారు శివపరమాత్మ ద్వారా లభించిన సహనశక్తి, నమ్రతలను జీవితంలో అనుభవం చేసుకుని, ఇతరులను కూడా ఆవిధంగా తయారుచేసిన వారికి మాత్రమే అంతిమం వరకు అనగా స్వర్గ స్థాపన ఈ భూమిపై జరిగే వరకు, ఆయన తోడుగా (శివబాబా) ఉంచుకుంటారు. మిగిలిన వారు జ్ఞానంలో ఉన్నా కానీ, ఈ విధిని పాటించకపోతే అంతిమంలో తొలగిపోతారు. ఉదాహరణకు రిజర్వేషన్ టికెట్ లేకుండా, రిజర్వేషన్ బోగిలో ప్రయాణం చేసే ప్రయాణీకుడు కొంతదూరం ప్రయాణం చేయగలడు. టికెట్ పరిశీలించే వ్యక్తి వచ్చినప్పుడు టికెట్ లేనివారిని తర్వాత స్టేషన్‌లో దింపివేస్తారు. కానీ మధ్యలో రైలు నుండి గెంటివేయకుండా కొంత సమయం క్షమిస్తారు. అదేవిధంగా శివబాబా స్వయం ఇతరులను తొలగించరు కానీ, వారికి వారే ఏదొక కారణం ద్వారా తొలగిపోతారు.

**6. శివపరమాత్మ తెలియజేసిన మహావాక్యాల ద్వారా ఇతరులను ఏవిధంగా మనం నిమిత్తంగా నడిపించాలి?**

శివపరమాత్మ మధువనంలో దాదీ శరీరంలో కొంత సమయం ఉండి తెలియజేసిన మహావాక్యాలలలో – అందరి కళ్యాణం అనగా మంచి ఇమిడి ఉంటుంది. దానిని, నిమిత్తమైన

మహారథులు పూర్తిగా అవగాహన చేసుకుని, ఇతరులకు అర్థం చేయించాలి. ఈ విధంగా సూక్ష్మ బిందు స్వరూపుడైన శివబాబా యొక్క కర్తవ్యం ఏమిటంటే సమయ ప్రమాణంగా వచ్చి, జ్ఞానం చెప్పటం. స్థూల రూపంలో నిమిత్తంగా ఉన్న మనం శివబాబా మహావాక్యాల సారాంశాన్ని ఇతరులకు చేర్చాలి. ఇది మన కర్తవ్యంగా భావించాలి.

## ౭. శివపరమాత్మ దివ్యప్రవేశం గావించిన శరీరధారియైన బ్రహ్మ మీకు ఇష్టం ఉండవచ్చా? ఉండకూడదా?

బ్రహ్మాబాబా ఎప్పుడూ చెప్తూ ఉండేవారు – పిల్లలూ! అందరికీ శివబాబా నుండే వారసత్వం లభిస్తుంది నా నుండి కాదు, కనుక నా ఫోటో మీకు ఎందుకు? అని అడిగేవారు. శివబాబా కంటే ఎక్కువగా బ్రహ్మాబాబాని ప్రేమిస్తే శివబాబా రెండవ నెంబరు అయిపోతారు. అప్పుడు రెండవ యుగమైన త్రేతాయుగంలోకి వెళ్ళవలసి వస్తుంది. అందువలన ఎల్లప్పుడూ శివబాబాని మొదటి నెంబరుగా పెట్టుకుని మొదటి నెంబరులోకి రావాలి. శివబాబా చెప్పిన మహావాక్యాలను బ్రహ్మాబాబా ప్రతీ కర్మలో అనుసరించి ప్రపంచానికి ఒక ఆణిముత్యంలా ఆదర్శప్రాయమై వెళ్ళారు. అదేవిధంగా మన కర్మలను కూడా బ్రహ్మ ఆచరణల వలె శ్రేష్టంగా చేసుకోవాలి.

## ౮. శివపరమాత్మ తెల్పిన మురళీ మరియు ట్రాన్స్‌లోకి వెళ్ళి తెచ్చిన సందేశానికి గల తేడా ఏమిటి?

మురళీ అనేది భగవంతుని మహావాక్యం. విశేషాత్మలు సూక్ష్మవతనంలోకి వెళ్ళి తెచ్చిన సందేశం మురళీ కాదు. ఆ సందేశంలో గారడీ (బాబా మహిమల లీల) ఉండదు. సందేశం అనేది ఆయా సమయాలలో కార్యాన్ని ఏవిధంగా నిర్వర్తించాలనే విషయాల గురించి వివరణ ఉంటుంది, వాటి ద్వారా కొంతమందికి సంతోషం కూడా అనుభవం అవుతుంది.

## ౯. ఏయే విషయాలలో సర్వస్వత్యాగిగా అవ్వాలి?

స్థూలంగా అనగా ధనం, దేహ సంబంధాల త్యాగం గొప్ప విషయం అయినప్పటికీ, మనస్సులో ఉత్పన్నం అవుతున్న సంకల్పాలలో చెడు ఉండకూడదు. ఇది మహాత్యాగం.

## ౧౦. ఆత్మ శరీరంతో ఎప్పటి వరకు కలసి ఉంటుంది?

కర్మలఖాతా పూర్తి అయ్యే వరకు ఆత్మ శరీరంతో కలిసే ఉంటుంది. ఉదాహరణకు, ఎవరికైనా యాక్సిడెంట్ జరిగినప్పుడు కొంతమంది వెంటనే ఆ ప్రదేశంలోనే చనిపోతారు. కొంతమంది ఆసుపత్రికి వెళ్ళి చికిత్స కోసం కొంత ధనం ఖర్చు చేసిన తర్వాత చనిపోతారు, మరి కొంతమంది

సంబందీకులు మరియు స్నేహితుల ద్వారా కొంత సేవ చేయించుకుని చనిపోతారు. కొంతమంది శరీర అనారోగ్యాల వల్ల, మంచంపై నుండి లేవలేని పరిస్థితుల్లో, ఆ బాధలు భరించలేక, చనిపోవాలని అనుకుంటున్నప్పటికి, లేక అటువంటి సేవలు చేయలేక సంబందీకులు, స్నేహితులు విసుగు చెందుతున్నప్పటికీ, వారి అన్ని జన్మల కర్మకాతాలు తీరేవరకు కూడా అనారోగ్యాన్ని మంచంపై అనుభవిస్తు, సంబందీకులు, స్నేహితుల సేవ చేయించుకున్న తర్వాతే చనిపోతారు. అనగా చనిపోయే ముందు, ఆసుపత్రి, డాక్టర్ల ఖాతా, సంబందీకులు, స్నేహితుల అలజడి ఖాతా, శరీర అనారోగ్యం భాద యొక్క ఖాతా పూర్తి చేసుకోవడానికి ఆ మరణం నిమిత్తమవుతుంది.

### 11. సహనశీలత అనే గొప్ప శక్తి మనలో ఎప్పుడు వస్తుంది?

మనం చేసే ప్రతీ పని ముందు ఒక్క నిమిషం అయినా, శివపరమాత్ముని మనస్సులో జ్ఞాపకం చేయాలి. ఏ పని చేస్తున్నా మధ్యమధ్యలో శివబాబాను జ్ఞాపకం చేయడం ద్వారా ఆత్మలో శక్తి నిండి సహనశీలత రూపంలో ఉపయోగపడుతుంది. ఉదాహరణకు – ఏదైనా వ్యాది తీవ్రంగా ఉన్నప్పుడు, గంట గంటకు మందు వేయడం ద్వారా ఆ వ్యాది తీవ్రత తగ్గి పూర్తిగా నయం అవుతుంది. అదేవిధంగా దినమంతటిలో ప్రతీ కర్మలోను ఎక్కువ సమయం శివబాబా స్మృతిలో ఉండటం ద్వారా వెనుకటి జన్మల వికర్మలు తేలికగా భస్మం అయిపోతాయి.

### 12. మన్మనాభవ యొక్క అర్థం ఏమిటి?

మనస్సుని పూర్తిగా శివపరమాత్మ స్మృతిలో నడపటమే మన్మనాభవ యొక్క గుహ్యమైన సూక్ష్మ రహస్యం. ఏవిధంగానైతే రైలు పట్టాను పట్టుకుని నడుస్తున్నంత వరకు యాక్సిడెంట్స్ జరగవు, గమ్యం చేరిపోతుంది. అదేవిధంగా నిరంతరం స్మృతి అనే పట్టాలపై మనస్సు నడచినప్పుడు, భగవంతుని ప్రాప్తులు మనకు సహజంగా లభిస్తాయి.

### 13. ఎవరు అమృతవేళ అవ్యక్త స్థితిలో స్థితులవ్వగలరు?

అమృతవేళ అనగా తెల్లవారుఝామున 2.00గం॥ నుండి 5.00॥ వరకు. ఆ సమయంలో శక్తిశాలీగా భగవంతుని జ్ఞాపకం చేయాలంటే ముందురోజు పగలు ప్రతీ కర్మలో ఎక్కువ సమయం ఆత్మగా భావించే అభ్యాసంలో నిమగ్నమై ఉన్నప్పుడు, అమృతవేళ అవ్యక్త స్థితిలో స్థితులవ్వగలరు. ఈ స్థితి ద్వారా పరమాత్మ శివబాబా నుండి ఆత్మలో శక్తి నిండుతుంది.

### 14. శివబాబాకి పిల్లలపై ఉన్న మోహానికి, మనకు ఒకరిపై ఒకరికి ఉన్న మోహానికి ఉన్న తేడా తెల్పుము?

శివబాబాకి పిల్లలపై మోహం ఉన్నా కానీ తిరిగి నిర్మోహి అయిపోతారు కానీ పిల్లలు అయిపోతే అతిప్రియంగా అయిపోతారు లేదంటే అతీతంగా అయిపోతారు. రెండింటి సమానత ఉండదు.

### 15. బుద్ధి అభిమానం అనగానేమి, దానివలన నష్టం ఏమిటి?

బుద్ధి అభిమానం అనగా మనలో వున్న విశేషతల యొక్క అహంకారం. నేను నాది అనే భావన వచ్చినా కానీ అది బుద్ధి అభిమానమే. నేను నాది అనేది వస్తే ఒకరిమధ్య ఒకరికి అభిప్రాయ భేదాలు వచ్చేస్తాయి. శివబాబా తెలియజేసిన మహావాక్యాలను ప్రక్కన పెట్టి, మనకు తోచినట్లు చేయటమే బుద్ధి అభిమానం.

### 16. సేవ చేసేటప్పుడు ఏ మూడు విషయాలు ధారణ చేయాలి, ఏ మూడు విషయాలు వదలాలి?

సేవలో ధారణ చేసే విషయాలు – త్యాగం, తపస్సు మరియు సేవ. మనం సేవ కోసం తనువు మనస్సు, ధనం, సంకల్పం, సమయం, సర్వ సంబంధాలు ఎంతెంత త్యాగం చేస్తుంటామో, అంతంత ఇతరుల భాగ్యం తెరుచుకుంటుంది. తపస్సు అనగా భగవంతునితో యధార్థ సంబంధాన్ని జోడించడం. త్యాగం తర్వాత తపస్సు సహజంగా మనలో ఉత్పన్నమవుతుంది. తపస్సు సేవ చేయకుండా ఉంచలేదు. కాబట్టి ఒకదానికొకటి అవినాభావ సంబంధం ఉందని శివబాబా తెలియజేస్తున్నారు. (1)సేవ చేసేటప్పుడు ఎప్పుడూ కూడా ఏ సాకు చెప్పకూడదు, అనగా ఇంట్లో పని ఉంది, అనారోగ్యంగా ఉంది వగైరా॥ (2) ఎప్పుడు ఏ సర్వీసు కొరకు చెప్పించుకోకూడదు అనగా మనంతట మనమే సర్వీస్ చేస్తే పూర్తి లాభం పొందుతాము. ఎవరైనా చెప్పిన తర్వాత ప్రేరణ వచ్చి చేస్తే సగబాగం ప్రేరేపించిన వారికి వెళ్ళిపోతుంది. (3) సర్వీస్ చేస్తూ ఎప్పుడూ వాడిపోకుడదు. అనగా సేవ చేస్తే ఫలితం లభించలేదని నిరాశ పడిపోకూడదు. ఎందుకంటే సృష్టికర్త యొక్క జ్ఞానం ఎవరికో ఒకరికి తప్పకుండా ఫలితాన్ని ఇస్తుంది.

### 17. అమృతవేళ ఏ విషయాన్ని పరిశీలించుకోవాలి?

అమృతవేళ శివబాబా అందరినీ జ్ఞాపకం చేసుకుంటారు. అదేవిధంగా మనం, శివబాబాను ఆ సమయంలో జ్ఞాపకం చేసుకోవాలనే ధ్యాస తప్పకుండా ఉంచుకోవాలి. ఏవిధంగానైతే ఎవరైనా అతిధులు కాలింగ్ బెల్ నొక్కినప్పుడు మనం వారిని ఆదరించి పలుకరిస్తాము కదా, అదేవిధంగా భగవంతుడు మనల్ని జ్ఞాపకం చేసుకుంటున్నారు కాబట్టి తిరిగి వారిని మనం జ్ఞాపకం చేసుకోవాలి.

## 18. జ్ఞానం విస్తారంగా చెబితే వచ్చే నష్టం ఏమిటి? బీజరూపీ స్థితిలో స్థితులై చెబితే వచ్చే లాభం ఏమిటి?

విస్తారంలోకి వెళ్ళి చెబితే, సారం గుప్తం అయిపోతుంది. ఈరోజుల్లో వినేవారు తక్కువ అయిపోయారు, కావున మనం శివపరమాత్మ స్మృతిలో తక్కువ సమయం తీసుకుని చెప్పినా కానీ వారు శివపరమాత్మతో మనస్సు యొక్క సంబంధం ఏర్పరచుకుంటారు. సత్యమైన సేవ యొక్క రహస్యం ఏమిటంటే, ఇతరులను మన దగ్గరకు చేర్చుకోకుండా, శివపరమాత్మ దగ్గరకు చేర్చటమే మన కర్తవ్యం. అప్పుడే మనం స్వర్గ వారసత్వానికి అధికారులం అవుతాము.

## 19. సౌభాగ్యశాలి అని ఎవరిని అంటారు?

అన్ని సంబంధాలు శివపరమాత్మతో జోడించి కర్మ చేసేవారిని సౌభాగ్యశాలి అని అంటారు. అనగా తండ్రి సంబంధంలో ప్రేమ, టీచర్ సంబంధంలో ఆజ్ఞాకారీ, సద్గురువు సంబంధంలో, శిక్షణాకారుడుగా నడుచుకునే వారిని సౌభాగ్యశాలి అని అంటారు.

## 20. సాయంత్రం ఏ సమయం అమృతవేళతో సమానం?

సాయంత్రం 7.00గం|| నుండి 7.30 గం|| వరకు అమృతవేళతో సమానం. ఆ సమయంలో విశాలహృదయంతో శివబాబా నుండి శక్తి తీసుకుని ప్రపంచంలో దు:ఖీ, అశాంతి, అలజడి, అనారోగ్యం, అనేక బలహీనతలు మరియు బికారీతనంతో భాదపడుతున్న వారికి శాంతిశక్తి కిరణాలు పంపిస్తున్నట్లుగా బుద్ధితో ఫైర్ చేయాలి. అనగా శరీరం ఒక స్థానంలోనే ఉంటుంది, మనస్సు అనేకులకు శాంతిని, శక్తినిస్తుంది.

## 21. మాల ఎప్పుడు తయారౌతుంది?

ఒక్కని స్మృతిలో నిమగ్నమైనప్పుడు అనగా శివ పరమాత్ముని స్మృతిలో నిమగ్నమై ఉన్నప్పుడు మన నయనాల ద్వారా, నడవడిక ద్వారా ఇతరులకు భగవంతుని శక్తి కనిపిస్తూ ఉంటుంది. ఈవిధంగా మాల తయారైపోతుంది.

## 22. కుమారీలు అంటే బాబాకు ఏవిధమైన ప్రేమ?

కుమారీలు శారీరకంగా మరియు మనస్సు ద్వారా కూడా పవిత్రంగా ఉంటారు కాబట్టి పరమపవిత్రమైన శివబాబాకు కుమారీలపై ఎక్కువ ప్రేమ ఉంటుంది.

## 23. మహారథీల కర్తవ్యం ఏమిటి?

మహారథీలు అనగా అనేక సంవత్సరాలు జ్ఞానంలో ఉండి, జ్ఞానాన్ని ధారణ చేసిన వారు, కానీ వారి ముఖ్య కర్తవ్యం ఏమిటంటే వారి గుణాల ద్వారా ఇతరులను గుణవంతులు చేయటం. ఉదాహరణకు ఎవరైనా నిందించినప్పుడు మనం సహనశీలతతో ఉన్నప్పుడు ఆ గుణం ఇతరులకు ఎంతో నచ్చి వారు కూడా పరివర్తన అయిపోతారు. ఇందులో కొంచెం శ్రమ ఉన్నా కానీ ఫలితం ఎక్కువ ఉంటుంది.

## 24. ఏ ఏడు విషయాలు వదలాలి, ఏ ఏడు విషయాలు ధారణ చేయాలి?

కామం, క్రోధం, మోహం, లోభం, అహంకారం, భయం, బద్ధకం – ఈ ఏడు విషయాలు వదలాలి. భయం అనేది మనస్సులోపల కూడా ఉండకూడదు. ధర్మాన్ని భయం లేకుండా సత్యతా శక్తితో చెప్పాలి. ధారణ చేయవలసిన విషయాలు – (1) స్వ స్వరూపం అనగా ఆత్మ స్థితిలో స్థితులవ్వటం (2) స్వధర్మం అనగా శాంతి స్థితిలో స్థితులవ్వటం (2) స్వదేశం అనగా మన అసలు నివాసం పరంధామాన్ని జ్ఞాపకం చేసుకోవడం (4) సుకర్మ అనగా శ్రేష్ఠ కర్మలను ఆచరించడం (5) స్వలక్ష్యం అనగా మనం దేవతలుగా శివపరమాత్మ యొక్క చదువు (జ్ఞానం) ద్వారా తయారుకావడం (6) స్వ లక్షణాలు అనగా మంచి గుణాలు కలిగి ఉండటం (7) స్వదర్శన చక్రధారి అనగా 84 జన్మల యొక్క అద్భుత చరిత్రను స్వయంలో అనుభవం చేసుకోవడం.

## 25. దైవీ పరివారం యొక్క స్నేహం మనకు ఎందుకు లభించడం లేదు?

దైవీ పరివారంలో ప్రతీ ఒక్కరు ఇతరుల పురుషార్థం గమనిస్తూ ఉంటారు. గమనించడంలో లోపాలు కనిపిస్తే, స్నేహం చేయలేరు. కావున మానవులుగా ఉన్న మనల్ని శివ పరమాత్మ జ్ఞాన రాజయోగాల ద్వారా దేవతలుగా పావనంగా తయారు చేస్తున్నారు కాబట్టి ప్రతీ ఒక్కరు పురుషార్థం మీద పూర్తి ధ్యాస పెట్టుకోవాలి.

## 26. పురుషార్థంపై ప్రేమ పెట్టుకోవడం అంటే ఏమిటి?

పురుషార్థం అనగా శివబాబా చెప్పిన ప్రకారంగా పరివర్తన అవ్వడానికి ప్రయత్నం చేయటం. పురుషార్థం అంటే ఒకసారి చేసిన పొరపాటు రెండవసారి చేయకుండా ఉండటమే. ఇంత ధ్యాస కలిగి ఉండటమే పురుషార్థంపై ప్రేమ పెట్టుకోవడం.

**27. అమృతవేళ శివపరమాత్మకు పిల్లలైన మనం ఏయే ఫిర్యాదులను వినిపిస్తాము?**

(1) శరీరం ఆరోగ్యం బాగుంటే పురుషార్థం చేస్తాం (2) బంధనాలు తొలగిపోయిన తర్వాత పురుషార్థం చేస్తాం (3) వచ్చిన సమస్యలు, విషయాలు తీరిన తర్వాత పురుషార్థం చేస్తాం – ఇలా అనేక రకాలైన ఫిర్యాదులు భగవంతునికి వినిపిస్తూ ఉంటారు. కానీ శివబాబా తెలియజేసిన సత్యం ఏమిటంటే, ఈ విషయాలన్నీ భగవంతునికి అమృతవేళ చెప్పకుండా, ఆయనతో పూర్తి సంలగ్నత జోడిస్తూ ఉంటే, అన్ని ఆటంకాలు క్రమంగా తొలగిపోతాయి. ఏవిధంగానైతే ప్రమిదలో నూనె, వత్తి వేసి ఉంచితే చీకటి తొలగదు దీపం వెలిగించనప్పుడే చీకటి తొలగిపోతుంది. అదేవిధంగా అమృతవేళ సమయంలో శివబాబాపై సంలగ్నత జోడించినప్పుడు ఆత్మలో శక్తి నిండి అన్నీ తొలగిపోతాయి. అందుచేత కంప్లైంట్ చేయడం కంటే కంప్లీట్ అవ్వడం విశేషమైన విషయం.

**28. ఏయే విషయాలలో త్యాగం చేయాలి?**

తనువు, మనస్సు, ధనం త్యాగం చేయటం గొప్ప విషయమే అయినప్పటికీ ఇతరుల అవగుణాలు చూడకుండా ఉండటం అనేది అన్నింటికంటే గొప్ప త్యాగం. ఎందుకంటే మనకు శక్తి లేకపోతే ఇతరుల లోపాలు మనలో చేరిపోతాయి. ఇతరుల చెడు విషయాలు వినవలసి వచ్చినా, చూడవలసి వచ్చినా, వాటిని పరివర్తన చేయడానికి ప్రయత్నించాలి కానీ మనస్సులో పెట్టుకోకూడదు. వారు మారినా మారకపోయినా, మీ శుభభావన వలన వారి చెడు ప్రభావం మీపై పడదు. ఇది అసలైన సూక్ష్మ త్యాగం.

**29. ఎప్పుడు ఒకరికి ఒకరు స్నేహీ అవుతారు?**

ఒకరి సంస్కారాలు ఒకరితో కలసినప్పుడు స్నేహీ అవుతారు.

**30. సర్వస్వత్యాగికి గుర్తు ఏమిటి?**

(1) సరళత అనగా ఇతరుల భావంలో అర్థం తీసి సర్దుకునే స్వభావం కలవారు. (2) సహనశీలత అనగా అన్ని విషయాల్లో మనస్సును తేలికగా ఉంచుకునేవారు. ఈ రెండు లక్షణాలు కలిగినవారు సర్వస్యత్యాగిగా పరిగణింపబడతారు.

**31. గుప్త పురుషార్థం వలన లాభం ఏమిటి?**

గుప్త పురుషార్థులు గుప్త సహయోగిగా ఉంటారు. వారు సహయోగం చేస్తారు కానీ ఇతరుల మహిమను ఆశించరు. వారికి తెలుసు ఇప్పుడిప్పుడే చేసిన సహయోగం ద్వారా వచ్చిన ఫలాన్ని

స్వీకరిస్తే, భవిష్యత్తులో వచ్చే సర్గం భాగ్యం యొక్క ఫలాన్ని పోగొట్టుకుంటామని కావున ఎవరికి తెలియకుండానే భగవంతుని యొక్క మహా యజ్ఞంలో బిన్నభిన్న రూపాల్లో సహయోగీ అయిపోతారు. వీరే రాబోయే శ్రీకృష్ణుని రాజ్యంలో ఉన్నత పదవిని పొందుతారు.

### 32. ఏయే విషయాల్లో యజమానిగా ఉండాలి; ఏయే విషయాల్లో పిల్లవాని వలె ఉండాలి?

సేవ కోసం సలహా ఇచ్చేటప్పుడు ధర్మశక్తి కలిగి యజమాని స్థితిలో ఉండాలి. వారు ఆ సలహాను పాటించకపోతే పిల్లవానిగా అయిపోవాలి. అందరూ కలిసిమెలసి ఉండాలంటే ఈ రెండు స్థితులు ధారణ చేయాలి. ఈ రెండు స్థితులు లేకుండా నేను చెప్పిందే వినాలి, నేను చెప్పిందే చేయాలి అని ఎవరికి వారు పట్టుబడితే సంస్కారాల గొడవ వస్తుంది. సంఘటనగా ఐక్యంగా ఉండలేం.

### 33. ప్రేతాత్మల గురించి పూర్తిగా వివరించండి? వాటినుండి పూర్తిగా ఎలా రక్షించుకోవాలి?

బలవంతంగా ఆత్మహత్య లేదా హత్య గావించబడి చనిపోయినవారు, ప్రకృతి ఆపదలలో ఊకుమ్మడిగా చనిపోయినవారిలో కొందరు ప్రేతాత్మలుగా అవుతారు. కోరికలు తీరకుండా బలవన్మరణం పొందారు కనుక వారికి త్వరగా జన్మ దొరకదు, అలాంటి ప్రేతాత్మలు గాలిలో తిరుగుతూ ఉంటాయి. ప్రేతాత్మలు చెడు కోరికలు కలిగి ఉంటాయి. అవి ఇతరులలో ప్రవేశించి తీరని కోరికలను వారి శరీరం ద్వారా తీర్చుకుంటాయి. ప్రస్తుత ఈ కలియుగాంత సమయంలో బలవన్మరణాలు ఎక్కువగా కానవస్తున్నాయి కనుక వర్తమాన సమయంలో ప్రపంచంలో ప్రేతాత్మల ఫోర్సు ఎక్కువగా ఉంటుంది. ఈ ఆత్మలు చాలా శక్తివంతంగా ఉంటాయి. ఇవి మనలో ప్రవేశించకుండా ఉండాలంటే, దినమంతటిలో ఎక్కువ సమయం, కార్యవ్యవహారాలు చేసుకుంటున్నా, మద్యమద్యలో మనస్సు ద్వారా శివబాబాను జ్ఞాపకం చేసుకుంటుంటే, అవి మనలో ప్రవేశించాలనుకున్నా ప్రవేశించలేవు మరియు పరమాత్ముని యొక్క శక్తిని అవి గ్రహించి ముక్తిని పొందుతాయి. కావున ఇక్కడ గమనించవలసిన ముఖ్య విషయం ఏమిటంటే, జీవితంలో ఎన్ని కష్ట నష్టాలు, ఒడిదుడుకులు వచ్చినా కానీ ఆత్మహత్యా ప్రయత్నం చేయకూడదని శివబాబా తెలియజేస్తున్నారు.

### 34. సహనశక్తి ఏయే సంధర్భాలలో అవసరం?

సర్వీసులో సఫలత రావాలన్నా సహనం కలిగి ఉండాలి. అందరు కలిసికట్టుగా సంఘటనగా ఉండాలన్నా సహనం కావాలి. ఐక్యత, అంతిమ వినాశనం యొక్క పేపర్‌లో ఫలితం పొందటానికి నిమిత్తం అవుతుంది.

**35. ప్ర నిర్భయత ఎప్పుడు వస్తుంది?**

నిరాకారిస్థితి అనగా "ఆత్మ" స్థితిలో స్థితులైనప్పుడు నిర్భయత శక్తి వస్తుంది.

**36. కుమారులు ఏయే విషయాలనుండి రక్షించుకోవాలి?**

కుమారులు శివబాబాపై మనస్సు యొక్క స్నేహాన్ని నిరంతరం పూర్తిగా ఉంచుకోవాలి. మనస్సు కనుక భ్రమిస్తే బాబా నుండి సహాయం పొందటంలో అనర్హులైపోతారు. ఏవిధంగానైతే కోమలంగా ఉన్న ఆకులను పక్షులు తినివేస్తాయో అలాగే మాయ మిమ్మల్ని తినివేస్తుంది.

**37. ఏకాంతం అనేది ఏవిధంగా ఉండాలి?**

స్థూలంగా అనగా ప్రశాంత వాతావరణం గల ప్రదేశాన్ని ఏర్పాటు చేసుకోవాలి. సూక్ష్మంగా అనగా తేలికదనాన్ని అనుభవం చేసుకోవాలి. విజయం, పరాజయంలో ఒకేవిధంగా స్థిరంగా ఉండాలి.

**38. సర్వీసు యొక్క సఫలతకు ఏ ముఖ్య గుణం ఆధారం?**

నమ్రత అనగా వినయంగా ఉండటం. స్వయాన్ని నిమిత్తమాత్రంగా భావించడం ద్వారా నమ్రతా గుణం సహజంగా మనలో నిండుతుంది. ఈ ఒక్క గుణం ఆధారంగా విశ్వాత్మలు మనముందు తలవంచుతారు. నమ్రతా గుణం ఎప్పుడు వస్తుందంటే సేవ చేసేటప్పుడు మనం శరీరాన్ని కూడా బాబాకు అర్పణ చేయాలి. ఈ శరీరం నీదే బాబా అని మనస్సులో తలచుకోవాలి. సర్వీసు కూడా నీదే, నా శరీరం ద్వారా నీవే చేస్తున్నావు బాబా అనే సంపూర్ణ సంకల్పం ఉండాలి.

**39. ప్రతీ ఒక్కరు సేవ ఏవిధంగా చేయాలి?**

ఏ విషయంలో అనగా ధన రూపంలో గాని, శరీర రూపంలో గాని, మనస్సు రూపంలో గాని సేవ చేస్తే వారికి తప్పక ఈశ్వరీయ సౌభాగ్యం జన్మజన్మలకు లభిస్తుంది. తనువు అనారోగ్యంగా ఉన్నప్పుడు మనస్సులో భగవంతుని స్మరణ చేసుకోండి. మనస్సు తనువు అలజడిగా ఉన్నప్పుడు ధనం ద్వారా శివబాబా సేవను ఇతరులకు అందించండి. ఈ మూడు విషయాల్లో ఏ ఒక్క విషయం సేవలో ఉపయోగించినా అనంతమైన ప్రాప్తి పొందుతారు.

**40. రోజంతటిలో అవ్యక్త స్థితి తక్కువలో తక్కువ ఎంత సమయం ఉండాలి?**

ఎనిమిది గంటలు ఉండాలి. ఒకేసారి కాకపోయినప్పటికి దినమంతటిలో అప్పుడప్పుడు కలుపుకుని మొత్తం 8 గంటలు ఉంటే చాలా మంచిది.

## 41. ఇప్పుడు ఏ కోర్సు పూర్తయ్యింది, మరలా ఏ కోర్సు మొదలైంది? దానిలో మనం ఏవిధంగా ఉండాలి?

ఇప్పుడు చెప్పవలసిన కోర్సు అంతా పూర్తయ్యింది. రివైజ్ కోర్సు మొదలైంది. రివైజ్ కోర్సు క్రొత్త వారికి క్రొత్తదనాన్ని, పాతవారికి ధారణను ఇప్పిస్తుంది. దాదీజీ శరీరంలో శివపరమాత్మ ప్రవేశించి చెప్పిన మహావాక్యాలను ప్రతీ ఒక్కరు ఏవిధంగా ఆచరిస్తున్నారు అని పరంధామం నుండి పరమాత్మ పరిశీలిస్తుంటారు. ధారణ చేసేవారికి పరంధామం నుండి శివబాబా శక్తిని ఇస్తుంటారు. ధారణ చేయలేనివారు ఎంతచెప్పినా శక్తిని పొందలేరు.

## 42. ఏది ముఖ్య శ్రీమతం?

ఎక్కువలో ఎక్కువ సమయం శివబాబాను స్మృతి చేయటమే ముఖ్య శ్రీమతం. ఈ స్మృతియాత్ర ద్వారా పవిత్రత, దైవీగుణాలు, సర్వీసులో సఫలత మనముందు ప్రత్యక్షమవుతూ ఉంటాయి.

## 43. ఎవరు శ్రీకృష్ణుని పరివారంలో అనగా స్నేహితులు/స్నేహితురాలిగా జన్మ తీసుకుంటారు?

ఎవరైతే శివపరమాత్మ చేస్తున్న యజ్ఞంలో భిన్నభిన్నరూపాల్లో సహాయకారులౌతారో, వారే శ్రీకృష్ణునికి సమీప సంబంధీకులుగా ఉంటారు.

## 44. ఏ తనువు ద్వారా ఏ కోర్సు పూర్తయ్యింది? ఇప్పుడు ఏ కోర్సు నడుస్తుంది?

బ్రహ్మాబాబా తనువుతో సాకార వాణీల కోర్సు పూర్తయ్యిందని శివబాబా తెలియజేస్తున్నారు. ఇప్పుడు అవ్యక్త వాణీల ద్వారా ప్రతీ ఆత్మను వ్యక్తం నుండి అవ్యక్త స్థితిలోకి తీసుకువచ్చే కోర్సు చెబుతున్నారు.

## 45. ధర్మాన్ని ఎప్పుడు వదలకూడదు?

ఎన్ని కష్టనష్టాలు వచ్చినా, ప్రకృతి వైపరీత్యాల ద్వారా మనకు ఎంత కష్టం, నష్టం వాటిల్లినా ధర్మం వదలకూడదు.

## 46. ఓహెూ ప్రభూ! అని శివపరమాత్మను మొత్తం విశ్వంలోని ఆత్మలు ఎప్పుడు మహిమ చేస్తారు?

ఇప్పుడైతే జ్ఞానయోగాలతో నిండియున్న మనలో భవిష్య రాజధాని ప్రత్యక్షమవుతుందో అప్పుడు మన భక్తులకు, ప్రజలకు శివబాబా ప్రత్యక్షత జరుగుతుంది. అప్పుడు ఓహెూ ప్రభూ! నీ లీల ఎంత అపారమైనదో అని అందరూ గ్రహిస్తారు.

**47. ప్రతీ కార్యంలో స్థూలంగా మరియు సూక్ష్మంగా ఏ విషయాన్ని వదలకూడదు?**

ధైర్యాన్ని వదలకూడదు. స్థూలంగా అనగా సంఘటనలో, సూక్ష్మంగా అనగా మనస్సు యొక్క సంకల్పంలో ధైర్యాన్ని కోల్పోకూడదు, అప్పుడే జైజైకారాలు వెలువడతాయి.

**48. పొదుపు మరియు విశాలహృదయం అనగా ఏమిటో వివరించండి?**

పొదుపు అనగా కర్మకు సంబంధించింది. ప్రతీ కర్మలో కొన్ని సాధనాలు అవసరం ఉంటాయి. వాటిని పొదుపుగా ఉపయోగించుకుంటూ విశాల హృదయం కలిగి విశాల సేవలో అవి ఉపయోగపడేలా వుండాలి. ఇదే అసలైన పొదుపు.

**49. జ్ఞానీయోగీ ఆత్మలమైన మనం వేసే ప్రతీ అడుగు ఇతరులకు ఏవిధమైన లాభనష్టాలను తీసుకుని వస్తుంది.**

చేసే కర్మయే ఆత్మ యొక్క దర్పణం. మనం ఏ కర్మ చేస్తున్నామో, ఆ కర్మను ఇతరులు గ్రహిస్తారు. గ్రహించి వారు పాటిస్తారు. కావున మన వెనువెంట జన్మలో వచ్చే ప్రజలు, భక్తులు కూడా ఆ కర్మ యొక్క సంస్కారాలతో నిండి ఉంటారు. మనం శ్రేష్ఠ కర్మలు చేస్తే వారు కూడా శ్రేష్ట కర్మతో మనవెంట సంబందీకులుగా ఉంటారు. మనం చెడు కర్మ చేస్తే వారు కూడా మన వెంట ఉంటారు. అనగా సంగమయుగమే అన్ని జన్మలకు, అన్నింటికీ పునాది. ఏవిధంగానైతే గర్భిణీ స్త్రీ జాగ్రత్తలు కలిగి ఉంటుందో, అదేవిధంగా మన జన్మజన్మల వెంట ఈ సంగమయుగంలో మనం చేసుకున్న కర్మల ఆధారంగా పరివారం మన వెంట వస్తూ ఉంటారు. ఇది చాలా గుహ్యమైన కర్మల గతి.

**50. నెమ్మది నెమ్మదిగా అందరిలో ఏ స్థితి వస్తుంది?**

జ) మీ దగ్గరకు వచ్చేవారి మనస్సులో ఏ విషయం దాగి ఉందో వారు చెప్పనవసరం లేకుండానే మీకు తెలిసిపోతుంది. ఈ స్థితి అందరికీ నెమ్మదినెమ్మదిగా పరమాత్మ స్మృతి ఆదారంగా వస్తుంది.

**51. శివబాబాకు ఏ టోలి (ప్రసాదం) అంటే ఇష్టం?**

మంచి మనస్సు కలిగిన పేదవారి యొక్క ప్రసాదం అంటే శివబాబాకు ఇష్టం.

**52. మాతల యొక్క పవిత్రత అంటే ఏమిటి?**

మనసా, వాచా కర్మణా బలి అవ్వడం.

**53. సర్వగుణ సంపన్నంగా ఎప్పడు అవుతారు?**

ప్రతీ ఒక్కరిలో ఒక విశేషగుణం ఉటుంది. ఆ విశేషగుణం మనం ధారణ చేయడంలో సర్వగుణ సంపన్నం అయిపోతాము.

**54. దైవీ పరివారంలో అందరికంటే భయంకరమైనవారు మరియు నష్టం తీసుకువచ్చేవారు ఎవరు?**

మనస్సులో ఒకటి ఉంచుకుని, మాటల్లో వేరొకటి చెప్పి కర్మలో మరోవిధంగా చేసేవారు అందరికంటే భయంకరమైన వారు, బాహాటంగా నిందించే వారికంటే వీరు ఎక్కువ భయంకరమైన వారు. ఇలాంటివారి నుండి అందరూ దూరంగా ఉండాలనుకుంటారు. ఎవరూ స్నేహం చేయలేరు.

**55. మన కర్మ ఎవరికి నిమిత్తమవ్వాలి?**

మనం ఏ కర్మ చేసినా ఇతరుల ఉన్నతికి నిమిత్తం అవ్వాలి.

**56. సంశయం అని దేనిని అంటారు?**

బలహీన సంకల్పమే సంశయం.

**57. ఏ అభ్యాసం ద్వారా మంచి నంబరు తీసుకుంటారు?**

ప్రతీ ఒక్క కర్మలో బుద్ధి యొక్క స్వచ్ఛత ద్వారా మంచి నంబరు తీసుకుంటారు. బుద్ధి యొక్క స్వచ్ఛత అనగా శివబాబా చెప్పిన విధంగా బుద్ధిని నడిపించాలి. పరిశీలించే శక్తి ద్వారా కూడా మంచి నంబరు తీసుకుంటారు.

**58. ఈర్ష్య ఎప్పుడు సమాప్తి అయిపోతుంది?**

ప్రతీ ఒక్కరిలో మంచి గుణాలు చూసినప్పుడు ఈర్ష్య సమాప్తం అయిపోతుంది. ఇది మనలో మహాపాపం తయారు చేయడానికి నిమిత్తం అవుతుంది. ఇతరుల ఎదుగుదల వైపు దృష్టి వెళ్తే ఈర్ష్య వస్తుంది.

**59. లక్షణాలు గల ఆత్మ యొక్క సేవ ఏవిధంగా ఉంటుంది?**

లక్షణాలు కల్గిన ఆత్మ ఒక్కటైనా గాని అనేకమందిని జ్ఞానంలోకి తీసుకు వస్తుంది.

**60. శివపరమాత్మ యొక్క జ్ఞాన రత్నాలకు విలువనివ్వటంలో మనకు వచ్చే లాభం ఏమిటి?**

ప్రపంచం మొత్తంలో విలువైన ఆత్మగా మనల్ని శివపరమాత్మ ప్రత్యక్షం చేస్తారు.

**61. ప్రపంచానికి ఎప్పుడు ప్రియంగా అవుతారు?**

శరీర స్థితిని మరిచి, ఆత్మ స్థితిలో స్థితులై కార్యం చేసినప్పుడు ప్రపంచానికి ప్రియమవుతారు.

అనగా మన శరీరానికి కావలసిన సహయోగం ఇతరుల నుండి తీసుకోకూడదు. దేహ సంబందీకులను వదలుకుని అనగా అతీతమై, దేహ(భ్రాంతిలో ఉంటే ప్రపంచానికి ప్రియం కారు.

### 62. శివబాబాని ఏ పద్ధతి ద్వారా ప్రత్యక్షం చేయగలము?

మీ సంస్కారాల పరివర్తన ద్వారా ప్రత్యక్షం చేయగలం.

### 63. మృత్యువు ద్వారా బాబాని ప్రత్యక్షం చేయగలరు?

అశరీరి అభ్యాసం చాలాకాలం నుండి ఉన్నవారు, మృత్యువు ద్వారా బాబాని ప్రత్యక్షం చేయగలరు. అనగా నేను ఆత్మను పాత్ర అభినయించడానికి ఈ ప్రపంచానికి వచ్చాను, తిరిగి పరంధామానికి వెళ్ళిపోవాలి అనే స్మృతి దినమంతటిలో ఎవరికి ఎక్కువ సమయం ఉటుందో వారు బౌతిక విషయాలచే ఆకర్షించబడరు. వారు మరణంలో కూడా సంబదీకులను జ్ఞాపకం చేసుకోకుండా, భగవంతుణ్ణి జ్ఞాపకం చేసుకున్న కారణంగా, మరణంలో కూడా వారు ఇతరులకు భగవంతుని స్మృతిని ఇప్పించగలరు.

### 64. ఏయే విషయాలలో మీకు మార్కులు జమ అవుతాయి?

కేవలం మాటల ద్వారా ఎవరూ భగవంతునికి సమర్పణ కారు. ఆంతరంగిక ఆత్మిక స్నేహం ద్వారా భగవంతునికి బలి అవుతారు. ఈశ్వరీయ స్నేహం, శక్తి ద్వారా వారసులు తయారవుతారు. సేవలో ఏవైతే సమస్యలు వస్తాయో, వాటిని ఎంత సమయంలో దాటి విజయం పొందుతారో వాటి ఆధారంగా మార్కులు ఉంటాయి. అనగా సమస్య ఆధారంగా ఎక్కువ సమయం సేవ చేస్తే తక్కువ మార్కులు వస్తాయి. ఎటువంటి సమస్యనైనా తక్కువ సమయంలో ఎదుర్కోవాలి. సేవలో ముందుకు సాగిన వారికే ఎక్కువ మార్కులు వస్తాయి. ఇది భగవంతుని యొక్క సూక్ష్మ లెక్క.

### 65. వచ్చే పరీక్షలను ఏవిధంగా భావిస్తే పాస్ అవుతారు?

సమస్యలన్నింటినీ పరీక్ష పేపర్‌గా భావించాలి, ప్రత్యక్ష విషయాలుగా భావించకూడదు. మానసిక పరీక్షలు, ధనం యొక్క లోటు, అనారోగ్య పరిస్థితులు, వాయుమండలం యొక్క సమస్యలు, లౌకిక సంబందీకులతో చిన్నచిన్న సమస్యలు వీటన్నింటిని పరీక్షలుగా భావించాలి కానీ సమస్యలుగా భావించకూడదు అప్పుడు పాస్ అయిపోతారు.

### 66. అర్పణ విషయంలో దేనికి ఫలం లభించదు?

ఆలోచించి ఆలోచించి భగవంతునికి అర్పణ అయితే ఫలం లభించదు.

**౬౭. సర్వశక్తివంతుడైన శివబాబాతో ఎప్పుడైతే తెగిపోని సంబంధం ఉంటుందో అప్పుడు ఏమి ఫలం లభిస్తుంది?**

ప్రతీ విషయం స్పష్టంగా కనిపిస్తుంది. సత్యాన్ని దాచే మాయ కూడా తొలగిపోతుంది.

**౬౮. నెంబర్‌వారీగా సంపూర్ణత అనగానేమి?**

ఇప్పుడు యోగ్యతను అనుసరించి శక్తి లభిస్తుంది. మున్ముందు ప్రతీ ఒక్కరు నెంబర్‌వారీగా స్వర్గంలోకి వెళ్ళే సంపూర్ణతను పొందుతారు. అష్టరత్నాలలో కూడా నెంబర్‌వారీగానే సంపూర్ణత పొందుతారు. కానీ మొత్తం మీద సంపూర్ణత అందరూ పొందుతారు.

**౬౯. అవ్యక్త స్థితి ద్వారా వాయుమండలాన్ని ఎలా తయారుచేసుకోవాలి?**

భాషా ప్రావీణ్యతతో ఉపన్యాసం చెప్పేవారు ప్రపంచంలో చాలామంది ఉన్నారు. కానీ ఆత్మ యొక్క శక్తిని, పరమాత్మ యొక్క శక్తిని అనుభవం చేయించే ఉపన్యాసం చెప్పగలిగినవారు మీరే. ఏదైనా ప్రదేశంలో శివబాబా కార్యక్రమం చేసేముందు కొన్ని రోజుల నుండి ఆ స్థలానికి అవ్యక్త తరంగాలను పంపించి శుద్ధి చేయాలి. ఇలా చేయటం వలన ఫలితం సంపూర్ణంగా వస్తుంది. అంతర్ముఖ స్థితిని కొన్ని రోజుల ముందు నుండి ధారణ చేయాలి. ఉదాహరణకు, ఒక పెళ్ళికి ముందు వేదికను అలంకరిస్తారు ఆ తర్వాత ఆ వేదికపై వివాహం జరుగుతుంది. పెళ్ళి సమయంలో అలంకరణ చేయాలి కదా, అదేవిధంగా అవ్యక్త వాతావరణం కొన్ని రోజుల ముందు నుండి తయారు చేసుకోవాలి.

**౭౦. మన విఘ్నాలు ఎప్పుడు స్వతహాగా తొలగిపోతాయి?**

సేవలో బిజీ అయినప్పుడు విఘ్నాలు సమాప్తం అయిపోతాయి. ఎందుకంటే శివపరమాత్మ గురించి తెలియజేసే సేవలో క్రొత్త ఆత్మలు క్రొత్త జ్ఞానాన్ని అనుభవం చేసుకుంటారు. వారి అనుభూతి శక్తి, మన పుణ్యఖాతాను పెంచుతుంది. వర్తమాన పుణ్యఖాతా వెనుకటి జన్మల కర్మలఖాతాల వలన వచ్చిన విఘ్నాలను తొలగిస్తుంది.

**౭౧. సంగమయుగంలో ప్రాప్తి పొందటానికి ఎక్కువలో ఎక్కువ ఎన్నిరోజులు అవసరం?**

15 రోజులు చాలా గొప్ప. 15 రోజుల్లో మొత్తం జ్ఞానం యొక్క సారాన్ని అందించవచ్చు. వినేవారు ఆ సారాన్ని ధారణ చేసుకుని సులువుగా ప్రాప్తిని పొందవచ్చు. ఉదాహరణకు ఒక సినిమాను తయారు చేయవలసి వచ్చినప్పుడు ఎక్కువ రోజులు పడుతుంది. అది సినిమాహాలులో ప్రదర్శించటానికి తక్కువ సమయం పడుతుంది. కానీ చూసేవారందరు ఆహ్లాదాన్ని అనుభవం చేసుకుంటారు కదా!

**72. మొత్తం సృష్టిలో అన్నింటికంటే ప్రియమైనవారు ఎవరు?**

మొత్తం సృష్టిలో అందరికంటే ప్రియమైనవారు శివపరమాత్మ ఒక్కరే!

**73. వినాశనానికి ముందుగానే, మన మరణానికి ముందుగానే మనం పరివర్తన అయితే వచ్చే ఫలితం ఎలా ఉంటుంది?**

ఒకటికి లక్షరెట్లు ప్రాప్తి పొందుతారు. అంతిమ సమయంలో పురుషార్థం చేయడానికి సమయం ఉండదు. కానీ అప్పుడు ఫలం వస్తుంది కానీ ఒకటి ఒకటే వస్తుంది.

**74. మనకున్న ఖజానాలు సంపూర్ణంగా భగవంతునికి అర్పణ చేసుకోకపోతే వచ్చే నష్టం ఏమిటి?**

భగవంతుడు కూడా మనకు భాగ్యం ఇవ్వటంలో అర్పణ చేసే మనస్సును బట్టి ఫలాన్ని ఇస్తారు.

**75. శివబాబా చేసే మహాయజ్ఞంలో అనేక మహారథులున్నారు. వారిలో ముఖ్యంగా మూడవవారు శరీరం వదిలివేస్తే ఏమి జరుగుతుంది?**

1) మమ్మా 2) బ్రహ్మాబాబా, మూడవ మహారథి శరీరం వదిలేస్తే సమస్యలు పెరిగిపోతాయి, సంకల్పాలు పెరిగిపోతాయి పురుషార్థం చేయలేరు.

**76. ఇతరులను ముందుపెట్టడంలో మనకు వచ్చే మంచి ఫలితం ఏమిటి?**

మంచి కార్యాలలో ఇతరులను మనం మనస్సు ద్వారా ముందు పెట్టినప్పుడు, భగవంతుని దృష్టిలో మనం ఎప్పుడూ ముందు ఉంటాము. ఎవరైనా జ్ఞానం ఇతరులకు చెబుతున్నప్పుడు వారి నుండి ఆ ఆత్మకు పొగడ్తలు వచ్చినప్పుడు, ముందు పెట్టిన పెద్దవారికి సహజంగా ఈర్ష్య వస్తుంది. కానీ ఈ విషయంలో మనందరం చాలా ధ్యాస పెట్టుకోవాలి. ఏమనంటే వారి ద్వారా ఇంకా అనేకులకు సేవ చేయవచ్చని భావించాలి, అంతేగాని, నాకు పేరు రావడం లేదు, వారికి పేరు వస్తుందని వారిని వెనుక పెట్టకూడదు. ఇతరులను ముందు పెట్టడంలో అంతిమంలో మన నెంబరు ముందు ఉంటుంది, ఇది కర్మల గొప్ప గుహ్య రహస్యం.

**77. మన పురుషార్థాన్ని ఎప్పుడు పరిశీలన చేసుకోవాలి?**

మనం ప్రతీ కర్మ చేసే ముందు శ్రీమతానుసారంగా ఉందా అని ప్రతీ గంటకు పరిశీలించుకోవాలి.

**78. సంగమయుగం యొక్క విశేష ఖజానాలు ఏమిటి?**

సంకల్పం మరియు సమయం. మన సంకల్పాలు వ్యర్థంగా వెళ్ళకుండా శక్తిశాలిగా ఉంటే, సత్యయుగి సృష్టి తయారవుతుంది. సంకల్పాలు బలహీనంగా ఉంటే త్రేతాయుగ సృష్టి తయారవుతుంది. కాబట్టి ప్రతీ సంకల్పం, ప్రతీ సెకను చాలా చాలా విలువైన ఖజానాలు.

### 79. సమయానికి యుక్తి రావటం లేదంటే మనకు ఏ శక్తి లోపం ఉన్నట్లు?

సమయానికి యుక్తి రావటం లేదంటే యోగ శక్తి లేదని అర్థం. యోగ శక్తి అనగా శివపరమాత్మ స్మృతి ద్వారా పొందిన దివ్య అలౌకిక శక్తి.

### 80. మనం ప్రేరణ ఇవ్వకుండానే ఇతరులు శివబాబాకు బలిహారం అయ్యే క్యూ ఎప్పుడు ఉంటుంది?

రేపటిరోజు ఎలా గడుస్తుందనే ఆలోచన మనకు రాకుండా, తక్షణమే ప్రతీ ఖజానాను శివబాబా సేవకు బలిహారం చేయాలి. అప్పుడు ప్రపంచం అంతా మనముందు బలిహారం అయిపోయే క్యూలో ఉంటుంది. ఏవిధంగానైతే కాశీలో కత్తుల బావిలో దూకి చనిపోతే పుణ్యం వస్తుందని భావిస్తారో, అదేవిధంగా శివబాబా మహాయజ్ఞంలో తనువు, మనస్సు, ధనంతో గాని లేదా మూడింటిలో ఏ ఒక్కదానితో కానీ పూర్తిగా నిస్సంకల్ప స్థితిలో బలైపోతారు.

### 81. భక్తులు ఏ విషయాన్ని కాపీ చేస్తారు?

మొదట సంగమయుగంలో జ్ఞానీ యోగీ ఆత్మలు బాబాను భిన్నభిన్న కార్యక్రమాల ద్వారా ప్రత్యక్షం చేస్తారు. అంతిమంలో భక్తులు ఈ విషయాన్ని గ్రహించి, ఆత్మలో సంస్కారాలు నింపుకుని, ద్వాపరయుగంలో భక్తులుగా జన్మ తీసుకున్నప్పుడు ఆ సూక్ష్మ విషయాలు స్థూల విగ్రహాల రూపంలో చూపిస్తారు. ఉదాహరణకు, కనకదుర్గ సింహంపై కూర్చున్నట్లు, చేతుల్లో ఆయుధాలు ధరించినట్లు చూపిస్తారు. వాస్తవానికి దేవతలు ఆయుధాలతో హింసా యుద్ధం చేయరు కదా! కానీ సంగమయుగంలో భక్తులు, అంతిమ దేవతా స్వరూపాన్ని సూక్ష్మ రూపంలో చూసి, ద్వాపరయుగం నుండి స్థూలంగా చిత్రీకరిస్తారు.

### 82. విజయం మనకంటే ముందు ఎప్పుడు పరుగెడుతుంది?

శివబాబాపై నిశ్చయం, స్వయంపై నిశ్చయం ఉన్నప్పుడు విజయం మన కంటే ముందు నడుస్తుంది. శివబాబాపై నిశ్చయం అనగా విశ్వ నవ నిర్మాత శివబాబా ఒక్కరే అని, స్వయంపై నిశ్చయం అనగా నేనే దేవతగా అవుతున్నానన్న నిశ్చయం పక్కాగా ఉండాలి.

### 83. సైన్స్‌కు ప్రేరణ ఎవరు?

సంగమయుగంలో జ్ఞానీ యోగీ ఆత్మల శాంతి శక్తి యొక్క ప్రేరణ ద్వారా విజ్ఞాన శాస్త్రవేత్తలకు ఏదొక క్రొత్త విషయం ఆవిష్కరణ చేయాలనే సంకల్పం వస్తుంది. ఈ విధంగా సైన్సు కేవలం సంగమయుగంలోనే పూర్తి రిఫైన్ అనగా పరిశుద్ధంగా మారిపోతుంది. ఉదాహరణకు, ఒకప్పుడు ధ్వని వ్యాపింపచేయడానికి రేడియో ఉండేది. రేడియోలో ధ్వని వస్తుంది కానీ దృశ్యం కనిపించదు

అనగా జ్ఞానీ యోగీ ఆత్మలు జ్ఞానాన్ని కేవలం నోటి ద్వారానే చెప్పగలిగే స్థితికి చేరుకున్న సమయం అది. జ్ఞానీ యోగీ ఆత్మలు సంపూర్ణంగా శాంతిశక్తిలోకి వచ్చినప్పుడు విజ్ఞాన శాస్త్రం కూడా చాలా అభివృద్ధి చెంది అది సత్యయుగీ సృష్టికి కూడా ఎంతగానో ఉపయోగపడుతుంది. వర్తమాన సమయంలో ఒకే ఒక్క సెల్‌ఫోన్‌లో, ఎఫ్ యమ్. రేడియో, ఆడియో, వీడియో, టార్చ్‌లైట్, ఇంటర్‌నెట్ మొ॥నవి ఒకదానిలోనే ఉత్పన్నమయ్యాయి.

## 84. సంగమయుగంలో జ్ఞానులైన మీ నియమాలు ద్వాపరయుగం యొక్క భక్తి మార్గంలో ఏవిధంగా తయారైనవి?

ఇక్కడ సంగమయుగంలో స్మృతిలో చేసిన శుద్ధ ఆహారాన్ని శివబాబాకు భోగ్ చేస్తారు. వాస్తవానికి శివబాబా అభోక్త అనగా ఏమి భుజించరు కానీ పరమాత్మపై గౌరవం ఆధారంగా ముందుగా ఆయనకు నైవేధ్యాన్ని ప్రేమతో అర్పణ చేస్తాం. అదేవిధంగా ద్వాపరయుగం నుండి భక్తి మార్గంలో దేవతా విగ్రహాలకు పూజారి స్వయంగా ప్రసాదాన్ని వండి దేవతకు అర్పిస్తారు.

## 85. ఎక్కడ మాస్టర్ బ్రహ్మ అవ్వాలి? ఎక్కడ మాస్టర్ శంకర్ అవ్వాలి?

జ్ఞానం ఇచ్చేటప్పుడు మాస్టర్ బ్రహ్మ అవ్వాలి. అవగుణాలను భస్మం చేసేటప్పుడు తపస్వీమూర్తి అయిన శంకరుడుగా అవ్వాలి. శంకరుడు అవ్వవలసిన చోట మాస్టర్ బ్రహ్మగా, మాస్టర్ బ్రహ్మ అవ్వవలసి వచ్చినప్పుడు శంకరుడుగా ఉంటే చాలా నష్టం జరుగుతుంది. ఈవిధంగా సమయ ప్రమాణంగా కర్తవ్యం నిర్వర్తించాలి.

## 86. విధాత అయిన శివబాబాను మర్చిపోతే వచ్చే నష్టం ఏమిటి?

శివపరమాత్మ ప్రతీ కర్మ యొక్క విధిని తెలియజేస్తారు. విధి అనగా పద్ధతి, దీని ద్వారా మాత్రమే సంపూర్ణ సఫలత వస్తుంది. అమృతవేళ సమయంలో శరీరాన్ని కూర్చోపెట్టటానికి సమయాన్ని కేటాయిస్తాం కానీ సూక్ష్మశక్తులు అయిన మనస్సు, బుద్ధిని పరమాత్మపై లగ్నం చేయకుండా నిద్రపోతే పరమాత్మ శక్తి ఆత్మలో నిండదు. విధానాన్ని పాటించారు కానీ, విధిని వదలివేశాం. విధితోనే సిద్ధి వస్తుంది. విధానం పాటించినా మార్కులు వస్తాయి గాని సంపూర్ణసిద్ధిని పొందలేము. ఉదాహరణకు సెల్‌ఫోన్ చార్జింగ్‌లో పెట్టినప్పుడు స్విచ్ వేయటం మర్చిపోతే చార్జింగ్ అవ్వదు కదా, అదేవిధంగా ప్రతీ కర్మ ఏవిధంగా చేయాలో శివపరమాత్మ విధిని స్పష్టంగా తెలియజేశారు. మనస్సుని విశ్వసేవ కోసం అర్పణ చేయమన్నారు, ధనాన్ని ఈశ్వరీయ సేవలో అర్పణ చేయమన్నారు, తనువుని ఎముకలు అరిగేలా అనేక ఆత్మలకు ఈశ్వరీయ సేవను అందించమన్నారు. అన్ని సంబంధాలను మరిచి శివపరమాత్మ ఒక్కరినే స్మృతి చేయమన్నారు. ఈ ఒక్క అంతిమ జన్మలో పైన చెప్పిన విధిని పాటిస్తే అన్ని జన్మలలో (84 జన్మల్లో) ఒకటికి లక్ష రెట్లు పుణ్యంగా మారి జీవిత సౌకర్యాన్ని సమకూర్చుతారు. ఇది అసలైన విధి.

**87. ప్రతీ కార్యం యొక్క ఫలం ఎవరికి సమర్పణ చేయాలి?**

ప్రతీ కార్యం యొక్క ఫలం శివబాబాకు అర్పణ చేసినట్లయితే అప్పుడు మనకు ఏవిధమైన సంకల్పం రాదు. నిమిత్త భావన మనలో ధారణ అవుతుంది.

**88. 21 జన్మల ప్రాప్తి రావాలంటే ఏ విషయంపై ధృడమైన ధ్యాస పెట్టుకోవాలి?**

శివబాబాతో తెగిపోని స్నేహం పెట్టుకోవాలి. ఒక్క సంకల్పం కూడా వ్యర్థంగా పోకూడదు. ఒక్క సంకల్పం అయినా వ్యర్థంగా పోతే జమాఖాతాలో కట్ అయిపోతుంది. సంగమయుగంలో మాత్రమే ఈశ్వరీయ బ్యాంక్ తెరిచి ఉంటుంది. మరే యుగంలో తెరువబడదు. ఈ యుగంలో చేసుకున్న త్యాగం యొక్క ప్రాప్తి 21 జన్మలకు జమ అవ్వటమే కాకుండా 63 జన్మలకు అనగా ద్వాపర, కలియుగాల జన్మలలో అంతిమ సమయం వరకు పప్పు, రొట్టె అనగా ఆహారానికి లోటు ఉండదు. ఇంత సౌభాగ్యం శివబాబా ప్రతీ ఒక్కరికి ఈ యుగంలో మాత్రమే ఇస్తారు.

**89. ఎవరి సమానంగా ఇతరులను తయారు చేయాలి, పూర్తిగా వివరించండి?**

శివబాబా సమానంగా తయారు చేయాలి. మీ సమానంగా తయారు చేస్తే మీలో ఏ లోపం అయితే ఉందో ఆ లోపం వారిలో కూడా వచ్చేస్తుంది. శివపరమాత్మ చాలా పవిత్రుడు, ఆయన దగ్గరకే మనం ఇతరులను చేర్చాలి. ఉదాహరణకు, మనం ఎక్కడైనా కోర్సు చెబుతున్నప్పుడు, వారు మన సెంటర్‌కి రాకపోయినా దైనందిన జీవితంలో జీవిస్తున్నా కానీ, బాబా పుస్తకం వారికి ఉచితంగా ఇస్తే అప్పుడు వారు బాబాతో ప్రతీరోజు సంలగ్నతను జోడించి స్వర్గ భాగ్యానికి కనీసం ప్రజలుగా రావడానికైనా అర్హత కలిగి ఉంటారు. దీనినే శుభభావన అంటారు. శుభభావనకు, శుభకామనకు తేడా ఏమిటంటే, శుభకామన అనగా, శుభం అనేది మంచిదే కానీ, కామన అనేది కోరిక. శుభ భావన అనేది శుభం అనేది మంచిది, భావన అనేది ఫలాన్ని ఇస్తుంది. మన భావన వారిని బాబాతో సంబంధం జోడించేలా తయారు చేస్తుంది. అప్పుడు వారి పుణ్యంలో కొంతబాగం మనకు జమ అవుతుంది. ఉదాహరణకు, జీవితభీమా పాలసీ చేయించిన వారికి కొంత కమీషన్ వచ్చేస్తుంది. మన వద్దకు వస్తేనే జ్ఞానం తెలియజేస్తాము అనే కోరిక వారిని, మనల్ని కూడా పుణ్యం నుండి వంచితం చేస్తుంది.

**90. ట్రాఫిక్ కంట్రోల్ వలన లాభం ఏమిటి?**

ట్రాఫిక్ కంట్రోల్ అనగా దినమంతటిలో ఏ కార్యం చేస్తున్నా, ఆ కార్యాన్ని ఆపి, 3 ని॥లు శివపరమాత్మని మనసారా జ్ఞాపకం చేసుకుంటే, శాంతి శక్తి ఆ 3 ని॥లలో ఆత్మలైన మనలో జమ అయిపోతుంది. ప్రతీరోజు ఈ పద్ధతిని పాటించి నిల్వచేసుకున్న శాంతి శక్తియే అంతిమ

భయంకర సమయంలో మన ద్వారా ప్రపంచంలో అలజడిలో ఉన్న ఆత్మలకు  ఒక్క సెకను శాంతిని అనుభవం చేయించి బాబా మనల్ని మరియు వారిని కూడా శాంతిధామానికి తీసుకెళ్ళిపోతారు. కాబట్టి 3 ని॥ల అభ్యాసం చేయడానికి ఎంత బిజీగా వున్నా సమయాన్ని తప్పకుండా కేటాయించాలి. ఏవిధంగానైతే రైల్వేవారు వికలాంగులకు వారితో పాటు వారి సహాయకారిగా మరొకరికి కూడా ప్రక్కనే రిజర్వేషన్ సీట్ ఇస్తారు కదా, అదేవిధంగా అంతిమంలో మనకు నిల్వ ఉన్న శాంతిశక్తి అశాంతి ఆత్మలకు జమ చేసి, శివబాబా మనల్నిఅందరిని శాంతిధామానికి తీసుకువెళతారు.  నాలుగురోడ్ల కూడలిలో పోలీస్‌వారు ఎఱ్ఱలైటు వేసి ఒక్కరోడ్డులో ప్రయాణించే ప్రయాణీకులను పంపిసారు  మిగిలిన మూడు రోడ్లలో ఉన్న ప్రయాణీకులను ఆపి వేస్తారు, తర్వాత వరుసగా ఆ మూడు రోడ్లలో ఉన్న ప్రయాణీకులను పంపిస్తారు దీని ద్వారా యాక్సిడెంట్స్ జరగవు. ఒకవేళ ఆ పద్ధతిని అతిక్రమించి వెళ్తే యాక్సిడెంట్ జరగవచ్చు, జరిమానా కూడా వేస్తారు. కావున ఈ 3 ని॥ల శాంతి అనుభవం చేసుకోవడానికి ఖాళీ లేదని చెబితే మనకు మనమే కారాగారాన్ని తయారుచేసుకుని అందులో బంధీ అయినట్లు నిర్ణయించబడుతుంది.

### ౨౧. బ్రాహ్మణాత్మలలో ప్రేతాత్మలు గుప్తంగా ప్రవేశించి ఏ విధమైన నష్టం తీసుకువస్తాయి?

ప్రేతాత్మ గుప్తంగా ప్రవేశించిన వారిలో చెడు సంస్కారం తీవ్రంగా విజృంభిస్తుంది.  వీరు ఇలా మారిపోయారేమిటి, చాలా మంచిగా ఉండేవారు కదా అని మనం అనుకుంటాం. ఇలాంటి ఆత్మలు మనలో ప్రవేశించకుండా ఉండాలంటే దినమంతటిలో ఎక్కువ సమయం ట్రాఫిక్ కంట్రోల్ నియమం పాటించి బిందురూప స్థితిని అనుభవం చేస్కోవాలి.

### ౨౨. ఉదారచిత్ అనగానేమి? వాటి వలన ఏ లాభాలుంటాయి?

మనసా, వాచా, కర్మణాలో విశాల మనస్సు ఉండటమే ఉదారచిత్. వీరు అందరినీ ఆకర్షితం చేస్తారు.

### ౨౩. ఏది మధువనం?

భగవంతుడు అవతరించి జ్ఞానం తెలియజేస్తున్న స్థానాన్నే మధువనం అంటారు. ఆ స్థానం భారతదేశంలో రాజస్థాన్ రాష్ట్రంలో ఆబూ పర్వతంపైఉంది. అక్కడ వేలాదిమంది సేవాదారులు ఉంటారు. భగవంతుడైన శివపరమాత్ముడు అక్కడ ప్రతీ సంవత్సరం నిర్ణయించిన తేదీలలో ఒక వృద్ధ మానవ శరీరంలో ప్రవేశించి, కొంత సమయం ఉండి, జ్ఞానం చెప్పి తిరిగి పరంధామం వెళ్ళిపోతారు. దీనిని అవతరణ అంటారు కానీ జన్మించడం అనరు. అవతరణ అనగా అవసరం కోసం ఒక తరుణంలో అనగా దేహంలో ప్రవేశించటం. శివపరమాత్మ ముఖ్యంగా మధువనంలో ఉన్నవారికి ఒక శిక్షణ ఇస్తున్నారు. అదేమిటంటే మదురత కలిగి బేహద్ వైరాగ్యవృత్తి కలిగి

ఉండాలి. బేహద్ వైరాగ్య వృత్తి అనగా దేహానికి సంబంధించిన వినాశి పదార్థాల నుండి అతీతంగా ఉండాలి. అనగా ధరించడంలో, ఉండటంలో, నడవటంలో, తినడంలో విశ్వం ముందు సాదాసీదాగా మరియు ఉదాహరణగా ఉండాలి. ఒకవేళ ఎవరైనా ఏ స్థానంలో అయినా ఈ లక్షణాలు కలిగి ఉంటే వారు మదువనానికి దూరంగా ఉన్నా కూడా మధువననివాసీలుగా లెక్కించవచ్చు. మధువనంలో ఉన్నా కానీ ఈ రెండు లక్షణాలు లేకపోతే స్థూలంగా ఉన్నా కానీ భాగ్యానికి దూరమవుతారు.

## ౨4. సర్వీస్ యొక్క సఫలతా స్వరూపం అని దేనిని అంటారు?

సర్వాత్మలను శివబాబాకి స్నేహీగా, సహయోగిగా మరియు పురుషార్థంలో శక్తి నిండే స్వరూపులుగా చేయాలి తప్ప, వారి నుండి మన కోసం ఏదీ ఆశించకూడదు. సేవ చేసే ప్రతీ ఆత్మలో ఈ మూడు లక్షణాలు స్పష్టంగా కనిపించాలి.

## ౨5. పాస్ విత్ ఆనర్ అయ్యేవారి లక్షణాలు తెలుపుము?

పాస్ విత్ ఆనర్ అంటే శిక్షలు లేకుండా పరంధామానికి శివబాబా వెంట వెళ్ళటం. ఆత్మ శరీర కర్మేంద్రియాల ద్వారా చేసిన పాపం, శరీర కర్మేంద్రియాల ద్వారానే ఈ భూలోకంలోనే సమాప్తం అయిపోతుంది. కానీ సంకల్పాల రూపంలో ఉండి కర్మలో రాకుండా ఉంటే వ్యర్థ పాపపు ఆలోచనలు ఆత్మలో మూడవ బిందువు అయిన సంస్కారంలో ఉండిపోతాయి. ఆత్మలు పరంధామం వెళ్ళే ముందు సూక్ష్మవతనంలో ఆగుతాయి. ఎందుకనగా సూక్ష్మ రూపంలో ఉన్న చెడు సంకల్పాలను శివబాబా ఒక్క సెకను దృష్టి ఇచ్చి ఆ ఆత్మలో ఆ సంస్కారాన్ని భస్మం చేసి పావనం చేసి ఆత్మలను పరంధామం తీసుకువెళతారు. పాస్‌విత్ ఆనర్ అయ్యేవారు ఈ సూక్ష్మ శిక్షలు అనుభవించకుండా, డైరెక్ట్‌గా బాబా వెంట పరంధామం వెళ్ళిపోతారు.

## ౨6. శివపరమాత్మ ధర్మరాజు రూపంలోకి మారినప్పుడు ఏవిధమైన శిక్షలు ఉంటాయి?

ఈ సంగమయుగంలో శివపరమాత్మ ప్రతీ ఒక్కరికీ వరుసగా తండ్రి, టీచర్, సద్గురువు రూపంలో పాలన, చదువు, సద్గతి ఇస్తున్నారు. ప్రతీ ఒక్కరికి అంతిమ సమయంలో సూక్ష్మ వతనంలో బాబా ధర్మరాజుగా పాత్ర అభినయిస్తారు. అప్పుడు అక్కడ ప్రతీ ఆత్మకు ఒక చెడు సంకల్పానికి 100 రెట్లు శిక్ష పడుతుంది. ఆ శిక్ష ఒక్క సెకను అయినా కానీ, అనేక జన్మల్లో సంకల్పాల ద్వారా వచ్చిన పాపాన్ని ఒక్క సెకనులో భస్మం చేస్తుంది. అప్పుడు బాబా వెంట పరంధామం వెళ్ళిపోతారు. ఈ శిక్ష నుండి తప్పించుకోవాలంటే, ఎవరిపైనా, ఏ విషయాలలోను చెడు సంకల్పాలు చేయకూడదు.

**౯౭. సూక్ష్మ వతనంలో అవ్యక్త బ్రహ్మా దగ్గర మన రికార్డ్ ఏవిధంగా ఉంటుంది?**

భూలోకంలో మనం చేసే ప్రతీ సంకల్పం ఏ తారీఖున, ఎన్ని గంటలకు చేసామో అక్కడ రికార్డ్ అయిపోతుంది. భక్తిమార్గంలో బ్రహ్మా మన తలరాత రాశారు అంటారు, అది వాస్తవం కాదు. మనం చేసుకున్న ప్రతీ కర్మ అక్కడ రికార్డ్ అవుతుంది. అవ్యక్త బ్రహ్మా సాక్షీరూపంలో ఉంటారు తప్ప, ఆయనేమీ మన తలరాత వ్రాయడు. ఈ విషయంలో ప్రతీ ఒక్కరు ధ్యాస పెట్టుకోండి.

**౯౮. మహారథులు ఏ రెండు విషయాలపై ధ్యాస పెట్టుకోవాలి?**

భగవంతుడిని తోడుగా మరియు సహాయకారునిగా అనుభవం చేసుకోవాలి. సహాయకారి అనగా మనం ఏదైనా అవసర సమయంలో మన ఆలోచన శివబాబాకు తెలియజేసినప్పుడు భగవంతుడు అశరీరి కావున ఎవరో ఒకరి ద్వారా సహాయం తప్పకుండా చేస్తారు. ఆ సమయంలో మనం ఆ వ్యక్తి సహాయం చేసారని అనుకుంటాము. అది తప్పు. ఆ సహాయం చేసిన వ్యక్తిలో నిరాకారి శివబాబా యొక్క శక్తి ప్రవేశించి ఆ కార్యం సఫలం చేయించారని అనుభవం అవ్వాలి. అంతేకాని, వీరు చేసారు, వారు చేసారు అని వారి (వ్యక్తి) యొక్క ప్రేమలో లీనం అవ్వకూడదు. వారిని గౌరవించాలి కానీ వారికి ఆధీనం కాకూడదు. ఈ విషయంపై మహారథులు చాలా ధ్యాస పెట్టుకుని నడవాలి. మహారథులు రెండు రకాలు ఉంటారు. (1) పురుషార్థంలో మహారథులు, (2) సేవలో మహారథులు.

**౯౯. మనం ఏయే విషయాల్లో మోసపోతున్నాము?**

ఈ పాత ప్రపంచంలో అల్పకాలిక సుఖాన్నిచ్చే సర్వ సంబంధాలు, ధనం, సర్వ పధార్థాలు, వస్తు వైభవాలు శాశ్వతం అనుకుని మోసపోతున్నాము. కానీ ఇవన్నీ కొంత సమయంలో మట్టిలో కలసిపోతాయి. వెనువెంట ఈ భూమిపై శివబాబా ద్వారా స్వర్గ స్థాపన జరుగుతుంది. కాబట్టి వినాశి పదార్థాల వెంట పరుగులు పెట్టకుండా, పరమాత్మ శివునితో సంబంధం పెట్టుకుంటే, స్వర్గంలో ఉన్నత పాత్ర అభినయిస్తారు.

**100. కోరిక ఏ గుణాన్ని సమాప్తి చేస్తుంది?**

స్వచ్ఛతను సమాప్తి చేస్తుంది.

**101. ఇచ్ఛామాత్రం అవిద్య అనగానేమి? దానివలన లాభాలేమిటి?**

ఇచ్ఛామాత్రం అవిద్య అనగా కోరిక అంటే ఏమిటో తెలియనివారు. దీనివలన లాభాలు (1) ఇతరుల కోరికలన్నీ మనం తీర్చగలుగుతాము. (2) యోగంలో కూర్చున్నప్పుడు ఆనందం అనుభవం అవుతుంది. (3) ప్రపంచం వారందరూ మనం ప్రేరణ ఇవ్వకుండానే శివబాబాకు అందరు మనసా, వాచా, కర్మణా బలి అయిపోతారు. (4) జ్వాలారూపీ తపస్సు కూడా ఈ ఒక్క విధి ద్వారా మాత్రమే అనుభవం అవుతుంది.

## 102. సూక్ష్మవతనంయొక్క విశేషతలను తెలుపుము?

సూక్ష్మవతనం అనేది సూర్యచంద్ర నక్షత్ర మండలాలపైన ప్రకాశవంతమైన ప్రదేశం. ఇది సంగమయుగం నడచినంత కాలం ఉంటుంది తరువాత అదృశ్యమవుతుంది. శివబాబా 1937లో పరంధామం నుండి సాకారలోకంలో అనగా ఈభూమిపై ఒక వృద్ధ మానవ శరీరంలో ప్రవేశించే సమయానికి ముందు ఈ వతనాన్ని తన దివ్య సంకల్పశక్తిచే సృష్టించినారు. ఇక్కడ ఏవిధమైన స్థూల సాధనాలు నామమాత్రంగా కూడా ఉండవు. భూలోకంలో మానవుడు చేసే ప్రతీ సంకల్పం, మాట, కర్మ యొక్క చిత్రం అక్కడ అలౌకిక మ్యూజియంలో రికార్డ్ అవుతుంది. శివభగవానుడు ప్రవేశించిన శరీరధారియైన బ్రహ్మాబాబా ఆత్మ 18 జనవరి 1969 సం॥లో ఆయన భౌతిక శరీరం నుండి ఆత్మ వెళ్ళిపోయింది(మరణం). బ్రహ్మ ఆత్మ బౌతిక శరీరంలో ఉన్నప్పుడు శివబాబా ఆయన శరీరంలో ప్రవేశించి ఆ ఆత్మకు ఎన్నో ధర్మ సూత్రాలు ప్రభోదించారు. ఆ బ్రహ్మ ఆత్మ ఇప్పుడు సూక్ష్మవతనంలో సూక్ష్మ శరీరధారియై భూలోకంలో జరిగే ప్రతీ ప్రక్రియ అక్కడ రికార్డ్ చేయడానికి నిమిత్తంగా ఉన్నారు. ఆయన వ్యక్తిగతంగా ఏదీ రికార్డ్ చేయరు కానీ ఆటోమేటిక్‌గా ఆ కాంతిపుంజంలో రికార్డ్ అయిపోతుంది. ఏవిధంగానైతే, శాటిలైట్ గగనమార్గంలో ఉంటూ భూలోకంలో ఉన్న కంప్యూటర్ ద్వారా దృశ్యాలను చూపిస్తుంది కదా! ఇది సూక్ష్మవతనం యొక్క గొప్పతనం. ఇక్కడ ముఖ్యంగా గమనించవలసిన విషయం ఏమిటంటే, ఈ భూలోకంలో జ్ఞానయోగాలు నేర్చుకుంటూ, బ్రహ్మాకుమారీ, బ్రహ్మాకుమారులుగా పిలువబడుతున్న మనం ఎంత శాంతిశక్తిని ధ్వనిలోకి వెళ్ళకుండా జమచేసుకుంటామో, అంత సూక్ష్మవతనం యొక్క లీలలు, సాక్షాత్కారాం జరుగుతాయని శివబాబా తెలియజేయుచున్నారు.

## 103. అవ్యక్త స్థితిలో స్థితులై ధ్వనిలోకి వస్తే వచ్చే లాభమేమిటి?

అవ్యక్త స్థితి అనగా వ్యక్తానికి అతీతమైన స్థితి. ఆ స్థితిలో స్థితులై ఇతరులకు జ్ఞానం చెబుతూ ఉంటే సంఘటనలో ఉన్నవారు చాలా కొద్దిమంది డైరెక్ట్ పరమాత్మ శివునితో తమ సర్వసంబంధాలను జోడించుకుంటూ ముందుకు వెళ్ళిపోతారు.

## 104. శ్రేష్ఠ ఆత్మల ద్వారానే శివబాబా ఇతరులకు ఎందుకు వరదానం ఇస్తారు?

శ్రేష్ఠ ఆత్మలలో నిరంతరం త్యాగం, తపస్సు, సేవ ఉంటాయి వారికి శివబాబా ఒకటికి వేలరెట్లు శక్తినిచ్చి, సహయోగం యిచ్చి, స్నేహం యిచ్చి, ఇతరుల కొరకు నిమిత్తం చేస్తారు. కావున మీరు కూడా త్యాగి, తపస్వీ, సేవాధారి మనస్ఫూర్తిగా అయితే, మీ ద్వారా కూడా అనేకులకు శివబాబా సేవ చేయిస్తారు. ఇది భగవంతుని యొక్క నియమం.

**105. మా నిమిత్త టీచర్ ఈ విషయంపై ధ్యాస యిప్పించలేదనే మాట ఎప్పుడు వస్తుంది?**

బ్రహ్మాకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో ఉన్న ప్రతీ టీచర్, శివబాబా చెప్పిన ప్రతీ వాక్యాన్ని ధ్యాసతో, సంలగ్నతతో విధ్యార్ధులకు వినిపించాలి. మా టీచర్ మాకు ఈ విషయంపై ధ్యాస ఇప్పించలేదనే నెపం పెట్టకూడదు. కాబట్టి వారి అదృష్టంలో ఉంటే వారు మహావాక్యాన్ని ఆధారంగా జీవితాన్ని తయారుచేసుకుంటారు. వారి అదృష్టంలో లేకపోతే, చేజేతులారా పోగొట్టుకుంటారు. కానీ, బాబా చెప్పిన ప్రతీ విషయం నేను వినిపించానని టీచర్‌కు తృప్తి ఉండాలి. నేను విన్నాను అని విధ్యార్థికి కూడా తృప్తి ఉండాలి. 1969 నుండి ఇప్పటి వరకు అనగా 2012 వరకు గల వాణీలు ఈ పుస్తకంలో పొందుపరచామని గమనించగలరు.

**106. ప్రతీ కర్మ ముందు, వెనుక 2, 4 ని॥లు ఎందుకు శివబాబాని స్మృతి చెయ్యాలి?**

వాతావరణంలో ప్రశాంతత ఏర్పడుతుంది మరియు వ్యర్థ సంకల్పాలకు తాళం పడిపోతుంది. ఆ వాతావరణం అనేకులను పావనం చేస్తుంది.

**107. తెలివిగల ఆత్మలకు మరియు సేవ చెయ్యాలనే బుద్ధి కలిగిన ఆత్మలకు తేడా తెలుపండి?**

తెలివిగల ఆత్మలు సేవలో ప్లానింగ్ బాగా చేయగలరు. కానీ కార్యంలో తీసుకురావడంలో శక్తి తక్కువగా ఉంది. సర్వీస్ చేసే ఆత్మలకు ప్లానింగ్ తక్కువగా ఉంటుంది, కానీ కార్యంలోకి తీసుకువచ్చే గుణం చాలా బాగా ఉంటుంది. కాబట్టి మనమందరం రెండు గుణాల గుణాలు కల్గి ఉంటే విజయం కంఠహారం అవుతుంది.

**108. టీచర్‌కి నిరంతరం ఏవిధమైన స్మృతి లేదా ధ్యాస ఉంచుకోవాలి?**

నేను టీచర్ కాదు, శివబాబాయే టీచర్, నేను బాగా చదువుకుని, ఇతరులకు నేర్పించే శ్రేష్ఠ విధ్యార్థిని అనే భావన ఉండాలి. ఈ స్మృతి లేకుంటే గర్వం సహజంగా వచ్చేస్తుంది.

**109. అంతర్వాహక శరీరం అనగానేమి? దాని ద్వారా జరిగే సేవను వివరింపుము?**

అంతర్వాహక శరీరం అనగా ఫరిస్తా శరీరం. ఆత్మ శరీరంలో ఉంటూ బుద్ధి ద్వారా విశ్వంలో జరుగుతున్న అలజడి స్థానాలకు వెళ్ళి ఆ ధు:ఖమయ వాతావరణాన్ని శాంతిమయ వాతావరణంగా మార్చేస్తుంది. ఇది ఒక్క సెకనులో విశ్వమంతా తిరిగేయగల శక్తి కలిగిఉంటుంది. ఆ ఆత్మ చుట్టూ ఒక ప్రకాశవంతమైన శరీరం ఉంటుంది, దీని ద్వారా ఆత్మ ఎక్కడికైనా వెళ్ళి సేవ చేయగలదు. మన శరీరం ఒకేచోట ఉంటుంది, కానీ ఆత్మ ఫరిస్తా రూపంలో సేవ చేసి వస్తుంది. అప్పుడు ఆ

స్థానంలోని వారందరు నేను ఏదొక అద్భుతాన్ని చూసాను, ఇది భగవంతుని లీల అని అనుభవం చేసుకుంటారు. శరీరం ఒకే స్థానంలోనే ఉండిపోతుంది, ఇక్కడ మనకు ఒక అనుమానం రావచ్చును. ఆత్మ శరీరం నుండి విడిపోయినప్పుడు, శరీరం మరణిస్తుంది కదా అని. కానీ,సెల్ ఫోన్‌లో బ్యాటర్ పూర్తిగా చార్జ్ అయిన తర్వాత కరెంట్ యొక్క అనుసంధానం నుండి విడిపోయి ఆ ఫోన్‌ను కొంత సమయం వరకు పనిచేసేలా చేస్తుంది. అదేవిధంగా శరీరం మరణాన్ని పొందదు, తిరిగి విశ్వకళ్యాణం అనంతరం ఆ ఆత్మ శరీరంలో ప్రవేశిస్తుంది. కొన్ని కొన్ని యాంప్లిఫయర్స్‌లో ఉన్న ట్రాన్స్‌ఫార్మ్ కూడా కరెంట్ నుండి విడిపోయిన తర్వాత కొంతసమయం కరెంట్ ప్రవహించే శక్తి కలిగిఉంటుంది. అదేవిధంగా ఫరిస్తా స్వరూప ఆత్మ శరీరం నుండి విడిపోయి, విశ్వకళ్యాణం చేస్తున్నా, తిరిగివచ్చి ప్రవేశించేవరకు ఆ శరీరం సజీవంగానే ఉంటుంది.

### 110. సంకల్పాల సిద్ధి ఎలా వస్తుంది?

సంకల్ప సిద్ధి పొందాలంటే వ్యర్థ సంకల్పాలు రచించకూడదు. ఎందుకంటే వ్యర్థ సంకల్పం కూడా సిద్ధి పొందే శక్తి మీలో ఉంది. కాబట్టి వ్యర్థం సమర్థాన్ని సమాప్తం చేసేస్తుంది. కావున జ్ఞానీ యోగులైన మీరు సర్వకాల సర్వావస్థల యందు సమర్థ సంకల్పాలనే చేయాలి. అప్పుడు ఆ సంకల్పం సిద్ధిస్తుంది. అనగా కార్యరూపం దాల్చుతుంది.

### 111. మాతలకి కర్మలఖాతా ఎప్పుడు పూర్తవుతుంది?

సేవలో పాల్గొన్నప్పుడు కర్మలఖాతా పూర్తవుతుంది. ఏదైనా కర్మలఖాతా అడ్డు వచ్చినప్పుడు, అడ్డు తొలగిన తరువాత సేవ చేస్తామనే మాట రాకూడదు. సేవలో ఇతరుల ఆశీర్వాదాలు మన పుణ్యఖాతాను పెంచుతాయి. మాతల ద్వారా మూలమూల స్థానాల్లో బాబా సందేశం అందే కార్యం డ్రామాలో నిర్ణయించబడి ఉంది. కావున ప్రతీ ఒక్కరు ధైర్యంతో ముందుకు వెళ్ళండి.

### 112. కుమారులు ఎలా ఉండాలి?

"కుమార్" అంటే పవిత్ర స్థితికి గుర్తు. పూర్తిగా ప్రపంచ విషయాలతో, బంధనాలతో అతీతం అవ్వాలి. అప్పుడే దైవీ పరివారానికి, శివపరమాత్మకు, బ్రహ్మాబాబాకు ప్రియం అవుతారు.

### 113. ఎవరితో కనెక్షన్ ఉండాలి? దాని వలన లాభం ఏమిటి?

కనెక్షన్ యొక్క అటెన్షన్ బీజరూపుడైన శివబాబాతో ఉండాలి. స్థూలంగా సంస్థతో ఉన్నప్పటికి, కనెక్షన్ మాత్రం సదా శివబాబాతో ఉండాలి. పరివారంలో అతీతం, అతిప్రియంగా ఉండాలి. పరివారమైనా, సంస్థ అయినా పరమాత్మ పరిచయం ఆధారంగానే లభిస్తుంది. ఆధారాన్ని వదలివేసి, ఆధారానికి నిమిత్తమైన వారితో కలిసి ఉండటం అనేది శివబాబాను అగౌరపరచినట్లుగా డ్రామాలో

నిర్ణయించబడుతుంది. వృక్షం యొక్క మొదట్లో నీరు పోసినప్పుడు వేర్ల ద్వారా మరియు కాండం ద్వారా కొమ్మకొమ్మకు, ప్రతీ ఆకుకు నీరు అందుతుంది. కేవలం ఆకుల మీద నీరు పోస్తే, వృక్షం ఎండిపోతుంది. అదేవిధంగా బీజరూపుడైన శివబాబాతో కనెక్షన్ పెట్టుకుంటే విశ్వంలో ఉన్న ప్రతీ ఒక్క ఆత్మ మనకు సహయోగి అయిపోతుంది. ఇది చాలా చాలా కర్మల యొక్క గుహ్యగతి.

### 114. ఎవరు ఇతర ఆత్మలకు ఆధీనం అవ్వరు?

ఎవరైతే శివ పరమాత్మ నుండి వరదానాలు పొందుతూ ఉంటారో వారు ఇంకెవ్వరికీ ఆధీనం అవ్వరు. ఎందుకంటే బాబా ఇచ్చే బహుమతుల ముందు ఇతరులు ఇచ్చేవి విలువ లేనివి, నిస్సారమైనవి అని గ్రహించాలి.

### 115. కర్మ చేసే ముందు మనం ఏవిధంగా ఆలోచించాలి?

కర్మ చేసే ముందు శివబాబా చెప్పిన విధంగా అనగా శ్రీమతం ఆధారంగా ఆ కర్మ ఉందా లేదా అని ఆలోచించాలి. కర్మ చేసిన తర్వాత ఆలోచిస్తే పశ్చాత్తాపం మిగులుతుంది. ఉదాహరణకు – మనం శివపరమాత్మ పేరుమీద ఒక స్థానిక సేవాకేంద్రం నిర్మించాలంటే, అది పూర్తిగా మధ్యస్తంగా ఉండాలి. అనగా ప్రపంచం వారు ఇప్పుడే వీరు ధనికులైపోయారని అనకూడదు. అలాగని, ఎందుకూ పనికిరానివారని, తీసిపారేసినట్లుగా కూడా అనుకోకూడదు. ఇది భగవంతుడు పెట్టిన ఆది, అనాది నియమం. బ్రహ్మాబాబా ఇతరులకు సౌకర్యం ఇవ్వడానికి ఇళ్ళు నిర్మించారు కానీ తాను స్వయం నిరాడంబరంగా గుడిసెలో అంతిమ కాలం వరకు నివసించారు.

### 116. అందరికీ ప్రియంగా అవ్వడానికి ఏవిషయంపై ధ్యాస పెట్టుకోవాలి?

అందరికీ ప్రియంగా అవ్వాలంటే మనలో ఏవిధమైన చెడుగుణాలు, చెడు సంస్కారాలు, చెడు ఆలోచనలు ఉండకూడదు.

### 117. ఈశ్వరీయరూపంలో మాయ వచ్చినప్పుడు మనం ఏవిధంగా ఉండాలి?

ఈశ్వరీయ రూపం అనగా నాలో భగవంతుడు వచ్చాడు అని చెప్పే విషయాలపై ధ్యాస పెట్టడం. భగవంతుడైన శివబాబా మౌంట్ ఆబూలో దాదీజీ శరీరంలో తప్ప ఇంకెవ్వరి శరీరంలో రారు. కానీ ఒక్కొక్కసారి ఏవైనా మంచి కార్యార్థం లేదా ఇతరులకు మంచి చేయడం కోసం ఎవరో ఒకరి శరీరంలోకి సమయప్రమాణంగా శివబాబా యొక్క శక్తి తప్పక ప్రవేశిస్తుంది. కానీ ప్రవేశించి నిరంతరం అలా ఉండిపోదు. కాబట్టి పరంధామంలో వున్న పరమాత్మ శివుని ఒక్కరిపై ధ్యాస పెట్టుకున్నప్పుడు మిగిలిన విషయాలన్నీ సమాప్తి అయిపోతాయి.

**118. సత్యం అని దేనిని అంటారు?**

ఏ విషయం అయితే సంకల్పం అనగా ఆలోచనలో వస్తుందో అది దాచకుండా తెలియజేయటమే సత్యం అని అంటారు. ఓటమి, సఫలత రెండూ కూడా స్పష్టంగా తెలియజేయాలి, దీనినే సత్యం అని అంటారు.

**119. ధర్మపితలు మీ ఎదురుగా ఎప్పుడు వస్తారు? వారు ఏవిధంగా ధర్మస్థాపన సంస్కారాన్ని మరియు శక్తిని నింపుకుంటారు?**

అంతిమ సమయంలో ధర్మపితలు మహాదాని, వరదాని ఆత్మల ముందుకు వస్తారు, ఆ సమయంలో వారికి నోటి ద్వారా పూర్తి జ్ఞానం చెప్పటం జరుగదు. అందరికీ తండ్రి ఒక్కడే! అనే విషయాన్ని నయనాల ద్వారా, సంకల్పాల ద్వారా వారికి అనుభవం చేయిస్తారు. ఆ ఒక్క సమయంలో ఆ ఒక్క శక్తిశాలీ అనుభూతి, ఆ ధర్మపితలలో నిండి తిరిగి భూమిపై తమ పాత్రను అభినయించడానికి పరంధామం నుండి వచ్చినప్పుడు ఈ సంస్కారాన్ని ఏవిధంగా వ్యక్తం చేస్తారంటే, పరలోకంలో తండ్రి ఉన్నారని, తన శిష్యులకు, భక్తులకు తెలియజేస్తారు. ధర్మం అంటే సృష్టికర్త శివబాబా తెలిపిన విధిని ఆచరించటమే! సృష్టిని పూజించకూడదు. సృష్టికర్త ఒక్కరినే జ్ఞాపకం చేసుకోవాలి.

**120. మనసా మహాదాని అయ్యేవారి గుర్తులు తెలుపుము?**

మనసా మహాదాని ఆత్మలు దృష్టి, వృత్తి ద్వారా పరమపిత స్మృతి ద్వారా ఇతరుల దు:ఖాన్ని తొలగిస్తారు. వారి మనస్సు ఎప్పుడూ వ్యర్థం వైపు నడవదు, ప్రపంచంలో అలజడిలోవున్న ఆత్మల సుఖాన్ని కోరుకుంటారు. వీరినే మనసా మహాదాని అని అంటారు.

**121. ప్రతీ సేవలో ఏయే విషయాలు ధారణ చేస్తే సఫలత వస్తుంది?**

త్యాగం, తపస్సు ఉండాలి. త్యాగం అనగా సేవ చేయటం ద్వారా వచ్చిన ఫలాన్ని తిరిగి ఇతరులకు పంచిపెడుతూ ఉండాలి.

**122. బ్రహ్మాకుమార్‌తో పాటు ఏ కుమార్‌గా తయారవ్వాలి?**

బ్రహ్మాకుమార్ అంటే సాకార స్వరూపధారులు. అనగా ఆహార, విహార, వ్యవహారంలో స్పష్టంగా కనిపిస్తారు. కానీ ఇవి బాహ్య విషయాలు. శివకుమార్ అంటే తపస్వీ కుమార్ అని అర్థం. తపస్యకు ఆధారం త్యాగం. త్యాగం చేసిన తర్వాత వచ్చిన సిరిసంపదలు, వస్తువైభవాలు, పేరు గౌరవం – ఇవన్నీ తిరిగి విశ్వ సేవలో అంతిమ శ్వాస వరకు పంచిపెట్టుకుంటూ వెళ్ళేవారే శివకుమారులు.

**123. కుమారులలో ఏ సంస్కారం ఉండిపోతుంది?**

ఏదొక సంస్కారం ఉండిపోతుంది. అదే దాచుకునే సంస్కారంగా పరిగణింపబడుతుంది.

**124. అంతిమంలో శివబాబా సూక్ష్మవతనంలో ధర్మరాజుగా ఉన్నప్పుడు ఆయనతోపాటు ఎవరు ఉంటారు?**

మహారథులు ఉంటారు. మహారథులు అనగా స్థూలంగా ఎక్కువ సంవత్సరాల నుండి జ్ఞానంలో ఉండేవారు అని కాదు, అంతిమం వరకు త్యాగం, తపస్సు కలిగి వుండి దివ్యగుణాలతో ఉండేవారు. ఇటువంటివారు ధర్మరాజు ప్రక్కనే సూక్ష్మ శరీరధారులుగా ఉంటారు. వీరిరువురి సమక్షంలో అనేక ఆత్మలకు తమ పాపాల సాక్షాత్కారాలు చేయించి, ఒక్క సెకను దివ్యదృష్టి ద్వారా శివబాబా వారి సంస్కారాలను పరివర్తన చేసి పరంధామం చేరుస్తారు.

**125. ఇతరుల మనస్సు యొక్క రహస్యాన్ని తెలుసుకోవటానికి మనకు ఏ శక్తి అవసరం?**

అంతర్ముఖత కావాలి. అంతర్ముఖత అనగా లోలోపల శివబాబా లీలలను, మహిమలను మననం చేసుకునే వారిలా ఉంటారు.

**126. బంధనాలలో ఉన్నవారు ఏవిధంగా సేవ చేయాలి?**

కొంతమంది బందనాలలో ఉన్నవారు నేను సేవ చేయలేకపోతున్నానని భాదపడుతుంటారు, కానీ శివబాబా చెబుతున్నారు బంధనాలలో ఉన్నవారు స్వతంత్రంగా ఉన్నవారికంటే మంచివారు. స్వతంత్రులు నిర్లక్ష్యం, సోమరితనంలో ఉంటారు. బందనాలలో ఉన్నవారికి మనస్సు యొక్క సంలగ్నత శివబాబాపై ఉంటుంది.

**127. మాతలు మైదానంలోకి వచ్చి సేవచేస్తే ఏవిధమైన ఫలితం లభిస్తుంది?**

పెద్ద పెద్ద పీఠాధిపతులు భగవంతునికి బలిహారం అయిపోతారు. ఎందుకంటే కుటుంబంలో ఉంటూ, మనస్సు యొక్క పవిత్రతను నిలబెట్టుకున్నారు. వారు కుటుంబాలకు అతీతంగా ఉండి పవిత్రంగా ఉన్నారు.

**128. ప్రతీ కర్మ ఎప్పుడు స్మృతిచిహ్నంగా తయారవుతుంది?**

మనం ప్రపంచానికి ఆధారమూర్తి, ఉద్ధారమూర్తి అనే విషయం నిరంతరం జ్ఞాపకం ఉంచుకుని కర్మ చేయాలి. అప్పుడు ఆ కర్మ స్మృతిచిహ్నంగా నిలిచిపోతుంది.

**129 . వరదాతగా అవ్వాలంటే ముఖ్య పురుషార్థం ఏమిటి?**

ప్రతీ సంకల్పం శివబాబాకు బలి చేయాలి అనగా ప్రతీ కర్మ శ్రీమతానుసారంగా ఆచరించాలి.

**130. అంతిమంలో ఏ సేవ జరుగుతుంది?**

అంతిమంలో నోటితో జ్ఞానం చెప్పే సేవ ఉండదు. కేవలం దృష్టి ద్వారా అద్భుతాలు జరుగుతాయి. ఏవిదంగానైతే దూరంగా ఉన్న టి.వి ని రిమోట్ ద్వారా ఛానల్ మార్చగల్గుతున్నామో అదేవిధంగా వరదానీ ఆత్మల యొక్క దృష్టి ద్వారా వారి నయనాలకు శివబాబా జ్యోతి స్వరూపం ప్రత్యక్షమవుతుంది.

**131. శివబాబా యొక్క ప్రతీ వాక్యంలో ఏ రెండు ముఖ్య విషయాలు దాగి ఉన్నాయి?**

1) ఆజ్ఞ 2) ప్రతిజ్ఞ. ఇలా చేయండి అని ఆజ్ఞ ఇస్తారు, ఆవిధంగా చేస్తే, ఆయన మనకు సంపూర్ణ సహయోగి అయిపోతారు. ఇదే భగవంతుని ప్రతిజ్ఞ. ఆజ్ఞ ఉల్లంఘిస్తే, భగవంతుని సహయోగం లభించదు. ప్రతీ ఆత్మలో 25% శక్తి ఉంటుంది. ఆ శక్తితో ఏవేవో విషయాలు చేసుకుంటూ వెళ్ళిపోతారు కానీ, శివబాబా సహయోగం లేకుండా ఎవరికీ 100% సఫలత లభించదు.

**132. ఆహారం తయారుచేసేటప్పుడు మనకు ఏవిధమైన స్మృతి ఉండాలి?**

భగవంతుని యొక్క శక్తి కిరణాలు ఆ ఆహారంపై పడుతున్నట్లు అనుభవం చేసుకోవాలి. అప్పుడు అది ప్రసాదంగా మారిపోతుంది. అది తీసుకున్న ప్రతీ ఒక్కరి మనస్సు చాలా శక్తిశాలీగా తయారవుతుంది మరియు శరీర ఆరోగ్యం కూడా బాగుపడుతుంది. కానీ భుజించే సమయంలో కూడా శివబాబా స్మృతి ఉంటే, అది కూడా మనస్సుకు, శరీరానికి ఎంతో ఆరోగ్యాన్ని, హాయిని ఇస్తుంది. ఆహారాన్ని తయారుచేయటం కూడా ఈశ్వరీయ సేవగా భావించి చేస్తే మార్కులు జమ అవుతాయి. ఉదాహరణకు – తిరుపతిలో ప్రసాదం లడ్డూలు తయారుచేసేటప్పుడు మంత్రాలు ఉచ్ఛరిస్తూ చేస్తారు. ఆ మంత్రాల యొక్క శక్తి తరంగాల రూపంలో ఆ పదార్థంపై ఒక పొరలా ఏర్పడుతుంది, అది మనకు కనిపించదు. అదేవిధంగా శివబాబా స్మృతిలో చేసిన ప్రతీ పదార్థం ప్రసాదంలా భావించాలి. వండటం కూడా శివబాబా సేవ అని చేస్తే సంపూర్ణ మార్కులు లభిస్తాయి.

**133. వారసులకు శివబాబా ఏమి ఇస్తారు? మిగిలినవారికి ఏమి ఇస్తారు?**

వారసులకు శివబాబా అన్ని శక్తులు అర్పణ చేస్తారు. వారసులు అనగా అతీంద్రియ సుఖం యొక్క అధికారులు. అతీంద్రియ సుఖం లేకుండా ఇంద్రియ సుఖం బోగించే ఆత్మలకు కొద్దిగా ఇచ్చి సంతోషపెడతారు.

## 134. సంకల్పం యొక్క గొప్పతనాన్ని వివరించండి?

1) సంకల్పం ద్వారా ఎవరినైనా దూరం నుండి పిలవవచ్చు 2) సంకల్పం ద్వారా ఎవరికైనా కార్యం యొక్క ప్రేరణ ఇవ్వవచ్చు 3) సంకల్పం ద్వారా ఇతరుల బుద్ధిలో స్పష్టంగా శివబాబా చిత్రాన్ని చూపించవచ్చు. ఏవిధంగానైతే టి.విలో దృశ్యాలు దూరంగా వున్న రిమోట్ ద్వారా మారిపోతాయో, అలాగే మనం ఒక స్థానంలో ఉండి సంకల్పశక్తి ద్వారా ఇతరాత్మల స్వభావ సంస్కారాలను మార్చవచ్చు. సంకల్పసిద్ధికి ముఖ్యమైనటువంటి ప్రయత్నం ఏమిటంటే ఎవరిపట్ల వ్యర్థ సంకల్పాలు నడవకుండా శివబాబా చెప్పిన శ్రీమతం బుద్ధిలో నిరంతరం నడుస్తూ ఉండాలి.

## 135. సహనశీలత యొక్క గొప్పతనం తెలుపుము?

సహనశీలత గుణం ఉన్న వారి ముఖంలో సంతుష్టత స్పష్టంగా కనపడుతుంది. సహనశీలత ఉన్నవారు బాహ్యవైబ్రేషన్స్‌చే కాక మనస్సు యొక్క సంకల్పాలలో కూడా భయపడరు. సహనశీలతతో ఇతరులను ఎదుర్కుంటారు. సహనశీలత ద్వారా మనన శక్తి పెరుగుతుంది. మననంలో మగ్న స్థితి కూడా సహజంగా లభిస్తుంది. సహనశీలత ఉన్నవారే సాక్షి అవుతారు. సహయశీలత ఉన్నవారు ఒకొక్క గుణం యొక్క లోతులకి వెళ్ళగలుగుతారు. సహనశీలత అంటే మన ఎదురుగా క్రోధంతో ఎవరైనా భయంకర రూపంతో వస్తే, ఆ ఆత్మను చూసి అలజడి అవ్వరు. ఎందుకంటే క్రోధం అనేది అవగుణం. ఆ అవగుణాన్ని సహనశీలత కలవారు స్వీకరించరు. తిరిగి క్రోధాన్ని వ్యక్తం చేయరు. వారిలో ఉన్నసహనశీలతా శక్తి ద్వారా ఇతరులకు పాపం రాకుండా ఆశీర్వాదాలు ఇస్తారు. ఇన్ని శక్తులు సహనశీలతలో ఇమిడి ఉన్నాయని శివబాబా మనకు తెలియజేస్తున్నారు.

## 136. ఎక్కడ స్నేహ స్వరూపం ఉండాలి? ఎక్క జ్ఞాన స్వరూపం ఉండాలి? ఎక్కడ శక్తి స్వరూపం ఉండాలి?

కొంతమందిలో నిర్బల సంస్కారాలు ఉంటాయి. వారికి దయాహృదయంతో స్నేహం యిచ్చి ముందుకు తీసుకువెళ్ళాలి. ఇతరులను జ్ఞానీగా తయారుచేసే సమయంలో స్నేహ స్వరూపంలో ఉండాలి. వారిలో చెడు సంస్కారాన్ని తొలగించే సమయంలో శక్తి స్వరూపంలో జ్ఞానయుక్తస్థితిలో ఉండాలి. జ్ఞానాన్ని ప్రసాదించేటప్పుడు, దయాహృదయులుగా ఉండాలి. ఈ అన్ని కర్తవ్యాలు వెనువెంట ఉండాలి.

## 137. ఏవైనా క్రొత్త పుస్తకాలు ముద్రించేటప్పడు ఏ విధిని పాటించాలి?

ప్రతీ పుస్తకంపై శివబాబా జ్యోతి స్వరూపమైన చిత్రం ఉండాలి. విస్తారం ఉండకూడదు. సారయుక్తంగా ఉండాలి. విస్తారం ఎక్కువ అయితే బుద్ధికి అలసట తీసుకువస్తుంది. సారం ఉంటే బుద్ధికి హత్తుకొని వారి బుద్ధి దివ్యబుద్ధిగా పరివర్తన అయిపోతుంది.

**138. కోర్సు చెబితే ఎవరు తయారవుతారు? శక్తినింపితే ఎవరు తయారవుతారు?**

కేవలం కోర్సు చెబితే సత్య త్రేతాయుగ ప్రజలు తయారవుతారు. మనం అశరీరి స్థితిలో ఉండి శక్తి నింపితే సంబంధంలోకి వచ్చేవారు తయారవుతారు. ప్రతీ సేవలో మార్కులు జమ అవుతూ ఉంటాయి.

**139. సర్వీస్ చేసేటప్పుడు ఎన్ని రకాల ఫలితాలు వస్తాయి?**

ప్రతీ సర్వీస్‌కు ఫలితం తప్పకుండా వస్తుంది. కొంతమంది శివబాబా గురించి చెప్పగానే ఆకర్షితమైపోతారు. మరికొంతమంది ఆపద వచ్చినప్పుడు శివబాబాకు దగ్గరవుతారు. కొంతమంది ప్రకృతి వైపరీత్యాలు వలన ఏదైనా నష్టం వాటిల్లితే శివబాబాకి దగ్గరవుతారు. ఏది ఏమైనా కానీ ప్రపంచం అన్ని విషయాలలో అతిలోకి వెళ్ళిపోయినప్పుడు ఓ భగవంతుడా, నన్ను నీ దగ్గరకు తీసుకుపో అనే మాట వస్తుంది. సేవ చేసేటప్పుడు వెంటనే ఫలితం రాలేదని వాడిపోకూడదు. కొన్ని విత్తనాలు తొందరగా మొలకెత్తి తొందరగా ఫలానిస్తాయి, కొన్ని విత్తనాలు ఆలస్యంగా మొలకెత్తి ఆలస్యంగా ఫలాన్నిచ్చి, ఎక్కువ ఆయుష్షు కలిగి ఉంటాయి.

**140. ఏయే విషయాలలో సాధారణత ఉండాలి?**

కేవలం వస్త్రాలు ధరించడంలోనే సాధారణత కాదు, ప్రతీ విషయంలో సాధారణంగా ఉండాలి. అనగా తినడం, నడవడికలో, వ్యవహారంలో సాధారణత ప్రత్యక్షంగా కనిపించాలి.

**141. సేవచేసేటప్పుడు శరీరాన్ని ఏవిధంగా భావించాలి?**

ఇది పాతశరీరం, కేవలం శివబాబా సేవకోసమే లభించింది. శివబాబాయే సేవ కోసం శరీరాన్ని తాకట్టుగా తీసుకున్నారు అని భావించి సేవచేస్తే, శరీరం గురించి మనకు ఏవిధమైన అలజడి మరియు కోరిక ఉండదు.

**142. రోజూ రాత్రి నిద్రించేటప్పుడు ఏవిధమైన ధ్యాస పెట్టుకోవాలి?**

రాత్రి నిద్రపోయేముందు, ఉదయం నుండి జరిగిన కర్మలను పరిశీలన చేసుకుని, చెడు కర్మలు ఉంటే బాబాకు చెప్పి నిద్రించుట అలవాటు చేసుకోవాలి. అప్పుడు మనలో తేలికతనం వస్తుంది.

**143. పాండవులని ఎవరిని అంటారు? వారి విశేషతలేమిటి?**

పాండవులు ఐదుగురే కానీ, ఒకేమతంలో అనగా బాబా స్మృతిలో ఉంటారు. కానీ ప్రతీ ఒక్కరికి ఒక విశేషత ఉంటుంది. ఎవరి విశేషత వారిదే అయినప్పటికీ, అందరూ కలసి విశేషమైన భాధ్యత తీసుకుని శివబాబా యొక్క ప్రతీకార్యాన్ని సఫలం చేస్తారు. వారు ముఖ్యంగా ఆత్మిక సంబంధంలోనే ఇతరులతో కూడా ఉంటారు. శివబాబాని తమ జీవిత భాగస్వామిగా చేసుకుంటారు.

### 144. మన స్థూల ఇంటిని సేవాస్థానంగా చేసుకుంటే వచ్చే ఫలితం ఏమిటి?

ఇంటిని సేవాస్థానంగా భావించి, శివబాబాను స్మృతి చేసుకుంటే, కర్మబందన సహజంగా మరియు వెనువెంటే సమాప్తి అయిపోతుంది. భగవంతుడు కూడా ప్రతీ ఇల్లు శివాలయం కావాలని ఆశపెట్టుకున్నారు. ఆ ఆశను పూర్తి చేసేవారే ధైర్యవంతులు మరియు గుణవంతులు.

### 145. మనం ఏయే దోషాల నుండి రక్షించుకోవాలి?

అన్నం యొక్క ప్రబావం నుండి అనగా చెడు, వ్యర్థ సంకల్పాలతో తయారుచేసిన అన్నం, మనస్సుపై ప్రభావం చూపిస్తుంది. కాబట్టి ఈ దోషం నుండి రక్షించుకోవాలి. చెడు సాంగత్య దోషం నుండి కూడా రక్షించుకోవాలి. సాంగత్యదోషం ఎటువంటిదంటే శివబాబా నుండి వేరుచేసేస్తుంది. భగవంతుడు ఎంత శక్తివంతుడో మాయ కూడా అంత శక్తివంతంగా ఉంటుంది. సాంగత్యదోపం సంగమయుగం యొక్క ప్రాప్తిని, భవిష్యత్తు యొక్క భాగ్యాన్ని శాశ్వతంగా దూరం చేసేస్తుంది. కాబట్టి స్వచ్ఛమైన మనస్సుతో, స్వచ్ఛమైన బుద్ధితో పరిశీలన చేసుకుని, పరివర్తన అయ్యి సాంగత్యదోషం అనే పరీక్షలో పాస్ అవ్వాలి.

### 146. బాబా చెప్పిన మహావాక్యాన్ని ఏవిధంగా మలచుకోవాలి?

కేవలం మహావాక్యాన్ని బుద్ధిలో ఉంచుకోవడమే కాకుండా, కార్యంలో ప్రయోగం చేయాలి. ఆ వచ్చే ఫలితం యొక్క అనుభవాన్ని ఇతరులకు కూదా తెలియజేయాలి. ఉదాహరణకు – మనస్సును కానీ, శరీరాన్ని కానీ, ధనాన్ని కానీ, సేవలో ఉపయోగించినప్పుడు సంశయం లేకుండా తక్షణమే చేస్తే పుణ్య ఖాతా వెంటనే జమ అయిపోతుంది. వాక్యంపై నమ్మకం ఉన్నవారినే సుపుత్రులు అని శివ పరమాత్మ తెలియజేస్తున్నారు. వీరికి శివపరమాత్మ మహావాక్యం అండగా నిలుస్తుంది.

### 147. సేవచేసేటప్పుడు మనం ఏ విషయాన్ని మరిచిపోకూడదు?

సేవ చేసేటప్పుడు భగవంతుని యొక్క స్మృతిని మరిచిపోకూడదు. రెండూ వెనువెంట ఉండాలి. మధ్యమధ్యలో పరిశీలన చేసుకోవాలి.స్మృతి లేకుండా చేసే సేవలో నాది – నేను అనే భావాలు చోటుచేసుకుంటాయి. మాయ యొక్క ప్రభావం కూడా ఎక్కువగా ఉంటుంది. విఘ్నాలు కూడా ఎక్కువగా వస్తాయి. ఆ సేవ శివబాబా ఖాతాలో జమ అవ్వదు. వ్యర్థం అయిపోతుంది. ఏవిధంగానైతే రబ్బరుతో వ్రాసినదంతా చెరిగిపోతుందో అదేవిధంగా స్మృతి లేని సేవ జమ అవ్వదు అని శివబాబా తెలియజేస్తున్నారు.

**148. జ్ఞానం తెలుసుకోవడమే కాదు, స్వరూపులుగా ఉంటే వచ్చే లాభం ఏమిటి?**

జ్ఞాన స్వరూపులుగా ఉంటే వచ్చే లాభం ఏమిటంటే ప్రకృతి ఇచ్చే రకరకాల దు:ఖాలను, వ్యాదులను గ్రహించి ఎదురొనే శక్తి లభిస్తుంది. అప్పుడు ప్రకృతే వారికి దాసీ అయిపోతుంది.

**149. సూక్ష్మస్వరూపంలో లోభం, మోహం ఏవిధంగా వస్తాయి?**

లోభం యొక్క సంస్కారం కొంచెమైనా లేకపోతే ఎలా సంపాదించుకుంటాం? అని కొంతమంది అంటున్నారు, కానీ ఈ వికారం మున్ముందు చాలా ఎక్కువై మనల్ని హద్దులోకి తీసుకువెళ్ళిపోతుంది. లోభం యొక్కసూక్ష్మ రూపం ఈశ్వరీయ ప్రాప్తి నుండి వంచింపజేస్తుంది. జ్ఞానంలో ఉంటూ కుటుంబం కోసం కొంత దాచుకోవటం అలవాటు చేసుకుంటారు. అది క్రమేపీ విరాత రూపాన్ని ధారణ చేస్తుంది. గమనించుకొని ఈ లోభత్వాన్ని పోగొట్టుకోవాలి. అదేవిధంగా మోహం కూడా నష్టాన్ని తీసుకుని వస్తుంది. జ్ఞానీ యోగీ ఆత్మలకు కుటుంబంపై ఎక్కువ మోహం ఉంటే అంతిమ స్థితి అయిన నష్టోమోహా స్మృతిర్లబ్ధగా అవ్వటంలో విఘ్నం వేస్తుంది. బ్రహ్మాబాబా జీవితంతో సమానంగా మన జీవితాన్ని గడపాలి అప్పుడే శ్రీకృష్ణుని కుటుంబీకులుగా జన్మ తీసుకుంటాము.

**150. ఎప్పుడు మీరు సేవాదారిగా కాలేరు?**

త్యాగం చేయలేనంత వరకు మీరు సత్యమైన సేవాదారి కాలేరు. సేవ చేస్తున్నప్పుడు ఈశ్వరుని స్మృతి లేకపోతే ఆ సమయంలో మీరు సాధారణ సేవాదారి కానీ ఈశ్వరీయ సేవాధారి కాదు.

**151. సమర్పణ యొక్క గుహ్య అర్థం ఏమిటి?**

శివపరమాత్మ చెప్పిన మర్యాదలకు వ్యతిరేకమైన స్వభావ సంస్కారాలు కలిగి ఉన్నా, అలాంటి కర్మలు చేస్తున్నా మనం సమర్పణ అయినట్లు కాదు. ఒకసారి స్విచ్ వేస్తే చాలు ఆ తర్వాత ఆ మిషన్ స్వతహాగా నడుస్తూ ఉంటుంది. అదేవిధంగా శివపరమాత్మ చెప్పిన ముఖ్య మర్యాదలలో ఒకటి – మనస్సుని విశ్వ సేవలో బిజీగా ఉంచండి. అలా కాకుండా మన మనస్సుని చిన్న చిన్న విషయాలలో, వ్యర్థ విషయాలలో నిమగ్నం చేస్తే సమర్పణ అయ్యినట్లు కాదు. అదేవిధంగా ధనం, తనువు, సంబంధాలు అన్ని విషయాలలో ఇదే సూత్రం.

**152. అన్నింటికంటే పెద్ద అంతిమ బందన ఏమిటి?**

1) దేహ బంధన 2) శ్రీమతంతో పాటు మన్మతం కలపడం. తమని తాము తెలివైనవారిగా భావించి శ్రీమతంలో మన్మతం కలిపే వారిని జ్ఞాని అభిమాని, బుద్ధి అభిమాని అని అంటారు. శివపరమాత్మ తెలియజేసిన జ్ఞాన సారాన్ని మాత్రమే ఇతరులకు తెలియజేయాలి తప్ప ఇక ఏ

విషయాలు కలపకూడదు. అలా కలిపినవారు మరియు అది విన్నవారు కూడా శివపరమాత్మ ప్రాప్తుల నుండి వంచితం అయిపోతారు. ఉదాహరణకు – ఒక బ్రాండెడ్ రిటేల్ షాపు వారు వేరొక బ్రాండ్ యొక్క వస్తువుని అమ్మటం జరిగితే అది అసలు బ్రాండ్ కు నష్టం చేకూర్చుతుంది. అదేవిధంగా అక్కడ ఇక్కడ విషయాలు శివబాబా జ్ఞానంలో కలిపితే, జ్ఞానం గుప్తం అయిపోయి, ఆ విషయాలే ప్రత్యక్షం అయిపోతాయి. ఈ విషయంపై ప్రతీ జ్ఞానీ యోగీ ఆత్మ ధ్యాస పెట్టుకోవాలి.

### 153. భవిష్యత్తుకు ఎప్పుడు జమ అవుతుంది?

భవిష్యత్తుకు జమ అవ్వాలంటే ప్రతీ ఒక్కరికి మనస్పూర్వకమైన స్నేహం ఇవ్వాలి. ఇప్పటి మనస్పూర్వకమైన ఆత్మిక స్నేహమే భవిష్యత్తులో వారు వేరొక పాత్రలో ఉండి కలుసుకున్నప్పుడు ప్రేమానురాగాలు సహజంగా ఉత్పన్నమవుతాయి. మనం ఇక్కడ ఒకరికొకరు స్వార్థంతో స్నేహం చేస్తే భవిష్యత్తు జన్మల్లో కలుసుకునేటప్పుడు కూడా మోసపూరిత స్నేహమే లభిస్తుంది. అది ఇరువురికి మరియు సమాజానికి నష్టం చేకూర్చుతుంది.

### 154. సంపూర్ణ నమ్మకదారి అని ఎవరిని అంటారు?

సంపూర్ణ నమ్మకదారి అనగా యజ్ఞంలో ప్రతీ వస్తువుని తమ ప్రాణంతో సమానంగా సంభాళిస్తారు. మనస్సుని, సమయాన్ని, శివబాబా సేవలో ఉపయోగిస్తారు.

### 155. పతితపావని ఆత్మ యొక్క లక్షణాలు తెలుపుము?

పతితపావని ఆత్మ ఏ కర్మేంద్రియం ద్వారా పతిత ప్రపంచాన్ని, పతిత ఆత్మల నుండి అల్పకాలిక రసనను స్వీకరించరు. సూర్యుడు మురికి వాసనలను తన కాంతి కిరణాలతో సమాప్తి చేస్తాడో, అదేవిధంగా పతితపావని ఆత్మ జ్ఞాన సూర్యుడైన శివపరమాత్మ నుండి శక్తి తీసుకోవాలనే ఆనందంలో నిమగ్నమై ఉంటుంది తప్ప, ఈ పాత ప్రపంచం యొక్క ఏ రసనకి ఆకర్షితం అవ్వరు. అంత శక్తిశాలీగా మనం తయారైనప్పుడు ప్రపంచంవాళ్ళు మన ముందు వంగిపోతారు.

### 156. దయార్థ హృదయులుగా ఎప్పుడు అవ్వగలరు?

అందరికీ ఈశ్వరీయ సేవ చేయాలి గాని, ఏ ఆత్మ నుండి ఏదీ తీసుకోకూడదు. అనగా నేను ఇంత చేసాను, ఇంత గౌరవం, పేరు కావాలని సంకల్పమాత్రంగా కూడా ఆలోచించకూడదు. ఈ స్థితిని ధారణ చేస్తే దయార్థ్ర హృదయులుగా అయిపోతారు.

## 157. మనం సర్వీస్ కోసం ఎక్కడకు వెళ్ళినా ఏ విదంగా ఉండాలి?

నిర్భయంగా, సత్యతా శక్తిని ప్రత్యక్షం చేసే విధంగా ఉండాలి. సత్యజ్ఞానాన్ని, సత్యమైన తండ్రిని ప్రత్యక్షం చేయాలి. వారు ఏమనుకుంటారు, వీరు ఏమనుకుంటారు అని భయపడకూడదు. అలా నిర్భయంగా జ్ఞానం చెప్పినప్పుడు సర్వశక్తివంతుడే మనకు నిరంతరం తోడు ఉండి, ఏ అపకారం జరుగకుండా కాపాడుతూ ఉంటారు.

## 158. మాయ ఎవరిద్వారా అయినా సమస్య లేదా విఘ్నరూపంలో వస్తే మనం వారిని ఏమని భావించాలి?

ఆ ఆత్మను నిర్దోషిగా భావించాలి. ఎందుకంటే అది మనకు పరీక్ష. ఆ పరీక్ష మన అనుభవాన్ని పెంచడానికి వచ్చినట్లుగా భావించాలి. భగవంతుడే వీరి ద్వారా మనకు పరీక్ష పెట్టారు లేదా వెనుకటి జన్మలలో నేను ఎవరినైనా ఈవిధంగా భాదపెట్టానేమో అది ఇప్పుడు ఈ వ్యక్తి ద్వారా ముక్తి అవుతుంది అని భావించి, మాయా రూపంలో వచ్చిన వ్యక్తిని నిర్దోషిగా భావించి ముందుకు వెళ్ళాలి.

## 159. వాయుమండలం తయారుచేయడానికి పునాది ఏమిటి?

వాయుమండలానికి పునాది వృత్తి. వృత్తి అనగా ఆలోచనా సరళి. ఏవిధంగానైతే రేడియో యొక్క ధ్వని వాయుమండలంలో ప్రవేశించి మనకు వినిపిస్తుంది కదా! అదేవిధంగా మన శ్రేష్ఠ ఆలోచనలు వాయుమండలం ద్వారా ప్రయాణం చేసి అజ్ఞాని మరియు స్వార్థపరులైన ఆత్మల యొక్క ఆలోచనలను, శుభ వృత్తిలోనికి మార్చి వేస్తాయి. ఈ ప్రయోగం చేసి చూడండి. ఫలితం మీకు అనుభవం అవుతుంది. వీరు ఇలా ఆలోచిస్తున్నారు, వారు అలా చేస్తున్నారు, మాట్లాడుతున్నారు అని ఆలోచించకూడదు. వారి కూడా మార్చే భాద్యత కూడా మనపై ఉందని శివపరమాత్మ తెలియజేస్తున్నారు.

## 160. ఆత్మకు శరీరం దేని ఆధారంగా లబిస్తుంది?

సంస్కారాల ఆధారంగా. సత్య త్రేతా యుగాల్లో దేవతా సంస్కారాలతో ఉంటాం కనుక దేవతా శరీరం లభిస్తుంది. భక్తిమార్గ సంస్కారం ఆత్మలో ఉంటే ఈ భూమిపై భక్తి ప్రారంభమయ్యే సమయం అనగా ద్వాపరయుగంలో పరంధామం నుండి భూమిపైకి వస్తాం. బాగా చెడు స్వబావ సంస్కారాలు వున్న ఆత్మలు కలియుగం చివరిలో శరీరాలు ధరిస్తాయి. ఈవిధంగా మానవాత్మకి మానవ శరీరాలు, పశుపక్ష్యాదాలకు ఆ ఆత్మ సంస్కారాల ఆధారంగా శరీరాలు లభిస్తాయి, అంతేకానీ మానవ ఆత్మ పశుపక్ష్యాదుల శరీరాలు తీసుకోదు. అదేవిధంగా పశుపక్ష్యాదుల ఆత్మ మానవ శరీరాలను తీసుకోవు. ఈ విధి అనాదిగా నిర్ణయించబడింది. ఉదాహరణకు కారుని నడిపే డ్రైవర్ విమానాన్ని నడుపలేడు కదా!

**161. హద్దు యొక్క విషయాలు ఎప్పుడు సమాప్తి అయిపోతాయి?**

బేహద్‌లో ఉంటే హద్దు విషయాలు సమాప్తి అయిపోతాయి. హద్దు విషయాలు సమాప్తి చేసుకుని బేహద్‌లోకి వెళదాం అనుకుంటే అది జరుగని విషయం. బేహద్ సేవలో లీనమైతే హద్దు విషయాలు స్వతాహాగా సమాప్తి అయిపోతాయి.

**162. ఇతరులకు మీరు జ్ఞానయుక్తమైన ధైర్యం యిస్తే, మీకు వచ్చే లాభం ఏమిటి?**

మీకు భాగ్యం తయారవుతుంది. అనగా జ్ఞానంలో నడవటానికి, నియమాల పాలన చేయటానికి, సమయం, ధనాన్ని ఉపయోగించడానికి ఇతరులకు ధైర్యం ఉండదు. కానీ జ్ఞానం వినండి, నియమాలు పాటించడం విశేషం కాదు. కొంత సమయాన్ని మీ ఆత్మ ఉన్నతికోసం ఉపయోగించండి అనే ధైర్యాన్ని ఇప్పించండి. వారు ఆ ధైర్యంతో ఇంటి దగ్గరైనా శివబాబాను స్మృతి చేసుకుని స్వర్గ ప్రాప్తికి అర్హులవుతారు. వారి పుణ్యంలో కొంత బాగం మీకు జమ అయిపోతుంది. జ్ఞానం ఎంతగా చెప్పినా వారు వినడం లేదని మీరు ధైర్యహీనులవ్వకండి. ఇలా ప్రతీ ఒక్కరికి ధైర్యం యిచ్చి ముందుకు నడిపించడంలో మీకు తెలియకుండానే అపారమైన పుణ్యం జమ అయిపోతుంది. ఎంతమందిని భీమా పాలసీదారులుగా చేస్తారో అంతగా వారికి కమీషన్ లభిస్తుంది కదా అలాగే ఇది స్వయం భగవంతునితో మనం చేసే సత్యమైన వ్యాపారం.

**163. ఏ దేహధారిపైనైనా మీ ఆలోచన వెళుతుంటే, ఏవిధంగా విడిపించుకోవాలి?**

ఆ సంబందాన్ని శివబాబాతో జోడించాలి. ఉదాహరణకు, మన సంతానంపై ఎక్కువ ఆలోచనలు వెళుతున్నప్పుడు, శివబాబాయే నా అలౌకిక సంతానం అని భావించి అభ్యాసం చేస్తూ ఉంటే, చంచలత సమాప్తి అయిపోతుంది. కొద్దిరోజులు ప్రయోగం చేసి చూడండి.

**164. విశ్వంలో మీ సూక్ష్మ స్వరూపం ఏవిధంగా సేవ చేస్తుంది?**

మీ సత్యయుగీ కుటుంబంలో సమీపంలోకి వచ్చేవారు ఎవరైతే ఉంటారో, వారికి మీ సూక్ష్మ ఫరిస్తా స్వరూపం మరియు భవిష్యరాజ్య పదవి రెండూ కలసి సాక్షాత్కారం అవుతాయి. ఆ సాక్షాత్కారం చేసుకున్నవారు మీ కుటుంబంలోకి వచ్చేస్తారు. ఆదిలో బ్రహ్మ యొక్క సంపూర్ణ స్వరూపం మరియు శ్రీకృష్ణుని స్వరూపం రెండూ వెనువెంట ఇతరులకు సాక్షాత్కారాలు అయ్యేవి. ఆ సాక్షాత్కారం పొందిన వారు శివబాబా దగ్గరకు వచ్చేవారు. అనగా ఆదిలో సింధు హైదరాబాదులోనున్న ఓంమండలికి వచ్చేవారు. అటువంటి సాక్షాత్కారాలు అంతిమంలో అనన్యమైన పిల్లల ద్వారా జరుగుతాయి. ఇప్పుడు మీరు ఒక స్థానంలో కూర్చుని ఉండగానే మీ సూక్ష్మ స్వరూపం సేవ చేస్తుంది. ప్రపంచం అలజడిలోకి వచ్చినప్పుడు సాకార శరీరం ద్వారా ఏ విధమైన సేవ చేయలేరు. ఇప్పుడు శివబాబాను ప్రత్యక్షం చేయడానికి ఈ సేవ చాలా చాలా అవసరం.

## 165. మననశక్తి యొక్క గొప్పతనం చెప్పండి?

కేవలం జ్ఞానాన్ని తెలుసుకుని, వర్ణన చేయడం మంచిదే కానీ అది బాహర్ముఖతగా లెక్కించబడుతుంది. జ్ఞానాన్ని మనస్సులో మననం చేస్తూ ఉంటే అంతర్ముఖత వస్తుంది మరియు మననం ద్వారా భగవంతునితో లీనమయ్యే మగ్న స్థితి కూడా వస్తుంది. ఆవు గడ్డిని త్వరత్వరగా తినేస్తుంది మరలా నెమరు వేసుకుంటూ ఉంటుంది. అప్పుడు ఆ ఆహారం ద్వారా దానికి శక్తి లభిస్తుంది. అదేవిధంగా జ్ఞానాన్ని వినటం లేదా చదువటం ద్వారా ఉపయోగం కొంతవరకు ఉంటుంది. కానీ పాత ప్రపంచంపై ఆకర్షణ పోవాలంటే మనస్సులో ఆ మహావాక్యాలను మననం చేసుకుంటూ ఉండాలి. అప్పుడు ఆత్మకు శక్తి వచ్చి, విఘ్నాలు సమాప్తి అయిపోతాయి. ఉదాహరణకు మీకు కష్టం వచ్చినప్పుడు నన్ను మనస్సుతో పిలవండి అని శివబాబా మనకు తెలియజేసారు. అది విని ఉరుకుంటే ఉపయోగం లేదు, ఆ సమయంలో మనస్సుతో శివబాబాను పిలిస్తే, శివబాబా హాజరైపోతారు, ఏవిధంగా హజరవుతారంటే ఆయనకు శరీరం లేదు కాబట్టి అక్కడ ఉన్న, ప్రక్కన ఉన్న ఎవరో ఒకరి శరీరంలోకి శక్తి ప్రవేశించి సమస్య పరిష్కారం అయిపోతుంది. కానీ ఆ సమయంలో ఆ వ్యక్తి పరిష్కరించటం లేదు. పరమాత్మ శక్తియే పరిష్కరిస్తుందనే నిశ్చయం ఉంచుకోవాలి.

## 166. శివబాబాపై ప్రీతి బుద్ధి లేకపోతే వచ్చే నష్టం ఏమిటి?

మనం కుటుంబస్థానంలో ఉన్నా, సేవాకేంద్రానికి సమర్పణ అయినా కానీ, పరమాత్మ శివునిపై ప్రేమ లేకుండా, పరివారంపైన కానీ, బాహ్యంగా కనపడే సేవాకేంద్రాలపై ప్రేమ ఉంటే వినాశ సమయంలో వీరెవరూ మనల్ని రక్షించలేరు. వారే జ్ఞాపకం వచ్చి, వినాశన సమయంలో ఓడిపోతాం. బాహ్య ప్రపంచంలో ఉంటూ శివబాబా స్మృతి ఉంటే తప్పక రక్షించబతారు, స్వర్గ ప్రాప్తిని పొందుతారు. ప్రీతి బుద్ధి మనకు ఎప్పుడు కలుగుతుందంటే, ఈ శరీరం ఏదొక సమయంలో మరణానికి గురి అవుతుందనే స్మృతి ప్రతీరోజు జ్ఞాపకం ఉండాలి. అప్పుడు శివపరమాత్మపై ప్రీతిబుద్ధి కలిగి ఉంటాం. వినాశ సమయంలో అజ్ఞానులు కూడా శివబాబాను జ్ఞాపకం చేయడానికి ప్రయత్నం చేస్తారు కానీ పరిచయం లేని కారణంగా ప్రేమను జోడించలేరు. కానీ జ్ఞానంలో నున్న మనం ఆవిధంగా కాకూడదని శివబాబా ఆశిస్తున్నారు.

## 167. అంతిమంలో అందరూ బాబాని ఏవిధంగా మహిమ చేస్తారు?

ఓహెూ ప్రభూ! నీ లీల అపారమైనది అనే అందరూ అంతిమంలో బాబా మహిమ చేస్తారు.

## 168. మాయ మన దగ్గరకు ఎందుకు వస్తుంది?

మనలో బలహీనతలే మాయ. ఆ బలహీనతలను పురుషార్థం ద్వారా తొలగించుకోవాలి. శివబాబా స్మృతిని పెంచడానికి కూడా మాయ వస్తుంది.

### 169. సోమరితనం ఏవిధంగా వస్తుంది? ఏవిధమైన నష్టం తీసుకు వస్తుంది?

సోమరితనం కూడా విశేషమైన వికారం, సోమరితనం అనేది తీవ్ర పురుషార్థిని సాధారణ పురుషార్థిగా చేసేస్తుంది. సోమరితనం అనేక రూపాల్లో ఉంటుంది. – చూద్దాంలే, చేద్దాంలే, ఇప్పుడే అవసరం ఏముంది. ఇవి కూడా సోమరితనానికి గుర్తులు.

### 170. సంగమయుగంలో ఏ ఖజానా వ్యర్థం చేయకూడదు?

సంగమయుగంలో ముఖ్యమైన ఖజానా శివబాబా యొక్క దివ్యజ్ఞాన ఖజానా. ఆ ఖజానా స్వయం చదువుకుని, ఇతరులందరికి వినిపించాలి. ఈ జ్ఞాన ఖజానా ఏ యుగంలోను లభించదు. ఈ జ్ఞాన ఖజానా మీరు ఇతరులకు ఇవ్వకపోతే, వారు అంతిమంలో మిమ్మల్ని చాలా నిందిస్తారు. ఒక దీపం అనేక దీపాలను వెలిగించినప్పుడే ఆ ప్రదేశం అంతా కాంతివంతంగా ఉంటుంది. అలాగే మీరు జ్ఞానాన్ని నోటితో చెప్పండి లేదా పుస్తక రూపంలో గాని అందరికీ పంచిపెట్టండి.

### 171. మహావీరులని ఎవరిని అంటారు? వారి లక్షణాలు తెలుపుము?

మహావీరులు శివపరమాత్ముని యొక్క మర్యాదను విశ్వంలో ప్రత్యక్షం చేస్తారు. ఈశ్వరీయ మర్యాద ఏమిటంటే, బలహీనులను బలహీనులుగా భావించి వదిలేయకూడదు. వారికి జ్ఞాన బలం యిచ్చి శక్తివంతులుగా తయారు చేయాలి. ఇదే మహావీరుల యొక్క ముఖ్య లక్షణం. మంచి స్నేహీలతో మంచిగా ఉండటం, మన సహయోగులకు మనం సహయోగం చేయటం, సంతృప్తిగా ఉన్నవారితో సంతృప్తిగా ఉండటం మహావీరత కాదు, శివబాబా ఎలాగైతే అపకారీ ఆత్మలకు కూడా ఉపకారం చేస్తారో, మహావీర్ ఆత్మలు నిరాశ ఆత్మల్లో ఆశను కలిగించి ఉన్నతంగా చేస్తారు.

### 172. అసఫలతలో ఏ విషయం దాగివుంది?

అల్పకాలిక అసఫలతలో సదాకాలిక సఫలత దాగివుంది. అసఫలత పైకి కనపడినా ఇది అసఫలత కాదు, ఇదొక పరీక్ష అని భావించాలి. దీనిని దాటితే పరిపక్వ స్థితి వస్తుందని గ్రహించాలి. ఇది అసఫలత కాదు, మనల్ని గట్టిగా చేయడానికి ఒక ముఖ్య సాధనంగా భావించాలి. ఇలా అసఫలతలో సఫలత ఇమిడి ఉంది. .

### 173. స్థూల శిక్షలు, సూక్ష్మ శిక్షలు ఏవిధంగా ఉంటాయి?

సూక్ష్మ శిక్షలు లో లోపలే అనుభవిస్తారు. కానీ స్థూల శిక్షలు అందరికీ తెలిసే విధంగా, అందరు చూసే విధంగా అనుభవిస్తారు. ఈ రెండు శిక్షలు ఇక్కడ ఈశ్వరీయ మర్యాదలను ఉల్లంఘించిన వారికి లభిస్తాయి. వారు దైవీ పరివారం యొక్క స్నేహం, సంబందం, వర్తమాన సమయం యొక్క ప్రాప్తి నుండి వంచితం అయిపోతారు. శ్రీమతం ప్రకారం నడవండి. మన్మతం. కలపకండి. ఒకవేళ స్వయంలో పరిశీలన చేసుకోలేకపోతే, శ్రేష్ఠ ఆత్మల ద్వారా సహయోగం తీసుకోండి. ఆ

సమయంలో శ్రేష్ఠ ఆత్మల ద్వారా శివబాబాయే ఖచ్చితమైన సలహా యిస్తారు. ఈవిధంగా సమయానికి ముందు జ్ఞానులైన మీరు స్థూల, సూక్ష్మ శిక్షల నుండి రక్షించుకోండి.

**174. మనలో బలహీనత మనకు ఏ నష్టాన్ని తీసుకువస్తుంది?**

మనలో విశేషతలను సమాప్తి చేసేస్తుంది. ఏ ఒక్క బలహీనత ఉన్నా మీలో విశేషతలు ప్రత్యక్షం అవ్వవు. అమృతం ఎంత ఉన్నా కానీ విషం ఒక్క చుక్క పడితే అదంతా విషం అయిపోతుంది అదేవిధంగా పదిసార్లు బాబా సేవ చేసి ఒకసారి మన వలన బాబాకి చెడ్డపేరు వస్తే అంతకు ముందు చేసిన పది సేవలు సమాప్తం అయిపోతాయి.

**175. దుర్గతి మాల త్రిప్పడం అంటే ఏమిటి?**

ఇతరుల అవగుణాలను చూసి, వాటిని వర్ణన చేస్తున్నాం అంటే దుర్గతి మాల త్రిప్పుతున్నాం. అంటే వారి అవగుణాలను మాలగా త్రిప్పితే మనకు దుర్గతి వస్తుంది.

**176. అష్టరత్నాలలో ఉండే ఒక శక్తిని తెలుపుము?**

కర్మ భోగాన్ని, కర్మయోగంగా మార్చుకుంటారు. అనగా అనారోగ్య సమయంలో నా పాపఖాతా పూర్తవుతుందని భావించి శివబాబాతో మధుర సంబంధం కలిగి ఉంటారు అంతేకానీ బాబాని నిందించరు. మేము చేసుకున్నది మేమే అనుభవించాలన్న భావనతో ఉంటారు. అష్టరత్నాల్లో ఉండే ఈ శక్తి వారిని విజేయులుగా తయారుచేస్తుంది. అష్టరత్నాలు అనగా, ఎనిమిది శ్రీకృష్ణులు. వీరు వంశపారంపర్యంగా సత్యయుగాన్ని పాలన చేస్తారు.

**177. శ్రీమతం అనగా ఏమిటో పూర్తిగా వివరించండి?**

శ్రీమతం అనగా శ్రేష్ఠమైన మతం. సృష్టికర్త శివ భగవానుడు అవతరించిన తర్వాత జ్ఞానులైన మనం ఏ శాస్త్రవాదుల యొక్క మతాలు, గురువుల యొక్క మతాలు, కలియుగీ సంబందీకుల మతాలు, మన ఆత్మ సంస్కారాల ద్వారా వచ్చిన సలహాలను సమాప్తి చేసి సద్గురువైన శివపరమాత్మ యొక్క మహావాక్యాలనే పాటించాలి. ఇతర మతాలను కనుక ఫాలో చేస్తే మీ జన్మ వారితో ఉంటుంది. ఈ విషయంపై ధ్యాస పెట్టుకోండి.

**178. ఒక చిన్న పొరపాటు ఎంత నష్టాన్ని తీసుకువస్తుంది?**

చాలా సమయం యొక్క ప్రాప్తిని వంచితం చేసేస్తుంది. ఏవిధంగానైతే తెల్లగా వున్న బట్టపై చిన్న మరక పడినా స్పష్టంగా కనిపిస్తుంది అదేవిధంగా చిన్న పొరపాటు కూడా చేయకూడదు.

### 179. సూక్ష్మ అభిమానం ఏవిధంగా ఉంటుంది?

మనం ఏవైనా పొరపాట్లు చేసినప్పుడు, అవి పొరపాట్లుగా గ్రహించే శక్తి మనకు లోపించనప్పుడు, శివబాబా ఎవరో ఒకరి ద్వారా ఆ పొరపాటుని సూచనప్రాయంగా తెలియచేస్తారు. ఆ సూచనను మన వర్తమానం మరియు భవిష్యత్తుని ఉన్నతి చేసేదిగా భావించాలి. అలా భావించకుండా వీరు నాకు చెప్పేదేమిటి అనుకుంటే అది అభిమానం. అభిమానం అనగా అహంకారం యొక్క అంశం.

### 180. పురుషార్థం ఏవిధంగా ఉండాలి?

పురుషార్థం ఎవరి ఆధారంగా ఉండకూడదు. ఫలానా విషయం బాగుంటే మరియు ఫలానా వ్యక్తి విఘ్నరూపం కాకుండా ఉంటే పురుషార్థం చేస్తాననే మాట రాకూడదు. పురుషార్థం అంటే ప్రయత్నం. మనకు ఆధారం ఒక్క శివబాబాయే. ఈవిధంగా పురుషార్థ విషయంలో పరిశీలన చేసుకుని ముందుకు వెళ్ళిపోండి.

### 181. సూక్ష్మ ఫలితాన్ని స్వీకరించడం అనగానేమి?

మనం కోర్సు చెబుతున్నప్పుడు కొంతమంది మహిమ చేస్తారు, కొంతమంది నిందిస్తారు, కొంతమంది ఏమీ మాట్లాడకుండా గంభీరంగా ఉంటారు. కానీ మనకు ముగ్గురి పట్ల సమాన భావన ఉండాలి. బాగా వింటున్న వారివైపే మన ధ్యాస ఉందంటే మనం సేవ చేసి మహిమను కోరకున్నట్లు. మహిమచేసే వారిని మంచివారిగా, నిందించేవారిని చెడ్డవారిగా తీసుకుంటే సూక్ష్మరూపంలో ఫలాన్ని ఆశించినట్లే! ఫలం యొక్క విషయం పరమాత్మకి వదలివేయాలి, మనం దేనినీ స్వీకరించకూడదు. రైలు ఏ.సి భోగీలో ఉన్నవారిని, రిజర్వేషన్ భోగిలో ఉన్నవారిని మరియు జనరల్ బోగిలో ఉన్నవారిని ఒకే స్పీడ్‌తో గమ్యం చేరుస్తుంది కదా! అదేవిధంగా ఫలితాన్ని సూక్ష్మరూపంలో కూడా అనగా సంకల్పంలో కూడా స్వీకరించకూడదు.

### 182. శిక్షణ ఏవిధంగా ఇవ్వాలి?

ప్రతీ ఒక్కరి సలహాకి గౌరవం ఇవ్వాలి. పెద్దవారైనా, చిన్నవారైనా, క్లాస్‌కు వచ్చే విధ్యార్థియైనా, వెంటవుండే సహయోగియైనా ఎవరి సలహాకైనా గౌరవం ఇవ్వాలి. మొదట గౌరవం ఇవ్వాలి తర్వాత మన అభిప్రాయం చెప్పాలి. ఇప్పుడు మీరు వారిని అగౌరపరిస్తే, ఆలోగా వారి సలహాను తిరస్కరిస్తే, ముమ్ముందు వారు మిమ్మల్ని తప్పక అగౌరవపరుస్తారు. వారి సలహా మీకు నచ్చితే పాటించండి. లేకపోతే అలాగే అని చెప్పి శాంతిగా అయిపోండి. ఎవరికైనా శిక్షణ ఇచ్చేటప్పుడు మొదట స్వమానంలో స్థితులై తర్వాత శిక్షణ యివ్వండి. ఈరోజుల్లో మీ దగ్గరకు ఎవరు వచ్చినా గౌరవం కోసం వస్తారు అందువలన అగౌరవపరచకూడదు.

**183. హద్దు యొక్క స్మృతి ఎవరెవరికి నష్టం తీసుకునివస్తుంది?**

హద్దు యొక్క కర్తవ్యాన్ని సంబాళిస్తున్నాము అనుకుంటున్నారు కానీ, హద్దు స్మృతిలో వున్న కారణంగా ఇతరుల భాగ్యాన్ని తయారుచేయటానికి బదులు పాడుచేయడానికి నిమిత్తం అవుతున్నారు. మీ అలౌకిక కర్తవ్యాన్ని చూడకుండా ఇంకా మీవైపు వారిని తగుల్పాటులోకి తీసుకువస్తున్నారు. బేహద్ నాది అనుకోవటంలో హద్దు స్వతహాగా పూర్తవుతుంది. విధ్యార్థులైనా, ప్రజలైనా నిమిత్త ఆత్మ అయినా హద్దులో ఉన్నట్లైతే వారు కూడా హద్దులో ఉండిపోతారు.

**184. రివైజ్డ్ కోర్సు అనగానేమి?**

రివైజ్డ్ కోర్సు అనగా పాత మురళీలను మరలా మరలా చదువుకోవటం. కొత్తవారికి కొత్తదిగా అనిపిస్తుంది, పాతవారికి ధారణ విషయంలో మెలకువనిప్పిస్తుంది. ఇది డ్రామాలో నిర్ణయించబడిపోయింది. పాతవారిగా అయ్యే కొలదీ ధారణపై ధ్యాస తక్కువైపోతుంది అందువలన బాబా మురళీలను రివైజ్ చేసుకోమని చెప్తారు.

**185. బ్రహ్మముహూర్తం యొక్క విశేషతలను తెలుపండి?**

బ్రహ్మముహూర్తం అనగా అమృతవేళ. తెల్లవారుఝాము 2.00 గం॥ నుండి 5.00 గం॥ వరకు బ్రహ్మముహూర్త సమయం. బ్రహ్మముహూర్త సమయంలో ఆత్మ సహజంగా బ్రహ్మలోకనివాసిగా అవుతుంది. వేరే సమయం అయితే ధ్వనికి, ఇతర వాతావరణానికి అతీతం కావాలి, కానీ ఆ సమయంలో వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. అలాంటి సమయంలో శివబాబా భోళానాథునిగా ఉంటారు. "ఆరోగ్య భవ!" అనే వరదానాన్ని ఇస్తారు. శ్రీమతం ప్రకారం ఆ సమయం యొక్క గొప్పతనాన్ని గ్రహించి సమయం ప్రకారం కర్తవ్యం చేస్తే, చాలా సహజంగా సర్వ ప్రాప్తులు లభిస్తాయని, శ్రమ నుండి విడిపించబడతారని శివబాబా బ్రహ్మ ముహూర్తం యొక్క విశేషతలు తెలియజేస్తున్నారు.

**186. జ్ఞాని ఆత్మలు జ్ఞానంలోకి రాని తమ కుటుంబసభ్యుల విషయంలో ఏవిధంగా ప్రవర్తించాలి?**

నా కుటుంబం, నా దంపతులు, నా సంతానం, నా సంబంధీకులు అనే స్మృతి రాకూడదు. ప్రతీ వస్తువుని సంబాళించడానికి బయటివారు ట్రస్టీని నియమిస్తారు కదా, అదేవిధంగా శివబాబా నన్ను వీరిని సంబాళించడానికి ట్రస్టీగా చేసారు అనే భావన కలిగిఉండాలి. వీరు నా పిల్లలు కాదు, బాబా ద్వారా నిమిత్తంగా అయ్యి వీరిని సంబాళించడానికి నియమించారు. నిమిత్త స్థితిలో సహజంగా నాది అనేది రాదు. సేవాకేంద్రంలో ఉన్న అక్కయ్య, అన్నయ్య, పరివారాన్ని

నిమిత్తంగానే భావిస్తారు కదా, అదేవిధంగా కుటుంబసభ్యులను కూడా నిమిత్తంగా భావించి నడవాలి. కుటుంబసభ్యులను కూడా ఈశ్వరీయ సేవకు యోగ్యంగా చేసి సేవ కోసం ఉ పయోగించాలి అనే భావన ఉండాలి. మీ భావన, గృహస్థీ సంకల్పానికి అతీతం కావాలి, అటువంటి స్థితి తయారుచేసుకోవడంతోనే అజ్ఞానీ ఆత్మలు కూడా మీ నడవడిక ద్వారా, మీ మాటల ద్వారా, నయనాల ద్వారా, ఏదైతే అతీతం, మరియు ప్రియమైన స్థితి మహిమ చేస్తారో ఆ అనుభవం చేసుకుంటారు.

### 187. శివబాబా అనే మాట నోటివెంట రాగానే ఏ అనుభవం అవుతుంది?

నిరాకార స్థితి అనుభవం అవుతుంది. నిరాకార స్థితి అనగా శరీరాన్ని నడిపించే నిరాకారి ఆత్మని అని అనుభవమవుతుంది. కేవలం నోటివెంట శివబాబా, శివబాబా అనడం కాదు స్వరూపంలో కూడా అనుభవం కావాలి. అప్పుడే శక్తి నిండుతుంది.

### 188. ప్రేమ ఎవరితో ఉండాలి? ఎవరితో ఉండకూడదు?

ప్రేమ అనేది ఒక్క శివబాబాతోనే ఉండాలి. వస్తు వ్యక్తి వైభవాలతో ప్రేమ ఉంటే బాబాపై ప్రేమ తగ్గిపోతుంది. అప్పుడు దు:ఖం అనుభవమౌతుంది. ఎందుకంటే వస్తు వ్యక్తి వైభవాలు శాశ్వతమైనవి కావు. శివపరమాత్మ ఒక్కరే జన్మజన్మలకు శాశ్వతమైన భాగ్యాన్ని ఇవ్వగలరు.

### 189. విజ్ఞానశక్తికి ఆధారం ఏమిటి?

సంగమయుగంలో జ్ఞానీ యోగీ ఆత్మలు శాంతిశక్తిని ఎంత ఎక్కువగా అనుభవం చేసుకుంటే అంతంత విజ్ఞాన శాస్త్రవేత్తలు క్రొత్త ఆలోచనలతో క్రొత్త క్రొత్త వస్తువులను, సాధనాలను ఆవిష్కరిస్తారు. విజ్ఞాన సాధనాలైన టి.వి., వీడియోలు జ్ఞానాన్నిఅర్థం చేయిండానికి నిమిత్తమౌతాయి. సత్యయుగంలో ఈ సైన్సు కూడా దాసీ వలె సహయోగి అవుతుంది అనగా అచ్చట విమానాలు సంకల్పశక్తి చేత నడుస్తాయి.

### 190. కర్మ ద్వారా ఉపన్యాసం చెప్పటం అంటే ఏమిటో వివరింపుము?

నోటి ద్వారా ఉపన్యాసం చెప్పటం సహజం. కర్మ ద్వారా ఉపన్యాసం అనగా మనం సేవ చేసేటప్పుడు అనేక రకాల సంస్కారాలు కలవారు కలుస్తూ ఉంటారు. వారందరినీ కలుపుకుని క్రోధంలోకి రాకుండా, అసహ్యించుకోకుండా సేవ చేయటమే కర్మ ద్వారా ఉపన్యాసం చెప్పటం. దీనికి కూడా మార్కులు ఉంటాయి.

**121. ఎవరైనా మనకు ఏదైనా విషయాలు చెప్తున్నప్పుడు మనం ఏ స్థితిలో ఉండాలి?**

ఆత్మిక స్థితిలో ఉండి వినాలి. ఏ వ్యర్థ విషయం కూడా మనస్సు వరకు వెళ్ళకూడదు. మనస్సులోకి వెళ్తే మనస్సు విచలితమౌతుంది. బుద్ధితో గ్రహించాలి మరియు వారికి సత్యమైన సలహా ఇవ్వాలి.

**122. భవిష్యత్తులో రాబోయే స్వర్గంలో విశ్వమహారాజు ఎవరు అవుతారు?**

విశ్వమహారాజు కావాలనుకున్నవారు అన్నింటినీ అనగా తనువు, మనస్సు, ధనాలను స్వయం విశ్రాంతి కోసం కాకుండా, విశ్వాత్మలకు జ్ఞానం ఇచ్చే సేవలో వినియోగించాలి. ఇలా దాతగా ఉన్నవారే విశ్వమహారాజు అవుతారు.

**123. శ్రేష్ఠ ఆత్మలు కూడా ఎప్పటివరకు ముక్తిధామంలోకి వెళ్ళరు?**

డ్రామా ప్లాన్ అనుసారం శ్రేష్ఠ ఆత్మలైన మీరు చేసిన పొరపాటును పశ్చాత్తాపంతో సవరించుకునే వరకు ముక్తిధామం అనగా పరంధామానికి వెళ్ళరు. శ్రేష్ఠ ఆత్మలే ఇతర ఆత్మలను ముందుకు తీసుకు వెళ్ళటానికి నిమిత్తమవుతారు. కాబట్టి వారు ఏ తప్పులు చేయకూడదు.

**124. ప్రపంచం నలువైపుల ఉన్న బ్రాహ్మణాత్మల విఘ్నాలు తొలగించుకోవాలంటే ప్రతీ ఒక్కరు ఏవిధమైన పురుషార్థం చేయాలి?**

అవ్యక్త వాతావరణం తయారు చేసుకోవాలి. అవ్యక్త వాతావరణం అనగా వ్యర్థ విషయాలు మాట్లాడకూడదు, చర్చించ కూడదు. ఎందుకంటే సంగమయుగం భగవంతుడు అవతరించిన యుగం. ఒకవైపు వరదానాలు, రెండవవైపు విఘ్నాలు వస్తూ ఉంటాయి. విఘ్నాలు ఎందుకు వస్తాయంటే వెనుకటి జన్మల కర్మలఖాతా సమాప్తం అవ్వడానికి మరియు అనేక రకాల స్వభావ సంస్కారాలు కలవారు జ్ఞానంలో ఉంటారు కాబట్టి భగవంతుడైన శివబాబా మనకు వరదానాలు ఇస్తూనే ఉంటారు. ఆ వరదానాలు ఫలీభూతం కావాలంటే, వ్యర్థ విషయాలను వదలి అవ్యక్త స్థితిని ప్రతీ ఒక్కరూ ధారణ చేయాలి.

**125. ద్వాపరయుగంలో దేవతల విగ్రహాలు ఏ విధి ద్వారా తయారవుతాయి?**

సంగమయుగంలో శివపరమాత్మ తెలియజేసిన మహావాక్యాల ధారణ ఆధారంగా చేసిన కర్మకు గుర్తుగా ద్వాపర యుగంలో విగ్రహాలు తయారు చేస్తారు. ఉదాహరణకు విఘ్నేశ్వరుని విగ్రహం ఏవిధంగా తయారవుతుందంటే సంగమయుగం జ్ఞాన యోగాలు నేర్చుకునే వారిలో విఘ్నాలను సహజంగా, నిర్మలంగా దాటేవారి యొక్క శక్తికి గుర్తుగానే అక్కడ విగ్రహం తయారవుతుంది.

విఘ్నేశ్వరుడికి పెద్ద పొట్ట చూపిస్తారు, కుడుములు, ఉండ్రాళ్ళు వంటి గట్టి ఆహారపదార్థాలను నైవేద్యంగా పెడతారు దీని యొక్క సూక్ష్మ అర్థం ఏమిటంటే సంగమయుగంలో అనేక రకాల అలజడి విషయాలను తనలో ఇముడ్చుకున్న శక్తిని కలిగి ఉన్నదానికి గుర్తు. ఇలా ప్రతీ పండుగ వెనుక, దేవీదేవతా విగ్రహాల రూపం వెనుక ఆధ్యాత్మిక రహస్యం నిండి ఉంటుంది. మనదేశానికి స్వాతంత్ర్యం ఎవరు తీసుకువచ్చారంటే; గాంధీగారు అని అంటాము. ఆయన ఆ సమయంలో చేసిన కష్టానికి ఫలంగానే ఆయన విగ్రహాలు పెడతారు. ఆయన మరణించారు, తిరిగి ఎక్కడో జన్మించి ఉంటారు కానీ ఈ విషయాలేమీ ఆయనకు గుర్తుండవు. ఇదే అనంత సృష్టి యొక్క రహస్యం.

**౧౨౬. ఎన్ని సంవత్సరాలు జ్ఞానంలో ఉన్నా కానీ దేని ఆధారంగా సఫలత లభిస్తుంది?**

చాలా సమయం అంటే స్థూల నెలలు, సంవత్సరాలు కాదు. ఎప్పుడైతే శివబాబా యొక్క పరిచయం తెలుసుకుని అలౌకిక జన్మ తీసుకున్నామో అప్పటి నుండి ఎంత ఎక్కువ సమయం జ్ఞానం యోగం ధారణ సేవ అనే నాలుగు సబ్జక్టులను ఆచరించారో దానిని బట్టి ప్రాప్తి జమ అవుతుంది. జ్ఞానంలో 35 సం॥లు నుండి ఉన్నా కానీ ఎక్కువ సమయం పురుషార్థం కోసం కేటాయించకపోతే ఎక్కువ ప్రాప్తి తయారవ్వదు. కనుక సంవత్సరాల లెక్క కాదు, పురుషార్థం చేసిన సమయం యొక్క లెక్కతో ప్రాప్తి తయారవుతుంది.

**౧౨౭. ఆదిలో బ్రహ్మాబాబా ద్వారా జరిగిన సేవకి, వర్తమానంలో జరుగుతున్న సేవకి మరియు అంతిమంలో జరగబోయే సేవకి తేడా తెలుపుము?**

బ్రహ్మాబాబా ద్వారా జరిగిన సేవ ద్వారా వారసులు ఎక్కువమంది వచ్చారు. వారసులు అనగా శివబాబాకి పూర్తిగా అర్పణ అయిపోయి బాబా నుండి లభించు సంపూర్ణ వారసత్వానికి అధికారులైనవారు. వారిలో త్యాగమే ముఖ్యగుణంగా ఉండేది. నాది అనే భావన లేశమాత్రంగా కూడా ఉండేది కాదు. విశ్వకళ్యాణార్థం అన్నీ ఇవ్వాలనే విశాల హృదయంతో పాటు యజ్ఞంలో ఏ వస్తువుని వ్యర్థం చేయకూడదనే పొదుపు కూడా ఉండేది. అప్పట్లో సేవ కోసం విజ్ఞాన సాధనాలు కూడా లేవు. మధ్యలో అనగా వర్తమానంలో సేవ సాధనాల ఆధారంగా జరుగుతుంది. ఈ సేవ ద్వారా బాబా పిల్లల సంఖ్య పెరిగింది కానీ లక్షణాలు కలిగిన ఆత్మలు, బలిహారం అయిపోగల శక్తివంతులు చాలా తక్కువమంది కనిపిస్తున్నారు. నాది అనే భావన ప్రతీ ఒక్కరిలో చాలా ఎక్కువగా కనిపిస్తుంది. నాది అనే భావన ఉన్నవారిలో శివబాబా శక్తి ఉండదు, నాది అనే బావన ఉన్నవారు సత్యమైన సేవ చేయలేరు. స్వయంలో త్యాగం లేదు కనుక ఇతరుల భాగ్యం తయారుచేయలేరు. ఆదిలో స్వయం యొక్క సుఖాలను కూడా త్యాగం చేసారు. ఇప్పటివారు స్వయం సుఖంకోసం చాలా ప్రాకులాడుతున్నారు. సేవ సత్యంగా లేని కారణంగా ఆ సేవ ద్వారా సత్యయుగి ఆత్మలు

తయారవ్వరు. కానీ అంతిమ సమయంలో సాధనాలు పూర్తిగా సమాప్తి అయిపోతాయి. సాధనాలలో ఉంటూ, సత్యంగా సాధన చేసిన వారే అంతిమంలో మిగులుతారు. వారే వరదాని, మహాదాని స్థితిని పొంది చాలా కొద్దిసమయంలోనే అనేకమంది భాగ్యాన్ని తయారుచేయగలరు. ఇదే అంతిమ సేవ. ఇప్పుడు మనం పరిశీలన చేసుకోవాలి, నేను ఏవిధమైన సేవ చేస్తున్నాను?

### ౧౯౮. బాబా ఎప్పుడు ఉన్నత న్యాయాధికారి రూపంలోకి మారిపోతారు? ఆ సమయంలో ఏ నియమం నడుస్తుంది?

ఇప్పుడు వినాశన సమయం చాలా సమీపంలో ఉంది. శివబాబా శ్రేష్ఠ ఆత్మలకు ఒకటికి వేలరెట్లు సహయోగం, స్నేహము, బలము ఇచ్చి పురుషార్థంలో ముందుకు తీసుకువెళ్ళడానికి తండ్రి రూపంలో సహయోగి అవుతున్నారు. కొంత సమయం తర్వాత ఈ సహయోగం ఆగిపోతుంది, శివబాబా ఉన్నత న్యాయాధికారి రూపంలోకి మారిపోతారు. ఉన్నత న్యాయాధికారి ద్వారా సహయోగం ఎట్టి పరిస్థితులలోను లభించదు. అప్పటి వరకు ఎంతగా తనువు మనస్సు ధనాలతో సహయోగి అయినా కానీ తండ్రి వలె సహయోగం ఇవ్వటం జరుగదు. ఏవిధంగా అయితే విధ్యార్థులకు టీచర్ క్లాస్ చెప్పేటప్పుడు ఒకటికి పదిసార్లు తెలియనిది నేర్పుతారు. అతనే పరీక్షల సమయంలో పరిశీలకుడిగా వచ్చినప్పుడు పరీక్ష హాలులో ఉన్న విధ్యార్థులకు ఒక ప్రశ్నకు కూడా జవాబు చెప్పరు అలాగే ముమ్ముందు శివబాబా తండ్రి రూపంలో ఇచ్చే సహాయం మనకు లభించదు. ఇప్పుడే ఆ అవకాశం, దీనిని మనందరం వినియోగించుకోవాలి.

### ౧౯౯. ఎవరు ఎవరికి ప్రజలు అవుతారు?

సేవ కానీ, పురుషార్థం కానీ దాదీ చేస్తారు, దీదీ చేస్తారు అని మీరనుకుంటే వారికి మీరు ప్రజలవుతారు. అధీన సంస్కారం అధికారిగా అవ్వనివ్వదు. కాబట్టి పెద్దవారి ప్రక్కన ఉన్నా కానీ, మీరు చేసిన పురుషార్థం, మీరు చేసిన సేవయే మీ ఖాతాలో జమ అవుతుంది. వారిది మీకు రాదు, మీది వారికి వెళ్ళదు. చేసుకున్నవారికి చేసుకున్నంత మహదేవా! అని అంటారు కదా.

### ౨౦౦. ఏ యుగంలో భగవంతుని ద్వారా మనకు దివ్య అలౌకిక జన్మ లభిస్తుంది? దాని ద్వారా లాభం ఏమిటి?

కలియుగం చివర సత్యయుగం ప్రారంభం మధ్యలో ఉన్న యుగాన్ని సంగమయుగం అంటారు. ఈ సమయంలో జ్యోతి స్వరూపుడు, పరంధామ నివాసి, సృష్టి కర్త అయిన శివపరమాత్మ దివ్య అవతరణ గావిస్తారు. ఈ సమయంలో జ్ఞాన రాజయోగాలు నేర్చుకున్నవారు భగవంతుని ద్వారా అలౌకిక జన్మ తీసుకున్నట్లు లెక్కించబడుతుంది. ఇక ఏ యుగంలోను ఇలాంటి జన్మ కావాలన్నా

లభించదు. భగవంతుని ద్వారా లభించిన ఈ అలౌకికజన్మ తీసుకున్నవారే సత్యయుగంలో దేవతా జన్మ తీసుకుంటారు.

**201. పాండవులు అనగా ఎవరు? స్వర్గంలో వారి జన్మ ఎక్కడ ఉంటుంది?**

పాండవులలో విశేషత ఏమిటంటే ప్రతీ ఒక్కరినీ ఆత్మగా చూడగలుగుతారు. భగవంతుడిని తమ జీవిత భాగస్వామిగా చేసుకుని అన్ని విషయాలలో వాటా పెడతారు. ఇటువంటి సంస్కారాలు కలవారే పాండవులు. వారి జన్మ అష్ట రత్నాలలో ఉంటుంది. అష్ట రత్నాలు అనగా ఎనిమిది కృష్ణులలోనే ఉంటుంది.

**202. జీవితంలో ఎదురయ్యే పరిస్థితులను, విఘ్నాలను ఏవిధంగా భావించాలి?**

ఏ పరిస్థితి అయినా, విఘ్నమైనా మనల్ని చలింపచేయటానికి వచ్చినప్పుడు, సర్వశక్తివంతుడు శివబాబా నా తోడుగా ఉన్నారని భావించాలి. పంచతత్వాలు అలజడి చేసినా కానీ ఈవిధంగానే భావించాలి. ప్రకృతి యొక్క ఆటను ఆవిధంగా భావించి చూడాలి, అలజడి కాకూడదు. ఆటగా భావించినప్పుడు ఎప్పుడూ అలజడి అవ్వము.

**203. అలౌకికంలో ఏది ఖర్చు? ఏది జమా?**

ఇతరులకు జ్ఞాన రాజయోగాలు నేర్పించడం కొరకు ఉపయోగించే సాధనాలు, సెంటర్ల స్థాపనలో అయ్యే ధన ఖర్చు - ఖర్చు కాదు జమ. మనకున్న సిరిసంపదలు స్వయం కొరకు ఉపయోగి ంచుకోవటం ఖర్చు, సేవ కోసం ఉపయోగించటం జమ.

**204 . జ్ఞానీ జీవితంలో క్రొత్త క్రొత్త అనుభవాలు ఎప్పుడు అవుతాయి?**

అంతర్ముఖీ స్థితి అనగా శాంతి స్థితిలో ఎంతెంతగా ఉంటామో అంతంత క్రొత్తక్రొత్త అనుభవాలు అవుతూ ఉంటాయి. ఉదాహరణకి శాంతిగా కూర్చుని శివబాబా యిచ్చే ప్రాప్తులను అనుభవం చేసుకుంటే కలియుగీ సిరిసంపదలు చాలా సామాన్యంగా అనుభవం అవుతాయి. భవిష్యత్తులో వచ్చే బంగారు మహల్స్ ఆంతరంగిక అనుభవం చేయిస్తాయి.

**205. సేవ చేసిన తర్వాత వచ్చే మహిమను స్వీకరించడం ద్వారా వచ్చే నష్టమేమిటి?**

వర్తమాన సమయంలో మనమందరం యుద్ధభూమిలో ఉపస్థితులై ఉన్నాము. ఇటువంటి సమయంలో సహజమైన లౌకిక జీవితాన్ని గడపటం, జీవితం పట్ల సాధనాలు ఉపయోగించి వ్యర్థం చేయకూడదు. సేవలో ఉపయోగిస్తే వర్తమానానికి, భవిష్యత్తుకి చాలా ఫలం లభిస్తుంది. వర్తమానంలో సేవ చేసిన

తర్వాత అందరి నుండి మహిమ అనగా పొగడ్తలు వస్తాయి. ఆ పొగడ్తలను ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించకూడదు. నేను టీచర్‌ను, నేను యోగిని, నేను జ్ఞానిని, నేను మహాజ్ఞానిని అనేవి మనకు తెలియకుండా మన మనస్సులో చోటు చేసుకుంటాయి. ఈ మహిమ కర్మాతీత స్థితి, అతీంద్రియ సుఖం, సంపూర్ణ తపస్విమూర్తిగా అవ్వనివ్వకుండా విఘ్నం వేస్తాయి. కర్మాతీత ఆత్మ తన శక్తితో ఇతరుల కర్మ బంధనాలను తొలగించగల శక్తి కలిగి ఉంటుంది. ఎవరైతే సంపూర్ణ తపస్వీమూర్తిగా ఉంటారో, అంతిమంలో విశ్వసమ్మేళనం అనే వేదికపై పాత్ర అభినయిస్తారు. సంపూర్ణ తపస్వీ ఆత్మల ఒక్క సెకను దృష్టితో అనేకాత్మలు ముక్తిని పొందుతారు. జనం యొక్క క్యూ ఆబూ పర్వతం నుండి ముంబయి వరకు ఉంటుందని శివపరమాత్మ తెలియజేశారు. కావున మహిమను స్వీకరిస్తే ఈ మూడు స్థితులను కోల్పోతాం. అంతిమంలో విశ్వసేవకు ఉపయోగపడం. ఈ విషయంపై ధ్యాస పెట్టుకుని మహిమను స్వీకరించకండి.

**206. పురుషార్థం ఎలా ఉండాలి?**

భట్టీ ఆధారంగా కానీ, ఒక వ్యక్తి ఆధారంగా కానీ, వాతావరణం ఆధారంగా కానీ మన పురుషార్థం ఉండకూడదు. ఆధారం ద్వారా ఉన్నతి అవ్వవచ్చు కానీ దానినే పునాదిగా చేసుకోకూడదు. ఆధారం ఆధారంగా పురుషార్థం చేసే వారు యోగ ప్రయోగం చేయలేరు. యోగ ప్రయోగం చేయకపోతే స్వయంలో శక్తి నిండదు, ఇతరులకు శక్తినివ్వలేరు.

**207. అన్ని విషయాలలో అతి దేనికి గుర్తు?**

అతి అంతిమానికి గుర్తు. గవర్నమెంట్ వారి కఠిన నియమాలు, వస్తువుల ధరలు, ప్రకృతి వైపరీత్యాలు అన్నీ అతిలోకి వెళ్తున్నాయి ఇవన్నీ వినాశనానికి గుర్తు. మానవులలో విపరీతమైన స్వార్థం తద్వారా అశాంతి, భయంకరమైన రోగాల విజృంభణ ఇవన్నీ వినాశనానికి సంకేతాలు.

**208. ఎవరిని అడుక్కునేవారు అంటారు?**

ఉదార భావంతో మనం శివబాబా నుండి పొందిన ఖజానాలను ఇతరుల ఉన్నతి కోసం ఇస్తూ ముందుకు సాగిపోవాలి. ఆవిధంగా కాకుండా లౌకిక వ్యాపారుల వలె అలౌకిక పరమాత్మ శివుని పిల్లలమై ఉండి; నీవు ఇంత యిస్తే, నేను అంత ఇస్తాను అనే మాట అనకూడదు. వారు ఇస్తే మీరు ఇస్తారు అంటే ముందు మీరు వారిని అడిగినట్లే కదా! దీనినే అడుక్కునే సంస్కారం అంటారు.

**209. మాయమాలను తయారు చేసేవారి గుర్తులు తెల్పుము?**

శివబాబా మాయపై విజయం పొందిన వారి యొక్క విజయీ మాల తయారుచేస్తారు. మాయ తన ప్రభావంలోకి వచ్చి ఓడిపోయినవారి యొక్క మాల తయారుచేస్తుంది దానినే మాయ మాల అని అంటారు. మాయ మాలలో పూసలు అయిన వారు అంటే అలాంటి ఆత్మలు బహురూపీగా

ఉంటారు, పైకి సుందరంగా ఉంటారు, లోపల నాశనం చేసేవారిగా ఉంటారు. ఏవిధమైన సమయమో, ఆవిధమైన స్వార్థ రూపాన్ని ధారణ చేస్తారు. వారిలో సత్యత ఉండదు. ఇప్పుడిప్పుడే ఉన్నత స్థితిలో ఉంటారు, ఇప్పుడిప్పుడే అందరికంటే నీచస్థితిలోకి దిగజారిపోతారు. ప్రకృతికి లేక వికారాలకు వశమై ఉంటారు. అల్పకాలిక మాయలో వుండి నిర్భయంగా ఉంటారు. అది చేస్తాం, ఇది చేస్తాం అని ఇతరులకు భయం కలిగించే విధంగా మాట్లాడతారు. ఈవిధమైన ఆత్మలుగా ఎవరూ అవ్వకూడదని శివబాబా ఆశిస్తున్నారు. ఇటువంటి వారు ఇతరులను కూడా మాయలోకి దింపుతారు. అటువంటి మాయా తెలివి వారికి మాయ ద్వారా వరదానంగా లభిస్తుంది. అతి తెలివిగా, స్వార్థంగా ఉంటారు. సత్యత ఉండదు. అలాంటి వారి సాంగత్యం చేస్తే మనం కూడా శివబాబా యొక్క విజయీమాల నుండి తొలగిపోతాం. వర్తమాన సమయంలో మాయమాల మరియు విజయమాల రెండూ చాలా తీవ్రవేగంతో తయారవుతున్నాయి. ఇటువంటి విషయాలు మాకు తెలియదని శివబాబాను నిందించవద్దు. చాలా జాగ్రత్తగా మీ జీవితాన్ని సంబాళించుకోండి.

### ౨౧౦. ముమ్మందు ఏ పద్ధతి నడుస్తుంది?

సత్య మాట, సత్య వృత్తి, సత్య దృష్టి, సత్య వాయుమండలం, సత్య సంగఠన మొదలైనవి చాలా ప్రసిద్ధమవుతాయి. ముమ్మందు అసత్యం పూర్తిగా సమాప్తి అయిపోతుంది.

### ౨౧౧. అష్టరత్నాలలోకి వచ్చే వారి నిద్ర ఏవిధంగా ఉంటుంది?

యోగనిద్ర. అనగా యోగం చేసుకుంటూ చేసుకుంటూ నిద్రపోతారు. నిద్రిస్తున్నా కానీ యోగం చేస్తున్నట్లుగానే కనిపిస్తారు.

### ౨౧౨. శివబాబా దినచర్య తెల్పుము?

శివపరమాత్మ అమృతవేళ జ్ఞానీ-యోగీ ఆత్మలకు శక్తినివ్వడానికి, సేవాధారి ఆత్మలకు సేవ యొక్క క్రొత్త క్రొత్త పద్ధతులను ప్రేరణ ఇవ్వడానికి నిమిత్తమవుతారు. తరువాత సత్యమైన భక్తుల యొక్క పిలుపు విని, వారి భావనలకు ఫలాన్ని వారి ఇష్టదేవతల రూపంలో ఇస్తారు. మరి కొంతమందికి సాక్షాత్కారం కూడా చేయిస్తారు. విశ్వంలో ఉన్న రజో ప్రధాన కర్మ అనగా, ఏదొక విధి విధానం ద్వారా పూజా పద్ధతులను ఆచరించే వారికి కూడా ఫలం ఇవ్వటానికి నిమిత్తమవుతారు. కొత్తగా జ్ఞానంలోనికి రావలసిన మూలమూలల్లో దాగి ఉన్న పిల్లలకు ఎవరొక నిమిత్త ఆత్మ ద్వారా సందేశాన్ని అందిస్తారు. వైజ్ఞానికులకు వైజ్ఞానిక రంగం అభివృద్ధి చెందటం కోసం, క్రొత్త క్రొత్త ఆవిష్కరణలు ఆవిష్కరించడానికి ప్రేరణ ఇస్తారు. ఈవిధంగా శివబాబా యొక్క దినచర్య నిర్ణయింపబడుతుంది. శివబాబాతో పాటు బ్రహ్మాబాబా కూడా జతగా సేవ చేయడానికి నిమిత్తమవుతారు.

## 213. సూక్ష్మవతనంలో బ్రహ్మాబాబా పాత్ర ఏవిధంగా నడుస్తుంది?

బ్రహ్మాబాబా సూక్ష్మశరీరంతో సూక్ష్మవతనంలో ఉంటారు. సూక్ష్మవతనం అనేది ప్రకాశలోకం. సత్యయుగీ స్థాపన కార్యం పూర్తయ్యే వరకు సేవాకార్యానికి తోడుగా, శివబాబా ఆజ్ఞాకారీగా బ్రహ్మాబాబా అక్కడే ఉంటారు. సూక్ష్మ శరీరంతో ప్రపంచంలో ఏ స్థానానికి అయినా వేగంగా వెళ్ళి సేవాకార్యాన్ని పూర్తి చేసి తిరిగి సూక్ష్మవతనం వెళ్ళిపోతారు.

## 214. ఆత్మ ఈ భూమ్మీదకు రావడానికి గల కారణాలు ఏవి?

1. కర్మ బంధన 2. సంబంధ బంధన 3. వ్యక్త సృష్టి యొక్క బంధన 4. దేహ బంధన వీటి కారణంగా ప్రతీ ఒక్కరు ఈ సృష్టిపైకి రావలసిందే! శివపరమాత్మ ఒక్కరే ఈ బంధనాలన్నింటికీ అతీతుడు, కర్మాతీతుడు, బంధన్ముక్తుడు, జనన మరణ రహితుడు. కేవలం సంగమయుగంలో బ్రహ్మ శరీరం ద్వారా జ్ఞానబోధ చేసి తిరిగి పరంధామం వెళ్ళిపోతారు, దీనినే పరకాయ ప్రవేశం అంటారు. ఇది జన్మించటం కాదు, అవతరించటం. ఈవిధమైన అవతరణ సృష్టిలో దేవతలకు గాని, ధర్మ పితలకు గాని, భక్తులకు గాని, మహాత్ములకు గాని, సాధుసన్యాసులకు గాని, పీఠాధిపతులకు గాని, మానవులకు గాని ఎవరికీ ఉండదు. అందరూ వారివారి సంస్కారాల ఆధారంగా పరంధామం నుండి, కర్మక్షేత్రమనే ఈ భూలోకంలోకి వచ్చి అనేక జన్మల పాత్రలు అభినయించి తిరిగి పరంధామానికి వెళ్ళిపోవాలి. సర్వబంధనాలకు అతీతుడు కనుకనే ఆయన పరమాత్మ అయ్యారు. మిగిలిన వారందరూ భగవంతుని పిల్లలయ్యారు.

## 215. అమృతవేళ నుండి రాత్రి దినచర్య వరకు మనకు ఏవిధమైన మర్యాదలు ఇచ్చారు. ఆ మర్యాదలు పాటిస్తే వచ్చే లాభం, ఉల్లంఘిస్తే వచ్చే నష్టం వివరింపుము?

తనువుని బాబా విశ్వకళ్యాణం చేయటం కోసం ఇచ్చారు. మనస్సుని శుద్ధ సంకల్పాలు చేసేటందుకు, శ్రేష్ఠ సంకల్పాల ద్వారా వాయుమండలాన్ని శుద్ధి చేసేటందుకు ఇచ్చారు. ధనాన్ని సేవార్థం ఖర్చు చేయమని ఇచ్చారు. ఈ మూడింటిని రోజంతటిలో బాబా శ్రీమతానుసారం వినియోగిస్తే అనంత ప్రాప్తిని పొందుతాము. అలాకాకుండా వ్యర్థంగా వినియోగిస్తే పాపభారం తయారవుతుంది. యజ్ఞం యొక్క స్థూల వస్తువులను కూడా జాగ్రత్తగా సంబాళించాలి. తనువు, మనస్సు, ధనాల కోసం బాబా యిచ్చిన మర్యాద అనుసారంగా నడిస్తే మార్కులు జమ అవుతాయి. మర్యాదను అతిక్రమిస్తే మార్కులు కట్ అవుతాయి. మందిరాలలో ప్రసాదం ఇస్తారు, దానిని అసలు వ్యర్థం చేయరు. కొంచెం క్రిందపడిపోయినా పాపంగా భావించి, తిరిగి తీసుకుని కళ్ళకు అద్దుకుని స్వీకరిస్తారు. అలాగే సంగమయుగంలో స్వయంగా శివబాబా ద్వారా తనువు, మనస్సు, ధనం అనే ప్రసాదాలు లభించాయి, వీటిని కూడా ఏ మాత్రం వ్యర్థం చేయకూడదు. సేవలో వినియోగించాలి. సమయం

తీవ్ర వేగంతో వెళుతుంది అలాగే ప్రాప్తి కూడా తీవ్ర వేగంతో తయారుచేసుకోవాలి. కనుక ధ్యాసతో ముందుకు వెళ్ళండి.

### 216. శివబాబా పిల్లల ముందు ఏ మర్యాద పాటిస్తారు?

శివబాబాకు పిల్లలందరి పురుషార్థంలో చేసే శ్రమను చూసి దయ వస్తుంది, అందరినీ సంపూర్ణంగా చేయాలని శుభ ఆశ ఉంటుంది. ఎవరు ఏ సమయంలో ఎలా ప్రవర్తించారో అదంతా బాబాకి తెలుస్తుంది కానీ పేర్లు చెప్పరు. ఎందుకంటే బాబా ఎవరినీ అగౌరవపరచరు, ఇది ఈశ్వరీయ నియమం. ఎవరు ఏది చేస్తే వారు అదే పొందుతారు. కానీ ధైర్యం ఉన్న పిల్లలకు శివబాబా సహాయం అందిస్తారు.

### 217. నష్టోమోహగా అవ్వడానికి విధి ఏమిటి?

జ్ఞానీ–యోగీ ఆత్మలు ప్రతీ సంబంధాన్ని శివబాబాతో అనుభవం చేసుకోవాలి. ఎప్పుడైతే ఒకరితోనే సర్వ సంబంధాలు అనుభవం చేసుకుంటారో అప్పుడు నష్టోమోహగా అయిపోతారు అనగా ఇతరులపై మోహం పోతుంది. ఎలాగైతే సైన్సు సూక్ష్మరూపంలో వృద్ధి చెందినప్పుడు ఒకే సెల్‌ఫోన్‌లో వీడియో, ఆడియో, ఇంటర్‌నెట్, కెమెరా మొదలైన అన్ని సౌకర్యాలను నింపుతున్నారు. ఈ సాధనం రాకముందు ఇవన్నీ వేర్వేరుగా ఉండేవి. అదేవిధంగా శివబాబా రాకముందు అనేక సంబంధాలను అనేక మందితో జోడించాం కానీ ఇప్పుడు శివబాబా అవతరించిన తర్వాత వినాశనం తప్పక జరుగుతుంది కనుక సర్వ సంబంధాలు ఒక్కరితోనే జోడిస్తే 84 జన్మలలో మంచి వ్యక్తులు మన సంబంధీకులుగా వస్తారు. ఇది కర్మల గుహ్యగతి.

### 218. అష్టరత్నాలకు బాబాతో ఏవిధమైన కనెక్షన్ (సంబంధం) ఉంటుంది?

అష్టరత్నాలు బాబాను కలుసుకునేటందుకు వేచి చూడనవసరం లేదు ఎందుకంటే వారు నిరంతరం బాబా కనెక్షన్‌లోనే ఉంటారు. నిర్వికారీ స్థితిలో, దేహాభిమానానికి అతీతంగా ఉంటూ కార్య వ్యవహారాలు నిర్వహిస్తారు. వారు సంకల్పం చేయగానే బాబా వారిముందు హాజరైపోతారు. బాబా సంకల్పం చేయగానే వీరు సూక్ష్మ శరీరంతో బాబా ముందు హాజరైపోతారు.

### 219. వ్యర్థ సంకల్పాలు నడవడానికి కారణమేమిటి?

మురళీ ద్వారా శివబాబా సూచనలు ఏవైతే లభిస్తున్నాయో వాటిని ధ్యాసతో వినటం లేదు, ఆచరించటం లేదు అందుకే వ్యర్థ సంకల్పాలు వస్తున్నాయి. మన నోటితో జ్ఞాన రత్నాలను ఇతరులకు ఇస్తూ ఉన్నా కానీ వ్యర్థ సంకల్పాలు నడువవు.

## 220. మనకి ఇప్పుడు ఎంత పని ఉంది?

ద్వాపరయుగం నుండి కలియుగం చివరి వరకు మనం 63 జన్మలు తీసుకుంటాము. ఆ జన్మల్లో చేసిన పాపకర్మలు ఈ సంగమయుగంలోనే శివబాబా స్మృతి ద్వారా భస్మం చేసుకోవాలి మరియు సంగమయుగంలో సూక్ష్మంగా బాబా ఆజ్ఞలను అతిక్రమించి కర్మలు చేయటం ద్వారా వచ్చే పాపాలను కూడా భస్మం చేసుకోవాలి. ఇంత పెద్ద పని మనకి ఉండగా ఇతర పనుల్లో బిజీగా ఉంటే ఎలా?

## 221. భక్తులకు, ప్రజలకు తేడా ఏమిటి?

జ్ఞానం యోగం ధారణ సేవ అనే నాలుగు సబ్జక్టుల ఆచరణను బట్టి రాజులు, ప్రజలు, దాసిలు, భక్తులు అని బాబా పోలుస్తూ ఉంటారు. వారిలో భక్తులు అంటే ప్రత్యక్షంగా శివబాబాతో మనుస్సుని జోడించే శక్తి కొందరికి ఉండదు. భక్తులు దేవతల ద్వారా పరమాత్మ శక్తిని అనుభవం చేసుకుంటారు. అలాగే జ్ఞాని ఆత్మల్లో శ్రేష్ఠ ఆత్మల ద్వారానే బాబాని చూస్తుండేవారు భక్తులు అని బాబా చెప్తున్నారు. అంతేకాదు వీరిలో ఎప్పుడూ అడిగే సంస్కారమే ఉంటుంది అంటే ఆశీర్వాదం ఇవ్వండి, శక్తి ఇవ్వండి, దయ చూపండి, దృష్టి ఇవ్వండి ఇలా చివరి వరకు అడిగే స్థితిలోనే ఉంటారు కానీ ఇతరులకు ఇచ్చే స్థితి రాదు. అలాంటి స్థితికి చేరమని చెప్పినా చేరుకోలేరు, కొంచెంలోనే తృప్తిపడిపోతారు, ఇంత వరకు చాల్లే అనుకుంటారు. ఇక ప్రజలు ఎవరంటే శివబాబా అంటే ఇష్టం ఉంటుంది, జ్ఞానాన్ని కూడా ఇష్టపడతారు కానీ ఈశ్వరీయ మర్యాదలతో కూడిన జీవితంలో నడవలేరు. జ్ఞానం వింటారు, యోగం చేస్తారు కానీ ధారణ మరియు సేవ శక్తిననుసరించి తక్కువగా చేస్తారు. వారిలో ఉండే ఏదో చెడు సంస్కారానికి, స్వభావానికి వశమైపోతారు. దానిని పోగొట్టుకోలేరు. అయినా కానీ జ్ఞాన యోగాలు అభ్యసిస్తున్నారు కనుక స్వర్గంలో ప్రజలుగా జన్మిస్తారు. ఇలా మనం చేసిన సేవ ద్వారా రాజులు, ప్రజలు, భక్తులు అందరూ తయారవుతారు కానీ ఎటువంటి వారు ఎక్కువగా తయారవుతున్నారు అనే విషయంపైనే మన సేవ యొక్క క్వాలిటీ తెలుస్తుంది. కొన్ని సేవాకేంద్రాలలో క్వాంటిటీ అంటే సంఖ్య ఎక్కువగా ఉంటారు కానీ వారిలో ప్రజలు, భక్తులే ఎక్కువమంది ఉంటారు. కొన్ని సేవాకేంద్రాల్లో క్వాంటిటీ అనగా తీవ్ర పురుషార్థులు ఎక్కువగా ఉంటారు. మనం సేవ చేసి ఎటువంటి ఆత్మలను ఎక్కువగా తయారుచేస్తున్నాం అని చూసుకోవాలి. లేదా మనలోనే ప్రజలు లేదా భక్తుల సంస్కారాలు ఉన్నాయా అనేది కూడా చూసుకోవాలి.

## 222. శివబాబా ఆదేశాన్ని ఆజ్ఞగా బావించి వెంటనే కర్మ చేస్తే వచ్చే సత్ఫలితం ఏమిటి?

శివబాబా మురళీ ద్వారా తెలియజేసిన ఆదేశాలను వెంటనే కర్మలోకి తీసుకువస్తే మహాపుణ్యం లభిస్తుంది. కొంతమంది శ్రేష్ఠాత్మలకు శివపరమాత్ముడు పరంధామం నుండి కొన్ని సందేశాలు

అనగా సేవా ప్లాన్స్ కానీ,  పురుషార్థం యొక్క ప్లాన్స్ కానీ ప్రేరణరూపంలో పంపిస్తూ ఉంటారు. వాణిలోనే కాకుండా శివపరమాత్మ సంకల్పాలు శ్రేష్ఠ అనన్యమైన పిల్లలకు అందుతూ ఉంటాయి. శ్రేష్ఠాత్మలు వాటిని వెంటనే కర్మలోకి తీసుకునివస్తారు. ఆ సమయంలో సేవ కోసం చేసిన ఆ చిన్న సహయోగం మొత్తం కల్పమంతా భగవంతుని నుండి సహయోగం పొందడానికి అర్హులుగా చేస్తుంది. ఉదా – అంతిమంలో అందరు భగవంతుడిని తెలుసుకుంటారు, ఓ ఈశ్వరుడా! నన్ను నీ దగ్గరకు తీసుకునిపో అని పిలుస్తారు కానీ వారికి అప్పుడు ఫలం ఉండదు. అదేవిధంగా చాలాకాలం నుండి జ్ఞాన యోగాలలో ఉన్నవారు కూడా అంతిమంలో త్యాగం, యోగం, సహయోగం చేస్తూ ఉంటే వారికి కూడా ఒకటికి ఒకటే ఫలితం ఉంటుంది. కోటిరెట్లు ఫలితం ఉండదు. సమయానికి ముందుగా చేస్తేనే ఒకటికి కోటిరెట్లు ప్రాప్తి. ఇవి చాలా సూక్ష్మాతి సూక్ష్మలెక్కలు.

## 223. వినాశనానికి ఆధారం ఎవరి సంకల్పం?

వినాశనం అనగా విశ్వపరివర్తన. విశ్వపరివర్తనకి ఆధారమూర్తులు బాబా పిల్లలు. మనం యోగం జ్వాలారూపంగా కానంత వరకు వినాశన జ్వల ప్రజ్వరిల్లదు. జ్వాలా రూపి యోగం కోసం ధృఢ సంకల్పం తీసుకోనంత వరకు వినాశకారి ఆత్మలకు వినాశనం చేయాలనే ధృఢ ప్రేరణ రాదు. మన యోగం ఒకసారి శక్తిశాలిగా, మరోసారి బలహీనంగా ఉంటుంది కనుకనే వినాశనం కూడా ఒక్కొక్కసారి ఎక్కువగా, ఒక్కొక్కసారి తక్కువగాను జరుగుతుంది. వినాశనంలో కళ్యాణం ఇమిడివుందని మనం అర్థం చేసుకోవాలి.  పాత యిల్లు తొలగించినప్పుడు బాధపడవలసిన పని లేదు. క్రొత్త ఇల్లు కట్టుకుంటాం కాబట్టి. అదేవిధంగా పాత ప్రపంచం వినాశనమయ్యేది ఎందుకు? కొత్త ప్రపంచం రావడానికి కనుక సంతోషంగా ఉండాలి.

## 224. రాజఋషి అని ఎవరిని అంటారు?

రాజు అనగా సుఖాలను అనుభవించే వ్యక్తి, ఋషి అనగా  సుఖాలకు  దూరంగా  వైరాగ్యంతో ఉండేవారు. ఈ రెండు విభిన్న లక్షణాలు ఎవరు కలిగి ఉంటారో వారే రాజఋషి అనగా ఎన్ని సుఖసాధనాలు ఉన్నా, వాటిని వినియోగించుకుంటున్నా కానీ వైరాగ్యస్థితిలో ఉండేవారే రాజఋషి. శివబాబా మనల్ని రాజుగా అవ్వమనటం లేదు అంటే సుఖాలలో మునిగిపోమనటం లేదు, ఋషిగా అంటే వైరాగ్యంతో విరక్తిగా బ్రతకమనటం లేదు. రాజఋషిగా ఉండమని చెప్తున్నారు.

## 225. ప్రకృతి మనకు ఎప్పుడు దాసీ అవుతుంది?

భగవంతుడైన శివపరమాత్ముని పిల్లలైన మనం త్యాగం, తపస్సు, సేవ చేసిన తరువాత ధనం, సాధనాలు దాసీ వలె మనకు వస్తాయి. కానీ వాటిని సేవను వృద్ధి చేయటానికి ఉపయోగించాలి

కానీ స్వయం కోసం స్వీకరించకూడదు. ప్రకృతి దాసీ అయ్యిందన్న విషయం గ్రహించకుండా, దాసీ అయిన దానికి మనం దాసీ అయితే సంపూర్ణ స్థితిని పొందలేం అంతేకాదు మన స్థితి యొక్క వృద్ధి కూడా అక్కడితో ఆగిపోతుంది. ఈ సాధనాలు, సౌకర్యాల వలన ఇంత నష్టం పొంచి ఉంది.

### 226. ఏ చింత శుభ చింతగా జమా అవుతుంది?

సేవ కోసం ఎలాంటి విశేష కార్యక్రమాలు చేయాలి? విభిన్నంగా ఎలా సేవ చేయాలి? ఇలా రాత్రి పగలు చింతన చేస్తూ ఉంటే దీని వలన ఎలాంటి నష్టం ఉండదు ఎందుకంటే ఇది శుభచింత, సుఖస్వరూప చింత. అనేకమందిని చింతల నుండి విడిపించాలనే చింత. ఇది ఎలాంటి నష్టం చేయదు. ఇతర విషయాల గురించి ఎంత ఎక్కువ చింత పడితే అంత నష్టం జరుగుతుంది. కానీ ఈ సేవా చింత విచిత్రమైనది. చిత్రంగా మన చింతలను చిద్రం చేసేది.

### 227. పాపఖాతా వర్తమాన సమయంలో ఏ రూపంలో వ్యక్తమౌతుంది?

మానసిక అలజడి, అశాంతి రూపంలో వ్యక్తమవుతుంది. నిజానికి ఇటువంటివారు కాగితం పులిని చూసి కూడా నిజమైన పులిగా అనుకుంటారు. అంటే కల్పిత విషయాలను కూడా నిజమైన విషయాలుగా తీసుకుంటారు. వ్యర్థ సంకల్పాలు, వికల్పాలు ఎక్కువగా వస్తూ ఉంటాయి. ఈవిధంగా ప్రతీ ఒక్కరు పాత పాపఖాతా ఉందేమో చూసుకుని జ్వాలారూపీ తపస్సు చేసి వికర్మలను భస్మం చేసుకోవాలి. జ్వాలారూపీ తపస్సు చేయాలంటే మనలో ఏవిధమైన స్వార్థ కోరికలు ఉండకూడదు.

### 228. మొత్తం కుటుంబం అంతా బాబాకి సమర్పణ అయిన తర్వాత ఏవిధమైన పురుషార్థం చేయాలి?

మొత్తం కుటుంబం అంతా శివబాబా జ్ఞానంలో ఉండటం చాలా అదృష్టం. ఒకరికొకరు పోటీపడి మంచి పురుషార్థం చేయవచ్చు. అలాంటి ఆరోగ్యకరమైన పోటీతో పురుషార్థం చేస్తే బాబా సహాయం తప్పకుండా లభిస్తుంది. ఇలా ప్రతీ కుటుంబం ఉన్నతి అవ్వాలని బాబా ఆశ పెట్టుకున్నారు. ముమ్ముందు అనేక కుటుంబాలు డ్రామా ప్లాన్ అనుసారంగా సేవలోకి వస్తాయి.

### 229. విశ్వం నాలుగువైపుల ఏవిధమైన బట్టీలు పెట్టుకోవాలి?

స్వ ఉన్నతికోసం భట్టిలు పెట్టుకోవాలి. అందులో ధారణా సబ్జక్టు ఉండాలి. ఆ బట్టీలో రెండు రకాల సేవలు వృద్ధి అవుతాయి. 1. స్వయాన్ని సంపన్నం చేసుకోవచ్చు. (స్వసేవ) 2. సంఘటనగా ఒక స్థానంలో ఉంటూనే తరంగాల ద్వారా విశ్వాన్ని పరివర్తన చేయవచ్చు (మనసాసేవ). ఇలాంటి

బట్టి చేసుకుని దాని అనంతరం, మీ దగ్గరలో ఉన్న గ్రామాలకు వెళ్ళి బాబా సందేశం ఇవ్వండి. ఈ సమయంలో బాబా సందేశం ఇవ్వకపోతే వారు ప్రాప్తి నుండి వంచితం అయిపోతారు. తెలుసుకుని, అనుభవం చేసుకున్న మీరు వారికి సందేశం ఇవ్వకపోతే వారి పాపం భస్మం అవ్వదు సరికదా మీకు నింద కూడా వస్తుంది. అందువలన చుట్టూ చక్రం తిరిగే చక్రవర్తిగా అవ్వండి అంటే ఒక్కొక్క ఆత్మ 2, 3, 4 స్థానాలే కాక చుట్టు ప్రక్కల ఉన్న అన్ని స్థానాల్లో తిరగడానికి నిమిత్తం కావాలి. కొంత సమయం అయిన తరువాత అక్కడ తయారైనవారికే ఆ స్థానాన్ని అప్పగించవచ్చు.

## 230. విదేశీ సేవ శివబాబా ఎందుకు ముందుగా చేయించారు? ఆ సేవ యొక్క విధి ఏమిటి?

ఇతర మతస్థులలో కొంతమంది దేవీదేవతా ధర్మానికి చెందిన వారు ఉంటారు. వారు ఈ జన్మలో ఇతర మతాలలోకి వెళ్ళిపోయారు. వారిని తిరిగి మన ధర్మంలోకి తీసుకుని రావడానికి మొట్టమొదటే విదేశీ సేవకు ప్రాధాన్యత ఇవ్వటం జరిగింది. వారు ఇప్పుడు భారత దేశంలో ఉన్న కుంభకర్ణులను మేల్కొల్పడానికి నిమత్తమవుతారు. ఎందుకంటే ఇండియాకు చెందిన వైద్యుడు విదేశాలలో వైద్యునిగా పనిచేసి వెళ్ళి వస్తే అతడిని గొప్పగా భావిస్తారు భారతీయులు. అలాగే భారతదేశంలో బాబా అవతరించినా కానీ ఆ విషయం విదేశీయులు చెప్తే భారతవాసులు మేల్కొంటారు. కనుక విదేశీయులే భారతదేశ కుంభకర్ణులు అనగా అజ్ఞానంతో గాఢంగా నిద్రించేవారిని మేల్కొల్పుతారు అని శివబాబా అన్నారు.

## 231. సఫలత ఎన్ని రకాలుగా వస్తుంది?

శ్రీమతానుసారంగా కర్మ చేస్తే సఫలత అనేది ప్రతీ కర్మలో తప్పక లభిస్తుంది కానీ కొన్ని కర్మల్లో వెంటనే సఫలత వస్తుంది, కొన్నింటిలో ఆలస్యంగా వస్తుంది. మనం చేసిన ప్రతీ కర్మలో బాబా తోడు ఉంటున్నారు కాబట్టి అసఫలత అనే మాయకు స్థానమే లేదు. సేవా విషయంలో కూడా ఇదే పద్ధతి అంటే కొంతమంది ప్రకృతి వైపరీత్యాలు పెరిగిపోయినప్పుడు ఎప్పుడో విన్న బాబా పరిచయం వారికి జ్ఞాపకం వచ్చి, శివబాబాను స్వల్పంగా స్మృతి చేసుకుని ముక్తిని పొందుతారు. ఈవిధంగా ప్రతీ సేవకు పుణ్యం తయారైపోతుంది, ఏ సేవా వ్యర్ధమవ్వదు.

## 232. ఇతరులకు జ్ఞానం చెప్పే ముందు ఏ విషయాన్ని గుర్తుంచుకోవాలి?

మొదట నియమాలు చెప్పకూడదు. లాఫుల్‌గా (నియమపూర్వకంగా) ఉండకూడదు, లవ్‌ఫుల్ (ప్రేమగా)ఉండాలి. ఎందుకంటే అల్పకాలిక సుఖాలే వారికి స్వర్గంలా అనిపిస్తాయి. ముమ్మందు ప్రేమ కూడా స్వార్థపూరితం అయిపోతుంది సుఖాన్నిచ్చే సాధనాలున్నా అశాంతి ఆవరించి

ఉంటుంది,  అప్పుడు నిస్వార్థ ఆత్మిక స్నేహం కోసం పరితపిస్తారు. కావున మీరు జ్ఞానంతో పాటు నిజమైన, నిస్వార్థమైన స్నేహాన్ని ఇవ్వండి. ఆ స్నేహంలో వారు శివబాబాకు దగ్గరై, మనకు తెలియకుండానే స్థూల నియమాలను కూడా పాటించి చాలా మంచిగా తయారవుతారు.

**233. అష్టరత్నాలు యొక్క నెంబర్ కూడా ఏ సమయంలో నిర్ణయింపబడుతుంది?**

అంతిమంలో ఒక్క సెకండు పరీక్ష ఉంటుంది. వినాశనం అనేది ఒక గంట ముందు కూడా ప్రకటించబడదు. అంతిమ సమయంలో హాహాకారాలు, తమోగుణీ ప్రకృతి యొక్క అలజడులు ఉంటాయి అలాంటి సమయంలో నిశ్చలంగా ఉండాలి. అదే పరీక్ష.  ఆ ఒక్క సెకను పరీక్షలో పాస్ అవ్వాలంటే ప్రతీ ఒక్కరు సంకల్పాలను శుద్ధం చేసుకుంటూ ప్రతీరోజు అచంచల స్థితిని అభ్యాసం చేస్తూ ఉంటే అంతిమంలో పాస్ విత్ ఆనర్ అవుతారు. వారే అష్టరత్నాలు.

**234. ద్వాపరయుగంలో భక్తులు దేవతా చిత్రాలను ఏవిధంగా తయారుచేస్తారు?**

అంతిమ సమయంలో సర్వాత్మలు విశేషించి భారతవాసులు మీ ద్వారా దేవతా స్వరూపాన్ని దర్శనం చేసుకుంటారు. అనగా  వారికి మీ సాకార శరీరం ద్వారా వారి ఇష్టదేవత సాక్షాత్కార మవుతుంది. ఆ స్వరూపాన్ని వారు చూస్తారే కానీ శివబాబా నేర్పిన ఆత్మిక చదువు ద్వారా ఆ స్వరూపాన్ని తయారుచేసుకోలేదు కనుక వారు సత్యయుగంలోకి రారు. కానీ మీ ద్వారా కనిపించిన దేవతా రూపం వారి మనస్సులో ముద్ర పడిపోతుంది. అది వారి సంస్కారంలో నిండిపోతుంది. తిరిగి ద్వాపరయుగంలో జన్మించినప్పుడు ఆ స్మృతులు బయటకు వచ్చి, వాటి ఆధారంగా దేవతా చిత్రాలను తయారు చేసి, మహిమ చేస్తారు. పూజ చేస్తారు.  సత్యయుగంలోకి వచ్చి ప్రత్యక్షంగా మీ దేవతా రూపం చూడకపోయినా కానీ వారిలో నిండిన అంత్య సంస్కారం కారణంగా అలా చేస్తారు.

**235. ఎటువంటి ఆత్మలపై దాతగా వరదాతగా ఉండాలి?**

శత్రువుని కూడా ఏదొక జన్మ యొక్క కర్మలఖాతా పూర్తి చేసేటందుకు నిమిత్తమైన ఆత్మగా భావించి దాతగా మరియు వరదాతగా అయ్యి వారిపై దయ చూపించాలి. మీ దయే వారికి వరదానం. అలాగే మనల్ని నిందించే ఆత్మలకు కూడా దాతగా అవ్వాలి. ద్వాపరయుగం నుండి భగవంతుడైన శివపరమాత్మని అనేకమంది నిందించినా, గ్లాని చేసినా కానీ శివబాబా వారికి జ్ఞానాన్ని ప్రసాదించారు. ఈ విషయాన్ని మనం కూడా అనుసరించాలి.

**236. శివబాబా యొక్క అనాది అవినాశి నియమం ఏమిటి?**

శివబాబా యొక్క అనాది అవినాశి నియమం ఏమిటంటే, ఏ రకంగానైనా స్వయానికి స్వయం గొప్పగా ఋజువు చేసుకో కూడదు, అలాంటి వారు ఎప్పటికీ ప్రసిద్ధ వ్యక్తులు కాలేరు. ఇతరులు మనల్ని గుర్తించాలి, మనకి మనం గొప్పలు చెప్పుకోకూడదు. ఈ విషయంపై ధ్యాస పెట్టుకోండి.

**237. సర్వప్రాప్తులకు పొందటానికి ఏ శక్తి ఆధారం?**

పరివర్తనాశక్తి. మానవుల నుండి దేవతలుగా తయారుచేయటానికి శివబాబా పరంధామం నుండి వచ్చారు. నేను ఆయన ఆజ్ఞకు పూర్తిగా ఆధీనమై నడవాలి అనుకుని అన్ని విషయాలలో మారాలి. ఈవిధమైన పరివర్తన సర్వప్రాప్తులకు ఆధారం.

**238. అంతిమ వినాశనం ఏవిధంగా ఉంటుంది? దాని తారీఖు నిర్ణయింపబడుతుందా, లేదా? ఆ సమయంలో మనం విజయం పొందాలంటే ఇప్పటి నుంచి ఏయే విషయాలు దారణ చేయాలి?**

(1) ఇప్పుడు జరుగుతున్న చిన్నచిన్న ఆపదలు అనగా యాక్సిడెంట్స్, భయంకరమైన రోగాలు, గొడవలు, గవర్నమెంటు యొక్క లోటు బడ్జెట్టు కారణంగా కఠినమైన నియమాలు, ప్రకృతి వైపరీత్యాలు మొదలైన వాటికంటే, అంతిమ వినాశనం అనేక రెట్లు భయానకంగా ఉంటుంది. ఒకే సమయంలో పంచతత్వాలు మానవాళిపై అంతిమ దావా చేస్తాయి అనగా భయంకరంగా విజృంభిస్తాయి. ఉదాహరణకు నీటి నుండి తయారయ్యే విద్యుశ్చక్తి పూర్తిగా ఆగిపోతుంది మరియు చాలా కిలోమీటర్ల వరకు రహదారులు కొట్టుకొనిపోతాయి. ఎక్కువ వేగంగా గాలులు వీచి భవనాలు నేలమట్టం అయిపోతాయి. ఆ సమయంలో, మనం మహాకాలుడి రూపంలో ఉండాలి. అంటే నేను ఆత్మను, ఆత్మకు చావు లేదు, అని నిర్భయ స్థితిలో స్థితులవ్వాలి.

(2) అంతిమ సమయం సమీపించే కొలదీ మానవులలో పంచ వికారాలు పెచ్చుమీరిపోతాయి. వీటి వలన ప్రపంచంలో చాలా అశాంతి నెలకొంటుంది. ఆ సమయంలో మనకు ఏవిధమైన సంకల్పం రావాలంటే పవిత్రంగా తయారైన నేను పంచ వికారాలకు సంకల్పమాత్రం కూడా వశం కాకుండా ఆత్మల పుట్టినిల్లు అయిన పరంధామానికి వెళ్ళిపోవాలి అనే సంకల్పం ఉండాలి.

(3) సంబంధీకులపై తగుల్పాటు కూడా ఆ సమయంలో ఉంటుంది. ఆ విషయాన్ని జయించాలంటే అందరికి తండ్రి శివబాబా ఒక్కరే! ఆయనే అన్ని చూసుకుంటారు, నేను సంబంధీకులను కూడా జ్ఞాపకం చేసుకోకుండా బాబా స్మృతిలో వెళ్ళిపోతాను అనే స్మృతిలో ఉండాలి. ఆ సమయంలో టెలిఫోన్లు, వైరలెస్ సెట్స్ ఏమీ కూడా పనిచేయవు. ఎంత మనం

నిర్వికారిగా ఉంటామో అంత మనం విజయం పొందుతాము. ఆ సమయంలో మనం విజయం పొందాలంటే ఇప్పటి నుండి పై విషయాలు దారణ చేయాలి. అంతిమ వినాశనం యొక్క తారీఖు శివబాబా ముందుగా ఎప్పుడూ చెప్పరు.

### 239. ఏ భావన ఉన్నవారు మహాపాపి లిస్టులో ఉంటారు?

జ్ఞానంలో ఉన్న ఆత్మలకు ఒకవేళ సంకల్పంలో అయినా వికార దృష్టి, ఆలోచనలు ఉంటే వారు మహాపాపి లిస్ట్‌లో ఉంటారు. జ్ఞానులు అంటే భగవంతుడిచ్చిన దివ్యబుద్ధితో ఆలోచించేవారు. వీరికి ఎప్పుడు వికారీ భావన ఆలోచనలో కూడా టచ్ అవ్వదు. ఈ విషయంలో పాస్ అయ్యేవారు మహాజ్ఞానీ లిస్ట్‌లో ఉంటారు.

### 240. శివబాబా జ్ఞానాన్ని ఏవిధంగా ఉపయోగించాలి?

కేవలం వినడం ద్వారా ఆనందం పొందటం కాదు, మాటిమాటికి స్వయం పట్ల, ఇతరాత్మల పట్ల జ్ఞానాన్ని ఉపయోగిస్తూ  ఉండాలి. ఈ నియమాన్ని పాటిస్తూ ఉంటే శక్తులన్నీ వృద్ధి చెందుతూ ఉంటాయి.

### 241. శ్రేష్ఠాత్మల మహిమ ఎవరు చేస్తారు?

శివబాబా యొక్క మహిమ ఆత్మలు చేస్తారు. శ్రేష్ఠాత్మల మహిమ స్వయం భగవంతుడైన శివబాబా చేస్తారు. ఇది చాలా అదృష్టవంతమైన విషయం. సర్వశ్రేష్ఠ ఆత్మల సహయోగం లేకుండా శివబాబా ఏమీ చేయలేరు. ఎందుకంటే, ప్రాప్తి మీకు ఇవ్వాలి కాబట్టి. మీ మహిమ శివబాబా చేస్తున్నారు.

### 242. బేహద్ సేవలో ఏవిధమైన ప్లాన్ ఉండాలి మరియు ఎవరి ద్వారా ఎవరు  బాబా దగ్గరికి వస్తారు?

బేహద్ ప్లాన్ అంటే ఒక్క ఆత్మను తయారుచేయాలి ఆ ఆత్మ అనేకమందికి నిమిత్తమవ్వాలి. అనగా వారు అనేక ఆత్మలను బాబా దగ్గరకు తీసుకుని రావాలి. ఇలాంటి వారు ఎవరు? బాగా ధనవంతులు, పదవిలో ఉన్నవారు, పేరు ప్రతిష్టలు ఉన్నవారు బాబా జ్ఞానం తెలుసుకుంటే వారు ఇలా చేయగలరు అనుకుంటాం. దీనిలో వాస్తవం ఉన్నప్పటికీ దీనికి మరోకోణం కూడా ఉంది. కొంతమంది సాధారణ ఆత్మలలో కూడా చాలా మంచి గుణాలు ఉంటాయి, సేవా తత్పరత ఉ ంటుంది వారికి  ధనం, పేరు ప్రతిష్టలు, పదవి ఉండకపోవచ్చు. ధనవంతులు, పెద్ద పదవుల్లో ఉ న్నవారి ద్వారా వచ్చేవారు వారికున్న పేరు ఆధారంగా బాబా దగ్గరకు వస్తారు కానీ వారి ప్రభావం అల్పకాలికంగా పడుతుంది.  పెద్ద పెద్దవాళ్ళు వస్తున్నారు అనే ఆధారం తీసుకుని బాబా దగ్గరకు వస్తారు. కానీ మంచి గుణాలు కలిగి సాధారణంగా ఉన్న ఆత్మల ద్వారా వచ్చేవారు ఎక్కువమంది,

సదాకాలికంగా నిలబడతారు. కాబట్టి పేరు ప్రతిష్టలు ఉన్నవారు, ధనము సమృద్ధిగా ఉన్నవారు బాబాకు కావాలి. వారికి కూడా సేవ చేసి, వారి ద్వారా అనేకులు వచ్చేలా వారినిసేవకు నిమత్తం చేయండి. మంచి గుణాలు, మంచి కర్తవ్యం చేసే వారి కి కూడా సేవ చేయాలి. కేవలం మీరే నిమిత్తం కాకుండా, వారిని కూడా నిమిత్తం చేయండి. ఈవిధంగా ఇరువురి సర్వీస్‌కు ఎవరైతే నిమిత్తం అవుతారో వారే భవిష్యత్తులో రాజ్య పదవి పొందుతారు.

## 243. బ్రాహ్మణ జీవితం ఈశ్వరీయ సేవార్థం - ఏవిధంగా ఉండాలి?

బ్రాహ్మణులు అనగా పరబ్రహ్మ జ్ఞానాన్ని తెలుసుకున్న ప్రతీ ఒక్కరూ బ్రాహ్మణులుగా పిలువబడతారు. బ్రాహ్మణ జీవితం కేవలం ఈశ్వరుని సేవార్థమే ఉంది. కాబట్టి ఈశ్వరుడు ఇచ్చిన శ్రీమతానికి విరుద్ధంగా పరమతం గాని, మన్మతం గాని ఉపయోగిస్తే ఆ జీవితం నిరుపయోగమవుతుంది. ఈ జీవితం స్వయం భగవంతుడైన శివ పరమాత్మ ద్వారా అందరికీ లభించింది. సంకల్పాలను కూడా వ్యర్థంగా ఉపయోగించకూడదు. అందుకే భక్తి మార్గంలో శ్వాసశ్వాస ఈశ్వరుని స్మృతిలో ఉండాలని చెబుతారు. భక్తి మార్గంలో కూడా దానం చేసిన వస్తువుని తిరిగి తీసుకోకూడదని తెలియజేస్తారు కదా! అదేవిధంగా బ్రాహ్మణ జీవితం యొక్క మొదటి ప్రతిజ్ఞ ఏమిటంటే –తనువు, మనస్సు, ధనం నీకే అర్పితం అన్నారు మరియు సర్వ సమర్పణ అంటే సంకల్పం, మాట, కర్మ, సంబంధం, స్వభావ సంస్కారాలు, వృత్తి, దృష్టి, స్మృతి అన్నీ అర్పణ చేసారు కదా! దీనినే సమర్పణ అంటారు. దీనికంటే శక్తివంతమైన మాట ఏమిటంటే స్వయాన్ని సర్వస్వత్యాగిగా భావించండి. సర్వస్వత్యాగి యొక్క ముఖ్య గుణం ఏమిటంటే, 63 జన్మల నుండి దాగివున్న పాత స్వభావ సంస్కారాలు, అంశ,వంశ సహితంగా శివబాబాకు అర్పితం చేసేస్తారు. వారి నోటి వెంట ఇది నా స్వభావం, నా సంస్కారం అనే బలహీనమైన మాటలు రావు.

## 244. సర్వస్వత్యాగులకు ఏయే భారాలు సమాప్తి అవుతాయి?

సర్వస్వత్యాగులకు పూర్వజన్మ యొక్క పాపభారం కానీ, కర్మబంధన యొక్క భారం కానీ, సంబంధాల యొక్క భారం కానీ, సర్వ కర్మేంద్రియాల ఆకర్షణ యొక్క భారం కానీ, ప్రకృతి ఆకర్షణ యొక్క భారం కానీ ఉండదు. వీరికి ఎటువంటి భారం లేని కారణంగా, ప్రతీ సంకల్పంలో భాగ్యాన్ని జమ చేసుకుని పదమాపద భాగ్యశాలిగా తయారైపోతారు. సర్వస్వత్యాగులు కేవలం చెప్పేవారిగా కాదు, తాము చేస్తూ ఇతరులతో చేయించేవారిగా కావాలి.

## 245. ఎప్పటివరకు మనకు బేహద్ వైరాగ్యం రాదు?

ఎప్పటి వరకైతే ఈ పాత ప్రపంచం స్మశానంగా అనుభవం కాదో అప్పటి వరకు సదాకాలిక బేహద్ వైరాగ్యం రాదు. బేహద్ వైరాగ్య వృత్తి వారు మొత్తం సృష్టిలోని ఆత్మలకు దయార్ద్ర హృదయంతో జ్ఞానాన్ని అందించాలనే భావనతో ఉంటారు.

## 246. వాతావరణం దేని ఆధారంగా తయారవుతుంది?

మన సంకల్పాల ఆధారంగా వాతావరణం తయారవుతుంది. వాతావరణం మన పురుషార్థానికి ఆధారం. కర్మ అయితే పెద్ద విషయం. కానీ సంకల్పాలపై చాలా ఎక్కువ ధ్యాస పెట్టుకోవాలి. ఇది తేలికైన విషయం కాదు ఎందుకంటే మన కర్మ  అనే వృక్షానికి సంకల్పమే బీజం. ఒక్క సంకల్పం అయినా వ్యర్థంగా పోయిందంటే సమయం వ్యర్థంగా పోతుంది. సమయం వ్యర్థంగా పోతే జీవితం వ్యర్థం అయిపోతుంది. ఒక్క సంకల్పం శ్రేష్ఠంగా వెళ్ళిందంటే, అది శ్రేష్ఠ జీవితానికి ఆధారమవుతుంది. అప్పుడప్పుడు సంతోషంగా, అప్పుడప్పుడు ఉదాసీనంగా ఉన్నవారు విశేష ఆత్మలుగా అవ్వలేరు. మీ శక్తివంతమైన సంకల్పం ద్వారా ఎక్కడోవున్న బలహీన ఆత్మలను కూడా శక్తిశాలీగా చేయవచ్చు. ఎందుకంటే సంకల్పశక్తి చాలా గొప్పది. ఇప్పటి వరకు మరియు ముందు కూడా, ఏ సాధనాలు ఈ సంకల్పశక్తి కంటే వేగంగా వెళ్ళలేవు. ఎందుకంటే, ఈ అనంతమైన విశ్వం జ్యోతి స్వరూపుడైన శివపరమాత్మ సంకల్ప శక్తి ద్వారా మాత్రమే తయారైంది. అదేవిధంగా ఆత్మ రూపంలో ఆయన పిల్లలైన మనకు కూడా అంత సంకల్పశక్తిని భగవంతుడు సృష్టి ఆదిలోనే మనలో పూర్తిగా నింపి, శరీరంతో భూలోకంలో పాత్ర అభినయించమని పంపించాడు. ఆత్మకు సృష్టికర్త అయిన శివపరమాత్మకు మరణం లేదు  కనుక ఆత్మకు కూడా మరణం లేదు.  దేహాన్ని ఇచ్చిన తల్లిదండ్రులకు మరణం ఉంది కనుక ఈ దేహం కూడా మరణిస్తుంది. ఈ సంగమయుగంలో, జ్ఞానులుగా పిలువబడే మనం సంకల్పాలను వ్యర్థం  చేయకుండా,  సదా శుభ సంకల్పాలు చేస్తూ ఉంటే, అవి వాయుమండలంలో వ్యాపించి ఇతర ఆత్మల వ్యర్థ సంకల్పాలను శ్రేష్ఠ సంకల్పాలలోకి మార్చి వేస్తాయి. ఎందుకంటే ఈ సృష్టిలో ఒక ఆత్మ సంకల్పాన్ని, వేరొక ఆత్మ తెలియకుండానే స్వీకరిస్తుంది. ఏవిధంగానైతే ఒక మునీశ్వరుడు, అడవిలో తపస్సు చేసుకుంటూ ఉండగా, సంకల్ప శక్తి శక్తివంతంగా తయారై, అడవి అంతా వ్యాపించి, అనేక క్రూర మృగాలు సాధు జంతువులుగా మారి ఆ మునీశ్వరుని ఆశ్రమం ముందు నివసించడాన్ని మనం గమనించగలం. అదేవిధంగా మనం అనేక జన్మల నుండి  సంకల్ప శక్తిని వ్యర్థంగా ఉపయోగించి, మనము, సమాజము మరియు వాతావరణం పాడు చేసామని శివపరమాత్మ మనకు తెలియ చేస్తున్నారు. జరిగినదేదో జరిగింది కానీ ఇప్పటి నుండి సంకల్ప శక్తిని పరమ పవిత్రుడైన శివపరమాత్ముని స్మృతిలో జోడించి పావనం చేసుకోండి. ఇదే అంతిమ సేవ! ఇదే భగవంతుడైన శివబాబా యొక్క అంతిమ ఆజ్ఞ!

## 247. శివబాబాతో ఎందుకు అలగకూడదు; దానివలన వచ్చే నష్టమేమిటి?

భగవంతుడైన శివపరమాత్మ నిస్వార్థమైన స్నేహాన్ని ఇస్తారు, సహయోగం కూడా చేస్తారు. మరి ఎందుకు మనం ఆయనతో అలుగుతాము, ఎందుకు ఆయనకు దూరమవుతాము?  భగవంతునితో అలిగినప్పుడు మనస్సుతో ఏడుస్తారు. తిరిగి మరలా శివపరమాత్మ తోడు లేకుండా ఆ కన్నీళ్ళు సమాప్తం అవ్వవు. స్థూల కళ్ళ ద్వారా వచ్చే కన్నీళ్ళు తుడుచుకుంటే పోతాయి కానీ మనస్సు ద్వారా వచ్చే కన్నీళ్ళు మనోభిరాముడైన శివబాబా తప్ప ఇంకెవ్వరూ తొలగించలేరు.

**248. సత్య-త్రేతాయుగాలలో ధనవంతులుగా ఎవరు జన్మ తీసుకుంటారు?**

సత్యయుగంలో శ్రీకృష్ణుని కంటే ఎక్కువ ధనవంతులు ఉంటారు కానీ వారికి రాజ్యపదవి ఉండదు. ఎవరైతే స్థూలధనాన్ని జ్ఞాన ప్రచారం కోసం ఉపయోగిస్తారో వారు సత్య-త్రేతాయుగాల్లో చాలా ధనవంతులుగా జన్మ తీసుకుంటారు.

**249. సత్యయుగంలో ఎవరు దాసీలుగా అవుతారు?**

ఎవరైతే మాటిమాటికి ఏదొక కర్మేంద్రియానికి, దేహదారులకు, దేహ సంస్కారాలకు వశీభూతం అవుతారో వారిలో ఉదాసీనత వచ్చేస్తుంది వారే దాసీలు అవుతారు. మేము ఏ పదవి పొందుతామని శివపరమాత్మను అడగవలసిన పనిలేదు. స్వయానికి స్వయమే న్యాయాధికారియై మీ రాబోయే పాత్రను మీరు జ్ఞానం ద్వారా తెలుసుకోవచ్చు.

**250. దివ్యబుద్ధిని హత్యచేయటం అంటే ఏమిటి?**

ఎప్పుడైతే మనం శివపరమాత్మ చెప్పిన శ్రీమతానికి వ్యతిరేకంగా పరులు చెప్పిన మతానికి వశమై, చెడు సాంగత్యానికి వశమై, ఏదైనా పరిస్థితులకు వశమై ఈశ్వరుడు ఇచ్చిన వివేకాన్ని అణిచేస్తామో అప్పుడు దివ్యబుద్ధిని హత్య చేసినట్లే!

**251. యోగం ఎందుకు కుదరటం లేదు?**

ఇంద్రియాల ద్వారా లభించే అల్పకాలిక సుఖాలను అనుభవించటంలో మనస్సు, మనిషి నిమగ్నమై ఉన్నప్పుడు యోగం కుదరదు. మాయ ముందుగా బుద్ధి మీద ప్రభావం చూపిస్తుంది. కాబట్టి బుద్ధిని ఎక్కడ, ఏవిధంగా ఉపయోగించాలో బాగా తెలుసుకోవాలి మరియు రక్షించుకోవాలి.

**252. ఎప్పుడు సిద్ధి స్వరూపులం అవుతాము?**

ఏదైతే ఆలోచిస్తున్నామో దానినే మాట్లాడాలి, దానినే ఆచరించాలి. అప్పుడు సిద్ధి స్వరూపులుగా అవుతాము. సంగఠనా రూపంలో అందరూ ఒకే సంకల్పం చేస్తూ ఉంటే వాయుమండలం శక్తిశాలీగా తయారై, ఆ వాయుమండలం ద్వారా యోగం కుదరని వారికి కూడా యోగం కుదురుతుంది, బలహీనులకు శక్తి లభిస్తుంది. అణుబాంబు ఒకచోట వేస్తే నాలుగువైపులా నాశనం అయిపోతుంది అదేవిధంగా సంకల్పం యొక్క ఏకాగ్రత అందరి సంకల్పాలని ఏకరసంగా చేస్తుంది. ఈవిధంగా అందరూ శక్తి ననుసరించి సిద్ధి స్వరూపులుగా అయిపోతారు.

**253. ఏవిధంగా బలిహారం అవ్వాలి? వాటి ఫలితం ఎలా ఉంటుంది?**

భగవంతునిపై కష్టంతో బలిహారం అయితే, ప్రాప్తి చాలా తక్కువగా ఉంటుంది. నియమాల ఆచరణ ద్వారా బలిహారం అయితే ప్రాప్తి మధ్యస్తంగా ఉంటుంది. మనస్సుతో బలియైతే పూర్తి ప్రాప్తి లభిస్తుంది. సత్యమైన శివబాబా సత్యాన్నే స్వీకరిస్తారు. కనుక సత్యమైన స్నేహం ద్వారా బలిహారం అయిన వారికే పూర్తిగా భగవంతుని నుండి స్వర్గవారసత్వం వస్తుంది. మిగిలిన బలిహారాలన్నీ వ్యర్థఖాతాలో జమ అయిపోతాయి. స్వార్థంతో బలైతే పాపఖాతా కూడా జమ అయిపోతుంది. కాబట్టి ప్రతీ ఒక్కరు సత్యమైన మనస్సుతో సమర్పణ అవ్వడానికి నిర్ణయించుకోండి.

**254. ఎవరు సత్య, త్రేతాయుగాల్లో ప్రజాపదవిని పొందుతారు?**

డైరెక్ట్ శివపరమాత్మ నుండి సర్వశక్తులు పొందలేరు, జ్ఞానాన్ని ధారణ చేయలేరు, స్వ ప్రయత్నం ద్వారా శ్రేష్ఠ ప్రారబ్ధాన్ని తయారుచేసుకోలేరు. కేవలం భగవంతునికి స్నేహి సహయోగి అవుతారు. వీరే ఆయా యుగాలలో ప్రజలుగా జన్మ తీసుకుంటారు.

**255. ఏ గుణాన్ని ఆచరిస్తే అందరికీ ప్రియమనిపిస్తాం?**

సంతుష్ట ఆత్మయే శివపరమాత్మకి, జ్ఞానయోగి ఆత్మలకు ప్రియమనిపిస్తారు. సంతుష్టత అనే గుణం చాలా గొప్పగుణం. ధనం విషయంలో సంతుష్టత (సంతృప్తి) ఉండాలి, స్నేహంలో ఉండాలి, సాధనాలలో ఉండాలి. అటువంటివారే శివపరమాత్మకు ప్రియమనిపిస్తారు. ఎప్పుడైతే శివపరమాత్మకు ప్రియమవుతారో, అప్పుడే ప్రపంచంలో మిగిలినవారందరికి కూడా ప్రియమనిపిస్తారు.

**256. బుద్ధికి భోజనం ఏమిటి?**

శరీర ఆరోగ్యానికి మంచి ఆహారం అవసరం. ఆత్మలో వున్న సూక్ష్మశక్తియైన బుద్ధికి సంకల్పాలే ఆహారం. కాబట్టి స్థూల నియమాలకంటే ఉన్నతమైన నియమం ఏమిటంటే ప్రతీ ఒక్కరిపై మంచి భావన పెట్టుకుంటూ ఉంటే అదే మనస్సుకి ఆరోగ్యం.

**257. శాంతిశక్తి యొక్క విశేషతలను తెలుపుము?**

నోటి ద్వారా, సాధనాల ద్వారా సేవ చేయటం మంచిదే కానీ అంతిమ సమయంలో శాంతిశక్తితో చేసే సేవ ఒక్కటే ప్రపంచం ముందు ప్రత్యక్షమవుతుంది. శాంతిశక్తి అనగా భగవంతునిపై మనస్సుని ఏకాగ్రం చేసుకోవడం. ఏకాగ్రతాశక్తిలో దివ్యదృష్టి వస్తుంది. వాచా, కర్మణా సేవలో, నాది – నీది, పేరు – గౌరవం, స్వభావ – సంస్కారాల అలజడి వస్తుంది. మరియు ఈ సేవ కొరకు

ఎక్కువ సమయం, ధనం కూడా కావాలి కానీ శాంతిశక్తి ఒక సంస్కారంగా అయిపోతే ఆ శాంతిశక్తికి ఎక్కడోవున్న ఆత్మలను ఆహ్వానం చేయగలదు. దూరంగా వున్న ఆత్మల స్వభావ సంస్కారాలను ఈ శాంతిశక్తి ద్వారా పరివర్తన చేయవచ్చు. దూరంగా ఉన్నా కానీ శాంతిశక్తి ద్వారా అప్రాప్తి ఆత్మలకు ప్రాప్తిని, దు:ఖీ ఆత్మలకు సుఖాన్ని, రోగి ఆత్మలకు నిరోగిగా అయ్యే వరదానాన్ని ఇవ్వగలం. ఇప్పటి నుండీ ఈ అభ్యాసం చేసి చూడండి.

### 258. సేవ ఏవిధంగా చేయాలి?

సేవ చేసేటప్పుడు మాటలకు అతీతమై ఆత్మికశక్తిని ఇతరులకు అనుభవం చేయండి. కేవలం ఉపన్యాసం చెప్పటం కాదు, చిన్న చిన్న సంగతనలు తయారుచేసినా కానీ ఆత్మీయత అనగా సోదరీసోదరులనే భావన తప్పక ఉండాలి మరియు శివతండ్రితో సంబంధాన్ని జోడించే విధంగా సేవ చేయాలి. ఇది కలియుగ అంతిమ సమయం అని సమయం యొక్క గుర్తింపునివ్వాలి.

### 259. త్యాగాన్ని త్యాగంగా భావిస్తే వచ్చే నష్టం ఏమిటి?

త్యాగం చేసిన తరువాత నేను ఇంత త్యాగం చేసాను అనే భావం వస్తే ఆ త్యాగానికి ఫలితం ఉండదు. అహంకారం వచ్చేస్తుంది. త్యాగాన్ని త్యాగంగా భావించకుండా భాగ్యంగా భావించాలి. అదే నిజమైన త్యాగం.

### 260. యజ్ఞ స్థాపన ఆదిలో, మధ్యలో అందరినీ బాబా ఉపయోగించుకుంటారు కానీ యజ్ఞ సమాప్తిలో ఏ బ్రాహ్మణ ఆత్మలను బాబా ఉపయోగించుకుంటారు?

మనస్సు సత్యంగా ఉన్న జ్ఞానీ-యోగీ ఆత్మలను మాత్రమే యజ్ఞ సమాప్తికి శివబాబా ఉపయోగించుకుంటారు. ఎందుకంటే, అంతిమంలో సత్యతా శక్తి ఒక్కటే ప్రత్యక్షమౌతుంది. యజ్ఞం ఆదిలో, మధ్యలో అన్నిరకాల జ్ఞానీ-యోగీ ఆత్మలుంటారు. కానీ ఎవరైతే సత్యతా శక్తిని ధారణ చేయరో వారు యజ్ఞం నుండి తొలగిపోతారు. ఒక సినిమాహాల్ వద్ద నాలుగు రకాల టికెట్స్ అమ్ముతారు, మెయిన్‌గేట్‌లో అవి కొద్దిగా కట్‌చేసి పంపుతారు, కానీ హాల్‌లో కూర్చోపెట్టేటప్పుడు, టికెట్ ఖరీదు బట్టి కూర్చోబెడతారు. అదేవిధంగా శివబాబా కూడా యజ్ఞం యొక్క మధ్యలో ఎటువంటి స్వభావ సంస్కారాలు కలవారినైనా మంచిగా తయారవుతారులే అనే శుభా బావనతో ముందుకి తీసుకువెళతారు. అంతిమంలో ఫిల్టర్ చేసేస్తారు. కావున మనమందరం ఇప్పటినుండి మనస్సులో, మాటలో మరియు కర్మలో సత్యంగా ఉండాలి.

## 261. సంపూర్ణశక్తిశాలీ బీజరూపి స్థితి ఎప్పడు మనకు లభిస్తుంది?

ఇఛ్ఛామాత్రం అవిధ్య అనగా  కోరిక అంటే ఏమిటో తెలియనివారిగా అవ్వాలి. అటువంటివారే సంపూర్ణ శక్తిశాలీ బీజరూపి స్థితిలో ఉండగలరు మరియు వారే విశ్వంలో సర్వాత్మల సర్వ కోరికలను తీర్చగలరు. వారు బీజరూపడైన శివబాబాతో నిరంతరం సంబంధం జోడిస్తున్న కారణంగా, వారి కోరికలన్నీ భగవంతుడే స్వయంగా తీరుస్తారు. వారు ఎవర్నీ ఏదీ అడుగరు.  వీరి ద్వారా ఇతరాత్మల సర్వ కోరికలు గుప్తరూపంలో శివపరమాత్మయే తీరుస్తారు.

## 262. బాబాతో సంబంధం ఎప్పడు మనం అనుభవం చేసుకోలేము?

ఇతరుల లోపాలు చూసే అలవాటు ఉన్నవారు లోపాలు లేని శివపరమాత్మతో సంబంధం జోడించలేరు. అటువంటి సాధకుల యొక్క సాధన సఫలం కాదు. ఎవరేం చేసారులే, అందరూ ఇలాగే ఉన్నారని స్వయం ఉన్నతి అవ్వటానికి బదులు ఇతరుల లోపాలను చూస్తూ ఉంటారు.

## 263. ఏ కోర్సు పూర్తి చేస్తే సమయం సమాప్తి అవుతుంది?

పేరు, గౌరవం మరియు సాధనాల యొక్క త్యాగమే గొప్ప త్యాగం. సఫలత వచ్చినప్పుడు నా గొప్పతనం అనుకోవటం, అసఫలత వచ్చినప్పుడు ఇతరులను దోషిగా వర్ణన చేయటం... ఇవన్నీ తొలగించుకోవాలి. జ్ఞానీ-యోగీ ఆత్మలు జ్ఞానంలో ఉంటూ ఇవన్నీ తొలగించుకోవడం కోసం సమయం ఆగింది. ఇవన్నీ తొలగించుకుంటే వినాశన సమయం సమీపంగా వచ్చి ఈ భూమిపై స్వర్గం స్థాపన అవుతుంది.

## 264. ఎన్నిరకాల పరీక్షలు మనం దాటాలి?

స్వయం యొక్క సంస్కారాలతో పరీక్ష, వ్యర్థ సంస్కారాలతో  పరీక్ష, ఏదొక శక్తి లోపంగా ఉన్నకారణంగా పరీక్ష, అందరి సంస్కారాలు కలుపుకునే పరీక్ష ఇలా ఈ చిన్నచిన్న పరీక్షలలో కూడా అలజడిగా ఉన్నారా లేక అచంచలంగా ఉన్నారా? బేహద్ పరీక్ష అంటే అనాది తత్వాల ద్వారా పరీక్ష. బేహద్ విశ్వం యొక్క అలజడుల ద్వారా పరీక్ష, బేహద్ వాతావరణం ద్వారా పరీక్ష, బేహద్ సృష్టియొక్క తమోప్రధాన అశుద్ద వాయుమండలం ద్వారా పరీక్ష - ఇలా బేహద్ పేపర్ తీసుకోవడానికి ముందు, స్వయం యొక్క, బ్రాహ్మణ పరివారం ద్వారా, బ్రాహ్మణుల సంస్కారాల ద్వారా వచ్చే పరీక్షలు ఎదుర్కోవాలి.

## 265. దేనిని బీజం అంటారు? దేనిని కర్మఫలం అంటారు?

చేసే పనిని (కర్మ) బీజం అంటారు. దాని ఫలితాన్ని కర్మఫలం అంటారు.

**266. సౌభాగ్యానికి మహాపాపం ఎప్పుడు అంటుతుంది?**

స్వప్నంలో కాని, సంకల్పంలోకానీ, ఏ వ్యక్తిపైనైనా తగుల్పాటు ఉంటే సదా సౌభాగ్యానికి మహాపాపం. సదా సౌభాగ్య శాలులు అంటే ఒక్క శివబాబా తప్ప మరెవ్వరూ లేరు అనే భావన ఉంచుకోవటమే.

**277. ఎవరితో స్నేహం చేయాలి? ఎవరితో స్నేహం చేయకూడదు?**

శివపరమాత్మతో ఎవరైతే స్నేహం చేస్తారో వారితోనే మనం స్నేహం చేయాలి. సత్యమైన మనస్సు కలవారు మాత్రమే శివబాబాకి స్నేహి అవుతారు. ఒకవేళ సగం కులం బ్రాహ్మణులతో అనగా మురళీపై పూర్తి సంలగ్నత లేనివారితో స్నేహం చేస్తే సత్యమైన స్నేహితుడైన శివబాబా నుండి స్వతహాగానే సమీపానికి బదులు దూరం అయిపోతారు. ఎందుకంటే మురళీ అనగా శ్రీమతం, శ్రీమతం అనగా శ్రేష్ఠ సలహా. సగం కులం బ్రాహ్మణులు అంటే పేరుకి మాత్రమే బాబా పిల్లలు అయిన వారు బాబా యొక్క శ్రేష్ఠ సలహాని గౌరవించరు కనుక వారితో స్నేహం చేయకూడదు.

**268. సంగమయుగం యొక్క ఉన్నతోన్నతమైన అనాది నియమం ఏమిటి?**

ఉన్నతోన్నతమైన సంగమయుగం యొక్క అనాది నియమం – ఒక తప్పుకు లక్షరెట్లు శిక్ష అలాగే ఒక మంచిపనికి లక్షరెట్లు ప్రాప్తి. ఈ నియమం స్వతహాగా నడుస్తూ ఉంటుంది. ఇది అనాది అవినాశి నియమం. సంగమయుగం భగవంతుడు అవతరించిన యుగం కావున ప్రాప్తి మరియు శిక్ష రెండూ చాలా ఎక్కువగా ఉంటాయి. భగవంతుడు అవతరించక ముందు 63 జన్మల నుండి చేసిన శ్రేష్ఠ కర్మకు మరియు వికర్మకు కూడా ప్రాప్తి మరియు శిక్ష కూడా తక్కువగా ఉంటాయి.

**269. ఇతరాత్మలను తోడు చేసుకుంటే మనకు వచ్చే నష్టం ఏమిటి?**

కొంతమంది బాబా తోడుని మరియు సహయోగాన్ని తీసుకునే ధైర్యంలేక మార్గంలో నడిచే తన తోటివారిని పండాగా తయారుచేసుకుంటారు. అంటే వారి ద్వారానే తోడు, సహయోగం అనుభవం చేసుకుంటారు. బాబా బదులుగా ఏదొక ఆత్మను తోడుగా భావిస్తారు. అందువలన బాబా నుండి వేరైపోతున్నారు. మాటిమాటికి తుఫానుల్లో కదలిపోతూ పడిపోతున్నారు. సదా తీరాన్ని దూరంగా అనుభవం చేసుకుంటున్నారు. ఎవరొక వ్యక్తిని తోడుగా భావిస్తున్నారు లేక ఏదొక ప్రాప్తిని ఆశిస్తున్నారు.

**270. అన్ని విషయాలలో వచ్చే తుఫానులను ఏవిధంగా భావించాలి?**

జ్ఞాని యోగి ఆత్మలలో కొద్దిమంది మాత్రమే తుఫానులను అంటే కష్టాలను కూడా డ్రామా యొక్క

కానుకగా భావించి ఇతరుల అనేక రకాల స్వభావ సంస్కారాలను కూడా ముందుకు వెళ్ళడానికి ఆధారంగా భావించి ఆ స్వభావ సంస్కారాలలో మాయను గ్రహించి సదా శివబాబాను తోడు పెట్టుకుని, సాక్షీ అయ్యి, సదా హర్షితంగా ఉంటూ ముందుకి వెళ్తున్నారు.

### 271. శ్రీమతంలో మన్మతం కలిపితే వచ్చే అపారమైన నష్టం ఏమిటి?

శ్రీమతంలో మన్మతం కలిపితే ప్రాప్తికి బదులు పశ్చాత్తాపం మిగులుతుంది. శ్రీమతంలో మన మనస్సు చెప్పిన మతం అంటే మన్మతం కలపకపోతే చాలా వృద్ధి పొందుతారు. అంతిమసమయం సమీపంగావున్న కారణంగా అనేక జన్మలనుండి చేసిన చెడు కర్మలయొక్క ఫలితం సంస్కార రూపంలో బయటకు వచ్చేస్తాయి. అతిగా వచ్చి అంతమైపోతాయి. వారు ఇలా మారరు, వీరు అలా మీరు మారద్దు అని అనుకోవద్దు. అలాగని వారి ఆధారంగా శ్రీమతానికి విరుద్ధంగా నడువవద్దు. వారిని పరివర్తన చేసే భాధ్యత బాబాది, మీదికాదు.

### 272. సత్యమైన స్థానంలో ఉంటూ, కొంచెమైనా అసత్య కర్మ చేస్తే ఏవిధమైన శిక్ష అనుభవించవలసి వస్తుంది?

శివపరమాత్మ పిల్లలుగా అయ్యి సత్యమైన స్థానం అనగా సేవాకేంద్ర నివాసీయులై కొద్దిగా అయిన అసత్య కర్మ చేస్తే ప్రత్యక్ష శిక్ష సాక్షాత్కారం అవుతుంది. బ్రాహ్మణ పరివారంలో లేదా బ్రాహ్మణ భూమిలో ఉండలేరు. ప్రతీ మచ్చ స్పష్టంగా కనిపిస్తుంది. దాచుకోలేరు. స్వయం తాము చేసిన తప్పుల కారణంగా మనస్సులో అలజడి ఉండి బాబాతో సంబంధం జోడించలేరు. స్వయానికి స్వయమే శిక్ష అనుభవిస్తారు.

### 273. ప్రపంచంలో ఎన్ని రకాల దు:ఖాలు అనుభవిస్తున్నారు?

కొంతమంది శరీరం యొక్క రోగాలతో, కొంతమంది మానసిక ఆందోళనలతో, కొంతమంది భగవంతుడు లభించలేదనే అశాంతితో, కొంతమంది జీవన లక్ష్యం లభించక.... ఇలా అనేక రకాల దు:ఖాలకు వశమై ఉన్నారు. వీరికి మనసా సేవ అనగా శ్రేష్ఠ సంకల్ప తరంగాల ద్వారా వీరిని దు:ఖాల నుండి విడిపించవచ్చు.

### 274. శుభచింతన వలన వచ్చే లాభాలు పేర్కొనండి?

అపకారికి ఉపకారిగా ఉండటం, సంబంధ సంపర్కాలలో ఎటువంటి తమోగుణీ ఆత్మ ఎదురుగా వచ్చినా ఆ ఆత్మ మాయకు వశమైనదని భావించి తన శుభ చింతన ద్వారా వారికి వరదానాన్ని ప్రసాదిస్తారు. వారికి దయ, ప్రేమ, స్నేహం హారాలుగా ఉంటాయి. ఈర్ష్యా భావం ఉండదు.

ఈర్ష్యా భావం లేకపోవడం వలన పాపం తయారవ్వదు మరియు ఇతరుల పాపాలను వారి శుభభావన ద్వారా భస్మం అయ్యేవిధంగా ప్రేరణ ఇస్తారు.

### 275. కల్పమంతా అనగా అన్ని జన్మల్లో గౌరవం పొందాలంటే, ఈ సంగమయుగంలో మనం ఏ స్థితిలో స్థితులై ఉండాలి?

కల్పం అనగా నాలుగు యుగాలలో, 84 జన్మల్లో అందరి ద్వారా గౌరవం పొందాలంటే ఆధారం – ఈ సంగమయుగంలో శ్రేష్ఠ కర్మ చేసి, దాని ద్వారా వచ్చే అల్పకాలిక వినాశి గౌరవాన్ని త్యాగం చేయాలి. గౌరవం ఇవ్వటం అంటే ఒక్క స్థూల విషయంలోనే కాదు, ఇతరులను భగవంతుని దివ్య జ్ఞానం ద్వారా ఉత్సాహ ఉల్లాసాలలోనికి తీసుకువచ్చే విధంగా తయారుచేయాలి. ఇతరులకు గౌరవం ఇవ్వటమే మనం గౌరవం తీసుకోవడం. ఇలా స్వమానంలో, ఆత్మాభిమాని స్థితిలో ఉండి, ఇతరాత్మలని సదాకాలిక పుణ్యాత్ములుగా తయారుచేయండి. ఈ సంగమయుగంలో, ఈ ఒక్క జన్మలో చేసిన ఈ పుణ్య ఫలం కల్పమంతా లభిస్తుంది. అందువలన గౌరవం ఇవ్వటం అంటే ఇవ్వటం కాదు, మనం తీసుకోవటం అని తెలుసుకోండి.

### 276. మొత్తం విశ్వం మనముందు ఎప్పుడు బలిహారం అవుతుంది?

ప్రతీ అడుగులో శివబాబా చెప్పిన జ్ఞానం ఆధారంగా ఎవరైతే నడుస్తారో వారిముందు ప్రపంచం బలైపోతుంది మరియు మాయ కూడా వారి ముందు బలైపోతుంది. మాయ మాటిమాటికి యుద్ధం చేస్తుందంటే గుర్తుంచుకోండి – శివబాబా ఆజ్ఞపై నడవటం లేదు.

### 277. శివబాబా తన సర్వసంపత్తి సహితంగా ఏ పిల్లల ముందు బలిహారం అయిపోతారు?

ఎన్ని పరీక్షలు వచ్చినా గానీ శివబాబా సహాయం చేస్తారని బుద్ధిలో నిశ్చయం గల పిల్లలకి భగవంతుడు బలిహారం అయిపోతారు.

### 278. పరీక్షలు మనకు ఎందుకు వస్తాయి?

పరిపక్వంగా తయారుచేయడానికి మరియు గుణపాఠం నేర్పటానికి పరీక్షలు వస్తాయి.

### 279. కౌరవసేన అనగానేమి?

మాయ యొక్క రకరకాల విభిన్న స్వభావ సంస్కారాలు కలవారందరు కౌరవసేన.

## 280. ధర్మపితలకు, దేవతలకు గల తేడా తెల్పుము?

దేవతలకు సంగమయుగంలో స్వయం భగవంతుని యొక్క శిక్షణ మరియు చదువు లభిస్తుంది. ఆ చదువు ద్వారానే స్వర్గరాజ్య భాగ్యం లభిస్తుంది. ధర్మపితలకి ద్వాపరయుగం నుండి భూమిమీదకు వచ్చే పాత్ర వున్న కారణంగా, ఆ యుగంలో భగవంతుని చదువు, పాలన వారికి లభించవు కానీ వారు భగవంతుడు ఒక్కరే అని విశ్వసించిన కారణంగా, ఆయా యుగాల్లో వారి ద్వారా భగవంతుడైన శివపరమాత్మ గుప్తరూపంలో వారి పేరుని ధర్మ ప్రచారం కొరకు నిమిత్తం చేసారు. కానీ సంగమయుగంలో అందరికీ భగవంతుని చదువు వినిపించినప్పుడు వారివారి శక్తిననుసరించి, ధారణ చేసిన కారణంగా, కొద్దిమంది దేవతలుగా, కొద్దిమంది ధర్మపితలుగా, ఈ అనంతమైన బేహద్ డ్రామాలో కల్పకల్పం, అవినాశిగా ఎవరి పాత్ర వారిది నిర్ణయించబడిపోయింది. ఏ విధంగానైతే ఒక ఖాళీ సి.డిలో ఒక ప్రోగ్రామ్‌ను రికార్డ్ చేస్తే అది సి.డిప్లేయర్‌లో పెట్టినప్పుడు ఆ సిడిలో వున్న ప్రోగ్రాం స్పీకర్ ద్వారా బయటకు వ్యక్తమౌతుంది కదా. అదేవిధంగా మొత్తం సంగమయుగంలో విశ్వంలో అన్ని ఆత్మలకు శక్తి లభిస్తుంది. ఇక ఏ యుగంలోనూ ఎవ్వరికీ భగవంతుని నుండి శక్తి లభించదు.

## 281. శివబాబా హృదయంలో ఉండే ఆత్మల యొక్క విశేషతలు తెలుపండి?

హృదయ సింహాసనాధికారి ఆత్మలు ఏ కర్మ చేసినా, ఏ మాట మాట్లాడినా బాబా ద్వారా వచ్చినట్లుగా అందరి మనస్సులో ఒక స్మృతిచిహ్న రూపంలో నిలిచిపోతుంది. బాబా మహావాక్యాలకు స్మృతిచిహ్నం భగవద్గీత. అలాగే హృదయసింహాసనాధికారీ పిల్లలు ఎవరి గురించి సంకల్పం చేసినా అది వారి మనస్సుకు చేరుతుంది. మీరు ఎవరి పట్లయినా శుభభావన శుభకామన ఉంచుకున్నారనుకోండి, అది వారి మనస్సుకు చేరి వీరు నిజంగా నాపై శుభ భావన శుభకామన పెట్టుకుంటున్నారని వారికి అనిపిస్తుంది. 1) పైపైకి 2) నిమిత్తంగా అయిన కారణంగా గౌరవం ఇవ్వటం (3) మనస్సుతో స్వీకరించటం.

బాబా సమాన పిల్లల యొక్క సంకల్పం కూడా మనస్సుకు చేరుకుంటుంది, బాణంలా గ్రుచ్చుకుంటుంది. ఎలాగైతే పూర్వ రోజుల్లో బాణాలు వేసేవారు కదా! అది దేనికి గ్రుచ్చుకుంటే, అది ఆ బాణంతో సహా క్రిందకు పడిపోతుంది. అదేవిధంగా హృదయ సింహాసనాధికారీ ఆత్మల మనసు యొక్క సంకల్పం ఏ ఆత్మ గురించి చేస్తే ఆ వ్యక్తి స్వయం తన మనస్సులో భావం ప్రకటితం చేసుకోవటానికి ఎదురుగా వస్తుంది. వారు మాట్లాడినవి రెండు మాటలైనా ఇతరుల మనస్సుకి విశ్రాంతి నిచ్చేవిగా ఉంటాయి. వీరు దూరంగా ఉన్నా కానీ అందరూ వీరిని మనస్సుతో జ్ఞాపకం చేసుకుంటూ ఉంటారు. దీనికి గుర్తు ఏమిటంటే వారు మాకు తోడుగా, సమీపంగా ఉన్నారు దూరంగా లేరని అనుభవం అవుతుంది. ఎలాగైతే శివబాబాను మనస్సుతో జ్ఞాపకం

చేస్తే ఎంత ఆనందం అనుభవం అవుతుందో, అదేవిధంగా హృదయసింహాసనాధికారిగా ఉన్న పిల్లలకు అంత శక్తి ఉంటుంది. హృదయ సింహాసనాధికారీ పిల్లల దగ్గరకి ఇతరులు వచ్చినప్పుడు, మాకు పూర్వజన్మలో వీరు సంబందీకులు, వీరు మా పూజ్యులు అని అనుభవం చేసుకుంటారు. హృదయ సింహాసనాధికారీ పిల్లలుగా చాలా కొద్ది మంది అవుతారు. అష్టరత్నాలలో వున్న విశేషత 108లో ఉండదు. వీరిలో తక్కువ శాతం ఉంటుంది. అలాగే అష్టరత్నాలలో కూడా నెంబర్‌వారీగా ఉంటారు.

### 282. ఒకటికి లక్షరెట్లు ప్రాప్తి పొందాలి అంటే ఏ విషయాన్ని ధారణ చేయాలి?

సత్యమైన మనస్సు, స్వచ్ఛమైన బుద్ధి కలిగి ఉండాలి. బుద్ధి స్వచ్ఛంగా అవ్వాలంటే బుద్ధిని బాబా ముందు సమర్పణ చేయాలి. అనగా ప్రతీ కర్మ చేసే ముందు బాబాకి ఆ విషయం తెలియజేయాలి. అప్పుడు భగవంతుడు దివ్యబుద్ధిని ప్రసాదించి మనకు సలహానిస్తారు. ప్రతీ కర్మ చరిత్ర రూపంలో చేయాలి.

### 283. వ్యర్థ సంకల్పాలకి ముఖ్య కారణం ఏమిటి?

వ్యర్థ సంకల్పాలకి ముఖ్య కారణం తగుల్పాటు. మీరు మనస్సు ద్వారా శుభసంకల్పాలు చేయాలి కానీ, వ్యర్థ సంకల్పాలు ఎందుకు వస్తున్నాయి? ఏదొక కోరిక, తగుల్పాటు ఉన్న కారణంగా వస్తున్నాయి.

### 284. మన సంబంధీకులు జ్ఞానాన్ని అర్థం చేసుకోనప్పుడు మనం ఏ విషయాన్ని జ్ఞాపకం చేసుకోవాలి?

సంబంధీకులు జ్ఞానం వినడం లేదు, సాంగత్యం మంచిగా లేదు అందువలన శక్తిశాలీగా కాలేకపోతున్నామని అనుకోకూడదు. శివబాబా ముందుగానే చెప్పారు, ప్రతీ ఆత్మకు తమతమ వేర్వేరు పాత్రలు ఉంటాయి. కొంతమంది సతోగుణీగా, కొంతమంది రజోగుణీగా, కొంతమంది తమోగుణీగా ఉంటారు. రకరకాలైన ఆత్మలతో కూడిన విభిన్నమైన డ్రామా ఇది. ఆత్మలందరి పాత్ర ఒకేలా ఎలా ఉంటుంది? ఒకవేళ ఏ ఆత్మ అయినా తమోగుణీగా అజ్ఞానీ పాత్ర అబినయిస్తుంటే, శుభభావన శుభకామన ద్వారా ఆ ఆత్మకు కూడా శాంతి, శక్తి దానం ఇవ్వాలి కానీ ఆ అజ్ఞానీ పాత్ర చూసి, మీ శ్రేష్ఠ స్థితి యొక్క అనుభవం ఎందుకు మర్చిపోతున్నారు? మీరు ఎందుకు అలజడి అయిపోతున్నారు? సాక్షీగా పాత్రలను చూస్తూ శక్తి దానం ఇవ్వాలి కానీ భయపడకండి. మీ సతో ప్రధాన పాత్రలో స్థితులై ఉండాలి. తమోగుణీ ఆత్మల సాంగత్యం యొక్కరంగు అంటిన కారణంగా, బాబా యొక్క శ్రేష్ఠ సాంగత్యంలో ఉండలేకపోతున్నారు.

ఇంకా ఏమంటున్నారంటే – మా సంబంధీకుల బుద్ధి తాళం తెరువమని బాబాను అడుగుతున్నారు. కానీ బాబా మీ సంబందీకులనే కాక, సర్వ ఆత్మల బుద్ధి తాళం తెరిచే తాళంచెవి అనగా జ్ఞానం మీకే ఇచ్చారు కదా! మీరే తెరవాలి. శివబాబాకు తెలుసు ప్రతీ ఆత్మకు తమతమ సమయంలో పాత్ర ఉంటుందని, కొంతమందికి ఆదిలో , కొందరికి మధ్యలో, కొందరికి అంతిమంలో పాత్ర ఉంటుంది. మీ జీవిత పరివర్తనే వారి జీవిత పరివర్తనకు ఆధారం.

## 285. పూర్వీకులు అనే మాట యొక్క అర్థం పుర్తిగా వివరింపుము?

సృష్టి ఆదిలో దేవతలుగా వచ్చే మనం, సంగమయుగంలో చేసే సంకల్పం, మాట, కర్మ ద్వారా, ఇతర యుగాలలోకి వచ్చే వారి జీవిత చిత్రం బందింపబడి వుంటుంది. కావున రిహార్సల్స్ అయిన తరువాత స్టేజీమీదకు వచ్చి అభినయం చేస్తాం కదా, అదేవిధంగా మీరే మొత్తం సృష్టికి ఆధారమూర్తులు, ఉద్ధారమూర్తులుగా నిర్ణయింపబడతారు. ఏవిధంగానైతే ప్రతీ గృహంలోను పెద్దలైన తల్లిదండ్రులు పిల్లలకు ఆధారం అవుతారో, అదేవిధంగా అందరికీ తండ్రి అయిన శివబాబా మనకు కూడా ఆధారం అవుతారు. మన ఆధారంగానే ఇతరులను కూడా తయారు చేస్తారు.

## 286. శివబాబా తన పిల్లలకు డ్రామా యొక్క రహస్యాలు ఎందుకు ముందుగా తెలియజేస్తారు?

శివబాబా డ్రామా యొక్క రహస్యాలు ముందుగా ఎందుకు తెలియజేస్తారంటే, ఐదువేల సం॥ల ఆత్మ యొక్క అద్భుత చరిత్రలో అనేక పాత్రలు ఉంటాయి. ముందుగా తెలియచేసినప్పుడు, మనం ఏ పాత్రలోకి వెళ్ళాలన్నా వెళ్ళవచ్చు. పురుషార్థం ఆధారంగా, జ్ఞాన రాజయోగాల ఆధారంగా మనం మంచి పాత్ర పొందవచ్చు. ఎవరి నెంబర్ వారే నిర్ణయించుకోవచ్చు. ఎవరి జీవితాన్ని వారే చేతులారా తయారుచేసుకోవచ్చు. నెంబర్ ఇవ్వటానికి భగవంతుడు అందరికీ ఒకేవిధంగా చదువు చెబుతారు. అందుకు డ్రామా పాత్ర గురించి ఆయనపై నెపం లేకుండా ఉండేందుకు ముందుగానే తెలియజేస్తారు.

## 287. బాబా ఎవరికి సహాయం చేస్తారు?

ధైర్యం ఉన్న పిల్లలకే బాబా సహాయం చేస్తారు. అడిగితే ఇచ్చే తండ్రి కాదు. ఒక్క అడుగు ధైర్యంతో శివబాబా చెప్పినట్లు నడవండి, లక్షరెట్లు ప్రాప్తి వర్తమానంలో పొందండి. కేవలం వర్తమాన ప్రాప్తే కాదు భవిష్య ప్రాప్తి కూడా ఉంటుంది. సహాయసాగరుడైన శివపరమాత్మ అందరికీ అడుగకుండానే సహాయం చేయగల సర్వశక్తివంతుడు. కానీ, ధైర్యం అనే విషయాన్ని సాధనంగా ఎందుకు పెట్టుకున్నారంటే అందరికీ న్యాయం చేకూర్చటానికి.

## ౨౮౮. పూజకు ఆధారం ఏమిటి?

పవిత్రత. పవిత్రత ఉన్నవారే భగవంతుని హృదయ సింహాసనంలో ఉంటారు. కొంతమంది దేవతలకు మందిరాలలో పూజ జరుగుతుంది. కొంతమంది దేవతలకు సంవత్సరానికి ఒకసారి మందిరం తెరచి జాతర చేస్తారు. అనగా సంగమయుగంలో జ్ఞానీ-యోగీ ఆత్మలు నిరంతరం అనగా ప్రతీరోజూ బాబా హృదయసింహాసనంలో లేని కారణంగా కొంతమందికి తెల్లవారుఝామునుండి రాత్రి నిదురించే సమయం వరకు రకరకాల పూజలు జరుగుతాయి. ఉదాహరణకు – వేంకటేశ్వరస్వామి ఆత్మ, సంగమయుగంలో సర్వశక్తివంతుడైన శివపరమాత్ముని మనసా, వాచా, కర్మణా ప్రతీ సంకల్పం, ప్రతీ సెకను జ్ఞాపకం చేసుకున్న కారణంగా ఆ పూజ ఆవిధంగా జరుగుతుంది. దీనిని బట్టి దేవతలకు పరమాత్మతో ప్రతీ సమయం బాబాతో సంబంధం అనే పవిత్రత ద్వారా ద్వాపరయుగం నుండి పూజ జరుగుతుంది. ఈవిధి దేవతలకైనా, ధర్మపితలకైనా, మహాత్ములకైనా, పీఠాధిపతులకైనా ఎవరికైనా ఒక్కటే. ఇప్పుడు ఈ భూలోకంలో అందరూ కల్పపూర్వం వలె దేవతలు, ధర్మపితలు, భక్తులు, మహాత్ములు, పీఠాధిపతులు, సాధుసన్యాసులు, మానవులు అందరు జననమరణ చక్రాలలో తిరుగుతూ ఇక్కడే పాత్రను అభినయిస్తున్నారు అని మనకు మరియు శివబాబాకు తెలుసు. అంతిమంలో పైన తెలిపిన వారందరు దేవతా స్వరూపంలో సంపన్నమైన వారి వద్ద నుండి పొందిన శక్తి ఆధారంగా వారి వారి ధర్మాలలో పూజింపబడుతున్నారు. ఇది అనంతమైన డ్రామా యొక్క రహస్యం.

## ౨౮౯. ఒక్కొక్క శక్తిని ఏవిధంగా ధారణ చేయాలి? వాటి వలన వచ్చే లాభం ఏమిటి?

శివపరమాత్మ తెలియజేసిన ప్రతీ వాక్యం, శక్తిని ప్రసాదిస్తుంది. వాక్యాన్ని కేవలం వినడం ద్వారా, వినిపించడం ద్వారా పూర్తి శక్తి రాదు. వాటిని మననం చేసి, మగ్నస్థితిలో కర్మలో ప్రయోగం చేసినప్పుడు శక్తి ప్రత్యక్షం అయ్యి మనకు అనుభవం అవుతుంది. ఉదాహరణకు – సహనశక్తి మన పుణ్యఖాతాను తయారుచేస్తుంది, ఇతరుల పాపఖాతాను భస్మం చేస్తుంది. అది ఏవిధంగా అంటే క్రోధి ఆత్మ ఎదరుగా వచ్చి నిందిస్తున్నప్పుడు, ఈ సహనశీలతాశక్తి వారిని పరివర్తన చేస్తుంది. అదేవిధంగా యోగశక్తి మన వెనుకటి కర్మలఖాతాను భస్మం చేస్తుంది. కేవలం యోగం చేయటమే కాకుండా ప్రయోగం చేయడం నేర్చుకోవాలి. ప్రయోగం ద్వారా ఫలితం వస్తుంది. అప్పుడు ఒకే శివబాబా యొక్క తోడు అనుభవం అవుతుంది. విఘ్నాలు కూడా తొలగిపోతాయి. సముద్రంలో చేపల వేట కోసం వెళ్తే చేపలు దొరుకుతాయి. ఆక్సిజన్ సిలిండర్ సహాయంతో సముద్ర గర్భంలోకి వెళ్తే రత్నాలు లభిస్తాయి. ఈవిధంగా ఈ సంగమయుగంలో సర్వశక్తివంతుడైన శివపరమాత్మ నుండి అనేక శక్తులు జమ చేసుకోండి.

## ౨౮౦. ఇతరులకు మనం ఏవిధంగా సహయోగులు అవ్వాలి?

తనువు, మనస్సు, ధనం, సాధనాల ద్వారా, సేవాకేంద్రాల ద్వారా ఇతరులకు జ్ఞానం ఇవ్వటంలో సహయోగులవ్వాలి లేదా ఏ విషయంలో స్వతంత్రంగా ఉంటే ఆ విషయం ద్వారా సేవలో సహయోగులుగా అవ్వండి. అప్పుడు, ఒకటి మీరు మనస్ఫూర్తిగా చేస్తే మిగిలిన అన్నింటిలో కూడా జమ అయిపోతుంది. ఏవిధంగానైతే, ధనం సంపాదించినప్పుడు దాని ఆధారంగా మనం సుఖంగా జీవించడానికి అన్ని వస్తువులు, వైభవాలు సహజంగా సులువుగా వచ్చేస్తాయి కదా! అదేవిధంగా ఏ ఒక్కదానిలో స్వతంత్రంగా ఉన్నా, ఆ ఒక్క దానిద్వారా శివపరమాత్మ సేవ చేయండి.

## ౨౮౧. సేవలు ఎన్ని రకాలు?

సేవ రెండు రకాలు. 1) మనస్సుతో చేసే సేవ 2) స్వార్థంతో చేసే సేవ. స్వార్థంతో చేసే సేవ ఏవిధంగా ఉంటుందంటే పైకి చూపించడానికి అంటే పేరు, ధనం, పదవి, సాధనాల సుఖం కావాలని కోరికతో ఉంటారు. బీజమే అల్పకాలికమైతే ఫలం కూడా అల్పకాలికమైనదే లభిస్తుంది. సర్వీసు మంచిగా చేసారు అని వీరిని అందరూ పొగుడుతారు కానీ అల్పకాలిక మహిమ యొక్క ఫలం ఎలాఉంటుందంటే, పచ్చి పండు తింటే రుచి మంచిగా ఉండదు కదా అదేవిధంగా, ఆ సేవలో ఆ ఆత్మకు శక్తి రాదు. ఈ కోరిక స్వయంలోను, ఇతరులలోను నిరంతరం సంతుష్టం చేయలేదు. సత్యమైన మనస్సుతో చేసేవారి సేవ, ఏవిధంగా ఉంటుందంటే బలహీన ఆత్మలను శక్తిశాలీగా చేయడం. అవగుణాలున్న ఆత్మనైనా కానీ, శివబాబా ద్వారా లభించిన దివ్యగుణాలతో అలంకరించడం ఇవన్నీ. వారిరువురు కూడా ప్రత్యక్ష ఫలం పొందుతూ ముగ్గిన పండు యొక్క రుచి ఏవిధంగా ఉంటుందో అలా సదాకాలిక ప్రాప్తిని పొందుతారు.

## ౨౮౨. దేవతలు ద్వాపరయుగంలో పూజారి స్థితిలోకి వెళ్ళిపోయినప్పుడు ఏ ఆత్మలు పరంధామం నుండి క్రిందికి వస్తాయి?

ధర్మపితలు క్రిందికి వస్తారు. వీరి రాక ద్వాపరయుగం నుండి ప్రారంభం అవుతుంది. సత్య-త్రేతాయుగాల్లో దేవతలుగా ఉండే మనం పూజారిగా అయ్యి, ఆత్మాభిమాని స్థితిని కోల్పోతాం. అప్పుడు పరంధామం నుండి ధర్మపితలైనా, ఇబ్రహీం, బుద్ధుడు, క్రీస్తు, శంకరాచార్యులు, గురునానక్ మొదలైనవారు వారి సమయం ప్రమాణంగా భూలోకానికి వచ్చి, శరీరాన్ని ధరించి వారివారి ధర్మాలను స్థాపన చేస్తారు.

## ౨౫౩. నిజాయితీ ఆత్మల యొక్క ముఖ్య గుర్తులు తెల్పుము?

నిజాయితీ కలవారు శివబాబా ద్వారా లభించిన ఖజానాలను బాబా ఆజ్ఞ లేకుండా ఉపయోగించరు. నిజాయితీ ఆత్మ ప్రతీ అడుగులో శివబాబా సహాయం ఉన్నట్లుగా అనుభవం చేసుకుంటారు మరియు ఎగిరేకళను అనుభవం చేసుకుంటారు. నిజాయితీ ఆత్మ ఒక్క బాబా విషయాలు తప్ప మిగిలిన ఏ విషయాలను పునాదిగా చేసుకోదు. నిజాయితీ ఆత్మ ఏ విషయంలోను ఈశ్వరునిపై దోషం పెట్టదు.

## ౨౫౪. ఏ ఆత్మ సేవలో విఘ్నరూపంగా అవుతుంది?

వెనుకటి జన్మల నుండి ఉండిపోయిన కర్మలఖాతాను పూర్తి చేసుకోవటంలో ఉన్నారు, కానీ ఆ భారం పెద్దది కాదు. బ్రాహ్మణులుగా అయ్యి లేదా బ్రహ్మకుమారీ, కుమారులుగా పిలువబడుతూ, విశ్వకళ్యాణకారీ, విశ్వ సేవాదారులుగా పిలువబడుతూ వికర్మలు లేదా వికల్పాలు చేసినట్లయితే, ఆ పాపం వందరెట్లు ఎక్కువగా ఉంటుంది. సంస్కారాలకు, స్వభావాలకు, బుద్ధి అభిమానానికి, పేరు గౌరవం కావాలనే స్వార్థానికి, నిర్లక్ష్యం, సోమరితనానికి వశమై బాబా ఆజ్ఞలను అతిక్రమించి ఎంత భారాన్ని ఎత్తుకున్నారు అనే ధ్యాస సదా ఉంచుకోవాలి. జ్ఞానీ ఆత్మలు, సేవాదారులుగా పిలువబడుతూ బాబాకి డిస్సర్వీస్ (అకళ్యాణం) చేసే పనులు కానీ, వాతావరణాన్ని కానీ ఉత్పన్నం చేయడానికి నిమిత్తం కాకూడదు. ఎందుకంటే సేవ చేసారు కానీ ఒకసారి డిస్ సర్వీస్ చేసారంటే, అది పదిసార్లు చేసిన సర్వీస్‌ను సమాప్తి చేసేస్తుంది. ఎలాగైతే రబ్బరు ద్వారా కాగితంపై వ్రాసినదంతా చెరిగిపోతుందో, అలాగే డిస్‌సర్వీస్ ద్వారా పదిసార్లు చేసిన సర్వీస్ ఖాతా సమాప్తి అయిపోతుంది. నేను చాలా సేవ చేస్తున్నానని వారు అనుకుంటారు కానీ ఖాతా అంతా ఖాళీ అయిపోతుంది. కానీ అభిమానానికి వశం కావటంతో స్మృతిలో శక్తిలో, ప్రాప్తి యొక్క అనుభవం అవ్వదు. లోపల సంతుష్టత ఉండదు. ప్రతీ సమయం ఏదొక పరిస్థితి ద్వారా, వ్యక్తి ద్వారా, ప్రకృతి యొక్క వైభవాల ద్వారా స్థితి అలజడి అయిపోతుంది. సంతోషం, శక్తి సమాప్తి అయిపోతాయి. కానీ పైకి మాత్రం ఎంత బాగా ఉంటారంటే, ఇతర ఆత్మలు వారిని పరిశీలించలేని కారణంగా, వారు చాలా సంతోషంగా ఉన్నట్లు, మంచి పురుషార్థులు అనుకుంటారు. కానీ వారికి లోపల అంతా అలజడితో ఉంటారు, పేరు గౌరవం యొక్క ఖాతా నిండుగా ఉంటుంది. కానీ ఖజానాలు అనుభూతుల యొక్క ఖాతా ఖాళీగా ఉంటాయి. కేవలం పేరుకు మాత్రమే ఉంటాయి. ఇటువంటి ఆత్మలు స్వయం విఘ్నాలకు వశం అయిపోయిన కారణంగా, సేవలో విఘ్నరూపంగా అవుతాయి. పేరు విఘ్నవినాశకులు కానీ అయ్యేది విఘ్నరూపంగా.

(1) ఇటువంటి ఆత్మలపై ప్రతీ సమయం పాపభారం ఎక్కువ అయిపోతున్న కారణంగా అనేకరకాలైన మానసిక వ్యర్థ చింతనలు లేక మానసిక అశాంతి వంటి రోగాలు వస్తాయి. (2) బరువు ఉన్న కారణంగా పురుషార్థంలో తీవ్రంగా ముందుకు వెళ్ళలేరు. (3) గుహ్య విషయం

ఏమిటంటే, ఇటువంటి ఆత్మలు విఘ్నరూపమై అకళ్యాణానికి నిమిత్తమవుతారు. బాబాకు అర్పణ చేసిన తనువు, మనస్సు, ఈశ్వరీయ సేవార్థం లభించిన ధనాన్ని, వారి విఘ్నాల కారణంగా వ్యర్థం చేస్తారు. అందువలన బరువు ఎక్కువ అవుతుంది. పాపాల గుహ్యగతిని మంచిగా తెలుసుకోండి. భారం తగ్గంచుకోండి. ధర్మరాజుపురిలోకి వెళ్ళేముందు పరిశీలించుకోండి. పాపం మరియు పుణ్యం యొక్క ఖాతా ఎంత ఉంది? ఏమి జమ చేసుకోవాలి?

**౨౧౫. కుటుంబంలో కొంతమంది జ్ఞానంలో వుండి, జ్ఞానంలో లేనివారు పెళ్ళిచేసుకుంటామంటే మనం ఏ స్థితిలో స్థితులై వారిని రక్షించాలి?**

ఈ చిన్న సంగమయుగంలో దేహ పవిత్రత 21 జన్మల దేవతా శరీరాలను సత్య త్రేతాయుగాలలో లభింపచేస్తుంది. కాబట్టి వివాహం చేసుకోమని మీరు ప్రోత్సహించకండి, రక్షించడానికి ప్రయత్నం చేయండి. బాబా తోడు ఉంటారు. ధైర్యం వున్న పిల్లలకు బాబా తప్పకుండా సహయోగం చేస్తారు. ఒకవేళ వారికే చేసుకోవాలన్న అభిప్రాయం కలిగితే చేయండి కానీ ఆ జీవితం, అల్పకాలిక జీవితం. కొన్ని సంవత్సరాలు మాత్రమే. రక్షించాలనుకున్న పెద్దవాళ్ళు, చేసుకుంటానన్న వారిపై సాక్షీ దృష్టిని పెట్టుకోండి. ఇరువురికి ఇదే బాబా యొక్క ఆజ్ఞ.

**౨౧౬. ఇల్లు కట్టుకోవాలా వద్దా? ఉద్యోగం చేయాలా వద్దా? అని సంశయం వున్నవారికి శివబాబా ఏవిధమైన డైరెక్షన్ ఇచ్చారు?**

ఇల్లు కట్టుకుందామా అనే ప్రశ్నకి సమాధానమేమిటంటే స్వయం పట్ల ఆ ధనాన్ని వినియోగించాలని అనుకుంటున్నారు. బాబా ఆజ్ఞ ప్రకారం అనగా మధ్యస్తంగా అవసరార్థం కట్టుకుంటే అది వ్యర్థం అవ్వకుండా జమా అవుతుంది. అదేవిధంగా ఉద్యోగం చేయాలా? వ్యాపారం చేయాలా అనే విస్తారం యొక్క కోరికలో ఫలం ఎక్కువ రాదు. దీనికి ఉదాహరణగా, బ్రహ్మాబాబా ఉన్న సంపదలోనే తృప్తి పొంది వజ్రాల వ్యాపారం మానివేసి, తన కీర్తి ప్రతిష్టలు, ఐశ్వర్యం అన్నీ శివబాబాకు అర్పణ చేసి సంపూర్ణ సౌభాగ్యం పొందారు. ఉదాహరణగా మనముందు ఆయన ఉన్నారు కాబట్టి మీకు ఎక్కువ ధనం ఉన్నా, తక్కువ ధనం ఉన్నా, మీ మనోభావాలను బట్టి పై రెండు విషయాలపై ధ్యాస పెట్టుకుని ముందుకు సాగిపోండి.

**౨౧౭. ఎవరిలో బాబా కన్పిస్తారు?**

ఎవరైతే సదా బాబా స్మృతిలో ఉంటారో, నాది అనేది లేకుండా త్యాగవృత్తి కలిగి దాత స్థితిలో ఉన్నవారిలో సర్వశక్తివాన్ శివబాబా కనిపిస్తారు.

### ౨౯౮. రివైజ్ కోర్సు యొక్క వివరణ తెలియచేయండి?

జ్ఞానం యొక్క కోర్సు పూర్తయ్యింది. ఇప్పుడు రివిజన్ జరుగుతుంది. ఈ కోర్సుతో ఎంత పోగొట్టుకున్నాం, ఎంత పొందాం అని పరిశీలించుకోండి. ఈ కోర్సు పూర్తయిపోయిన తర్వాత పశ్చాత్తాపం మిగులుతుంది. జ్ఞానాన్ని మననం చేసే వారా లేక ధారణ చేసేవారా అని పరిశీలించుకోండి. ఈవిషయాలన్నీ రివైజ్ కోర్సులో పరిశీలించుకుని పరివర్తన అవ్వండి.

### ౨౯౯. సంకల్పంలో దేహరూపీ సర్పాన్ని తలచుకుంటే వచ్చే అపారమైన నష్టాన్ని తెలియజేయండి?

సంకల్పంలో అనగా ఆలోచనలో ఏ దేహదారులైనా అనగా జ్ఞానంలో ఉన్నవారు , నా పిల్లలు, నా భార్య, నా భర్త, నా సంబంధీకులు, ఈవిషయాలే జ్ఞాపకం వస్తాయి. క్లాస్ టీచర్ అయితే నా విధ్యర్థులు, నాపైనున్న పెద్దవారి ఆజ్ఞ ప్రకారం నడవాలని అనిపిస్తే, శ్రీమతంలో అన్ని విషయాలు స్పష్టంగా ఉన్నప్పటికీ పై విషయాలలో ఇరువురికి ఉన్న అనగా విధ్యార్థులకు, టీచర్‌కు అప్పటి వరకు తనువు, మనస్సు ధనంతో ఎంత సమర్పణ అయినా ఈ దేహదారుల ఆలోచలు రాగానే, పుణ్యం అంతా సమాప్తి అయిపోతుంది. ఏవిధంగానైతే పాము కాటు వేస్తే, సెకండు సమయంలో శరీరం విషపూరితమై, మనిషి చనిపోతారు కదా! అదేవిధంగా చేసుకున్న పుణ్యం అంతా సమాప్తి అయిపోతుందని శివపరమాత్మ కర్మల గుహ్యగతిని తెలియజేస్తున్నారు. ఇప్పుడు గమనించవలసిన విషయం ఏమిటంటే, కుటుంబసభ్యులకు దు:ఖం ఇవ్వకుండా ఉండటం మంచి విషయమే, కానీ వారిపై మోహం తగుల్పాటు ఉండటం జ్ఞానానికి విరుద్ధం. ఎందుకంటే ఇది అంతిమ సమయం కాబట్టి, అందరూ పరంధామానికి వెళ్ళిపోవాలి. కావున సర్వశక్తివంతుడైన తండ్రి ఆజ్ఞ ప్రకారం మనకు ఎవ్వరూ జ్ఞాపకం రాకూడదు. అదేవిధంగా టీచర్ అయినా, ఇన్‌చార్జి అయినా, జోనల్ ఇన్‌చార్జి అయినా, మహారధులుగా పిలువబడేవారైనా బాబా చెప్పిన వాఖ్యాలు తప్ప, ఇతరుల మాటల ఆధారంగా శ్రీమతానికి విరుద్ధంగా ప్రవర్తిస్తే వారి పుణ్యం కూడా సమాప్తి అయిపోతుంది.

### ౩౦౦. బాబా ఎవర్ని పాపాత్ములని అన్నారు? వారికి ఏ విషయంలో వార్నింగ్ యిస్తున్నారు?

సంగమయుగంలో భగవంతుడిచ్చిన జ్ఞానాన్ని గ్లాని చేసేవారికి వార్నింగ్ ఇస్తున్నారు. ఇటువంటివారు పాపాత్ములుగా పరిగణింప బడతారు. జ్ఞానానికి గ్లాని చేయటం అంటే బాబా ఇలా చెప్తారు మనం ఇలా చేస్తే ఎలా ఉంటుంది అనే సంశయ సంకల్పం రావటమే జ్ఞానానికి గ్లాని చేయడం అవుతుంది.

## 301. ఐక్యత అనగా ఏమిటి? పూర్తిగా వివరించండి?

ఐక్యత అనగా కలసి ఉండటం. మనకు నచ్చినవారితో కలసి ఉండటం సహజం. అందరి స్వభావ సంస్కారాలు కలవకపోయినా ప్రయత్నించి మరీ కలుపుకోండి. ఇదే ఐక్యత. ఐక్యత అంటే కేవలం స్థూలమైన సంగఠనే కాదు. బేహద్ సేవ చేసేవారు ఈ రెండు విషయాలలో ధ్యాస ఉండాలి. నృత్యం చేసేటప్పుడు తాళం కలిస్తేనే కదా – ఓహో! ఓహో! అని ధ్వని వస్తుంది, అప్పుడే వీరందరూ ఒక్కరే, వీరందరూ చెప్పే టాపిక్ ఒక్కటే! వీరందరూ ఒకే తండ్రిని ప్రత్యక్షం చేసేవారు అనే మాట వస్తుంది. సమయానికి ముందే ఈవిధమైన పరివర్తన రావాలి. లేకపోతే సమయమే టీచర్‌గా అయ్యి పరివర్తన తీసుకు వస్తుంది. దానిలో మనకు మార్కులు జమ అవ్వవు. తండ్రి చెప్పినప్పుడు పరివర్తన అయితేనే మార్కులు జమ అవుతాయి.

## 302. సంఘఠన రూపంలో ఎక్కడైనా సర్వీస్ చేస్తున్నప్పడు మనం ఏయే విషయాలు ధారణ చేయాలి?

సంఘఠన రూపంలో ఎక్కడైనా సర్వీస్ చేస్తున్నప్పుడు వారి సంస్కారాలను దయా హృదయంతో చూస్తూ కలుపుకోవాలి. మనకు నచ్చని సంస్కారంలో కూడా కళ్యాణం ఇమిడిఉంది. ఎందుకంటే శివబాబా వారిని ఏదొక విశేషత చూసి ఎన్నుకున్నారు. ఎవరిపట్ల వ్యర్థ సంకల్పాలు నడవకూడదు. వ్యర్థం ఎవరికీ వినిపించకూడదు. పెద్దకుటుంబంలో ఏదైనా పొరపాటు జరిగినా దానిని ఎవరికీ చెప్పరు కదా! ఎదుర్కొనే శక్తి జ్ఞానీ–యోగీ ఆత్మల మధ్య ఉపయోగించకూడదు. ఒకరు చెప్తే మరొకరు విని స్వీకరించాలి. పరివారంలో ఇముడ్చుకునే శక్తి ఉండాలి. ఇటువంటి సంగఠన తయారైతే 108 మాల తయారైనట్లే. అప్పుడు సంగఠనపై శివబాబాకి ఉన్న శుభభావన తీరిపోతుంది. పూస వేరు, దారం వేరుగా ఉండకూడదు. విశేషతలు ప్రతీ ఒక్కరిలో ఉన్నా కానీ లాభం ఏమిటి? అందరూ కలవాలి కదా! అప్పుడే పూసలన్నీ దారంలో గ్రుచ్చబడి మాల అయినట్లు.

## 303. మన బలహీనతలు ఎప్పుడు తొలగిపోతాయి?

ఎంతెంత సేవలో సమయాన్ని ఉపయోగిస్తామో అంతంత మన బలహీనతలు తొలగిపోతాయి. ఒకవేళ తనువుని లౌకికంలో ఉపయోగించినా కానీ, మనస్సుని మాత్రం విశ్వసేవలో ఉపయోగిస్తే మన బలహీనతలు తొలగిపోతాయి. ఎందుకంటే అనేక ఆత్మలు ఈ జ్ఞానం వినడం ద్వారా శాంతిశక్తిని అనుభవం చేసుకోవడం ద్వారా వారి ఆశీర్వాదాలు మనకు లభిస్తాయి. అవే మనకు పురుషార్థం కంటే ఎక్కువ పుణ్యఖాతా లభించేలా చేస్తాయి. అప్పుడు మనకు సంతోషం లభిస్తుంది.

## 304. ప్రపంచం వారందరి నోట ఏ మాట రావాలని బాబా ఆశిస్తున్నారు?

స్వయం భగవంతుడు శివబాబా వీరిని ఇంత అదృష్టవంతులుగా తయారుచేసారనే మాట రావాలి. ఈ సంస్థ మంచి కార్యం చేస్తుందనే మాట శివబాబాను ప్రత్యక్షం చేయలేదు. నిమిత్త ఆత్మలు ప్రత్యక్షం అవుతారు.

## 305. మాతల గురించి బాబా ఏవిధంగా తెలిచేసారు?

ఎవరైనా మీకు దు:ఖాన్ని ఇచ్చినా, నింద చేసినా స్వీకరించకుండా శివబాబాను స్మృతి చేసుకోండి. వారి యొక్క నింద మిమ్మల్ని బాబాకు దగ్గరకు చేయడానికి నిమిత్తం అవుతుంది. ఈ కళ్యాణకారీ యుగంలో ఏవైనా పరిస్థితులు వచ్చినా, ఆ పరిస్థితులను చూడకుండా, ఆ పరిస్థితిలో దాగి వున్న రహస్యాన్ని గమనించండి. ఆ రహస్యమేమిటంటే, వెనుకటి జన్మలలో (63 జన్మలలో) మీరు ఎవరికైనా దు:ఖం గాని, నింద గాని ఇచ్చినా అది ఇప్పుడు వేరొకరి ద్వారా తిరిగి మనకు వస్తుందని గమనించండి. అప్పు తీరిపోవడం మంచిదే కదా! దేవతలు అంటే ఇచ్చేవారు కానీ తీసుకునేవారు కాదు కదా!

## 306. స్మృతిచిహ్నాల గురించి బాబా ఏవిధంగా తెలియజేశారు?

స్మృతిచిహ్నం అనగా జ్ఞాపకార్థం. సంగమయుగంలో శివబాబా తోడుతో మరియు స్మృతిలో చేసిన కర్మ ద్వాపరయుగంలో ఇతిహాసాల రూపంలో లిఖించబడుతుంది.

## 307. బాబాను పొందిన ఆత్మ నుండి ఏ మాట వస్తుంది?

పొందవలసినదంతా పొందేశాము, ఇక పొందవలసినదేమీ లేదు అనే మాట వస్తుంది.

## 308. సంగమయుగం యొక్క విశేషత ఏమిటి? దేనిని సాధారణ కర్మ అంటారు? దేనిని శ్రేష్ఠ కర్మ అంటారు?

సంగమయుగం యొక్క విశేషత – ఇప్పుడిప్పుడే త్యాగం, ఇప్పుడిప్పుడే భాగ్యం. కర్మలో ధర్మం లేకపోతే అది సాధారణ కర్మ. ధర్మం అనగా జ్ఞానం యొక్క ధారణ. ఆ ధారణ ఆదారంగా కర్మ చేస్తే అందులో ధర్మం ఉన్నట్లు. జ్ఞాన ధారణ, దివ్యగుణాల ధారణ ఉంటే, సంగమయుగంలో అసంభవం కూడా సంభవం అయిపోతుంది. శ్రేష్ఠ కర్మ అనగా దాత యొక్క గుణాలతో చేసే కర్మ. దాత యొక్క గుణం ధారణ చేస్తే వారికి ప్రకృతి కూడా దాసీ అయిపోతుంది. ప్రపంచం వారందరూ సేవార్థం అన్ని సాధనాలు సమర్పణ చేసేస్తారు. సంగమం యొక్క ముఖ్యమైన విశేషత ఏమిటంటే – గుడ్డి గవ్వగా ఉన్న ఆత్మలను వజ్ర సమానంగా చేస్తుంది. లౌకికంవారు, బయటివారు, కర్మలో ధర్మం వదలినా అది వేరే విషయం కానీ, జ్ఞానీ–యోగీ ఆత్మలుగా పిలువబడే బ్రాహ్మణులు మాత్రం ధర్మాన్ని వదలకూడదు.

### ౩౦౯. బ్రాహ్మణులుగా పిలువబడేవారు అనగా జ్ఞానీ-యోగీ ఆత్మలు జ్వాలారూపీ తపస్సు ఎందుకు చేసుకోలేకపోతున్నారు?

సర్వదివ్యగుణాలతో, శక్తులతో సంపన్న ఫలంగా తయారవుతున్న సమయంలో కోరిక అనే పక్షి ఆ ఫలాన్ని ఎంగిలి చేస్తుంది. అనగా కోరికలు మిగిలి ఉన్న కారణంగా జ్వాలారూపంగా యోగం చేయలేకపోతున్నారు. ఉదాహరణకి ఒక వ్యాపారస్తునికి ఒక డబ్బున్న స్నేహితుడు ఉదారభావంతో వ్యాపారం చేసుకోవడానికి కొంత ధనం అప్పుగా ఇస్తాడు. అప్పు తీసుకుని చేసేవారి వ్యాపారం వృద్ధిలోనికి వచ్చినప్పుడు, అప్పిచ్చిన పెద్దమనిషి ఇంకా ఎక్కువ ధనం ఇచ్చి వ్యాపారం వృద్ధి చేయమన్నప్పుడు దురాశతో రెండోవసారి పెట్టుబడి పెట్టిన వ్యక్తి యొక్క అప్పు తీర్చకపోతే ఎంత మోసం చేసినట్టు, అదేవిధంగా మన త్యాగానికి ఫలితంగా డ్రామా మనకి ఎక్కువ సదుపాయాలను సమకూర్చినప్పుడు ఆ సదుపాయాలను విశ్వసేవలో ఉపయోగించకుండా, స్వయానికి ఉపయోగించుకుంటే అది చాలా నష్టం, మొత్తం ప్రాప్తిని పోగొట్టుకున్నవారిగా అవుతారు. ఇటువంటి ఆత్మలు జ్వాలారూపీ తపస్సు అనుభవం చేసుకోలేవు. కోరికలు జ్వాలారూపంగా అవ్వనివ్వవు కాబట్టి వీరు ఇతరుల కోరికలను తీర్చలేరు. బికారి అయిన వారు బికారికి దానం ఇవ్వలేరు కదా! అలాగే స్వయంలోనే కోరికలు ఉంటే ఇక ఇతరుల కోరికలను ఎలా తీరుస్తారు!

### ౩౧౦. ప్రతీ కార్యం ఏవిధంగా ప్రారంభించాలి?

ప్రతీ కార్యంలో చేసి చేయించేవారు శివబాబా అనుకుని ప్రారంభించాలి. కర్మ పూర్తయిన తర్వాత సఫలత లేదా ఓటమిని కూడా మనదిగా భావించకుండా బాబాకి అర్పణ చేయాలి. ఇదే భగవంతుని మీద ఉన్న స్నేహానికి గుర్తు.

### ౩౧౧. దేనిని మధువనం అంటారు?

ఎక్కడ ఒకే స్థానంలో ఉన్న అందరి సంకల్పాలు ఏకరసంగా ఉంటాయో మరియు బేహద్ వైరాగ్యవృత్తి కలిగి ఉంటారో ఆ స్థానమే మధువనం అని శివబాబా తెలియజేస్తున్నారు. ప్రతీ విదేశీ, స్వదేశీ స్థానాలు ఈవిధంగా తయారుచేసుకుంటే, అక్కడికి శివ పరమాత్మ వస్తారు. దృష్టి, వృత్తి ద్వారా ఎవరో ఒక శ్రేష్ఠ ఆత్మని ఆధారంగా చేసుకుని ఇతరులకు శక్తినిస్తారు. మధువనం అయినా, గ్రామమైనా, పట్టణమైనా, మన ఇల్లు అయినా ఈవిధంగా తయారుచేసుకుంటే, బాబా ఆ స్థానంలో అద్భుతం చేసి చూపిస్తారు. ఇవి భవిష్యత్తులో జరుగబోయే అద్భుతాలు.

## 312. సూక్ష్మాతిసూక్ష్మమైన త్యాగం అని దేనిని అంటారు?

మీరు శివబాబా యొక్క జ్ఞానం చెబుతున్నప్పుడు మిమ్మల్ని కూడా శివబాబాతో పాటు మహిమ చేస్తారు. అప్పుడు మీకు సూక్ష్మంగా అహంకారం వస్తుంది. ఆ అహంకారం రాకుండా త్యాగం చేసుకుంటూ శివబాబా ఈ పొగడ్త కూడా నీ వలన వచ్చింది కావున తిరిగి నీకే అర్పితం చేసేస్తున్నాను అనే భావనలో ఉండాలి. ఇదే అన్నింటికంటే సూక్ష్మాతి సూక్ష్మమైన త్యాగం. మీరు వద్దన్నా కానీ ఇతరులు మీ గుణగానం చేస్తారు కానీ మీరు దానిని స్వీకరించకూడదు.

## 313. సంకల్పం ద్వారా కూడా పాపం ఏవిధంగా వస్తుంది?

సంకల్పం ద్వారా కూడా పాపం వస్తుంది. సంకల్పంలోనైనా కానీ స్వయంలో బలహీనత అంటే ఏదైనా వికారం ఉంటే అది కూడా పాపఖాతాలో జమ అయిపోతుంది. కానీ ఇతరాత్మల పట్ల సంకల్పాలలో అయినా కానీ ఏ వికారానికైనా వశీభూతం అయితే అది కూడా మహాపాపం. ఇతర ఏ ఆత్మ గురించి అయినా వ్యర్థంగా మాట్లాడితే అది కూడా పాపఖాతాలో జమ అవుతుంది. అలాగే కర్మ అంటే సంబంధ సంపర్కాలతో కూడా మీ గురించియైనా శుభభావనకు బదులు ఇక ఏ భావన ఉన్నా అది కూడా పాపఖాతాలో జమైపోతుంది. ఎందుకంటే ఇది కూడా దు:ఖం ఇవ్వటం. శుభభావన పుణ్యఖాతాను పెంచుతుంది. వ్యర్థ భావన, ఈర్ష్య, అసూయ పాపఖాతాను పెంచుతుంది. అందువలన బాబాకు పిల్లలుగా అయ్యారు, వారసత్వానికి అధికారిగా అయ్యారు, పుణ్యాత్మలుగా అయ్యారు ఈ నిశ్చయం మరియు నషా మంచిదే, కానీ నషా మరియు గర్వం రెండింటిని కలపకూడదు. బాబావారిగా అయిన తర్వాత లెక్కలేనంత ప్రాప్తి కానీ చెడు కర్మ చేస్తే పాపం కూడా వందరెట్లుగా తయారవుతుంది. అందువలన సోమరిగా అవ్వవద్దు. బాబాని, వారసత్వాన్ని తెలుసుకున్నారు, బ్రహ్మకుమారులుగా పిలువబడుతున్నారు. అందువలన ఇప్పుడు పుణ్యమే పుణ్యం. పాపం సమాప్తి అయిపోయింది లేదా సంపూర్ణం అయిపోయామని ఆలోచించవద్దు. బ్రహ్మకుమారీ-కుమారుల జీవితం యొక్క నియమాలను కూడా ధ్యాసలో ఉంచుకోండి. సదా మర్యాదలను ఎదురుగా ఉంచుకోండి. పుణ్యం, పాపం రెండింటి జ్ఞానాన్ని సదా బుద్ధిలో ఉంచుకోండి, పరిశీలించుకోండి. పుణ్యాత్మగా పిలువబడుతూ, మనసా వాచా కర్మణా ఏ పాపం చేయలేదు కదా! ఏ ఖాతా జమా అయ్యింది, ఏ నడవడిక ద్వారా బాబాకు మరియు జ్ఞానానికి చెడుపేరు తీసుకురాలేదు కదా! అని సదా పరిశీలించుకోండి. బాబా వద్ద ప్రతీ ఒక్కరి ఖాతా స్పష్టంగా ఉంటుంది కానీ స్వయం ముందు కూడా స్పష్టం చేసుకోండి, మీకు మీరు దాటవేయకండి. ఇది ఇలా అవుతూనే ఉంటుంది, ఇది అందరిలోనూ ఉంది అని. అందరిలో ఉన్నా కానీ మనం రక్షణగా ఉండాలి. అటువంటి శుభభావన ఉంచుకోండి అప్పుడు విశ్వ సేవాధారిగా కాగలరు. సంగఠిత రూపంలో ఏకీమతం మరియు ఏకీరస స్థితిని అనుభవం చేసుకోగలరు. ఇప్పటివరకు

పాపఖాతాను జమచేసుకుంటే, ఎప్పుడు సమాప్తి చేసుకుంటారు. ఇతరాత్మలను, పుణ్యాత్మలుగా చేయడానికి ఎలా నిమిత్తం అవుతారు. అందువలన సోమరితనంతో పాపఖాతాను తయారుచేసుకోవడం ఆపండి. సదా పుణ్యాత్మ భవ! అనే వరదానం తీసుకోండి. అజ్ఞాని ఆత్మలు సూక్తి చెబుతారు కదా – చెడు వినకండి! చెడు చూడకండి! చెడు ఆలోచించకండి! అని. కానీ ఇక్కడ బాబా చెబుతున్నారు. వ్యర్థం వినకండి – వ్యర్థం వినిపించకండి! శుభ మాటలు మాట్లాడండి. వ్యర్థాన్ని కూడా శుభభావనతో వినండి. సైన్సు సాధనాలు చెడు వస్తువులను కూడా మంచిగా పరివర్తన చేస్తున్నాయి. మరి మీరు సదా శుభచింతకులు. సర్వాత్మల మాటలను, భావనలను పరివర్తన చేయలేకపోతున్నారా? సదా భావం మరియు భావనను శ్రేష్ఠంగా ఉంచుకోండి. అప్పుడు సదా పుణ్యాత్మగా అవుతారు. స్వయం పరివర్తన అవ్వండి కానీ ఇతరుల పరివర్తన గురించి ఆలోచించండి. స్వ పరివర్తనయే ఇతరుల పరివర్తన, దీనిలో మొదట నేను అని ఆలోచించండి. ఈ మరజీవగా అవ్వటంలోనే మజా! దీనినే మహాబలి అంటారు. భయపడకండి! సంతోషంతో చనిపోండి. ఈ చనిపోవడం అంటే జీవించడం. ఇదే సత్యమైన జీవదానం.

**314. సామాన్య కర్మలలో మహాన్‌గా ఎప్పుడు తయారవుతాము?**

మనం చేసే ప్రతీ కర్మ ఇతరులకు చూడటానికి సామాన్యంగా అనిపించవచ్చు. కానీ లోపల మనస్సులో శివబాబా స్మృతి నడుస్తూ ఉంటే అది మహాన్ కర్మగా మారిపోతుంది. స్థూలంగా బట్టలు ఉతుకుతున్నా, సామాన్లు శుభ్రం చేస్తున్నా మనస్సులో బాబా స్మృతి చేస్తుంటే అది శ్రేష్ఠ కర్మ అవుతుంది. ఇతరులకు మన ముఖం ద్వారా వ్యక్తం అయిపోతుంది. భవిష్యత్తులో విశ్వమహారాజు, విశ్వ మహారాణిగా కాబోయేవారు ఈ స్థూలసేవ చేస్తున్నట్లుగా ఇతరులు అనుభూతి చేసుకోవాలి. సాధారణ కర్మలో స్మృతి లేకపోతే అది లౌకిక కర్మగా పరిగణింపబడుతుంది.

**315. ఈశ్వరీయ పరివారంలోకి వచ్చిన ఆత్మకి ఏముంటుంది? దానిని ఉపయోగిస్తే వచ్చే పరిణామం ఏమిటి?**

శివపరమాత్మ యొక్క జ్ఞానంలోకి వచ్చిన ప్రతీ యొక్క ఆత్మకు ఏదొక విశేషత తప్పకుండా ఉంటుంది. ఆ విశేషతను ఇతరులను ఈశ్వరీయ జ్ఞానంలోకి తీసుకురావడానికి ఉపయోగిస్తే, ఒకటికి లక్షరెట్లు పెరుగుతుంది. ఆ విశేషత అనేక సమయాలలో ఫలం ఇవ్వడానికి యోగ్యంగా అవుతుంది. ఒక విత్తనం నాటితే దాని ద్వారా వృక్షం పెరిగి ఎన్ని ఫలాలు వస్తున్నాయి? విశేషతను సేవలో ఉపయోగించకపోతే ఫలం రాదు.

### 316. పరోపకారి ఆత్మల యొక్క విశేషతలను తెలుపుము?

పరోపకారీ ఆత్మ సర్వ ఖజానాలలో సంపన్నంగా ఉన్న కారణంగా మీరు ఇంతిస్తే, నేను ఇంతిస్తాను, నేనే వంగి ఉండాలా? ఎప్పటి వరకు ఎంత వరకు చేస్తాం? అనే అడుక్కునే మాటలు ఈ ఆత్మ నోటి వెంట రావు. ప్రతీ ఆత్మలో గుణాలనే చూస్తారు. ఎవరిలో బలహీనతలు, అవగుణాలున్నా వాటిని తమ శుభభావనతో సహయోగం యొక్క కామనతో అవగుణాలను చూస్తూ కూడా గుణవంతులుగా అయ్యే శక్తిని దానమిస్తారు. ఒకవేళ మీ సహయోగీ అక్కయ్య లేదా అన్నయ్య, అల్పకాలిక వస్తువులను సదాకాలిక ప్రాప్తిగా భావించి అల్పకాలిక పేరు గౌరవాలను, ప్రాప్తిని కావాలని కోరిక ఉంచుకుంటే, ఆ సమయంలో వారికి గౌరవం యిచ్చి మనం నిర్మాణంగా ఉండాలి. ఇదే పరోపకారం. ఇలా ఇవ్వటమే మనం సదాకాలికంగా తీసుకోవడం. చిన్నపిల్లలు ఏదైనా వస్తువును పాడుచేస్తుంటే పనికిరాని వస్తువుని చేతికి ఇచ్చి ఆ పనికి వచ్చే వస్తువుని మెల్లగా తీసుకుంటాము కదా! అలాగే అల్పకాలిక ప్రాప్తిని ఆశించే బ్రాహ్మణ ఆత్మకు, వారికి కావలసినది యిచ్చి మనం నిర్మాణంగా ఉంటే, కొంత సమయం తర్వాత ఆ ఆత్మ ఇది అల్పకాలికం అని తెలుసుకుంటుంది. ఇటువంటి దయా స్థితి కలవారినే పరోపకారి అంటారు.

### 317. ఏవిధమైన సంశయాలు మనకు ఉండకూడదు?

వినాశనం అవుతుందో లేదో, భగవంతుడు చెప్పింది నిజమో కాదో, ప్రపంచంలోని వారికి నిశ్చయంతో చెబుదామా వద్దా? ఇంకా ధనం జమ చేసుకుందామా లేక సేవలో ఉపయో గించుదామా? కుటుంబాన్ని సంబాళించుకుందామా లేక సేవలో ఉందామా? ఆఖరుకు ఏమౌతుందో? భగవంతుడు నిరాకారుడు కానీ మనం సాకార శరీరంలో ఉన్నాం కదా! ఇలా వ్యర్థ సంకల్పాల యొక్క తుఫానులను స్వయమే రచించుకుంటున్నారు, అలజడి అయిపోతున్నారు. నిశ్చయం అనే పునాదిని కదిపివేసుకుంటున్నారు. ఇటువంటి తుఫానులు రానివ్వకండి. ఇవి మర్రి ఊడలతో సమానం. మర్రి ఊడలు మనం నిప్పు అంటించకుండానే ఒకదానికొకటి రాచుకుని అగ్ని రాజుకుంటుంది.

### 318. ఏవిధమైన మాట ఇతరుల నుండి వస్తే బాబా ప్రత్యక్షత జరుగుతుంది?

ఆది నుండి అంతిమం వరకు అందరూ చేసిన సేవా పటాలు బాబా చూసారు. సేవ మంచిగానే చేసారు కానీ మీరు ప్రత్యక్షం అయ్యారు, మీ కర్తవ్యం ప్రత్యక్షం అయ్యింది. ఇతరులకు వారసత్వం ఇచ్చేది శివబాబానా? లేక మీరా? ఇప్పుడు అందరి నోటి వెంట శివబాబా వచ్చారు, ఆయనే మా అందరికి ఆత్మిక తండ్రి. ఇప్పుడు స్వయంగా సర్వశక్తివంతుడైన భగవంతుని కర్తవ్యం నడుస్తుంది అన్న మాట వచ్చినప్పుడే శివబాబా ప్రత్యక్షం అవుతారు. అప్పుడే వినాశనం పూర్తవుతుంది.

### 319. వర్తమానంలో శాంతిశక్తి ఏ అద్భుతాన్ని చూపిస్తుంది?

1) ఇతరుల మనస్సు యొక్క భావాలను అర్థం చేసుకోవడానికి శాంతిశక్తి ఒక్కటే ఉపయోగ పడుతుంది. (2) మనం ఒక స్థానంలో ఉండి శాంతిశక్తి ద్వారా ఇతర ఆత్మల దు:ఖం, అశాంతి, టి.విలో చూస్తున్నట్లుగా మన కళ్ళకు ప్రత్యక్షంగా కనిపిస్తాయి. టి.విని కరెంట్‌తో అనుసంధానం చేసి మీట నొక్కినప్పుడు, ఎక్కడోవున్న దృశ్యాన్ని దగ్గరగా చూపిస్తుంది కదా! అలాగే మనం శివబాబాతో సంబంధం జోడించి, శ్రేష్ఠ భావన, శ్రేష్ఠకామన అనే మీట నొక్కితే దూరంగా ఉన్న ఆత్మలను సమీపంగా అనుభవం చేసుకుని శక్తినివ్వవచ్చు. మనలో శాంతిశక్తిని ఎప్పుడు పెంచుకోగలం అంటే వ్యర్థాన్ని ఇముడ్చుకుని, సమర్థాన్ని ప్రత్యక్షం చేసినప్పుడు. అప్పుడు ఇతరాత్మలు దూరంగా ఉన్నా కానీ, మీ సంకల్ప శక్తిని గ్రహించి మీ ముందుకు వచ్చి, మాకు సరైన మార్గం చూపించారని అంటారు. ఎందుకంటే అంతకు ముందు మీ దివ్య స్వరూపం వారికి స్పష్టంగా కనిపిస్తుంది. ఈ శక్తిని ప్రయోగం చేయడానికి మనం సర్వబంధనాల నుండి ముక్తి అయ్యి స్వతంత్రంగా ఉండాలి.

### 320. పుణ్యాత్మ యొక్క విధులు తెలుపుము?

పుణ్యాత్మ యొక్క ప్రతీ సంకల్పం అతి శీతలంగా ఉంటుంది. వికారాల అగ్నిలో కాలిపోతున్న ఆత్మలను శీతలం చేస్తుంది. పుణ్యాత్మ ప్రతీ ఒక్కరికి ఏదొక శక్తి అనే ఖజానాని దానం చేస్తూ ఉంటుంది. పుణ్యాత్మ నోటినుండి అమూల్య జ్ఞాన రత్నాలే వెలువడుతాయి. పుణ్యాత్మ స్వయంగా శివబాబా శక్తి ఆధారంగా నడుస్తున్న కారణంగా ఆ శక్తి కిరణాలు విశ్వం నలువైపులా వెదజల్లబడతాయి.

### 321. అంతిమంలో ఏ దేవతల దగ్గర రోజురోజుకీ క్యూ పెరుగుతుంది?

పాండవులకి స్మృతిచిహ్నం అయిన హనుమంతుని వద్ద మరియు జ్వాలాముఖీ తపస్సులో నిమగ్నమైన వైష్ణవదేవి దగ్గర పెద్ద వరుస (క్యూ) ఉంటుంది. రోజురోజుకీ క్యూ పెరిగిపోతుంది. వీరిరువురి ద్వారా అందరికి గతి-సద్గతి లభిస్తుంది.

### 322. సంగమయుగంలో ఏయే వికారాలు ఏయే విధంగా పరివర్తన అయిపోతాయి?

కామ వికారం శుభకామన రూపంలో మారిపోతూ మీ తీవ్రపురుషార్థానికి సహయోగి అవుతుంది. క్రోధాగ్ని, ఈశ్వరుని సంపదను కాల్చేస్తుంది. ఆవేశరూపంలో వచ్చి అందరిని స్పృహ లేకుండా పడిపోయేలా చేస్తుంది కదా – ఇది కూడా ఆత్మిక సంతోష రూపంలో పరివర్తన అవుతుంది.

అనగా సహనశక్తి రూపంలో ఒక అస్త్రంగా పరివర్తన అయిపోతుంది. ఆ క్రోధాగ్ని పరివర్తనై మనల్ని, ఇతరులను కాల్చకుండా, ఇరువురిలో పాపాలను భస్మం చేస్తుంది. అలాగే, లోభం అనగా కావాలి కావాలి అనే భావన తొలగి, మనదంతా బేహద్ సేవలో ఉపయోగించాలనే భావనగా మారిపోతుంది. ఎవరినుండైనా తీసుకోవాలనే కోరిక, అందరికి ఇవ్వాలనే శుభ భావనలోనికి మారిపోతుంది. ఈ లోభం అనేది అనాశక్తి వృత్తిలోనికి, దాత స్వరూపం యొక్క స్మృతిలోకి పరివర్తన అయిపోతుంది. మోహ వికారం స్నేహ స్వరూపంలోకి పరివర్తన అయిపోతుంది. ఈ స్నేహమే స్మృతి మరియు విశేష సేవలో సాధనంగా పరివర్తన అవుతుంది. అలాగే అహంకారం అనే వికారం దేహమనే అభిమానం నుండి ఆత్మాభిమాని స్థితియొక్క వృద్ధి కళలోనికి పరివర్తన అవుతుంది. ఈవిధంగా మాయ యొక్క ఐదురూపాలు ఐదు సహయోగిరూపాల్లోకి పరివర్తన అవుతాయి.

### 323. సిద్ధి పొందకపోవడానికి కారణం ఏమిటి?

ఒకే శివపరమాత్మపై సర్వసంబంధాల తోడు సదా లేని కారణంగా సిద్ధి ఆగిపోతుంది. మధ్యమధ్యలో ఏదొక ఆత్మను తోడు తీసుకున్న కారణంగా కూడా సిద్ధి పొందటానికి ఆటంకం వస్తుంది.

### 324. సూర్యవంశీయులు, చంద్రవంశీయుల తేడా తెలుపండి?

సూర్య వంశీయులనగా సదాకాలికంగా విజయం పొందేవారు. చంద్రవంశీయులనగా అప్పుడప్పుడు విజయీలు.

### 325. ఏయే విషయాలకి మార్కులుంటాయి?

ఆత్మ యొక్క నిజ సంస్కారం పవిత్రత. జన్మ తీసుకున్న దగ్గర నుండి అంతిమం వరకు సంకల్పంలో కూడా అపవిత్రత సంస్కారాలు రాకూడదు. ప్రతీ ఒక్కరు ఆత్మ, అందరూ నా సోదరులు అనే భావన ఉంటే మనసా పవిత్రతకి మార్కులు లభిస్తాయి. వాచా పవిత్రతలో మార్కులు లభించాలంటే సత్యత మరియు మధురత ఉండాలి. కర్మలో మార్కులు లభించాలంటే సదా నమ్రత, సంతుష్టత ఉండాలి. వీరు ఎల్లప్పుడు హర్షిత ముఖంతో ఉంటారు.

### 326. జ్ఞానం యొక్క విశేషతలను తెలుపుము? ఆ జ్ఞానం వున్నచోట వచ్చే లాభమేమిటి?

జ్ఞానధనం అన్ని ధనాలకీ రాజు వంటిది. ఎందుకంటే ఇతర శాస్త్రాల్లో జ్ఞానాన్ని గుప్తం చేసేసి దేహదారులు రచించారు. కానీ ఈ జ్ఞానం స్వయం భగవంతుడు అవతరించి తెలియజేసారు. ఈ జ్ఞాన ధనాన్ని ఎవరైతే పంచిపెడుతూ ఉంటారో వారికి స్థూలధనం నీడలాగ అడగకుండానే ఎక్కువగా సమకూరుతుంది. ప్రయోగం చేసిచూడండి అనగా జ్ఞాన ధనాన్ని పంచిపెట్టి చూడండి.

### 327. జ్ఞానాన్ని అగౌరవపర్చడం అంటే ఏమిటి?

భగవంతుడు మన జీవితం అంతా ఎలా నడవాలో శ్రేష్ఠ సలహా ఇచ్చారు. ఆ సలహాను వదిలివేసి, మన మనస్సు చెప్పినట్లు, ఇతరులు చెప్పినట్లు నడిస్తే భగవంతుని యొక్క జ్ఞానాన్ని అగౌరపరచినట్లు. భగవంతుడు ఈ చదువు ద్వారా స్వర్గాన్ని స్థాపన చేస్తున్నారు, సూక్ష్మంగా భగవంతుడు చెప్పిన మహావాక్యాలపై అచంచలమైన నిశ్చయం లేకపోతే ఆ స్వర్గభాగ్యాన్ని కాలదన్నుకున్నట్లు. సూక్ష్మ సంకల్పంలో శివబాబాను అగౌరపరచినట్లు జమ అయిపోతుంది.

### 328. సంగమయుగం ప్రత్యక్ష ఫలాన్నిస్తుందా; లేదా? వివరించండి?

సంగమయుగం ప్రత్యక్ష ఫలాన్ని తప్పకుండా ఇస్తుంది. ఎందుకంటే భగవంతుడు భాగ్యవిధాతగా ఈ భూలోకంలో అవతరించి ఒక ప్రతిజ్ఞ చేశారు. అదేమిటంటే – ఒకటి ఇవ్వండి లక్షరెట్లు పొందండి. భవిష్యత్తు కంటే వర్తమానమే విశేషమైనది. కానీ ఇక్కడ బాగా గుర్తుంచుకోవలసిన విషయం ఏమిటంటే, అన్నీ వచ్చిన తర్వాత, ప్రేమ, గౌరవం, సాధనాలు వచ్చిన తర్వాత ఇవి వర్తమానంలోకి రావడానికి ఆధారమైన భగవంతుడిని మర్చిపోతే పొందినవన్నీ సమాప్తి అయిపోతాయి. ముమ్ముందు కూడా ఎక్కువ జమ కాదు. ఒక వ్యాపారస్తుడు అవసర సమయంలో అప్పు ఇచ్చిన వ్యక్తి అప్పు తిరిగి చెల్లించకపోతే, అతనిపై కోర్టులో దావా వేసి తప్పకుండా నెగ్గుతాడు. అలాగే భగవంతుడు మనం ఒకటి ఇస్తే వర్తమానంలో లక్షరెట్లు సహయోగి అయిపోతారు. కానీ వాటిని తిరిగి విశ్వ సేవలో ఉపయోగించాలి. మనం త్యాగం గొప్పదనుకుంటున్నాం కానీ త్యాగం ద్వారా వచ్చిన భాగ్యం చాలా గొప్పది. ఇప్పుడు అందరూ మీ త్యాగాన్ని గుణగానం చేస్తున్నారు కానీ భగవంతుడు ఇచ్చిన మీ భాగ్యాన్ని వారు గుర్తిస్తే వారు కూడా భాగ్యవంతులు అయిపోతారు.

### 329. వాయుమండలం యొక్క ప్రభావం దేనిమీద పడుతుంది? దాని పరివర్తన ఏ విధంగా చేయాలి?

వాయుమండలం మన వృత్తి అనగా మన ఆలోచన ఆధారంగా తయారవుతుంది. కానీ సంగఠిత రూపంలో అందరూ ఒకే వృత్తి కలిగి ఉంటే విశ్వ పరివర్తనా కార్యం సంపన్నం అయిపోతుంది. ఎవరికి వారు వేరుగా ఉండి చేయటం గొప్ప విషయం కాదు. అందరూ కలిసి చేయాలి.

### 330. భార్యభర్తలు జ్ఞానంలో వచ్చినప్పుడు నియమాల విషయాలలో లోపం జరిగినా, ఆ లోపం యొక్క విషయాలు ఎవరికి చెప్పాలి? ఎవరికి చెప్పకూడదు?

జ్ఞానంలోనికి భార్యభర్తలలో ఒక్కరే వచ్చినప్పుడు నియమాల విషయంలో లోపంగా వున్నా, ఇతర జ్ఞానీ ఆత్మలకు ఎవరికీ చెప్పకూడదు. ఎందుకంటే వారు ఒకరి ద్వారా మరొకరికి అలా అందరికీ

వ్యాపింపచేస్తారు. అప్పుడు అందరూ మిమ్మల్ని బలహీనంగా చూస్తారు. భగవంతుడు ఒక్కరికే చెప్పండి. ఆయనే దానికి తీర్పునిస్తారు. కొంతసమయం మీరు శ్రేష్ఠ సంకల్పం ద్వారా పురుషార్థం చేసుకొండి. కొంతసమయం తర్వాత రెండవ వారికి బాబా గురించి పూర్తిగా తెలుపండి. స్వర్గ భాగ్యం గురించి కూడా వారికి పూర్తిగా తెలుపండి. సంగమయుగం యొక్క ప్రత్యక్ష ఫలితాన్ని గురించి కూడా పూర్తిగా తెలుపండి. అప్పుడప్పుడు గానీ, ప్రతీ గురువారం కానీ, మీతోపాటు వారిని సెంటర్‌కు తీసుకువెళ్ళండి. ఈరోజు సద్గురువు వచ్చిన పవిత్రమైన రోజని ప్రేమగా చెప్పి తీసుకువెళ్ళండి. ఇలా కొంతకాలం గడచిన తరువాత ఆత్మ పవిత్రతతో పాటు శరీర పవిత్రత గురించి కూడా తెలియపరచండి. ఈవిధంగా వారిని పావనం చేయడానికి మీ ప్రయత్న లోపం లేకుండా బాబా చెప్పినట్లు తెలియపరచండి. వారి భాగ్యంలో ఉంటే, డ్రామాలో ఉంటే పరివర్తనై, బాబాతోపాటు మీకు కూడా సహయోగీ అవుతారు. లేకపోతే వారితో మీరు లోక ధర్మంగా నడచుకోండి. మీకు పాపం అంటదు. వారిని వేరుచేసి దు:ఖం ఇవ్వకండి. బాబాకి జ్ఞానానికి ఈ నియమం ఆధారంగా చెడ్డపేరు తీసుకుని రాకండి.

**331. రాబోయే సత్యయుగ ప్రపంచం ఏవిధంగా ఉంటుంది? పూర్తిగా వివరించండి?**

సర్వ ప్రాప్తులు ప్రతీ ఒక్కరి జీవితంలో నలువైపుల తిరుగుతూ ఉంటాయి. నలువైపుల వైభవాల యొక్క ఖజానా నిండి ఉంటుంది. సదా సంతోషం యొక్క బాజాలు స్వతహాగానే మ్రోగుతూ ఉంటాయి. మ్రోగించాల్సిన పని ఉండదు. మీ రచన అయిన గాలి విశ్వపతి అయిన మీ ముందు ఆకులను కదలించడం ద్వారా రకరకాల పాటలు పాడతాయి. వృక్షాల ఆకులు కదలటం, ఊగడం ద్వారా రకరకాల గానాలు వస్తాయి. పక్షుల యొక్క మాటలు రకరకాల పాటలుగా ఉంటాయి. చైతన్య బొమ్మలుగా అనేక రకాలైన ఆటలు చూపిస్తాయి. ఈరోజుల్లో మనోరంజనం కోసం రకరకాల మాటలు చిలుకలకు నేర్పిస్తారు కదా! అలాగే అక్కడ పక్షులు రకరకాల సుందర మాటలద్వారా మీ యొక్క అజ్ఞానుసారంగా మనోరంజనం చేస్తాయి. ఫలాలు రకరకాల రసాలు కల్గి ఉంటాయి. ఇక్కడ వేర్వేరుగా ఉప్పు, కారం, పంచదార ఉంటాయి కానీ అక్కడ స్వతహాగానే ఫలాలు రకరకాలైన రసాలను ఇస్తాయి. అక్కడ పంచదార ఫలాలు ఉంటాయి కానీ పంచదార మిల్లులు ఉంటాయి. ఏ రుచి కావాలంటే అది సహజంగానే ఫలం ద్వారా తయారుచేసుకోవచ్చు. ఇక్కడ వలె ఆకుకూరలు ఉండవు. ఫలాలు, పూలు, కూరగాయలు ఉంటాయి. పాలు నది వలె ప్రవహిస్తూ ఉంటాయి. స్వతహాగానే అన్ని రసాల ఫలాలు తినడానికి, త్రాగడానికి వేర్వేరుగా ఉంటాయి. శ్రమతో రసం పిండవలసిన అవసరం లేదు. కొబ్బరి బొండాం నీరు త్రాగుతారు కదా! అలాగే ప్రతీ ఫలం అంత నిండుగా ఉంటాయి. చేతిలోనికి తీసుకుని కొంచెం వ్రేలుతో నొక్కగానే రసం త్రాగేయవచ్చు. స్నానం చేయడానికి నీళ్ళు పర్వతాల నుండి మూలికలను రాసుకుంటూ ప్రవహించి వస్తాయి. అందువలన నీరు స్వతహాగానే సువాసనతో ఉంటుంది, సెంట్ వేయ వలసిన పనిలేదు. అక్కడ

అమృతవేళ టేప్ రికార్డర్ మేల్కొల్పదు. పక్షుల ధ్వని సహజంగానే పాటలుగా ఉంటాయి. దీని ద్వారా మీరు మేల్కొంటారు. అక్కడ చాలా ఉదయాన్నే మీరు మేల్కొంటారు, అక్కడ మీరు అలసిపోవటం ఉండదు. ఎందుకంటే చైతన్య దేవీ దేవతలు ఉదయమే మేల్కొన్నదానికి గుర్తుగానే భక్తులు కూడా ఉదయమే మేల్కొంటారు. ఏమి కష్టమైన పనులుండవు. బుద్ధికి కూడా పని ఉండదు. ఏ బరువు ఉండదు. అందువలన అక్కడ నిద్రపోయినా మేల్కొన్నా రెండూ సమానమే! అక్కడ చదువు కూడా ఒక ఆట. ఆటలు ఆడుకుంటూ చదువుకుంటారు. రాజధాని యొక్క జ్ఞానం అయితే ఉండాలి కదా! అందువలన రాజవిద్యే చదువు. కానీ అక్కడ ముఖ్య సబ్జక్టు చిత్రలేఖనం. చిన్నవారు, పెద్దవారు అందరూ చిత్రకారులే! పాటలు, చిత్రలేఖనం, ఆటపాటలు అంటే గాయన విధ్య ఉంటుంది. అక్కడ చరిత్ర అంతా కవితల రూపంలో సంగీతలా ఉంటుంది. ఇక్కడలా ఏదీ బోర్ కొట్టే విధంగా ఉండదు. నాట్యాలు కూడా చేస్తారు కానీ సినిమాలు ఉండవు. నాటకాలు ఉంటాయి. నాటకాలు హాస్యంగా ఉంటాయి. చాలా నాటక కళాశాలలు ఉంటాయి. ఆక్కడ మహల్స్‌లో విమానాలు వరుసలో ఉంటాయి మరియు విమానాలు నడపటం కూడా అతి సహజంగా ఉంటుంది. అణుశక్తి (సూర్యరశ్మి) ఆధారంగా అన్ని పనులు జరుగుతాయి. ధనం బంగారునాణాల రూపంలో ఉంటుంది. దుకాణదారులు, కోనుగోలుదారులు అనే మాట ఉండదు. అందరూ యజమానులే అనే భావన ఉంటుంది. కేవలం పరస్పరం వస్తు మార్పిడి చేసుకుంటారంతే. ఎవరికీ ఏ లోటు ఉండదు. ప్రజలకు కూడా ధనం తమ శరీర నిర్వాహణార్థం కంటే కోటిరెట్లు నిండుగా ఉంటుంది. స్నేహంలో యిచ్చిపుచ్చుకుంటారు. లెక్కాచారాలు, ఖాతా పుస్తకాలు ఉండవు. రత్నజడిత వాయిద్యాలు చాలా సహజంగా ఉంటాయి. వ్రేలు వాటిపై పెట్టగానే మ్రోగుతాయి. దుస్తులైతే చాలా మంచివి ధరిస్తారు. ఎటువంటి కార్యమో అటువంటి రకరకాల దుస్తులు ధరిస్తారు. అలంకరణ కూడా చాలా రకాలుగా ఉంటుంది. రకరకాల కిరీటాలు, నగలు ఉంటాయి కానీ బరువు లేకుండా దూదికంటే తెలికగా సత్యమైన బంగారంతో ఉంటాయి. వాటిలో వజ్రాలు రకరకాల కాంతులను విరజిమ్ముతూ ఉంటాయి. బంగారపు వజ్రాల లైట్ల మెరుపుతో మహల్ అంతా మెరిసిపోతూ కనిపిస్తుంది. సూర్య కిరణాల ద్వారా వజ్రాలు, బంగారం వేల లైట్లలాగ మెరుస్తూ ఉంటాయి. వైర్లు అవి పెట్టుకోవలసిన పని లేదు.

భాష కూడా చాలా శుద్ధమైన హిందీ ఉంటుంది. ప్రతీ శబ్దం వస్తువుని సిద్ధి చేసే బాష ఉంటుంది. విదేశాలు కేవలం విహరించే విహార స్థలాలుగా కొద్ది దేశాలే మిగిలిపోతాయి. విమానాన్ని ప్రారంబించగానే ధ్వని వేగం కంటే ముందుగా వెళ్ళి పోతాయి. బుద్ధి విమానం సంకల్పం అంత వేగంగా ఉన్నాయా? సంకల్పం చేయగానే సూర్యచంద్రులకు , విఘ్నాలకు అతీతంగా మీ ఇంటికి చేరుకోవాలి. వ్యర్థ సంకల్పాలనే పర్వాతానికి ఢీకొనకుండా ప్రమాదాలకు అతీతంగా బుద్ధి రూపీ విమానం ఉండాలి. మొదట ఈ విమానం ఎక్కినప్పుడే ఆ విమానం లభిస్తుంది. అలా సదా తయారుగా ఉన్నారా అని శివబాబా అడుగుతున్నారు.

**332. బాబా యొక్క లీలలు ఏవిధంగా ఉంటాయి?**

మీరు ఈ సాకార లోకంలో శాంతిశక్తితో సూక్ష్మవతనాన్ని తయారుచేసుకుంటే, బాబా యొక్క విచిత్రమైన లీలలు తెలుసుకుంటారు. బాబా మీ వద్దకు వస్తారు, ఒక్కొక్కసారి మనల్ని తన దగ్గరకు తీసుకువెళతారు. ఒక్కొక్కసారి తనతోపాటు వెంటపెట్టుకుని విశ్వసేవ చేయిస్తారు. భక్తులకు ఇష్టదేవతలుగా సాక్షాత్కారం చేయించడానికి మిమ్మల్ని భక్తుల దగ్గరకు తీసుకువెళతారు. ఎందుకంటే కొంతమంది భక్తులు వారి ఇష్టదేవత సాక్షాత్కారం కావాలని మొండిగా ఉంటారు. కాబట్టి వారికి మీ ద్వారా ఆ దేవత యొక్క సాక్షాత్కారం చేయిస్తారు. సదా స్నేహి, సహయోగి పిల్లలకు చెవిలో మంత్రం చెప్పినట్లుగా కొన్ని విషయాలు తెలియజేసి, కొన్ని అద్భుతమైన కార్యాలను చేయిస్తారు. ఇలా ఒక్క సెకనులోనే అనేక మందితో అనేక రకాల కార్యాలు చేయిస్తారు.

**333. శివబాబాకి ప్రపంచం అంతా చూడటానికి ఎంత సమయం పడుతుంది?**

దివ్యదృష్టి అనే టి.వి ద్వారా ఒక సెకను పడుతుంది.

**334. విశ్వంలో ఉన్న ప్రతీ ఆత్మకి సౌభాగ్యం, ప్రాప్తి, ప్రాలబ్ధ జీవితం సంగమయుగంలోనే వస్తుందా? లేక ఇతర యుగాలలో కూడా వస్తుందా?**

విశ్వంలో ఉన్న ప్రతీ ఆత్మకి సౌభాగ్యం, ప్రాప్తి, ప్రాలబ్ధ జీవితం సంగమయుగంలోనే వస్తుంది. ఎందుకంటే సంగమ యుగంలో భగవంతుడు అవతరించి విశ్వంలో ఉన్న ప్రతీ ఆత్మకి వారివారి పురుషార్థం యొక్క శక్తిననుసరించి సౌభాగ్యం, ప్రాప్తి, ప్రాలబ్ధ జీవితం ఇస్తారు. ఈ యుగంలో తప్ప భగవంతుడు మరే యుగంలో అవతరించరు. ఏ యుగంలోనే ఎవ్వరికీ ఏమి భగవంతుడు ఇవ్వరు. ఏవిధంగానైతే మూల స్థానం నుండి ప్రయాణం మొదలు పెడుతుందో, అది తప్పకుండా అంతిమ గమ్యస్థానం చేరిపోతుంది. మధ్యలో తిరిగి వెనక్కు రాదు కదా! అలాగే ప్రపంచంలో ఉన్న కోటానుకోట్లలో ఒకరైన దేవాత్మలకు, ధర్మాతలకు, మహాత్ములకు, సామాన్య మానవులందరికి పైన చెప్పిన మూడు శక్తులు వారి శక్తిననుసరించి నెంబర్‌వారీగా శివబాబా ఇస్తారనేది సత్యం. కానీ దేవతలు భగవంతుని చదువు చదువుకుని, ధారణ చేసి, దివ్యగుణాలు పొందుతారు. కానీ ధర్మపితలు ఈ సంపూర్ణమైన దేవతల ద్వారా కొంత శక్తిని పొందుతారు కానీ డైరెక్ట్‌గా భగవంతుని నుండి పొందలేరు. అందుచే వారు పరంధామం నుండి క్రిందకు వచ్చినప్పుడు దేవతలలో దాగివున్న ఒకే భగవంతుని సంస్కారం ధర్మపితలు సంగమయుగం యొక్క అంతిమంలో సంపూర్ణ దేవతా స్వరూప ఆత్మల దగ్గర పొందిన కారణంగా తిరిగి అదే శక్తిని భగవంతుడు పరలోకంలో ఉన్నా కానీ, భగవంతుడు సబ్‌కా మాలిక్ – యజమాని ఒక్కరే అని వారివారి ధర్మాల స్థాపన ద్వాపరయుగం నుండి చేస్తున్నారు. కానీ సంగమయుగంలో వారు శివభగవాన్ పాలన, చదువు పాటించని

కారణంగా, అంతిమంలో తెలుసుకున్న కారణంగా, ద్వాపరయుగం నుండి వారి శక్తి అద్భుతరూపంలో పప్రత్యక్షమవుతూ ఉంది. సత్య త్రేతాయుగాలలో ఉన్న దేవతలు ద్వాపర యుగం వచ్చేటప్పటికి దేవతా స్థితిని కోల్పోయి, వారి విగ్రహాలను వారే పూజచేసుకుంటారు. ఇక్కడ గమనించవలసిన ముఖ్య విషయం ఏమిటంటే, ద్వాపరయుగం నుండి జన్మలు తీసుకుంటున్న భక్తి ఆత్మలకు, ప్రజ ఆత్మలకు భగవంతుడు ఒక్కడే అని చెప్పడానికి ధర్మ పితలు నిమిత్తం అయ్యారు కానీ దేవతలు కాదు. ఏవిధంగానైతే, టి.వి కనిపెట్టలేనప్పుడు, రేడియో విశేష పాత్ర అభినయిస్తుందొ అదే విధంగా ఒక్కొక్క యుగంలో ఒక్కొక్క విశేష ఆత్మలు ప్రఖ్యాతి కలిగి ఉన్నారని శివబాబా తెలియజేస్తున్నారు. వీరందరూ సంగమయుగంలో మాత్రమే కల్ప, కల్పం వ్యక్తిగతంగా శివబాబా నుంచి శక్తిని పొందుకుంటారు

**335. మాయపై దయ చూపించడం అంటే ఏమిటి?**

ఎవరైనా ఏదైనా చెడుపని చేస్తున్నవారిపై దయ చూపిస్తే మాయపై దయ చూపిస్తున్నట్లే! ఇటువంటి సమయంలో నియమపూర్వకంగా నడవాలి కానీ వారితో తగుల్పాటు ఉండటం వలన నియమపూర్వకంగా ఉండరు పైగా వారిపై దయ చూపిస్తున్నాం అంటారు. ఇది సత్యమైన దయ కాదు. మీ దయ వారి మాయను ఇంకా ప్రోత్సహిస్తు ఉంటుంది. అందువలన ఇటువంటి దయాహృదయులుగా అవ్వకూడదు. మానవులు చెడు కర్మలు చేసి ఏదో రూపంగా కర్మభోగాన్ని అనుభవిస్తున్నప్పుడు భగవంతుడు దయ చూపించడు కదా! ఉదాహరణకు దొంగతనం చేసే ఒక దొంగ, దొంగతనం ద్వారా వచ్చిన కొంత ధనాన్ని భగవంతునికి అర్పితం చేసుకుని ఇంకా దొంగతనాల్లో ఇంకా లాభం రావాలని కోరుకుంటారు. ఇలా కొంత సమయం వరకు వాటా ఇస్తూ వెళతాడు. కానీ ఒక సమయంలో పట్టుబడతాడు. ఆ సమయంలో భగవంతుని వేడుకున్నా కానీ విడిపించడానికి సహయోగిగా అవ్వడు. ఒకసారి అతనికి సహయోగి అయితే అతను ఆ విషయాన్ని చులకనగా తీసుకుని గజదొంగ అయిపోతాడు. మొదట వాటా పెట్టినప్పుడు భగవంతుడు ఎందుకు సహయోగి అయ్యాడంటే, ఆయన స్మృతి ద్వారా కొంత సమయానికి మారిపోతాడని భావించి ఆలోచించి ఇటు అపకారం, ఉపకారం లేకుండా సాక్షిగా ఉంటారు. అదేవిధంగా మీరు కూడా జ్ఞానులపై గాని, బయటివారిపై గాని, మాయకు వశమైనట్టు మీకు కనపడిన వెంటనే వారిని ఆయా విషయాలలో అప్రమత్తం చేయండి.

**336. బాబా మన దగ్గర అన్ని ఎందుకు తీసుకుంటారు?**

తీసుకున్న వాటిని కోటిరెట్లు చేసి ఇవ్వటానికి. శివబాబాకి మనం ఇచ్చేది ఏదీ అవసరం ఉండదు. శివబాబా దగ్గర ఉన్నదంతా పిల్లలకు ఇవ్వటానికే.

**337. ఎక్కడైనా ఏదైనా కష్టమనిపిస్తే బాబాను ఏ రూపంలో స్మృతి చేయాలి?**

వరాలిచ్చే వరదాత రూపంలో జ్ఞాపకం చేసుకోవాలి. అప్పుడు కష్టాలన్నీ తీరిపోతాయి.

**338. శరీరాన్ని మనం ఏవిధంగా నడిపించాలి?**

ఇది పాత శరీరమని ఎప్పుడూ భావించవద్దు. బాబా సేవకు నిమిత్తమైన శరీరంగా మీరు సదా భావించాలి. అప్పుడు శరీరానికి ఆరోగ్యం, మీకు ఆనందంగా ఉంటుంది. పాతది, పాతది అనే సంకల్పం శరీరాన్ని ఇంకా బలహీనంగా చేస్తుంది.

**339. సంగమయుగంలో ఒక బ్రాహ్మణ ఆత్మ ద్వారా వేరొక బ్రాహ్మణ ఆత్మ యొక్క కర్మలఖాతా పూర్తవడం వలన వచ్చే లాభం ఏమిటి?**

జ్ఞానంలో నడుస్తున్నవారికి కూడా సూక్ష్మవతనంలో అనగా ధర్మరాజపురిలో ఖాతాలు సమాప్తి చేసుకోవాలి. ఒక బ్రాహ్మణ ఆత్మ వేరోక బ్రాహ్మణ ఆత్మను సత్యంగా ఉన్నా కూడా అసత్యంగా చిత్రీకరించినప్పుడు, సత్యంగా ఉన్న బాహ్మ్రణాత్మ యొక్క అతిసూక్ష్మ ఖాతాలు అసత్యంగా చిత్రించిన బ్రాహ్మణ ఆత్మకు బదిలీ అవుతాయి. అప్పుడు సత్యంగా ఉన్న బ్రాహ్మణాత్మకు సూక్ష్మవతనంలో ధర్మరాజపురిలో శిక్ష ఉండదు. కాబట్టి బ్రాహ్మణ పరివారంలో ఇలా జరుగుతుందేమిటి, వీరింత భయంకరంగా మారిపోయారని చింతించవలసిన పనిలేదు. బ్రాహ్మణుల ఖాతా, బ్రాహ్మణుల ద్వారానే ఇక్కడే పూర్తవుతుంది అనే సంతోషంలో ఉండండి. ఇది కూడా ఒక సూక్ష్మాతిసూక్ష్మమైన లెక్క.

**340. యోగం యొక్క ప్రయోగం ఏయే విషయాలలో చేయాలి?**

శాంతిశక్తికి ఆధారం శుభసంకల్పం. శరీరం యొక్క వ్యాధులపై ప్రయోగం చేసి చూడండి. అనగా శాంతిసాగరుడైన శివపరమాత్మ నుండి శక్తి తీసకున్నట్లుగా అనుభవం చేసుకుని, శరీర అవయవాలపై ప్రయోగం చేసి చూడండి. ఇలా కొన్ని రోజులు చేసినచో కర్మబంధన మధుర సంబంధం రూపంలోకి మారిపోతుంది. బందనాలు ఎప్పుడూ చేదుగా ఉంటాయి. సంబంధాలు సదా మధురంగా ఉంటాయి.

**341. ఇప్పుడు సేవ కోసం నలువైపులకి వెళ్తున్నాం. ముమ్ముందు ఎటువంటి సేవ లభిస్తుంది?**

ఇప్పుడు సేవ కోసం ఇల్లు అద్దెకి తీసుకుంటున్నాము. నలువైపులా వెళ్ళి సేవ చేస్తున్నాము. ముమ్ముందు మీ స్థానం దగ్గరకు ఇతరులు వస్తారు. వారు వేదిక తయారుచేసి మిమ్మల్ని ఆహ్వానిస్తారు. ఈ సేవకు ఆధారం శాంతిశక్తి.

## 342. ప్ర. పత్రికల ద్వారా, విలేకరుల ద్వారా ఎవరైనా జ్ఞానంలోకి వస్తే ఏవిధమైన లాభం పొందుతారు?

పత్రికలవారు మన జ్ఞానం యొక్క విషయాలు పేపరులో వేస్తారు. వారు రారు కానీ కొంతమందిని వచ్చేలా చేస్తారు. అయినా ఇక్కడ ఒక సూక్ష్మ నియమం ఉంది. పత్రికలవారు రాకపోయినా కానీ వారు ద్వారా వచ్చేవారు జ్ఞానంలో ఉన్నతి అవుతుంటే, వారి పుణ్యంలో కొంతభాగం పత్రికలవారికి చెందుతుంది. మున్ముందు ఆ పుణ్యం పత్రికలవారిని కూడా బాబా దగ్గరకు చేరుస్తుంది. కనుక ప్రతీ ఆత్మను శివబాబా దగ్గరకు తీసుకునిరండి.

## 343. ఎవరిని సుపుత్రులు, ధైర్యవంతులు అంటారు? జ్ఞాన స్థానాలు ఎక్కడెక్కడ ఉండాలి? ప్రతీ ఇంటిలో ఎవరుఉండాలి?

జ్ఞాన స్థానాలు పట్నాలు, పల్లెలలోనే కాకుండా సందు సందులో, వీధి వీధిలో ఉండాలి. ప్రతీ ఇంటిలో దేవతా చిత్రాలు ఉంటాయి కదా అదేవిధంగా ప్రతీ ఇంటిలో చైతన్యమైన జ్ఞానీ ఆత్మ ఉండాలని శివబాబా ఆశిస్తున్నారు. ఆ ఒక్కజ్ఞానీ ఆత్మ ద్వారా ఆ ఇల్లు శివాలయం అవుతుంది. ఇలా ధైర్యంతో ఇంటిని శివాలయం చేసుకున్నవారే సుపుత్రులు, ధైర్యవంతులు మరియు బాబా ఆశను పూర్తి చేసేవారు.

## 344. మనల్ని ఇతరులు ఎప్పుడు ముందుపెడతారు?

మనం ఎప్పుడైతే మన దగ్గర వున్నవారిని సేవలో మనస్ఫూర్తిగా ముందు ఉంచుతామో అప్పుడు మనల్ని కూడా వారు ముందు ఉంచుతారు. శివబాబా మాతలను ముందు ఉంచిన కారణంగా గవర్నమెంటు వారు కూడా అన్ని విషయాలలో స్త్రీలకు ప్రాముఖ్యత ఇస్తున్నారు.

## 345. భగవంతుడి నుండి ఖజానాలు ఎందుకు లభించాయి?

ఇతరులకు పంచిపెట్టుట కొరకు. స్వయానికి ఉపయోగించుకోవడానికి కాదు.

## 346. సంగమయుగంలో ఏ రోజు గొప్ప రోజు?

సంగమయుగంలో ప్రతీరోజూ గొప్పరోజు, చెడురోజు అనేది లేదు. ఎందుకంటే సంగమయగం భగవంతుడు అవతరించిన యుగం. కావున జ్ఞానంలో ఉన్నవారు బయటివారితో ఏ కార్యానికైనా ముహూర్తం పెట్టించుకోవలసిన అవసరం లేదు. మనస్సులో సత్యంగా శివబాబాను ఆహ్వానించి ఏ కార్యాన్నైనా ప్రారంభించవచ్చు.

**347. సమర్పణ అయితే వచ్చే లాభమేంటి? సహయోగిగా ఉంటే వచ్చే లాభమేమిటి?**

తనువు, మనస్సు, ధనంతో సమర్పణ అయితే శ్రేష్ఠ ప్రాప్తిని పొందుతారు. కేవలం సహయోగి అయితే స్వర్గంలో ప్రజలుగా జన్మ పొందుతారు.

**348. సంగమయుగంలో ఉన్నతోన్నతమైన శక్తి ఏమిటి? అది పొందితే వచ్చే లాభం ఏమిటి?**

సంగమయుగంలో ఉన్నతోన్నతమైన శక్తి భగవంతుని జ్ఞానం. దానిని కర్మలో పెట్టి అనుభవం చేసుకున్నప్పుడు, దివ్యగుణాలు వస్తాయి మరియు మాయ యొక్క రకరకాల రూపాల నుండి దూరం చేస్తాయి.

**349. ఏది అద్భుతం?**

సేవాకేంద్రాలలో ఉండటం గొప్ప విషయం కాదు, ఎక్కడ ఉన్నా కానీ, విశేష పాత్రధారిగా అయ్యి, విశేష పాత్రను అభినయించడం గొప్ప విషయం, అదే అద్భుతం. ఉదాహరణకు ప్రజాసేవ చేయాలంటే రాజకీయ నాయకులుగా అవ్వవలసిన అవసరం లేదు కదా! మన చుట్టుప్రక్కల ఉన్న ప్రజలకు భిన్నభిన్న రూపాలలో సహయోగం చేయటం కూడా గొప్ప విషయమే!

**350. బంగారు సంకెళ్ళు అని దేనినంటారు?**

సంగమయుగంలో ప్రతీ బ్రాహ్మణాత్మ చేసే కార్యం, శ్రేష్ఠకార్యంగా పరిగణించబడుతుంది. కానీ ఎప్పుడైతే నేను చేసాను అనే భావన ఉత్పన్నమవుతుందో, అప్పుడు బంగారు సంకెళ్ళలో చిక్కుకున్నట్టుగా భావించండి. సంకెళ్ళు బంగారంతో చేసినా ఇనుముతో చేసినా బందింపచేస్తాయి కదా! అలాగే హద్దు యొక్క కోరికలన్నీ సంకెళ్ళ లాంటివి.

**351. సోమరితనం వలన వచ్చే నష్టం ఏమిటి?**

సోమరితనం కూడా సహజ పురుషార్థంగా భావిస్తారు, కానీ పైకి గొప్పగా ఉంటారు. లోపల మనస్సు తినేస్తూ ఉంటుంది. కాబట్టి సోమరితనాన్ని ఆదిలోనే త్రుంచేయండి.

**352. అన్ని విషయాలు శివబాబా చేయగలరు కానీ మనల్ని ఎందుకు నిమిత్తం చేసారు?**

అందరిచేత చేయించేవారు శివబాబాయే! ఆయన కర్మఫలానికి అతీతుడు కాబట్టి కర్మ యొక్క ఫలాన్ని మనకు ఇవ్వటం కోసం మనల్ని నిమిత్తం చేసారు.

**353. సేవ చేసేటప్పుడు ఎటువంటి ఆత్మలను తయారుచేయాలి?**

లక్షణాలు కలిగినవారు కావాలి, వారు వారసులుగా స్వర్గంలోకి వస్తారు. రాజధాని కాబట్టి ప్రజలుగా వచ్చేవారు కూడా కావాలి.

**354. ఆత్మ ఎప్పుడు ఏది కావాలంటే అది చేయగలదు? ఆ స్థితి పొందటానికి ఏ శక్తి అవసరం?**

ఆత్మ పవిత్రతా శక్తి ద్వారా ఏది కావాలంటే అది చేయగలదు. ఇక్కడ పవిత్రత అంటే ఒక్క శివబాబాతో సర్వసంబందాలు పెట్టుకోవడం.

**355. గవర్నమెంట్ వారు కుమారులను ఏవిధంగా గుర్తిస్తారు?**

సిఐడిలను పంపించి కోపం తెప్పిస్తారు కావున క్రోధముక్తులుగా అవ్వాలి.

**356. అక్కయ్య, అన్నయ్య కంటే ఏవిధంగా పిల్చుకుంటే దృష్టి, వృత్తి చంచలం కాకుండా ఉంటాయి?**

శివశక్తి స్వరూపంగా అనుభవం చేసుకోవాలి అనగా ప్రతీ ఒక్క ఆత్మ శివబాబా సంతానంగా, శక్తిస్వరూప ఆత్మగా అనుభవం చేసుకుంటే దృష్టి, వృత్తి చంచలం కాదు. అక్కయ్య, అన్నయ్య అని బయటివారు కూడా పిలుచుకుంటారు. ఇక్కడ అక్కయ్య, అన్నయ్య అని పిలుచుకున్నా కానీ శివశక్తి స్వరూపంలో మనం వారిని చూడాలి.

**357. పూజకు ఆధారం ఏమిటి?**

పూజకు ఆధారం నాలుగు సబ్జక్టులలో (జ్ఞానం, యోగం, ధారణ, సేవ) పవిత్రత అనగా నాలుగు సబ్జక్టులను శ్రీమతం ఆధారంగా ధారణ చేయడం. శ్రీమతంలో మన్మతం కలిపి కర్మ చేస్తే పూజ కూడా ఆవిధంగానే ఉంటుంది. అనగా మన విగ్రహాలకు ద్వాపరయుగం నుండి భక్తులు పూజ చేసేటపుడు పైపైకి చూపించటానికి చేస్తారు. మనస్ఫూర్తిగా చేయరు.

**358. బ్రాహ్మణ ఆత్మలు ఏయే విషయాలలో కమలపుష్ప సమానంగా ఉండాలి?**

దు:ఖ సమయంలో అనగా ధనం లేదని దు:ఖం, రోగం ఆధారంగా దు:ఖం, మనస్సులో వ్యర్థ అలజడి ద్వారా దు:ఖం, ఇతరుల స్వభావ సంస్కారాల ద్వారా వచ్చే దు:ఖం, ఇవి మనస్సుని తనవైపుకు లాగేసుకుంటాయి. ఆ సమయంలో కమలపుష్ప సమానంగా దు:ఖానికి అతీతంగా మన మనస్సుని ఉంచాలి. కమలపుష్పం కాండం బురదలో ఉంటుంది. పుష్పం బురదకు అతీతంగా

ఉంటుంది. అదేవిధంగా మనం దు:ఖమయ పరిస్థితుల్లో ఉన్నా, మనస్సు మాత్రం బాబా స్మృతిలో అతి తేలికగా అంటే మన అనేక జన్మల యొక్క కర్మలఖాతా తీరిపోతుందని సంతోషంగా నాట్యం చేస్తూ ఉండాలి. భగవంతుడు మీ దగ్గరకు వచ్చేసిన కారణంగా మీకు దు:ఖం అనుభవం కాకూడదు.

### 35వ. బాబా ద్వారా నిమిత్తమైన శిక్షకులైనా, సేవాదారులైనా, సహయోగులైనా ఏ విధిని పాటించాలి?

పూజ్య ఆత్మల పట్ల ఒకవేళ ఏదైనా అపవిత్ర దృష్టి వస్తుందంటే స్మృతి యొక్క పునాది బలహీనంగా ఉన్నట్లు, ఇది మహా మహా మహా పాపం. ఏ పూజ్య ఆత్మ పట్ల అయినా కానీ అపవిత్రత అంటే దైహిక దృష్టి వెళుతుంది అంటే ఈ సేవాదారి చాలా మంచివాడు, ఈ శిక్షకుడు చాలా మంచివాడు అని కానీ మంచి ఏమిటి? మంచిది అంటే ఉన్నత స్మృతి, ఉన్నత దృష్టి ఉండటం. ఆ ఉన్నతం లేకపోతే మంచిది ఏమిటి? ఇది కూడా బంగారు జింక యొక్క రూపం. అది సేవ కాదు, సహయోగం కాదు, కానీ స్వయాన్ని మరియు సర్వులను వియోగిగా చేయడానికి ఆధారం. ఇది మాటిమాటికి ధ్యాసలో ఉంచుకోండి. బాబా ద్వారా నిమిత్తం అయిన శిక్షకులు లేదా సేవా సహయోగిగా అయిన ఆత్మలు, అక్కయ్య లేక అన్నయ్య కానీ, సేవాదారీ ఆత్మల సేవ యొక్క ముఖ్యలక్షణం – త్యాగం మరియు తపస్సు. ఈ లక్షణం ఆధారంగా సదా త్యాగి మరియు తపస్వీ అనే దృష్టి ఉంచుకోండి కానీ దైహిక దృష్టి కాదు. శ్రేష్ఠ పరివారం కనుక శ్రేష్ఠ దృష్టి ఉంచుకోండి. ఎందుకంటే ఈ మహాపాపం ఎప్పుడూ ప్రాప్తి స్వరూపం యొక్క అనుభవం చేసుకోనివ్వదు. అందువలన సదా స్మృతిలో ఉంచుకోండి, పూజ్య ఆత్మకు బదులు పాపాత్మగా అవ్వవద్దు. ఈ ఒక్క వికారం ద్వారా మిగిలిన వికారాలు స్వతహాగానే ఉత్పన్నం అవుతాయి. మనం అనుకున్న కోరిక పూర్తి కాకపోతే, క్రోధం కూడా మొదటికే వచ్చేస్తుంది. అందువలన ఈ విషయాన్ని తేలికగా భావించవద్దు. దీనిలో సోమరిగా అవ్వకండి. బయటికి శుభ సంభంధం, సేవా సంబంధం అనే రాయల్ రూపం యొక్క పాపాన్ని పెంచుకోకండి. ఈ పాపానికి ఎవరు దోషులైనా కానీ ఇతరులను దోషిగా చేసి స్వయం సోమరితనంగా అవ్వవద్దు. నేను దోషిని అని ఎప్పటివరకు ఈ జాగ్రత్త ఉంచుకోరో, అప్పటివరకు ఈ మహాపాపం నుండి ముక్తి అవ్వలేరు. ఏరకమైన మనసా సంకల్పం లేదా మాట, లేదా సంపర్కం అయినా విశేషంగా దానివైపు వంగటం అంటే అది తగుల్పాటుకు గుర్తు. ఇంకేమీ చేయటం లేదు, కేవలం మాట్లాడుతున్నారంటే, ఈ విషయాలు కూడా తగుల్పాటు యొక్క శాతం. సేవా సహయోగీ వైపు విశేషంగా లోబడి ఉంటే అవి కూడా తగుల్పాటు. ఎప్పుడైనా ఏదైనా సైగ లభిస్తే దానిని ఆ సైగతోనే సమాప్తి చేసేసుకోవాలి. ఇంకా మొండికెత్తితే, దానిని స్పష్టీకరణ చేయడానికి ప్రయత్నిస్తున్నారు. అంటే మీ పాపాన్ని మీరు స్పష్టం చేసుకుంటున్నట్లు. ఆ విషయం యొక్క స్పష్టీకరణ కాదు, పాప రేఖను పెంచుతున్నారు. అందువలన విశ్వపరివర్తన కార్యంలో ఉన్నాం కావున స్వ పరివర్తన చేసుకోవడం తెలివైనవారి పని.

**360. అన్నింటికంటే గొప్ప పుణ్యం ఏది? పుణ్యాత్మ యొక్క విశేషతలు తెల్పుము?**

ఏ ఆత్మకు ఏ ప్రాప్తి అవసరమో, ఆ ప్రాప్తినిచ్చే కార్యం చేయించడం, అదే పుణ్యం. పుణ్యాత్మకు ఎప్పుడు కూడా పుణ్యానికి బదులు గౌరవం పొందాలని కామన ఉండదు. ఎందుకంటే ఏవిధమైన కామన అయినా పుణ్యాన్ని సమాప్తి చేసేస్తుంది. ఈ విషయం పుణ్యాత్మకి నిరంతరం జ్ఞాపకంలో ఉంటుంది.

**361. ఈ చిన్న సంగమయుగంలో సేవ చేస్తే దేని నుండి ముక్తులవుతాము?**

ఇతరులకు సేవ చేసే దాసీ జన్మ నుండి ముక్తులైపోతారు.

**362. స్వర్గం ఎవరి ఆజ్ఞ ద్వారా తయారవుతుంది?**

విశ్వబ్రహ్మ అయిన శివపరమాత్మ ఆజ్ఞ చేయగానే స్వర్గం తయారైపోతుంది. ఇది పరమ శివుడు మనకు ఇచ్చే ప్రారబ్ద నగరం.

**363. జ్ఞానదాత అయిన శివబాబా ఎప్పుడు ప్రత్యక్షమవుతారు?**

ఇది క్రొత్త జ్ఞానం అని, ప్రపంచం అందరికీ తెలిసినప్పుడు శివపరమాత్మ ప్రత్యక్షం అయిపోతారు.

**364. మురళితో ప్రేమ ఉండి వచ్చేవారికి, పరివారంతో ప్రేమ ఉండి వచ్చేవారికి తేడా ఏమిటి?**

పరివారంపై ప్రేమతో వచ్చేవారు బాబాతో సంబంధం ఎక్కువగా జోడించలేరు. బుద్ధి ఏకాగ్రమవ్వదు. జ్ఞానం ఆధారంగా వచ్చేవారి బుద్ధిని ఏకాగ్రం చేసుకునే శక్తి వస్తుంది.

**365. ప్రపంచంలో అందరికి ఎవరికి వారి హక్కు ఉంటుంది. అటువంటి వారికి మనం జ్ఞానం ఏవిధంగా ఇవ్వాలి?**

ప్రపంచంలో ప్రతీ ఒక్కరికి ఏదోక విధమైన హక్కు ఉంటుంది. వారి హక్కును కించపరచకుండా ప్రేమతో, మనస్ఫూర్వక స్నేహంతో శివపరమాత్మ యొక్క యధార్థ జ్ఞానాన్ని ఇవ్వండి.

**366. వాణీ ద్వారా సేవ కంటే శ్రేష్ఠ తరంగాల ద్వారా చేసే సేవ ఏవిధంగా ఉంటుంది?**

శ్రేష్ఠ తరంగాల ద్వారా చేసే సేవ సాక్షాత్కారాలు చేస్తుంది. ఇటువంటి సేవ చాలా అవసరం ఉంది. ఎందుకంటే విని వినీ అందరూ విసిగిపోయి ఉన్నారు. శ్రేష్ఠ తరంగాల యొక్క సేవ ప్రకృతి వరకు చేరి ప్రకృతిని కూడా పరివర్తన చేస్తుంది.

**367. వి.ఐ.పి అంటే అర్థం ఏమిటి?**

వి.ఐ.పి అంటే – వెరీ ఇన్నోసెంట్ పర్సన్ అంటే ప్రపంచ జ్ఞానంలో అమాయకులు. అటువంటి వారంటేనే బాబాకు ఇష్టం.

**368. ఒక్కొక్క మురళీ వాక్యం ఎన్ని సంవత్సరాల ఫలం ఇస్తుంది వివరించండి?**

ఒకొక్క మురళీ యొక్క మహావాక్యం 2,500 సం॥లకు అనగా సత్య, త్రేతాయుగాలకు సంపూర్ణ ఫలాన్నిస్తుంది. ఒక్క వాక్యాన్ని పోగొట్టుకుంటే కోటానుకోట్ల భాగ్యాన్ని పోగొట్టుకున్నట్లే! అదేవిధంగా కర్మలగతి చాలా గుహ్యమైనది. మురళీని వినేటప్పుడు నేను ఈశ్వరీయ విధ్యార్థిని అనే సంలగ్నతో విధిపూర్వకంగా మురళీ వినాలి. ఆఖరులో వచ్చేవారు కూడా ఈ విధి ద్వారా ముందుకు వెళ్ళిపోవచ్చని శివబాబా తెలియచేస్తున్నారు.

**369. ఏకాగ్రతా శక్తి యొక్క విలువను తెలుపుము?**

ఏకాగ్రతా శక్తి ఎప్పుడు వస్తుందంటే ఒక్క బాబా తప్ప ఇంకెవ్వరూ లేరు అనే భావన కలిగినప్పుడు. ఒకే బాబాలో మొత్తం ప్రపంచం యొక్క సర్వ ప్రాప్తులు ఇమిడి ఉన్నాయన్న సత్యం తెలుసుకోవాలి. ఒక్క ఏకాగ్రత స్థితిలో స్థితులై ఒక్క సంకల్పం చేసినా కానీ సఫలత వచ్చేస్తుంది. ఏకాగ్రత అనేది అనేక వైపులనుండి భ్రమించడాన్ని విడిపిస్తుంది.

**370. మనం సేవలో బిజీగా వుంటూ ఏ అభ్యాసం చేస్తూ ఉండాలి? దాని యొక్క విశేషమైన ఫలితం ఏమిటి?**

మున్ముందు అనేక నిరాశ ఆత్మలు మీ సన్నిధికి వస్తారు. వారి ఆశను పూర్తి చేయాలంటే మీలో చాలా శాంతిశక్తి జమ అయి ఉండాలి. ఒక్కొక్క నీటి బిందువు కలిసి చెరువు అవుతుంది కదా అలాగే ప్రతీరోజు శాంతిశక్తిని కొంత సమయం నుండి జమ చేసుకుంటూ ఉండాలి. దీని యొక్క విశేష ఫలితం అంతిమంలో అందరికీ శాంతినిచ్చేవారిగా కాగలుతారు.

**371. క్రొత్తవారు ముందుకు వెళ్ళడానికి ఏ విషయం ధారణ చేయాలి?**

భగవంతుడిని ప్రేమతో కలవటమే కాకుండా ప్రేమలో లీనమవ్వాలి. పంచదారని పాలలో వేసి అది కరిగించకపోతే రుచి అనుభవం అవ్వదు కదా! ఆ పంచదార ఆ పాలలో లీనమైపోయినప్పుడే రుచి అనుభవం అవుతుంది.

**372. శ్రేష్ఠ బ్రాహ్మణ ఆత్మలైన మీరు మొత్తం మానవరూపీ కల్పవృక్షానికి ఏవిధంగా పునాది వివరించండి?**

సంగయముయగమే అన్ని యుగాలకు మరియు అన్ని ధర్మాలకు పునాది. ఎందుకంటే భగవంతుడు అవతరించి ఈ చిన్న సమయం మొత్తం కల్పంలో ఉన్న ప్రతీ ఆత్మకు ఆధారం. సంగమయుగంలో జ్ఞానీ–యోగీ ఆత్మలు ఆచరించే వ్యవహారాలు ద్వాపర కలియుగాలలలో కర్మలకు ఆధారం అవుతాయి. ఇక్కడ మనం అమృతవేళ యోగం చేసుకుంటున్నాము. ఈ సూక్ష్మ నియమం ద్వాపరయుగంలో తెల్లవారుజామునుండి ఆ దేవతలకు పూజలు జరుగుతూ ఉంటాయి.

**373. ప్రాప్తి నుండి ఎప్పుడు వంచితులైపోతారు?**

మాయ యొక్క చిన్న చిన్న సమస్యలలో, సాంగత్యదోషంలో, పరమతం వినడంలో, వ్యర్థ సంకల్పాలు రావడంలో, శ్రీమతం ఆదారంగా కాకుండా మనం మనస్సు చెప్పినట్లు వినటం – ఈ విషయాలన్నీ సంగమయుగి ప్రాప్తుల నుండి వంచితం చేస్తాయి.

**374. సద్గుణాలు కల ఆత్మ యొక్క లక్షణాలు తెలుపండి?**

ఎవరి అవగుణాలను ధారణ చేయరు. ఇతరుల అవగుణాలను వారి దివ్యగుణాల ద్వారా నిరాడంబరంగా పరివర్తన చేస్తారు.

**375. శోకవాటిక సీత యొక్క కథని సూక్ష్మరూపంలో బాబా మనకి ఏ విధంగా తెలిచేసారు?**

సీత, రాముడు, లక్ష్మణుడు – తండ్రి యొక్క ఆజ్ఞ ప్రకారం అడవికి వెళ్ళినప్పుడు సీత రాముడితో ఉండటానికి బదులు, బంగారు లేడి అనగా వస్తు వైభవాలకు వశం అయ్యి వున్న కారణంగా రావణాసురుడు తీసుకు వెళ్ళిపోయాడు. ఈ కథ యొక్క సూక్ష్మ అర్థం – రాముడు అనగా (మనోభిరాముడు) మనస్సుని రంజింపచేసే శివపరమాత్మ! లక్ష్మణుడు అనగా – బ్రహ్మాబాబా, సీత అనగా ఆత్మ! అడవి అనగా – వైరాగ్య వృత్తి, తండ్రి ఆజ్ఞ అనగా – శ్రీమతం! జ్ఞానంలోకి వచ్చి వస్తు వైభవాల ఆకర్షణలో సమయాన్ని పోగొట్టుకుంటే శోకవాటికలో సీతలాగ, మన జీవితం వ్యర్థం అయిపోతుంది. శివబాబాతో ఉంటే భ్రమించే బుద్ధి నుండి విడిపించుకోగలం.

**376. శక్తిశాలీ వాతావరణం ఏవిధమైన సహయోగం అందరికీ అందిస్తుంది?**

బలహీనుణ్ణి కూడా శక్తిశాలీగా చేస్తుంది. అందుకే అందరు కలసి ధారణా బట్టీలు పెట్టుకోవాలి. అది ఒక రక్షణా కోటలా తయారుకావాలి.

**377. శివబాబా ఎవరెవరికి ఏవిధమైన ప్రేరణలు ఇస్తారు?**

భక్తులకు భావనకు ఫలం ఇస్తారు. విజ్ఞానం వారికి క్రొత్త విషయాలు ఆవిష్కరించడానికి ప్రేరణ ఇస్తారు. ఆ క్రొత్త విషయాలు వర్తమానంలో బాబా సేవకు ఉపకరిస్తాయి మరియు స్వర్గంలోకి రానివారికి ఇదే స్వర్గంగా అనుభవం చేయిస్తాయి. ఉదాహరణకు – సత్య త్రేతాయుగాలలో వాతావరణమంతా వసంత ఋతువులా అంటే ఏ.సిలా ఉంటుంది. ఈవిధంగా సాధనాల అవసరం లేకుండానే ప్రకృతి సహజంగానే అటువంటి వాతావరణం అందరికీ అనగా రాజులకు, దాసీలకు మరియు ప్రజలకు అనుభవం అవుతుంది. అటువంటి స్వర్గంలోకి రానివారిలో ఎక్కువమందికి ఈ సైన్సు ద్వారా ఇక్కడే కొంత స్వర్గాన్ని అనుభవం చేసుకుంటారు. ఇది సుమారుగా వంద సంవత్సరాల నుండి ఆవిష్కరణ జరిగింది. అక్కడ స్వర్గంలో 2,500 సం॥ల సుఖమే సుఖం ఉంటుంది. కానీ ఇప్పటి సుఖం సుమారుగా 100 నుండి 150 సం॥లు ఉంటుంది.

**378. నిమిత్త కర్మకి ఫలితం ఏవిధంగా ఉంటుంది?**

నిమిత్త కర్మకి ప్రత్యక్ష ఫలం వెనువెంట లభిస్తుంది. వీరు చాలా నిశ్చింతగా ఉంటారు. ఉదాహరణకు – మీరు భగవంతునికి సేవార్థం అర్పితం చేసిన ధనం తిరిగి బాబా మీకు ఎవరో ఒకరి ద్వారా అనేక రెట్లు తిరిగి ఇస్తారు. ప్రయోగం చేసి చూడండి.

**379. మున్ముందు ఇతరులు మనల్ని ఏవిధంగా ఆహ్వానిస్తారు?**

మున్ముందు మమ్మల్ని ఒక సెకండు మీతో కలుసుకోనివ్వండి అని ప్రాధేయపడతారు. అంత ఎక్కువ వరుస (క్యూ) మీ ముందు ఉంటుంది. అటువంటి సమయంలో మీ శ్రేష్ఠ జీవితం యొక్క ప్రాప్తి, మహత్యం, విశేషతను, పిల్లలైన మీకంటే ఇతరులు ఎక్కువ గ్రహిస్తారు. ఒక్కొక్క మహావాక్యం, ఒక్కొక్క సెకండు, ఎంత విలువైనదో మీకంటే వారే ఎక్కువగా తెలుసుకుంటారు. ఆ స్థితి మీకు తప్పకుండా నంబర్‌వారీగా వస్తుంది. ఇప్పుడు మీకు ఆ స్థితి ఎందుకు లేదంటే సోమరితనం, నిర్లక్ష్యం, సాదారణంగా జీవితం గడపడం, ఇతర విషయాలలో మీ బుద్ధిని బిజీగా చేసుకుంటున్నారు. వీటి అన్నింటినీ ధ్యాస పెట్టి తొలగించుకున్నప్పుడు శక్తిశాలీగా అయ్యి విశ్వం ముందు వెంటనే తండ్రిని ప్రత్యక్షం చేస్తారు.

**380. బాబా దృష్టిలో అందరూ మహారథీలే అనే విషయాన్ని పూర్తిగా వివరించండి?**

కేవలం స్థూల కార్యాలను సహజం చేసేటందుకు కొంతమందిని నిమిత్తం చేసారు. వారినే మీరు దాదీ, దీదీ అంటారు. కేవలం వీరు కార్యార్థం మాధ్యమాలు. కానీ బాబా దృష్టిలో ప్రతీ సెంటర్ సంబాళించే ప్రతీ ఒక్క ఆత్మ, చిన్నవారైనా – పెద్దవారైనా, క్రొత్తవారైనా–పాతవారైనా, మహారథులే! ఎందుకంటే, మాయా జీవితాన్ని వదలి భగవంతుని యొక్క జీవిత భాగస్వాములుగా అయ్యారు. కావున అందరూ మహారథులే!

### 381. ఎప్పుడు మీకు గౌరవం పూర్తిగా లభిస్తుంది?

గౌరవం అనేది ఎప్పుడూ మీరు ప్రయత్నం చేయడం వలన, అడగటం వలన రాదు. ఇతరులకు మీరు గౌరవం ఇవ్వండి. అప్పుడు మీకు లభించకపోవడం అనేది ఉండదు. మన:స్ఫూర్వకంగా ఇవ్వండి. కేవలం పైపైకి చూపించడానికి ఇవ్వకండి. మీరు ఏవిధంగానైతే ఇతరులను గౌరవిస్తారో, వారు ఆవిధంగానే మీకు తిరిగి గౌరవం ఇస్తారు. మనస్సుతో ఇచ్చే గౌరవంలో కర్మలఖాతా తయారవ్వదు. మరియు వెనుకటి జన్మలఖాతా భస్మమవుతుంది. కార్యం చక్కబెట్టుకోవాలని స్వార్థ భావంతో ఇతరులకు గౌరవం ఇస్తే, కొంత సమయం తరువాత వారికి ఆ స్వార్థం తెలిసి మీనుండి పూర్తిగా తొలగిపోతారు. మీ స్వార్థపూరితమైన స్నేహం, గౌరవంలో ఋణ సంబంధ ఖాతా తయారై, అది మీరు ఏదొక జన్మలో ఋణముక్తి చేసుకోవలసి వస్తుంది. బంతిని గోడకు విసిరినప్పుడు, తిరిగి మరలా మన దగ్గరకు వస్తుంది. అదేవిధంగా, కర్మ యొక్క ఫలం కూడా మన దగ్గరకే తిరిగి వస్తుంది.

### 382. హద్దులో నాది అంటే వచ్చే నష్టం ఏమిటి? బేహద్‌లో నాది అంటే వచ్చే లాభం ఏమిటి?

హద్దులో నాది అనే భావన విఘ్నాలు తీసుకువస్తుంది. బేహద్–నాది అనే భావన నిర్విఘ్నంగా, విఘ్న వినాశకులుగా తయారుచేయటమే కాకుండా, అనేక జన్మల కర్మల వలయం నుండి విడిపిస్తుంది.

### 383. నిమిత్తమైనవారిని నిమిత్తంగా భావించడం వలన ఏమి లాభం? నిమిత్తమైన వారికి గౌరవం ఎందుకు ఇవ్వాలి?

నిమిత్తమైనవారిని నిమిత్తంగా చేసింది శివబాబాయే కాబట్టి, వారికి గౌరవం ఇవ్వటం అంటే బాబాకు గౌరవం ఇవ్వటం. సేవలో సహయోగులు కాబట్టి, సేవలో అందరూ కలుసుకోవటం వలన సఫలత ఎక్కువ వస్తుంది.

### 384. ఎవరి గుణాలు బాబా స్మరణ చేస్తారు?

మనస్సులోను, కర్మలోను బోళా పిల్లల, సత్యత స్వచ్ఛత ఉన్న పిల్లల యొక్క గుణాలు బాబా గానం చేస్తుంటారు. బోళా అంటే సరళ స్వభావం కలవారు. సరళ స్వభావం అంటే సారం తీసుకుని సర్దుకునే స్వభావం కలవారు.

### 385. ద్వాపరయుగంలో భక్తికి ఎవరు ఆధారం?

భక్తి సమయం అనగా ద్వాపరయుగం నుండి సత్వ ప్రధానమైన భక్తి మీనుండే ప్రారంభమైంది. అనగా బ్రహ్మ మరియు మీ నుండి, మొదటగా మనస్సు యొక్క స్నేహం మరియు శక్తి ఉన్న

కారణంగా, మానసిక భావంతో భక్తి ప్రారంభమైంది. అభిషేకాలు, కుంకుమార్చనలు, రథయాత్రలు వంటి స్థూల విధులన్నీ నెమ్మది నెమ్మదిగా బహురూపాలు దాల్చాయి. ఆ యుగంలో ఆ భక్తి ఉండటం వలన, బుద్ధి బిజీగా ఉండి వికారాలలోనికి వెళ్ళటం నుండి దూరమయ్యారు.

**386. మున్ముందు దివ్యబుద్ధి యొక్క ప్రేరణ ద్వారా ఏ విషయాలు అనుభవం అవుతాయి?**

భక్తుల యొక్క ఆహ్వాన ధ్వని మీకు స్పష్టంగా వినిపిస్తుంది. వారు మిమ్మల్ని పిలుస్తున్నట్లు అనుభవం అవుతుంది. మీరు ఏ దేవతయో మీ దివ్యబుద్ధి యొక్క ప్రేరణ ద్వారా మీకు సాక్షాత్కారం అవుతుంది. ఇప్పుడు మీరు దివ్యగుణాలు అలంకరించుకుంటున్నారు. మున్ముందు దివ్యగుణాలతో సంపన్నమవుతారు. మీ దేవతా స్వరూపం మీకే కాకుండా ఇతర భక్తి ఆత్మలకు కూడా సాక్షాత్కారం జరుగుతుంది.

**387. ఏదైనా కర్మేంద్రియం విచలితమవుతున్నప్పుడు, దానిని సరైన మార్గంలో ఏవిధంగా తీసుకురావాలి?**

అంతర్ముఖత అనే బట్టీలో కూర్చోండి. అనగా అ విచలితమైన కర్మేంద్రియం పరివర్తన అవ్వాలి అనే ధ్యాస పెట్టుకుని బాబా స్మృతిలో లీనమవ్వండి. అప్పుడు ఫలితం సదా కాలికంగా తప్పకుండా లభిస్తుంది.

**388. శాంతిమయ ప్రపంచం ఈ భూమిపై ఎప్పుడు ప్రత్యక్షం అవుతుంది?**

వాతావరణంలో ఉన్న అణువులు ఆత్మిక శక్తితో అనుసంధానం కలిగి ఉంటాయి. ఆ అణువు యొక్క శక్తి సత్వప్రధాన ప్రకృతిని తయారు చేస్తుంది. అనగా, అణుశక్తి, ఆత్మశక్తి కలసి పనిచేస్తాయి. ఉదాహరణకి – స్వర్గంలో విమానాలు సంకల్ప శక్తితో ప్రయాణిస్తాయి, ఇందనం ఆధారంగా ప్రయాణించవు. ఎందుకంటే అక్కడ ఇందనాలు ఉండవు. 8 సం॥ ల పిల్లలు కూడా విమానాలు నడుపగలరు, యాక్సిడెంట్‌లు జరగవు ఎందుకంటే సత్యయుగంలో వికర్మల ఖాతా ఎవరికీ ఉండదు. కనుక యాక్సిడెంట్‌ల రూపంలో ఎవరూ దు:ఖాన్ని అనుభవించరు.

**389. ముక్తి ఆత్మలు ఎవరి దగ్గరికి ఎప్పుడు వస్తారు?**

ఎక్కువమంది ఆత్మలు ముక్తి యొక్క బిక్షం అడగటానికి కర్మాతీత వానప్రస్థ మహాదాని, వరదాని పిల్లలైన మీ వద్దకు వస్తారు. ఇప్పుడు మీ జడ చిత్రాల ముందు మందిరాలలోనికి వెళ్ళి ప్రార్థన చేసి, సుఖశాంతులను అడుగుతున్నారు. కొంతమంది తీర్థస్థానాలకు వెళ్ళి అడుగుతున్నారు. కొంతమంది ఇంటిలో కూర్చుని అడుగుతున్నారు. ఎవరికి ఎంత శక్తి ఉందో అంతవరకు

చేరుకుంటున్నారు. యాధాశక్తి యధా ఫలాన్ని ప్రాప్తి చేసుకుంటున్నారు. కొంతమంది దూరంగా కూర్చున్నా కానీ మనస్సుతో చేస్తారు. కొంతమంది విగ్రహాలకు ఎదురుగా, తీర్థస్థానాలు, మందిరాలకు వెళ్ళి కూడా చూపించడానికి చేస్తారు. స్వార్థానికి వశమై చేస్తారు. వాటన్నింటి లెక్కల అనుసారంగా ఎటువంటి కర్మయో, ఎటువంటి భావనయో, అటువంటి ఫలం లభిస్తుంది. అలాగే, ఇప్పుడు సమయానుసారంగా, చైతన్య మహాదాని, వరదాని మూర్తులైన మీ ముందు ప్రార్థన చేస్తారు. కొంతమంది, సేవాస్థానాలనే మందిరాలకు చేరుకుంటారు. కొంతమంది మహా తీర్థస్థానం అయిన మధువనం వరకు చేరుకుంటారు. కొంతమంది ఇంట్లోకూర్చునే సాక్షాత్కారం చేసుకుంటూ దివ్యబుద్ధి ద్వారా ప్రత్యక్షతను అనుభవం చేసుకుంటారు. ఎదురుగా రాకపోయినా కానీ, స్నేహం మరియు ధృఢ సంకల్పంతో ప్రార్థన చేస్తారు. మనస్సులో చైతన్య ఫరిస్తాలైన మిమ్మల్ని ఆహ్వానించి, ముక్తి వారసత్వాన్ని అడుగుతారు. ఎలాగైతే వినాశన సాధనాలు బాగా పరిశుద్ధం అయిన కారణంగా తీవ్రగతిలో సమాప్తికి నిమిత్తం అవుతాయి. అలాగే వరదానీ-మహాదానీ ఆత్మలైన మీరు మీ కర్మాతీత ఫరిస్తా స్వరూపం ద్వారా సర్వుల ప్రార్థనకి ఫలితంగా ముక్తి వారసత్వాన్ని ఇస్తారు.

### ౩౮౦. సమస్య దేని ఆధారంగా వస్తుంది?

సమస్య మీ బలహీనత ఆధారంగానే వస్తుంది.

### ౩౮౧. ఏది పాప ఖాతా?

మీకు ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఆ సమస్యలో మీరు చిక్కుకుని బాబాని వదిలేస్తే జీవితం వ్యర్థమైపోతుంది. అలాగని ఇతరులకు సమస్య అయ్యి బాబాతో జీవితం గడుపుతున్నా కానీ ఇతరులకు దు:ఖం ఇచ్చినవారవుతారు. ఉదా - ఇంట్లో ఒకరు జ్ఞానంలో నడుస్తున్నప్పుడు మిగిలినవారికి ఇష్టం లేనప్పుడు వారిని వారి ఇష్ట ప్రకారంగా నడుచుకోనివ్వాలి. మీకు వారు సమస్య అవ్వకూడదు, వారు మీకు సమస్య అవ్వకూడదు. ఇటువంటి అనేక సమస్యల నుండి ఎంత సమయంలో విజయం పొందారో దానిని బట్టి విశేష మార్కులు జమ అవుతాయి.

### ౩౮౨. ఏ శ్రేష్ఠ కార్యానికైనా సఫలతకి ఆధారం ఏమిటి?

ఏ శ్రేష్ఠ కార్యానికి అయినా సఫలతకు ఆధారం త్యాగం, తపస్సు మరియు సేవ. ఈ మూడూ ఉంటే ఎటువంటి కార్యమైనా సఫలత పొందుతుంది. త్యాగం ఉండి తపస్సు లేకపోతే వెనుకటి జన్మల కర్మలఖాతా భస్మమవ్వదు. తపస్సు ఉండి సేవ లేకపోతే ఇతరులు తయారవ్వరు.

## ౩౭౩. మీకు మీరు చేజేతులారా నాశనము అవ్వటం అనే విషయం గురించి బాబా ఏవిధంగా వివరించారు?

పవిత్రతలో ఓడిపోతున్నాం అంటే దానికి బీజం ఏదొక వ్యక్తికి లేదా వ్యక్తి యొక్క గుణాలకు, స్వభావానికి, వ్యక్తిత్వానికి, విశేషతకు ప్రభావితం అవ్వటం. వ్యక్తికి లేదా వ్యక్త భావానికి ప్రభావితం అవ్వటమంటే ప్రభావితం అవ్వటం కాదు, నాశనం అవ్వటం. వ్యక్తికి వ్యక్తిగత విశేషత లేదా గుణం, స్వభావం బాబా ఇచ్చినవి అంటే దాత యొక్క దానం. వ్యక్తికి ప్రభావితం అవ్వటం అంటే మోసపోవటం. మోసపోవటం అంటే దు:ఖం పొందటం. అపవిత్రత అనేది ఎండమావులతో సమానం. అది సంబంధ సంపర్కాలలో చాలా మంచిగా అనుభవం అవుతుంది, ఆకర్షిస్తుంది. నేను మంచికి ప్రభావితం అవుతున్నాను అని అనుకుంటారు. అందువలన మాటలు కూడా ఇలా మాట్లాడుతారు లేదా ఆలోచిస్తారు – వీరు చాలా మంచిగా అనిపిస్తున్నారు లేదా వీరి గుణాలు, స్వభావం మంచిగా అనిపిస్తున్నాయి, జ్ఞానం మంచిగా అనిపిస్తుంది, యోగం చేయటం బావుంది, వీరి ద్వారా శక్తి లభిస్తుంది, సహయోగం లభిస్తుంది, స్నేహం లభిస్తుంది అని ఇలా అల్పకాలిక ప్రాప్తి వస్తుంది కానీ మోసపోతున్నారు. ఇచ్చేటటువంటి దాతను అంటే బీజాన్ని, పునాదిని వదిలేస్తున్నారు. రంగురంగుల కొమ్మలను పట్టుకుని ఊగుతున్నారు. అప్పుడు ఏమవుతుంది? పునాది లేని కొమ్మ ఊపుతుందా? పడేస్తుందా? బీజం అంటే దాత, విధాతతో సర్వ సంబంధాలు, సర్వప్రాప్తుల యొక్క రసాన్ని అనుభవం చేసుకోనంతవరకు ఒకొక్కసారి వ్యక్తితో, ఒకొక్కసారి వైభవంతో, ఒకొక్కసారి వాయుమండలంతో ఇలా ఇలా రకరకాల కొమ్మలతో అల్పకాలిక ప్రాప్తియొక్క ఎండమావులతో మోసపోతూ ఉంటారు. ఇలా ప్రభావితం అవ్వటం అంటే అవినాశి ప్రాప్తి నుండి వంచితం అవ్వటం. పవిత్రత యొక్క శక్తితో ఎప్పుడు ఏ స్థితి కావాలంటే అది, ఏ ప్రాప్తి కావాలంటే అది, ఏ కార్యం సఫలత పొందాలంటే దానిలో సఫలత, అన్నీ మీముందు దాసీ సమానంగా హాజరవుతాయి. కలియుగం అంతిమంలో రజో ప్రధాన పవిత్రతా శక్తిని ధారణ చేసేవారు, పేరుకు మహాత్ములు, ఇప్పటికే ప్రకృతిని దాసీగా చేసుకుని ఋజువు చూస్తున్నారు. ఇప్పటివరకు పేరు మహాత్మ అని నడుస్తుంది. ఇప్పటికీ పూజ్యులు. అపవిత్ర ఆత్మలు తలవంచుతున్నాయి. అంటే ఆలోచించండి – అంతిమం వరకు పవిత్రత యొక్క శక్తికి ఎంత గొప్పతనం ఉన్నదో! పరమాత్మ ద్వారా లభించిన సతో ప్రధాన పవిత్రత ఎంతో శక్తిశాలీగా ఉంటుంది. ఈ శ్రేష్ఠ పవిత్రతా శక్తి ముందు అపవిత్రత తలవంచటమే కాదు, మీ పాదాల క్రింద ఉంటుంది. అపవిత్రత అనే అసురీ శక్తి, శక్తి స్వరూపం యొక్క పాదాల క్రింద ఉన్నట్లుగా చూపిస్తారు కదా!

బ్రాహ్మణ జీవితానికి పునాది పవిత్రతా శక్తి. పునాది బలహీనంగా ఉంటే, 21 జన్మల ప్రాప్తి అనే భవనం ఎలా నిలబడుతుంది. పవిత్రతా అనే పునాదిలో శివబాబా ధర్మరాజు ద్వారా

ఒకటికి వంద రెట్లు, కోట్ల రెట్లు శిక్ష ఇస్తారు. దీనిలో మోసం ఎప్పుడు జరుగదు. దీనిలో దయాహృదయులుగా ఉండరు. ఎందుకంటే, ఎవరికో ప్రభావితం అయిపోయి తండ్రితో సంబంధాన్ని త్రెంచేసుకున్నారు. పరమాత్మ ప్రభావం నుండి తొలగిపోయి, ఆత్మల ప్రభావంలోకి రావటం అంటే, బాబాని గుర్తించలేదు మరియు గ్రహించలేదు. అటువంటి వారి ముందు బాబా తండ్రి రూపంలో కాక ధర్మరాజు రూపంలో ఉంటారు. ఎక్కడ పాపం ఉంటుందో అక్కడ బాబా ఉండరు. అందువలన సోమరితనంగా అవ్వవద్దు. ఎవరికైనా ప్రభావితం అవ్వటం కూడా కామన – అంటే, కామ వికారం యొక్క అంశం. కామన లేకుండా ప్రభావితం అవ్వరు. ఆ కామన కూడా కామ వికారం, మహా శత్రువు. ఇది రెండు రూపాల్లో వస్తుంది. కామన చేస్తే ప్రభావితం చేస్తుంది లేదా అలజడి చేస్తుంది. కామన ఉంది అంటే మోసపోవటం. కఠిన దృష్టి ఉంచుకుని, ఈ కామనపై కాళీ రూపంగా అవ్వండి. వికర్మలపై విరాట రూపం ధరించండి, ఇతరులపట్ల కాదు, మీ పట్ల. అప్పుడే వికర్మలను వినాశనం చేసుకుని ఫరిస్తాగా కాగలరు. యోగం కుదరటం లేదు అంటే పరిశీలించుకోండి, తప్పకుండా దాచిన వికర్మ ఏదో తనవైపు ఆకర్షిస్తుంది. బ్రాహ్మణ ఆత్మగా ఉండి యోగం కుదరకపోవటం ఉండదు. బ్రాహ్మణ ఆత్మపై వ్యర్థమైన లేక వికారీ దృష్టి లేదా వృత్తి వెళుతుంది అంటే అది కూడా కళంక విషయం. ఒక్క జన్మకు కాదు, అనేక జన్మలకు కళంకం తీసుకువచ్చేవారు, రాజ్య భాగ్యాన్ని కాలదన్నుకోవడం అవుతుంది. ఇటువంటి కోటిరెట్లు వికర్మ ఎప్పుడూ చేయకూడదు. ఎలాగైతే ఎవరైనా చాలాచాలా దాహంతో శరీరం వదులుతారో అలా సదా ఎదురుగా ఈ పాపాల యొక్క యమదూతలు ఉంటారు. అంత కఠిన అంతం ఉంటుంది. అందువలన వర్తమానంలో పొరపాటున కూడా అటువంటి పాపం చేయకూడదు.

### 374. సర్వప్రాప్తులు విడదీయని నీడలాగ మనకు ఎప్పడు వస్తాయి?

మీరు కేవలం జ్ఞానసూర్యుడైన శివబాబా ద్వారా లభించిన శక్తుల యొక్క వెలుగులో నడవండి. అప్పుడు సర్వ ప్రాప్తులు నిరంతరం విడదీయని నీడలా మీవెంట నడుస్తాయి.

### 375. సత్యయుగంలో మహల్ కంటే సంగమయుగంలో ఏది శ్రేష్ఠమైనది?

సంగమయుంగంలో ఎవరైతే తమ ఇంటిలో మూడు అడుగుల స్థలంలో జ్యోతిర్బిందు స్వరూపుడైన శివబాబా ఫోటో పెట్టుకుని, జ్ఞానం, యోగం చేసుకుంటారో, ఆ గృహం సత్యయుగంలోని బంగారు మహల్ కంటే చాలా విలువైనది. ఎందుకంటే సత్యయుగంలో శివ పరమాత్మ మనకు లభించరు. సత్యయుగం నుండి ప్రారబ్ధం జీవితం రోజురోజుకీ తరిగిపోతుంది. ఈ యుగంలో అనగా సంగమయుగంలో ప్రారబ్ధం రోజురోజుకీ పెరిగిపోతుంది. ఈ చిన్న విధి ద్వారా ప్రతీ ఒక్కరు స్వర్గ ప్రాప్తిని పొందగలరు.

**౩౯౬. ఎంత మంచి, పెద్ద సేవ చేసినా ఏ భావం మరియు భావన తప్పక ఉండాలి?**

నిర్మాణ భావన మరియు నిమిత్త భావం. నిర్మాణ భావన అంటే గౌరవానికి అతీతంగా ఉండే గుణం. నిమిత్త భావం అంటే సదా నాచే చేయించేవారు నిరాకార జ్యోతిర్బిందు శివపరమాత్మ ఒక్కరే! ఓహో బాబా! నీవు నన్ను నిమిత్తం చేసావు, ఈ సేవ నేను చేయలేదు అని మనస్సు నుండి పాటలు రావాలి. ఎంత పెద్ద భాద్యతో మనస్సు అంత తేలికగా ఉండాలి. ఆ తేలికతనంలో నిమిత్త భావం, నిర్మాణ భావన సహజంగా ఉండాలి.

**౩౯౭. ఏ సేవ విశ్వానికి అవసరం అవుతుంది?**

సిద్ధి ద్వారా ప్రాప్తి పొందే సేవయే విశ్వానికి అవసరం. సిద్ధి ఎప్పుడు లభిస్తుందంటే శ్రీమతానుసారంగా, విధి ప్రకారం నడిచినప్పుడు. ఇతరులు చెప్పే విధానం ప్రకారం అసలు నడవకూడదు. వర్తమానంలో అనేకమంది దేహదారీ భావాలు, అల్పకాలికమైన స్వార్థబుద్ధితో కొన్ని అద్భుతాలు చేస్తున్నారు. అవి ఇప్పుడు సమాప్తి అయిపోనున్నాయి. వాటితో ప్రజలు విసిగిపోయి ఉన్నారు. ఈ విషయాన్ని గమనించి మీరు శ్రీమతానుసారంగా సిద్ధిని పొందండి. ఆ సేవకోసం విశ్వం ఎదురు చూస్తుంది.

**౩౯౮. ఎవరు ఏ విషయాన్ని ధారణ చేస్తే ఇతరుల పాపాలను తొలగించే వారిగా అవుతారు?**

స్మృతిలో జ్వాలారూపం అయినప్పుడు ఇతరుల పాపాలను తొలగించగలరు. మీ అంతిమ బిరుదు విశ్వకళ్యాణకారి కానీ స్వ కళ్యాణకారీ కాదు. జ్వాలా స్వరూపం అనగా ఎక్కువ సమయం శివబాబాను స్మృతి చేసుకోవాలి. సర్వ సంబంధాలు అనుభవం చేసుకోవాలి.

**౩౯౯. బాబా భోళానాధుడు దాంతోపాటు అంతిమంలో ఏ పాత్ర అభినయిస్తారు?**

వరాలు ఇవ్వటంలో శివబాబా అమాయకులు దాంతో పాటు కర్మలగుహ్యగతి జ్ఞాత కూడా కాబట్టి మన పాప పుణ్యాలను లెక్కించటంలో ధర్మరాజుగా ఉంటారు. ఆ సమయంలో ఆ స్వరూపంలో దయ ఉండదు.

**400. అకాల మృత్యువులు ఎందుకు సంభవిస్తున్నాయి? పూర్తిగా వివరించండి?**

అకాల మృత్యువులు అనగా తుఫానుల వలన, భూకంపాల వలన, అగ్ని ప్రమాదాల వలన, యాక్సిడెంటుల వలన జరిగే మరణాలు. అనేక జన్మల నుండి చేసిన మహాపాపం భస్మం చేయడానికి ఈ అకాల మృత్యువు నిమిత్తమౌతుంది. అనేక జన్మల ఖాతాలను పూర్తి చేసుకునే సమయం పూర్తి కావస్తుంది కావున పవిత్రమై తిరిగి పరంధామానికి వెళ్ళిపోవలసిన కారణంగా, వెంటనే జన్మ

మరియు వెంటనే మృత్యువు కూడా జరుగుతుంది. ఎందుకంటే, ఆత్మ తల్లి గర్భంలో శరీరంలో ప్రవేశించిన తర్వాత, పూర్వ జన్మల కర్మలు సాక్షాత్కారమౌతాయి. పశ్చాత్తాపపడుతుంది దాని ద్వారా కొంతపాపాన్ని భస్మం చేసుకుంటుంది. దానినే గర్భజైలు అంటారు. మరలా జన్మించిన తరువాత ఆ ఆత్మ శరీరం ద్వారా పాపాలు చేయటం మొదలు పెడుతుంది. వెంటనే మృత్యువు కలిగి, తిరిగి తల్లి గర్భంలో ప్రవేశించిన తర్వాత, మళ్ళీ పాపాలు సాక్షాత్కారమౌతాయి. ఈ విధంగా జన్మించడం, మరణించడం, ఇవి కూడా అకాల మృత్యువు యొక్క జాబితాలో వస్తాయి. ఈవిధంగా ఆత్మ కొన్ని కర్మల ఖాతాలను పూర్తిచేసుకుంటుంది. కొన్ని ఆత్మలు శారీరక అనారోగ్యాలతో, మనస్సు యొక్క ఆందోళన ద్వారా, సంబంధ సంపర్కం యొక్క గొడవల ద్వారా, ప్రకృతి ఆపదల ద్వారా - ఇలా అనేక రకాలైన ఖాతాలను ఆత్మ శరీరంలో ఉండగానే తీర్చుకుంటుంది. ఈ సంగమయుగం పూర్తయిపోయిన తర్వాత పరంధామానికి వెళ్ళేముందు ఆత్మలు సూక్ష్మవతనం అనే కోర్టులో ఆగి, భగవంతుని యొక్క పవిత్ర దృష్టి ద్వారా చెడు సంస్కారాన్ని భస్మం చేసుకుంటాయి. కానీ, ఇచ్చట ఆత్మకు శరీరం ఉండదు. ఆత్మ స్వయంగా శిక్ష అనుభవిస్తుంది. ఆ శిక్ష ఒక్క సెకను అయినా కానీ అనేక జన్మల కర్మలఖాతాను పూర్తి చేసుకుంటుంది. ఆ తర్వాత పరంధామానికి బాబా వెంట వెళుతుంది. ఆత్మలో దేవతా సంస్కారం ఉంటే సత్య-త్రేతాయుగాలలో జన్మ తీసుకుంటుంది. భక్తి సంస్కారం ఉంటే ద్వాపరయుగంలో, చెడు సంస్కారం ఉంటే కలియుగంలో జన్మ తీసుకుంటారు. ఈవిధంగా అకాలమృత్యువులు అనే యంత్రాంగం తీవ్రంగా పనిచేసి కర్మల ఖాతాను భస్మం చేస్తాయి.

### 401. బుద్ధిని సమర్థ సంకల్పాలతో నిండుగా ఉంచుకోవడానికి ఏ విధిని పాటించాలి?

ప్రతీరోజు మురళీని వినడం లేదా చదువుకోవడం, హృదయంలో నింపుకోవటం, మరలా కర్మలోకి వచ్చేసరికి స్వరూపంలోకి రావటం, ఈ మూడు స్థితుల ద్వారా బుద్ధి సమర్థవంతంగా ఆనందంగా ఉంటుంది.

### 402. రాజ్యశక్తి మరియు ఈశ్వరీయశక్తి ఈ రెండు శక్తులు వర్తమానంలో

ఈశ్వరీయ శక్తి అనగా శివపరమాత్మ శక్తి ఈ సంగమయుగంలో విశేషమైన పాత్ర అభినయిస్తుంది. రాజ్యశక్తి చాలా అలజడిలో ఉండి, రాజ్యాన్ని కూడా అలజడి రూపంలో తీసుకు వచ్చింది. ఈశ్వరీయశక్తి సదా అచంచలంగా, అవినాశిగా నడుస్తుంది. ఈశ్వరీయ శక్తిని సత్యతాశక్తి అని అంటారు. ఎందుకంటే, ఇచ్చేటటువంటివారు సత్యమైన తండ్రి, శిక్షకుడు, సద్గురువు, ధర్మరాజు. యమధర్మరాజు కాదు - ధర్మరాజు. ఈశ్వరీయశక్తి సత్యయుగాన్ని స్థాపన చేస్తుంది. ఈశ్వరీయ శక్తి అవినాశి వారసత్వాన్ని ఇస్తుంది. ఈశ్వరుడిని అనగా శివ పరమాత్మని - సత్యం, శివం, సుందరం అంటారు కదా!

**403. సాగరం మధ్యలో శ్రీకృష్ణుడు సర్పంపై నాట్యం చేస్తున్నట్లు చూపిస్తారు. దాని సూక్ష్మాతి సూక్ష్మమైన అర్థం ఏమిటి?**

సంసారం అనే సాగరంలో ఉంటూ వికారాలపై విజయం పొంది, సత్యతా శక్తికి గుర్తుగా సర్పంపై నాట్యంచేస్తున్నట్లుగా చూపిస్తారు. సముద్రం అనగా సంసారమని, శేషపాన్పు అనగా వికారాలు దాసీ అయిన దానికి గుర్తు. నాట్యం చేస్తున్న దానికి గుర్తు ప్రతీ ఒక్క శక్తి ద్వారా మనస్సు మాయపై విజయం పొందటం. ఇక్కడ శ్రీకృష్ణుడు అనగా బ్రహ్మాబాబాకి గుర్తు.

**404. మనుమడు - మనుమరాలి సంబంధం కూడా బాబాతోనే జోడించాలి - ఎందుకు?**

అంతిమ సమయంలో మనకు ఎవ్వరూ జ్ఞాపకం రాకూడదు. కనీసం మనుమడు–మనుమరాలు ఎలా ఉన్నారని సంకల్పం వచ్చినా కానీ మనం ఒక్క సెకను యొక్క నష్టోమోహా అనే పేపరులో ఫెయిల్ అయిపోతాము. కొన్ని సంబందాలను జయిస్తాము కానీ ఏదో ఒక సంబంధం ద్వారా ఓడిపోకుండా ఉండటం కోసం, శివబాబాను ఇప్పటినుండే మనవడు–మనవరాలుగా అనుభవం చేసుకోమని శివబాబా సూచన ఇస్తున్నారు.

**405. విధాత అని ఎవరిని అంటారు?**

విధాత అనగా విశాల హృదయం కలిగినవారు. శివబాబాతో తప్ప మిగిలిన ఏ ఆత్మతో తీసుకునే భావన పెట్టుకునేవారు కాదు. సదా ఇచ్చేవారిగా ఉంటారు.

**406. మీకు పేరు కావాలంటే ఎవరి పేరును ప్రసిద్ధి చేయాలి?**

బాబా పేరుని ప్రసిద్ధి చేయాలి. నాది అనే భావన లేకుండా, చేసి చేయించేవారు శివబాబా అని, ఆయన పేరు పైకి తీసుకురండి. అప్పుడు మీపేరు సహజంగా బాబాయే ఇతరుల ద్వారా తీసుకువచ్చే వరదానం ఇస్తారు.

**407. సత్యయుగంలో ఏ ప్రమాదాలు జరుగవు, కారణం ఏమిటి?**

సంగమయుగంలో చేసిన శ్రేష్ఠ కర్మల ఫలమే, సత్యయుగి సుఖమయ జీవితం . ఎందుకంటే, భగవంతుని స్మృతి ద్వారా సంగమయుగంలో పావనంగా తయారయ్యాము కాబట్టి, ఆ ప్రాప్తి 2,500 సం॥లు అనగా సత్య–త్రేతా యుగాల్లో 21 జన్మలకు లభిస్తుంది, అనగా కలియుగంలో కొన్నివందల సం॥ల నుంచి యాక్సిడెంట్స్ జరుగుతున్నాయంటే, అది చెడు కర్మల యొక్క ఫలితం. ఇది డ్రామా నిర్ణయం.

**408. మనసా సేవను క్లుప్తంగా వివరింపుము?**

1) మనసా సేవ ద్వారా ఎదరుగా ఉన్న లేదా చాలా దూరంగా వున్న ఆత్మలకు ఒక్క సెకనులో ప్రాప్తి యొక్క శక్తిని అనుభవం చేయిస్తుంది. (2) ఎటువంటి మానసిక అలజడిలో వున్న ఆత్మకైనా శుభభావన, శ్రేష్ఠ భావన ద్వారా ఆ ఆత్మకు శాంతిని అనుభవం చేయిస్తారు. (3) మనసా సేవ ద్వారా ఆ ఆత్మ తన శ్రేష్ఠ భావన ద్వారా భగవంతుని యొక్క సమీపంలోకి తీసుకువచ్చి ఆ ఆత్మ యొక్క శ్రేష్ఠ భాగ్యరేఖను పెంపొందింప చేస్తుంది. వర్తమాన సమయం అనుసరించి మనసా సేవ చాలా అవసరం. మనసా సేవ ఆత్మిక వైర్‌లెస్ సెట్ వలె పనిచేస్తుంది. మనసా సేవ ద్వారా ఎక్కడ ఏ అలజడి జరుగుతున్నా, అక్కడ శాంతిని అనుభవం చేయిస్తుంది. మనసా సేవ ద్వారా ఆత్మలు ముమ్మందు, ఇతరులకు ఏదో లైట్, బిందు స్వరూపం వచ్చినట్టుగా విచిత్రమైన అనుభవం చేసుకుంటారు. మనసా సేవను తీవ్రం చేయండి - అప్పుదు తొమ్మిది లక్షల ఆత్మలు తయారైపోతాయి.

**409. అంతిమం వరకు ఎవరు సేవ చేయగల్గుదురు?**

దివ్యబుద్ధి మంచిగా ఉంటే, అంతిమం వరకు సేవ చేయవచ్చు.

**410. సంగమయుగం యొక్క ఒక జన్మ యొక్క ఫలం అన్ని జన్మలకు బికారీ అవ్వకుండా ఎలా చేస్తుంది?**

దాతగా అయ్యి ఈ యజ్ఞంలో ధనం ఉపయోగించమని శివబాబా చెప్పారు. ఈ ధనం, బాబా సేవకు ఉపయోగిస్తారు. ఆ సేవ వలన అనేక ఆత్మలు శివబాబాను తెలుసుకుని భాగ్యాన్ని పొందుతారు. దాని ప్రతిఫలంగా అంతిమ జన్మ వరకు అనగా 84 జన్మల వరకు బికారీ స్థితి మీ దగ్గరకు దరి చేరదు. ఇది బాబా యొక్క గ్యారంటీ!

**411. బాబా తన పిల్లలకు అంతిమం వరకు ఏ గ్యారంటీ ఇచ్చారు?**

అంతిమ జన్మలో కూడా మీకు పప్పు-రొట్టె లభిస్తుంది. అడుక్కునే పని లేదు. ఇదే బాబా యొక్క గ్యారంటీ! ఎందుకంటే, సంగమయుగంలో బాబాకు మీరు అన్నీ అర్పితం చేశారు కదా!

**412. అంతిమంలో ఏ నాలుగు విషయాలు పరీక్ష రూపంలో ఎదురవుతాయి? వాటిని ఎలా జయించాలి?**

ఇప్పుడు ప్రపంచంలో నాలుగు రకాల అగ్నిలు అంటుకుని ఉన్నాయి. అవి రోజురోజుకి ఇంకా విరాటరూపం ధరిస్తున్నాయి. (1) తమో ప్రధాన ప్రకృతి విజృంభణ ద్వారా మహా వినాశనం యొక్క అగ్ని (2) వికారాల యొక్క అగ్ని (3) దేహం, దేహ సంబందీకులు, పదార్థాలపై ఆసక్తి యొక్క అగ్ని (4) పశ్చాత్తాపం యొక్క అగ్ని.

(1) అంతిమ వినాశనంలో ప్రకృతి అనగా పంచతత్వాలు ఒకేసారి విజృంభిస్తాయి. ఇప్పుడు ఏదొక తత్వం అనగా భూకంపం వస్తుంది. కానీ అంతిమంలో తుఫానులు, భూకంపాలు ఇలా ఐదు తత్వాలు ఒకేసారి విరాటరూపం ధరిస్తాయి. ఆ సమయంలో మనం నిర్భయతా శక్తితో ఆత్మకు మరణం లేదు, శరీరానికే మరణం అనే స్మృతిలో శరీరాన్ని వదిలేయాలి. ఈ ఒక్క స్మృతి తప్ప ఏవిధమైన భయం ఉండకూడదు.

(2) వికారాల యొక్క అగ్ని – అంతిమంలో ఐదు వికారాలు ఒకేసారి విజృంభించి మనముందు పరీక్షరూపంలో నిలబడతాయి. ఆత్మ పరంధామం నుండి పవిత్రంగా వచ్చి పాత్రలు పూర్తి చేసుకుని తిరిగి పవిత్రంగానే పరంధామానికి వెళ్ళిపోవాలి అనే స్మృతి తప్ప, ఇంక ఏ స్మృతి ఉండకూడదు. ఇంక ఏ స్మృతి ఉన్నా, ఆ అంతిమ పరీక్షలో ఫెయిల్ అయిపోతారు.

(3) దేహం, దేహసంబంధాలు, పదార్ధాల యొక్క అగ్ని – దేహము, దేహసంబందాలు, పదార్ధాలు అన్నీ మహా వినాశనంలో సమాప్తి అయిపోతాయి. సినిమా షూటింగ్ అయిపోయిన తర్వాత సెట్టింగ్‌ను ఎలాగైతే పడగొట్టేస్తారో, అదే మాదిరిగా మన వస్తు వైభవాలు, దేహ సంబంధీకులు, మన దేహం మహావినాశనంలో నాశనం అయిపోతాయి. సంబందీకులు జ్ఞాపకం వస్తుంటే, వారు కూడా బాబా పిల్లలే, వారి భాధ్యత బాబాది, నాకు ఏవిధమైన సంబంధం లేదు. శివబాబా ఒక్కరే నాకు సర్వం అనే స్మృతి తప్ప ఇంకే విషయం బుద్ధిలో ఉండకూడదు. ఈ శరీరం పాత శరీరం, నాకు 21 దేవతా శరీరాలు భవిష్యత్తులో లభ్యం అవుతున్నాయి, ఇంత భాగ్యం నాకు లభిస్తుందన్న స్మృతి తప్ప ఇంకేమీ ఉండకూడదు. ఆస్తిపాస్తులు, వస్తు వైభవాలు ఇవి పాతవి అయిపోయాయి కాబట్టి నాకు క్రొత్త ప్రపంచంలో సత్వప్రధానమైన అవినాశి దు:ఖ రహితమైన సుఖాసాధనాలను బాబా ఇస్తున్నారు అనే తృప్తి తప్ప ఇంకే విషయం ఉండకూడదు.

(4) పశ్చాత్తాపం యొక్క అగ్ని – చేయవలసిన మంచి కార్యాలు అనగా తనువు, మనస్సు, ధనం, సర్వ సంబంధాలు, సమయం, సంకల్పం, ఆస్తిపాస్తులు వస్తువైభవాలు ఈ అంతిమ జన్మలో బాబా మనకు విశ్వసేవలో ఉపయోగించి, విశ్వ మహారాజ పదవిని జన్మసిద్ధ అధికారంగా పొందటానికి ఇచ్చారు. ఈ విషయాన్ని మనస్సు, బుద్ధి ద్వారా గ్రహించి ఈ సంగమయుగంలో ఈశ్వరీయ బ్యాంకులో సమర్పణ చేసుకోండి. లేదంటే అంతిమ సమయంలో పశ్చాత్తాపం తప్ప ఇంకేమీ ఉండదు. ఈ నాలుగు అగ్నిలు జ్ఞానీ యోగీ ఆత్మలకు పరీక్ష రూపంలోను, బయటివారికి, ఇంటికి తీసుకెళ్ళిపోవాలి అనే విధి ద్వారా ఈ డ్రామా నిర్ణయించబడింది. కాబట్టి, బయటివారు ఏమీ త్యాగం చేయలేరు, వారు దాచుకుంటారు. దాచుకున్నవన్నీ, ప్రకృతి తన కాలగర్భంలో దోచేసుకుంటుంది. మనం కూడా దాచుకుంటే, మనస్సు ముక్కలు ముక్కలుగా చేసుకుని, అంతిమంలో అరవ వలసి వస్తుంది. ఇదే భగవంతుని యొక్క సత్యమైన సందేశం!

## 413. అప్రాప్తి వస్తువు అనేది ఏ యుగంలో ఉండదు? ప్రాప్తులు ఎవరు పొందగలరు?

బ్రాహ్మణ జీవితంలో సంగమయుగంలో అప్రాప్తి అనేది ఏదీ లేదు. మీరు బాబా పిల్లలైన తర్వాత అప్రాప్తి పొందుతున్నారు అంటే నిర్లక్ష్యం, సోమరితనం అనే నిద్రలో జీవిస్తున్నారని అర్థం చేసుకోండి. భగవంతుని చదువులో, పాలనలో ఉన్నాం కాబట్టి, ప్రకృతి నుండి జన్మ తీసుకున్న వస్తు వైభవాలన్నీలోటు లేకుండా సమృద్ధిగా లభిస్తాయి. ఇది బాబా యొక్క గ్యారంటీ!

## 414. ధనం ఎక్కువైతే నష్టమేంటి?

బిందువు బిందువు కలసి చెరువుగా అవుతుంది కదా – అదేవిధంగా మనకు ఎక్కువ డబ్బు లభించినా మాయ వచ్చి శివబాబాను మరచిపోతాం. అందువలన ధనవంతులు ఎక్కువగా బాబా పిల్లలు కాలేరు. సత్య సంపాదన యొక్క ధనం కొంచెం అయినా గానీ అది ఎక్కువ ఫలాన్ని సమకూర్చుతుంది. ఈ విధంగా, స్థూలరూపంలో పేదలగా ఉన్నవారు మరియు సత్య సంపాదనలో ధనవంతులుగా ఉన్నవారు, ఒకటి కోటిరెట్లు ఫలితాన్ని పొందుతారు. ఒకవేళ ఇక్కడ మీరు విశ్రాంతి కోసం సంపాదించుకున్నది ఖర్చు చేస్తే, అక్కడ అనగా సత్యయుగంలో విశ్రాంతి తీసుకునే వారికి విశ్రాంతి యిచ్చే వారిగా అనగా దాసీలు అవుతారు. ఎవరైతే ప్రేమతో, సత్యమైన మనస్సుతో సంపాదించుకున్నది ఇస్తారో వారే సఫలం చేసుకుంటారు. వారే అనేకమంది ఆత్మల ఆశీర్వాదాలు తీసుకుంటారు. ఎవరి సేవకైతే నిమిత్తం అయ్యారో వారే మరలా ద్వాపరయుగంలో మీ భక్తులుగా జన్మ తీసుకుని మీ దేవతా విగ్రహాలకు పూజ చేస్తారు. ఎందుకంటే, సంగమయుగంలో మీ సత్యమైన ధనం వారిని బాబా దగ్గరకు చేర్చడానికి నిమిత్తమైంది. అటువంటి సేవకు ప్రతిఫలంగా ద్వాపరయుగం నుండి మీ జడదేవతా చిత్రాలకు పూజ చేస్తారు. మందిరాలు కట్టిస్తారు. బాబా సేవలో ఇచ్చారు కాబట్టి, బాబా మీకు సత్య–త్రేతా యుగాలలో చైతన్య దేవీ దేవతలుగా 21 జన్మల ప్రాప్తినిచ్చారు. కానీ ఆ ఆత్మల ద్వారా కూడా మీకు ద్వాపరయుగం నుండి మహిమ జరుగుతుంది. ఏ ఆత్మల సేవ కోసం అయితే ధనం ఇచ్చారో వారు అధికారిగా కాకపోయినా, సేవకు బదులుగా కొంతమంది ప్రజలుగా, కొంతమంది భక్తులుగా, చాలా కొద్దిమంది మీతోపాటు బాబాతో సంబంధం జోడించిన కారణంగా బాబాకు వారసులవుతారు.

## 415. ఎవరిని మరచిపోకూడదు? వారిని మరచిపోతే వచ్చే నష్టమేమిటి?

శివబాబా వెంట ఉన్న కారణంగా మీరు అమూల్యంగా అయ్యారు. బాబాను మరచిపోతే అది తప్పవుతుంది. తయారుచేసిన వారిని మరచిపోకూడదు. ఇదే అసలైన విధి. ఈవిధిని మరిచిపోతే, నాది అనే భావన వస్తుంది, అప్పుడు స్మృతి అనగా సఫలత రాదు, అనుభవం కూడా కాదు. బాబాను తొలగిస్తే, పాపం తప్పకుండా వస్తుంది. బాబా పేరు ఉన్నచోట పాపం నామమాత్రం కూడా ఉండదు. కనుక మీ విలువ అర్థమైందా!

## 416. బాబా యొక్క సాక్షాత్కారాలు అంతిమంలో ఏ బ్రాహ్మణ ఆత్మలు చేయించగలరు? మరియు అప్పుడు సమయం ఎలా ఉంటుంది?

సాక్షాత్కారాలు కూడా విచిత్రంగా జరుగుతాయి. ఒకసారి సాక్షాత్కారం అవ్వాలని అందరికీ కోరిక ఉంది కదా! చివరివరకు పక్కాగా ఉన్నవారికే సాక్షాత్కారం అవుతుంది. వారికే సంగఠన యొక్క బట్టీ ఉంటుంది. సేవ పూర్తయిపోయింది. ఇప్పుడు సేవ కారణంగా అక్కడికి ఇక్కడికి వెళ్ళిపోయారు, తరువాత నదులన్నీ సాగరంలో కలసిపోతాయి. కానీ సమయం నాజూకుగా ఉంటుంది. సాధనాలు ఉన్నప్పటికీ పనిచేయవు అందువలన బుద్ధిలైను స్పష్టంగా ఉండాలి. ఇప్పుడు ఏమేమి చేయాలి అనే సంకల్పం వస్తుంది. ఒక్క సెకను ఆలస్యం అయినా అదిపోతుంది. ఎలాగైతే వినాశనం చేసేవారు కూడా బటన్ నొక్కటం, ఒక్కసెకను ఆలస్యం చేస్తే ఏమౌతుంది? ఇక్కడ కూడా ఒక సెకను టచ్చింగ్ (సంకల్పం)లో ఆలస్యం అయితే చేరుకోవటం కష్టం అయిపోతుంది. వారు కూడా ఎంత ధ్యాసతో కూర్చుంటారు. ఇది బుద్ధి యొక్క సంకల్పం. ఎలాగైతే ఆదిలో ఇంటిలో కూర్చుని ఉండగానే రండి, చేరుకోండి అనే పిలుపు వచ్చేది, అలాగే అంతిమంలో కూడా బాబా యొక్క ధ్వని చేరుకుంటుంది.

## 417. అంతిమంలో "ఈ చోటు వదిలేయండి! ఈ చోటు వదిలేయండి!" అని శివబాబా సందేశం పంపుతారు. అది ఎవరికి అందుతుంది?

అంతిమ సమయంలో శివబాబా పరంధామం నుండి ఒక సంకల్పం చేస్తారు, ఆ సంకల్పం ఏమిటంటే మనం ఎవరైతే ఎక్కడెక్కడ ఉన్నామో, ఆ స్థానాలన్నీ వదిలేయండి అనే సందేశం ఈ భూలోకానికి పంపిస్తారు. ఆ సందేశం మనకు అందాలంటే ఇప్పటినుండి బుద్ధిలో బాబా విషయాలు తప్ప, ఏ విషయాలు లేకుండా స్పష్టంగా సత్యంగా ఉంచుకోవాలి. ఇప్పటినుండి ఆవిధంగా లేకపోతే అంతిమ సందేశం మనం గ్రహించలేము. అంతిమంలో ఒకే ఒక్క రైలు ఉంటుంది. ఈ సందేశం అందుకున్న వారు, ఆ రైలులో మధువనం చేరుకుంటారు. అక్కడ పర్వతాలపై తపస్సు చేసుకుంటారు. వదిలేసి వచ్చిన స్థలాలన్నీ వినాశనం అయిపోతాయి. మీరు విధ్యార్థియైనా, టీచరైనా ఆ సందేశం మనకు అందినప్పుడు మనం ఎవరెడీగా లేకపోతే అంతిమ రైలు అందుకోలేము. కొంతమంది టీచర్స్ నా వెంట సహయోగులు రావాలని అనుకుంటారు. ఆ సూక్ష్మ తగుల్పాటు యొక్క కోరిక ఆ టీచర్‌ని అక్కడే ఆపేస్తుంది. కావున ఇప్పటి నుండి టీచర్స్‌కి ఏ విధ్యార్థిపైన తగుల్పాటు ఉండకూడదు. అందుకే ముందుగా కొంతమంది విధ్యార్థులు ఏదొక రూపంలో మన నుండి వేరవుతూ ఉంటారు. అది అంతిమ పరీక్షకు పునాదిగా భావించి వేరైన ఆత్మతో తగుల్పాటు ఉంచుకోకూడదు. ఒకరు వెళ్ళిపోతే ఆ సమయంలో పదిమందిని బాబా మనకు సహయోగులుగా పంపిస్తారు అనే వాణీ ప్రమాణంగా నిశ్చింతా చక్రవర్తులుగా ఉండాలి, పెద్దపరీక్షకు ముందుగా

ఈ చిన్న పరీక్షలో పాస్ అయితే అంతిమ విజయం మీదే. ఇక్కడ గమనించవలసిన ముఖ్య విషయం ఏమిటంటే, కొంతమంది టీచర్స్ సందేశం అందిన తర్వాత కూడా బాబా ఆజ్ఞ ప్రకారం ఆ స్థానంలో ఉండి కొంతమంది ఆత్మలకు శక్తినిచ్చి వారిని కూడా వెంట తీసుకు వెళ్ళేలా డ్రామాలో నిర్ణయింపబడి ఉందని శివబాబా తెలియజేస్తున్నారు.

## 418. ఏ ధ్వని అందరి నోటి వెంట రావాలి?

అందరి నోటి నుండి సత్యజ్ఞానం ఇది, భగవంతుని జ్ఞానం ఇది అనే మాట రావాలి తప్ప, ఇది బ్రహ్మకుమారీ జ్ఞానం అని, ఓంశాంతి జ్ఞానం అని మాత్రమే కాదు, కేవలం ఆ మాటే వస్తే ఇతరులు భగవంతుని నుండి వారసత్వం పొందలేరు. మీరు ఎన్ని మేళాలు, ప్రదర్శనలు పెట్టినా ఈ విషయంపై ధ్యాస పెట్టుకోకపోతే బయట రూపంలో పెద్ద సేవగా కనపడినా, అది చీమమార్గపు సేవగా జమ అవుతుంది. అనగా చీమ ఎంత మెల్లగా ప్రయాణం చేస్తుందో, గమ్యం చేరాలంటే కష్టం కదా! ప్రజలను ఆకర్షించడానికి భక్తిమార్గపు ప్రదర్శనలు పెట్టినా కానీ, వారికి ఏదొక రూపంలో సత్యమైన బాబాను ప్రత్యక్షం చేసే పుస్తకాలను లేదా సి.డిలను ఇచ్చి వారి ఇంటి దగ్గర ఉంటూనే బాబాతో సంబంధం పెట్టుకొనేవారిగా తయారుచేయండి.

## 419. సాధనాలు ఎందుకు ఉన్నాయి? అవి ఎలా ఉపయోగించుకోవాలి?

ఏదొక సాకార సాధనాలను ఆధారంగా చేసుకున్నారు. సాధనాలు ఉంటే సేవ చేస్తారు, సాధనాలలో లోటు వస్తే సేవలో కూడా లోటు వస్తుంది. సాధనాలను కార్యంలో ఉపయోగించడం అనేది వేరే విషయం. కానీ సాధనాలకు వశమై సేవచేయటం, ఇది సాధనాలను ఆధారంగా తీసుకోవటం. సాధనాలు సేవ యొక్క వృద్ధి కోసం ఉన్నాయి. అందువలన సాధనాలను ఆధారంగా చేసుకోండి. ఆధారం ఒకే బాబా! వినాశి సాధనాలను ఆధారంగా చేసుకోవటం అంటే ఎలాగైతే సాధనాలు వినాశియో, అలాగే స్థితి కూడా అప్పుడప్పుడు చాలా ఉన్నతంగా, అప్పుడప్పుడు మధ్యంగా, అప్పుడప్పుడు క్రిందకు మారిపోతుంది. అవినాశి ఏకీరస స్థితి ఉండదు. కనుక వినాశి సాధనాలను ఆధారంగా భావించకండి. అవి నిమిత్తమాత్రంగా సేవ కోసం ఉన్నాయి. సాధనాల ఆకర్షణలో మనస్సు ఆకర్షితం కాకూడదు.

## 420. అంతిమ సమయం సమీపంగా వస్తున్నప్పుడు మనం ఏ పాత్ర అభినయించాలి? ఆ పాత్ర అభినయించడానికి ఏ విషయాలు ధారణ చేయాలి?

వరదాని రూపంలో సేవ జరుగుతుంది అనగా ఆ సమయంలో వాణి ద్వారా చెప్తే ఎవరూ వినరు, చెప్పలేము కూడా. సంకల్పాలలో శుభ భావన ద్వారా ఇతరులందరికీ శుభం జరుగుతుంది.

ఈ సేవ చేయడానికి మనం ఇప్పటి నుండి అందరిపై శుభ భావన, వృత్తి, దృష్టి శుభంగా పెట్టుకోవాలి. అంతిమంలో మిగిలిన సేవలన్నీ సమాప్తి అయిపోతాయి.

### 421. సంపూర్ణత సమీపంగా ఎప్పుడు వస్తుంది?

ఉపన్యాసం చెప్పటం, వేదిక తయారుచేయటం, ప్రదర్శనిలు పెట్టడం ఈ మహాయజ్ఞానికి కొంత సమయం వరకు అవసరం కానీ శాంతిశక్తి లేదా సంకల్పశక్తే సంపూర్ణతను సమీపంగా తీసుకువస్తుంది.

### 422. దేనిని బ్రహ్మాకుమారీ స్వరూపం అంటారు?

బ్రహ్మాకుమారి స్వరూపం అంటే సాకారి స్వరూపం అనగా ధరించే వస్త్రాలను బట్టి, పెట్టుకునే బ్యాడ్జిని బట్టి ఉంటుంది. కానీ ఈ స్వరూపంతో పాటు తపస్వి స్వరూపం కలిసి ఉన్నప్పుడే సేవలో బాబా ప్రత్యక్షమవుతారు.

### 423. జ్ఞానం యొక్క పాయింట్‌ను ఏవిధంగా తీసుకోవాలి?

ప్రతి పాయింట్‌ని కర్మలో అనుభవం చేసుకుని అనుభవీమూర్తిగా అవ్వాలి మరియు ఆ అనుభవం ఇతరులకు వినిపించి వారిని కూడా అనుభవీమూర్తులుగా తయారుచేయాలి. డైరీలు చాలా రాసుకుంటారు కానీ సమయప్రమాణంగా వాటిని ఉపయోగించినప్పుడే వాటి ఫలితం దక్కుతుంది.

### 424. ప్రతీ కర్మను ఏ విధంగా భావించాలి?

ప్రతీ పనిని యజ్ఞసేవగా భావించాలి. అప్పుడు పుణ్యఖాతా ఎక్కువగా జమ అవుతుంది అనగా సెంటరు కట్టించినా యజ్ఞ సేవగానే భావించాలి కానీ నిమిత్త ఆత్మకు సేవ చేస్తున్నట్లు భావించకూడదు. ఇక్కడ ప్రేమతో చేసిన శ్రమ అక్కడ తయారైన బంగారు మహల్స్‌ను ఇస్తాయి.

### 425. మొదటి లక్ష్మీనారాయణులకు, రెండవ లక్ష్మీనారాయణులకు తేడా ఎందుకు వచ్చింది?

బ్రహ్మాబాబా, శివబాబా యొక్క ఆజ్ఞ ప్రకారం తన జీవితాన్ని నడిపించుకుని మనందరి ముందు ప్రత్యక్ష రూపంలో ఉదాహరణ మూర్తిగా నిలిచారు. యువ జీవితం అనగా భగవంతుని తెలుసుకున్న వెంటనే నడిచే జీవితం, సేవా జీవితంలో అంతిమ జీవితంలో కూడా బ్రహ్మాబాబాను అనుసరించాలి. యువ జీవితం అనగా యజ్ఞం యొక్క స్థాపనా కార్యంలో  ఆలోచించి ఆలోచించి కాకుండా ఎంత తక్కువ సమయంలో సహయోగి అయ్యారో మరియు పాలనా కార్యంలో మీ యొక్క మరియు

ఇతరుల యొక్క విఘ్నవినాశకులుగా అవ్వడానికి ఎంత సమయం పట్టిందో ఈ విషయంలో బ్రహ్మాబాబాని ఎంత వరకు అనుసరించారు వీటన్నింటికీ కలిపి మార్కులు జమ అవుతాయి. ఆ మార్కులు ఆధారంగా రెండవ నెంబరు, మూడవ నెంబరు ఇలా లక్ష్మీ నారాయణుల నెంబరు తయారవుతుంది కాబట్టి సంఘటనలో సమస్యలు ఉంటాయి ఆ సమస్యలను దాటటానికి ఎంత సమయం బాబా స్మృతిలో దాటారు ఆ సమయం బట్టి నెంబరు లెక్కించబడుతుంది.

ఉదాహరణకు – బ్రహ్మాబాబాలో శివబాబా ప్రవేశించిన తర్వాత బ్రహ్మ ఎంత సమయంలో తనువు, మనస్సు, ధనం సర్వసంపత్తిసహితంగా, సర్వ సంబంధాల సహితంగా అర్పణ అయ్యి మనస్పూర్వక ప్రేమతో కనపడని భగవంతుడిని జీవిత భాగస్వామిగా చేసుకుని యజ్ఞం నడిపారు. అదేవిధంగా మిగిలిన లక్ష్మీనారాయణుల నెంబర్ ఫిక్స్ అవుతుంది. మధ్యలో యజ్ఞంలో వచ్చే విఘ్నాలు ఎలా దాటారో, బ్రహ్మాబాబా ఏవిధంగా ముందుకు వెళ్ళారో, అదే విధంగా ఇతర అష్టరత్నాల యొక్క నంబర్ ఆధారపడి ఉంటుంది. యజ్ఞం బికారీ స్థితిని ధారణ చేసినప్పుడు ఎంత సమయంలో మనస్సు చలించకుండా నిశ్చయంగా ఉందో ఆ సమయం కూడా లెక్కింపబడుతుంది. అదేవిధంగా మిగిలిన అష్టరత్నాల నెంబరు కూడా శివబాబా ఆవిధంగా చూస్తారు. అంతిమంలో బ్రహ్మ బాబా ఉన్న సమయంలో యజ్ఞం యొక్క అంతిమంలో లభించే పేరు, గౌరవం, ధనం, సాధనాలు బ్రహ్మాబాబా ఏవిధంగా స్వీకరించలేదో దాని ఆధారంగా మిగిలిన అష్టరత్నాలకు నెంబర్ ఉంటుంది. అంతిమంలో బ్రహ్మాబాబా అవ్యక్తమయ్యేముందు యజ్ఞ బికారీ స్థితిని దాటి సర్వ సుఖాలు సాధనాల రూపంలో లభించినా కానీ, బ్రహ్మాబాబా ఒక్క రూపాయి కూడా తన విశ్రాంతి కొరకు ఉపయోగించలేదు అని శివబాబా వాణీలో తెలియజేసారు అంటే, ఇప్పుడు ఈ సంస్థలో కూడా బికారి స్థితిని దాటి అన్ని సదుపాయాలు కలిగేలా డ్రామాలో నిర్ణయించబడినది మరియు ఇతరులు అనేక రకాలుగా సహయోగులౌతున్నారు. ఆ ఇతరుల సహయోగాల ద్వారా వచ్చే విశ్రాంతి నిచ్చే ఏ సాధనాలను మనం ఒక శాతం కూడా వాడకూడదని ఈ మహావాక్యం తెలియజేస్తుంది.

## 426. మాయా సమస్య యొక్క బంధనాలు ఎప్పుడు సమాప్తి అవుతాయి?

మాకు బాబా నుండి సహయోగం లభించలేదు, మాకు స్థానం లభించలేదు మొ॥వి అన్నీ వ్యర్థ విషయాలు. శివబాబాతో సంబంధం జోడించి కూర్చోండి. సర్వశక్తులు మీ ముందు హాజరౌతాయి. ఒకవేళ ఒకటి రెండు సెకన్లు అనుభవం కాకపోయినా అలజడి కాకూడదు. ధైర్యాన్ని వదలకండి. నిశ్చయం యొక్క పునాదిని వదలకండి. బాబా నా వారు, నేను బాబా వాడిని. అప్పుడు బాబా కూడా ఎక్కడకీ వెళ్ళలేరు. మీకు సహాయం ఇవ్వడానికి బందీ అయిపోతారు, అప్పుడు మాయా సమస్యలు తొలగిపోతాయి.

**427. నిరాకారుడు సాకారంలో ఏ విధంగా సహయోగి అవుతారు?**

శివబాబా నిరాకారుడు మనతో ఎలా మాట్లాడుతారు అని అనుకోకండి. ఎక్కడికి పిలిచినా అక్కడికి వెంటనే హాజరైపోతారు. ఇతరులు రావటానికి ఆలస్యమవుతుందేమో కానీ, బాబా మీ దగ్గరకు రావటానికి సహయోగం ఇవ్వటానికి ఆలస్యమవ్వదు. ఏవిధంగా సహయోగి అవుతారంటే, అక్కడ ఎవరో ఒకరు ఉంటే చాలు వారి శరీరంలో భగవంతుని శక్తి ప్రవేశించి, మీకు వెంటనే సహయోగం లభిస్తుంది. ఏదొక విషయంలో ప్రయోగం చేసి చూడండి. మీకే అనుభవం అవుతుంది.

**428. ఏయే విషయాలు పిల్లల చేతుల్లో ఉన్నాయి?**

మీ యొక్క శ్రేష్ఠ కర్మ ద్వారా భగవంతుని పేరు పైకి తీసుకురావాలన్నా లేదా సాధారణ నడవడిక ద్వారా చెడు పేరు తీసుకురావాలన్నా రెండూ పిల్లలైన మీ చేతుల్లో ఉంది.

**429. భక్తులు ఏయే రూపాలు కాపీ చేస్తారు?**

మీరు చేసిన కర్మలు, మీ గుణాల సూక్ష్మరూపాన్ని స్థూలరూపంలో భక్తులు అనుకరించారు. ఉదాహరణకు – మనం వ్యర్థ సంకల్పాలు చేయకుండా మదిని పరమాత్మ స్మృతిలో ఉంచి భోజనం తయారుచేస్తాం దానిని వారు మడి కట్టుకుని, ప్రసాదం తయారుచేసి భగవంతునికి నైవేద్యం పెట్టాలి అనే పద్ధతి పెట్టారు.

**430. సేవాదారులకు ఏ సంస్కారం ఉండకూడదు?**

వ్యక్తి యొక్క కోరిక అవ్వనివ్వండి, పాత్ర యొక్క కోరిక అవ్వనివ్వండి, వస్తువుల యొక్క వాయుమండలం యొక్క ఏదొక కోరిక కలిగిన వారిగా అవుతున్నారు. కోరిక అంటే పరవశం అయిపోతున్నారు. సేవాదారులలో ఈ సంస్కారమే ఉండకూడదు.

**431. సంగమయుగంలో ఇతరులకు బాబా పరిచయం యొక్క సేవచేస్తే, కల్పమంతా ఏ విధమైన ప్రాప్తి లభిస్తుంది?**

ఎవరైనా 50 – 60 సం॥లు సేవ చేసారనుకోండి, 5,000 సం॥లలో 50–60 సం॥లు తీసివేస్తే మిగిలినదంతా ప్రాప్తియే. సేవ 50–60 సం॥లు చేశారు, మిగిలినదంతా ఫలమే! ఈ అంతిమ జన్మలో కూడా మీరు దాసీగా అయ్యి ఎవరికీ సేవ చేయటం లేదు. చాలా మంచిగా ఏ కష్టం లేకుండా హాయిగా ఉన్నారు. ఈ భాగ్యం సేవ వలనే లభించింది.

### 432. సేవ మిక్స్ అయ్యి చేస్తే వచ్చే ఫలం ఏమిటి?

పది సం॥ల నుండి ఉన్న విధ్యార్థి కూడా కేవలం 2 సం॥ల నుండి సేవాకేంద్రంలో ఉంటున్న టీచర్‌ని దాదీ, దీదీ అంటారు అంటే ఇక్కడ కూడా ఉన్నత స్థితిలో చూస్తున్నారు కదా! గౌరవం ఇస్తున్నారు కదా! ఒకవేళ సత్యమైన సేవాదారీ అయితే ఇక్కడ కూడా గౌరవం లభించడానికి యోగ్యంగా అవుతారు. ఒకవేళ మిక్స్ అయితే ఈరోజు దాదీ, దీదీ అంటారు, రేపు మరలా మీ స్థితి గురించి చెబుతారు కూడా. సేవ మిక్స్ అయ్యి చేస్తే గౌరవం కూడా మిక్స్ అయినదే లభిస్తుంది.

### 433. మహాన్ ఆత్మలు ఎప్పుడు వంగవలసి ఉంటుంది? దానివలన లాభం ఏమిటి?

బ్రహ్మాబాబా కంటే మీరు గొప్పవారు కాదు కదా! అనేకుల సేవ కోసం మహానాత్మలైన మీరు వంగవలసిందే! ఏదైనా విషయం గురించి ఎక్కువమంది మీకు సైగచేస్తే ఆ సమయంలో మీరు చేసేది మీకు తప్పు కాదని అనిపించినా కానీ, లోక మర్యాదకోసం, వారి సైగను అర్థంచేసుకుని భగవంతుడు మాకు వీరి ద్వారా ఆజ్ఞ ఇస్తున్నారని భావించి, వారి ముందు వంగిపోండి. ఒకవేళ మనం ఏదైనా పొరపాటు చేస్తే ఆ విషయాన్ని కూడా మనం అంగీకరించాలి. ఈవిధంగా, ఇతరుల ముందు వంగటం వలన వారినుండి మనకు సదాకాలికంగా గౌరవం లభిస్తుంది. బ్రహ్మాబాబాను ఎంతోమంది అగౌరవపరిచారు, లేనిపోని నిందలు వేసారు. బ్రహ్మాబాబా అన్నీ సహించి పరివర్తన చేసారు. ఈ విషయంలో బ్రహ్మాబాబాను అనుసరించండి.

### 434. సత్యతాశక్తి ఏయే కార్యాలు చేస్తుంది?

సత్యతాశక్తి మొత్తం ప్రకృతినే సత్వ ప్రధానంగా చేసేస్తుంది. యుగాన్నే సత్యయుగంగా తయారుచేస్తుంది. సర్వ ఆత్మలకు సద్గతి యొక్క అదృష్టం తయారు చేస్తుంది. ప్రతీ ఆత్మ, మీ సత్యతా శక్తి ద్వారా తమ యొక్క శక్తి ననుసరించి తన ధర్మంలో, తన సమయంలో, గతి తర్వాత సద్గతిలోనే అవతరిస్తారు. ఎందుకంటే, సంగమయుగంలో విధివిధాతల ద్వారా అంతిమం వరకు కూడా బాబాను స్మృతి చేసే విధి యొక్క సందేశం తప్పకుండా లభిస్తుంది. కొంతమందికి వాణా ద్వారా, కొంతమందికి చిత్రాల ద్వారా, కొంతమందికి వార్తల ద్వారా, కొంతమందికి మీ యొక్క శక్తిశాలీ తరంగాల ద్వారా, కొంతమందికి అంతిమ వినాశ లీల యొక్క అలజడి ద్వారా, కొంతమందికి వైరాగ్యవృత్తి యొక్క వాయుమండలం ద్వారా లభిస్తుంది. ఇలా సైన్సు సాధనాలన్నీ ఈ సందేశం ఇచ్చే కార్యంలో మీకు సహయోగం ఇస్తాయి. భిన్నభిన్న సంస్కారం గల భక్తి ఆత్మలను, రాజకీయ నాయకులను, కష్టించి పనిచేసే కార్మికులను, కర్మలఖాతాను భిన్నభిన్న రూపాలలో అనుభవిస్తున్న ప్రతీ ఒక్కరిని పరమాత్మ శివుని యొక్క సత్యతాశక్తి మనద్వారా అనగా, జ్ఞాన యోగాలలో సంపూర్ణమైన వారి ద్వారా పైన చెప్పిన వారందరిని సత్యంగా తయారు చేస్తారు. కానీ వీరు ఒక్క జన్మలోనే సత్వ, సతో, రజో, తమోలోకి వచ్చేస్తారు.

### 435. సంగమయుగంలో ప్రకృతి ఏవిధమైన పాత్రను అభినయిస్తుంది?

సంగయముగంలోనే ప్రకృతి సహయోగి అయ్యే పాత్రను ప్రారంభిస్తుంది. సాగరం తనలో ఉన్న వజ్రాలను భారతభూమికి తీసుకు వచ్చే సహయోగం చేస్తుంది. అలాగే భూమి కంపించి పాత ప్రపంచాన్ని సంపూర్ణంగా తన గర్భంలో కలిపేసుకుని, స్వర్గం యొక్క బంగారు మహల్స్‌ని ప్రత్యక్షం చేస్తుంది. అదే స్వర్గం. కొన్ని గాలికి ఎగిరిపోతాయి. కొన్ని వర్షం ద్వారా సముద్ర గర్భంలో కలిసిపోతాయి. ప్రకృతి అంతా శుభ్రమై, స్వర్గ భూమిగా మారిపోతుంది. ఇలా సంగమయుగంలో, జడమైన ప్రకృతి చేసిన కర్తవ్యాన్ని మరిచిపోయి భక్తులు వాటికి దేవతా స్వరూపాన్ని ఇచ్చి పూజలు కూడా చేస్తున్నారు. సూర్యుడు పంచ తాత్వాల్లో ఒక తత్వం కానీ మనిషి రూపం ఇచ్చి, మహిమ చేస్తున్నారు. ఎందుకు? ద్వాపరయుగం నుండి భక్తులు ఇలా పూజ చేస్తున్నారంటే సంగమయుగంలో పంచతత్వాలు బాబా సేవలో సహయోగం అందించాయి కనుక.

### 436. సమస్యలు ఏవిధంగా వస్తాయి?

సమస్యలు ఏవిధంగా వస్తాయంటే, మున్ముందు ప్రపంచంలో ఉండే స్థూల సాధనాలన్నీ, అనగా కరెంటు ద్వారా పనిచేసే సాధనాలన్నీ సమాప్తి అయిపోతాయి. ఆ తర్వాత శాంతిశక్తి ప్రపంచం ముందు ప్రత్యక్షం అవుతుంది. సైన్సు సాధనాలన్నీ సమాప్తి అయిపోతాయి.

### 437. ట్రాన్స్‌కు, దివ్యదృష్టికి గల తేడా తెలుపుము?

దివ్యదృష్టి అనేది ఆత్మీయతతో నిండిన దృష్టి. దీని ద్వారా ఎక్కడో దూరంగా వున్న వారికి కూడా ఆత్మ పరిచయం, ఆత్మిక తండ్రియైన శివపరమాత్మ యొక్క స్వరూపాన్ని సాక్షాత్కారం చేయించవచ్చు. ఆత్మను చూడడానికి వారు శ్రమ చేయవలసిన అవసరం ఉండదు నేను ఆత్మను, ప్రపంచంలోని వారందరూ ఆత్మలే! ఆత్మల తండ్రి ఒక్కరే! అని దివ్యదృష్టి ద్వారా అనుభవం అయిపోతుంది. ట్రాన్స్ అంటే విశేష పురుషార్థీ యోగశక్తిగల కొంతమంది ఆత్మలు పరమాత్మ దగ్గర నుండి కొన్ని విషయాలకు సమాదానం తీసుకువస్తారు. దీనినే ట్రాన్స్ అంటారు.

### 438. అంతిమంలో ఏ శక్తి ద్వారా ప్రజలు, భక్తులు తయారవుతారు?

ఈ పాత ప్రపంచం యొక్క వినాశనానికి ముందు అనగా సంగమయుగం యొక్క సమాప్తికి ముందు శివబాబా జ్ఞాన రాజ యోగాలలో సంపూర్ణత పొందిన వారి ద్వారా ఇతరులకు కొన్ని శక్తులు అనుభవం చేయిస్తారు. సంపూర్ణ సంపన్న ఆత్మ ఎదురుగా కొంతమంది వచ్చి ఆ సంపూర్ణ సంపన్న ఆత్మనే దేవతా స్వరూపంగా అనుభవం చేసుకుంటారు. వారి ద్వాపరయుగంలో జన్మ తీసుకుని గత కల్పం సంగమయుగంలో చూసిన దేవతా స్వరూపాన్ని విగ్రహంగా తయారుచేసి

పూజలు చేస్తారు. కొంతమందికి ఆ సంపూర్ణ ఆత్మల యొక్క శరీరం విశ్వమహారాజు రూపంలో సాక్షాత్కారం అవుతుంది. వారు ఆయాయుగాల్లో వారికి ప్రజలుగా వస్తారు. ఈవిధంగా పరమాత్మ శివుడు చెప్పిన చదువును సంపూర్ణంగా చదువుకుని సంపన్నంగా అయిన ఆత్మల ద్వారా ఈవిధమైన అద్భుత లీలలు శివబాబా చేయిస్తారు. ఈ యజ్ఞం ఎలా జరుగుతుందో చూద్దాం అని ముందునుంచి వేచిచూసేవారు అంతిమంలో కూడా దూరం నుండి నిరీక్షణలోనే ఉండిపోతారు కానీ రక్షణ పొందలేరు. అటువంటి విరోధి ఆత్మలను కూడా శాంతిశక్తి ద్వారా పరివర్తన చేసి పరంధామానికి పంపిస్తారు. వీరే భక్తుల్లోకెల్ల ఆఖరి వారు.

## 439. టీచర్, నేను టీచర్‌ని అనుకుని సేవ చేస్తే వచ్చే నష్టం ఏమిటి?

సేవాదారీ అంటే జ్ఞాని మరియు తపస్వీ. ఎక్కడ త్యాగం, తపస్సు ఉంటాయో అక్కడ భాగ్యం దాసీ హాజరవుతుంది. ఒకవేళ మీరు మిమ్మల్ని టీచర్‌గా భావిస్తే వచ్చేవారు కూడా కొద్దిగా ముందుకు వెళ్ళిన తర్వాత తమని తాము టీచర్‌గా భావిస్తారు. టీచర్‌గా భావించడం ద్వారా స్టేజ్ (గద్దె) లభించాలి, స్థానం లభించాలి అనే సూక్ష్మ కోరిక ఉత్పన్నమౌతుంది. ఇది మాయ యొక్క చాలా పెద్ద విఘ్నం. టీచర్ అనుకుంటే సీట్ కావాలి, పేరు కావాలి, గౌరవం కావాలి అనే మాయ వస్తుంది. సేవాదారులు అంటే ఇచ్చేవారిగా ఉంటారు కానీ తీసుకునేవారిగా కాదు. కనుక నిమిత్త ఆత్మ అయిన మీరు ఏవిధంగా ఉంటారో విద్యార్థులు కూడా అదేవిధంగా ఉంటారు. అప్పుడు నలువైపుల త్యాగం, తపస్సు యొక్క వాతావరణం ఉంటుంది. ఎక్కడ త్యాగం, తపస్సు యొక్క వాతావరణం ఉంటుందో అక్కడ సదా నిర్విఘ్న స్థితి ఉంటుంది. కనుక అందరూ సేవాదారులే కదా. మనం టీచర్ అనుకుంటే విద్యార్థులు కూడా మేము కూడా తక్కువ కాదు అంటారు. సేవాదారీ అనడం ద్వారా అందరూ నెంబర్‌వన్ మరియు ఒకరికంటే ఒకరు తక్కువ కాదు. కనుక మీ పేరు సేవాదారి అని భావించండి మరియు నడవండి. అన్ని విఘ్నాలకు మూలం మిమ్మల్ని మీరు టీచర్‌గా భావించి స్టేజ్ తీసుకోవటం. అప్పుడు అందరు ఫాలో టీచర్ అవుతారు కానీ ఫాలోఫాదర్ అవ్వరు. వృద్ధిని అయితే పొందుతున్నారు కానీ ఇప్పుడు వృద్ధితో పాటు విధిపూర్వక వృద్ధిని పొందుతూ ఉండండి. విధి తక్కువగా ఉంటే వృద్ధిలో విఘ్నాలు ఎక్కువగా ఉంటాయి. కనుక విధి సంపన్న వృద్ధిని పొందేవారిగా అవ్వండి.

## 440. ప్రతీ గృహం ఏవిధంగా మారాలి?

శాంతి స్థానంగా, శివాలయంగా మారాలి. ఇది భగవంతుని యొక్క శుభ ఆశ.

## 441. అంతిమంలో మన నెంబరును ఏవిధంగా తక్కువ చేసుకుంటాం?

కొద్దిపాటి అల రూపంలో శివబాబాపై నిశ్చయంలో అనుమానం వచ్చిందంటే అంతిమంలో మీ నెంబర్ దూరం చేసుకుంటారు.

## 442. డబల్ సేవాదారీ యొక్క విశేషతలు ఏవిధంగా ఉంటాయి?

డబల్ సేవాదారీ అనగా లౌకిక అలౌకిక జీవితాన్ని సమానం చేసుకుంటూ ముందుకి వెళ్ళేవారు. ఇలాంటి వారు కుటుంబంలో ఉంటూ కుటుంబసభ్యులను వదిలివేయకుండా వారికి కావలసిన సదుపాయాలను సమకూర్చుతూ అనాశక్త భావనతో ఉంటారు. ఉదాహరణకు కుటుంబ సభ్యులలో ఒకరు టి.వి కొనమన్నారనుకోండి – వారికి టి.వి. కొనిఇస్తారు కానీ వారికి మాత్రం టి.వి చూడాలని, అల్పకాలిక ఆనందం పొందాలనే సంకల్పమాత్రం కోరిక కూడా ఉండదు. వ్యక్తి, వస్తు వైభవాలపై ఆసక్తి ఉండదు కనుక పరమాత్మ యొక్క దివ్యశక్తి నిరంతరం వారి ఆత్మలో ప్రవహిస్తూ ఉంటుంది. వారు లౌకిక కుటుంబంలో ఉంటున్నప్పటికీ ఈశ్వరీయ సేవ కోసం తనువు, మనస్సు, ధనంలో ఒక వాటా తీస్తారు. వీరు బాబా దృష్టిలో నంబర్‌వన్ ఆత్మలు. డబల్ సేవాదారులు. హృదయ సింహాసనాదికారులు, రెండవ వారు త్యాగం చేసి భాగ్యాన్ని తయారుచేసుకుని భవిష్యత్తుకు జమ చేసుకోకుండా ఈ జన్మలో అప్పుడే వాడేస్తారు. ఉదాహరణకు – ఎక్కడైనా ఒక సేవాకేంద్రం పెట్టినప్పుడు, ముందుగా వారి తనువు, మనస్సు ధనాలను ఇతరుల కళ్యాణం కొరకు అర్పితం చేస్తారు కానీ వారిలో ఒక సూక్ష్మ కోరిక ఉంటుంది. అదేమిటంటే చతురతతో ఖర్చు చేసి దానిని తిరిగి ఆత్మల నుండి పొందాలనే కోరిక వారిలో ఉంటుంది. మూడవ నెంబర్ వారికి త్యాగం ఉండదు. ఇతరులు త్యాగం చేసి పొందిన భాగ్యాన్ని వీరు ఆరగించేస్తారు. ఉ దాహరణకు – బాబా కోసం అర్పితం చేసిన ధనాన్ని, వీరు స్వయం కోసం మరియు స్వయం యొక్క సుఖం కోసం వ్యర్థం చేసేస్తారు. వారు మాత్రం త్యాగం చేయరు. పై మూడు విషయాలను పరిశీలించుకొని, మీరు ఏ నెంబర్ వారో తెలుకోండి. బాబా చెప్పవలసిన అవసరం లేదు.

## 443. ఒకటికి కోటి రెట్లు ఏవిధంగా జమ అవుతాయి?

భవిష్య ఫలమైతే అనాది నిమయం అనుసరించి లభించవలసిందే! కానీ సంగమయుగం వరదాని యుగం. ఇప్పుడిప్పుడే త్యాగం చేసారు, వెనువెంట ప్రత్యక్ష ఫలం ఇప్పుడిప్పుడే లభిస్తుంది. కానీ ఇప్పుడిప్పుడే తినేయకూడదు. ఇది ప్రసాదంగా భావించి, అందరికీ పంచి పెట్టాలి. లేకపోతే శివబాబా ముందు అర్పణ చేసేయాలి. అప్పుడే ఇటువంటి ఆత్మలకు ఒకటికి కోటిరెట్లు వర్తమానం మరియు భవిష్యత్తులో కూడా ఫలం జమ అవుతుంది. ఇది కర్మల యొక్క సూక్ష్మ గుహ్యా రహస్యం.

## 444. నిస్వార్థ సేవ అనగానేమి?

మీ తనువు ద్వారా, మనస్సు ద్వారా, ధనం ద్వారా, ఇతరుల సంబంధాన్ని భగవంతుని యొక్క సంబంధంలోకి తీసుకువచ్చే విధంగా సహయోగం ఇవ్వండి. ఇదే నిస్వార్థమైన సేవ.

**445. సూక్ష్మశక్తి ఎప్పుడు గుప్తం అవుతుంది?**

స్థూల సాధనాల యొక్క విస్తారంలో సూక్ష్మశక్తి గుప్తం అవుతుంది. ఏవిధంగా అయితే వృక్షం యొక్క విస్తారంలో బీజం దాగిపోతుందో, అదేవిధంగా స్థూల సాధనాల యొక్క ఆనందంలో సూక్ష్మ ఆనందం కోల్పోతాం. ప్రపంచం వారందరి దగ్గర సాధనాలున్నాయి కానీ ఇదే లోటుగా ఉంది. దానిని శివపరమాత్మ మీ ఒక్కరికే బహుమతిగా ఇచ్చారు. ఎందుకంటే మీరు భగవంతుడిని గుర్తించారు కనుక.

**446. మహాభోగ్ అని దేనిని అంటారు?**

స్థూల భోగ్ (నైవేధ్యం) అయితే భక్తులు కూడా దేవతా విగ్రహాల ముందు అర్పితం చేస్తున్నారు. మీరు స్వయాన్ని బాబా ముందు అర్పణ చేసుకోండి. దీనినే మహాభోగ్ అంటారు. ఫలాన్ని బాబా ముందు పెట్టి బాబాకి సమర్పించటం ఒక విషయమైతే స్వయం సంపన్న ఫలంగా తయారై బాబాకి అర్పణ అవ్వటమే మహాభోగ్.

**447. పరివారం యొక్క అర్థం ఏమిటి? సేవలో ప్రతీ ఒక్కరిని ఎవరి దగ్గరకు చేర్చాలి?**

అల్పకాలిక ప్రాప్తినిచ్చే నామధారీ మహాత్ములు కూడా ఇతరులకు ప్రేమనిస్తారు. మంచి విషయాలు తెలియజేస్తారు కానీ పాలన ఇవ్వలేరు. కాబట్టి వారు శిష్యులుగానే ఉండిపోతారు. వారికి పాలన ఇచ్చి పెద్దవారిగా చేసి భగవంతునితో కలుపలేరు. వారి దగ్గరే ఉంచుకుంటారు. అటువంటి వారు బాబా నుండి వారసత్వం తీసుకోలేరు. అదేవిధంగా బ్రాహ్మణాత్మలైన మీరు ఇతరాత్మలను బాబా దగ్గరకు చేర్చటంలో విఫలం అయ్యి స్వార్థంతో మీ దగ్గరకు చేర్చుకుంటే మీరు కూడా ద్వాపరయుగం యొక్క గురువులతో సమానం. పరివారం యొక్క అర్థం ప్రేమ మరియు సత్యమైన పాలన. అందరికీ ఏకైక తండ్రి అయిన శివబాబాతో కలపాలి. లౌకిక తల్లి కూడా పిల్లలను తండ్రితో కలుపుతుంది కదా. మా స్థానం, మా సేవ, మా విధ్యార్థులు, మా సహయోగీ ఆత్మలు... ఇలా బావించడం కూడా సేవ యొక్క బంధనలో చిక్కుకుపోవడం. భగవంతునికి సమీపంగా అవ్వకుండా ఎవ్వరూ కూడా ఈ సృష్టిలో కర్మాతీత స్థితి పొందలేరు, దేవతలు కాలేరు.

**448. క్రోధం యొక్క సూక్ష్మ రూపం ఏవిధంగా ఉంటుంది?**

క్రోధం యొక్క సూక్ష్మరూపం కార్యంలో చిటపటల రూపంలో, అసహ్యించుకునే భావనలో ఉంటుంది. క్రోధం అనేది అగ్ని వలె కాల్చి వేస్తుంది. క్రోధంతో ఇతరుల నుండి వేరవ్వటం అనేది కూడా క్రోధం యొక్క అంశం, ప్రియంగా ఉంటూ అతీతంగా ఉండటం అనేది అసలైన విషయం.

సూక్ష్మ అసహ్య భావం ఏవిధంగా ఉంటుందంటే, వీరు మారరు, వీరు ఇంతే అని సూక్ష్మంగా శాపం ఇస్తారు. మీరు రక్షణగా ఉండండి. కానీ వారికి ఫైనల్ సర్టిఫికెట్ ఇవ్వకండి. వారిని బాబాయే నిమిత్తం చేసారు, బాబాయే మారుస్తారు, ఇతరులను పడవేసి స్వయాన్ని రక్షించుకోవటం అనేది బ్రాహ్మణుల లక్షణం కాదు. ఇటువంటి చిన్నచిన్న విషయాలు మనస్సుని బలహీనం చేసేస్తాయి. అదేవిధంగా అహంకారం ఏవిధంగా వస్తుందంటే బాబా ఇచ్చిన విశేషతను మీదిగా భావించడం వలన అహంకారం వచ్చేస్తుంది. నింద, స్తుతి కూడా బాబాకు అర్పణ చేసేయండి. మోహం ఏవిధంగా వస్తుందంటే, ఈ వస్తువు నాకు అవసరం లేదు కానీ ఉంటే మంచిదనిపిస్తుంది. అదేవిధంగా ఈ వ్యక్తితో ఉండటం ఇష్టం అనటం కూడా మోహంలోనికి వస్తుంది. అన్ని వస్తువులు మరియు అందరూ ఇష్టమనిపించాలి. అందరితో అతి ప్రియంగాను మరియు అతీతంగాను ఉండాలి. అప్పుడే మోహాన్ని జయించగలరు. 36 రకాల పిండివంటలతో కూడిన భోజనం మంచిగా అనిపించాలి, అలాగే ఎండిపోయిన రొట్టె కూడా ఇష్టమనిపించాలి. భోజనం అంటేనే మందు. మందు శరీర అనారోగ్యానికి ఎంత అవసరమో, ఆత్మను దివ్యగుణాలతో అలంకరించుకోవడానికి ఏ పదార్థమైన ఎలా వున్నా భగవంతుని ప్రసాదంగా భావించి, స్మృతిలో ప్రతీ ముద్ద ముద్ద తీసుకోవాలి. ఈ స్మృతి మనస్సుని శుద్ధి చేస్తుంది. ఇక లోభం యొక్క అంశం ఏవిధంగా ఉంటుందంటే, ఏ వస్తువుపై కోరిక లేదు అయినా మంచిగా అనిపిస్తుంది. మంచి అనేది అన్ని వస్తువులపైన మంచిగా అనిపించాలి.

### 449. మీ ధనం, యజ్ఞంలో ఉపయోగించుకోమని శివబాబా ఎందుకు చెప్పారు?

సమయం తక్కువ ఉంది, ప్రాప్తి ఎక్కువ సంపాదించుకోవాలి. అందువలన తనువు, మనస్సు, ధనాన్ని ఉపయోగించుకోమని బాబా చెప్పినప్పటికీ ధనానికి ఎందుకు ప్రాధాన్యత వస్తుందంటే, ప్రతీ జన్మలో ధనం కూడా ఒక శక్తిలా వెంట రావాలి. కాబట్టి సంగమయుగంలో ధనాన్ని శివబాబా సేవలో ఉపయోగించినప్పుడు మీ ఖాతాలో మార్కులు జమ అవుతాయి. దాని ద్వారా కూడా మీ నెంబర్ ముందుకు వెళుతుంది. మీ ధనం ఉపయోగించండి అని మీ లాభం కోసమే భగవంతుడు శివబాబా మీకు తెలియజేస్తున్నారు. ధనం యొక్క సబ్జక్టులో ఒక్క రూపాయి మనస్సుతో ఇచ్చినా, కోటానుకోట్లగా జమ అయ్యి ప్రతీ జన్మకు మీ వెంట వస్తుంది. గవర్నమెంట్ వారు కూడా రిటైర్ అయిన తర్వాత కూడా ఆఫీసులో పని చేయకపోయినా కానీ అతను జీవించి ఉన్నంతవరకు ఫించను ఇస్తారు మరియు ఆ వ్యక్తి చనిపోయిన తర్వాత కుటుంబసభ్యులకు ఆ పింఛనులో సగభాగం ప్రతీ నెల ఇస్తారు కదా. ఒక్క జన్మకే కలియుగీ గవర్నమెంటు ఇన్ని సదుపాయాలు చేకూర్చినప్పుడు, భగవంతుడు ఇంకా ఎంత ఎక్కువ చేస్తారో కదా!

## 450. డ్రామా మిమ్మల్ని ఎప్పుడు ఉద్యోగం చేయనివ్వదు?

మీరు ఉద్యోగం చేస్తూ కూడా సంకల్పంలో దృఢంగా ఉద్యోగ మానేయాలని మీకు కలిగినప్పుడు, ముందుగా మీరు సేవలో బిజీ అవ్వండి. అప్పుడు నిమిత్త ఆత్మలు గాని, డ్రామా కానీ మిమ్మల్ని ఉద్యోగం నుండి విడిపించి శ్రేష్ఠ సేవాధారిగా పాత్ర అభినయించేలా చేస్తారు. అప్పటివరకు మీరు వేచి చూడండి. శివబాబాయే ఏదోలాగున విడిపిస్తారు. కేవలం మీరు ఉద్యోగం మానేసి ఖాళీగా ఉంటే సమయం పొదుపు అనే ఖాతాలో జమ అవ్వదు.

## 451. ఏ పరిస్థితిలోనైనా సంస్కారాల యొక్క గొడవ జరుగుతున్నప్పుడు మనం ఏ స్థితి ధారణ చేయాలి?

మీరు సంస్కారాన్ని మొదటే పరిశీలన చేసుకోవాలి. ఒకవేళ ఎవరితోనైనా సంస్కారాల యొక్క గొడవ జరుగుతుంటే, వారి నుండి అతీతం అవ్వటమే మంచిది. ఏ పరిస్థితుల్లో సంస్కారాల యొక్క గొడవ జరుగుతుందో దానిలో వేరుగా అయిపోవటమే మంచిది.

## 452. నిర్బల ఆత్మ లేదా శక్తిశాలీ ఆత్మ లేదా సర్వశక్తిసంపన్న ఆత్మ అని మనం ఎలా గ్రహించగలము?

పైన తెలిపిన మూడు రకాల ఆత్మలను ఏవిధంగా గుర్తిస్తామంటే చేసే కర్మల ఆధారంగా గుర్తిస్తాము. కర్మే దర్పణం అవుతుంది. సంకల్పం యొక్క శక్తి చాలా సూక్ష్మం మరియు చాలా శ్రేష్ఠం కానీ దానిని ఇతరులు గ్రహించలేరు. ఎందుకంటే అది సూక్ష్మశక్తి. నిర్బల ఆత్మ అనగా – స్వయం భగవంతునితో సంబంధం జోడించలేదు. వీరు సర్వశక్తి సంపన్న ఆత్మలతో తమ బలహీనతలను తెలిపి సరిదిద్దుకోవాలి. స్వయంలో బలహీనతలను దాచుకోకూడదు. తెలుసుకుని స్వయం నడిపించుకోకూడదు. అప్పుడు వారి నంబర్ నిర్బల ఆత్మ నుండి శక్తిశాలీ ఆత్మల జాబితాలోకి మారిపోతుంది. సర్వశక్తి సంపన్న ఆత్మ అనగా, ధారణా శక్తి, యోగ ప్రయోగ శక్తి నిరంతరం ఉంటాయి. దానినే ధర్మశక్తి అంటారు. ధర్మశక్తి కలిగిన ఆత్మలు ఎవరైతే ద్వాపరయుగం నుండి వచ్చారో వారి విశేషత ఏమిటంటే, మనుష్య ఆత్మలను పరివర్తన చేయడం. ఈవిధంగా కొందరు బౌద్ధులుగా, కొందరు క్రైస్తవులుగా, కొందరు మత సాంప్రదాయులుగా అయ్యారు. ధర్మశక్తి అంటే పరివర్తన చేసే శక్తి. ధర్మశక్తి కలవారు పరిపక్వ స్థితి కలిగి వారు పరివర్తనై, ఇతరులను పరివర్తన చేస్తారు. అనగా, బీజరూపుడైన శివపరమాత్మ నుండి గుప్త రూపంలో శక్తిని తీసుకుంటూ, చెట్టుకు మగ్గిన ఫలం వలె వారు భుజిస్తూ కొంతబాగం ఇతరులకు అర్పణ చేస్తారు. ఎన్ని అత్యాచారాలు జరిగినా, గ్లాని చేసినా, వ్యతిరేకం చేసినా, తమ ధారణలో పక్కాగా ఉంటారు. భగవంతుని ఆశీర్వాదంతో సంపూర్ణ సంపన్న స్థితిని పొందుతారు.

## 137. మనస్సు యొక్క పవిత్రత గురించి వివరింపుము?

మీ మనసా శక్తి యొక్క తరంగాలు దు:ఖీ, అశాంతి ఆత్మలకు చేరటం లేదంటే, మీ మనస్సు పవిత్రంగా లేనట్లే! సంపూర్ణ పవిత్రత అంటే స్వయం సుఖ-శాంతి స్వరూపంగా ఉండాలి, ఇతరులకు కూడా సుఖ-శాంతిని ఇవ్వాలి. ఈవిధంగా ప్రకృతి కంటే ముందు వ్యక్తులు పరివర్తన అవుతారు. ఆ వ్యక్తులే సత్యయుగంలోకి రావడానికి అర్హత కలిగి ఉంటారు. అందుచేత ముందు మీరు మారితే, ప్రకృతి ఒక్క సెకనులో మీ పవిత్ర తరంగాల ద్వారా పరివర్తన అవుతుందని శివబాబా తెలియజేస్తున్నారు.

## 453. సంగమయుగం యొక్క శ్రేష్ఠ ప్రాప్తి నుండి ఎప్పుడు వంచితం అయిపోతారు?

మనస్సులోనైనా, వాచాలోనైనా, కర్మలోనైనా అశుద్ధత అనేది సంగమయుగం యొక్క శ్రేష్ఠ ప్రాప్తి నుండి వంచితం చేసేస్తుంది. ఏ ఆత్మపైనైనా అశుద్ధ భావన వుంటే ఆ ఆత్మ గురించి శివబాబాకి మన:స్ఫూర్తిగా తెలియజేసి, మీ మనస్సుని నిర్మలం చేసుకోండి. అంతేగాని పెద్దవారి ముందు, దాదీల ముందు, బుద్ధి చతురతతో అసత్యాన్ని సత్యంగా ఒప్పించి ముందుకు వెళితే, 2, 3 సం॥ల వరకుపేరు పొందుతారు కానీ, అనేక జన్మల శ్రేష్ఠ భాగ్యం నుండి వంచితం అయిపోతారు.

## 454. ఏ వృత్తి ద్వారా మాలలో మంచి నెంబరు తీసుకుంటారు?

సేవాదారి అయ్యి, సేవాకేంద్రంలో ఉండటమే శ్రేష్ఠ త్యాగం లేదా భాగ్యం అని చెప్పటం లేదు. కుటుంబంలో ఉంటూ నిమిత్తంగా ఉండే ఆత్మలు కూడా త్యాగ వృత్తి ద్వారా మాలలో మంచి నంబర్ తీసుకోవచ్చు. కానీ సత్యమైన స్వచ్ఛమైన మనస్సు కలిగి నిమిత్త భావనతో ఉండాలి. ఇద్దరికీ భాగ్యం పొందే అదికారం ఉంది. శ్రేష్ఠ భాగ్యాన్ని తయారు చేసుకోవటానికి ఆధారం శ్రేష్ఠ సంకల్పం మరియు శ్రేష్ఠ కర్మ. నిమిత్త ఆత్మ అయినా మరియు సేవాదారీ ఆత్మ అయినా దీని ఆధారంగా నంబర్ తీసుకుంటుంది. ఇద్దరికి భాగ్యం తయారు చేసుకునేటందుకు పూర్తి అధికారం ఉంది. ఎవరు అవ్వాలనుకుంటున్నారో, ఎంతగా అవ్వాలను కుంటున్నారో, అంతగా తయారవ్వవచ్చు. సంగమయుగానికి వరదాత ద్వారా డ్రామానుసారం వరదానం లభించింది. ఎవరు కావాలంటే వారు శ్రేష్ఠ భాగ్యాన్ని తయారు చేసుకోవచ్చు.

## 455. రెండు మాలలు ఎందుకు తయారయ్యాయి? మరియు ఆ మాలలలో నెంబర్‌వారీ పూసలు ఎందుకు తయారయ్యాయి?

కొంతమంది మనసా స్నేహంతో సేవ చేస్తున్నారు. కొంతమంది బుద్ధి యొక్క అభిమానంతో సేవ చేస్తున్నారు. బుద్ధి తేజంగా ఉంటుంది. పాయింట్సు చాలా ఉంటాయి. వీరు బుద్ధి ద్వారా చేస్తారు.

బాబా వాక్యాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా అక్కడక్కడి వాక్యాలు కలిపి చెబుతారు. దీనికారణంగా ఆత్మలకు కేవలం చెప్పడం ద్వారా, పిలవడం ద్వారా సేవ చేసారు. వీరు పేరుకోసమే సేవ చేస్తారు. పిల్లలను బాబా దగ్గరకు చేర్చలేరు. శక్తిశాలీగా తయారుచేయలేరు. ఇటువంటి సేవాదారులు మరియు సేవాదారుల వలన తయారయ్యే ఆత్మలు త్రేతాయుగంలో వస్తారు.

బాబాపై మనస్సును పెట్టి, మనస్సు యొక్క స్నేహంతో సేవ చేసేవారు సంకల్పంలో కూడా పేరుని ఆశించరు. మనన స్థితిలో, అశరీరి స్థితిలో సేవ చేసి, ఆత్మలందరినీ బాబా వద్దకు చేరుస్తారు. వారు, వారి పరివారం కూడా, సత్యయుగీ పాత్రధారులుగా పరిగణించబడతారు. బుద్ధితో చేసేవారు, 7 రోజుల కోర్సు చెబుతారు. యోగా శిభిరాలు, ధారణా శిభిరాలు కూడా పెడతారు. మురళీ వినేవరకు కూడా చేస్తారు. కానీ, బాబాతో ఆ ఆత్మల సంబంధం జోడించే భాధ్యత తమదని అనుకోరు. కోర్సులు చాలా చెబుతారు కానీ, ఆత్మలలో శక్తిని నింపలేరు. నేను చాలా శ్రమచేసానని ఆలోచిస్తారు కానీ, శ్రమకు తగ్గ ఫలితాన్ని పొందలేరు.

## 456. ఎవరిని అనుసరించమని శివబాబా చెప్పారు? ఆ విధిని పాటిస్తే, వచ్చే ఫలితం ఏమిటి?

బ్రహ్మాబాబా చేసిన కర్మను మనం ఆచరించాలి. ఎందుకంటే బ్రహ్మాబాబా శివబాబా యొక్క శక్తితో స్వయంగా శ్రేష్ఠ కర్మలు చేసి ప్రపంచానికి ఆదర్శమయ్యారు. కావున బ్రహ్మాబాబా ఒక్కరినే ఫాలో చేయాలి. ఏ అక్కయ్య, అన్నయ్యను కూడా అనుసరించకూడదు. ఫాలో ఫాదర్ అని శివబాబా చెబుతున్నారు. ఫాలో సిస్టర్స్ అని బాబా చెప్పటం లేదు. సిస్టర్స్‌కు గౌరవం ఇవ్వండి, కానీ అనుసరించకండి. వారిలో విశేషతలను, శ్రేష్ఠ గుణాలను స్వీకరించండి, కానీ బ్రహ్మాబాబా అడుగులో అడుగు వేయండి. అక్కయ్యలను అన్నయ్యలను అనుసరిస్తే గమ్యం నుండి వంచితమైపోతాము. ఈ విషయంలో ఏవిధమైన సాకులు శివబాబాకు చెప్పకండి. శివబాబాకు అన్నీ తెలుసు. ఒక్క సెకనులో పరంధామం నుండి మనల్ని చూడగలరు. ఇతరుల సంలగ్నతను బాబావైపుకు త్రిప్పకుండా తెలుసుండి మీవైపుకు ఆకర్షితం చేసుకుంటే, సాలిపురుగు తన గూడును అల్లుకుని, అందులో నివసిస్తూ, అందులో చిక్కుకున్న పురుగులను ఆహారంగా స్వీకరిస్తుంది. కానీ దానికి కూడా గూడులో చిక్కుకున్నానన్న భావన రాదు. అదేవిధంగా ఆ గూడు దగ్గరకు వెళ్ళే క్రిములు కూడా విశ్రాంతి తీసుకుందామని వెళతాయి కానీ, చనిపోవాలని వెళ్ళవు. అదేవిధంగా విధ్యార్థులు అన్నయ్యలను అక్కయ్యలను అనుసరించటం అనేది మహా తప్పు. ఆ స్థానంలో ఉంటూ బాబాను మర్చిపోవటం కూడా చాలా తప్పు. అదేవిధంగా నిమిత్త ఆత్మలు బీజం ఆధారంగా వచ్చిన పరివారాన్ని చూసుకుని సంతోషపడిపోకండి. బీజం అవినాశి, ఆ బీజం ద్వారానే పరివారం వచ్చారు.

**457. మనసును విచలితం చేసే విషయాలేమిటి? వీటిని ఏ విధంగా జయించాలి?**

ఒకవేళ ఎవరిపైనైనా మనకు అసహ్య భావన ఉంటే అది మన బుద్ధిని విచలితం చేసేస్తుంది. యోగంలో కూర్చుని బాబాను స్మృతి చేసేటప్పుడు ఆ ఆత్మ ఎదురుగా వస్తుంది. కావున మంచి గుణాలు కలిగిన ఆత్మపై ఆకర్షణ, చెడుగుణాలు కలిగిన ఆత్మపై అసహ్యం లేకుండా ఉంటే నష్టోమోహగా అయిపోగలరు. అప్పుడు మీ మనస్సు విచలితమవ్వదు.

**458. సర్వశక్తివంతుడైన శివబాబాను వదిలేసి యధాశక్తి గల ఆత్మలను తోడు పెట్టుకోవడం వల్ల వచ్చే నష్టం ఏమిటి?**

సర్వశక్తివంతుడైన శివబాబాను వదిలేసి యధాశక్తి గల ఆత్మలను తోడుపెట్టుకుంటే కర్మాతీత స్థితిని పొందలేరు. ఇది కర్మల యొక్క గుహ్యగతి. కర్మబంధనం లేని భగవంతుని తోడు పెట్టుకోవడం వలన మన కర్మ బంధన భస్మం అవుతుంది.

**459. వర్తమానానికి, భవిష్యత్తుకి కూడా ప్రాప్తి జమ అవ్వాలంటే ఏవిధి పాటించాలి?**

వర్తమానంలో శ్రేష్ఠ కర్మలు చేసుకుంటూ వెళ్ళిపోతుంటే ఆ కర్మల యొక్క ప్రత్యక్ష ఫలితంగా సంతోషం, శక్తి అనుభవమవుతాయి మరియు భవిష్య జన్మలు కూడా ఉన్నతంగా ఉంటాయి. కనుక ఈ లెక్కతో చూసుకుంటే, ఈ సంగమయుగంలో ఒక వ్యర్థ వికర్మ కనుక జరిగితే చాలా నష్టం జరుగుతుంది. నష్టానికి లక్షరెట్లు ఫలితం ఉంటుంది, లాభానికి లక్షరెట్లు ఫలితం ఉంటుంది.

**460. జ్ఞాన మార్గంలో ఉంటూ, జ్ఞానమార్గాన్ని వదలి, వేరే మార్గంలోకి మీరు ఎప్పుడు వెళ్ళిపోతారు?**

ఒకే బలం, ఒకే నమ్మకం సదాకాలికంగా ఉండాలి. మధువనంలోనే బాబా వస్తారు, ఇక ఎక్కడా రారు. కానీ, ఎక్కడైనా, మొద్దు టీచర్ ఉంటే వారి ద్వారా ఇతరులకు కళ్యాణం చేయవలసి వస్తే, ఆ టీచర్‌కు తెలివి లేకపోయినప్పటికి పరంధామం నుండి శివబాబా శక్తి ఆ టీచర్‌లో ప్రవేశించి, ఇతర ఆత్మల కళ్యాణం చేస్తారు తప్ప, మధువనంలో వచ్చినట్లు రెగ్యులర్‌గా రారు. మధువనం ద్వారా మీ అందరికీ ఏదైతే చదువు లభిస్తుందో అదే చదువు, ఇక వేరే చదువు లేదు. మధువనం నుండి ఏదైతే మురళీ వస్తుందో దానిపై ధ్యాస ఉంచండి. లేకపోతే సర్వశక్తివంతుడైన శివబాబాను వదిలేసి వేరే మార్గంలోకి వెళ్ళిపోతారు.

**461. లౌకిక మర్యాదల విషయంలో మరియు అలౌకిక మర్యాదల విషయంలో శివబాబా ఏవిధంగా తెలియజేసారు?**

అలౌకిక తండ్రి వచ్చిన తర్వాత లౌకిక మర్యాదలు నామమాత్రమే పాటించాలి. వాటికి ఎక్కువ

విలువ ఇవ్వకూడదు. వాటికి ఎక్కువ విలువ ఇస్తే, కోటానుకోట్ల ప్రాప్తి నుండి వంచితం అయిపోతాము. బ్రహ్మకుమారీ, కుమారులు అవ్వటమే విశేషత. మీ నడవడిక ఇతరులు చూస్తారు. కావున మీ నడవడిక ఇతరులకు నష్టాన్ని కలుగజేసిందా? లాభాన్ని కలుగజేసిందా? అనే విషయం పరిశీలించుకోండి. బ్రాహ్మణ కులం యొక్క గౌరవం కాపాడటం అనేది ప్రతీ బ్రాహ్మణుని కర్తవ్యం. ఉదాహరణకు – ఒకే తారీఖున ఒకచోట సంఘఠనా బట్టీ జరుగుతుందనుకోండి, అదే తారీఖున లౌకికంలో పెళ్ళి వైభవం కాని లేదా ఎవరైనా చనిపోవడం జరిగినప్పుడు, మనం ఎక్కడికి వెళ్ళాలనే సంశయంలో పడిపోతాం. ఇది మనకి ఒక పెద్ద పరీక్ష. బట్టీకి వెళితే శివబాబా సంతోషించి, శ్రేష్ఠ ఆత్మల ద్వారా మనకు శక్తిని, ప్రాప్తిని ఇస్తారు. ఈ విషయాన్ని వదలి, పెళ్ళి కార్యక్రమంలో పాల్గొంటే వ్యక్తుల ఆశీర్వాదాలు వస్తాయి. కానీ బాబా ఆశీర్వాదాల నుండి వంచితం అయిపోతాం. మీరు భట్టీలో పాల్గొన్న తర్వాత ప్రేమతో బంధువులకు ఆ విషయాన్ని వివరిస్తే వారు కూడా అది భగవంతుని కార్యం అని సంతోషించడం వలన వారికి కూడా పుణ్యఖాతా జమ అవుతుంది. చనిపోయిన వారి బంధువుల దగ్గరకు కూడా వెళ్ళకుండా బట్టీలో ఉంటూ శరీరం వదిలేసిన ఆత్మకు బాబా యొక్క శక్తినిచ్చి, శ్రేష్ఠ జన్మ తీసుకోవాలని సంకల్పం చేస్తే, స్థూలంగా శరీరం దగ్గరకు, బంధువుల దగ్గరకు వెళ్ళేకంటే సూక్ష్మంగా ఆ ఆత్మను పరమాత్మ వరదానానికి పాత్రులను చేయటం గొప్ప విశేషం. కావున లౌకిక అలౌకిక మర్యాదలలో ఏ విధంగా నడుచుకోవాలో బాగా తెలుసుకోవాలి.

### 462. అన్ని వర్గాలవారు సత్య త్రేతాయుగంలో రాకపోయినా జ్ఞానం ఎందుకు చెప్పాలి?

జ్ఞానం విశ్వంలో వున్న అన్ని ఆత్మలకు చెప్పాలి. కొందరికి సత్యయుగంలో, కొందరికి త్రేతాయుగంలో, కొందరికి ద్వాపర కలియుగాల్లో జన్మలుంటాయి. కానీ అందరికీ చెప్పటం వలన వారు పరంధామం నుండి క్రిందకు వచ్చే సమయం ఏదైనా కానీ, సంగమయుగంలో తెలుసుకున్న ఈ జ్ఞానం అవినాశి కావున ఆ సమయంలో వారు సత్వప్రధానంగా ఉండి, సత్వప్రధాన కర్మలు ఆచరించి, సమాజాన్ని కూడా సత్వ ప్రధానంగా కొంచెమైనా పరివర్తన చేయడానికి నిమిత్తమై, చాలా తక్కువ జన్మలలో, తక్కువ సమయంలోనే సతో, రజో, తమోలోకి మారిపోతారు. కానీ వారి ప్రాప్తికి ఆధారం సంగమయుగంలో శివబాబా యొక్క జ్ఞానం బిందుమాత్రంగా అయినా పొందాలి. మనసా, వాచా, కర్మణాలలో ఏదోక పద్ధతితో, ఏదొక విజ్ఞాన సాధనం అనగా పుస్తకాల ద్వారా, చిత్రాల ద్వారా, సి.డిల ద్వారా సత్యజ్ఞానాన్ని మాత్రమే సత్యంగా వారికి అందించాలి. అలా అందించకపోతే అంతిమ సమయంలో ప్రకృతి వైపరీత్యాల వలన అన్నీ పోగొట్టుకున్న ఆలాపన సమయంలో ఈ జ్ఞానం మాకు తెలియలేదని నెపం వేస్తారు. ఆ సమయం యొక్క ఆలాపన మిమ్మల్ని నిందించేవిధంగా చేస్తుంది. కాబట్టి అన్ని వర్గాల వారికి, అన్ని ధర్మాల వారికి బాబా నుండి బేహద్ వారసత్వాన్ని పొందింపచేయటం కోసం జ్ఞానాన్ని తప్పక ఇవ్వాలి. ఇదే శివపరమాత్మ యొక్క ఆజ్ఞ మరియు ఆశ.

**463. విశ్వంలో ఆత్మలకు, రాబోయే క్రొత్త ప్రపంచం గురించి స్వప్నంలో గాని, సాక్ష్మాత్కార రూపంలో గాని ఎప్పుడు కనిపిస్తాయి?**

శ్రేష్ఠ ఆత్మలైన మీరు ఈ సంగమయుగంలో రాబోయే సత్యయుగీ ప్రపంచం యొక్క మెరుపును క్రొత్తదిగా అనుభవం చేసుకుంటారో, ఆ తరంగాలు బయటవున్న అభాగ్యశాలీ అజ్ఞానీ ఆత్మలకు కలలోగానీ, సాక్షాత్కారం రూపంలో గానీ ప్రత్యక్షమై వారి ధ్యాస పరమాత్మయైన శివబాబా వైపుకి వస్తుంది. ఇప్పటి వరకు ప్రజలకు వినాశనం అవుతుందని తెలుసు కానీ తర్వాత ప్రపంచం ఎలా మారుతుందనేది తెలియదు.

**464. ముందుముందు ఎటువంటి అనారోగ్యాలు వస్తాయి? అప్పడు డాక్టర్ల నోటి నుండి ఏ మాటలు వస్తాయి?**

మున్ముందు డాక్టర్లకు అంతుచిక్కని వ్యాధులు ప్రపంచవ్యాప్తంగా చాలా ఎక్కువగా ప్రబలుతాయి. మందు కనిపెట్టే లోపల రోగులు చనిపోతారు. ఆసుపత్రులన్నీ రోగుల క్యూతో నిండిపోతాయి. డాక్టర్ దగ్గరకు వచ్చి చూపించుకునే లోపునే చనిపోతారు. ఆ శరీరాన్ని కాల్చవలసిన సంబందీకులు కూడా చనిపోతారు. ఈవిధంగా శవాలు గుట్టగుట్టలుగా పడి ఉంటాయి. ఇప్పటి వరకు డాక్టర్లు, ఆత్మ లేదు పరమాత్మ లేదు అని వృత్తి యొక్క అహంకార భావనతో ఉన్నారు. కానీ పైనచెప్పిన అంతిమ సమయంలో వారు పూర్తిగా మనస్సులో నమ్ముతారు ఏమనంటే – ఒక దైవశక్తి ఉంది, ఈ అనంత విశ్వాన్ని ఆ శక్తి నడిపిస్తుందని నమ్ముతారు. ఈ విధంగా ప్రపంచంలోని వారందరూ శివబాబా వద్దకు రావలసిందే.

**465. ఏ శక్తి ముందు విజ్ఞాన శక్తి లొంగిపోతుంది?**

శాంతి శక్తి ముందు విజ్ఞాన శక్తి లొంగిపోతుంది. జ్ఞానీ–యోగీ ఆత్మలు ఎంతెంత శాంతిశక్తిని ధారణ చేస్తారో అంతంత విజ్ఞానశక్తి సమాప్తి అయిపోతుంది. శాంతిశక్తి ఎంత గొప్పదంటే, డాక్టర్లు ఆపరేషన్ చేసేటప్పుడు, ఆ బాగానికి మత్తు ఇచ్చి ఆపరేషన్ చేస్తారు. ఆ మత్తు యొక్క ప్రభావం కారణంగా బాధ అనిపించదు. అదేవిధంగా విజ్ఞాన శక్తి అవసరం లేకుండానే, జ్ఞానీ–యోగీ ఆత్మల ద్వారా శాంతి శక్తి కిరణాలు విశ్వంలోని ఆత్మలందరికీ శివబాబా అందిస్తారు. వాటితో వారి శరీర వ్యాధులు తగ్గకపోయినప్పటికీ ఈ పరమాత్మ శక్తి యొక్క ఆనందంలో వ్యాధి యొక్క బాధలు పూర్తిగా మర్చిపోయి శివబాబాను జ్ఞాపకం చేసుకుంటూ శరీరాన్ని వదిలేస్తారు. ముక్తిధామానికి వెళ్ళిపోతారు.

**466. ప్రకృతిలో ఏ సాధన ద్వారా ఇతరులకు భగవంతుని శక్తి అనుభవమవుతుంది?**

వాయుమండలం ద్వారానే అనుభవం అవుతుంది. అంతిమంలో అందరికీ జ్యోతిర్బిందు స్వరూపుడైన

శివపరమాత్మ ఒక్క సెకండు మెరిసే నక్షత్రంలా కనిపిస్తారు. ఆ సెకను యొక్క సాక్షాత్కారం వలన వారు తృప్తి అయిపోతారు. ఈ దృశ్యం ఎప్పుడు వస్తుందంటే, జ్ఞానీ యోగీ ఆత్మలు శివబాబా యొక్క శక్తిని బాగా అనుభవం చేసుకున్నప్పుడు మాత్రమే. ఉదాహరణకు – ఒక వ్యక్తి తన వస్త్రంపై సెంటు రాసుకున్నప్పుడు ఆ సువాసన వాయుమండలంలో ప్రవేశించి చుట్టుప్రక్కల ఉన్న వ్యక్తులకు వ్యాపిస్తుంది. వాయుమండలంలో ఉన్న అణువులు వారికి ఈ సువాసనను అందిస్తాయి. కాబట్టి సమాజాన్ని, ప్రకృతిని పాడుచేయాలన్నా, బాగుచేయాలన్నా ప్రతీ వ్యక్తి యొక్క ఆలోచనా తరంగాలు ఒకరి నుండి ఒకరికి వ్యాపిస్తాయి అనేది సత్యం. అందుకే శివపరమాత్మ జ్ఞానీ–యోగీ ఆత్మలకు ఒక ముఖ్య సూచన ఇచ్చారు – వ్యర్థం ఆలోచించకండి, వ్యర్థం మాట్లాడకండి, వ్యర్థం వినకండి.

**467. నష్టోమోహులుగా ఎప్పడు అవుతారు?**

స్మృతి స్వరూపంగా అయితే నష్టోమోహులుగా అవుతారు.

**468. నిశ్చయబుద్ధి ఆత్మ యొక్క గుర్తులు తెలపండి?**

నిశ్చయబుద్ధి ఆత్మకు విజయం తప్పకుండా లభిస్తుంది. నిశ్చయబుద్ధి ఆత్మ ఓటమిలో కూడా విజయం అనుభవం చేసుకుంటుంది. అనగా తన చేస్తున్న కర్మ గురించి తప్పా, ఒప్పా అని ఎప్పుడూ సంశయం రాదు. ఎందుకంటే నిశ్చయబుద్ధి ఆత్మ ప్రతీ కర్మ శ్రీమతానుసారం చేస్తుంది, కాబట్టి ఫలం లభిస్తుందా లేదా అని అలజడి అవ్వదు. మొత్తం ప్రపంచం అంతా ఒకవైపు ఉన్నా కానీ, బాబా నావైపు ఉన్నారు అన్న నిశ్చయంతో నిర్భయంగా ఉంటుంది. నిశ్చయబుద్ధి ఆత్మ నష్టోమోహగా ఉంటుంది. ఈ నిశ్చయబుద్ధి ఆధారంగానే నెంబరు తయారవుతుంది.

**469. సెంటర్ నాది అనుకుంటే వచ్చే నష్టమేమిటి?**

నాది అనే భావన నాటుకుపోయి, అక్కడ నుండి వేరవటానికి అలజడి అయిపోతారు. సెంటర్ అనుకుంటే అతీతంగా ఉండి ఎక్కడికి వెళ్ళాలన్నా సరళంగా వెళ్తారు.

**470. పాత స్వభావ సంస్కారాలు దేని ఆధారంగా భస్మమవుతాయి?**

నేను ఆత్మను అనే స్మృతి కానీ, అలౌకిక జీవితం యొక్క సంతోషం కానీ, ఫరిస్తా స్థితి యొక్క నషా కానీ, భవిష్యత్తు యొక్క ప్రాప్తి కానీ ఈ నాలుగింటిలో ఏ ఒక్కటైనా సంకల్పంలోనే కాకుండా సాకార స్వరూపంలో ఉంటుంటే పాత స్వభావ సంస్కారాలు భస్మం అయిపోతాయి. కేవలం శారీరక భౌతిక పధార్థాల యొక్క నియమాలు స్వభావ సంస్కారాలను భస్మం చేయడానికి పనిచేయవు. అవి బ్రాహ్మణ జీవితంలో నడవడానికి మాత్రమే పని చేస్తాయి.

### 471. మనసా బంధన ఆత్మల యొక్క గుర్తులు తెలుపుము?

సత్యాన్ని ఎంత అనుభవం చేయించినా అనుభవం అవ్వదు. సేవా సాధనాల ద్వారా సంతోషం అనుభవం చేసుకుంటుంది. అది సమాప్తి అయితే సంతోషం సమాప్తి అయిపోతుంది. ఒక అబద్దానికి వెయ్యి అబద్దాలు ఆడి తన తప్పును కప్పి పుచ్చుకుంటుంది.

### 472. సంకల్ప భాష యొక్క విశేషతను తెలుపుము?

సంకల్పశక్తి ప్రత్యక్షమైనప్పుడు, సైన్సు సాధనాలు పూర్తిగా పనిచేయటం ఆగిపోతాయి. అప్పుడు సంకల్ప శక్తి ద్వారా దూరంగా ఉన్న ఆత్మలకు శివబాబా యొక్క ప్రత్యక్షత చేయించవచ్చు. అప్పుడు వారు ఆ స్థానాన్ని, మనల్ని, మన దివ్యబుద్ధి అనే టి.వి ద్వారా చూడగలుగుతారు. ఏవిధంగానైతే బైనాక్యులర్ అనే పరికరం ద్వారా దూరపు వస్తువుని దగ్గరగా చూసినట్లు అనుభవం అవుతుంది కదా!

### 473. విశేషతలు సేవలో ఉపయోగించకుంటే వచ్చే నష్టం ఏమిటి?

భగవంతుడు యిచ్చిన విశేషతలు మనవిగా భావించి సేవలో ఉపయోగించకుండా సోమరిగా అయితే ఆ విశేషతలు పెరగవు సరికదా, తరిగిపోతాయి కూడా. ఏవిధంగానైతే వడ్డీ వ్యాపారస్తుడు ధనాన్ని బీరువాలో పెట్టుకుని ఉంచుకుంటే వడ్డీ రాదు చివరికి అది ఏదొక రూపంలో ఖర్చయిపోతుంది కదా. అలాగే సేవలో ఉపయోగించకపోతే విశేషత వృద్ధి అవ్వదు.

### 474. జ్ఞానంలో వచ్చే క్రొత్త పిల్లల్ని బాబా దగ్గరకి చేర్చకుంటే వచ్చే నష్టం తెలపండి?

కేవలం జ్ఞానం చెప్పటం, ఏడురోజుల కోర్సు చెప్పటం మాత్రమే సేవ కాదని శివబాబా తెలియజేస్తున్నారు. ఇలా వినిపించడం అనేది ద్వాపరయుగం గురువులు కూడా చేసారు. కొంతమందిని శిష్యులుగా, కొంతమందిని భక్తులుగా చేసుకున్నారు తప్ప, భగవంతునితో కలుపలేదు. అదేవిధంగా మీరు కూడా సేవ చేసేటప్పుడు శివబాబాతో సంబంధం జోడించకపోతే అది సేవ కాదు, పుణ్యం కాదు, పాపం. సత్యమైన సేవాదారీ, సత్యమైన బాబాతోనే సంబంధాన్ని జోడింపచేస్తారు. బాబా పేరు మీద మీ దగ్గరకు చేర్చుకుంటే మహాపాపం.

### 475. ఎవరు శివబాబాకి సత్యమైన సహయోగులు?

బ్రాహ్మణులుగా అయ్యాము, బ్రహ్మకుమారీ కుమారులుగా అయ్యాము అని అనుకోవటం కాదు. సేవలో సదా సహయోగులు అవ్వాలి. రెండు కుటుంబాలకు అనగా లౌకిక అలౌకిక కుటుంబాలకు అతీతంగా మరియు అతిప్రియంగా అయ్యి బాబాకు ప్రియంగా అవ్వాలి. వీరే శివబాబాకు సత్యమైన సహయోగులు.

**476. బ్రహ్మాబాబా తరువాత గుల్జార్ దాదీ శరీరంలోకి బాబా ఎందుకు వస్తున్నారు?**

ఆమె చాలా చిన్న వయస్సులోనే శివబాబాకు అర్పణ అయ్యారు మరియు బ్రహ్మాబాబాతో పాటు ఏకాంతవాసిగా తపస్సు చేసుకునేవారు దీని ఆధారంగా బ్రహ్మాబాబా తర్వాత ఆమె శరీరంలో శివబాబా ప్రవేశించే అదృష్టం లభించింది. ఇందుకే ప్రతీ శివాలయంలో రెండు నందులు చూపిస్తారు. ఒకటి – బ్రహ్మాబాబాకి గుర్తు. రెండవది – గుల్జారీ దాదీకి గుర్తు. భక్తిలో శివునికి నంది వాహనం అని తెలియజేస్తారు. దాని సూక్ష్మ అర్థం ఇదే!

**477. మధురత యొక్క విశేషతను తెలుపుము?**

గంట ఉపన్యాసం కంటే రెండు మధురమైన మాటలు మనస్సుని ఆనంద పరుస్తాయి. మధుర మాటలు మనస్సు నుండి వస్తాయి. శివబాబా మనల్ని మధురమైన పిల్లలూ! అని పిలుస్తారు. ఆ రెండు మాటలతోనే మనం బాబావారిగా అయ్యాం.

**478. బాబాకి ఎవరంటే ఇష్టం?**

మనస్సు యొక్కశ్రేష్ఠ స్నేహం, మనస్సు యొక్క శ్రేష్ఠ భావన కలిగిన ఆత్మ అంటే శివబాబాకు ఇష్టం. ఎందుకంటే మనస్సు యొక్క స్నేహమే, సర్వప్రాప్తులు పొందటానికి ఆధారం.

**479. తొమ్మిది లక్షల ఆత్మలు ఏవిధంగా తయారవుతారు? వెనక వచ్చే ప్రజలు ఎప్పుడు తయారవుతారు?**

తొమ్మిది లక్షల ఆత్మలు మనసాసేవ ద్వారా తయారైపోతారు. వీరిని తయారు చేయటంలోనే కొంచెం శ్రమ. అంతిమంలో మనందరిలో బాబా రూపం తప్పక అనుభవం అవుతుంది. అది గ్రహించిన వారు వెనుక వచ్చే ప్రజలుగా అయిపోతారు. ఏవిధంగా అయితే కారు చీకటిగా ఉన్న ప్రదేశంలో చిన్న కాంతినిచ్చే లైట్ వెలిగించితే, చీకటి తొలగిపోతుంది కదా! అదేవిధంగా, వెనుక వచ్చే పిల్లలకి మనలో శివబాబా యొక్క జ్యోతిస్వరూపం వారికి కనిపిస్తే చాలు.

**480. అర్జునుడి యొక్క సూక్ష్మ అర్థాన్ని తెలియజేయండి?**

జ్ఞానాన్ని అర్జించే వారందరు అర్జునులే కానీ మత్స్యం యంత్రంలో తిరుగుతున్నప్పుడు బాణంతో ఆ చేపకన్నుని ఛేదించాలి. చేప శరీరాన్ని కాదు, అప్పుడే స్వయంవరంలో విజయం పొందినట్లు. అనగా దానిలో సూక్ష్మార్థం ఏమిటంటే ఈ పాత ప్రపంచ విషయాలను చూస్తూ శరీర భ్రాంతిలోకి వస్తూ ఉంటాము. కానీ, మన ఆత్మరూపీ దృష్టిని భగవంతుడైన శివపరమాత్మతో అనుసంధానం చేసి, మన దృష్టిని మార్చుకోవాలి. మరియు దాని ద్వారా ఇతరుల దృష్టిని మార్చాలని ఈ కథ యొక్క సూక్ష్మ అర్థం. అప్పుడే మనకు, స్వర్గం యొక్క విశ్వమహారాజు పదవి లభిస్తుంది.

## 481. భిన్నభిన్న వయస్సు గల శివబాబా పిల్లల్ని స్టేజ్‌పైకి రప్పించి వారి ద్వారా ఇతరులకు ఏవిధంగా సేవ చేయాలి?

బాబా, బాబా అనే చిన్న పిల్లల్ని స్టేజ్‌పై కూర్చోపెట్టి మైక్‌లో బాబా! బాబా! అనిపించాలి. దీని ద్వారా కుటుంబసభ్యులకు తెలియజేయండి మీ పిల్లలకు కూడా ఈ మాట నేర్పించండి అని. అప్పుడు వారు పెద్దవారు అవుతున్నకొద్ది బాబా జ్ఞానంలోకి వచ్చేస్తారు. కుమారీలను స్టేజీపైకి రప్పించి వారి జీవిత అనుభవాన్ని మూడు మాటల్లో చెప్పించండి. శారీరక పవిత్రత, ఆత్మిక పవిత్రత భగవంతుడిని ఆకర్షితం చేస్తాయని చెప్పించండి. తల్లిదండ్రులు తమ ఒక కుమారీని భగవంతుని యజ్ఞంలో సమర్పితం చేస్తే, వందమంది జ్ఞానులను తయారుచేసినంత ఫలం ఆ తల్లిదండ్రులకు లభిస్తుందని తెలియజేయండి. కుటుంబంలో ఉన్న భార్యాభర్తల యొక్క అనుభవాన్ని మైకులో చెప్పించండి. కుటుంబంలో ఉంటూ భగవంతుని జ్ఞాపకం చేసుకోవచ్చని, రాబోయే స్వర్గ వారసత్వం పొందవచ్చునని తెలియజేయండి. దీని గుర్తుగానే భక్తిమార్గంలో లక్ష్మీదేవి, సరస్వతి, విఘ్నేశ్వరుడు కమలపుష్పంపై కూర్చున్నట్లు చూపిస్తారు. దీని సూక్ష్మార్థం – సరస్వతికి గుర్తు, సంసారంలో ఉంటూ శివబాబా జ్ఞానాన్ని చదువుకోవడం, లక్ష్మీదేవికి గుర్తు – స్వర్గంలో మేము జన్మ తీసుకోవాలనే లక్ష్యం పెట్టుకోవడం, విఘ్నేశ్వరుడికి గుర్తు – కుటుంబంలో ఉంటూ శివబాబా స్మృతిలో విఘ్నాలు తొలగించవచ్చని గుర్తు. ఈవిధంగా, ప్లీడర్స్, డాక్టర్స్ మొదలైన వారినందరినీ వేదిక ఎక్కించి మైక్‌లో వారి వారి అనుభవాలు తెలియజేస్తే భిన్న భిన్న వయస్సులవారు ఈ జ్ఞానాన్ని అభ్యసించవచ్చని తెలుసుకుంటారు.

## 483. ఏయే విషయాలలో సంతోషాన్ని వదలకూడదు?

హద్దు యొక్క ప్రాప్తిని త్యాగం చేయవలసి వచ్చినా కానీ సంతోషాన్ని వదలకూడదు. అనగా సెంటర్, సెంటర్‌లో ఉండే వస్తు వైభవాలు, పేరు, గౌరవం, మర్యాదలు ఇవన్నీ హద్దులోకి వస్తాయి.

## 484. అంతిమ జన్మ వరకు శివబాబా పిల్లలకు ఎటువంటి అదృష్టం తోడుగా వస్తుంది?

21 జన్మలకు సంపన్నంగా ఉండటమే కాదు, ద్వాపరయుగంలో భక్తి ఆత్మగా ఉన్న కారణంగా, దాన పుణ్యాలు చేయడానికి ధనానికి మరియు ఇతరత్రాలకు లోటు ఉండదు. ఈ సమయం అనగా సంగమయుగం యొక్క సంపాదన అన్ని జన్మలలో అడుక్కునేవారిగా చేయదు. చాలా ముఖ్యమైన గమనించవలసిన విషయం ఏమిటంటే – జన్మజన్మలో ఉన్నత కుటుంబంలో జన్మ తీసుకుంటారు కానీ రాజ్యాధికారిగా అవ్వరు. రాజ్యాధికారిగా అవ్వకపోయినా ఆ రాజ్యాధికారీ కుటుంబంలోనే జన్మ తీసుకుంటారు.

### 485. ఏయే విషయాలలలో నష్టోమోహులుగా అవ్వాలి?

స్వయంపై, దైవీ పరివారంపై, సేవ యొక్క ఫలితంపై, హద్దు యొక్క ప్రాప్తిపై మోహం ఉంచుకోకూడదు. అప్పుడు చాలా సమయం యొక్క ప్రాప్తికి అధికారిగా అయిపోతారు.

### 486. దేనిని అడుక్కునే సంస్కారం అంటారు?

ఇతరులు ఇచ్చినప్పుడే మీరు ఇవ్వటం అనేది అడుక్కునే సంస్కారం. అనగా స్నేహం ఇస్తే స్నేహం ఇస్తాను, గౌరవం ఇస్తే గౌరవం ఇస్తాను ఇది రాయల్ బికారీ సంస్కారం. ఈ విషయంలో నిష్కామ యోగీగా అవ్వండి. అప్పుడే గోల్డెన్ ప్రపంచం యొక్క అద్భుతం విశ్వం మీదకు చేరుకుంటుంది.

### 487. నిష్కామ సేవాదారి, నామధారి సేవాదారి యొక్క లక్షణాలు తెలుపండి?

నిష్కామ సేవాదారి అనగా గుప్త సేవాదారి. వర్తమాన సమయంలో గుప్తంగా ఉన్నాకానీ, గుప్త సేవాదారులు సఫలత యొక్క సంతోషంలో సదా ఉంటారు కొంతమంది పిల్లలకు సంకల్పం వస్తుంది సేవ చేస్తున్నాం కానీ పేరు రావటం లేదు ఎవరైతే పైపైకి సేవ చేస్తున్నారో, షో చేస్తున్నారో వారిపేరు ఎక్కువ పైకి వస్తుంది. కానీ ఈవిధంగా కాదు, అవినాశి పేరు సంపాదించుకునే వారి మనస్సు యొక్క ధ్వని ఇతరుల మనస్సు వరకు చేరుకుంటుంది. వారి ముఖంలో, మూర్తిలో సత్యమైన సేవాధారి యొక్క మెరుపు తప్పకుండా కనిపిస్తుంది. ఒకవేళ ఎవరైనా సేవాదారులు ఇక్కడ పేరు సంపాదించుకుంటే సేవచేసారు ఫలం తిన్నారు మరియు సమాప్తం అంతే. భవిష్యత్తు శ్రేష్ఠంగా ఉండదు అంటే ఫలం అవినాశిగా లేదు. అందువలన శివబాబా దగ్గర సేవాదారులందరి రికార్డ్ అంతా ఉంది. సేవ చేస్తూ వెళ్ళండి, పేరు రావాలని సంకల్పం చేయకండి. జమ అవ్వాలని ఆలోచించండి. అవినాశి ఫలానికి అధికారి అవ్వండి, అవినాశి వారసత్వాన్ని పొందడానికి వచ్చారు. సేవ యొక్క ఫలం ఇప్పుడే తినేస్తే అవినాశి వారసత్వం యొక్క అధికారం తక్కువైపోతుంది. అందువలన సదా వినాశి కోరికల నుండి ముక్తిగా, నిష్కామ సేవాదారిగా, బాబా కుడిభుజంగా అయ్యి సేవలో ముందుకు వెళ్ళండి. గుప్తదానానికి, గుప్త సేవకి గొప్పదనం ఎక్కువ. ఆ ఆత్మ సదా స్వయంలో నిండుగా ఉంటుంది. నిశ్చింతా చక్రవర్తిగా ఉంటుంది. పేరు గౌరవం యొక్క చింత ఉండదు. దీనిలో కూడా నిశ్చింతా చక్రవర్తిలా ఉంటారు. అంటే హద్దు, గౌరవం యొక్క సింహాసనాధికారిగా కాదు, సదా స్వమానం యొక్క సింహాసనాధికారిగా మరియు అవినాశి సింహాసనాధికారిగా ఉంటారు. స్థిరమైన ఖండితం లేని సింహాసనాధికారిగా ఉంటారు. వీరినే విశ్వకళ్యాణకారీ సేవాదారి అంటారు. ఎప్పుడు కూడా సాధారణ సంకల్పాల కారణంగా విశ్వసేవా కార్యంలో సఫలత పొందటంలో వెనుకకు వెళ్ళకండి. త్యాగం మరియు తపస్సు ద్వారా సదా సఫలత పొంది ముందుకు వెళ్ళండి. సేవ స్థితిని అలజడి చేస్తే అది సేవ కాదు. సేవ అలజడి తీసుకువస్తుంది అని కొందరు అనుకుంటున్నారు. విఘ్నాలు కూడా సేవలోనే వస్తాయి, నిర్విఘ్నంగా

కూడా సేవయే చేస్తుంది. కానీ విఘ్నరూపంగా అయ్యే సేవ సేవకాదు. దానిని సత్యమైన సేవ అనరు. పేరు కోసం చేసే సేవ అంటారు. సత్యమైన సేవ – సత్యమైన వజ్రం. సత్యమైన వజ్రం యొక్క మెరుపు దాగదు అలాగే సత్యమైన సేవాదారీ సత్యమైన వజ్రం. అసత్యమైన వజ్రానికి ఎంత మెరుపు ఉన్నా విలువ దేనికి ఉంటుంది? సత్యమైన సేవాధారికి అనేక జన్మలు విలువ ఉంటుంది. అల్పకాలిక మెరుపు యొక్క షో అంటే నామధారీ సేవ. అందువలన సదా నిష్కామ సేవాదారియై విశ్వకళ్యాణం చేస్తూ నడవండి.

**4౮౮. బాబా పిల్లలు అన్ని ధర్మాలలో ఎందుకున్నారు?**

బ్రాహ్మణులు లేని ధర్మమే లేదు. కర్మలఖాతా ఆధారంగా బ్రాహ్మణాత్మలే వేర్వేరు ధర్మాల్లో జన్మ తీసుకుంటారు. కానీ అంతిమ జన్మలో మరలా బాబా పిల్లలుగా అయిపోతారు.

**4౮౯. మీరు చేసే పనులు ఎవరూ చూడకపోయినా శివబాబా ఎందుకు చూస్తారు?**

ఎందుకంటే సంగమయుగంలో పురుషార్థం ఆధారంగా ప్రాప్తి ఇవ్వాలి కాబట్టి, శివబాబా వద్ద ఎవరు ఏవిధంగా ఎంత చేస్తున్నారు, ఏ స్థితిలో చేస్తున్నది అన్నీ జమ అయిపోతాయి. అందుచే మిమ్మల్ని ఎవరూ పట్టించుకోక పోయినా కానీ, చూడక పోయినా కానీ శివబాబా మాత్రం మీకు ప్రాప్తి ఇవ్వడానికి చూడాలి.

**4౯౦. మనం జ్ఞానం ఎంత చెప్పినా ఇతరులు ఎందుకు వినడం లేదు?**

జ్ఞానంతో పాటు ఆత్మిక స్నేహం ఇవ్వకపోతే ఎంత జ్ఞానం చెప్పినా వారు వినరు. ఏవిధంగానైతే బీజం నాటినప్పుడు నీరు పోయకపోతే మొలకెత్తదు కదా!

**4౯౧. జ్ఞానం చెప్పటానికి మీరు ఏ గ్రామంలో అడుగుపెట్టినా పొందే లాభం ఏమిటి?**

ఎవరో ఒకరు జ్ఞానంలోకి తప్పకుండా వస్తారు. అక్కడ కొంతమంది జ్ఞానీ ఆత్మలు డ్రామానుసారం జన్మించి ఉంటారు కావున నిశ్చింతగా, నిర్భయంగా, సంలగ్నతతో వెళ్ళి సేవ చేయండి.

**4౯౨. . చెడ్డవారు మనల్ని మేము చెడ్డవారిమా అని అడిగినప్పడు ఏమి సమాధానం చెప్పాలి?**

చెడ్డవారికి మీరు చెడ్డవారని చెబితే, అగ్నిలో నెయ్యి పోసినట్లు. వారిలో ఉన్న మంచిని మొదట తెలియజేసి ఆ తర్వాత లోపాలను సరిదిద్దుకోమని తెలియజేయాలి. శివబాబా కూడా డైరెక్ట్ ఎవరికీ కూడా ఏవిషయంలోను మీరు తప్పు అని చెప్పరు. మురళీలోనే చెబుతారు. ఎవరైనా ఎదురుగా వచ్చి, నేను అసత్యమా అని అడిగితే అసత్యం కాదు అని చెబుతారు. ఎందుకంటే ఆ సమయంలో వారికి ధైర్యం ఉండదు.

**౪౯౩. అంతిమ పేపర్ ఏవిధమైన భయాలు పుట్టిస్తుంది?**

అన్ని విషయాలు చాలా ఫుల్‌ఫోర్స్‌గా ఉంటాయి. ఆ సమయంలో నేను ఆత్మను, నేను ఆత్మను అని అభ్యాసం చేస్తే ఫెయిల్ అవుతారు. కానీ ఆత్మ స్వరూపంలో స్థిరమై ఉండాలి.

**౪౯౪. ఎవరికైనా ఏదైనా వస్తువును బహుకరించినపుడు ఏవిధమైన భావన ఉంటే జమ అవుతుంది?**

స్నేహం అనేది చాలా అమూల్యమైనది. స్నేహానికి విలువ ఉంటుంది, వస్తువుకి కాదు. స్నేహం లేకుండా ఎవరు ఎంత ఇచ్చినా అది జమ అవ్వదు. స్నేహంతో కొద్దిగా యిచ్చినా కానీ అది కోటానుకోట్లు జమ అవుతుంది. కాబట్టి బాబాకు స్నేహం అంటే చాలా ఇష్టం.

**౪౯౫. మొత్తం కల్పంలో ఇతర ఆత్మలు పావనం అవ్వడంలోనూ, మీరు పావనం అవ్వడంలోను తేడాను తెలుపుము?**

కల్పమంతటిలో ఇతర ఆత్మలు కూడా పావనంగా, పవిత్రంగా అవుతారు. పావన ఆత్మలు ధర్మపితల రూపంలో ధర్మస్థాపన చేయడానికి నిమిత్తమవుతారు. వెనువెంట గొప్ప ఆత్మలు కూడా పావనం అవుతారు. మీకు భగవంతుని యొక్క పాలన, చదువు లభించింది. వారికి అవి లభించవు.

**౪౯౬. సేవాదారీ అంటే కేవలం కోర్సు చెప్పడమే కాదు, కానీ ఇంకా ఏమి సేవ చేయాలి?**

ఉత్సాహం, ఉల్లాసం యొక్క సహయోగం ఇవ్వాలి. మీకు సహయోగిగా కాదు, శివబాబాకు సహయోగిగా చేయాలి. ఇతరులను ముందుకు తీసుకు వెళ్ళటంలో మీకు ఉత్సాహం కలగాలి, ఈర్ష్య కలుగకూడదు. ఉత్సాహం ఇరువురి పుణ్యఖాతాను పెంచుతుంది. ఈర్ష్య ఇరువురి పాపఖాతాను పెంచుతుంది.

**౪౯౭. ఏ సేవలో ౨౫% మార్కులు మాత్రమే జమా అవుతాయి?**

త్యాగం, తపస్సు లేకుండా చేసే సేవలో 25% మాత్రమే మార్కులు జమ అవుతాయి. సేవ యొక్క విశేష గుణం సంతుష్టత. మీకు, పరివారానికి సంతుష్టత లేని సేవ, సేవాఖాతాలో జమ అవ్వదు.

**౪౯౮. ఉపరాం మరియు పరోపకారి అని ఎవరిని అంటారు?**

పరోపకారీ అయిన వారి విశేషత – స్వార్థభావన ఉండదు. సదా నిండుగా అనుభవం చేసుకుంటారు. ప్రాప్తి స్వరూపం యొక్క స్థితిలో ఉంటారు. ఉపరాం అంటే అతీతస్థితి. ఆరామ్‌గా మనస్సులో శివబాబా ఒక్కరినే ఉంచుకోవడం. పరోపకారీ ఆత్మ స్వయం పట్ల మహిమను, వస్తువులను, స్థానాన్ని స్వీకరించదు. ఆ విషయాల్లో ఇతరులనే ముందు పెడుతుంది.

**499. ఆత్మజ్ఞానంతో పాటు మరియు ఏ జ్ఞానం మనకి ఉండాలి?**

ఆత్మజ్ఞానంతో పాటు శరీర జ్ఞానం కూడా కావాలి. ఆత్మ శక్తిశాలీగా ఉంటే చాలు, శరీరం ఎలావున్నా పరవాలేదు అని అనుకోకూడదు. శరీరం మంచిగా లేకపోతే యోగం కుదరదు శరీరం తనవైపు ఆకర్షితం చేసేస్తుంది. ఉదాహరణకు – శరీరానికి రాత్రి సమయంలో తక్కువలో తక్కువ 7 గంIIలు అయినా నిద్ర ఉండాలి. ఆ నిద్ర తక్కువ అయితే శరీరం సహకరించదు. అదేవిధంగా వ్యర్థ మాటలు వినడం, వినిపించడం, స్వయంపట్ల వ్యర్థ విషయాలు ఆలోచించడం, ఇవి ఆత్మను బలహీన పరుస్తాయి. కావున ఈ రెండింటి జ్ఞానం పూర్తిగా తెలుసుకుని నడవాలి.

**500. విశాల హృదయం ఉంటే ఏ అవగుణాలు తొలగిపోతాయి?**

ఈర్ష్య, అసహ్యం మరియు విమర్శించడం – ఈ మూడు విషయాలు విశాలహృదయం గల ఆత్మలో ఉండవు. విమర్శ నవ్వుతూ చేసినా, నిజంగా చేసినా ఇతరుల మనస్సుకి వెళ్ళి వారు బాధపడితే అది మన పాపఖాతాను పెంచుతుంది. దెబ్బపొడవటం అంటే ఇద్దరు స్నేహితులు చేయి చేయి వేసుకుని జతగా కలసి వెళుతున్నప్పుడు ఊహించని రీతిలో ఒకరిని క్రింద పడవేసే దృశ్యం ఎలా ఉంటుందో, అలాంటిదే విమర్శ అంటే. ఒకరు పడవేస్తారని రెండవవారు ఊహించరు కదా. గాయం తగిలినప్పుడు పడిపోయిన వారికి పడవేసిన వారే జ్ఞాపకం వస్తూ ఉంటారు. అందుచేత విశాల హృదయం గల ఆత్మ ఎప్పుడూ ఎవరినీ నామ మాత్రం కూడా విమర్శించదు.

**501. ఏకాగ్రత అంటే ఏమిటి?**

ఏకాగ్రత అనగా వ్యర్థ సంకల్పాలు లేని నిశ్చల స్థితి. అప్పుడు సఫలత కంఠహారం అవుతుంది.

**502. బాబా తప్ప, సంకల్పంలో ఏదైనా ఆత్మని గాని, ప్రకృతి సాధనాలు గానీ తోడు తీసుకుంటే ఏమవుతుంది?**

ఏ కర్మలోనైనా ఏ సెకనులోనైనా ఇతరులను తోడు చేసుకుంటే, బాబా తొలగిపోతారు. సత్యమైన బాబా నుండి బుద్ధి తొలగిపోయిన కారణంగా అసత్యాన్ని సత్యంగా, సత్యాన్ని అసత్యంగా అంగీకరిస్తారు. ఇతరులు ఎంత ఇది అసత్యం అని చెప్పినా వారిని కూడా అసత్యంగా చూస్తారు. ఇప్పుడు జ్ఞాపకం ఉంచుకోండి – అసత్య రాజ్యం నడుస్తుంది. అసత్యరాజ్యం యొక్క ప్రధాన మంత్రి – రావణాసురుడు. బాబా ఏ విషయం చెప్పినా, బయటి వారి గురించి కాదు, మన గురించి చెబుతారు. మనం ఏ స్థానంలో ఉన్నా, ఎవరికీ ఆధీనం కాకూడదు. మురళీ మరియు మురళీధరునిపై ధ్యాస ఉంటే మన బుద్ధి ఎవరివైపు తగులుకోదు. ఇదే విచిత్రమైన అనుభవం.

**503. బాబా ఎప్పుడు మనకు కోటానుకోట్లు శుభాకాంక్షలు ఇస్తారు?**

ఎవరైతే ధైర్యంతో తనువు, మనస్సు, ధనాన్ని మరియు సమయాన్నిసేవలో ఉపయోగిస్తారో వారికి శివబాబా కోటానుకోట్ల శుభాకాంక్షలు ఇస్తారు.

**504. కర్మాతీత స్థితి పొందటానికి ఏ నాలుగు విషయాలపై విజయం పొందాలి?**

కర్మాతీత స్థితి పొందే ఆత్మకు సేవలో నాది అనే భావన రాదు. సేవ పుణ్యఖాతాను పెంచేది. (1) సేవలో హద్దు యొక్క కోరిక ఉంటే కర్మాతీత స్థితి రాదు. లౌకిక సంబంధంలో స్వార్థభావం నుండి కూడా ముక్తి కావాలి. అనగా నా పిల్లలు, నా ఇల్లు, నా ఆస్తి మొదలైనవి (2) వెనుకటి జన్మల కర్మలఖాతా మరియు వర్తమాన పురుషార్థం యొక్క బలహీనతల నుండి ముక్తి కావాలి. (3) ఏదొక సేవ యొక్క, సంగఠన యొక్క, ప్రకృతి యొక్క పరిస్థితి, మన స్వస్థితిని చలింపచేయకుండా ఉండాలి. (4) పాత ప్రపంచంలో పాత అంతిమ శరీరంలో ఏదొక వ్యాధి మీ శ్రేష్ఠ స్థితిని అలజడిలోకి తీసుకువస్తుంది. దీని నుండి ముక్తి అవ్వాలి. వ్యాధి రావటం వేరు, మనస్సుని చలింపచేయటం వేరు. ఈ నాలుగు విషయాలను జయించినప్పుడే కర్మాతీత స్థితిని పొందుతారు.

**505. సత్యయుగంలో మంత్రి ఉండరు. మరి ఎవరు ఉంటారు?**

సమీప సంబందీకులే తోడుగా ఉంటారు. ఎందుకంటే అక్కడ అలజడి నామమాత్రం కూడా ఉండని కారణంగా, ఎవరి సలహాలు అక్కర లేదు.

**506. చాలాకాలం అభ్యాసం యొక్క లాభాలను తెలుపుము?**

చాలాకాలం అన్ని విషయాల యొక్క అభ్యాసం లేకపోతే, అంతిమ పరీక్షలో ఫెయిల్ అయిపోతారు. అంతిమంలో తయారౌతానంటే స్వర్గం యొక్క అంతిమంలో ఒక జన్మ యొక్క ప్రాప్తే లభిస్తుంది.

**507. మధువనంలో బాబాని మిలనం చేసుకోవడంలో మన వృత్తి ఎలా ఉండాలి?**

మధువనం అనగా భగవంతుడు అవతరించిన జన్మభూమి. ఇది మనదేశంలో రాజస్థాన్ రాష్ట్రంలో ఆబూ పర్వతంపై ఉన్నది. అక్కడికి భగవంతుడు సంవత్సరానికి ముందుగా నిర్ణయించిన కొన్నిదినాలలో ఒక వృద్ధ అనుభవీ మానవ శరీరంలో ప్రవేశించి ఈ జ్ఞానం చెబుతారు. ఆ జ్ఞానాన్నే మనం ఇప్పుడు చదువుకుంటున్నాము. వెళ్ళేవరకు నియమాలు మరియు సంతోషం ఉంటుంది. వచ్చిన తర్వాత ఆ సంతోషం ఆ నియమాలు మాయం అవ్వకూడదని శివబాబా మనకు చెబుతున్నారు.

**508. మధ్యమధ్యలో స్మృతిలో తెగిపోయే రేఖ అంటే ఏమిటి?**

డైరెక్ట్ శివబాబాతో సర్వసంబందాల అనుభూతి సదా ఉంటుందా? లేక నిమిత్త ఆత్మల ద్వారా సంబంధం జోడించే అనుభవీ అయ్యారా? బాబాతో జోడించినప్పుడే మీ స్మృతిరేఖ స్పష్టంగా ఉంటుంది. ఉదాహరణకు, డైరెక్ట్‌గా కౌంటర్ దగ్గర సినిమా టికెట్ తీసుకున్నప్పుడు దాని ఖరీదు ఖచ్చితంగా ఉంటుంది. అదే బ్లాకులో కొంటే ఎక్కువగా ఉంటుంది కదా. అదేవిధంగా నిమిత్త ఆత్మల ద్వారా బాబాను అనుభవం చేసుకుంటే మీ పుణ్యంలో కొంతభాగం వాళ్ళకు వెళ్ళిపోతుంది.

**509. పరివారం పెరుగుతున్నప్పుడు పరివారానికి ఆధారమైన బీజాన్ని మర్చిపోతే వచ్చే అపార నష్టం ఏమిటి?**

పవిత్రత యొక్క అర్థం సదా బాబాను తోడుగా ఉంచుకోవటం మరియు బాబా యొక్క సాంగత్యంలో సదా ఉండటం. “బాబా నా వాడు” అని తోడుగా చేసుకున్నారు. ఇది అవసరమే కాని, ప్రతీ సమయం బాబా సాంగత్యం ఉండాలి. దీనినే సంపూర్ణ పవిత్రత అంటారు. సంగఠన యొక్క తోడు, పరివారం స్నేహం యొక్క మర్యాద, ఇది వేరే విషయం. ఇది కూడా అవసరమే కానీ, బాబా కారణంగానే ఈ సంగఠన యొక్క తోడు. ఇది మర్చిపోకూడదు. పరివారం యొక్క ప్రేమ కానీ ఆ పరివారం ఎవరిది? బాబాది. బాబా లేకపోతే పరివారం ఎక్కడినుండి వస్తుంది? పరివారం యొక్క ప్రేమ, పరివారం యొక్క సంగఠన చాలా మంచిది. కానీ పరివారం యొక్క బీజాన్ని మర్చిపోకూడదు. బాబాను మర్చిపోయి పరివారాన్ని తోడుగా చేసుకుంటున్నారు, మధ్యమధ్యలో బాబాను వదిలేస్తే కనుక ఖాళీస్థానం అయిపోయింది, అక్కడ మాయ వస్తుంది. అందువలన స్నేహంలో ఉంటూ, స్నేహం ఇస్తూ తీసుకుంటూ బీజాన్ని మర్చిపోవద్దు. దీనినే పవిత్రత అంటారు.

**510. సేవ ప్రారంబించే ముందు ఏవిధమైన పరిశీలన ఉండాలి?**

ఏదైనా సేవా కార్యక్రమం ప్రారంభించే ముందు మన బుద్ధిలో ఏ ఆత్మ పట్లయినా స్వచ్ఛతకు బదులు జరిగిపోయిన విషయాలు కొద్దిగా జ్ఞాపకం వచ్చినా, మన ఆలోచన, వృత్తి మారిపోతుంది కదా. సంపూర్ణ సఫలత ఏదైతే పొందాలో అది పొందలేరు. జరిగిపోయిన విషయాలను సమాప్తం చేయటమే స్వచ్ఛత.

**511. అనుభూతి ఎన్ని రకాలు? వాటి వివరణ తెలుపండి?**

అనుభూతి రెండు రకాలు. 1) మనస్సు యొక్క అనుభూతి 2) సమయ ప్రమాణంగా కార్యం చేసుకోవడానికి అనుభూతి. భగవంతుడు సత్యమైన మనస్సుకే రాజీ అవుతారు. మనస్సు యొక్క అనుభూతి మనోభిరాముడిని(శివబాబాను) చేరుకుంటుంది. ఏ కార్యంలోనైనా సఫలత పొందటానికి మనం భగవంతుణ్ణి స్మరిస్తాం కానీ ఆ కార్యం అయిపోయిన తర్వాత మరచిపోతాము. అలా చేయకూడదు.

**512. శివబాబాను తండ్రిగా, గురువుగా అనుభవం చేసుకున్న దానికి గుర్తు ఏమిటి?**

తండ్రి సంబంధం ద్వారా వారసత్వాన్ని అనుభవం చేసుకోవాలి. సద్గురువు ద్వారా వరదానాన్ని అనుభవం చేసుకోవాలి. ఈ అనుభూతులే ఆయన కర్తవ్యాలను గుర్తు చేస్తాయి.

**513. మనస్సు యొక్క ఆకలి అంటే ఏమిటి?**

పేరు, గౌరవం, మర్యాద, సాధనాలు, సేవ చేయడానికి స్థానం బాగుండాలి అని అనుకోవడం ఇవన్నీ మనస్సు యొక్క ఆకలికి గుర్తు. స్థూల నియమాల ద్వారా శరీరం అదుపులోకి వస్తుంది కానీ అవి మనస్సుని అదుపు చేయలేవు. మనస్సు యొక్క ఆకలిని భగవంతుని యొక్క అనుభూతి శక్తి మాత్రమే పోగొట్టగలదు.

**514. సేవలో ఏవిధమైన భయం ఉండకూడదు?**

ఎక్కడైనా మనం సేవ చేస్తున్నప్పుడు మనలోపల సత్యత మరియు నిర్భయత తొలగిపోకూడదు. ఇది క్రొత్త జ్ఞానం, ఎవరూ అర్థం చేసుకోలేరు అనే భయం ఉండకూడదు. తెలివితక్కువ వారికి కూడా తెలివిగా జ్ఞానాన్ని అర్థం చేయించాలి. మీరు ఎక్కడికి వెళ్ళినా కానీ, ఆ స్థానం యొక్క, ఆ వ్యక్తి యొక్క ప్రభావంలోకి వెళ్ళకండి.

**515. సమర్పణ అనగా ఏమిటి?**

కుటుంబంలో ఉన్నా, సెంటర్‌లో ఉన్నా ఎవరికైతే మనస్సు ద్వారా బాబాతో స్నేహం ఉంటుందో వారు భగవంతునికి సమర్పణ అయినట్లే.

**516. హద్దు యొక్క కోరిక దేనిని సమాప్తి చేస్తుంది?**

హద్దు యొక్క కోరిక బేహద్ ప్రాప్తిని సమాప్తి చేసేసి, మనస్సుని హద్దులోకి తీసుకు వస్తుంది. ఎందుకంటే, హద్దు యొక్క కోరిక మనస్సుకు ఫలం ఇవ్వనివ్వదు. అనగా మనస్సును సత్యంగా ఉండనివ్వదు.

**517. సర్వ సంబంధాల అనుభూతి బాబాతో ఉండకపోతే వచ్చే నష్టం ఏమిటి?**

ఒక్క సంబంధం కూడా భగవంతునితో అనుభవం అవ్వకపోతే ఆ సంబంధం తనవైపుకు లాక్కుని బాబా నుండి దూరం చేసేస్తుంది. ఇది మనం శరీరం వదిలేటప్పుడు భగవంతుని స్మృతి లేకుండా చేస్తుంది. ఆ వ్యక్తియే స్మృతి వస్తారు. ఆ వ్యక్తి స్మృతి వలన వచ్చే నష్టం ఏమిటంటే, మరుసటి జన్మలకు ఆ వ్యక్తి మనకు ప్రాప్తిని ఇవ్వలేదు. పరమాత్మతో సర్వసంబంధాల అనుభూతి యొక్క స్వర్ణిమ అవకాశం ఈ ఒక్క సంగమయుగంలో మాత్రమే లభిస్తుంది.

**518. పవిత్రత ఎప్పుడు ఖండితం అయిపోతుంది?**

స్వప్నంలో కూడా ఏ ఆత్మపట్లయినా ఈర్ష్య, ఆవేశాలకు వశమై మాట, కర్మ జరిగినా పవిత్రత ఖండితం అయినట్లే! ఖండిత మూర్తులకు పూజ జరుగదు, మ్యూజియంలో పెడతారు. అలాగే మీకు స్మృతిచిహ్నాలు తయారవుతాయి కానీ పూజ జరగదు.

**519. కోరిక యొక్క సూక్ష్మరూపం ఏవిధంగా ఉంటుంది?**

నాకు ఈ వస్తువు అవసరం లేదు కానీ ఉంటే మంచిదనిపిస్తుంది అంటారు. ఇది సూక్ష్మ కోరిక. దీనిని సమాప్తి చేసుకోలేక పోతే ముస్ముందు కోరికలు విరాఠ రూపం ధరిస్తాయి.

**520. సాధనాలు లేకపోవడం అనేది అతీతమా? కాదా?**

సాధనాలు లేకపోవడం అనేది అతీతం కాదు. ఎందుకంటే మనం కర్మయోగులం. సాధనాలను సేవకోసం వినియోగించాలి. స్వయం కోసం వినియోగించకూడదు. సాధనాలు లేకుండా అతీతంగా ఉన్నాను అంటే అది గొప్ప విషయం కాదు. సాధనాలతో ఉంటూ అనాశక్త భావన కలిగి ఉండటమే సరైన విధి.

**521. అనుభూతి శక్తి ఎప్పుడు సమాప్తి అయిపోతుంది?**

వేల అబద్దాలతో ఒక విషయాన్ని రుజువు చేయటం అనే లక్షణం ఎప్పుడైతే ఉంటుందో ఆ ఆత్మకు ఏ విషయాలలోనూ, అనుభూతి కాదు. ఎందుకంటే మనస్సు సత్యతా శక్తిని కోల్పోయింది. ప్రమిదలో నూనె అయిపోయినప్పుడు వెలుగుతున్న వత్తి పూర్తిగా కాలిపోతుంది కదా, అదేవిధంగా వేల అబద్దాలు అనే అవగుణం భగవంతునితో అనుభవం చేసుకునే శక్తిని సమాప్తి చేసేస్తుంది.

**522. జ్ఞానధనం ఉన్నచోట ఏ సహజ లాభం ఉంటుంది?**

శివపరమాత్మ యొక్క జ్ఞానాన్ని అందరికీ యిచ్చుకుంటూ వెళుతుంటే, స్థూలధనం స్వతహాగా దాసీ అయ్యి మన దగ్గరకు వస్తుంది మరియు ప్రకృతి నుండి ఉద్భవించిన సాధనాలు, స్వతహాగా సమయప్రమాణంగా మన దగ్గరకు వచ్చేస్తాయి. జ్ఞానదనం ఉన్నచోట సర్వ అవసరాలు స్వతహాగా పూర్తి అయిపోతాయి. జ్ఞానం అనే ధనం కోటానుకోట్ల పుణ్యానికి అధిపతిగా చేస్తుంది. ఏ సెంటర్‌లో అయినా నిమిత్త ఆత్మ జ్ఞాన ధనాన్ని సంపూర్ణంగా మరియు శక్తి శాలీగా విధ్యార్ధులకు ఇవ్వకపోతే వారు నిర్విఘ్నంగా కాలేరు. ఆ సెంటర్‌లో విధ్యార్దులు ఎక్కువగా ఉన్నా కానీ వారిలో జ్ఞానధనం తక్కువగా ఉంది కనుక సత్యయుగంలో ప్రజలుగా జన్మ తీసుకుంటారు.

**523. పరివర్తనకు ఆధారం ఏమిటి?**

పరమాత్మ ప్రేమ అనుభవం అయిన ఏ ఆత్మ జీవితంలోనైనా పరివర్తన వచ్చి తీరుతుంది.

**524. అల్పకాలిక సిద్ధులను చేసేవారి జన్మ రహస్యం తెలుపుము?**

పరంధామం నుండి ద్వాపరయుగంలో కానీ, కలియుగంలో కానీ మొదటి జన్మ తీసుకుని ఆధ్యాత్మిక చింతన ఉన్నవారికి అల్పకాలిక సిద్ధులు లభిస్తాయి. అది పరమాత్మ ఇచ్చిన సిద్ధి కాదు. ఒక్క జన్మలోనే సత్వ,రజో, తమో మూడు స్థితులను పొందుతారు. అనగా, ఉదాహరణకు - 30 సం॥లు సిద్ధులు కలిగి ఉండవచ్చు. మొదటి 10 సం॥ల సిద్ధి యొక్క మహిమ ద్వారా అనేక మందికి కష్టాలు రోగాలు నయం చేయవచ్చు. మధ్యలో 10 సం॥లు కోరిక పెరిగిన కారణంగా స్వార్థ భావంతో సిద్ధులని ప్రయోగం చేస్తారు. కొన్ని ఫలిస్తాయి, కొన్ని ఫలించవు. అప్పుడు ప్రజలలో అప నమ్మకం ఏర్పడుతుంది. మిగిలిన 10 సం॥లలో ఆ సిద్ధులు పొందిన వ్యక్తే అనారోగ్యంతో లేదా శిష్యుల యొక్క గొడవతో లేదా గవర్నమెంటు శిక్షలతో జీవితాన్ని నడిపిస్తారు. కాబట్టి భగవంతుడు అవతరించి ఈ సంగమయుగంలో కూడా అనేకమంది బాబాలు, గురువులు ప్రసిద్ధమై చివరిలో తొలగిపోతారు. కానీ భగవంతుని పిల్లలమైన మనం సంగమయుగంలో పొందిన సిద్ధి 2,500 సం॥ల వరకు ఉంటుంది. సంపూర్ణ ఆయుష్షుతో ప్రకృతి యొక్క పూర్తి సుఖంతో ఆనంద అనుభూతులు పొందుతూ ఉంటాము. కావున సదాకాలిక ఫలితాన్నిచ్చే శివ తండ్రిని మరువకండి.

**525. ముస్ముందు ఏ సేవలకు సమయం అనుకూలించదు?**

మన్ముందు వాచా సేవకు, సాదనాల ద్వారా చేసే సేవకు, వేరే స్థానానికి వెళ్ళి చేసే సేవకు సమయం అనుకూలించదు. శాంతిశక్తి ద్వారా చేసే సేవ ఒక్కటే చేయగలం.

**526. విశ్వమంతటికీ సంపూర్ణ సహాయకారి అయిన శివబాబా సహాయోగం చేయుటంలో ఏ నియమంలో బంధింపబడి ఉన్నారు?**

శివబాబా నిరాకారుడైనప్పటికీ, ఎంతో సహాయం చేయగలరు. మీరనుకుంటారు నిరాకారుడు ఏమి చేయగలడు అని. నీకు శరీరం లేదు, కాబట్టి నీకు భాదలు తెలియవు అని బాబాని నిందిస్తారు. కానీ, భగవంతునికి కూడా ఒక నియమం ఉంది. ఆ నియమం ఏమిటంటే ధైర్యం ఉన్న పిల్లలకు మాత్రమే శివబాబా సహాయం చేస్తారనే రహస్యాన్ని మర్చిపోకూడదు. ఇది డ్రామా యొక్క గుహ్యమైన కర్మల గతి. ఈ నియమం లేకపోతే, ఎవర్ని మొదటి రాజుగా చేయాలి? ఈ ఒక్క నియమం ఆధారంగానే దేవతల్లో కూడా నెంబర్ ఉంది. దేవతల్లోనే నెంబర్ ఉంది అంటే

మిగిలిన వారిలో నెంబర్ ఎందుకు ఉండదు? సాగరంలో ఉన్న నీటిని ప్రపంచంలో ఉన్న మోటర్లన్నీ పెట్టి తోడినా మోటర్లు కాలిపోతాయి కానీ నీరు తరగదు. అదేవిధంగా సర్వశక్తివాన్ పరమపూజ్యుడైన శివబాబా యొక్క సహాయం సాగరం వంటిది. కానీ పిల్లల కళ్యాణం కోసం అందరు నన్నెందుకు ముందు పెట్టలేదని నిందించకుండా ఉండటం కోసం బాబా ఈ విధిలో బందింపబడి ఉన్నారు. ఆ విధే, ఒక్క అడుగు ధైర్యానికి కోటానుకోట్ల భగవంతుని సహాయం లభిస్తుంది. ఈ విధానం డ్రామానుసారంగా నిర్ణయించబడి వున్నది. డ్రామాను భగవంతుడు రచన చేసారు కానీ డ్రామా భగవంతుడిని రచించలేదు. సమర్పణ అయినా, కుటుంబంలో ఉన్నా, జ్ఞానం తెలిసి ఒక్క సంవత్సరం అయినా, 50 సం॥ నుండి జ్ఞానంలో నడుస్తున్నాఅధికారం అందరికీ సమానం. కానీ విధి ద్వారా మాత్రమే ప్రాప్తి అనేది పదేపదే గుర్తు పెట్టుకోండి.

### 527. ఏ విషయాన్ని బాగా పరిశీలించుకోవాలి?

సమయానుసారంగా శివబాబా ఇచ్చిన విశేషతలను, విశ్వ కళ్యాణమనే కార్యంలో ఉపయోగి ంచకపోతే మీ నంబర్ వెనుకకు వెళ్ళిపోతుంది. ఇది బాగా పరిశీలించుకోండి.

### 528. త్రేతాయుగం యొక్క అంతిమ ప్రజలకు కూడా ధనం ఏవిధంగా ఉంటుంది?

కలియుగం చివరిలో ప్రపంచం మొత్తంలో ఎంత ధనం ఉన్నదో, అంత ధనం త్రేతాయుగం అంతిమంలో ప్రజలకు ఉంటుంది. కలియుగంలో కూడా గవర్నమెంటు కంటే ఎక్కువ ధనవంతులు ఉన్నారు కదా! అనగా 2,500 సం॥లు తర్వాత కూడా సత్య త్రేతాయుగం ప్రజలకి ధనం మట్టిలా ఉంటుందని బాబా తెలియజేసారు.

### 529. సంగమయుగం యొక్క అంతిమ సమయంలో బాబా ఏవిధమైన పాత్ర అభినయిస్తారు?

ఒకటికి కోటానుకోట్ల భాగ్యం అనే విధి ఈ సమయంలోనిది. సంగమయుగం అంతిమంలో ఒకటి కోటానుకోట్లు భాగ్యాన్ని యిచ్చే విధి సమాప్తి అయిపోతుంది. ఆ సమయంలో కర్మలఖాతాను పూర్తి చేసుకుంటారు. బాబా సద్గురువుగా ఉంటారు. ఇప్పుడైతే దయాసాగరులుగా ఉన్నారు. కఠినమైన పొరపాట్లు చేసినా క్షమిస్తారు, సహాయకారిగా అవుతారు. సమయం సమాప్తి అయిన తరువాత చేస్తే పశ్చాత్తాపం మిగులుతుంది.

### 530. చిత్రగుప్తుడు అనే పాత్ర గురించి పూర్తిగా వివరించండి?

చిత్రగుప్తుడు అంటే గుప్తంగా మన చిట్టాలన్నీ రికార్డ్ అయిపోతాయి. ఏ రోజు ఏ సమయంలో ఏమి ఆలోచించారు, మాట్లాడారో, కర్మ చేసారో అన్నీ రికార్డ్ అయిపోతాయి. ఇప్పుడు మనకు

బాబా అవి చూపించరు, చెప్పరు. కానీ అంతిమంలో పొరపాట్లు, ప్రాప్తులు అందరికి స్పష్టంగా చూపిస్తారు. భగవంతుడిని అమాయకుడు అనుకుంటున్నారు. వరాలు ఇవ్వడంలో అమాయకుడు, కానీ ప్రతీ ఒక్కరి లెక్కలు చూడటంలో ధర్మానికి రాజుగా ధర్మరాజుగా ఉంటారు. ఇప్పుడు అమాయకంగా ఎందుకు ఉంటున్నారంటే, మిమ్మల్ని సంపూర్ణంగా చేయడానికి. అంతిమంలో ధర్మరాజుగా ఎందుకు మారుతున్నారంటే, అందరి ఖాతాలు చూసి అందరికీ న్యాయం చేకూర్చటం కోసం. ముందే ధర్మరాజుగా ఉంటే, ఆ మహాకాలుని ముందు ఎవరూ నిలబడలేరు.

## 531. బ్రాహ్మణ పరివారం మధ్యలో కర్మలఖాతాలు భయంకరంగా ప్రత్యక్షం అవుతున్నప్పుడు, మనం ఏ స్థితిలో ఉంటే సమాధానం లభిస్తుంది?

కొన్ని విషయాలు  మంచిగా ఉంటాయి.  కొన్ని విషయాలు బాహ్యంగా నష్టంగా కనిపిస్తాయి కానీ వాటిలో కూడా లాభం దాగి ఉంటుంది.  ఆ సమయంలో మనం ధైర్యంతో, సహనంతో, శాంతిస్థితిలో బాబా ఒడిలో లీనమై ఉంటే లోపల దాగివున్న లాభం స్పష్టంగా వ్యక్తమవుతుంది. ఉదాహరణకు భగవంతుని జ్ఞానంలోనికి వచ్చాక, వ్యాపారంలో నష్టం వచ్చిందనుకోండి, పైకి నష్టంలా కనిపిస్తుంది, లోపల ఓవిధమైన కళ్యాణం ఇమిడి ఉంటుంది. అది ఏమిటంటే వ్యాపారం మానేసి బాబా వద్దకు వచ్చి సేవ చేసుకునే మహా భాగ్యాన్ని పొందే లాభం కలిగివుంది. ఆ విషయాన్ని గ్రహించాలి కానీ, బాబాను తెలుసుకున్న తర్వాత  నష్టం వచ్చింది అని చింతించకూడదు.

## 532. సమర్పణ అనగానేమి?

మధువనంలో ఉండిపోతే లేక సెంటరులో ఉండిపోతే సమర్పణ అనరు. ఇది సేవార్థం సమర్పణ అవ్వటం ఇది ఒక మెట్టు  కానీ ప్రాప్తుల యొక్క గమ్యం చేరాలంటే నింద, స్తుతి, మాన అవమానం, లాభ నష్టాలలో సమానంగా ఉంటూ బాబా స్మృతి, మర్చిపోకుండా ఉండాలి. ఇదే సమర్పణ అంటే. వ్యాపారం పెట్టిన వెంటనే లాభాలు కోకొల్లలుగా రావు కదా! వ్యాపారం నడిచే కొలదీ వచ్చే వడిదుడుకులను, ఇతరులతో పోటీని తట్టుకుని నిలబడినప్పుడే లాబాలు పొందగలం. ఇది కూడా అంతే!

## 533. ఎవరికి మనం వశీభూతం అవ్వకూడదు?

చెడు స్వభావ సంస్కారాలకు వశమైన ఆత్మలకు మనం వశం అవ్వకూడదు.

## 534. ఏ స్నేహంలో కర్మలఖాతా ఉండదు?

మనస్సు యొక్క స్నేహంలో వెనుకటి జన్మల కర్మలఖాతా భస్మం అవ్వటమే కాకుండా, వర్తమానంలో పుణ్యం అయిపోతుంది. స్నేహం అనేది శివబాబాతో తప్ప ఇంక ఎవరితో స్నేహం చేయకూడదు. ఎందుకంటే వారికైనా మీకైనా ఇచ్చే దాత ఒక్కరే! డైరెక్ట్‌గా తీసుకోండి. ఇన్‌డైరెక్ట్‌గా తీసుకోకండి.

## 535. సాధనాలను ఏ స్థితిలో ఉండి ఉపయోగించుకోవాలి?

ఏ వ్యక్తి, వైభవాల మీద తగుల్పాటు లేదు కదా! వ్యర్థం లవలీన స్థితిని అనుభవం చేయించదు. వైభవాలను ఉపయోగించుకోండి, కానీ యోగీ అయ్యి ఉపయోగించుకోండి. మీ విశ్రాంతి సాధనాలు మనస్సును బరువుగా చేయకూడదు. ఎందుకంటే కొంతమంది పిల్లలు వైభవాలకు వశమై మనసు యొక్క తగుల్పాటుని తెలుసుకోలేక పోతున్నారు. అధికారికంగా చెబుతున్నారు. మేము హఠయోగులం కాదు, రాజయోగులం అని. ఏ సాధనాలైతే మీ స్మృతి అలజడిలోకి తీసుకువస్తున్నాయో అంటే తనవైపు ఆకర్షితం చేస్తున్నాయో ఆ సాధనాన్ని మీరు యోగీ అయ్యి ప్రయోగించడం లేదు. ఎందుకంటే బాబా వారిగా అవ్వడం ద్వారా ప్రకృతి దాసీ అవుతుంది. అంటే వైభవాలు, సాధనాల యొక్క ప్రాప్తి పెరుగుతుంది. అన్ని సాధనాలు పెరుగుతూ ఉంటాయి. ఫలం తింటూ బీజాన్ని మరువకండి. ఆరామ్‌గా (విశ్రాంతిగా) ఉంటూ మనోభిరాముడిని మరువకండి. సత్యమైన సీతగా ఉండాలి. మర్యాదరేఖను సంకల్పం మాత్రంగా కూడా దాటకూడదు.  సాధన లేకుండా సాధనాలను ఉపయోగిస్తే బంగారు లేడి వలన మోసపోయినట్లు మోసపోతారు. అందువలన వ్యక్తి, వైభవాల తగుల్పాటు నుండి రక్షణగా ఉంచుకోండి. లేకపోతే బాబాకు స్నేహి అవ్వటానికి బదులు, సహయోగిగా అవ్వటానికి బదులు, అప్పుడప్పుడు సహయోగిగా, అప్పుడప్పుడు సహజయోగిగా, అప్పుడప్పుడు వియోగిగా అవుతారు. అప్పుడప్పుడు స్మృతి అప్పుడప్పుడు పిర్యాదులు ఈవిధమైన అనుభూతిలో  ఉంటారు.

## 536. మనన చింతన ఎప్పుడెప్పుడు చేయవచ్చు?

మననశక్తి మగ్నశక్తిని తీసుకువస్తుంది. మనన శక్తి ప్రకృతి నుండి వచ్చే భిన్నభిన్న పరిస్థితులలో కూడా విజయం పొందేటట్లు చేస్తుంది. మననం అనేది నడుస్తూ తిరుగుతూ, కార్యం చేస్తూ, అనగా వ్యాపారం చేస్తున్నా, ఆఫీసులో పని చేస్తున్నా కానీ, సెంటర్‌లో సేవ చేస్తున్నా కానీ, జ్ఞానాన్ని మననం చేసుకోవచ్చు. కొన్ని సమయాలలో కొన్ని పనుల గురించి ఆలోచించ వలసి వస్తుంది. ఆ సమయం అయిపోయిన వెంటనే మరలా మననం చేయండి.  మననశక్తిని ప్రయోగం చేసి చూడండి. మీరు ఆలోచించి చేసే పనుల్లో కూడా బాబాశక్తి ద్వారా తేలికదనం అనుభవం అయిపోతుంది.

## 537. కర్మకర్త, కర్మయోగి అనగానేమి?

కర్మ మరియు యోగం రెండూ వెనువెంటే ఉండాలి. కర్మ చేసిన తర్వాత యోగం చేస్తానంటే, కర్మ కర్త అయ్యారు కానీ కర్మయోగి కాలేదు.  కర్మకర్త స్థితిలో అలసి పోతారు. కర్మయోగి స్థితిలో తేలికైపోతారు. కర్మ చేస్తూ భగవంతుని మహావాక్యాలలో ఏదొక మహావాక్యాన్ని మననం చేసుకోవచ్చు. జ్ఞానధనం ద్వారా జ్ఞానదాత స్వతహాగా జ్ఞాపకం ఉంటారు.

## 538. శ్రేష్ఠ ఆజ్ఞాకారీ పిల్లలు ఏవిధంగా ఉంటారు. వారి యొక్క సాంగత్యం అందరూ ఎందుకు చేయరు?

శ్రేష్ఠ ఆజ్ఞాకారీ పిల్లలు ఎప్పుడు సొంత మతాన్ని కలపరు. ఎవరికైనా పేరు గౌరవం, సాధనాలు కావాలని మరియు బుద్ధి ప్రమాణంగా పెద్దవారిగా కావాలని అనుకుంటారు. ఆ కోరికలు మనస్సు యొక్క ఆకలి అని ఆజ్ఞాకారికి తెలిసి మనసు అవి కాలుష్యం చేస్తాయని తెలిసి, ఆజ్ఞాకారీ పిల్లవాడు అటువంటి వారికి సహయోగం ఇవ్వరు. అందుచే కొంతమంది ఆజ్ఞాకారీ పిల్లల యొక్క సాంగత్యం చేయరు. కొంతమంది ఆత్మలకి ఆజ్ఞాకారీ ఆత్మలు ఎంత సహయోగం చేసినా కాని, వారి స్వభావ సంస్కారాలు వెనుకటి జన్మల కర్మలఖాతా కారణంగా సంతుష్టం అవ్వనివ్వదు. ఈవిధంగా ఆక్కడక్కడ ఆజ్ఞాకారీ ఆత్మకు వ్యతిరేకత వచ్చి వేరైపోతారు. కానీ ఇటువంటివారు 5% ఉంటారు. ఆజ్ఞాకారీ పిల్లల యొక్క సూక్ష్మ కర్మలఖాతాలు ఏవైనా ఉంటే మాత్రం ఈ 5% ఆత్మలకు బదిలీ అవుతుంది. ఈవిధంగా ఆజ్ఞాకారీలు సంపూర్ణం అయిపోతారు. కోరికలు తీరని ఆత్మలు పాపాత్ములుగా అయిపోతారు. ఏవిధంగానైతే ఒక లౌకిక తండ్రి, తన పిల్లలకు చెడు విషయాలు ప్రోత్సహించరు కదా.

## 539. వెనుకటి జన్మల ఖాతా ఎప్పుడు సమాప్తి అయిపోతుంది?

అగ్ని స్వరూప శక్తిశాలీ స్మృతి లేకుండా సమాప్తమవ్వదు. శక్తిశాలీ స్మృతి అంటే కోరికంటే ఏమిటో తెలియని స్థితిలో ఉన్నప్పుడే అగ్ని స్వరూప శక్తిశాలీ స్మృతి అనుభవం అవుతుంది.

## 540. ఎవరెవరు సేవ ద్వారా భవిష్యత్తులో శ్రేష్ఠ పదవి పొందుతారు?

కేవలం ఉపన్యాసం చెప్పటమే సేవ కాదు. యోగయుక్త స్థితిలో స్థితులై పాత్రలు శుభ్రం చేసేవారు కూడా శ్రేష్ఠ పదవి పొందుతారు. ఉపన్యాసం నోటితో చెప్తారు, ఇది స్థితితో చేస్తారు. అమాయకుడైన బాబాని రాజీ చేసుకోవటం చాలా సహజం. భగవంతుడు రాజీ అయితే ధర్మరాజు శిక్షల నుండి కూడా రక్షించబడతారు, మాయ నుండి కూడా రక్షించబడతారు.

## 541. 350 మంది పిల్లలకి ఆహారం లేనప్పుడు బ్రహ్మాబాబా ఏ స్థితి యొక్క అభ్యాసం ద్వారా విజయం పొందారు?

350 మంది పిల్లలకు బోజనం లేనప్పుడు బ్రహ్మాబాబా మనస్సు, బుద్ధి నిశ్చింతగా ఉన్నాయి. బ్రహ్మాబాబా కేవలం స్థూలమైన ధనం, ఆస్తిపాస్తులే సమర్పణ చేయటమే కాకుండా ఆది నుండి మనస్సు బుద్ధిని కూడా శివబాబాకు సమర్పితం చేసి, ఆజ్ఞాకారియై ఆయనను తోడు పెట్టుకున్న కారణంగా అలాంటి పరిస్థితిలో కూడా చలించలేదు.

**542. అందరికీ ఎలాంటి స్నేహాన్ని ఇవ్వాలి?**

జ) సంగమయుగంలో అనేక ఆత్మలు మనల్ని కలుస్తారు. ఎటువంటి మంచి లేదా చెడు స్వభావాలు కలిగిన ఆత్మలు ఎదురుగా వచ్చినా మనస్సు యొక్క స్నేహం, మనస్సు యొక్క గౌరవం తప్పకుండా ఇవ్వాలి. ఇదే అసలైన విధి.

**543. సహనశీలత ఏయే విషయాలలో సంపూర్ణంగా ఉండాలి?**

ఎవరైనా గౌరవం ఇస్తే నవ్వటం. ఇది సహనశీలత కాదు, కానీ విరోధులుగా అయ్యి, క్రోధితులు అయ్యి, తిట్ల వర్షం కురిపించినా ఆ సమయంలో కూడా సదా నవ్వుతూ ఉండాలి. సంకల్పమాత్రంగా కూడా వాడిపోవడం వంటి గుర్తులు ముఖంలో ఉండకూడదు. దీనినే సహనశీలత అంటారు. స్థాపనాకార్యంలో, సేవా కార్యంలో అప్పుడప్పుడు చిన్న పెద్ద తుఫానులు వచ్చాయి. స్మృతిచిహ్న శాస్త్రాలలో మహావీర్ హనుమంతుడు పెద్ద పర్వతాన్ని కూడా బంతివలె తెచ్చాడు అని చెప్తారు. అదేవిధంగా ఎంత పెద్ద పర్వతం వంటి సమస్య అయినా, తుఫాను అయినా, విఘ్నం అయినా, విషయం అయినా కానీ చిన్నబొమ్మగా చేసుకుని దాటాలి. లేక పెద్ద విషయాన్ని తేలికగా చేసుకుని స్వయం కూడా తేలికగా ఉండాలి. ఇతరులను కూడా తేలికగా చేయాలి. దీనినే సహనశీలత అంటారు.

**544. ఏ మాల చిన్నది? ఏ మాల పెద్దది?**

శివబాబాతో స్నేహం చేసే స్నేహి ఆత్మల మాల పెద్దది. అంటే వీరి సంఖ్య ఎక్కువ. కానీ ఆ స్నేహాన్ని సదాకాలికంగా నిలుపుకునే క్రమంలో ఎదురైన మాయా విఘ్నాలను జయించే విజయీ ఆత్మల మాల చిన్నది. అంటే వీరి సంఖ్య తక్కువ.

**545. ఏ సేవ శివబాబా అకౌంట్‌లో జమ అవుతుంది?**

వాస్తవానికి సేవ మాయను జయించేదిగా చేస్తుంది, మాయను తెచ్చేది కాదు. స్వార్థంతో ఫలాన్ని ఆశించినప్పుడు సేవలో మాయ వస్తుంది. ఇది మన పుణ్యఖాతాలో జమ అవ్వదు. కొందరికి 50 – 60 సెంటర్లు ఉంటాయి. అవన్నీ మాయ విఘ్నాలతో కదులుతూ ఉంటాయి. యోగయుక్త స్థితి ఉండదు. ఒకరికి రెండే సెంటర్లు ఉంటాయి. మాయ నుండి విముక్తిగా యోగయుక్తంగా, నిర్విఘ్నంగా ఉంటాయి. ఆ రెండు సేవాకేంద్రాలే సేవాఖాతాలో జమ అవుతాయి. 50 – 60 సెంటర్లు ఉన్న ఇన్‌చార్జికి సెంటర్లతో పాటు మాయ కూడా చాలా పెరుగుతుంది. రాత్రి-పగలు నిద్రపోవటం లేదు, చాలా సేవ చేస్తున్నారని అనుకుంటారు కానీ ఫలితం తక్కువ ఉంటుంది. ఇక్కడ ఒక విషయం గమనించుకోవాలి, పరివారానికి ఆధారభూతుడైన, బీజరూపుడైన శివబాబా కావాలా? లేక పరివారం కావాలా? మీ హక్కు కావాలా లేక శివబాబా హక్కును ఆధారంగా చేసుకుంటారా? మీ హక్కుని ఆధారంగా చేసుకుంటే మీ సేవాకేంద్రాలన్నీ భగవంతుని ఖాతా

నుండి సంపూర్ణంగా తొలగిపోతాయి. ఇక్కడ ముఖ్య విధి ఏమిటంటే, మనం ఎంత శక్తిశాలీగా తయారయ్యాం? ఇతరులను ఎంత శక్తిశాలీగా తయారుచేసాం అనేది చూసి అంతిమంలో బాబా మార్కులేస్తారు.

### 546. స్మృతి భోజనం అనగానేమి? అశుద్ధ ధన సంపాదన ఎంత నష్టం తీసుకువస్తుందో పూర్తిగా వివరించండి?

శివపరమాత్మ స్మృతిలో తయారుచేసిన భోజనం దు:ఖాన్ని దూరం చేస్తుంది. శుద్ధ అన్నం మనస్సుని మరియు తనువుని రెండింటినీ శుద్ధం చేస్తుంది. స్మృతిలో తయారుచేసిన ఆహారాన్ని స్మృతిలో భుజించకపోతే స్థితిని క్రిందకు తీసుకు వచ్చేస్తుంది. భక్తిలో అన్నాన్ని పరబ్రహ్మ స్వరూపం అంటారు. అన్నం పరబ్రహ్మ స్వరూపం ఎలా అవుతుంది? అన్నం ఘన పదార్థం. భగవంతుడు అవ్యక్త జ్యోతి స్వరూపుడు. భగవంతుని స్మృతిలో తయారుచేసిన ప్రతీ పదార్థం ప్రసాదంగా మారడం వలన ఆవిధంగానే పేరు వచ్చింది. అదేవిధంగా అశుద్ధ ధనం కూడా మనస్సుని పాడుచేస్తుంది. అనగా చింత ఎక్కువ అవుతుంది. అశుద్ధ ధనం లక్ష రూపాయలు వస్తే అది కోటానుకోట్ల చింతలను కలిగిస్తుంది. స్మృతిలో తీసుకున్న అన్నం లేదా ఏదైనా పదార్థం మనస్సును శుద్ధి చేసి ధనం సంపాదన కూడా సుఖం అవుతుంది.

### 547. శ్రీమతంపై నడిచే శ్రేష్ఠ ఆత్మల గురించి బాబా ఏవిధంగా తెలియచేసారు?

21 జన్మల వారసత్వం బాబా నుండి అందరూ పొందుతారు. అందువలన 21 జన్మలు గ్యారంటీ! తర్వాత కూడా ప్రతీ ఆత్మకు కొన్ని జన్మలు భారత దేశంలోనే ఉన్నాయి. ఎందుకంటే బ్రహ్మాబాబా యొక్క సమీప ఆత్మలు సమానంగా అయ్యే ఆత్మలు బ్రహ్మాబాబాతో పాటు పూజ్యులు నుండి పూజారీ పాత్ర అభినయిస్తారు. ద్వాపరయుగంలో మొదటి భక్తులు బ్రాహ్మణాత్మలే. ఆది స్వర్గంలో ఈ దేశం యొక్క నివాశీలు మరియు అనేకసార్లు భారతభూమి యొక్క నివాసీయులు అయ్యారు. అందువలనే బ్రాహ్మణుల యొక్క అలౌకిక సంసారం మధువనం అతి ప్రియమైనది. ఇప్పుడిప్పుడే మధువన్ నివాసీ అయిపోండి అని ఆజ్ఞ ఇస్తే సంతోష పడతారు కదా! లేక సేవ ఎవరు చేస్తారు అనే సంకల్పం వస్తుందా? సేవ కోసమైతే వెళ్ళాలి. శివబాబా ఇక్కడ ఉండిపోండి అనినా సేవ జ్ఞాపకం వస్తుందా? సేవ చేయించేవారు ఎవరు? ఏ సమయంలో బాబా యొక్క ఆజ్ఞ, శ్రీమతాన్ని ఏ రూపంలో ఇస్తారో ఆ రూపంలోనే పాలన చేయాలి. వీరినే సత్యమైన సేవాదారీ అంటారు. శివబాబాకు తెలుసు మధుబన్‌లో ఉంచాలా లేక సేవకు పంపించాలా అని. బ్రాహ్మణ పిల్లలు ప్రతీ విషయంలో ఎవరెడీ అవ్వాలి. ఇప్పుడిప్పుడు ఏ ఆజ్ఞ లభిస్తే, దానిలో ఎవరెడీ (తయారయ్యి) ఉండాలి. సంకల్ప మాత్రంగా కూడా మన్మతం కలుపకూడదు. వీరినే శ్రీమతంపై నడిచే శ్రేష్ఠ ఆత్మ అని అంటారు.

**548. దైవీగుణాలు ఎప్పుడు మనకు సహజంగా ధారణ అవుతాయి?**

జ) సత్యత. ఎక్కడ సత్యత ఉంటుందో అక్కడ దైవీగుణాలు సహజంగా ధారణ అవుతాయి.

**549. రెండు రకాల మహారథుల గురించి తెలియజేయండి?**

1) స్వ స్థితిలో మహారథులు 2) సేవలో మహారథులు. స్వస్థితిలో మహారథులుగా ఉండే వారి మనస్సు సదా అతీంద్రియ సుఖంలోను, సంతుష్టత యొక్క సుఖంలోను, సర్వుల మనస్సు యొక్క స్నేహంలోను, ప్రాప్తి యొక్క స్వరూపంలోను నిండుగా ఉంటారు. రెండవ వారు సేవ ద్వారా మహారథులు. అప్పుడప్పుడు మనస్సుతో సంతుష్టంగా ఉంటారు మరియు అప్పుడప్పుడు అసంతుష్టంగా ఉంటారు. సేవ ఆధారంగా సర్వులకు స్నేహీగా ఉంటారు.

**550. ఏ ఆత్మ నుండైనా మనం రక్షణగా ఎలా ఉండాలి?**

ఏ ఆత్మ ఎలా ప్రవర్తించినా మీరు రక్షణగా ఉండాలి. ఆ ఆత్మకు శుభభావన శుభకామన తరంగాలు పంపిస్తూ ఉండాలి. ఆ ఆత్మను మనం మార్చలేకపోయినప్పటికి శుభభావన వలన వారి నుండి వచ్చే చెడు తరంగాలు మనల్ని చేరవు.

**551. సూక్ష్మ శరీరం యొక్క విశేషత తెలుపుము?**

సూక్ష్మ శరీరం అంటే ఫరిస్తా శరీరం. అనగా ఆత్మ చుట్టూ ఒక ప్రకాశవంతమైన శరీరం నిండి ఉంటుంది. ఆ శరీరం ద్వారా ఆత్మ స్థూల శరీరాన్ని ఒకచోట ఉంచి, ప్రపంచం అంతా కొన్ని సెకన్లలో తిరిగి రాగలదు. ఒక్క సెకనులో అనేక ఆత్మలకు మన సంకల్ప శక్తి ద్వారా మరియు దృష్టి ద్వారా ఈ సమయంలో మేము శివబాబాను చూసాము, బాబాను కలుసుకున్నాను, ఆత్మిక సంభాషణ చేసామని అందరికీ అనుభవం అవుతుంది. కొంతమంది మాకు సహాయం లభించింది అని కూడా అంటారు. ఇదే సూక్ష్మ శరీరం యొక్క విశేషత.

**552. అంతిమ సమయంలో అజ్ఞాని ఆత్మలలో ఏవిధమైన పరివర్తన వస్తుంది?**

ఇప్పుడు ఇక కొంతసమయం తర్వాత అతి మరియు అంతం రెండూ అనుభవం అవుతాయి. అప్పుడు జ్ఞానీ-యోగీ ఆత్మలు సంపూర్ణ బేహద్ వైరాగ్య స్థితిలో ఉంటారు. బయటవారు అనగా అజ్ఞానీ ఆత్మలు పూర్తిగా హద్దు వైరాగ్యంలోకి వచ్చేస్తారు. అతి భయం కారణంగా వారికి ఎప్పుడో విన్న జ్ఞానం మరియు జ్ఞానదాత అనగా శివబాబా జ్ఞాపకం వచ్చి, అందరి మనస్సు నుంచి ఇదే మాట వస్తుంది. అందరికీ రచయిత, అందరికీ తండ్రి శివబాబా ఒక్కరే మరియు బుద్ధి అన్నివైపుల నుండి తొలగి ఒక్క బాబా వైపుకు వెళుతుంది. కానీ అభ్యాసం లేని కారణంగా మనస్సుని ఎక్కువ

సమయం శివబాబాతో జోడించలేరు. ఆ అంతిమ స్మృతి వారిని ద్వాపరయుగం నుండి కలియుగం చివరి వరకు ఎంతోకొంత భాగ్యవాన్‌గా తయారు చేస్తుంది. ఎక్కువ సమయం జ్ఞానంలో ఉన్న వారికి బేహద్ వైరాగ్య వృత్తి స్వతహాగా, అవినాశిగా ఉంటుంది.

### 553. సంగమయుగంలో ఏయే విషయాలపై విజయం పొందితే కల్పాంతం వరకూ ఏయే ప్రాప్తులు పొందుతాము?

ఈ సమయం యొక్క మీ సంపూర్ణ స్థితి 16 కళల సంపూర్ణ స్థితికి ఆధారం. ఇప్పటి ఒకే మతం, అక్కడ ఒకే రాజ్యానికి ఆధారం. ఇక్కడి సర్వ ఖజానాల యొక్కసంపన్నత అంటే జ్ఞానం, గుణం, శక్తులు అక్కడ సంపన్నతకి ఆధారం. ఇక్కడ దేహం యొక్క ఆకర్షణతో అతీత స్థితి అక్కడ తనువు యొక్క ఆరోగ్యానికి ఆధారం. అశరీరి స్థితి, నిరోగ స్థితికి మరియు పెద్ద ఆయుష్షుకి ఆధారం. ఇక్కడ నిశ్చింత చక్రవర్తి స్థితి యొక్క జీవితం, అక్కడ మనస్సు యొక్క ఆనంద జీవితానికి ఆధారం. ఒక్క బాబా తప్ప ఇంకెవ్వరూ లేరు. ఇక్కడి అఖండ అచంచల సాధన అక్కడ అఖండ నిర్విఘ్న సాధనాల ప్రాప్తికి ఆధారం అవుతుంది. ఇక్కడి చిన్న సంసారం శివబాబా లేదా తల్లి తండ్రి మరియు సోదరి సోదరులు, ఇది అక్కడి చిన్న సంసారానికి ఆధారం అవుతుంది. ఇక్కడి ఒకే తల్లి-తండ్రి యొక్క సంబంధం యొక్క సంస్కారం, అక్కడ విశ్వ మహారాజు లేదా విశ్వమహారాణిని తల్లి-తండ్రి రూపంలో అనుభవం చేసుకుంటారు. ఇక్కడ స్నేహంతో నిండిన పరివారం యొక్క సంబంధం అక్కడ కూడా రాజులైనా, ప్రజలైనా కానీ, ప్రజలను కూడా పరివారంగా భావిస్తారు.

### 554. ఏ ముఖ్య సిద్ధాంతం ద్వారా శివబాబా ద్వాపర, కలియుగీ మహాన్ ఆత్మలకు గుప్త రూపంలో బహుమతి ఇస్తారు?

ద్వాపర కలియుగాల్లో కొంతమంది మహాన్ ఆత్మలు అందరికీ తండ్రి ఒక్కరే అనే నమ్మకమైన మూల సిద్ధాంతం ద్వారా వారికి గుప్తరూపంలో పాలన ఇస్తారు. ఉదాహరణకు - షిర్డీ సాయిబాబా "సబ్ కా మాలిక్ ఏక్ హై" అనగా సృష్టికి యజమాని ఒక్కరే అని తెలియజేసారు. "నేను దేవుని కుమారుడను, పరలోకమందు తండ్రి ఉన్నాడని" క్రీస్తు తెలియజేసారు. మహ్మదీయులు "అల్లా ఏక్ నూర్ హై" అనగా భగవంతుడు ఒక వెలుగు అని తెలియజేసారు. భక్తులలో కూడా ఎక్కడైతే భగవంతుడు ఒక్కడే అనే సిద్ధాంతం ఉందో అక్కడ ఏ యుగమైనా వారు ఎంతోకొంత భగవంతుని నుండి శక్తిని పొందుతారు.

### 555. సోమరితనం ఏ విధంగా సమాప్తి అయిపోతుంది?

యోగంలో ఉండే రమణీయత (ఆనందం) యొక్క అనుభవం సోమరితనాన్ని సమాప్తి చేస్తుంది. అమృతవేళ లేవడానికి ఈ అనుభవం అవసరం.

**556. ప్రపంచంలో వున్న ప్రతీ ఆత్మకు ఎంత, ఎటువంటి జ్ఞానం ఇవ్వాలి?**

ప్రపంచంలో ఉన్న ప్రతీ ఆత్మకు భగవంతుడు వచ్చి, ధర్మ స్థాపన చేస్తున్నారని, మన బాబా వచ్చారు. బ్రహ్మకుమారీల బాబా కాదు అనే శ్రేష్ఠమైన పరిచయాన్ని వారికి ఇవ్వాలి. అప్పుడు పరంధామం యొక్క తలుపులు తెరుచుకుంటాయి. అందరూ కూడా ముక్తి ధామానికి వెళ్ళేముందు వారి శక్తిననుసరించి వారసత్వం తీసుకుంటారు.

**557. సూక్ష్మ వతనంలో ఏ భండారా ఉంది?**

మీ సేవాకేంద్రాలలో ధనానికి సంబందించిన భండారా ఉంటుంది. సూక్ష్మవతనంలో ప్రతీ ఒక్కరు ప్రతీరోజూ మనసా, వాచా, కర్మణా వేటి ద్వారా ఎంత జమ చేసుకున్నారో మొత్తం లెక్కఅంతా ఉంటుంది.

**558. సంతుష్టత ఏయే విషయాలలో ఎక్కడెక్కడ ఉండాలి?**

స్వ సేవ అనగా యోగంలో, ధారణలో సంతుష్టంగా ఉండాలి. పరివారం యొక్క సేవలో అందరూ సంగఠిత రూపంలో సంతుష్టమవ్వాలి. ఏదొక విధంగా ప్రతీ ఒక్కరికీ బాబా సందేశం వెళ్ళాలి. అప్పుడు వారు సంతుష్టం కావాలి. దీనినే నెంబర్‌వన్ సఫలతా సేవ అంటారు.

**559. ఎవరిని మనం బాబాని ప్రత్యక్షం చేయడంలో నిమిత్తంగా చేయాలి?**

స్టేజీపై ఉన్న వి.ఐ.పిలు కేవలం మనల్ని మహిమ చేయడం కాదు. పరమాత్మ జ్ఞానం యొక్క గుహ్య విషయాలను శివపరమాత్మను మహిమ చేయాలి.

**560. బాబాని మనస్సుతో కలుసుకున్నా గానీ, సాకార తనువులో వచ్చినప్పుడు కలుసుకున్నాగానీ, అనుభవం దేని ద్వారా అవుతుంది?**

మనస్సు యొక్క స్నేహం ద్వారా.

**561. దివ్యత, అలౌకికత ఏయే విషయాలలో ప్రత్యక్షంగా ఋజువవ్వాలి?**

దివ్యజన్మ తీసుకున్న మన తనువు ద్వారా సాధారణ కర్మ చేయకూడదు. మనం చేసే పని చూడటానికి సాదారణ కర్మ లాగే ఉంటుంది. అంటే అందరిలాగే మనం కూడా వ్యాపారం చేసుకుంటాము, ఉద్యోగం చేసుకుంటాం. మాతలైతే వంట చేస్తారు. ఇవన్నీ చూడటానికి సాదారణ కర్మలు కానీ, మన కర్మలు అతీతంగా అలౌకికంగా మరియు దివ్యంగా ఉండాలి. అంటే బుద్ధి ద్వారా బాబాను స్మృతి చేయాలి. మనం దివ్య జన్మదారీ బ్రాహ్మణులం కావున, తనువు ద్వారా సాదారణ కర్మ చేయకూడదు. మనస్సు ద్వారా సాధారణ సంకల్పాలు చేయకూడదు. ధనాన్ని సామాన్య రీతీలో ఉపయోగించకూడదు. ఎందుకంటే మనం తనువు, మనస్సు, ధనం మూడింటికి నిమిత్తులం.

యజమాని అయిన బాబా శ్రీమతానుసారమే ఉపయోగించాలి. బాబా శ్రీమతం ఏమిటంటే, ప్రతీ సమయం దివ్యకర్మ చేయండి. ఎందుకంటే సాధారణ కర్మలు మన ప్రాప్తిని తయారుచేయవు, తగ్గించవు, కానీ వర్తమానంలో చేసిన దివ్య సంకల్పం, మాట, కర్మ భవిష్యత్తుకు జమ చేస్తాయి. కొంతమంది పిల్లలు చెబుతారు నేను ఈరోజు దు:ఖాన్ని ఇవ్వలేదు అని కానీ సుఖం ఎంతవరకు ఇచ్చారు. దు:ఖం ఇవ్వలేదు, దీని వలన వర్తమానం బాగుంటుంది. సుఖం ఇవ్వటం ద్వారా భవిష్యత్తుకు జమ అవుతుంది. సుఖదాత పిల్లలం కావున సుఖం ఎంత ఇచ్చాను అది కూడా చూసుకోవాలి. ఎవరైనా మన దగ్గరకి వస్తే మన ద్వారా ప్రతీ అడుగులో సుఖం అనుభవం కావాలి. దీనినే దివ్యత, అలౌకికత అంటారు. కనుక ఇలా మనల్ని లోతుగా పరిశీలన చేసుకోవాలి. ఈ ఒక్క జన్మలోనే 21 జన్మలు ప్రాప్తి సంపాదించుకోవాలి అని గుర్తుండాలి. తనువు ద్వారాఎంత సంపాదించుకున్నాను, దివ్య సంకల్పాలు చేసి మనస్సు ద్వారా ఎంత సంపాదించుకున్నాను, ధనాన్ని శ్రేష్ఠ కార్యాలలో ఉపయోగించి ఎంత సంపాదించుకున్నానని పరిశీలించుకోవాలి. మనం సంపాదించుకునే సమయం ఈ చిన్న సమయం దీనిలోనే మొత్తం కల్పానికి సరిపడగా సంపాదించుకోవాలి. ఇతరాత్మల యొక్క విషయం వేరు, కానీ శ్రేష్ఠ ఆత్మలైన మనకు ఇప్పుడు లేకున్నా మరెప్పుడు లేదు. దీనిలో అమాయకంగా అవ్వకూడదు.

### 562. సత్యతా శక్తికి మరియు బలహీన బుద్ధికి తేడా తెలుపుము? ఈ విషయాలలలో బాబా ఎవరికి రాజీ అవుతారు?

బుద్ధి, మనస్సు కంటే స్థూలమైనది, మనస్సు సూక్ష్మమైనది. సత్యమైన మనస్సుకు భగవంతుడు రాజీ అవుతారు. విశాల బుద్ధికి రాజీ అవ్వరు. విశాలబుద్ధి అనే విశేషత తప్పకుండా ఉండాలి. ఈ విశేషత ద్వారా జ్ఞానపాయింట్స్‌ని మంచిగా చెప్పవచ్చు కానీ ఆ పాయింట్ స్వరూపంగా అవ్వలేరు. సత్యమైన మనస్సు కలవారు, బిందువైన బాబాను ఒక్క సెకనులో స్మృతి చేస్తారు. సత్యమైన మనస్సుకి యజమాని రాజీ అయిన కారణంగా, సమయప్రమాణంగా, డ్రామా ప్లాన్ అనుసారంగా వారి బుద్ధికి భగవంతుని ప్రేరణ వస్తుంది. సత్యతా శక్తి గల ఆత్మకు, విశాబుద్ధి గల ఆత్మకు తేడా ఇదే.

### 563. పాస్‌విత్ ఆనర్ అవ్వాలంటే మనం ఏవిధిని ధారణ చేయాలి?

ఏకవ్రత అనగా ఒక్క శివబాబాయే సర్వస్వం. సర్వ సంబంధాలు ఆయనతోనే పెట్టుకునేవారినే ఏకవ్రత అని అంటారు. ఇలాంటి పిల్లలంటే వరాలు కురిపించే వరదాత శివబాబాకు చాలాచాలా ఇష్టం. ఇటువంటి పిల్లల భాద్యతలన్నీ ప్రతి సమయం స్వయం శివబాబాయే చూస్తారు. వారు ప్రతీ సెకను బాబా సహయోగంతో ముందుకు వెళ్ళి, వరదానాలతో సంపన్నంగా ఉంటారు.

## 564. శుభభావన గురించి బాబా ఏ విధంగా తెలియజేసారు?

శుభభావన కేవలం శుభమైనదే కాదు శక్తివంతమైనది కూడా. మిమ్మల్ని భగవంతుడు ఎన్నుకున్నారు కాబట్టి మీరు శుభభావనలో ఉంటే మీ ద్వారా స్వయం భగవంతుడు ఇతరులను మంచిగా చేస్తారు. శుభభావన ఎలా ఉండాలంటే, విశ్వంలోని ప్రతీ ఆత్మ భగవంతుడిని తెలుసుకుని స్వర్గవారసత్వం తీసుకోవాలని ఉండాలి. ఎవరికైనా మనం భగవంతుని పరిచయం ఇచ్చి సేవ చేస్తున్నప్పుడు వారిపై శుభభావన లేకపోతే ప్రత్యక్షఫలం రాదు. సేవలు రెండు రకాలుగా ఉంటాయి. 1) నీతి ప్రమాణంగా 2) రీతి ప్రమాణంగా అంటే ఏది వింటారో అది ఇతరులకు ఉన్నది ఉన్నట్లుగా వినిపిస్తారు. రెండవది నీతి ప్రమాణంగా అంటే శుభభావనతో మనస్పూర్వకంగా ఇతరులకు ఇప్పిస్తారు. మనలో శుభభావన, శివబాబాలో శుభబావన కలుగజేస్తుంది అప్పుడు వారు భగవంతుని నుండి ప్రాప్తి పొందగలరు. సైన్సు సాధనమైన టి.వి. దూరంగా వున్న దృశ్యాన్ని దగ్గరగా చూపిస్తుంది. అలాగే శుభభావన ఎంత శక్తిశాలీగా ఉంటుందో అంతంత ఇతరులకు ఎవరో మాకు విశేషంగా శాంతిశక్తి సహయోగం ఇస్తున్నారని సహజంగా అర్థమవుతుంది. ఈ అద్భుతాన్ని శివబాబా మన ద్వారా చేస్తారు. అప్పుడు మనం అనుకుంటాం, ఈ పనిలో మాకు ధైర్యం మరియు యోగ్యత లేనప్పటికి భగవంతుని సహాయంతో ఈ కార్యం పూర్తయ్యింది, విఘ్నాలు సమాప్తి అయ్యాయని. ఈ సేవకు సాధనాలు, ధనం, పరివారం అవసరం లేదు. మనస్సు చిన్న చిన్న విషయాల పట్ల నిమగ్నమై ఉండకూడదు. రోజంతటిలో ఎన్ని సమస్యలలో, పనులలో మునిగి ఉన్నా కానీ, మధ్యమధ్యలో కొన్ని నిమిషాలు తీసి మౌనంగా ఉంటూ సంకల్పాలను, స్థూలమైన కార్యాన్ని కూడా ఆపి శివబాబాను జ్ఞాపకం చేసుకుంటే శాంతిసాగరుడు నుండి శాంతిశక్తి మనలో అపారంగా నిండుతుంది. సెల్‌ఫోన్‌ని కాస్సేపు చార్జింగ్ చేసి రోజంతా వాడుకుంటాం కదా అలాగే ఈ అభ్యాసం కొంచెం సమయం చేసినా రోజంతటికి సరిపడు శక్తి నిండుతుంది. వ్యాపారం చేస్తున్నా, వ్యవసాయం చేస్తున్నా, ఉద్యోగం చేస్తున్నా, స్త్రీలైనా పురుషులైనా ఈ ఒక్క చిన్న పద్ధతిని పాటించండి. అప్పుడు ప్రతీ ఒక్కరి జీవితం ప్రశాంతం అయిపోతుంది. టీచర్స్ కూడా ఈ విషయాన్ని పాటించి యోగ్య టీచర్ అనే బిరుదు పొందండి. పాటించకపోతే కేవలం నామధారీ టీచర్‌గా అవుతారు. యోగ్య టీచర్ కారు.

## 565. సర్వప్రాప్తులు పొందే అవకాశం ఏ యుగంలో ఉంటుంది?

విశ్రాంతిగా జీవితాన్ని గడపడానికి ఉద్యోగం చేస్తారు కానీ, విశ్వానికి బాబా పాలన ఇవ్వాలనే లక్ష్యం పెట్టుకోండి. అనేక ఆత్మలను పాలన చేసేముందు స్వయాన్ని పాలన చేసుకోవటం ఎంత? అనేకమంది నుండి ఆశీర్వాదాలు తీసుకోవడం అనేది ఎంత పెద్ద సంపాదన. లౌకిక సంపాదన ఐదు వేలు లేదా ఐదు లక్షలు ఉంటుంది. కానీ అనేక ఆత్మల యొక్క ఆశీర్వాదాలు ఎంత పెద్ద సంపాదన, ఇది అనేక జన్మల సంపాదన. సంగమయుగంలో ప్రతీ దానిని

బేహద్ సేవలో ఉపయోగించే స్వర్ణిమ అవకాశం లభిస్తుంది. సత్యయుగంలో కూడా ఈ అవకాశం లభించదు. కుమారీలు ఉద్యోగం కోసం వార్తాపత్రికలు కూడా చూస్తూంటారు కానీ బాబా స్వయమే సేవకు అవకాశం ఇస్తున్నారు కాబట్టి యోగ్యమైన కుడిభుజంగా అవ్వండి.

### 566. కుమారుల యొక్క విలువ ఎప్పుడు పెరుగుతుంది?

కుమారులు కేవలం బాబాను తోడుపెట్టుకోండి. ఇంకెవరి తోడు అక్కరలేదు. అప్పుడు సదా సుఖీగా ఉంటారు. సేవలో ఎవరికీ మీరు సమస్య అవ్వకండి. అప్పుడే మీ విలువ పెరుగుతుంది.

### 567. నా భాగ్యం డ్రామాలో ఈవిధంగా ఉంది అని చింతను ఏవిధంగా తొలగించుకోవాలి?

ముందుగా మీ అదృష్టాన్ని గ్రహించండి, బలహీనమవ్వకండి. భగవంతుని పిల్లలైన ప్రతీ ఒక్కరికి ఏదొక విశేషత తప్పకుండా ఉంటుంది. మీలో ఏ విశేషత ఉందో గ్రహించి ఆ విశేషతను కార్యంలో ఉపయోగించే ధైర్యాన్ని పెట్టుకోండి. డ్రామాలో ఇంతే ఉందేమో అని బలహీన సంకల్పం ఎప్పుడూ చేయకండి. సేవలో ఉపయోగించడానికి ధనం లేదని చింతిస్తున్నారనుకోండి, మీ ఆస్తి పదివేల రూపాయల ఖరీదు చేస్తాయనుకోండి, మీరు ఒక్కరూపాయి సేవలో ఉపయోగించినా అది కోటానుకోట్లగా జమ అయిపోతుంది. ఒకరికి మొత్తం ఆస్తి పది లక్షలు ఉండి, వారు వందరూపాయలే భగవంతుని సేవలో ఉపయోగించారనుకోండి, మీ ఒక్క రూపాయి ఆ వంద రూపాయలతో సమానం. కావున ధనవంతులను, గుణవంతులను, మహారథులను, టీచర్స్‌ను మరియు పెద్దపెద్దవారికి చూసి నేను బలహీనుడను అని ఎప్పుడూ అనుకోవద్దు. ఎందుకంటే ఈశ్వరుని వద్ద ఒక లెక్క ఉంది – ఎంత ఉంటే ఎంత మనస్ఫూర్తిగా చేసారు, మిగిలింది ఎంత దాచుకున్నారు, ఈ ఒక్క ఉదార హృదయం ఆధారంగా ధనవంతులైనా, పేదవారైనా వారి ఖాతా లెక్కింపబడుతుంది.

### 568. ఏ సేవపై విశేషంగా ధ్యాస పెట్టాలి?

లక్షణాలు కలిగిన వారిని బాబా దగ్గరకు తీసుకువచ్చే సేవపై ధ్యాస పెట్టాలి. ఎందుకంటే ప్రజలు అంతిమంలో ఒక్క సెకనులోనే తయారైపోతారు.

### 569. సారథి, సాతీ అనగా నేమి?

మనలో ఒక బలహీనత ఉంటే మిగిలిన బలహీనతలన్నీ భూతాల్లా వచ్చేస్తాయి. అలాగే ఒక మంచి గుణం ఉంటే మిగిలిన మంచి గుణాలన్నీ మనలో వచ్చేస్తాయి. సారథి అంటే నడిపించేవాడు. శరీరాన్ని నడిపించేది ఆత్మ. సాథీ అంటే ఆత్మ భగవంతుని తోడుపెట్టుకుని జీవితాన్ని నడిపించడం.

**570. మన పరివారంలో ఏవరైనా విశేషత కారణంగా ముందుకు వెళుతున్నప్పుడు మనకు ఈర్ష్య వస్తే ఎంత నష్టం వస్తుంది?**

ఈర్ష్య అనేది పాపఖాతాను తయారుచేస్తుంది. ఉదాహరణకు మనం టీచర్ అనుకోండి. సేవార్థం ఇతరులను ముందు పెడతాము. ఆ సమయంలో మనకంటే (టీచర్ కంటే) ఎక్కువగా వారికి పేరు గౌరవం వస్తుందనుకోండి. అప్పుడా మనకి సహజంగా ఈర్ష్య వస్తుంది. ఆ ఈర్ష్య కారణంగా ఇకముందు వారిని ముందు పెట్టకుండా ఆపేస్తాం. వాస్తవానికి ఇతరులను ముందు పెట్టి మనం శాంతిగా ఉంటే మనకు విశ్రాంతి లభిస్తుంది. మనం వారిని ముందు ఉంచితే బాబా నుండి ఎప్పుడూ ఆశీర్వాదాలు వస్తాయి. కానీ మన పూర్వజన్మ సంస్కారాల ఆధారంగా, ఈర్ష్య ప్రజ్వరిల్లి వారిని వెనుకపెట్టి, మనం ముందు ఉంటే ఈ సృష్టి యొక్క కర్మల గుహ్యగతి ప్రకారం మనం మొదట ఉండటానికి బదులు చివరి నెంబరులోకి వెళ్ళిపోతాము. అనగా త్రేతాయుగం చివరి జన్మలలోకి వెళ్ళిపోతాం. ఈ విషయంపై విశేష ధ్యాస ఉంచాలి. మహారథులైనా, టీచర్స్ అయినా, విధ్యార్థులైనా ఇది పక్కా నియమంగా భావించి ముందుకు వెళ్ళిపోవాలి.

**571. ఆత్మబాణం ఆత్మకే తగులుతుంది అన్న విషయాన్ని వివరించండి?**

సాకార రూపంలో బ్రహ్మాబాబా అంతిమ వరదాన రూపం ఏమిచ్చారు? నిరాకారి, నిర్వికారి, నిరహంకారి. నిరాకారీ స్థితిలో స్థితులవ్వకపోతే ఏ ఆత్మకి సేవ చేసినా అది ఫలించదు. ఎందుకంటే ఆత్మ బాణం ఆత్మకే తగులుతుంది. స్వయం సదా ఈ స్థితిలో స్థితులవ్వకపోతే ఎవరికైతే సేవ చేస్తామో వారిని సదా స్మృతిస్వరూపంగా తయారుచేయలేం. అదేవిధంగా నిర్వికారిగా ఉండాలి. ఏదైనా వికారం యొక్క అంశం ఉంటే ఇతర ఆత్మలను శూద్ర వంశం నుండి బ్రాహ్మణ వంశంలోకి పరివర్తన చేయలేము. ఆ ఆత్మ కూడా శ్రమ చేయవలసి ఉంటుంది. అందుకు ప్రేమ యొక్క ఫలితాన్ని సదా అనుభవం చేసుకోలేదు. నిరహంకారీ సేవ అంటే, ఫలస్వరూపంగా అయ్యి, తలవంచటం, నిర్మాణంగా లేకపోతే సేవలో కూడా సఫలత రాదు. నిరాకారి, నిర్వికారి, నిరహంకారి ఈ వరదానాన్ని సేవలో ఉపయోగించాలి.

**572. యోగంలో కూర్చున్నప్పుడు ఆత్మాభిమాని స్థితికి బదులు సేవాస్మృతి వస్తే వచ్చే నష్టం ఏమిటి?**

అంతిమ సమయంలో అశరీరిగా అవ్వటానికి బదులు సేవాసంకల్పం నడిస్తే, సెకండ్ యొక్క పేపరులో ఫెయిల్ అయిపోతారు. ఆ సమయంలో శివబాబా తప్ప ఇంకెవ్వరూ స్మృతిలోనికి రాకూడదు. బ్రహ్మాబాబా కూడా అంతిమ స్థితిని ఈవిధంగానే తయారుచేసుకున్నారు – పూర్తి నిరాకారిస్థితిలో ఉండి సాకార స్థితిలోకి వచ్చి సేవ చేసేవారు. కాబట్టి ఏ సమయంలో ఏ స్థితి కావాలో ఆ స్థితి ధారణ చేయాలి. ఈ అభ్యాసం ఇప్పటి నుండే చేయండి. లేకపోతే అంతిమంలో

ఓడిపోతారు. సేవా సంకల్పమే కదా, వ్యర్థ సంకల్పం, వికారీ సంకల్పం కాదు కదా అని అనుకోకండి. కంట్రోలింగ్ పవర్ లేకపోతే రూలింగ్ పవర్ కూడా రాదు. కనుక అభ్యాసం చేయండి. ఇప్పటి నుండి అనగా చాలా కాలం యొక్క అభ్యాసం కావాలి. దీనిని తేలికగా వదిలేయకండి.

### 573. చిన్న చిన్న అవాజ్ఞలు ఏవిధంగా నష్టం తీసుకువస్తాయి?

అవాజ్ఞ అనగా బాబా ఆజ్ఞలను అతిక్రమించటం. చిన్న చిన్న అవాజ్ఞలు మనస్సుని భారం చేసేస్తాయి. భారంగా అయిపోయిన కారణంగా ఉన్నత స్థితిలో ఎగరలేం. ఇది చాలా గుహ్యగతి. వెనుకటి జన్మల పాపభారం ఆత్మను ఎగురనివ్వదో అదేవిధంగా, ఈ జన్మ యొక్క చిన్న చిన్న అవాజ్ఞల యొక్క భారం ఏ స్థితి కావాలో ఆ స్థితిని తయారుచేసుకోనివ్వదు.

### 574. భక్తి ఎవరు ప్రారంభించారు?

సత్య-త్రేతాయుగాలలో చైతన్య దేవతలుగా జన్మలు తీసుకుంటూ వచ్చిన దేవతలే ద్వాపరయుగం నుండి మానవులుగా మారి భక్తిని ప్రారంభించారు. మొదట శివలింగాన్ని తయారుచేసి పూజ చేసారు. తరువాత వారి విగ్రహాలకు వారే పూజలు చేసారు. అంటే దేవాత్మలుగా ఉండేవారు దేవతావిగ్రహాలను పూజించేవారిగా అవుతారు.

### 575. వృక్షం యొక్క కాండము, శాఖలు అనగా సూక్ష్మ అర్థం తెలపండి?

ప్రతీ ఒక్కరిచే ప్రతీ శ్రేష్ఠకర్మ సంగమయుగంలో చేయించేవారు శివబాబా ఒక్కరే! మనల్ని ఎందుకు నిమిత్తం చేశారంటే భాగ్యాన్ని ఇవ్వటానికి. నేను చేస్తున్నాను అంటే ఆ ఆత్మకు సుమారుగా 25% శక్తి ఉంటుంది. ఆ శక్తి ఆధారంగా మాత్రమే సఫలత వస్తుంది. సర్వజ్ఞుడు సర్వశక్తివంతుడైన శివబాబా నా చేత చేయిస్తున్నారంటే, 100% సఫలత వస్తుంది. ఏదైనా వృక్షానికి బీజం ఒకటే ఉంటుంది. కొమ్మలురెమ్మలు అనేకం ఉంటాయి. అదేవిధంగా సంగమయుగంలో జ్ఞానీ-యోగీ ఆత్మలుగా పిలువబడే బ్రాహ్మణులు కొందరు శ్రీమతాన్ని తక్కువ పాటించి, మన్మతాన్ని కలిపి జీవితాన్ని నడిపించుకుంటూ, ఇతరుల జీవితాలను కూడా ఆ భావంలోనే నడిపించారు. కాబట్టి ద్వాపరయుగం నుండి అనేక మతాలు, అనేక గురువులు, శాఖోపశాఖలుగా చీలిపోయి అసలైన భగవంతుడిని మరిచిపోయారు. ఈ శాఖలకు ఆధారం మీరే కదా! ఉదాహరణకు, వ్యర్థ సంకల్పాలు, చెడు సంకల్పాలను బాబాకు అర్పితం చేయమని బాబా చెప్పారు. మనం భగవంతుడు చెప్పిన ఆ సూక్ష్మ నియమాన్ని ప్రక్కకు పెట్టి, ఆచరించే శక్తిలేక కేవలం స్థూలఅర్థం తీసుకునే స్థితిలోనే ఉండిపోయిన కారణంగా, అభోక్త అనగా ఏమి భుజించని నిరాకారుడైన శివపరమాత్మకు పండ్లు పథార్థాల భోగ్ చేస్తాం. పరమాత్మ తెలియజేసిన సూక్ష్మ సూత్రాన్ని గ్రహించలేక కేవలం పదార్థాలను మాత్రమే భోగ్ చేస్తాం అందువలనే భక్తిలో జడ విగ్రహాలకు ఘన పదార్థం నైవేద్యం పెడతారు.

దీనికి ఆధారం మనలో కొందరే కదా! ఇదొక శాఖగా తయారయిపోయింది. అదే మహా ఋషులైతే ఏకాగ్రతాశక్తితో స్థూల భోగ్ పెట్టకుండా మనస్సుని భగవంతునికి భోగ్ చేస్తారు అంటే అర్పిస్తారు. దీనికి కూడా ఆధారం మనలో ఒకరు. ఇలా సంగమయుగి బ్రాహ్మణుల ఆధారంగానే ద్వాపర కలియుగాల్లో విభిన్న శాఖలు, మతాలు, సంప్రదాయాలు ఏర్పడ్డాయి.

### 576. బాబా నుండి మనకు శక్తి సహయోగ రూపంలో ఎప్పుడు లభిస్తుంది?

ఏదైనా ఒక విషయాన్ని శివబాబా ఎదురుగా కూర్చుని మనస్సుతో తెలియజేయండి మరే విషయాలు ఆలోచించకుండా కొన్ని నిమిషాలు అలాగే ప్రశాంతంగా కూర్చుంటే ఆ కార్యం ఎలా చేయాలనేది మీ మనస్సుకి బాబా నుండి టచ్చింగ్ లభిస్తుంది.

### 577. సేవా విస్తారాన్ని ఎంతైనా పెంచండి. కానీ ఏ స్థితి చాలా అవసరం?

ఆత్మిక వాయుమండలాన్ని, అశరీరి స్థితి యొక్క వాయుమండలాన్ని, అతీత మరియు అతిప్రియ స్థితి యొక్క శక్తిశాలీ వాయుమండలాన్ని తయారుచేయండి. ఇతరుల సేవ చేసేటప్పుడు ఈ విధిని తప్పకుండా పాటించండి. అప్పుడు సేవ విజయం పొందుతుంది. ఈ సేవ మీరు తప్ప ప్రపంచంలో మరెవ్వరూ చేయలేరు. ఈ అభ్యాసం ద్వారా ప్రకృతి, మనస్సు, ఆత్మల యొక్క సంస్కారాలు కూడా మారిపోతాయి.

### 578. మనసా సేవలో ఏయే విషయాలు సమాప్తి అయిపోతాయి?

వాచా సేవతో పాటు మనసాసేవ కూడా చేయండి, అప్పుడు మీకు వాక్కు ద్వారా చెప్పడం తగ్గుతుంది. మాట్లాడటం ద్వారా ఏదైతే శక్తి ఖర్చవుతుందో, మనసాసేవ చేయడం ద్వారా ఆ శక్తి జమ అవుతుంది మరియు మనసా సేవ ద్వారా సేవలో సఫలత ఎక్కువ అనుభవమవుతుంది. అప్పుడప్పుడు మన సంస్కారాలు పరివర్తన చేసేటప్పుడు కష్టపడవలసి ఉంటుంది. సంగఠన రూపంలో నడిచేటప్పుడు, అప్పుడప్పుడు సేవలో సఫలత తక్కువ వస్తుంది. అప్పుడు మీ మనస్సు బలహీనం అయిపోతుంది. ఇటువంటివి అన్నీ మనసాసేవ ద్వారా సమాప్తి అయిపోతాయి. ఒక్కొక్కసారి చిన్నచిన్న విషయాలు పెద్దవిగా అవుతాయి అవి కూడా సమాప్తి అయిపోతాయి. ఎలాగంటే ఏమైనా గారడీ జరిగిందా అని అనుకుంటారు. అంత సులువుగా పోతాయి.

### 579. ఎవరు నెంబర్‌వన్ ప్రజలుగా అవుతారు?

నంబర్‌వన్ ప్రజలంటే బాబా స్నేహాన్ని అనుభవం చేసుకుంటారు మరియు సహయోగిగా కూడా ఉంటారు. నా బాబా అని మనస్ఫూర్వకంగా అంటారు కానీ సమర్పణ అవ్వరు, ఇప్పుడు ఎవరు సేవ చేస్తారో వారితో స్నేహీగా అవుతున్నారు కానీ, బాబా స్నేహం యొక్క అనుభూతి చేసుకోవాలి.

**580. ఈశ్వరీయ చదువుని ఏవిధంగా తీసుకోవాలి?**

కేవలం వినటం కాదు, స్వరూపంలోకి తీసుకురావాలి.

**581. యోగం ఏవిధంగా చేసుకోవాలి?**

యోగం ముఖ్య సంస్కారంగా అనగా ప్రధానంగా చేసుకోవాలి.

**582. రాయల్టీ అంటే ఏమిటి?**

దేవాత్మలుగా అవ్వటమంటే రాయల్ కుటుంబంలోకి రావటం. మీ యొక్క రాయల్టీకి పూజ విగ్రహాల రూపంలో జరుగుతుంది. ఇటువంటి రాయల్టీ పూజ్య ధర్మాత్మలకు కానీ, మహాన్ ఆత్మలకు కానీ లేదు.

**583. ఏదైనా చెడువిషయాలు వింటున్నా, చూడవలసివస్తున్నా మన స్థితి ఎలా ఉండాలి?**

కర్మల గుహ్య రహస్యాన్ని ఎదురుగా ఉంచుకోండి. ఒకవేళ ఎవరి చెడు లేదా పొరపాటు విషయం మనస్సులో ఉంచుకోవటంతో పాటు వర్ణన చేస్తున్నారంటే ఈ వ్యర్థ వర్ణన ఎలాంటిదంటే నూతిలో అరిస్తే ఆ అరుపు మనకే ఇంకా గట్టిగా వినిపిస్తుంది. ఎవరికైనా చెడు చూసేటటువంటి, పొరపాటుని పొరపాటుగా వ్యాపించే అలవాటు ఉంటే మార్చుకోండి. ఎందుకంటే ఈరోజు మీరు ఎవరినో నింద చేస్తున్నారు , మిమ్మల్ని మీరు గొప్ప తెలివైనవారిగా, పొరపాటుగా దూరంగా ఉండేవారిగా భావించి వారి లోపాలను వర్ణన చేస్తున్నారు కానీ పక్కా నియమం లేదా కర్మల గుహ్యగతి ఏమిటంటే ఈరోజు మీరు ఎవరినైనా నింద చేస్తే రేపు వారు మిమ్మల్ని 10రెట్లు నిందిస్తారు. ఎందుకంటే ఈ పొరపాటు విషయాలు ఎంత తీవ్రంగా వ్యాపిస్తాయంటే ఏదైనా అంటువ్యాధి ఎంత తొందరగా వ్యాపిస్తుందో అలాగే ఎవరిని నింద చేశారో అక్కడి వరకు చేరుకుంటుంది. మీరు ఒక నింద చేశారు; వారు తమ పొరపాటుని సిద్ధి చేసుకోవడానికి మీకు 10 నిందలు చేస్తారు. ఫలితం ఏమయ్యింది? కర్మలగుహ్యగతి ఏమయ్యింది? తిరిగి ఎక్కడికి వచ్చింది? ఒకవేళ మీకు శుభ భావన ఉంది వారిని మంచిగా చేయాలని, పొరపాటు విషయాన్ని శుభ భావనా స్వరూపంతో విశేష నిమిత్త స్థానంలో చెప్పండి. వ్యాపింపచేయటం తప్పు. కొందరంటారు మేము ఎవరికీ చెప్పలేదు కానీ వారు చెప్తుంటే నేను కూడా అవునా, అలాగా అని అన్నానంతే, మరేమీ మాట్లాడలేదు అని కానీ భక్తిమార్గ శాస్త్రాలలో కూడా చెప్తారు కదా – చెడు పని చేయకపోయినా చేస్తుండగా చూసినా, చేసిన వారికి సహాయం చేసినా పాపం అని వర్ణన చేశారు కదా, అవును అవును అనటం కూడా కర్మల గుహ్యగతి అనుసారంగా పాపంలో భాగం పొందటం.

**584. జ్ఞానం అంటే ఏమిటి?**

జ్ఞానం అంటే తెలివి. తెలివిగా మాయపై విజయం సాధించే ఆయుధమే జ్ఞానం.

**585. బ్రహ్మాబాబాకి ఏవిషయంపై స్నేహం ఉంది?**

శివబాబా చెప్పిన మురళీపై బ్రహ్మాబాబాకు స్నేహం ఉంది. అందుకే శ్రీకృష్ణునికి స్థూలంగా కూడా మురళీని చూపిస్తారు.

**586. సంగమయుగంలో ధర్మపితలు మన ద్వారా ఏమి నేర్చుకుంటారు?**

తయారైన వేదిక మీకు లభిస్తుంది. ధర్మపితలు మిమ్మల్ని పిలిచి ముఖ్య అతిధిగా ఏర్పాటు చేస్తారు. భగవంతుడు ఒక్కరే! అనే నినాదాన్ని ధర్మపితలు మన నుండి నేర్చుకుంటారు.

**587. డ్రామాలో ఈ సంగమయుగం యొక్క విశేషత ఏమిటి?**

నరుణ్ణి శ్రీనారాయణునిగా, నారిని శ్రీలక్ష్మిగా తయారు చేయటం.

**588. పవిత్రతకు గుర్తు ఏమిటి?**

ఒక్క శివబాబాతోనే ఉండటం.

**589. లక్షణాలు గల ఆత్మల యొక్క గుర్తులు తెలుపుము?**

లక్షణాలు గల ఆత్మలను తయారు చేయడానికి మీ మనస్సు చాలా శక్తిశాలీగా ఉండాలి. లక్షణాలు గల ఆత్మలు వాణీలో మొదట తెలివైనవారిగా ఉంటారు, కానీ అనుభూతి శక్తి పొందటంలో మొత్తం ఖాళీగా ఉంటారు. వారిలో ఏ బలహీనతలు ఉన్నాయో గ్రహించి తొలగించే శక్తి మీలో ఉండాలి. అప్పుడు లక్షణాలు గల ఆత్మ వీరికి శివపరమాత్మ ఆశీర్వాదాలు ఉన్నాయని అనుభూతి చేసుకుని, మిమల్ని గొప్పవారిగా భావించి మీ స్నేహం ద్వారా పావనమవుతారు.

.

**590. స్మృతి స్వరూప ఆత్మల గుర్తులు తెలుపుము?**

స్మృతి స్వరూప ఆత్మకు ఎటువంటి పరిస్థితి వచ్చినా, ఎటువంటి పరీక్ష అయినా, విఘ్నాలైనా, సమస్యలైనా కానీ ఇవి మార్గమధ్య దృశ్యాలు అని భావించి ప్రతీకల్పం వీటిని దాటి ముందుకు వెళ్ళిపోయానని అనుభవం చేసుకుంటుంది. నాలుగు సబ్జక్టుల సారం స్మృతి అని తెలుసుకుంటుంది.

**581. వేరే మాలను తయారు చేసేవారు సత్యయుగంలో ఏ పాత్ర ఉంటుంది?**

పిక్నిక్ స్థానంలో ఉంటారు అనగా ఇతర దేశాలు సముద్రంలో ఎక్కువ బాగం మునిగిపోయి దీవులుగా పిక్నిక్ స్థానాలుగా మిగిలిపోతాయి. ఆ దీవుల దగ్గర వీరు కాపలాదారులుగా పాత్ర అభినయించవలసి వస్తుంది.

**582. ఏవిధమైన త్యాగం చేసారు? ఇంకా ఏవిధమైన త్యాగం చేయాలి?**

కేవలం తెల్ల బట్టలు వేసుకుంటున్నారు వీటిలో ఇంతకుముందుకంటే అందంగా కనిపిస్తున్నారు. ఆహార పానీయాలలో నియమాలు పాటిస్తున్నారు. ఈ విషయంలో బయటివారు కూడా వైద్యం ఆధారంగా ఆహారనియమాలు పాటిస్తున్నారు, ఎక్కువ తినకండి, తక్కువగా, సాధారణంగా తినండి అని వైద్యులు కూడా చెబుతున్నారు. మీరు నగలు ధరించడం మానేసారు, బయటివారు కూడా దొంగలు దోచుకుంటారని నగలు ధరించడం మానివేసారు. ఈ త్యాగాలు బయటివారితో పోలిస్తే సాధారణం. కానీ శివపరమాత్మ తెలిపే సత్యమైన త్యాగం ఏమిటంటే – ఆత్మలోవున్న సూక్ష్మశక్తియైన మనస్సుని సర్వశక్తివంతుడైన శివబాబాతో జోడించి బుద్ధిని వస్తువైభవాలవైపు వెళ్ళనివ్వకుండా అన్నీ భగవంతునికి అర్పితం చేసి, కోరికంటే ఏమిటో తెలియని వారిగా అయిపోవాలి. ఇదే ఉన్నతోన్నత త్యాగం. దీని తర్వాత పేరు గౌరవం, సాధనాలు, సంపత్తి, పదవి, ఉన్నత స్థితి లభిస్తాయి. వీటిని కూడా మనస్సు, బుద్ధిలో స్వీకరించకుండా డబల్ భాగ్యశాలీగా అవ్వండి. అనగా త్యాగం ద్వారా వచ్చిన భాగ్యాన్ని మరలా త్యాగం చేయండి. ఏవిధంగానైతే తెలివైన వడ్డీ వ్యాపారస్తులు వచ్చిన వడ్డీని కూడా అప్పుగా యిచ్చి వడ్డీకి వడ్డీ వచ్చేటట్లుగా చేసుకుంటారు కదా, ఆవిషయంలో వారు పొదుపు యొక్క చక్రవర్తులుగా ఉంటారు. వారికంటే మీరు గొప్పవారు కాబట్టి ఏమి త్యాగం చేయాలో బాగా అర్థం చేసుకుని నడవండి.

**583. తనువు యొక్క, మనస్సు యొక్క స్వచ్ఛత వీటి గురించి పూర్తిగా తెలుపుము?**

తనువు యొక్క స్వచ్ఛత అంటే తనువుని మందిరంలా భావించాలి. మందిరంలో భూతాలు నివసించవు కదా! అలాగే మన దేహం ద్వారా చెడు కర్మలు చేయకూడదు. అనగా ఎవరినైనా కొట్టడం, బాధించడం, తిట్టడం మొ॥నవి చేయరాదు. మనస్సు యొక్క స్వచ్ఛత అనగా (1) స్వయం పురుషార్థం యొక్క స్వచ్ఛత (2) సేవ చేస్తూ ఎంత సత్యంగా ఉన్నాము, ఈ రెండు విషయాలు శివబాబా ముందు పెట్టాలి. ఎన్ని మేళాలు చేసినా, ఎన్ని కోర్సులు చెప్పినా, ఎన్ని సెంటర్స్ పెట్టినా, మనస్సు యొక్క స్వచ్ఛత లేకపోతే కేవలం అవి డ్యూటీ చేసినట్లు అవుతుంది. డ్యూటీగా చేసేవారికి గవర్నమెంటు తగు జీతమే ఇస్తుంది, ఎక్కువ జీతాన్ని ఇవ్వదు. అదేవిధంగా ఇక్కడ మనస్సు యొక్క స్వచ్ఛత లేకపోతే తగుమాత్రంగానే ఫలాన్ని పొందుతారు.

## 524. స్మృతి మరియు సేవ అనగా నేమి?

సేవ చేస్తూ భగవంతుని స్మృతి ఉండాలి. అంటే బట్టలు ఉతుకుతున్నా, వంట చేస్తున్నా అదీ యజ్ఞ సేవే కదా. అది కూడా అలౌకిక జీవితం కోసమే కదా! ఆ స్మృతిలో కర్మ చేయాలి. యోగ్య టీచర్ యొక్క బండారా ఎప్పుడు పెరుగుతుందంటే అందరినీ ఆత్మగా చూడగలిగినప్పుడు. ఇది కూడా సేవలో స్మృతిలో  ఉంచుకోవాలి.

## 525. సంబంధంలో సఫలత రావాలంటే మనం ఏవిధంగా నడుచుకోవాలి?

ఏ ఆత్మకి, ఏ సమయంలో, ఏ రకంగా స్నేహం, సహయోగం, శిక్షణ యివ్వాలో పరిశీలించాలి. అప్పుడే సఫలత వస్తుంది. శరీర రోగాన్ని పరిశీలించే శక్తి డాక్టరుకు లేకపోతే రోగాన్ని తొలగించలేదు కదా. అదేవిధంగా ఇతరులకు ఏది ఇష్టమో పరిశీలించి ఆ రీతిలో యుక్తీయుక్తంగా భగవంతునితో సంబంధం  ఏర్పరచాలి. అనగా క్రైస్తవులకు జ్ఞానం చెప్పాలంటే, ఏసుక్రీస్తు ఏమని చెప్పారని వారిని అడగాలి, పిమ్మట, పరలోకంలో తండ్రి ఉన్నారని క్రీస్తు చెప్పారు కదా మరియు నేను దేవుడిని కాదు, దేవుని కుమారుడను అని చెప్పారు కదా! భగవంతుడు ఒక వెలుగు అని  (గాడ్ ఈజ్ లైట్) చెప్పారు కదా. ఈ అన్ని విషయాల యొక్క సూక్ష్మ అర్థం వారికి చెప్పాలి. అప్పుడు వారు మన జ్ఞానమార్గంలోకి రాకపోయినా ఇది సత్యజ్ఞానం అని అంగీకరిస్తారు. అందరూ అంగీకరించేలా సేవ చేయాలని శివబాబా మనపై ఆశ పెట్టుకున్నారు.

## 526. కర్మలో ఏవిధంగా మనం ప్రవర్తించాలి మరియు సిద్ధిని పొందాలంటే ఏ సిద్ధి దారణ చేయాలి?

కర్మలో సాధారణత, విశేషత కలిపేస్తే సఫలత కూడా మిక్స్ అయ్యి వస్తుంది. ఒకొక్కసారి మనం సాధారణ కర్మ లేదా వ్యర్థ కర్మ చేస్తాం అది తప్పో ఒప్పో మనకే తెలియదు, అప్పుడు మనం పరవశం అయిపోతాం. అటువంటి పరిస్థితుల్లో కూడా సిద్ధి పొందాలంటే దానికి శ్రేష్ట విధి ఏమిటి? ఎందుకంటే ఆ సమయంలో మీ బుద్ధి పరవశమైపోయి ఉంది. ఒప్పుని కూడా తప్పుగా భావిస్తారు ఇదే వశీభూతం అయిపోయిన బుద్ధికి గుర్తు. ఆ సమయంలో సదా ఒకే శివబాబా యొక్క శ్రేష్ట సలహాని స్మృతిలో ఉంచుకోండి మరియు బాబా ఎవరినైతే నిమిత్తం చేశారో వారి ఆజ్ఞకు కూడా గొప్పతనం ఇవ్వాలి. నిమిత్తమైనవారికి చెప్తే ఎవరికైనా చెప్తారేమో అనుకుని మోసపోవద్దు. నిమిత్తమైనవారి ఆజ్ఞకు విలువనిస్తే అది ఒకవేళ ఏదైనా చెడు పని జరిగినా దాని భాద్యత మీకు ఉండదు. ఒకవేళ బ్రహ్మాబాబా తప్పు చేస్తే ఆ పొరపాటు కూడా మంచిగా మారిపోతుంది కనుక నిమిత్తంగా అయిన ఆత్మల పట్ల ఎప్పుడూ వ్యర్థ సంకల్పాలు రాకూడదు. వారు ఇచ్చిన సలహా మీకు నచ్చకపోయినా కానీ ఆ సమయంలో ఆవిధంగానే చేయాలి. అలా

చేస్తే మీకు ఏ పాపం రాదు. మీ పని మంచిగా అయిపోతుంది ఎందుకంటే బాబా ఉన్నచోట పాపం ఉండదు. ఇది గుహ్యమైన రహస్యం కాబట్టి నిమిత్తమైన శ్రేష్ఠాత్మల శ్రేష్ఠ ఆజ్ఞను ఇప్పటి నుండీ కార్యంలో ఉపయోగించండి. దీనిలో మీకు లాభం ఉంది. నష్టం కూడా లాభంలోకి మారిపోతుంది. ఇది బాబా యొక్క గ్యారంటీ. అందుకే ముందే చెప్పాను, కర్మల యొక్క లీల చాలా విచిత్రమైనది, బాబాయే బాధ్యుడు. ఎవరిని నిమిత్తం చేశారో వారికి కూడా బాధ్యుడు బాబాయే, మీ పాపాన్ని కూడా మార్చే భాద్యత బాబాదే.

### 597. నిమిత్తమైనవారి సాంగత్యంలో మనం ఏవిధంగా ఉండాలి?

నిమిత్తమైనవారిని ఏమైనా అనటం అంటే బాబాని అనటం. ఎందుకంటే వారిని బాబాయే నిమిత్తం చేశారు కదా, బాబా కంటే మీకు పరిశీలనాశక్తి ఎక్కువ ఉందా? శివబాబాకి పిల్లలందరితో స్నేహంతో ఉంటుంది. నిమిత్తమైనవారంటేనే బాబాకి ఇష్టం అనుకోకండి ఇది కూడా ప్రేమ ఉన్న కారణంగానే ఈ ఆజ్ఞ ఇస్తున్నారు. ప్రేమ లేకపోతే ఎలా కావాలంటే అలా నడుచుకోండి అని అంటారు.

### 598. ఒకరినొకరు వేళాకోళం చేసుకునే సమయంలో ఏవిధిని ధారణ చేయాలి?

హద్దు దాటి వేళాకోళం చేసుకోవటమనేది జ్ఞానీ ఆత్మల మద్య లేదు. వేళాకోళం అనేది మంచిదే కానీ దానిలో ఆత్మీయత ఉండాలి. ఆ ఆత్మకి ఏ లాభం ఉండదు, సమయం వ్యర్థంగా అయిపోతుంది అలాంటి వేళాకోళం చేసుకోవద్దు. రమణీయత అనే గుణం మంచిదే కానీ వ్యక్తి, సమయం, సంఘటన, స్థానం, వాయుమండలం అనుసారంగా ఉండాలి. ఒకవేళ ఈ అన్ని విషయాలలో ఏది లోపించినా అది కూడా వ్యర్థంలోకి లెక్కించబడుతుంది. నవ్విస్తున్నారు బాగానే ఉంది కానీ ఎక్కువగా మాట్లాడుతున్నారు అనే సర్టిఫికెట్ వస్తుంది. అంటే మిక్స్ చట్నీ అయిపోయింది. కాబట్టి సమయానికి హద్దు ఉంచుకోండి. అటువంటి వారినే మర్యాదా పురుషోత్తములు అని అంటారు. మన మాట ఎలా ఉండాలంటే వీరు ఏమి మాట్లాడుతారో అని ఆత్మలు చాత్రకులుగా ఎదురుచూడాలి. దానిని అమూల్య మహావాక్యం అని అంటారు. మహావాక్యాలు ఎక్కువ ఉండవు. ఎప్పుడు కావాలంటే అప్పుడు మాట్లాడేయటాన్ని మహావాక్యం అనరు. సద్గురువు యొక్క పిల్లలు మాస్టర్ సద్గురువులు కాబట్టి మహావాక్యం రావాలి కానీ వాక్యం కాదు.

### 599. అంతర్ముఖత ఎప్పుడు మనలో ధారణ అవుతుంది?

మాటపై ధ్యాస పెట్టుకున్నప్పుడు అంతర్ముఖత సహజంగా వస్తుంది. అంతర్ముఖత అనగా మన భృకిటి అనే కుటీరంలో తపస్వీమూర్తిగా ఆత్మను అనుభవం చేసుకోవటం. అప్పుడు మన స్థితి నిశ్చింతా చక్రవర్తిగా ఉంటుంది.

### ౬౦౦. అమృతవేళ గురించి బాబా ఏముఖ్య విషయాన్ని తెలియచేసారు?

రాత్రంతా సేవ చేసి అమృతవేళ పడుకుంటున్నారా? మరి అదనపు జమా ఏమి అయినట్లు? సేవ చేశారు అమృతవేళ మిస్ చేశారు. అప్పుడు ఏమైనట్లు? అమృతవేళ కేవలం నియమానుసారం లేవకూడదు. శక్తిశాలిగా యోగం చేసుకోవాలి. కొంతమంది సహజయోగమే కదా అనుకుని సహజంగా కూర్చుని నిద్రలోకి వెళ్ళిపోతున్నారు, గురక కూడా పెడుతున్నారు ఆ ధ్వని యొక్క క్యాసెట్ కూడా బాబా దగ్గర ఉంది. కనుక ఇప్పుడు అమృతవేళపై బాగా ధ్యాస పెట్టండి.

### ౬౦౧. ఎప్పుడు మీరు గొప్ప వ్యక్తులుగా ప్రపంచంలో పిలవబడతారు?

ఇప్పటి వరకు బ్రాహ్మణాత్మలైన మీరు మీ తనువు, మనస్సు యొక్క శ్రమతో కార్యక్రమాలు చేస్తున్నారు. వేదిక తయారుచేస్తున్నారు, ఆహ్వానపత్రాలు ముద్రిస్తున్నారు, గొప్ప వ్యక్తులను పిలుస్తున్నారు, రేడియో, టి.వి వాళ్ళని సహయోగులుగా చేస్తున్నారు, ధనాన్ని ఖర్చుపెడుతున్నారు కానీ ఇకముందు మీరు గొప్పవ్యక్తులుగా పిలవబడతారు. మీకంటే గొప్పవ్యక్తులు ఎవరూ కనిపించరు. తయారైపోయిన వేదిక పైకి ఇతరులు మిమ్మల్ని ఆహ్వానిస్తున్నారు. వారి తనువు, మనస్సు, ధనములతో వేదిక తయారుచేసి మిమ్మల్ని ఆహ్వానిస్తారు. మీరు శ్రమపడనక్కర్లేదు. వారే వచ్చి మా వద్దకు రండి అని కోరతారు. అప్పుడు ప్రత్యక్షత అనే మాట వస్తుంది. అందరి ధ్యాస పిల్లలైన మీ ద్వారా బాబావైపు వెళ్తుంది. ఇది ఎక్కువ సమయం ఉండదు. అందరి దృష్టి బాబా వైపుకి వెళ్ళటం అంటే బాబా ప్రత్యక్షం అవ్వటం. జై జై ధ్వనుల గంటల మ్రోగుతాయి. ఇది డ్రామా యొక్క సూక్ష్మ రహస్యం తయారై ఉంది. ఈ ప్రత్యక్షత తర్వాత అనేకాత్మలు పశ్చాత్తాపపడతాయి. పిల్లల యొక్క పశ్చాత్తాపం బాబా చూడలేరు అందువలన పరివర్తన అవుతుంది. ఇప్పుడు బ్రాహ్మణాత్మలైన మీ ఉన్నత స్థితి సదాకాలానికి ఉంటుంది. మీ ఉన్నత స్థితి సేవను ఉన్నతి చేస్తుంది మరియు అనంత విశ్వవేదికపై జై జై అనే పాత్ర వస్తుంది.

### ౬౦౨. శివబాబా బ్రహ్మా ద్వారా ఏవిధమైన అడుగులు వేయించారు?

మొదటి అడుగు – సర్వస్వత్యాగి. కేవలం తనువు, లౌకిక సంబంధాల త్యాగమే కాకుండా అంతకంటే పెద్దత్యాగం చేశారు అదేమిటంటే మనస్సు మరియు బుద్ధిని సంపూర్ణంగా త్యాగం చేశారు. అంటే మనస్సు, బుద్ధిలో ప్రతి సమయం బాబా మరియు శ్రీమతం యొక్క స్మృతిలో ఉండేవారు. సదా స్వయాన్ని నిమిత్తంగా భావించి ప్రతి కర్మలో అతీతంగా అతిప్రియంగా ఉండేవారు. దేహ సంబంధాలతో నాది అనే భావనను త్యాగం చేశారు. మనస్సు, బుద్ధి బాబా ముందు సమర్పితం అయినప్పుడు దేహ సంబంధాలు స్వతహాగానే త్యాగం చేయగలరు. కాబట్టి మొదటి అడుగు సర్వస్వత్యాగి.

రెండవ అడుగు – సదా ఆజ్ఞాకారి. ప్రతి సమయం, ప్రతి విషయంలో అంటే స్వ పురుషార్థంలో అయినా కానీ, యజ్ఞ పాలనలో అయినా కానీ స్వయం కేవలం నిమిత్తంగా ఉండేవారు ఎందుకంటే బ్రహ్మా ఒక్కరే విశేషాత్మ, డ్రామాలో ఈయన పాత్ర విశేషంగా నిర్ణయించబడి ఉంది. ఒకే ఆత్మ తల్లి కూడా, తండ్రి కూడా. యజ్ఞ పాలనకు నిమిత్తమై కూడా సదా ఆజ్ఞాకారిగా ఉండేవారు. స్థాపన అనే విశాలకార్యం చేస్తూ కూడా ఎటువంటి ఆజ్ఞను ఉల్లంఘన చేయలేదు. ప్రతి సమయంలో 'అలాగే' అనే పాఠాన్ని ప్రత్యక్ష స్వరూపంలో చూపించారు.

మూడవ అడుగు – ప్రతి సంకల్పంలో నిశ్చయబుద్ధి. పతివ్రత కలలో కూడా తన పతిని తప్ప ఇంకెవరినీ స్మృతి చేయదు కదా అదేవిధంగా ప్రతి సమయం నాకు ఒక్క శివబాబా తప్ప మరెవ్వరూ లేరు అనే నిశ్చయాన్ని ప్రత్యక్షంగా చూపించారు. కొత్త స్థాపన యొక్క విశాల కార్యం యొక్క భాధ్యతల్లో ఉంటూ కూడా నిమిత్తంగా ఒకే బలం ఒకే నమ్మకంతో ప్రతి పరిస్థితిని సహజంగా దాటారు మరియు దాటించారు.

నాల్గవ అడుగు – విశ్వ సేవాధారి. బ్రహ్మాబాబా సేవ యొక్క విశేషత – ఒకవైపు అతి నిర్మాణంగా విశ్వసేవాధారిగా మరియు రెండవవైపు కొత్తజ్ఞానం అయినా కానీ ధైర్యంగా (అథార్టీ) చెప్పేవారు. ఎంత నిర్మాణంగా ఉండేవారో అంత నిశ్చింతా చక్రవర్తిగా ఉండేవారు. సత్యత యొక్క నిర్భయత, ఇదే సేవలో విశేషత. ఎంత సంబంధీకులైనా కానీ, రాజనేతలు అయినా కానీ, ధర్మనేతలైనా కానీ కొత్తజ్ఞానం కారణంగా వ్యతిరేకం చేసినా కానీ తన సత్యత యొక్క నిర్భయత అనే స్థితి నుండి క్రిందకి వచ్చేవారు కాదు. దీనినే నిర్మాణం మరియు ధైర్యం రెండింటి యొక్క సమానత అని అంటారు. దీని ద్వారా గ్లాని చేసేవారు కూడా మనస్పూర్వకంగా తలవంచేవారు. సేవా సఫలతకి విశేష ఆధారం – నిర్మాణ భావన, నిమిత్త భావన, బేహద్ భావన. ఈ విధి ద్వారానే సిద్ధి స్వరూపులుగా అయ్యారు.

అయిదవ అడుగు – కర్మబంధన్ముక్తిగా కర్మ సంబంధముక్తిగా అంటే శరీరం యొక్క బంధన నుండి ముక్తి ఫరిస్తాగా అంటే కర్మాతీతంగా ఉండేవారు. సెకనులో నష్టోమోహ స్మృతి స్వరూపంగా సమీపంగా మరియు సమానంగా అయిపోవాలి.

## 603. శుభ భావనకి ఏ విధమైన విశేషత ఉంది?

మీరు ఎటువంటి ఆత్మను చూసినా కానీ అంటే వారు ఈరోజుల్లో ఎటువంటి పెద్దవారు అయినా కానీ అనగా ముఖ్యమంత్రి అయినా కానీ, వారిని రాజుగా అనుకోకుండా, వీరిలో సోదర ఆత్మను చూస్తున్నాను, వారు కూడా శివబాబా నుండి ప్రాప్తి తీసుకోవాలి అనే శుభభావన మీకు ఎప్పుడైతే ఉత్పన్నమౌతుందో వారు కూడా శక్తిశాలీగా తయారవుతారు. మీ యొక్క శుభభావన, వారిలో బలాన్ని నింపుతుంది. వాయుమండలం కూడా పావనం అయిపోతుంది.

### 604. ఉత్సాహం మనకు ఏవిధమైన లాభాన్ని సమకూర్చుతుంది?

శరీర శక్తి, ధనశక్తి లేకపోయినా, ఉత్సాహంతో ఇతరులకు శివబాబా జ్ఞానాన్ని వినిపించండి. వారు మీకు సహయోగులైపోతారు. ధనాన్ని కూడా భగవంతుని సేవకు అర్పితం చేస్తారు. ఉత్సాహం ఉంటే ఎటువంటి బలహీన ఆత్మ యొక్క ప్రభావం పడదు. మీయొక్క ప్రభావం వారిపై పడుతుంది. ఇలా సంస్కారాలను ఉత్సాహంతో కలుపుకోండి. అప్పుడు సమయం సమీపంగా వస్తుంది.

### 605. శివబాబా ప్రేరణ (టచింగ్) ఎప్పుడు లభిస్తుంది?

సత్యమైన మనస్సుకి యజమానియైన శివ పరమాత్మ రాజీ అవుతారు. రాజీ అయిన కారణంగా, ఆ సమయంలో డ్రామా ప్లాన్ అనుసారంగా టచ్చింగ్ వస్తుంది. ఆ టచ్చింగ్ అసత్యం నుండి సత్యంలోకి తీసుకు వెళుతుంది.

### 606. ఏ ఆత్మ యొక్క ఏ విషయమైనా మీకు నచ్చకపోతే వారి మధ్యలో నడవడానికి ఏ విధిని పాటించాలి?

ఆ ఆత్మని స్వయం శివబాబాయే ఏదొక విశేషత కారణంగా విశ్వసేవ కొరకు ఎన్నుకున్నారనే భావన ఉంటే అందరినీ మనం సమాన దృష్టితో చూడగలుగుతాము. వారిలో 99 అవగుణాలున్నా, ఒక మంచిగుణం ఉంటే చాలు, బాబా ఎన్నుకుంటారు. అన్నింటికంటే ఉన్నతోన్నతమైన విశేషత లేదా గుణం వారిలో ఉన్నది – "బాబాను గ్రహించే బుద్ధి, బాబా వారిగా అయ్యే ధైర్యం, బాబాపై ప్రేమ ఉంచుకునే విధి, ఈ మొత్తం కల్పంలో ధర్మపితలలో గాని, రాజ్యనేతలలోగాని, అపారమైన స్థూలధనం కలవారిలో లేదు. కానీ ఆ ఆత్మలో ఉంది.

### 607. బుద్ధిని ఏ విషయం ఏకాగ్రంగా ఉండనివ్వదు?

ఎప్పుడూ కూడా, ఏ విషయంలోనైనా, ఏ స్థానంలోనైనా, ఏ సేవతోనైనా, ఏ సేవాసహయోగితోనైనా వేరుగా ఉండి నా స్థితిని మంచిగా చేసుకుని చూపిస్తాను.... అనే సంకల్పాలు రాకూడదు. మేము వీరితో నడవలేకపోతున్నాం, వారితో నడవగలం, ఈ స్థానంలో సేవాఉన్నతి లేదు, ఆ స్థానంలో ఉంది. ఈ సేవలో విఘ్నాలు ఉన్నాయి ఆ సేవ బాగుంది ఇవన్నీ వేరుగా అయిపోవాలనే భావన కలిగిన మాటలు. ఒకసారి ఈ అలవాటు మీలో వస్తే ఈ అలవాటు ఎక్కడా నిలబడనివ్వదు. బుద్ధిని ఏకాగ్రం చేయనివ్వదు ఎందుకంటే బుద్ధికి మారిపోయే అలవాటు అయిపోయింది ఇది కూడా బలహీనతలోకి వచ్చేస్తుంది.

## 608. వస్త్రాలు ధరించడం గురించి శివబాబా ఏవిధంగా తెలియజేసారు?

ఆఫీసుకి వెళ్తున్నప్పుడు, వేరే స్థానాలకు వెళ్ళినప్పుడు వాటికి సంబంధించిన బట్టలు వేసుకుంటే దానికి శివబాబా ఏమీ అనరు కానీ ఇది విదేశి సంస్కృతి, ఇది నా వ్యక్తిత్వం అని భావించి వేసుకోవద్దు. సేవాభావంగా వేసుకోండి కానీ వ్యక్తిత్వం యొక్క లక్ష్యంతో వేసుకోవద్దు. బ్రాహ్మణ జీవితం యొక్క లక్ష్యం పెట్టుకోండి. సేవార్థం అవసరాన్ని బట్టి వేసుకోండి. దానికి బాబా ఏమీ అనరు కానీ అది కూడా నిమిత్తమైనవారితో పరిశీలన చేయించుకోండి. బాబా అయితే అవకాశం ఇచ్చారు మీరెందుకు ఆపుతున్నారు అని అనకండి.

## 609. బుద్ధితో సమర్పణ అనగా ఏమిటి?

నేను చేసాను సేవ అని రాకూడదు. సేవ చేయండి. ఫలాన్ని, ఫలితాన్ని, బాబాకు అర్పణ చేయండి. సేవ నేను చేశాను అనుకుంటే బుద్ధి బరువై పోతుంది. తనువు, మనస్సుతో సేవ చేయండి కానీ మనస్సు, బుద్ధిని భగవంతునికే అర్పించండి.

## 610. శివబాబా మనందరికీ ప్రతికార్యంలో ఏవిధిని తప్పక ఉపయోగించాలని తెలియజేసారు?

ఏ కార్యక్రమం చేసినా తక్కువ ఖర్చు ఎక్కువ ఫలితం ఉండాలి. శివబాబా ప్రతి కార్యానికి ఆది నుండి ఇప్పటి వరకు ఇదే విధి చెప్పారు. చాలా పెద్దదిగా కాదు, చాలా సాధారణంగా కాదు. మధ్యరకంగా ఉండాలి. ఎందుకంటే రెండు రకాల ఆత్మలు ఉంటారు. ఒకవేళ చాలా గొప్పగా చేస్తే బయటవారు అనుకుంటారు వీరి దగ్గర చాలా డబ్బులున్నాయని, చాలా సాధారణంగా చేస్తే విలువ ఉండదు కాబట్టి సదా మధ్యస్థంగా ఉండాలి. పుస్తకాలు కూడా ఇప్పటి వరకు ఏవైతే తయారుచేశారో అవి బావున్నాయి. సంపన్నం చేయాలి కానీ ఎక్కువ విస్తారం చేయకూడదు. చాలా ఎక్కువగా తయారుచేయకూడదు. చిన్నదిగా ఉండాలి మధురంగా ఉండాలి. సారం కూడా ఉండాలి. విస్తారంలో ఉంటే బుద్ధికి ఎక్కువ పని అయిపోతుంది. కనుక సమయం మరియు బుద్ధిలో కూడా తక్కువ ఖర్చు ఎక్కువ ఫలితం ఉండాలి.

## 611. పుస్తకాలు తయారు చేయడంలో శివబాబా మనకు ఏ విషయం తెలియజేసారు?

భగవంతుని గురించి తెలియజేసే పుస్తకాలు తయారుచేయటంలో సారం ఉండాలి, విస్తారం ఉండకూడదు. విస్తారం ఉంటే బుద్ధికి భారం అయిపోతుంది. పుస్తకం మొదలు పెట్టిన దగ్గర నుండి పూర్తయ్యేవరకు ఎవరెవరు ఏయే విషయాలలో సహయోగులయ్యారో వారందరికీ భాగ్యంలో వాటా లభిస్తుంది. ఇది ఒక కర్మలగుహ్యగతి.

**612. జ్ఞానీ ఆత్మ వేటిని ఆధారంగా తీసుకోరు?**

జ్ఞానీ ఆత్మ విజ్ఞాన సాధనాలను ఆధారంగా తీసుకోరు. మరియు తమ సాధన ద్వారా బాబాను ప్రత్యక్షం చేయాలి.

**613. సాధనాలకు, సాధనకు గల తేడా తెలుపండి?**

సాధనాలు వినాశి. వాటిని ఆధారంగా తీసుకుంటే ఫలం కూడా ఎలావుంటుందంటే, ఒకసారి సంతోషంగా, మరోకసారి సంతోషం తక్కువ అయిపోతుంది. సాధన అంటే శక్తిశాలీ స్మృతి. నిరంతరం బాబాతో మనస్సు యొక్క సంబంధం ఉంచుకోవటం. కేవలం యోగంలో కూర్చున్నప్పుడే బాబాను జ్ఞాపకం చేయటం కాదు, సాధన అనగా మనస్సు బుద్ధిని ఒకే భగవంతునిపై ఏకాగ్రం చేయటం.

**614. ఏరకమైన 4 సేవలు చేయాలి?**

స్వసేవ, విశ్వసేవ, మనసా సేవ, యజ్ఞ సేవ. స్వ అంటే ఆత్మ, శ్రీమతం ఆధారంగా పురుషార్థం చేసి ఆత్మ ఉన్నతిని చేసుకోవటాన్నే స్వసేవ అంటారు. విశ్వసేవ అంటే పుస్తకం ద్వారా కానీ, సి.డి ద్వారా కానీ, టి.వి ఛానల్ ద్వారా కానీ విశ్వంలో వున్న ప్రతీ ఒక్క ఆత్మకు శివబాబా పరిచయం ఇవ్వాలి. మనసా సేవ అంటే – మనస్సుని ఏకాగ్రతతో భగవంతునిపై లగ్నం చేసి, శక్తిని పొంది ఆ తరంగాలను వాయుమండలంలోకి పంపి దూరంగా విశ్వంలో ఎక్కడోవున్న ఆత్మలకి భగవంతుని సందేశం ఇవ్వటం. యజ్ఞసేవ అంటే – ఎక్కడవున్నా, ఏస్థానంలో ఉన్నా అదే యజ్ఞకుండం. కేవలం మధువనం లేక మీ స్థానం ఒక్కటే యజ్ఞభూమి కాదు. యజ్ఞసేవ అంటే ఆ స్థానంలో ఉంటూ ఏదొక కర్మ ద్వారా ఏదొక సేవ తప్పక చేయాలి. కొంతమంది యజ్ఞంలో తనువుని ఉపయోగిస్తున్నారు. కానీ, వారి దగ్గర ధనం లేదని భావించి యజ్ఞంలో ధనసహాయం చేయలేకపోతున్నామని చింతిస్తున్నారు. కానీ తనువు ద్వారా సమర్పితమైన ఆత్మ యజ్ఞాన్ని చాలా ధ్యాసతో మనస్సుతో (పైపై చూపించటానికి కాదు) పొదుపు చేస్తే అలా పొదుపు చేసిన ప్రతీ ఒక్కటి మీ పేరు మీద ధనం సమర్పించినట్లు జమైపోతుంది. ఇది సూక్ష్మ లెక్కల ఖాతా. ఒకవేళ ఎవరైనా వ్యర్థం చేస్తే పాపం కూడా జమ అవుతుంది. రెండవ విషయం ఒకవేళ సమర్ధ ఆత్మ ఎవరైనా సేవకోసం ధనం ఇస్తే, ఆ ధనాన్ని పొదుపుగా వాడితే ఆ పొదుపుతనం పొదుపు చేసిన వారి ఖాతాలో జమ అయిపోతుంది. ఎందుకంటే ప్రతీ ఒక్క సేవకు 100 మార్కులు ఉంటాయి.

**615. స్వపరివర్తనా ప్రగతి భట్టీ అనగా ఏమి?**

స్వ అంటే ఆత్మ. ఆత్మ పరివర్తన కోసం భట్టీ పెట్టుకుంటే పరంధామం నుండి శివబాబా వారిని, వారి స్థానాన్ని ప్రతీ సెకను చూస్తూ ఉంటారు. ఎందుకంటే లక్ష్యం ఉంటే లక్షణాలు తప్పకుండా వస్తాయి. దీనినే స్వపరివర్తనా ప్రగతి భట్టీ అంటారు.

**616. అజ్ఞాని ఆత్మల గురించి శివబాబా ఏవిధంగా తెలియజేసారు?**

అజ్ఞానీ ఆత్మలపట్ల కూడా జ్ఞానయుక్తమైన దయ కలిగి ఉండాలి. ఈ దయతో ఆ ఆత్మలకు బేహద్ వైరాగ్యవృత్తి స్వతహాగా వస్తుంది. అజ్ఞానీ ఆత్మలు బాబాను తెలుసుకోలేని కారణంగా ధర్మపితలను లేదా గురువులను లేదా వారి ఇష్టదేవతలను దయాసాగరులుగా భావించి వారిని ఆశ్రయించుచున్నారు. మీకు తెలుసు దయ బాబా ద్వారా తప్ప, ఇంకెవ్వరి ద్వారా లభించదని. కానీ బాబా వారి కోరిక పూర్తి చేయడానికి ఏదొక ఇష్టదేవతను కానీ, మహాన్ ఆత్మను కానీ నిమిత్తం చేసి వారి ద్వారా దయ ఇస్తారు. ఇచ్చే దాత ఒక్కరే! ఈ విషయం బాగా గుర్తుంచుకోవాలి.

**617. జ్ఞానయుక్తమైన దయ అని దేనినంటారు?**

జ్ఞానయుక్తమైన దయలో ఏ ఆత్మపట్ల ఈర్ష్య, అసూయ మనస్సులో ఉత్పన్నం కాదు. జ్ఞానయుక్తమైన దయతో పాటు మనలో ఆత్మీయత కూడా అవసరం. జ్ఞానయుక్తమైన దయ లేకుండా సాధారణమైన దయ ఉంటే, ఆ ఆత్మ పట్ల తగుల్పాటు రూపంలో గానీ, బలహీనత రూపంలో గానీ ప్రభావితం అయిపోతారు. దయ అనగా ఎవ్వరికీ ప్రభావితం కాకూడదు. అసూయ కూడా ఉంచుకోకూడదు. జ్ఞానయుక్తమైన దయలో కర్మలఖాతా తయారుకాదు మరియు వెనుకటి జన్మల కర్మలఖాతాలను ఇరువురిలోను భస్మం చేస్తుంది. సామాన్య దయ అనగా స్వార్థంతో కూడుకున్న దయ మరియు ఇరువురికి పాపఖాతాను తయారుచేస్తుంది. మీరు మీ తనువు, మనస్సు, బుద్ధి భగవంతునికి అర్పితం చేసిన కారణంగా, భగవంతుని గుణాలు మీలో రావాలి. దయాగుణం అనేది భగవంతుని దివ్యగుణాలలో ఒక గుణం.

**618. వైరాగ్యం అని దేనినంటారు?**

బాబాకు ఏవైతే ఇష్టముండదో వాటిపై మనకు వైరాగ్యం రావాలి. ఉదాహరణకు – బాబాకు ఇతరులను అడిగే గుణం నచ్చదు. శివబాబా దాత కనుక ఎవరి నుండి తీసుకునే గుణం ఉండదు దాత పిల్లలమైన మనల్ని కూడా ఆవిధంగా ఉండమని చెప్తారు కానీ ఆ దాత గుణం వచ్చిందో లేదో పరిశీలించుకోవాలి.

**619. మనస్సు యొక్క ప్రేమ అని దేనిని అంటారు?**

భగవంతుడికి ఏదైతే మంచిగా అనిపించదో దానిని మనం ఆలోచించకూడదు. దాని గురించి మాట్లడకూడదు, కర్మ చేయకూడదు. దీనినే మనస్సు యొక్క ప్రేమ లేక స్నేహం అంటారు.

**620. తపస్సు యొక్క విశేషతలను తెలుపుము?**

తపస్సులో అనంతమైన వైరాగ్యం వస్తుంది. సర్వప్రాప్తులకు, ఖజానాలకు అధికారీ అవుతారు. వ్యర్థం నుండి రక్షించబడతారు. ఏ శక్తి కావాలంటే ఆ శక్తి మీ ముందు హాజరవుతుంది.

**621. ఏ వైరాగ్యంలో ఫలం రాదు?**

గత్యంతరం లేక చేయడమనేది వైరాగ్యం కాదు, దానితో ఫలం రాదు.

**622. క్షమించడం మరియు శిక్షణ ఇవ్వడం అంటే ఏమిటి?**

మంచివారితో మంచిగా నడవటం అందరికీ తెలుసు, కానీ, చెడ్డవారిని మంచిగా చేయటం అనేది విశేషం. శిక్షణ అనేది శుభ భావనతో ఇవ్వండి. మీ శుభభావన వారిలో శుభభావనను తీసుకువస్తుంది. క్రోధంతో శిక్షణ యిస్తే, వారిలో క్రోధం ఉత్పన్నం అయ్యి వారు జ్ఞానం నుండి తొలగిపోతారు.

**623. సేవలో కర్మలఖాతా విషయం గురించి శివబాబా ఏవిధంగా తెలియజేసారు?**

సత్యమైన మనస్సుతో సేవ చేస్తే కర్మలఖాతా పూర్తవుతుంది. ఖాతా నిమిత్తంగా ఉంది, సేవ రహస్యంగా ఉంది. ఈ ఒక్క యుగంలోనే విశ్వసేవ ఉంటుంది మరి ఏ యుగంలోనూ ఉండదు.

**624. శివబాబా ప్రేమ ఏవిధంగా ఉంటుంది?**

శివబాబా ప్రేమ ముందు ఏ పరిస్థితి నిలువలేదు.

**625. అంతిమంలో విదేశం నుండి మధువనం రావడానికి విమానాలు ఆగిపోతే ఏవిధమైన అద్భుతం జరుగుతుంది?**

అంతిమంలో ఇందనాలు లభించక, పరిస్థితులు అనుకూలించక విదేశాల నుండి మధువనం రావాలంటే విమానాలు ఆగిపోతాయి. కొంతమంది బాబా పిల్లలు ముందుగానే మధువనం చేరి ఉండిపోదాం అనుకుంటారు. అలా వచ్చినా కానీ మనస్సు యొక్క ప్రేమ లేకపోతే మా దేశం వెళ్ళాలనే సంకల్పం వచ్చి అక్కడికి వెళ్ళిపోయి చిక్కుకుపోతారు. తిరిగి ఇక్కడికి రాలేరు. ఎందుకంటే మీకు మనస్సులో సూక్ష్మంగా తగుల్పాటు ఉంది. కానీ మీరు మీ దేశంలో ఉన్నా, అంతిమ మహావినాశనం సమయంలో వరుసగా విమానాలు ఉంటాయి, వారు మీ నయనాలలో ఒక అద్భుతాన్ని గమనించి, విమానాల ద్వారా మధువనం తీసుకువస్తారు. ఈ అద్భుతం చేసే బాబా పిల్లలు ఎవరంటే ఏ దేశంలో, ఏ స్థానంలో ఉన్నా కానీ మనస్సు యొక్క స్నేహం ఉన్నవారు మాత్రమే రాగలరు.

**626. అంతిమంలో మధువనం ఏవిధంగా పరివర్తన అవుతుంది?**

మొత్తం విదేశాలన్నింటికీ తొందర తొందరగా బాబా సందేశాన్నిచ్చే కార్యాన్ని పూర్తి చేయండి, తరువాత వారు ఇక్కడికి వస్తే తిరిగి వెళ్ళరు. అందరికోసం పీస్ పార్క్ ముందుగానే తయారై ఉంది కదా!అటువంటి సమయంలో గదులు, మంచాలు ఏమీ ఉండవు. కొండలపై పడుకోవలసి

వస్తుంది. అటువంటి రోజు కూడా రానున్నది. ఆరోజు ఎప్పుడు వస్తుందంటే, అందరూ కలసి అందరి మనస్సు శక్తిశాలీగా, జ్ఞానస్వరూపంగా, ప్రేమ స్వరూపంగా ఎప్పుడవుతారో అప్పుడు ఆ సమయం ప్రత్యక్షం అవుతుంది. ఒక వాణీలో శివబాబా ఆబూ పర్వతం నుండి ముంబయి వరకు క్యూ ఉంటుందని చెప్పారు. ఆబూ నుండి ముంబయి 800 కి.మి. దూరం. ఇక్కడ గమనించవలసిన ముఖ్య విషయం ఏమిటంటే ద్వాపరయుగం నుండి కలియుగం చివరివరకు వచ్చే భక్తులు, సామాన్య మానవులు బాబాని కలుసుకోవడానికి ఆ స్థానానికి వచ్చి, విశ్వ సమ్మేళనం అనే వేదికపై వున్న శ్రేష్ఠ దేవతల యొక్క వృత్తి, దృష్టి ద్వారా భగవంతుని జ్యోతి స్వరూపం అందరికీ ఒక సెకను సాక్షాత్కారం అవుతుంది. ఆ ఒక్క సెకను వారి జన్మజన్మలకు సత్వ ప్రధాన ప్రాప్తిని తయారుచేస్తుంది. అప్పుడు ఈ అనంతమైన డ్రామాకు అంతిమ తెర పడిపోతుంది. అందుకే ఇక్కడ బాబా ఒక విషయం నొక్కి చెప్పారు. వచ్చినవారు తిరిగి వెళ్ళరని. ఆ దృశ్యం తరువాత తిరిగి వెళ్ళే సదుపాయాలు ఉండకపోవచ్చు. శివుని ఆలయాలలో ప్రసిద్ధమైన "కాశీ" కి వెళ్ళినవారు, అక్కడ మరణించడం చాలా విశేషమైనదిగా భావిస్తారు కదా. ఈ స్మృతి చిహ్నమే అక్కడ భక్తి మార్గంలో కీర్తించబడుతుంది.

### 627. ఏ ప్రసాదాన్ని మనం అందరికీ పంచాలి?

ప్రభు ప్రసాదాన్ని అనగా భగవంతుడు యిచ్చిన విశేష శక్తులను మనవద్ద ఉంచుకుని ఇతరులకు పంచిపెట్టకుండా ఉండకూడదు. బాబా! బాబా! అనే మాటను ఎప్పుడూ మరచిపోకండి. శివబాబా శక్తి ఇచ్చారు, బుద్ధి ఇచ్చారు, బాబా కార్యం, బాబా సెంటర్, అన్ని వస్తువులు బాబావే! అని భావించాలి.

### 628. మధువనంలో మొదట శివబాబా ఎక్కడ కలుసుకునేవారు?

మొట్ట మొదట హిస్టరీ హాలులో, తరువాత మెడిటేషన్ హాలులో, ఆ తరువాత ఓంశాంతి భవనంలో ఇప్పుడు డైమండ్ హాల్‌లో మరియు అంతిమంలో పీస్ పార్క్‌లో కలుసుకుంటారు.

### 629. దానం కంటే పుణ్యం గొప్పది ఎలా?

దానం అనగా మనకు పుష్కలంగా వున్నది ఇతరులకు దానం చేస్తాం. ఇది బయటకు కనిపిస్తుంది. మనకు ఎక్కువగా వున్న కారణంగా వారికి దానం చేశాము, ఇది మంచి విషయమే! దానం కంటే పుణ్యం ఏవిధంగా గొప్ప స్థానాన్ని పొందిందంటే, ఎవరైతే ఇతరులకు అవసర సమయంలో తన దగ్గర ఉన్నదంతా అర్పణ చేస్తారో అది పుణ్య కార్యం అవుతుంది. పుణ్యకార్యం మనస్సుతో జరుగుతుంది. ఇతర ఆత్మకు సహయోగం అంటే వారిని భగవంతుని సంబంధంలోనికి తీసుకురావటం. పుణ్యకర్మ చేసే ఆత్మలకు అనేక ఆత్మల మనస్సు నుండి ఆశీర్వాదాలు వస్తాయి.

ఈవిధంగా దానం కంటే పుణ్యం గొప్ప స్థానాన్ని పొందింది. ఉదాహరణకు, భగవంతుడైన శివ పరమాత్మ ఇప్పుడు అందరికీ స్వర్గ ప్రాప్తి యివ్వాలని, భూమిపై అవతరించారు. కానీ ఆయనకు ఈ అవసర సమయంలో మన తనువు, మనస్సు, ధనం ద్వారా సహయోగి అయితే మహాపుణ్యం తయారవుతుంది. అంతిమంలో అందరూ పరిస్థితుల ఆధారంగా భగవంతుని దగ్గరకు వస్తారు. ఆ సమయంలో మన తనువు, మనస్సు, ధనం భగవంతునికి, విశ్వానికి అవసరం ఉండదు. ఈ అవసర సమయంలోనే భగవంతునికైనా, ప్రపంచంలో ఎవరికైనా ఉపయోగ పడటమే మహాపుణ్యం. మనకు ఖజానాలు ఎక్కువ అయిపోయి, స్వార్థం కోసం, పేరు, గౌరవం కోసం, ఇతరులకు దానం చేస్తే పుణ్యం జమ అవ్వదు.

## 630. పుణ్యం సంపాదించుకోవటంలో ఏది విఘ్నరూపమవుతుంది?

ఎవరైనా మనల్ని నిందించినప్పుడు మన మనస్సు భాదపడకూడదు. భాదపడితే వారికి పాపఖాతా తయారవుతుంది. అది ఆటగా భావిస్తే ఇరువురికి పుణ్యఖాతా తయారవుతుంది. బాబా యొక్క శ్రీమతం దు:ఖం తీసుకోకండి అని కనుక దు:ఖం తీసుకోకండి, దు:ఖం ఇవ్వకండి అప్పుడే పుణ్యాత్మ అవుతారు, తపస్వి అవుతారు. తపస్సు అనగా పరివర్తన. కనుక ఇతరులు దు:ఖం ఇచ్చినా కానీ దానిని సుఖస్వరూపంలోకి పరివర్తన చేసుకోండి. నిందను ప్రశంసగా భావించండి, అప్పుడే పుణ్యాత్మ అని అంటారు. జగదాంబ సదా ఇదే పాఠాన్ని పక్కా చేయించేవారు – నిందించేవారిని లేదా దు:ఖం ఇచ్చే ఆత్మను కూడా మీరు దయాదృష్టితో చూడండి. నిందించారు అనే దృష్టితో చూడకండి. వారు నిందించినా మీరు పుష్పాలు జల్లండి. పుణ్యఖాతా జమ చేసుకోవటంలో ఇదే విఘ్న రూపంగా అవుతుంది.

## 631. యోగం యొక్క ప్రయోగం అని దేనినంటారు?

మనం భగవంతుడిని జ్ఞాపకం చేస్తూ కూర్చున్నప్పుడు మనలో దైవశక్తి నిండుతుంది. ప్రపంచంలో భిన్నభిన్న పరిస్థితుల వలన అశాంతిలో ఉన్నవారికి ఆ శాంతికిరణాలను పంపించడమే యోగ ప్రయోగం. ప్రయోగం చేసినప్పుడే శక్తులు పెరుగుతాయి. ప్రయత్నించి చూడండి. రావటం లేదని, అనుభవం అవ్వలేదని మానివేయకండి. ప్రయత్నం చేయగా చేయగా అనుభవం అవుతుంది. ఉదాహరణకు – సైకిల్ నేర్చుకునేటప్పుడు ఒకోసారి పడిపోతూ ఉంటాము. అలాగని ప్రయత్నం చేయకపోతే విజయం పొందలేము. అదేవిధంగా, యోగం యొక్క ప్రయోగం చేయాలి. ఈ ప్రయోగానికి ఉదయం, 3.00 – 5.00 గం॥, సా: 7.00 నుండి 7.30 గం॥ అనువైన సమయం.

**632. తపస్సు ఏవిధమైన సఫలతనిస్తుంది?**

తపస్సు సర్వ అవసరాలను సమయానికి సహజంగా పూర్తి చేస్తుంది.

**633. సంపూర్ణ పవిత్రత అని దేనినంటారు?**

పవిత్రత అనగా కేవలం బ్రహ్మచర్య వ్రతమే కాదు, సంపూర్ణ పవిత్రత అంటే సంకల్పంలో కూడా ఏ వికారం రాకూడదు. ఏవిధంగానైతే బయటవారి జీవితంలో శరీర ఆకర్షణ అపవిత్రతయో, ఇక్కడ జ్ఞానంలో ఉండే వారికి సంకల్పంలో కూడా వికల్పం అనగా ఏవిధమైన వికారం వచ్చినా సంపూర్ణ పవిత్రంగా అవ్వలేము.

**634. స్థూలసాధనాలతో నిండుతనానికి, మనస్సు యొక్క నిండుతనానికి ఉన్న తేడా తెలుపండి?**

1. బయటకి నిండుతనం అంటే స్థూల వస్తువులతో, సాధనాలతో నిండుగా ఉండటం 2. మనస్సు యొక్క నిండుతనం. ఎవరైతే మనస్సుతో నిండుగా ఉంటారో వారి దగ్గర స్థూల వస్తువులు లేదా సాధనాలు ఉండకపోయినప్పటికీ మనస్సు నిండుగా ఉన్న కారణంగా ఎప్పుడూ లోటుగా అనిపించదు. లేనప్పటికీ కూడా ఉన్నట్లుగా అనుభవం చేసుకుంటారు. ఎవరి మనస్సు నిండుగా ఉండదో ఆ ఆత్మ బయటకి వస్తువులు సాధనాలతో ఎంత నిండుగా ఉన్నప్పటికీ వారు ఎప్పుడూ కూడా తమని తాము నిండుగా భావించరు. ఆవిధమైన ఆత్మ సదా కోరిక కారణంగా కావాలి, కావాలి అనే పాట పాడుతూ ఉంటుంది. ప్రతీ విషయంలో ఇది ఉండాలి, ఇది చేయాలి, ఇది లభించాలి. ప్రతి సమయం ఇదే పాట పాడుతూంటారు. మరియు మనస్సు ద్వారా నిండుగా ఉన్న ఆత్మ అన్నీ పొందాను, అన్నీ లభించాయి అనే పాట పాడుతూ ఉంటుంది. ఇది ఉండాలి, ఇది చేయాలి, ఇది కావాలి ఇది కూడా సూక్ష్మంగా అడుక్కునే సంస్కారం. బేహద్ సేవ కోసం ఇది ఉండాలి, ఇది చేయాలి అనుకోవటం వేరే విషయం కానీ స్వయం యొక్క హద్దు ప్రాప్తుల కోసం కావాలి అనటం, సూక్ష్మంగా అడుక్కోవటం. పేరు కావాలి, గౌరవం కావాలి, ప్రేమ కావాలి ... ఇవన్నీ హద్దు విషయాలు. ఠీవి గల ఆత్మలో అడిగే సంస్కారం అంశమాత్రంగా కూడా ఉండదు.

**635. సత్యత ఏవిధంగా రుజువవుతుంది?**

రాయల్ ఆత్మ యొక్క ముఖం మరియు నడవడిక రెండూ సత్యత యొక్క సభ్యతను అనుభవం చేయిస్తాయి. అలాగే రాయల్ ఆత్మలను సభ్యతాదేవి అంటారు. వారు మాట్లాడటం, చూడటం, నడవటం, తినటం, త్రాగటం, లేవటం, కూర్చోవటం, ప్రతి కర్మలో సభ్యత, సత్యత స్వతహాగా కనిపిస్తాయి. నేను సత్యతను రుజువు చేస్తున్నాను కనుక సభ్యత ఉండదు అనరు. కొంతమంది పిల్లలు అంటున్నారు – మామూలుగా అయితే కోపం రావటంలేదు కానీ ఎవరైనా అసత్యం

మాట్లాడితే కోపం వచ్చేస్తుంది అని. వారు అబద్ధం చెప్పారు, మీరు కోపంతో మాట్లాడారు; ఇద్దరిలో ఎవరు సత్యం? సత్యతను రుజువు చేసేవారు సదా సభ్యత కలిగి ఉంటారు. కొంతమంది చాలా చతురంగా – మేము కోప్పడంలేదు కానీ మా మాటే పెద్దది, మా మాటే అలా ఉంటుంది అంటున్నారు. విజ్ఞాన సాధనాల ద్వారా ధ్వనిని తక్కువగా మరియు ఎక్కువగా చేయగలరు కదా మరి శాంతిశక్తి ద్వారా మీ మాట యొక్క వేగాన్ని తక్కువ ఎక్కువలు చేసుకోలేరా? మీ కంటే ఈ టేప్‌రికార్డర్ లేదా మైక్ మంచివి, ధ్వనిని చిన్నదిగా లేదా పెద్దదిగా చేసుకోవచ్చు. కనుక పరిశీలన చేసుకోండి – సత్యతతో పాటు సభ్యత కూడా ఉందా? అని. ఒకవేళ సభ్యత లేకపోతే అది సత్యత కాదు. పవిత్రత యొక్క ఉన్నతస్థితి సదా ప్రత్యక్షరూపంలో కనిపించాలి. లోపల హోదా ఉంది కానీ బయటికి కనిపించదు అనడానికి లేదు ఎందుకంటే లోపల ఉంటే అది తప్పక బయటికి కనిపిస్తుంది. సత్యత యొక్క హోదాను ఎవరు దాయలేరు, దీనిలో గుప్తంగా ఉండకూడదు. కొంతమంది గుప్తపురుషార్థులం అందువలన గుప్తంగా ఉంటున్నాము అంటున్నారు కానీ సూర్యుడిని ఎవరూ ఎలాగైతే దాయలేరో అదేవిధంగా సత్యత యొక్క సూర్యుడిని కూడా ఎవరూ దాయలేరు. ఏ కారణం లేదా ఏ వ్యక్తి కానీ దాచలేరు. సత్యం సదా సత్యమే. సత్యతాశక్తి అన్నింటికంటే గొప్పది. సత్యం రుజువు చేయటం ద్వారా రుజువు అవ్వదు. సత్యతాశక్తి స్వతహాగానే రుజువు అయ్యే శక్తి కలిగి ఉంటుంది. సత్యతను ఒకవేళ ఎవరైనా రుజువు చేయాలనుకుంటే అది మొండితనం అయిపోతుంది. అందువలన సత్యత స్వయమే రుజువవుతుంది, రుజువు చేయవలసిన అవసరం లేదు. అర్థమైందా! తపస్యా సంవత్సరంలో ఏమి చూపించాలి? పవిత్రత యొక్క వ్యక్తిత్వం మరియు హోదా.

### 636. సంగమయుగం యొక్క ఒక సెకండ్ ఎంత ఫలానిస్తుంది?

సంగమయుగం యొక్క ఒక సెకండ్ ఒక సంవత్సర ఫలాన్నిస్తుంది.

### 637. నిజాయితీ ఆత్మల గుర్తులు తెలుపండి?

భగవంతుని ద్వారా లభించిన ఏ ఖజానాని వ్యర్థం చేయరు. నిజాయితీ ఆత్మ సంగమయుగం యొక్క ఒక్క సెకను కూడా వ్యర్థం చేయదు.

### 638. శక్తిశాలి స్మృతి ఏ రెండు రకాల యొక్క అనుభవాల్ని చేయిస్తుంది?

1. పాత పాపాన్ని వేగవంతంగా భస్మం చేస్తుంది, 2. మనస్సులో సంతోషాన్ని, తేలికదనాన్ని అనుభవం చేయిస్తుంది.

**639. ఏ విషయాన్ని చాలాకాలం యొక్క సంస్కారంగా తెలుసుకోవాలి?**

ఏమి వచ్చినా పెద్ద పర్వతంలాంటి పరిస్థితులు వచ్చినా, మన మంచి సంస్కారాన్ని, చెడు సంస్కారంగా మార్చే పరిస్థితి వచ్చినా, ప్రకృతి పరీక్ష తీసుకున్నా, జరిగిపోయిన వాటిలో ఏదైనా అలజడి వర్తమానంలో వచ్చినా బుద్ధిని అచంచలంగా ఒక్క బాబా స్మృతిలోనే ఉంచండి. ఇప్పటి నుండి ఈ అభ్యాసం చాలా చాలా అవసరం.

**640. బయటి ప్రపంచంవారు ఏ విషయంలో నిండుగా ఉన్నారు? ఏ విషయం పొందడంలో లోపంగా ఉన్నారు?**

బయటి ప్రపంచంవారు కొందరు కోట్లాది రూపాయలు సంపాదించడంలో నిమగ్నమై ఉన్నారు. అసత్య రాజ్యం పరిపాలించడానికి అధికార దాహంతో ఉన్నారు. వైజ్ఞానికులు కూడా ప్రకృతిపై ప్రయోగం చేసి సృష్టి రహస్యాలు తెలుసుకోవాలనే పరిశోధనలో ఉన్నారు. కానీ, పరమాత్మ శివుని యొక్క ప్రేమని, పాలనని, చదువుని, స్వర్గ ప్రాప్తి అనే వరదానాలను పొందక ఈ విషయంలో బికారీగా ఉన్నారు.

**641. శివబాబా నుండి సహాయం అనుభవం చేసుకునే వారికి ఏమి సంకల్పం ఉంటుంది?**

వారిలో ధైర్యం ఉంటుంది. క్రొత్తేమీ కాదు కల్పపూర్వం విజయం నిర్ణయించబడింది. మరలా ఇప్పుడు లభిస్తుంది, ఇది అవినాశి, అనంతమైన డ్రామా భగవంతునిచే రచించబడినది మరియు నిర్ణయించబడినది. నేను కేవలం నిమిత్తం, చేసి చేయించే శివబాబా చేయిస్తున్నారు అనే సంకల్పం ఉంటుంది.

**642. సంపూర్ణ విజయీలు అని ఎవరిని అంటారు?**

పూర్తి విజయం పాండవులే తప్ప ఇంకెవ్వరూ పొందలేరు. పాండవులకు ఎందుకు విజయం లభించిందంటే భగవంతుడిని తమ జీవిత తోడుగా చేసుకుని అనంత వైరాగ్యవృత్తిలో ఉన్నారు. కౌరవులలో ఎక్కువ జనసంఖ్య ఉన్నా కానీ విజయం పాండవులనే వరించింది. ఇక్కడ సంఖ్య యొక్క బలం కాదు, భగవంతుని యొక్క బలం ముఖ్యం.

**643. అల్పకాలిక ఓటమిలో ఏ విషయం దాగిఉంది?**

అల్పకాలిక ఓటమిలో సదాకాలిక విజయం దాగివుంది. అనగా జ్ఞానీ యోగి ఆత్మలకు ప్రపంచం దృష్టిలో జీవితం యొక్క రసానుభూతి లేదని ఆనందం కోల్పోయారు అని అనుకుంటారు. వాస్తవానికి అతీంద్రియ సుఖం ముందు అనగా ఆత్మలోవున్న సూక్ష్మశక్తియైన మనస్సు యొక్క ఆనందం ముందు శరీరం ద్వారా కలిగే అల్పకాలిక ఆనందాలు పెద్దగొప్పవి కాదు. కానీ ఈ ఒక్క జన్మ

యొక్క అల్పకాలిక ఆనందాన్ని త్యాగం చేశారు కనుక స్వర్గంలో 21 జన్మలకే కాక ద్వాపర కలియుగాల 63 జన్మలకు ఎన్నో న్యాయ సమ్మతమైన రసాలు కలిగి జీవించే భాగ్యాన్ని పొందుతారు.

**644. జ్ఞానం నుండి వెళ్ళిపోయిన పిల్లలపై బాబా ఏవిధమైన ఆశ పెట్టుకుంటారు?**

ఒకవేళ ఎవరైనా జ్ఞానంలో ఉండి ఏదొక కారణం చేత తొలగిపోయినా కానీ శివబాబాకి వారిపై ఒకవిధమైన ఆశ ఉంటుంది. ఈరోజు కాకపోయినా ఇంకొకరోజు అనగా భయంకర పరిస్థితుల్లో భగవంతుని ఒడిలోకి తప్పకుండా వస్తాడని ఆశ ఉంటుంది. ఎందుకంటే వారికి పాత ప్రపంచంలో కొంత కర్మలఖాతా వున్న కారణంగా అది పూర్తి చేసుకుని తిరిగి భగవంతుని దగ్గరకే వచ్చేస్తారు. ఎందుకంటే ప్రతీ పిల్లవాడు భగవంతుని దగ్గరకు వచ్చి, భగవంతుని వెంట పరంధామానికి వెళ్ళిపోవాలి.

**645. బ్రహ్మాబాబా ఎవరిని స్మృతి చేయమని తెలియజేసారు? ఆ విషయాన్ని పాటించినప్పుడు మనకు కలిగే లాభం ఏమిటి?**

బ్రహ్మాబాబా కూడా ఆది నుండి అంతిమం వరకు ఒక్క శివబాబాతోనే సంబంధం పెట్టుకుని ఆయననే స్మృతి చేసారు. ఆ అనుభవం ద్వారా ప్రతీ ఒక్కరికి బ్రహ్మాబాబా ఈవిధంగా తెలియజేశారు. శివబాబానే స్మృతి చేయండి, ఆయన ద్వారానే పూర్తి వారసత్వం ప్రతీ ఒక్కరికి లభిస్తుంది, మరెవ్వరి ద్వారా లభించదు. బ్రహ్మాబాబాని ఎవరైనా తన ఫోటో అడిగితే, ఫోటో ఇవ్వకుండా శివబాబానే స్మృతి చేయమని చెప్పేవారు. ఆవిధంగా బ్రహ్మ శివతండ్రికి ఆజ్ఞాకారీగా, నమ్మకదారిగా, విశ్వాసపాత్రుడిగా, బయటి వారికి సత్య మార్గాన్ని చూపించే సాధకునిగా బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో పేరు గాంచారు. అదేవిధంగా మనం ఆయన్ని ఫాలో చేయాలి.

**646. ఇతరులను ఏ విషయంలో నిమిత్తం చేయాలి?**

ఒకరు అనేకులకి నిమిత్తం అవ్వాలి అప్పుడు సందేశం ఇవ్వటం వేగంగా జరుగుతుంది. అందువలనే బాప్‌దాదా ఇంతకు ముందు కూడా సైగ చేసారు – ఎక్కడ ఎక్కువ సంఖ్య ఉంటారో అంటే సంస్థలు మరియు పరిశ్రమలలో ఎక్కువమంది ఉంటారు. కనుక అటువంటి ఆత్మలను నిమిత్తంగా చేయండి; వారు సేవలో మీకు సహయోగులై ఇతరులను సమీపంగా తీసుకురావాలి. మీరు సందేశం ఇస్తూ ముందుకు వెళ్ళిపోతూ ఉండాలి. సందేశం ఇవ్వడానికి వారిని నిమిత్తం చేయాలి. ఇప్పుడు ఆత్మలైన మీ స్థితి ప్రకారం మీకు తయారుగా ఉన్న వేదిక లభిస్తుంది.

**647. సత్యయుగ ప్రజలు ఎప్పుడు తయారవుతారు?**

సేవలో తనువు–మనస్సు–ధనాలను ఉపయోగించే అవకాశం ఇతరులకు ఇవ్వండి. వారు తనువు ఉపయోగించినా, మనస్సు ఉపయోగించినా, ధనాన్ని ఉపయోగించినా కానీ ఉపయోగించినప్పుడే సత్యయుగీ ప్రజల్లోకి వస్తారు.

**648. గ్రామగ్రామాలలో సేవ చేసేటప్పుడు ఏ విధమైన సహయోగులను తయారు చేయాలి?**

ప్రతి ప్రాంతంలో ఈవిధమైన ఆత్మలను తయారుచేయండి మరియు తయారైనవారికి మరియు నమ్మకమైన సహయోగులకు విశేషసమయం తీసి శిక్షణ ఇవ్వండి అప్పుడు వారు నడుస్తూ ఉంటారు. నిమత్తమైనవారు మాత్రం చుట్టూ తిరుగుతూ ఉండాలి, పాతసెంటర్స్ అయితే పక్కా అయిపోయాయి కనుక క్రొత్తస్థానాలు తిరుగుతూ క్రొత్తవారిని పాతవారిగా తయారుచేయండి. యోగ్య సహయోగులను తయారుచేసే సాధనం – సమయానుసారం సహయోగులకు శిక్షణ ఇవ్వాలి. సమీపంగా ఉన్నవారు 8 మంది ఉన్నా, 10 మంది ఉన్నా కానీ సమయానుసారం శిక్షణ లభించడం చాలా అవసరం.  నిమిత్తంగా చేస్తూ ఉండండి, ముందుకి వెళ్ళిపోతూ ఉండండి. ఇప్పుడు మీకు సంబంధ,సంపర్కాలు బాగా తయారయ్యాయి. అందరిలో ప్రభావం కూడా బాగా పడింది. లక్ష్యం పెట్టుకుంటే అటువంటి సహయోగి ఆత్మలు కూడా దొరుకుతారు.

**649. సేవలో సఫలత ఎప్పుడు రాదు?**

కాన్‌ఫ్రెన్స్‌లు, యోగశిబిరాలు పెట్టడం, ఉపన్యాసం చెప్పి రావటమే కాదు, సహయోగులను తయారుచేయాలనే లక్ష్యం ఉండాలి. గీతాపాఠశాలల వలె నడిపించండి. నెమ్మదినెమ్మదిగా గీతాపాఠశాల నుండి ఉప సేవాకేంద్రంగా, ఉపసేవాకేంద్రం నుండి కేంద్రంగా అయిపోతాయి. కానీ ఏ గ్రూపు ఎక్కడికి వెళ్ళినా కానీ కంబైండ్ సేవ లేకుండా సఫలత లభించటం అసంభవం. సేవ చేయడానికి వెళ్ళి వచ్చిన తర్వాత మాయ వచ్చేసింది, మూఢ్ ఆఫ్ అయిపోయింది, అలజడి అయిపోయాము అనకూడదు. దీని కారణంగా నిమిత్త ఆత్మలు మిమ్మల్ని సేవకు పంపించడానికి కూడా భయపడతారు, ధైర్యం చాలదు.  ఇతరుల సేవ చేస్తూ వీరు బలహీనం అవ్వరు కదా అనుకుంటారు. అందువలన దీనిని అండర్‌లైన్ చేసుకోండి. సేవలో సఫలత లేదా సేవా వృద్ధికి సాధనం – స్వ మరియు సర్వుల సేవ కంబైండ్‌గా ఉండాలి.

**650. భావనాస్వరూప ఆత్మలకు, జ్ఞానయోగీ ఆత్మలకు తేడా తెలుపుము? వారు మొత్తం కల్పంలో ఎక్కడెక్కడ వస్తారు?**

వర్తమాన సమయంలో సేవలో భావనాస్వరూప ఆత్మలు ఎక్కువ వస్తున్నారు. ఇటువంటి ఆత్మలు

కూడా స్థాపనాకార్యంలో, ఆదిసనాతన దేవీదేవతాధర్మ స్థాపన లేదా రాజ్యస్థాపన రెండింటిలో అవసరం. కానీ ఇప్పుడు సమయానుసారం జ్ఞానీ యోగి ఆత్మలు ఎక్కువ అవసరం. ఎందుకంటే మున్ముందు సమయాల్లో వైరాగ్యవృత్తి యొక్క వాయుమండలం కారణంగా భావనాస్వరూప ఆత్మలు ఇంకా సహజంగా వస్తారు. అందువలన సేవాలక్ష్యంలో జ్ఞాని యోగి ఆత్మలపై ఎక్కువ ధ్యాస పెట్టాలి. ఇటువంటి ఆత్మల వృద్ధి అవసరం. అర్థమైందా! సంఖ్య బాగా పెరుగుతుంది అనుకోకండి. కానీ బాబా సమానంగా సర్వశక్తుల అనుభూతి కలిగిన ఆత్మలను తయారుచేయండి. రాజధాని అయితే చాలా మంచిగా వృద్ధి అవుతుంది. కానీ విశ్వపరివర్తనకి రెండు స్వరూపాల సమానత కలిగిన ఆత్మలే నిమిత్తం అవుతారు. ఎందుకంటే విశ్వపరివర్తన కొరకు చాలా సూక్ష్మ శక్తిశాలిస్థితి కలిగిన ఆత్మలు కావాలి. వారు తమ వృత్తి ద్వారా, శ్రేష్టసంకల్పం ద్వారా అనేకాత్మలను పరివర్తన చేయగలగాలి. స్నేహం లేదా భావన కలిగిన ఆత్మ స్వయంలో చాలా బాగా నడుస్తారు కానీ ఆ స్నేహం మరియు భావన విశ్వం పట్ల ఉండదు. స్వయం పట్ల లేదా సమీపంగా ఉండే కొందరి ఆత్మల పట్ల ఉంటుంది. బేహద్‌సేవ లేదా విశ్వసేవ సమానత కలిగిన ఆత్మలే చేయగలరు. స్వయం యొక్క శక్తిశాలి మనసాశక్తి ద్వారా, శుభభావన, శుభకామనల ద్వారానే బేహద్ సేవ జరుగుతుంది. కేవలం స్వయం పట్ల భావన కలిగినవారిగా కాదు కానీ ఇతరులను కూడా శుభభావన మరియు శుభకామన ద్వారా పరివర్తన చేయగలుగుతున్నారా?

### 651. ఏకాగ్రతా శక్తి ఏవిధమైన లాభాన్ని చేకూర్చుతుంది?

ఏకాగ్రతాశక్తి సహజంగా నిర్విఘ్నంగా తయారుచేస్తుంది. శ్రమ చేయవలసిన అవసరమే ఉండదు. ఏకాగ్రతాశక్తి స్వతహాగా 'ఒక బాబా తప్ప మరెవ్వరు లేరు' అనే అనుభూతిని సదా చేయిస్తుంది. ఏకాగ్రతాశక్తి సహజంగా ఏకీరసస్థితిని తయారుచేస్తుంది. ఏకాగ్రతాశక్తి సదా సర్వుల పట్ల కళ్యాణవృత్తిని సహజంగా తయారుచేస్తుంది. ఏకాగ్రతాశక్తి సర్వులపట్ల సోదరులు అనే దృష్టిని స్వతహాగా తయారుచేస్తుంది. ఏకాగ్రతాశక్తి ప్రతి ఆత్మ యొక్క సంబంధంలో స్నేహము, గౌరవము, స్వమానం యొక్క కర్మను సహజంగా అనుభవం చేయిస్తుంది.

### 652. బాబాతో స్నేహం చేసే జాబితా నుండి మనం ఎప్పుడు తొలగించబడతాము?

బాబాతో పాటు ఒకొక్కసారి వ్యక్తులతో, ప్రకృతి సాధనాలతో సంకల్పమాత్రమైనా కాని స్నేహం జోడిస్తే, వారే మాటిమాటికి జ్ఞాపకం వచ్చి క్రమంగా, బాబాతో స్నేహం చేసే జాబితా నుండి తొలగిపోతారు.

### 653. సర్వ ప్రాప్తులకు ఆధారం శివబాబా అనే విషయాన్ని పూర్తిగా వివరించండి?

బాబా సూక్ష్మంలోనే సహాయం చేస్తారని అనుకోకండి. భగవంతునికి దేహం ఉండదు కనుక సర్వ సంబంధాల యొక్క అనుభూతి, నిరాకార ఆత్మకు సంగమయుగంలోనే అనుభవం

చేయించగలరు. దేహాన్ని ధరించిన దేహదారులు, అల్పకాలిక రసాన్ని, సుఖానిచ్చే సాధనాలను, అవి రూపం రంగులో స్థూల కంటికి ఆకర్షణీయంగా కనిపిస్తాయి కాబట్టి ఆకర్షితమౌతున్నారు. కానీ అలా అవ్వకండి. అప్పుడు సర్వప్రాప్తులకు ఆధారమైన తండ్రి నుండి కొంత నిరాధారమైపోతాము.

**654. ఏ కారణంగా అతీంద్రియ సుఖం, మధురమైన శాంతి తక్కువగా అనుభవమవుతుంది?**

పవిత్రత అనగా ఒకే బలం, ఒకే నమ్మకం బాబాపై పెట్టుకున్న విషయంలో లోపం వున్న కారణంగా, మధురమైన శాంతి, అతీంద్రియ సుఖం అనుభవం అవ్వవు. పవిత్రత అంటే కేవలం బ్రహ్మచర్య వ్రతం కాదు. ఈ విషయంలో ఎక్కువమంది పాస్ అయ్యారు, ఇది కూడా ఒక అద్భుతం. వారిపై శివబాబా మనస్సు నుండి ఆశీర్వాదాలు కురిపిస్తున్నారు. కానీ, సంపూర్ణ పవిత్రత అనగా సూక్ష్మ కర్మేంద్రియాలైన మనుస్సు, బుద్ధి, సంస్కారం బాబా శ్రీమతానుసారంగా నడచుకోవాలి. సూక్ష్మకర్మేంద్రియాలు ఎప్పుడైతే శివబాబా ఆజ్ఞ పాటిస్తాయో, స్థూల కర్మేంద్రియాలైన కళ్ళు, ముక్కు, చెవులు, నోరు, మొదలైన దేహ కర్మేంద్రియాలు కూడా అదుపులో ఉంటాయి. అందుకే బాబా దేహాన్ని మందిరంగా భావించమని వాణీలో తెలియజేస్తారు. ఉదాహరణకు చైతన్యమైన డ్రైవర్ ఎంత అనుభవశాలీ అయినా, వాహనం సరిగ్గా నడచినప్పుడే అతని నైపుణ్యం తెలుస్తుంది. అదేవిధంగా, వాహనం నంబర్‌వన్‌గా ఉన్నా, డ్రైవర్ బలహీనంగా అనగా వ్యసనాలు, మత్తుపదార్థాలు స్వీకరించి వాహనాన్ని నడిపితే ఎంత క్రొత్త వాహనమైనా ప్రమాదానికి గురై ఇరువురికి నష్టం తీసుకువస్తుంది. అందులోఉన్న ప్రయాణీకులకు కూడా ప్రమాదం తీసుకువస్తుంది. అదేవిధంగా ఆత్మ పావనం కావాలి పరమాత్మ స్మృతిలో. శరీరం యొక్క ప్రతీ కర్మేంద్రియం పావనం కావాలని భగవంతుడు ఆశిస్తూ తెలియజేస్తున్నారు. ఈ రెండు విషయాలలో ఎవరు విజయం పొందుతారో వారికి భగవంతుడు తన హృదయంలో శాశ్వతమైన స్థానాన్ని బహుమతిగా ఇస్తారు.

**655. ఏ విధి ద్వారా ప్రకృతి పరివర్తన అవుతుంది?**

మీ యొక్క శ్రేష్ఠ దృష్టి, శ్రేష్ట సంకల్పం అనే తరంగాల ద్వారా పరివర్తన అవుతుంది.

**656. ఏయే విషయాలలో శుభభావన వదలకూడదు?**

ఎటువంటి ఆత్మ అయినా కానీ, తిట్టే ఆత్మ అయినా, నిందించే ఆత్మ అయినా కానీ మీ శుభ భావన, శుభ కామన ద్వారా, వృత్తి ద్వారా, స్థితి ద్వారా అటువంటి ఆత్మకు కూడా గుణదానం లేదా సహనశీలత అనే శక్తిని వరదానంగా ఇవ్వండి. ఒకవేళ ఎవరైనా క్రోధ అగ్నిలో కాలబడుతూ మీ ఎదురుగా వస్తే ఆ అగ్నిలో నూనె వేస్తారా లేక నీరు వేస్తారా? నీరు వేస్తారు కదా లేక కొద్దిగా

నూనె చుక్కలు కూడా వేస్తారా? ఒకవేళ క్రోధి ఎదురుగా మీరు పైకి క్రోధం చూపించలేదు, నోటి మాటలు లేకుండా శాంతిగా ఉన్నారు, కానీ నయనాల ద్వారా, ముఖం ద్వారా క్రోధ భావన పెట్టుకున్నారంటే నూనె చుక్కలు వేసినట్లే. క్రోధి ఆత్మ అనగా పరవశ ఆత్మ అటువంటి వారికి దయ అనే శీతల జలం ద్వారా వరదానాన్ని ఇవ్వండి.

### 657. సేవలో సమయం, శ్రమ ఎప్పుడు రక్షించబడతాయి?

మేళాలు చాలా చేసాం, చెప్పలేనన్ని ప్రదర్శనిలు పెట్టాం, మెగా ప్రోగ్రాములు చేశాం, కాన్ఫరెన్స్‌లు కూడా చాలా పెట్టాం అంటున్నారు కానీ సేవ కోసం ఇతరాత్మలను కూడా సహయోగిగా చేయండి. ఇతరులెవరైనా వారి కార్యక్రమాలలో స్టేజ్ అరేంజ్ చేసినప్పుడు మీరు ఆ స్టేజీపై శివబాబా పేరును ప్రత్యక్షం చేయండి. తయారైన వేదికలపై బాబాను ఎంతగా ప్రత్యక్షం చేస్తారో, అంతగా మీకు శ్రమ, సమయం రక్షించబడతాయి. మంత్రులతోపాటు, సెక్రటరీలకు కూడా జ్ఞానం చెప్పి బాబా సమీపంగా తీసుకురండి.

### 658. ఇప్పుడు ఎటువంటి సమయం నడుస్తుంది?

అసత్య సమయం నడుస్తుంది. సత్యం అసత్యంగా రుజువయ్యే సమయం. ఎందుకంటే ఈ అనంతమైన డ్రామాలో ఈ అసత్య రాజ్యం నడవటంలో కూడా చాలా గుహ్యమైన రహస్యం దాగివుంది. పరంధామం నుండి కొన్ని అసత్య ఆత్మలు భూలోకంలోకి వచ్చి శరీరం ధరించి పాత్రలు అభినయిస్తాయి. వారిలో అసత్య సంస్కారాలు ఉంటాయి కనుక అసత్యంతో గెలిచి అల్పకాలిక ఫలాలు అనుభవిస్తారు. కానీ భగవంతుడు అటువంటి పిల్లలపై కూడా దయ చూపిస్తారు. అందరి పాత్రను సాక్షిగా చూస్తారు కానీ దయాభావన కలిగి ఉంటారు. ఎందుకంటే భగవంతునికి అందరు పిల్లలే కావున ఆయన మనస్సులో ఎలా ఉంటుందంటే, పిల్లలు ఎటువంటి స్వభావ సంస్కారాలు కలవారైనా కానీ ఒక్క జన్మ అయినా కానీ సుఖశాంతులతో జీవించాలని కోరుకుంటారు.

### 659. మీలో ఏ శక్తి ద్వారా మీ ఎదురుగా వచ్చిన క్రోధాత్మలు రక్షించబడతారు?

సహనశక్తి యొక్క ప్రయోగం ద్వారా మీరు, ఇతరాత్మలు కూడా రక్షించబడతారు. ఈ శక్తి వాయుమండలంలో ప్రవేశించి వాయుమండలాన్ని శక్తిశాలిగా తయారు చేసి, ఒక పెద్ద రక్షణా కోటగా నిలబడుతుంది.

## 660. ఏ విధమైన తోడు తీసుకుంటే మీరు మోసపోతారు?

అల్పకాలిక ఆధారాలు ఏవైతే హద్దుని తయారు చేస్తున్నాయో, ఉదాహరణకు కొంత సంపాదించాలని, దైనందిన జీవితంలో సంబంధీకుల సంబంధంలో ఎక్కువ సమయం కేటాయించి వారిని తోడు తీసుకుంటే సంగమయుగం యొక్క సౌభాగ్యాన్ని పోగొట్టుకుంటారు. నవయుగ నిర్మాతయైన శివపరమాత్మ యొక్క యధార్థ జ్ఞానాన్ని, పరిచయాన్ని, శక్తిని, ప్రాప్తిని, ఆశీర్వాదాలను ఎప్పుడూ పొందలేరు. ఇప్పుడు లేకున్నా మరెప్పుడూ లేదు, కాబట్టి ఎందులో మోసపోతున్నారో పరిశీలించుకుని రక్షించుకోండి. భగవంతుడు ప్రవేశించిన శరీరధారియైన బ్రహ్మాబాబా సమయం, సంకల్పం, వ్యాపార వ్యవహారాలు, ధనం, రక్త సంబందీకులను, ఆస్తిపాస్తులు, పేరు, గౌరవ మర్యాదలు, ఇవన్నీ శివపరమాత్మ చేసిన రుద్రజ్ఞాన యజ్ఞంలో త్యాగం చేసి ప్రపంచానికి ఉదాహరణ మూర్తిగా అయ్యారు. సూపర్‌ఫాస్ట్ రైలు ఆలస్యంగా బయలుదేరినప్పటికీ మార్గమధ్యలో అనేక రైళ్ళను దాటి, చాలా తక్కువ సమయంలో గమ్యం చేరుకుంటుంది అదేవిధంగా ఆఖరులో వచ్చిన వారైనా, మొదటలో వచ్చిన వారైనా, మధ్యలో వచ్చిన వారైనా ఫాస్ట్‌గా వెళ్ళి, రెండవ లక్ష్మీనారాయణుల పదవికి పాత్రులవ్వండి. వారి నెంబర్ ఇంకా ఇప్పటి వరకు నిర్ణయింపబడలేదు. మీరు పొందడానికి అవకాశం వుంది.

## 661. శివబాబా ఎవరికి పూర్తిగా తోడుగా ఉంటారు?

ధృఢ సంకల్పం ఉన్నవారికి శివబాబా ఎల్లప్పుడూ పూర్తి తోడుగా ఉంటారు.

## 662. ఎవరిని ఫరిస్తా అంటారు?

ఫరిస్తా అంటే సర్వ ఆత్మలకు సేవ చేసే సేవాధారి, ఒకరిద్దరికి కాదు. ఫరిస్తా అంటే దృష్టి, వృత్తి ద్వారా విశ్వంలోని సర్వఆత్మలకు శివపరమాత్మ సందేశాన్ని యిచ్చి వారి సంబంధాన్ని భగవంతునితో జోడిస్తారు. వీరి శరీరం ఒకే స్థానంలో ఉంటుంది, కానీ ఆత్మ సూక్ష్మశరీరం అనగా ప్రకాశ శరీరం ధరించి విశ్వంలో అలజడిలో, అనారోగ్యంలో, ఆత్మహత్యా ప్రభావంలో, అనేక రకాల విఘ్నాలలో అలసిపోయిన ఆత్మలకు శక్తినిచ్చి వారిని రక్షించే సేవలో నిమగ్నమై ఉంటారు.

## 663. ఏ విషయాన్ని ఎవరూ తొలగించలేరు?

బుద్ధిలో ఉన్న విషయాన్ని తేలికగా తీసివేయవచ్చు కానీ మనస్సులో వున్న విషయాన్ని మొత్తం ప్రపంచం అంతా ఏకమైనా తీసివేయలేరు. అందుకే శివబాబా మనందరికీ ఒక ముఖ్య సూచన ఇస్తారు. అదేమిటంటే భగవంతుని యొక్క మహావాక్యం బుద్ధి వరకే కాదు మనస్సు వరకు తీసుకువెళ్ళండి అని. బుద్ధి వరకు వెళితే క్లాసురూము గడప దాటగానే మరచిపోతాం. ఒకవేళ జ్ఞాపకం ఉన్నా, కర్మలోకి వెళ్ళడానికి మనస్సు ఏమి చెబుతుందంటే, నీవు బలహీనుడవు, ఈ

వాక్యాన్ని ధారణ చేసి ప్రయోగం చేయలేవని చెబుతుంది. కానీ ఒకటి గుర్తు పెట్టుకొండి – ఐదువేల సం॥లకు ఒక్కసారి అనగా సంగమయుగంలో అవతరించిన భగవంతుడు ఒక్క అక్షరం కూడా అబద్ధం చెప్పరు కనుక ప్రతీ వాక్యాన్ని మనస్సులోకి వెళ్ళేలా చేసుకోండి. అప్పుడు కర్మలోకి వచ్చి, కర్మ శ్రేష్ఠంగా అయ్యి, సత్యయుగంలో శ్రేష్ఠ పాత్ర అభినయించడానికి పాత్రులవుతారు. భగవంతుడు కేవలం మనస్సుకే రాజీ అవుతారు. ఎందుకంటే మనస్సు అనేది ఆత్మలో ఉన్న అతి సూక్ష్మాతి సూక్ష్మశక్తి. అక్కడి నుండే చెడు అయినా, మంచి అయినా అన్ని సంకల్పాలు ఉత్పన్నమవుతాయి. ఆ స్థానంలో జ్యోతి స్వరూపుడైన భగవంతుని కూర్చో పెట్టుకుంటే మొత్తం కర్మేంద్రియాలన్నీ కర్మాతీతంగా అవుతాయి.

**664. ఏ విశేషత మిగిలిన అన్ని విశేషతలను తీసుకు వస్తుంది?**

సంతుష్టత. పరిస్థితి ఎంత మారినా కానీ, సంతుష్టతను వదలకండి. సంతుష్టతలోనే మొత్తం ప్రాప్తి యొక్క సారం దాగి ఉంది. చూడండి, వర్తమాన సమయంలో రాజకీయ వర్గంలో ఉన్నవారు శాంతిగా నిద్రలేకపోతున్నారు. కష్టించి పనిచేసి కొద్దిపాటి సంపాదనతో తృప్తి పడే కార్మికులు వారి ఇంటి అరుగుపై సుఖంగా నిద్రపోతున్నారు. ఎందుకంటే అతనిలో సంతుష్టత; నేను మన:స్ఫూర్తిగా డ్యూటీ చేసి, యజమానికి న్యాయం చేకూర్చాను అనే సంతుష్టత అతనిని ప్రతీరోజు శాంతిమయ నిద్రలోకి తీసుకెళ్ళిపోతుంది.

**665. సంగమయుగంలో మనం సాధారణ స్థితిలో ఉండటం వలన లాభం ఏమిటి?**

ప్రపంచం యొక్క లెక్కల్లో మనం పైకి చాలా సాధారణంగా కనిపిస్తున్నాము. ఈ అంతిమ జన్మలో సాధారణంగా ఉండటం వలన భగవంతుడు లభించాడు. కాబట్టి ఈ అంతిమ జన్మలో సాధారణ జీవితం భవిష్య భాగ్య జీవితానికి నిమిత్తమైనది. ఉదాహరణకు ఇప్పుడు మనకు ఎక్కువ ధనం ఉంటే దానిని కాపాడుకోవటంలోనే నిమగ్నమైపోతాం కానీ శివబాబాను తెలుసుకోలేము. కాబట్టి సంగమయుగంలో పేదవారికి ఉండటం కూడా గొప్ప అదృష్టం.

**666. కర్మ ఎప్పుడు శ్రేష్ఠం అవ్వదు?**

కర్మలో పూర్తిగా లీనమైపోయి ఆ కర్మలో యోగం లేనప్పుడు ఆ కర్మ శ్రేష్ఠ కర్మ కాదు. ఇది కర్మయోగం కాబట్టి, బయటివారిలా కాకుండా ప్రతీ కర్మలో యోగం ఉండాలి.

**667. మున్ముందు మధువనంలో ఏవిధమైన మార్పు వస్తుంది?**

మధువనం అనగా భగవంతుడు అవతరించిన జన్మభూమి. ఇప్పుడు అందరు శక్తిననుసరించి కొన్ని నియమాలు పాటించి భగవంతుని కలుసుకోవడానికి మధువనం వెళుతున్నారు. కానీ మున్ముందు అందరూ వచ్చేయండి అని సూచన వెళుతుంది. అప్పుడు వసతులు సరిపోవు, కొన్ని

రోజులు భోజనం దొరకటం కూడా కష్టమవుతుంది. కానీ అశరీరి స్థితి యొక్క అభ్యాసం ద్వారా ఏదైనా సాధించవచ్చు. కాబట్టి మధువనం మున్ముందు ఆవిధంగా కూడా మారిపోవచ్చును.

### 668. అందరు భగవంతుడిని తండ్రి అంటారు. కానీ ఆయన ద్వారా కొంతమందికి ఏమి లభించదు?

చదువు, పాలన లభించదు. చదువు, పాలన సంగమయుగంలో కేవలం మనకే లభిస్తుంది. ఈ అదృష్టం ధర్మపితలకు, మహాన్ ఆత్మలకు కూడా లేదు.

### 669. యథార్థమైన వైరాగ్య వృత్తి సహజ అర్థం ఏమిటి?

యదార్ధ వైరాగ్యవృత్తి యొక్క సహజ అర్ధం - ఆత్మల యొక్క సంపర్కంలోకి వచ్చినా, సాధనాల యొక్క సంబంధంలోకి వచ్చినా, సేవా అవకాశం యొక్క భాగ్యం లభించినా, సర్వ సంబంధసంపర్కాలలో ఎంత అతీతమో అంత ప్రియంగా ఉండాలి, రెండింటి బాలన్స్ (సమానత) ఉండాలి. కానీ జరిగేది ఏమిటి? ఒక్కొక్కసారి అతీతం యొక్క శాతం పెరిగిపోతుంది. ఒక్కొక్కసారి అతి ప్రియం యొక్క శాతం పెరిగిపోతుంది. ప్రియం అంటే నిమిత్త భావం, నిర్మాణ భావం ఉండాలి. కానీ దీనికి బదులు "నాది" అనే భావం వచ్చేస్తుంది. ఇది నా పని, ఈ స్థానం నాది, ఈ సర్వ సాధనాలు నా భాగ్యానుసారం లభించాయి, ఇంత శ్రమతో నేను ఈ సాధనాలను, స్థానాన్ని లేదా సేవని లేదా సేవా సహయోగులను (విద్యార్థులను) తయారుచేశాను. కనుక ఇవి నావి, నా శ్రమకు ఏ విలువా లేదా? ఇలా నిమిత్త భావం మరియు నాది అనే భావం రెండింటికి తేడా ఉన్నదా? లేక రెండూ ఒకటేనా? ఈ నాది అనేది రాయల్ (సూక్ష్మ) రూపంగా పెరిగిపోయింది.

### 670. సమయం యొక్క సమీపతకు పునాది ఏమిటి?

సమయం యొక్క సమీపతకు పునాది - మన యొక్క బేహద్ వైరాగ్యవృత్తి అనగా దేహానికి సంబంధించిన వినాశీ పదార్థాలపై ఆసక్తిని అంశ, వంశ సహితంగా త్యాగం చేయాలి. ఉదాహరణకు దేహాన్ని అలంకరించుకోవడానికి, దేహానికి సదుపాయాలు సమకూర్చుకోవడానికి ఎన్నో వస్తు వైభవాలు కావలసి ఉంటాయి. వాటిని అవసరం ఉన్నంత వరకు ఉపయోగించుకుని, కోరిక లేకుండా పరిత్యజించడమే బేహద్ వైరాగ్య వృత్తి.

### 672. మున్ముందు మధువనం ఏవిధంగా మారుతుంది?

ఇప్పుడు వచ్చే వేలమందికి టెంట్స్ అయినా లభిస్తున్నాయి. మున్ముందు సాధనాలన్నీ సమాప్తి అయిపోతాయి. పర్వతాలే విశ్రాంతి స్థలాలుగా మారిపోతాయి.

**673. అభిమానం ఎన్ని రకాలుగా ఉంటుంది?**

1) బుద్ధి యొక్క అభిమానం అనగా నా బుద్ధే చాలా గొప్పదని భావించడం, నేను చెప్పిందే సత్యమని భావించడం. 2) శ్రేష్ఠ సంస్కారం యొక్క అభిమానం అనగా తనకున్న మంచి గుణాలు ఎవరికీ లేవు, నేనే గొప్పవాడిని అని భావించడం. ఇలా మంచి స్వభావం, విశేషతల యొక్క అభిమానం, సేవాసఫలత యొక్క అభిమానం అనగా నేను చేశాను కనుకే సఫలత వచ్చింది అనుకోవటం ఇవన్నీ సూక్ష్మమైన అభిమానాలు. ఎక్కడైతే అభిమానం ఉంటుందో అక్కడ అవమానం కూడా త్వరగా తీసుకుంటారు. కాబట్టి మనచే చేయించేది స్వయంగా శివబాబా అనే సూత్రం ఆధారంగా అన్ని అభిమానాలు తొలగిపోతాయి.

**674. సర్వులకి ప్రియంగా ఎప్పుడవుతాము?**

ఎవరు అందరి స్వభావ సంస్కారాలు, సంబంధ సంస్కారాలు చూసి కూడా వారితో కలిసి, వారిని అవమానించకుండా ఆత్మాభిమాని స్థితిలో ఉంటారో వారు సర్వులకు ఇష్టం అనిపిస్తారు అనగా చెడు మరియు మంచి విషయాలలో మనం ఒకేవిధంగా ఉండాలి.

**675. నిరంతర యోగిగా ఎప్పుడవుతారు?**

ఏ ఒక్క విషయంలో కూడా నాది అనేది లేకుండా, "నా బాబా" అనేది ఎప్పుడైతే మనస్సు నుండి వస్తుందో, అప్పుడు నిరంతరయోగిగా అయిపోతారు. ఉదాహరణకు – టీచర్స్, నా పరివారం, నా సెంటర్, నా జిజ్ఞాసుపులు, నా సేవ మీరెందుకు చేసారు అనే విషయాలలో చిక్కుకుంటే నిరంతర యోగిగా అవ్వలేరు. అదేవిధంగా విధ్యార్థులు కూడా నా కుటుంబసభ్యులు, నా ఆస్తిపాస్తులు అని భావించకూడదు. ఈ అంతిమ జన్మలో మనకు లభించినవన్నీ భగవంతుని యజ్ఞంలో సమర్పణ చేసుకుంటే కల్పమంతా, 84 జన్మలకు భాగ్యం తయారైపోతుంది మరియు త్యాగం ద్వారా మన జీవితం యోగి జీవితంలా గడచిపోతుంది.

**676. బ్రాహ్మణ పరివారంలో అతీత స్థితి అంటే ఏమిటి?**

అతీత స్థితి అంటే అందరిలో ఉంటూ మరియు గొడవల మధ్యలో ఉంటూ, స్థూలంగా వేరవ్వకుండా ఆ సమస్యలన్నీ భగవంతుని స్మృతిని పెంచడానికి వచ్చినవిగా భావించి ధర్మాన్ని వదలకుండా భవిష్యత్తులో వచ్చే రాజ్యప్రాప్తిని జ్ఞాపకం ఉంచుకుని నడవటమే అతీత స్థితి. ఎందుకంటే భగవంతుడు ధర్మాన్ని, రాజ్యాన్ని స్థాపన చేస్తున్నారు. ధర్మపితలైతే కేవలం ధర్మాన్ని స్థాపన చేయగలరు. అందరికీ వారసత్వం భగవంతుడు ఇచ్చినప్పటికీ, పరివారంతో జన్మజన్మలకు కలిసి ఉండాలి కనుక ఎవరు ఎటువంటి వారైనా అందరూ కలసి ఉండండి. అశాంతి వాతావరణం మధ్యలో కూడా మీరొక్కరు శాంతిగా ఉంటే అక్కడ వాతావరణం మారిపోతుంది. అలా కాకుండా అక్కడి నుండి మీరు తొలగిపోతే ఆ అశాంతి వాతావరణాన్ని పరివర్తన చేసే వారుండరు. కాబట్టి ఈ సూక్ష్మ రహస్యాన్ని తెలుసుకుని నడవండి.

**677. అతిథులను ఏవిధంగా గౌరవించాలి?**

మర్యాదలు చేయడంలో అనగా సదుపాయాలు ఇవ్వడంలో అందరూ పాస్ అవుతారు. కానీ వారికి భగవంతుని యొక్క పరిచయం ఇచ్చి, ఆయన శక్తి యొక్క అనుభూతి చేయించి, ఇతరులను ఉత్సాహ ఉల్లాసాలతో ముందుకు తీసుకు వెళ్ళటమే అసలైన గౌరవం ఇవ్వటం.

**678. ఏ ఒక్కరిని అనుసరించాలి? మధువనంలో ఉన్నా కూడా ఏ విషయంలో లోపం ఉంటే బాబాకు దూరంగా ఉన్నట్లు?**

చాలా ఎక్కువమంది మధువనంలో సేవ చేయడం గొప్ప విషయంగా భావించి వెళతారు, కొద్దిరోజులు ఉంటారు, మరలా తిరిగి వచ్చి మేము మధువనం సేవాదారులమని గొప్పగా చెప్పుకుంటారు. మధువనంలో స్థూలసేవ అనగా కాయగూరలు తరగటం, గదులు శుభ్రం చేయడం మొదలైనవి చేస్తారు. కానీ వాస్తవానికి సేవ అంటే బాబా చెప్పినదేమిటంటే – ప్రతీరోజు ఎవరికో ఒకరికి మనసా, వాచా లేదా కర్మ ద్వారా, సాధనాల ద్వారా జ్ఞానం చెప్పటం కావున ఏ స్థానంలో ఉన్నా సేవ చేయండి, శివబాబా మనస్సు యొక్క సంలగత్నని చూస్తారు. కాబట్టి గొప్పలు చెప్పుకోవటం మాని శ్రేష్ఠంగా తయారవ్వండి. కొద్దిమంది పాత్రలు శుభ్రం చేయడం కూడా భగవంతుని సేవగా భావించి మధువనంలో సేవాదారిగా ఉంటారు. వారు గొప్పలు చెప్పుకోరు. వారే అసలైన సేవాధారులు మరియు శ్రేష్ఠ పదవిని పొందే భాగ్యశాలీ ఆత్మలు.

**679. బ్రహ్మాకుమారులు అని పిలుస్తుంటారు. శివకుమారులు అని ఎందుకు అనరు?**

బ్రహ్మాకుమారీకుమారులు అంటే సాకార స్వరూపం. అనగా ఆహార, విహార, వ్యవహారంలో సాత్వికంగా నడిచేవారు. శివకుమారులు అంటే నిరాకారి స్వరూపం. నిరాకారి స్థితిలో ఉంటే శివకుమారులుగా ఉన్నాం అని అర్థం. కనుక బ్రహ్మాకుమారి స్వరూపంతో పాటు శివకుమారి స్వరూపం కూడా ఉంటే శివబాబాను ప్రత్యక్షం చేయగలుగుతాం.

**680. సంతుష్టత ఎప్పుడు మనకు కలుగుతుంది?**

సంతుష్టత అనేది దైవీగుణం. పైపై విషయాల ఆధారంగా సంతుష్టం అవ్వటం గొప్ప విషయం కాదు; మనస్సు సంతుష్టమవ్వాలి. సంతుష్టత అనగా అన్ని ఉన్నప్పుడు సంతృప్తిగా ఉండటం కాదు, నష్టంలో కూడా లాభం చూసి బాబాపై నిశ్చయం సడలిపోకుండా ఉండాలి. వారే సంతుష్టమణి.

**681. మీ ఎదురుగా ప్రతీరోజు ఒక విశేష ప్రాప్తిని ఎందుకు ఉంచుకోవాలి?**

ఎందుకంటే ఆ విశేష ప్రాప్తి మిగిలిన ప్రాప్తులన్నింటిని సహజంగా తీసుకువస్తుంది.

## 682. పవిత్రత యొక్క గుహ్య అర్థం ఏమిటి?

పవిత్రత అంటే కేవలం బ్రహ్మచర్యవ్రతమే కాదు. బ్రహ్మచర్య వ్రతాన్ని ఈరోజుల్లో కొంతమంది పరిస్థితుల ఆధారంగా డాక్టర్ల సలహా మేరకు పాటిస్తున్నారు. కాబట్టి ఇది గొప్ప విషయమేమీ కాదు. కొంతమంది భక్తులు కూడా పాటిస్తున్నారు, వారిలో జ్ఞానం ఉండి కాదు, కోరికలు నెరవేరడానికి కొంత సమయం పాటిస్తున్నారు. పవిత్రత అనగా ప్రతీ రోజు, ప్రతీ విషయాన్ని పరిశీలించుకోవడం. మాట్లాడటంలో, వ్యవహరించడంలో, కర్మణా సేవలో శివపరమాత్మ చెప్పిన శ్రీమతానుసారంగా లేకపోతే పవిత్రత కాదు. వ్యర్థ సంకల్పాలు కూడా అపవిత్రతయే. మేము ఏం పాపం చేయలేదు, ఎవరికీ దు:ఖం ఇవ్వలేదు అని అనుకుంటున్నారు. కానీ ఎవరికైనా జ్ఞానాన్ని తెలిపి సుఖం ఇచ్చారా అని భగవంతుడు చూస్తున్నారు, అదే పవిత్రత. అదే భవిష్యత్తు జన్మలకు, వర్తమాన జన్మకు పుణ్యాన్ని జమ చేస్తుంది. పవిత్రత యొక్క పరిభాష చాలా గుహ్యమైనది. ఉదాహరణకు మన మనస్సు శుభ సంకల్పాలనే చేయాలి, అదే మనసా పవిత్రత. మధురంగా మాట్లాడాలి, నెమ్మదిగా మాట్లాడాలి. ఫలపూరితంగా మాట్లాడాలి; ఇదే వాచా పవిత్రత. కర్మణా పవిత్రత అనగా మన ప్రతీ కర్మ నిస్వార్థంగా, విశ్వకళ్యాణం కొరకు ఉండాలి అనగా అన్నదానం, వస్త్రదానం, భూదానం, గోదానం వగైరా స్థూలదానాలు కాకుండా జ్ఞాన దానం, యోగదానం, గుణాల దానంలో మన సర్వ సంపత్తిని ఖర్చు పెట్టాలి. అన్నదానం మొ॥నవి బయటివారు చేసి కొంత పుణ్యాన్ని సంపాదించుకుంటున్నారు. మనసా, వాచా, కర్మణా ద్వారా చేసే దానాలు భగవంతుని పిల్లలమైన మనమే చేయగలము. ఇదే అసలైన పవిత్రత.

## 683. రోజంతటిలో మధ్యమధ్యలో శివబాబాను జ్ఞాపకం చేయడం వలన వచ్చే లాభం ఏమిటి?

రోజంతటిలో మధ్య మధ్యలో ఈ అభ్యాసం చేయండి. ఎంత బిజీగా ఉన్నా కానీ మధ్యమధ్యలో ఒక్క సెకను అయినా కానీ అశరీరిగా అయ్యే అభ్యాసం తప్పకుండా చేయండి. ఈ అభ్యాసం చేయటానికి నేను బిజీగా ఉన్నాను అని ఎవరూ అనలేరు కదా! దీని కోసం ఒక్క సెకను తీయవలసిందే, అభ్యాసం చేయవలసిందే, ఒకవేళ ఎవరితో అయినా మాట్లాడుతున్నా, ఎవరితో పనిచేస్తున్నా వారితో కూడా ఒక్క సెకను ఈ అభ్యాసం చేయించండి. ఎందుకంటే సమయప్రమాణంగా ఈ అశరీరి స్థితి యొక్క అనుభవం లేదా అభ్యాసం ఎవరిలో ఎక్కువగా ఉంటుందో వారే ముందు నెంబర్ తీసుకుంటారు. ఎందుకంటే చెప్పాను కదా! సమయం అకస్మాత్తుగా సమాప్తి అయిపోతుంది. అశరీరిగా అయ్యే అభ్యాసం ఉంటే వెంటనే సమయం యొక్క సమాప్తి యొక్క తరంగాలు వస్తాయి.

## 684. సేవ నేను చేస్తున్నాను, పేరు ఇంకొకరికి వస్తుంది అనే భావన ఎంత నష్టం తీసుకు వస్తుంది?

సేవ నేను చేస్తున్నాను పేరు ఇంకొకరికి వస్తుంది ఇలా హద్దులోని పేరు వెనుక వెళ్ళకండి. బాబా యొక్క హృదయంలో సదా మీ పేరు శ్రేష్టంగానే ఉంటుంది. బాబా హృదయంలో సదా మీ పేరు ఉన్నప్పుడు ఇక ఏ సేవలోనైనా, కార్యక్రమంలోనైనా, ఏవిషయంలోనైనా మీ పేరు లేకపోతే ఏమైంది? బాబా దగ్గర అయితే ఉంది కదా! భక్తిమార్గంలో హనుమంతుని చిత్రం చూపిస్తారు కదా! ఆయన హృదయంలో ఏమి ఉండేది? రాముడే ఉండేవాడు. అలాగే బాబా హృదయంలో ఎవరు ఉంటారు? (పిల్లలు) అయితే ఆ పిల్లలలో మీరు ఉన్నారా? లేరా? చాలామందిని ఈ పేరు, గౌరవం, మర్యాదలే పడవేస్తున్నాయి మరియు ఈ పేరు, గౌరవ మర్యాదలే నషాని కూడా ఎక్కిస్తున్నాయి. అయితే ప్రాప్తి రూపంలో చూడండి. ఒకవేళ ఏ కారణంగా అయినా మీ పేరు గుప్తంగా ఉంది, మీరు అనుకుంటారు నా పేరు ఉండాలి అని మీది యదార్ధమే అయినా కానీ ఏదోక ఆత్మతో కర్మలఖాతా కారణంగా లేదా వారి సంస్కారాల కారణంగా మీ పేరు ఉండటంలేదు, మీరు సత్యం, వారు అసత్యం అయినా కానీ వారి పేరు ఉంది మీ పేరు లేదు అనుకోండి అయినా ఫర్వాలేదు. విజయీమాలలో మీ పేరు నిశ్చితం అయిపోయి ఉంటుంది. అందువలన దీని గురించి కూడా చింతించకండి. ఈ రూపంలో మాయ ఎక్కువగా వస్తుంది. అందువలన ఇప్పుడు పొరపాటున మీ పేరు మిస్ అయిపోయినా ఏమీ పర్వాలేదు కానీ విజయీమాలలో మీ పేరు మిస్ అవ్వదు. ముందు మీ పేరే ఉంటుంది. ఇలా మీ పేరు యొక్క మహిమను జ్ఞాపకం ఉంచుకోండి – నా పేరు బాబా హృదయంలో ఉంది, విజయీమాలలో ఉంది, అంతిమం వరకు నా పేరు సేవ చేస్తుంది అని.

మీ యొక్క గౌరవం ఎంత గొప్పది? భగవంతుడు కూడా మిమ్మల్ని తన కంటే ముందు ఉంచారు. ముందు పిల్లలు అంటారా లేదా ముందు బాబా అంటారా? ముందు పిల్లలే అంటారు అంటే స్వయం భగవంతుడు మీకు గౌరవం ఇచ్చారు. ఎప్పుడైనా హద్దులోని గౌరవం యొక్క విషయం వస్తే పరమాత్మ ద్వారా గౌరవం లభిస్తున్నప్పుడు ఆత్మల యొక్క గౌరవం దేనికి అని ఆలోచించుకోండి. మేము ఇంతగా చేస్తున్నాము కానీ గౌరవం ఇవ్వటం లేదు, అసలు అడగటం లేదు అని ఆలోచించకండి. ఇలా ఆలోచించటం వ్యర్ధం. ఎందుకంటే ఎంతగా మీరు హద్దులోని గౌరవం వెనుక పరుగెడతారో అంతగా ఈ హద్దులోని వస్తువులు ఏవైనా కానీ నీడతో సమానం. నీడను చూసారు కదా. నీడ వెనుక పడితే నీడ దొరుకుతుందా ఇంకా ముందుకి వెళ్ళిపోతుంది? అలాగే ఈ హద్దులోని గౌరవం, పేరు అనేవి నీడలాంటివి. ఇవి మాయ యొక్క ఎండలోనే కనిపిస్తాయి కానీ నిజానికి అది ఉండదు. మీకు పేరు కూడా మీకు లభించింది, గౌరవం కూడా లభించింది మరియు ఎంత మర్యాద లభించింది? ఒక్కొక్క మర్యాదని జ్ఞాపకం చేయండి మరియు మిమ్మల్ని మర్యాదలో కూర్చోపెట్టింది ఎవరు? బాబా కూర్చోపెట్టారు కదా! బాబా యొక్క హృదయ సింహాసనాధికారులు అన్నింటికంటే గొప్ప మర్యాద ఏమిటి? రాజ్య పదవి కదా అయితే మీకు సింహాసనం, కిరీటం లభించాయి కదా! పరమాత్మ హృదయ సింహాసనాధికారులు దీని కంటే గొప్ప మర్యాద ఇంకేముంది?

### 685. శివబాబా తన సూక్ష్మ టి.విలో ఎవరెవర్ని చూస్తారు?

సేవాకేంద్రాలను, బాబా పిల్లల ఇళ్ళను ఒక్క సెకనులో మొత్తం చూడగలరు. ఎవరు ఎలా నిద్రపోతున్నారు? ఎవరు ఎలా మాట్లాడుతున్నారు? ఎవరు ఎలా ప్రవర్తిస్తున్నారు మొదలగు విషయాలన్నీ పరిశీలించాలి అనుకున్నప్పుడు బాబా తన సూక్ష్మ టి.విలో చూస్తుంటారు.

### 686. సేవకు ఎన్ని మార్కులు? ధారణకు ఎన్ని మార్కులు?

సేవకు 1 మార్కు, ధారణకు 10 మార్కులు. ఒకవేళ మీకు చదువు రాదు, మీరు జ్ఞానం చెప్పలేరు, కానీ మీ ధారణా ప్రభావంతో ఇతరులకు ప్రేరణ ఇస్తే, మీ సేవాఖాతాలో 10 మార్కులు జమ అవుతాయి. అనగా కొంతమంది మాతలు ఉపన్యాసం చెప్పలేరు, కోర్సు కూడా చెప్పలేరు అనుకోండి, కానీ వారు సామాన్లు శుభ్రం చేసేటప్పుడు, ఆహారం తయారు చేసేటప్పుడు అంతర్ముఖి అయ్యి ఇది భగవంతుడి సేవ, నా భాగ్యం కోసం ఇచ్చిన సేవ అని అనుకుంటూ సేవ పూర్తయ్యే వరకు ధారణా స్వరూపంలో ఉంటే, వారి ధారణ యొక్క అంతర్ముఖి స్థితి యొక్క ప్రభావం వారి నయనాల నుండి, మస్తకం నుండి, వాయుమండలంలోకి వెలువడి ఇతరులు కూడా ఆవిధంగా చెప్పకుండానే పరివర్తన అవుతారు. అందుకు ధారణకు 10 మార్కులు. పైపైకి చూపించే అల్పకాలిక పేరు, గౌరవం, ధనం, సాధనాలు కావాలనే కోరిక ఉన్నవారికి ఒకటే మార్కు జమ అవుతుంది.

### 687. అంతిమంలో మన నెంబర్ ముందు ఉండాలంటే ఏ విధిని పాటించాలి?

బ్రాహ్మణ పరివారంలో మీకు పేరు లేకపోయినా, మీరు మంచి సేవాధారులే కానీ మీకు పేరు లేదు కానీ బాబా దగ్గర అయితే ఉంది కదా! బాబా హృదయంలో పేరు ఉంటే ఇంకేమి కావాలి? కేవలం బాబా హృదయంలోనే కాదు అంతిమంలో నెంబర్ లభించేటప్పుడు కూడా మీ నెంబర్ ముందు ఉంటుంది. ఎందుకంటే బాప్‌దాదా లెక్క చూస్తారు – మీకు అవకాశం లభించలేదు, మీరు సత్యమే అయినా కానీ అవకాశం లభించలేదంటే అది కూడా నోట్ అయిపోతుంది. మీరు అడిగి అవకాశం తీసుకున్నారు మరియు చేశారు మంచిదే కానీ దానికి కూడా మార్కులు కట్ అయిపోతాయి. ధర్మరాజు యొక్క ఖాతా తక్కువేమీ కాదు. చాలా సూక్ష్మ లెక్కల ఖాతా. అందువలన నిస్వార్థ సేవాధారిగా అవ్వండి, మీ స్వార్థం ఉండకూడదు. కళ్యాణం యొక్క స్వార్థం ఉండాలి. ఒకవేళ మీకు అవకాశం లభించింది కానీ ఇంకొకరు కూడా యోగ్యమైనవారే వారు కూడా అవకాశం కావాలనుకుంటారు కానీ దొరకలేదు. ఆ సమయంలో మీ అవకాశం వారికి ఇస్తే దానిలో వాటా మీకు జమ అయిపోతుంది.

**౬౪౪. ఎవరైనా ఏదైనా విషయం మనకు తెలిపినప్పుడు మనం ఏ విధిని పాటించాలి?**

మీకు భాద్యత ఉంటే వినండి కానీ ఆ పరిస్థితిని విని మీరు అలజడి అవ్వకండి. ఇతరులను కోప్పడకండి. మీ భాద్యతగా భావించి వ్యర్థ సంకల్పాలకు బిందువు పెట్టి, ఆ పరిస్థితులను, వ్యక్తులను పరివర్తన చేయండి.

**౬౪౫. లోభత్వం మనలో ఏ విధంగా ఉంటుంది?**

లోభం అంటే తినటం, త్రాగటంలో ఉంటుందని కాదు. కొందరు అనుకుంటున్నారు, మాకు ధరించటంలో, తినటంలో, ఉండటంలో ఏ ఆకర్షణ లేదు, ఏది ఉంటే, ఏది తయారుచేసుకుంటే అది తినేస్తున్నాం అంటారు కానీ ముందుకి వెళ్ళే కొలది మాయ రాయల్‌రూపంలో మరియు సూక్ష్మరూపంలో లోభాన్ని తీసుకువస్తుంది. అయితే ఆ రాయల్ లోభం ఏమిటి? విద్యార్థి అయినా, టీచర్ అయినా ఇద్దరిలో కూడా మాయ రాయల్ లోభం తీసుకురావడానికి పూర్తిగా ప్రయత్నం చేస్తుంది. ఒక విద్యార్థి చాలా మంచి నిశ్చయబుద్ధిగా, సేవాధారిగా, అన్నింటిలో మంచిగా ఉంటారు కానీ ముందుకి వెళ్తున్న కొలది ఆ విద్యార్థికి కూడా ఈ రాయల్ లోభం ఎలా వస్తుందంటే – నేను ఇంతగా చేస్తున్నాను, అన్ని విధాల సహాయకారి అవుతున్నాను, తనువు, మనసు, ధనాలతో ఏ సమయంలో కావాలనుకుంటే ఆ సమయంలో హాజరు అయిపోతున్నాను, అయినా కానీ నాపేరు టీచర్ ఎప్పుడూ వర్ణన చేయలేదు, వీరు చాలా మంచి విద్యార్థి అనలేదు అని వస్తుంది. ఒకవేళ ఈ రూపంగా రాకపోతే ఇంకా ఎలా వస్తుందంటే – పేరు వస్తుంది, ఆ పేరు వింటూవింటూ – నేనే అలా ఉన్నాను, నేనే చేస్తాను, నేనే చేయగలను. ఇలా అభిమానరూపంలో వస్తుంది. లేదా మీరు చాలా పనిచేసి వచ్చారు, ఎవరూ మిమ్మల్ని పలకరించలేదు, ఒక గ్లాసు మంచినీళ్ళు కూడా ఇవ్వలేదు, అసలు చూడనేలేదు. వారి విశ్రాంతిలో, వారి పనిలో వారు ఉన్నారు అనుకోండి. అప్పుడు నేను అంత చేసినా కానీ ఎవరూ అడగలేదు, అలాంటప్పుడు చేసినా ఒకటే, చేయకపోయినా ఒకటే, అసలు అడిగేవారే లేరు దీని కంటే హాయిగా ఇంట్లోనే ఉ ండటం మంచిది, ఎప్పుడు కావాలంటే అప్పుడు సేవ చేయవచ్చు ఇలా రకరకాలుగా వికారాల యొక్క రాయల్ రూపం వస్తుంది. ఒక వికారం అయినా అంటే లోభం రాలేదు కానీ అభిమానం వచ్చింది, నన్ను గౌరవించాలి లేదా మాకు విలువ ఉండాలి అనే ఇలాంటి భావన వచ్చింది అంటే ఇలా ఎక్కడైనా ఒక వికారం ఉంటే అక్కడ దాని నలుగురు సహయోగులు గుప్తరూపంలో ఉంటాయి.మరియు మీరు ఆ సమయంలో ఒక దానికి అవకాశం ఇచ్చారంటే గుప్తంగా ఉన్న మిగిలిన వికారాలన్నీ కూడా సమయానుసారంగా తమ అవకాశం తీసుకుంటూ ఉంటాయి.

## ౬౨౦. టీచర్స్ విద్యార్థుల సహయోగం విషయంలో ఏ విధంగా ఉండాలి? మధువనం ప్రోగ్రామ్స్‌లో ఎవర్ని ముందు పెడతారు? దేని ఆధారంగా వారి నెంబర్ తయారౌతుంది?

టీచర్స్‌కు కూడా లోభం వస్తుంది. టీచర్స్‌కి ఏమి కావాలి? సెంటర్ మంచిగా ఉండాలి, బట్టలు ఎలా ఉన్నా కానీ సెంటర్ మాత్రం కొంచెం ఉండటానికి యోగ్యంగా మంచిగా ఉండాలి మరియు తోడుగా ఉండేవారు మంచిగా ఉండాలి, విద్యార్థులు మంచిగా ఉండాలి, బాబా భండారా మంచిగా ఉండాలి అని. ఒకవేళ మంచి విద్యార్థి కొంచెం ఏమైనా మారిపోతే గుండె వేగంగా కొట్టుకుంటుంది. మరలా అనుకుంటారు, ఏమి చేయము, వీరు మంచి సహాయకారి కదా అలాంటి వారు వెళ్ళిపోయారు అని. ఆ జిజ్ఞాసువు సహాయకారియా? లేదా బాబా సహాయకారియా? ఆ సమయంలో ఎవరు కనిపిస్తున్నారు? జిజ్ఞాసువా లేక బాబానా? అంటే ఇలా వచ్చే రాయల్‌మాయ పునాదిని కదపడానికి ప్రయత్నం చేస్తుంది. మీకు సర్వశక్తివంతుడు తోడు ఉన్నారు, అనే నిశ్చయం ఉంటే కనుక ఆ సమయంలో బాబా ఎవరో ఒకరిని నిమిత్తం చేస్తారు. కొందరు మాకు తక్కువలో తక్కువ ఒకసారి అయినా కానీ మౌంట్‌ఆబూ కాన్ఫరెన్స్‌లో అవకాశం లభించాలి, పోని యోగశిబిరంలో అయినా కావాలి, ఈ అవకాశం అయినా ఉండాలి కదా, ఉపన్యాసం చెప్పకపోయినా వేదికపైకి అయినా రావాలి, చివరికి వినాశనం అయిపోయేలా ఉంది కానీ వినాశనం వరకు కూడా మాకు అవకాశం లభించదేమో! మాకు అవకాశం కావాలి కదా! అనుకుంటారు కానీ బాప్‌దాదా ఇంతకు ముందు కూడా చెప్పారు మీరు దానికి యోగ్యమైనవారైతే అవకాశం లభిస్తే సంతోషంగా చేయండి కానీ మాకు కూడా అవకాశం కావాలి అనటం అనేది కూడా అడుక్కోవటం. కావాలి,కావాలి అనటం కూడా రాయల్‌గా అడుక్కోవటం. ఇలా జరగాలి..... మమ్మల్ని ఎవరు గుర్తించటం లేదు, దాదీ, దీదీలు కూడా అందరినీ గుర్తించటం లేదు, ముందు వచ్చిన వారిని ముందు పెట్టేస్తున్నారు, ఇటువంటి సంకల్పాలు రావటం అనేది కూడా సూక్ష్మంగా అడుక్కోవటం. కానీ బాప్‌దాదా చెప్పారు కదా, మీరు వేదికపైకి వచ్చారు, ఏదోక విశేషత కారణంగా, యోగం లేకున్నా కానీ స్థితి మంచిగా లేకపోయినా కానీ వచ్చారు ఎందుకంటే కొందరి వాణీలో మాధుర్యం ఉంటుంది, స్పష్టత ఉంటుంది మరియు గ్రహణశక్తి ఉంటుంది, ఇక్కడి, అక్కడి ఉదాహరణలు అన్నీ సేకరించి చెప్తారు. అందువలన వారికి పేరు కూడా వస్తుంది. ఎవరు కావాలి అంటే ఫలానా వారు కావాలి అంటారు. ఎవరు వచ్చారు అంటే ఫలానా వారు వచ్చారు అంటారు. వారు యోగంలో గట్టిగా లేకపోయినా అవకాశం లభిస్తుంది. కానీ దీని ఆధారంగా నెంబర్ నిర్ణయం అవ్వదు. అంతిమ నెంబర్‌లో–వీరు ఇన్ని ఉపన్యాసాలు చెప్పారు లేదా వీరు ఇంతమంది విద్యార్థులను, ఇన్ని సెంటర్స్‌ని తయారుచేశారు అని చూడరు కానీ ఎంతమందిని యోగ్యంగా తయారుచేశారు? అనేది చూస్తారు. సెంటర్స్ తయారుచేయటం గొప్ప విషయం కాదు ఎంత మంది ఆత్మలను యోగ్యంగా చేసారు? 30 సెంటర్స్‌కి ఇన్‌చార్జి అనే పేరు అయితే ఉంటుంది కానీ 30సెంటర్స్‌లో 15 సెంటర్స్ కదులుతున్నాయి, 15 మంచిగా ఉన్నాయనుకోండి దాని

వలన లాభం ఉందా లేదా కేవలం ఇన్ని సెంటర్స్ ఉన్నాయనే పేరు ఉందా? ఫలానావారికి 30 సెంటర్స్ ఉన్నాయి అనే పేరే ఉంటుంది. కానీ దీని ఆధారంగా నెంబర్ లభించదు. ఎంతమందికి సుఖం ఇచ్చారు, ఎంతగా స్వయం శక్తిశాలిగా ఉన్నారు, దాని ప్రకారం నెంబర్ లభిస్తుంది. అందువలన కావాలి కావాలి అనే దానిని సమాప్తి చేయండి. లేకపోతే యోగం కుదరదు.

### 681. జ్ఞానీ, యోగీ, ధారణ ఆత్మల గుర్తులు తెలుపండి? అన్నింటిలో పాస్ కావాలంటే ఏ యుక్తిని ధారణ చేయాలి?

తెలివైనవారు ఎప్పుడూ మోసపోరు అంటే ఇది జ్ఞాని అయిన వారి గుర్తు. యోగి అయిన వారి గుర్తు ఏమిటంటే సదా స్వచ్ఛంగా, స్పష్టమైన బుద్ధి కలిగి ఉంటారు. స్వచ్ఛంగా కూడా ఉంటారు మరియు స్పష్టంగా కూడా ఉంటారు. తెలియదు, తెలియదు అనే మాట యోగిఆత్మలు మాట్లాడరు. వారి బుద్ధి సదా స్పష్టంగా ఉంటుంది. ధారణా స్వరూపానికి గుర్తు సదా స్వయం కూడా డబల్‌లైట్‌గా ఉంటారు. ఎంత బాధ్యత ఉన్నా కానీ ధారణాస్వరూపులైనవారు సదా డబల్‌లైట్‌గా ఉంటారు, మేళాలో అయినా, అలజడిలో అయినా డబల్‌లైట్‌గా ఉంటారు. మరియు సేవాధారికి గుర్తు – సదా నిమిత్తంగా మరియు నిర్మాణభావంతో ఉంటారు. కనుక ఈ గుర్తులన్నీ మీలో పరిశీలన చేసుకోవాలి. నాలుగు సబ్జక్టుల యొక్క ఈశ్వరీయవిద్యార్థులం అని అంటారు కదా కనుక ఆ గుర్తులు మీలో కనిపించాలి. క్రొత్తవారు ఏమి చేస్తారు? మీ నిశ్చయాన్ని మరింత పక్కా చేసుకోవాలి లేకపోతే రెండు, మూడు సంవత్సరాలు జ్ఞానంలో నడిచి మరలా పాత ప్రపంచంలోకి వెళ్ళిపోతారు. తిరిగి వెళ్ళిపోయినవారు మరలా ఆ ప్రపంచంలో కూడా ఉండలేరు, ఈ ప్రపంచంలో ఉండలేరు. అందువలన మీ పునాదిని చాలా గట్టిగా చేసుకోండి. సర్వశక్తివంతుడైన బాబా మా తోడుగా ఉన్నారు అనేది అనుభవం చేసుకోండి. ఈ ఒక్క విషయం అనుభవం చేసుకుంటే చాలు అన్నింటిలో పాస్ అయిపోతారు.

### 682. ఏ సేవాకేంద్రానికి మార్కులు జమ అవుతాయి? టీచర్స్ అయినా, మధువనం అయినా, మధువనం యొక్క ఉప సేవా కేంద్రాలైనా, గీతా పాఠశాలలైనా, మీ జోన్‌లో ఉప సేవాకేంద్రాలైనా ఏ విషయంపై జాగ్రత్తగా ఉండాలి?

నిర్విఘ్న సేవాకేంద్రంగా ఉండాలి. దానికే మార్కులు లభిస్తాయి. ఈ జోన్‌లో వెయ్యి సెంటర్స్ ఉన్నాయి. వెయ్యి గీతాపాఠశాలలు ఉన్నాయి అని దానికి బాప్‌దాదా సంతోషించటం లేదు. ఈ జోన్‌లో ఏ గొడవలు లేవు, ఎటువంటి ఫిర్యాదులు లేవు అని అంటే అప్పుడు సంతోషిస్తారు. ఎందుకంటే వాస్తవానికి టీచర్ శ్రమ చేస్తున్నారు మరియు గొడవలు కూడా జరుగుతున్నాయి, వాతావరణం అలజడిగా ఉంది అంటే అది సేవ అయ్యిందా? లేదా గొడవ అయ్యిందా? మీరు

ఎందుకు వచ్చారు? బ్రహ్మాకుమారీ, కుమారులుగా ఎందుకు అయ్యారు? గొడవలు పెట్టుకోవడానికా? గొడవలు పెట్టుకోవాలంటే ప్రపంచంలో ఇంకా చాలా స్థానాలు ఉన్నాయి. కావాలంటే బాప్‌దాదా అక్కడి చిరునామా కూడా ఇస్తారు. కానీ బ్రహ్మాకుమారీ, కుమారులుగా అవ్వటం అంటే కలయిక యొక్క మేళా జరుపుకోవాలి కానీ గొడవలు పెట్టుకోకూడదు. ఇప్పుడు మీరు ఇక్కడికి ఏ లక్ష్యంతో వచ్చారు? గొడవల కోసం వచ్చారా? కలయిక జరుపుకోవటం కోసం వస్తే బావుంటుంది కదా! ఎప్పుడైనా కానీ ఏ విద్యార్థి అయినా, టీచర్ అయినా, అవ్వటానికి అందరు విద్యార్థులే కనుక ఎప్పుడు కూడా గొడవ పెట్టకండి. గొడవ పెట్టడం అంటే ఏమి చెప్పను! బాప్‌దాదాకి అయితే అది చెప్పటం కూడా ఇష్టమనిపించటంలేదు. టీచర్ అయినా, మధువనం వారైనా, మధువనం యొక్క ఉపసేవాకేంద్రం వారైనా, గీతాపాఠశాలలవారైనా లేదా మీ జోన్‌లలో ఉపసేవాకేంద్రాలలో వారైనా లేదా కేంద్రాలలో వారైనా బ్రాహ్మణులుగా పిలవబడే వారందరు గొడవలు పెట్టుకుని బ్రాహ్మణుల పేరు పాడు చేయవద్దు, గొడవలు పెట్టుకుంటే క్షత్రియులుగా పిలుచుకోండి. బ్రాహ్మణులు అంటే విజయీ, గొడవలు పెట్టుకుంటే క్షత్రియులు, బ్రాహ్మణులు కాదు.

ఈరోజు ఏ పాఠం పక్కా చేసుకుంటారు? ఏ సంకల్పం చేస్తారు? ప్రతి ఒక్కరు మనసా, వాచా, కర్మణా, సంబంధ సంపర్కాలలో గొడవల నుండి ముక్తులు అవ్వండి. గొడవలు పెట్టుకోకూడదు. ప్రతి రోజు పరిశీలించుకోండి, ఈ వ్యర్థ సంకల్పాలు కూడా గొడవే. ఇది ఇతరులతో జరిగే గొడవ కాదు మీ మనస్సులో జరిగే గొడవ. అయితే అందరు ఏమి సంకల్పం చేస్తారు? ఎలా అవుతారు? చెప్పండి. గొడవల నుండి ముక్తులు అవుతాము అని చెప్పండి. ఎందుకంటే డైమండ్ జూబ్లీ వస్తుంది కదా డైమండ్ జూబ్లీలో గొడవలు పెట్టుకునే వజ్రం కావాలి? మీరు ఇష్టపడతారా? లేదా చాలా అందమైన వజ్రాల మధ్య రెండు, నాలుగు గొడవ గల (కల్తీ) వజ్రాలు ఉంటే ఇష్టపడతారా? ఇష్టపడరు. కానీ దీనికి చాలా సహజవిధి ఉంది, శ్రమ చేయవలసిన అవసరం లేదు. గొడవల నుండి ముక్తి అయ్యే విధి అన్నింటి కంటే సహజం, అదేమిటంటే మొదట స్వయాన్ని గొడవలు నుండి ముక్తులు చేస్కోండి. ఇతరుల వెనుక పడకండి. ఈ విద్యార్థి ఇలా ఉన్నారు, ఈ సహయోగి ఇలా ఉన్నారు, ఈ పరిస్థితి ఇలా ఉంది అని వాటిని చూడకండి. మిమ్మల్ని మీరు గొడవల నుండి ముక్తులు చేస్కోండి. గొడవలు ఉన్నచోట నుండి మీ మనస్సుని, బుద్ధిని వేరు చేస్కోండి. ఈ గొడవ పూర్తి అయిపోతే చాలా మంచిగా అయిపోతుంది, మా సేవ మరియు స్థితి కూడా మంచిగా అయిపోతాయి అని ఆలోచిస్తున్నారు. కానీ గొడవ అనేది పర్వతంతో సమానం. పర్వతానికి తలకొట్టుకుంటే పర్వతం కదులుతుందా? స్వయం వేరు అవ్వండి లేదా ఎగిరేకళతో గొడవ అనే పర్వతం పై నుండి వెళ్ళిపోండి అప్పుడు పర్వతం కూడా మీకు ఒకసారిగా సహజం అనిపిస్తుంది. నేను తయారవ్వాలి అని అనుకోవాలి. నేను గొడవల నుండి ముక్తి అవ్వాలి అని. అమృతవేళ నుండి స్వయంలో సంకల్పం చేస్కోండి. ఇది గొడవల ప్రపంచం కనుక

గొడవలే వస్తాయి. కానీ మీ సేవాకేంద్రమే మీకు ప్రపంచం. మీ ప్రపంచమే అది అయినప్పుడు అక్కడికే వస్తాయి కదా! పేపర్ ఇవ్వడానికి లండన్, అమెరికా వెళ్తారా? సెంటర్‌లోనే ఇస్తారు కదా! కనుక గొడవలు రాకూడదు అని అనుకోకండి. గొడవల నుండి విముక్తులు అవ్వాలి అని అనుకోండి.

### ౬౨౩. సత్యయుగంలో మొదటినెంబర్ ప్రాలబ్ధం ఎవరెవరికి లభిస్తుంది?

సంఖ్యపరంగా చూస్తే సింహాసనం లక్ష్మీనారాయణులు ఇద్దరికే లభిస్తుంది. కానీ లక్ష్మీనారాయణుల యొక్క ఉన్నత కుటుంబంలో 16,108 మంది జన్మ తీసుకుంటారు. వారు లక్ష్మీనారాయణులకి సమీప సంబంధీకులుగా పాత్రను అభినయిస్తారు. కావున వీరు కూడా మొదటినెంబరు ప్రాలబ్ధం పొందే భాగ్యశాలీ ఆత్మలు.

### ౬౨౪. అనారోగ్య సమయంలో దేహానికి మందు వేసుకుంటున్నప్పుడు ఏ స్మృతి ఉండాలి?

శరీరాన్ని నడిపించుకోవడానికి శక్తిని నింపుకుంటున్నాను అనే స్మృతిలో మందు వేసుకుంటే, ఆ మందు రోగాన్ని జ్ఞాపకం చేయదు, సంతోషాన్నిస్తుంది. ఈ శరీరం శివపరమాత్మ సేవకు చాలా అవసరం కనుక విలువైనది అని భావించి మందు వేసుకుంటే కొన్నిరోజుల్లో వ్యాధి నయమైపోతుంది. వ్యాది నయం అయిపోయిన తర్వాత తనువుతో బాబా సేవ చేసి బాబా మనకు చేసిన సహాయానికి ఋణం తీర్చుకోవాలి.

### ౬౨౫. ఆది నుండి ఇప్పటి వరకు బ్రాహ్మణులకు ఉన్న నియమం ఏమిటి?

ఆది నుండి ఇప్పటివరకు బ్రాహ్మణులు లేక బాబా పిల్లలుగా పిలువబడే జ్ఞానీ-యోగీ ఆత్మలకు ఒక నియమం భగవంతుడు నిర్ణయించారు. ఏ పని చేసినా లేక ఏ కార్యం తలపెట్టినా అక్కడ బాబా పేరుపైన సెంటర్స్ క్రొత్తగా నిర్మాణం చేసినా, సాధనాలు సేవకోసం ఉపయోగించుకున్నా, ధనాన్ని సేవలో ఖర్చు పెట్టినా అన్నీ మధ్యస్థంగా ఉండాలి. అనగా,ఎక్కువ ఆడంబరంగా, లగ్జరీగా ఉండకూడదు. అలాగని, పనికిరాని స్థితిలో కూడా ఉండకూడదు. ఇది భగవంతుడు పెట్టిన అనాది నియమాలలో ఒకటి. ఇప్పుడే వారు బాగా ధనవంతులైపోతున్నారనే మాట ఇతరుల నుండి రాకూడదు. ఆవిధంగా కన్పించే కర్మ మీరు చేయకూడదు. అదేవిధంగా వీరెందుకూ పనికిరాని వారని ప్రజల నుండి ఆ మాట రాకూడదు. అనగా సోమరితనం, నిర్లక్ష్యం చోటు చేసుకుని, ఇతరులకు బాబా జ్ఞానం చెప్పకుండా విశ్రాంతిని తీసుకో కూడదని అర్థం.

### ౬౨౬. బ్రహ్మాబాబాకు తపస్యా సమయంలో ఏ విధమైన విఘ్నాలు వచ్చాయి; వాటిపై ఏ విధంగా విజయం పొందారు?

చిత్రాలలో చూపిస్తారు కదా తుఫాను వచ్చేసింది, నీళ్ళు పెరిగిపోయాయి అప్పుడు సర్పం ఛత్రచ్ఛాయగా అయ్యింది అని వారు శ్రీకృష్ణుని గురించి స్థూల విషయం చూపించారు. కానీ

వాస్తవానికి ఇది ఆత్మిక విషయం. ఎవరైతే ఫరిస్తాగా అవుతారో వారి ఎదురుగా ఏ పరిస్థితి వచ్చినా లేదా ఏ విఘ్నం వచ్చినా కానీ బాబా మీ ఛత్రచ్ఛాయగా అయిపోతారు. చేసి చూడండి. ఎందుకంటే మామూలుగా బాప్‌దాదా చెప్పరు. వజ్రోత్సవం జరుపుకుంటున్న పిల్లలు చేతులెత్తండి. బాప్‌దాదా వారితో మాట్లాడుచున్నారు. మీరందరు 14 సంవత్సరాలు యోగం అంటే తపస్సు చేసారు కదా ఎన్ని విఘ్నాలు వచ్చాయి కానీ మీకు ఏమైనా అయ్యిందా? బాప్‌దాదా ఛత్రచ్ఛాయగా అయ్యారు కదా! ఎన్ని పెద్ద పెద్ద విషయాలు జరిగాయి. మొత్తం ప్రపంచం, ముఖ్యమైన వారు, నేతలు, గురువులు అందరు వ్యతిరేకం అయిపోయారు కానీ బ్రహ్మాకుమారీలు ఒక్కరే అచంచలంగా ఉన్నారు. బికారీ జీవితం కూడా ప్రత్యక్షంగా చూశారు. తపస్యా సమయంలో రకరకాల విఘ్నాలు కూడా చూసారు. తుపాకులు, కత్తులు అన్నీ మీదకు వచ్చాయి కానీ బాబా ఛత్రచ్ఛాయగా ఉన్నారు కదా! ఏదైనా నష్టం జరిగిందా? పాకిస్తాన్‌లో ఉన్నప్పుడు అలజడులకు భయపడి జనం అందరు అన్నీ వదిలి పారిపోయారు. కానీ మీ సామాన్లతో టెన్నీస్ కోర్టు నిండిపోయింది. ఎందుకంటే మంచి వస్తువులని ఎలా వదులుతారు, వాటితో ప్రేమ ఉంటుంది కదా! అప్పట్లో సింధ్ నివాసీయులు వ్యతిరేకంగా ఉండేవారు, నిందించేవారు కానీ మరలా వారే సామానులు కూడా ఇచ్చారు. నమస్కారం పెట్టి పెద్ద పెద్ద వస్తువులని మీరు ఉపయోగించుకోండి అని ఇచ్చి వెళ్ళిపోయారు. ప్రపంచం వారికి అలజడిగా ఉంటే బ్రహ్మాకుమారీలకు అయిదురూపాయలకే కూరగాయల బండి ఇచ్చేసేవారు. అయిదురూపాయలకే కూరగాయలన్నీ వచ్చేసేవి. మీరు ఎంత ఆనందంగా కూరలు వండుకుని తినేవారు! ప్రపంచం వారు భయపడుతూ ఉండేవారు మరియు మీరు నాట్యం చేసేవారు. ఇలాప్రత్యక్షంగా చూసారు కదా! బ్రహ్మాబాబా, శివబాబా ఇద్దరూ చత్రచ్ఛాయగా అయ్యి ఎంత రక్షణగా స్థాపనాకార్యం చేశారు! వీరికి అనుభవం అయినప్పుడు మీరు అనుభవం చేసుకోలేరా?

### ౬౨౭. జ్ఞానంలో నడుచుకుంటున్నప్పుడు ఏయే విషయాలు వస్తాయి? వాటిని ఏవిధంగా భావించి ముందుకెళ్ళిపోవాలి?

బ్రాహ్మణులుగా అవ్వటం అంటే మంచిదే మంచిది. కలలో కూడా అనుకోని విషయాలు వస్తాయి. కొన్ని విషయాలు అజ్ఞానకాలంలో కూడా జరగనివి వస్తాయి. ఉదాహరణకి అజ్ఞానంలో ఉన్నప్పుడు వ్యాపారంలో దెబ్బ తినలేదు. జ్ఞానంలోకి వచ్చిన తరువాత వ్యాపారంలో అలజడి వచ్చిందనుకోండి. అయితే జ్ఞానం వదిలేద్దాం అని భయపడుతున్నారు. కానీ ఏ పరిస్థితి వచ్చినా ఆ కొంచెం సమయం దానిని శిక్షకునిగా భావించండి. శిక్షకుడు ఏమి చేస్తాడు? శిక్షణ ఇస్తాడు. అలాగే పరిస్థితి కూడా విశేషంగా మిమ్మల్ని రెండు శక్తుల యొక్క అనుభవీగా చేస్తుంది. 1. సహనశక్తి, అతీత స్థితి, నష్టోమోహ 2. ఎదుర్కొనే శక్తి యొక్క పాఠం చదివిస్తుంది. ఈ పరిస్థితి ఈ రెండు పాఠాలను చదివించడానికి వచ్చింది అని ఆ రెండు పాఠాలను ఇక ముందు కోసం కూడా నేర్చుకోండి. మేము నిమిత్తులం నాది అంటూ ఏదీ లేదు అని అంటున్నారు. మోసం చేయడానికి అనటం లేదు కదా! మనస్సుతో అంటున్నారా? నిమిత్తులేనా? అప్పుడప్పుడు గృహస్థీలుగా, అప్పుడప్పుడు నిమిత్తులుగా అవుతున్నారా?

### ౬౯౮. ఈర్ష్య దేని కారణంగా వస్తుంది?

తోటివారి సఫలతను చూసి ఈర్ష్య వస్తుంది. ఈర్ష్య పోవాలంటే శివబాబా ప్రతీ ఒక్కరిని తన సేవ కోసం ఎన్నుకున్నారు అనే భావన ఉంచుకుని వారిలో విశేషతలను చూడండి. ఈర్ష్య పాపఖాతాలో జమ అవుతుంది. పాపఖాతాల నుండి మిమ్మల్ని మీరు రక్షించుకోండి.

### ౬౯౯. అందరి నోటి నుండి ఏ మాట రావాలి?

ఇంతవరకు బ్రహ్మాకుమారీల అద్భుతం అనే మాట వచ్చింది. కానీ పరంపిత శివ పరమాత్మ దివ్య జ్ఞానం ఇది అనే మాట రావాలి. బ్రహ్మను వేరుచేయటం కాదు కానీ, శివపరమాత్మ శక్తి బ్రహ్మ ద్వారా కార్యం చేయిస్తుందనే గుర్తింపు రావాలి. ఇప్పటి వరకు ఏదొక శక్తి ఉంది అనేటంత వరకు వచ్చారు. ఇది పరమాత్మ కార్యం అని రావాలి. పరమాత్మకు గుర్తింపు వచ్చినప్పుడే డ్రామా సమాప్తి అవుతుంది. ముందు బ్రహ్మాకుమారీ–కుమారులుగా పిలువబడే మీ ద్వారా ఈ విషయం ప్రపంచానికి ఋజువు అవ్వాలి. అప్పుడు ప్రపంచంలో కొంతమంది ఉత్సాహ ఉల్లాసాల్లో ఉన్నవారు, మీ తరఫున బాబా జ్ఞానాన్ని ఋజువు చేస్తారు. వారిని ఆపకండి, వారిని ముందు పెట్టండి. భాగ్యాన్ని కేవలం మీరే తయరుచేసుకోవడం కాదు, వారిని కూడా తయారు చేసుకోనివ్వండి. ఉదాహరణకు – ఇంటి యజమానురాలు, దూరంగా ఉన్న కుళాయి నుండి మంచినీటిని బిందెతో తీసుకు వచ్చి ఇంటిలో పెట్టినప్పుడు, వాటిని తీసుకువచ్చిన ఆమె ఒక్కతే కాకుండా, ఇంటిలోని వారందరు మరియు ఇంటికి వచ్చిన అతిధులకు కూడా ఆ నీటితో దాహం తీర్చి వారిని తృప్తి పరుస్తారు కదా.

### ౭౦౦. ఎవరికి మొత్తం కల్పం యొక్క ప్రాలబ్ధం ఉండదు?

సత్యతాశక్తితో నడిచే మహారథీలే సత్యమైన మహారదీథీలు. పరిస్థితిని చూసి సత్యతను కొంచెం కూడా వదలకూడదు. కొందరు అంటున్నారు. ఏమీ చేయలేదు. కానీ ఒకటి, రెండు మాటలు మాట్లాడేసాము, మనస్పూర్వకంగా అనలేదు. బయటికి అలా అన్నాము అంతే అని అంటారు. కానీ ఇది కూడా సంపూర్ణ సత్యత కాదు. సత్యత గురించి ఎంత సహించవలసి వచ్చినా అది సహించటం కాదు. బయటికి మేము చాలా సహిస్తున్నాము అని అనిపించినా కానీ అది సహనశక్తి రూపంలో మీ ఖాతాలో జమ అయిపోతుంది. కొంచెం అయినా కానీ సహించటంలో బలహీనంగా ఉంటే వారు తప్పనిసరిగా అసత్యం వారి సహాయం తీసుకోవలసి వస్తుంది. వారి సహాయం అందింది. సరైపోయింది అని ఆ సమయంలో అనిపిస్తుంది. కానీ వారి ఖాతాలో సహనశక్తి జమ అవ్వదు. మేము చాలా మంచిగా నడుస్తున్నాము. మాకు చాలా చతురత వచ్చింది అని అనుకుంటున్నారు. కానీ స్వయం యొక్క ఖాతా చూసుకుంటే జమా ఖాతా చాలా తక్కువగా

ఉంటుంది. అందువలన చతురతతో నడవకండి. ఒకరిని చూసి ఒకరు కాపీ చేస్తున్నారు. వీరు ఇలా నడుస్తున్నారు కదా! అందువలన వీరికి చాలా పేరు వచ్చేసింది, చాలా ముందుకు వెళ్ళిపోయారు. కానీ మేము సత్యంగా నడుస్తున్నాము కనుక వెనుక ఉండిపోయాము అని అనుకుంటున్నారు. కానీ అది వెనుక ఉండటం కాదు. ముందుకు వెళ్ళటం. బాబా దృష్టిలో మున్ముందుకి వెళ్తున్నారు. ఇతరులకి వెనుక ఉన్నట్లు కనిపించినా కానీ మీకు పని ఎవరితో ఉంది? బాబాతో ఉందా? లేక ఆత్మలతో ఉందా? (బాబాతో) అయితే బాబా హృదయంలో ముందుకు వెళ్ళటం అంటే మొత్తం కల్పం యొక్క ప్రాలబ్ధంలో ముందుకు వెళ్ళటం. ఒకవేళ ఇక్కడ ముందుకు వెళ్ళటంలో ఆత్మలని కాపీ చేస్తే ఆ సమయంలో పేరు, గౌరవం వస్తుంది, ఉపన్యాసం చెప్పేవారి జాబితాలో ఉంటారు, సెంటర్ సంభాళించే జాబితాలో ఉంటారు కానీ మొత్తం కల్పం యొక్క ప్రాలబ్ధం ఉండదు. దీనినే బాప్‌దాదా అంటారు - శ్రమ చేసారు, బీజం వేసారు, వృక్షాన్ని పెద్దది చేసారు, ఫలం కూడా వచ్చింది. కానీ వచ్చి ఫలం తినేసారు అంటే సదాకాలిక ప్రాలబ్ధం అనే ఫలం సమాప్తి అయిపోయింది. అల్పకాలిక పేరు, గౌరవం కోసం ఒకరినొకరు కాపీ చేయకండి. ఇక్కడ పేరు లేకపోయినా కానీ బాప్‌దాదా హృదయంలో మీ పేరు మొదటి నెంబర్‌లో ఉంటుంది. అందువలన డైమండ్‌గా అవ్వాలంటే ఇవన్నీ పరిశీలించుకోండి. కొంచెం కూడా రాయల్ రూపం యొక్క మచ్చ వజ్రంలో దాగి ఉండకూడదు. సత్యతాశక్తితో దివ్యతను ధారణ చేయండి. ఎంత సహించాల్సి వచ్చినా భయపడకండి.

## ౭౦౧. సత్యమైన దయా భావన ఉంటే వచ్చే ఫలితం ఏమిటి?

సత్యమైన సేవలో నిమిత్త భావన సహజంగా వచ్చేస్తుంది. నిమిత్త భావనే విశ్వం ముందు భగవంతుణ్ణి మన ద్వారా ప్రత్యక్షం చేస్తుంది. దీనినే సత్యమైన దయ అంటారు. కొంతమందికి మోహయుక్తమైన దయ ఉంటుంది. అది ఏమనగా ఏదొక ఆత్మ యొక్క గుణాలకు లేక విశేషతలకు ఆకర్షితమైపోతుంది. కానీ ఆ విశేషతలు, గుణాలు ప్రతీ ఒక్కరికి శివబాబా యిస్తారు యిచ్చినవారి దగ్గర నుండి మీరు తీసుకోవటంలో అది మంచి కార్యం అయినప్పటికి మోహం వచ్చేస్తుంది. ఈ సృష్టిలో అందరికీ ఇచ్చేవారు భగవంతుడు ఒక్కరే! అనే విషయాన్ని గుర్తుంచుకోండి. కాబట్టి అందరూ కలసి ఒక్క భగవంతుని నుండే కావలసినవన్నీ తీసుకోండి. ఉదాహరణకు - మనం ఒక కార్యం తలపెట్టినప్పుడు బాబాకు మనస్ఫూర్తిగా ఆ కార్యం యొక్క వివరణ ఇవ్వాలి. ఆ కార్యం నిస్వార్థమైనదైతే అవసరమైతే బాబా ఎవరో ఒకరి ద్వారా ఆ కార్యానికి సహయోగి అయిపోతారు. ఎవరైతే స్థూలంగా సహయోగి అయ్యారో వారే సహయోగం చేసారని ఆ సమయంలో అనుకుంటాము. ఆ భావన తప్పు. నిరాకారుడు శివబాబా ఆ వ్యక్తి ద్వారా మీకు సహయోగి అయ్యారు, ఇది సత్యం. నిరాకారుడిని మనస్సులో తలచుకుంటూ సాకారీ సహయోగికి గౌరవం ఇవ్వండి. సాకారీ సహయోగిని ఆధారం తీసుకుంటే శివబాబా రెండవవారు అయిపోతారు. అప్పుడు మీరు నంబర్-1 యుగమైన సత్యయుగంలోనికి రావడానికి బదులు నంబర్-2 యుగమైన త్రేతాయుగంలోనికి వెళ్ళిపోతారు. ఇది చాలా చాలా కర్మల గుహ్యగతి.

### 702. ఏ విషయం మనల్ని ప్రాప్తి స్వరూపులుగా అవ్వనీయదు?

పేరు ఆధారంగా సేవ చేసే వారి యొక్క పేరు ఉన్నతపదవిలో అనగా సత్యయుగీ విశ్వమహారాజ పదవిలో వెనుక ఉంటారు. పేరు కావాలని అడుక్కోవటం కూడా అభిమానంలోకి వచ్చేస్తుంది. పేరు కావాలంటే భగవంతుడి పేరును ప్రత్యక్షం చేయండి. ఆత్మల హృదయాల నుండి గౌరవం పొందాలనే భావన ఉంటే మీరు దాత అయినట్లు కాదు. దాత స్వరూపంగా కాకపోతే ప్రాప్తి స్వరూపంగా అవ్వలేరు.

### 703. అసఫలతకి కారణం ఏమిటి?

సఫలం చేసుకోవటమే సఫలతకు ఆధారం. అసఫలం చేసుకున్నారంటే జ్ఞానం మీకు పూర్తిగా అర్థం కానట్లే!. తనువు, మనస్సు, ధనం అన్నింటినీ ఈ సమయంలోనే సఫలం చేసుకోండి అని భగవంతుడు శివబాబా తెలియజేస్తున్నారు. అది మీ మంచి కోసమే. అవి భగవంతునికి అవసరం లేదు. ఈ విషయాలలో సోమరి అయితే అప్రాప్తి, అసఫలత జాబితాలో మీ పేరు ఉంటుంది. కొన్ని నెలల ముందు రైలు రిజర్వేషన్ చేసుకుంటాము. కానీ రైలు వచ్చే సమయానికి వెళ్ళకుండా రైలు మిస్ అయితే ప్రయాణం ఆగిపోతుంది. టికెట్ ధనం నష్టం అవుతుంది. వెళ్ళవలసిన చోటుకు వెళ్ళలేదనే అశాంతి మిగులుతుంది. అదేవిధంగా భగవంతుడు అవతరించి ఈ చిన్న సంగమయుగం యొక్క సమయంలో అన్నీ సఫలం చేసుకుని అసఫలతా జాబితా నుండి సఫలతా జాబితాలోనికి మీ పేరు మార్చుకోండి. ఇదే భగవంతుని యొక్క సత్యమైన సలహా!

### 704. సాకార లోకంలో బ్రాహ్మణాత్మలు చలిస్తుంటే ఎక్కడ ఆ విషయం తెలిసిపోతుంది?

సూక్ష్మవతనంలో తెలుస్తుంది. సూక్ష్మవతనం అనగా సూర్యచంద్ర నక్షత్ర మండలంపైన ప్రకాశవంతమైన ప్రదేశం. అక్కడ ఏవిధమైన స్థూల సాధనాలు ఉండవు, కానీ అక్కడ మన కర్మలన్నీ రికార్డ్ అయిపోతాయి.

### 705. అందరి నోటి నుండి ఏ మాట రావాలి?

మా బాబా వచ్చారు, మా తండ్రి శివబాబా వచ్చారు అనే మాట అందరి నోటి నుండి రావాలి. కేవలం బ్రహ్మకుమారీల బాబా కాదు, మా బాబా వచ్చారు అని నాలుగువైపుల ఉన్న అందరి మనస్సు నుండి ఈ మాట రావాలి. సైన్సు సాధనాలు ఏవైతే ఉన్నాయో ఆ సాధనాలు కూడా ఈ నగాధా మ్రోగిస్తాయి. ఇప్పుడు బ్రహ్మకుమారీలు మంచి పని చేస్తున్నారు అని అంటున్నారు తప్ప, నేను ప్రత్యక్షం కాలేదు అని శివబాబా అంటున్నారు.

## ౭౦౬. వారసత్వానికి ఏ చిన్న విషయం ద్వారా అధికారి అవుతారు?

ఒక్కరోజైనా ఏ ఆత్మ అయితే నా బాబా అని అంగీకరిస్తే చాలు, వారు వారసత్వానికి అధికారి అయిపోయినట్లే. ఇలాంటి వారు యోగం ద్వారా జన్మజన్మల పాపాలను తొలగించుకోలేరు కానీ భగవంతునికి స్నేహి సహయోగి అయిన కారణంగా స్వర్గంలో ఉండే ప్రజా మాలలోకి వచ్చేస్తారు.

## ౭౦౭. సాక్షీ స్థితిలో స్థితులై వుంటే వచ్చే లాభమేంటి?

సాక్షీ స్థితి అంటే అతీత స్థితి. ఈ అనంతమైన డ్రామాలో ప్రతీ కల్పకల్పం ఉన్నది ఉన్నట్లుగా తిరుగుతుందని జ్ఞానం ఆధారంగా తెలుసుకున్నాం, మనం నిమిత్తమై తిరిగి ఆ పాత్రలే అభినయిస్తున్నాం అని అనుకోవటంలో సాక్షీ స్థితి వస్తుంది. సాక్షీ స్థితిలో ఉన్నప్పుడు సమస్యలు తొలగిపోతాయి.

## ౭౦౮. సమర్పణ అంటే ఏమిటి?

లౌకిక జీవితంలో ఉంటూ అలౌకిక కార్యానికి తనువు, మనస్సు, ధనం – వీటిలో ఏ ఒక్కటైనా అర్పితం చేస్తే, బాబా ముందు సమర్పణ అయినట్లే. అలౌకిక జీవితంలో ఉంటూ తనువు, మనస్సు, ధనం, లౌకిక కార్యాలకు ఉపయోగిస్తే సమర్పణ కానట్లు.

## ౭౦౯. ఎవరికైనా బహుమతి ఇచ్చేటప్పుడు అందులో ఏది నిండి ఉండాలి?

ఎవరికైనా బహుమతి ఇచ్చేటప్పుడు అందులో మనస్సు యొక్క నిస్వార్థ స్నేహం నిండి ఉండాలి. భగవంతునికి స్థూలమైన వస్తువులు సమర్పణ చేస్తాం. స్థూల వస్తువులు ఈ లోకంలోనే ఉండిపోతాయి. కానీ దానికంటే ముందు సంకల్పం భగవంతునికి చేరిపోతుంది. సంకల్పం ఆధారంగానే ప్రాప్తి యొక్క ఫలం లభిస్తుంది.

## ౭౧౦. క్రోధం యొక్క సూక్ష్మరూపాన్ని తెలియజేయండి? క్రోధాన్ని జయిస్తే ఏ రెండు అవగుణాలు సహజంగా తొలగిపోతాయి?

క్రోధం జ్ఞానీ ఆత్మలకు మహా శత్రువు. కోపంలోకి వచ్చామంటే అప్పటి వరకు సంపాదించిన ఈశ్వరీయ సంపాదన అంతా కాలిపోతుంది అనగా సమాప్తి అయిపోతుంది. క్రోధం యొక్క సూక్ష్మరూపం ఈర్ష్య, ద్వేషం, అసహ్యం. ఇవి లోలోపల మనస్సును తినేస్తూ ఉంటాయి. క్రోధాన్ని జయిస్తే లోభం, అహంకారం కూడా సమాప్తి అయిపోతాయి. లోభం అంటే కోరిక. కోరిక అంటే కావాలి, కావాలి అనే ఆశ. జ్ఞానీ ఆత్మలకైనా ఏదైనా కోరిక ఉంటే అది కూడా లోభంలో జమ అవుతుంది. క్రోధాన్ని సమాప్తి చేయటం వలన లోభం అనే వికారం స్వతహాగా సమాప్తి అయిపోతుంది, అహంకారం కూడా సమాప్తి అయిపోతుంది. అందుచే శివబాబా లోభం అహంకారాలను జయించమని చెప్పకుండా క్రోధాన్ని జయించమని చెబుతున్నారు. .

### 711. మహారథుల బలహీనతలు చూడవద్దని బాబా ఎందుకు చెబుతారు?

చాలామంది అప్పుడప్పుడు మహారథుల బలహీనతలను చూస్తున్నారు, అనుసరిస్తున్నారు కూడా. ఒకరికొకరు మహారథుల బలహీనతల గురించి వర్ణన చేసుకుంటున్నారు. మహారథి మారిపోతే, మేము కూడా మారిపోతాం అనుకుంటారు. కానీ మహారథులు చేసిన తపస్సు కారణంగా మరియు చాలాకాలం యొక్క పురుషార్థం కారణంగా మధ్యమధ్యలో వారు పరవశించినప్పటికి అదనపు మార్కులు ఇచ్చి"పాస్ విత్ ఆనర్" చేస్తారు బాబా. లోపాలు చూస్తూ నిరీక్షణలో ఉన్నవారు నష్టపోతారు. కాబట్టి దూరదృష్టి బదులు దగ్గరలో ఉన్న మిమ్మల్ని అంటే మీలో ఉన్న బలహీనతను చూసుకోండి మరియు పరివర్తన చేసుకోండి.

### 712. అడ్వాన్స్ పార్టీలోకి ఎవరు వెళ్తారు?

అడ్వాన్స్ పార్టీ అనగా వారు జ్ఞాన యోగాలతో సంపన్నమై శరీరం వదిలేస్తే అడ్వాన్స్ పార్టీలోకి వెళ్ళిపోతారు. అనగా ఎక్కడో మంచి కుటుంబంలో జన్మ తీసుకుంటారు. కానీ స్వర్గం ఇంకా ఈ భూమ్మీద ఇంకా ఆరంభం కాలేని కారణంగా, వారు ఈ లోకంలోనే వేరే జన్మలోకి వెళతారు. వారు ఆ జన్మలో బాబాని మర్చిపోతారు. అయినా కానీ, బాబా వారు బలహీనమై పోతారేమోనని అమృతవేళ తన దివ్య సంకల్పంతో సూక్ష్మవతనానికి ఆహ్వానం చేస్తారు. శరీరం ఎక్కడో ఉంటుంది, ఆత్మ సూక్ష్మవతనంలో ఉన్న ఫరిస్తా శరీరంలో ప్రవేశించి, పునర్జన్మల స్మృతులు జ్ఞాపకం చేసుకుని, శక్తిశాలి యోగం చేసుకుని తెల్లవారేపాటికి మరలా తిరిగి భూలోకంలో ఉన్న శరీరాలలోకి వెళ్ళిపోతారు. అనగా వీరు క్రిందటి జన్మలోనే సంపూర్ణం అయిపోయారు, కానీ స్వర్గం భూమి మీద రావడానికి సమయం ఉన్న కారణంగా, ఆ సమయంలో ఆత్మ పరంధామం వెళ్ళడానికి వీలు లేని కారణంగా ఎక్కడో అక్కడ ఈ భూలోకంలోనే సాంప్రదాయ సంపన్న కుటుంబంలో జన్మ తీసుకుంటారు. కానీ దినమంతటిలో సామాన్య జీవితం గడుపుతున్నా కానీ, అమృతవేళ మాత్రం సూక్ష్మవతనంలో యోగం చేసుకుని తిరిగి పాత్ర అభినయించడానికి శరీరంలోకి వచ్చేస్తారు. శరీరంలోకి వచ్చినప్పుడు అమృతవేళ విషయం మర్చిపోతారు. అమృతవేళ తన ఫరిస్తా శరీరంలో ప్రవేశించినప్పుడు లౌకిక జీవితాన్ని మర్చిపోతుంది. ఇదే భగవంతుని యొక్క విచిత్రమైన ఆత్మలమీద ఉన్న ప్రేమానుభూతులు. వీరు సంకల్ప శక్తి చేత స్వర్గంలో వచ్చే ఆత్మలకు జన్మనివ్వడానికి నిమిత్తం అవుతారు.

### 713. ఒక బ్రాహ్మణ ఆత్మకి వేరొక బ్రాహ్మణ ఆత్మ సహయోగం ఇవ్వాలా లేక దానం ఇవ్వాలా?

సహయోగం ఇవ్వాలి కాని దానం ఇవ్వకూడదు. సహయోగం అనగా పురుషార్థానికి సహాయం చేయటం. దానం ఎవరికి ఇవ్వాలంటే ద్వాపర కలియుగీ ఆత్మలకు అంతిమంలో దృష్టి ద్వారా వరదాని రూపంలో దానం ఇవ్వాలి. దానం పొందిన వారు భక్తులవుతారు. దానం ఇచ్చిన వారు దేవతలవుతారు. కాబట్టి దేవతలకు దేవతలు దానం ఇచ్చుకోరు కదా!

## 714. మనోబలం యొక్క విశేషతలు తెలుపండి?

దాత యొక్క బావనలో రాయల్ ఫ్యామిలీవారు, రాయల్ ప్రజలు తొందరగా తయారైపోతారు. ఈవిధంగా విశ్వమహారాజు అవ్వాలన్న కోరిక పెట్టుకోండి. కేవలం మీ జోన్‌కి, మీ సేవకి, మీ సర్కిల్‌కి రాజు అవ్వటం కాదు, బేహద్‌లోకి వెళ్ళండి. హద్దు విషయాలు స్వతహాగా సమాప్తమైపోయి మనోబలం పెరుగుతుంది. వాణీ మరియు సంబంధ సంపర్కాల సేవలో నిమగ్నమైపోతున్నారు, ఇప్పుడు మనోబలాన్ని పెంచుకోండి. మనోబలం పెంచుకోవడం అనగా ఈ భూగోళం అంతా ఒక బంతి వలె ఉంటుంది, దానిపై కూర్చుని పరంధామంలోనున్న శివపరమాత్మ నుండి ఒక దివ్య అలౌకిక అనంతమైన శక్తిని పొందుతున్నట్లు అనుభవం చేసుకోండి. ఈ స్థితిలో స్థితులై మీరు పొందిన ఆ శక్తి కిరణాలు ఆ భూగోళం అంతా వ్యాపిస్తున్నట్లు అనుభవం చేసుకోండి. ఇదే మనోబలం యొక్క సేవ. వర్తమాన సమయం యొక్క పరిస్థితుల ననుసరించి ఇదే అంతిమ సేవ. దీనినే మనోబలం యొక్క సేవ అంటారు. ఈ సేవలో అందరి చెడు మనస్సులు ఒకే ఒక్క సెకనులో మంచి మనస్సులుగా మారిపోతాయి. దీనిలో ప్రాలబ్ధం అనేక రెట్లు పెరిగిపోతుంది. ఇది కొద్ది సమయం చేసినా కానీ ఎక్కువ సమయం జమ అయిపోతుంది. ఉదాహరణకు – ప్రతీ గ్రామంలో పుస్తకాలు పంచి పెట్టాలంటే కారులో వెళ్ళి ప్రతీ ఇంటికీ ఉచితంగా పంచిపెడతాము. ఈ సేవలో సమయం ఎక్కువ, శారీరక శ్రమ ఎక్కువ పడుతుంది. గగనమార్గం గుండా హెలీకాప్టర్‌లో వెళ్తే తక్కువ సమయం పడుతుంది కదా అదేవిధంగా మనోబలం అంటే హెలీకాప్టర్ సేవ వంటిది.

## 715. ఆదిలో సాక్షాత్కారాలు ఏవిధంగా అయ్యాయి మరియు అంతిమంలో సాక్షాత్కారాలు ఎలా అవుతాయి?

ఆదిలో బ్రహ్మాబాబా ఓం మండలిలో కూర్చుండగానే ఎక్కడో ఉన్నవారికి శ్రీకృష్ణునిగా, ఫరిస్తాగా కనబడి వారిని పాకిస్థాన్‌లో సింద్ హైదరాబాద్‌లో గల ఓం మండలికి వెళ్ళమని ప్రేరణ కలిగేది. కొంతమంది శివ పరమాత్మ జ్యోతి స్వరూపాన్ని సాక్షాత్కారం చేసుకునేవారు. ఆ జ్యోతియే వారిని ఓం మండలికి ఒక కాంతిరూపంలో తీసుకువచ్చి బ్రహ్మాబాబాకు అప్పచెప్పేది. ఈ అద్భుతాలన్నీ శివబాబా యజ్ఞం ఆదిలో బ్రహ్మాబాబా ఒక్కరి ద్వారానే చేయించేవారు. బ్రహ్మాబాబాను పురుషార్థంలో కాపీ చేసే అనన్య పిల్లల ద్వారా తిరిగి ఇటువంటి అద్భుతాలు జరుగుతాయని శివబాబా తెలియజేసారు.

## 716. కాండము యొక్క పని అంటే ఏమిటో తెలపండి?

ఈ సెంటర్ యొక్క బాధ్యత, ఈ జోన్ యొక్క భాద్యత నాది అని అనుకోవటం కాదు. మీరందరు ఒకే దేశానికి రాజుగా అవ్వాలా లేక విశ్వానికి రాజుగా అవ్వాలా? ఎలా అవ్వాలి? ఆది రత్నాలు కనుక విశ్వానికి శక్తినిచ్చేవారిగా అవ్వండి. మాకు 20 సెంటర్‌లు, 30 సెంటర్‌లు లేదా 200

సెంటర్లు అని బుద్ధిలో ఉండకూడదు ఎందుకంటే ఇది కాండం యొక్క పని కాదు. ఈ పని కొమ్మలు రెమ్మల వంటివారు చేస్తారు. మీరయితే కాండం కదా, కాండం నుండే అందరికీ శక్తి అందుతుంది.

**717. అనారోగ్యంతో ఉన్నప్పుడు, శరీరం సహకరించనప్పుడు ఏ శక్తితో సేవ చేయాలి?**

మనస్సు ద్వారా మనసా సేవ చేయాలి. బిందురూపీ శివబాబా నుండి బిందురూపీ ఆత్మనైన నాలో ప్రవాహంలా ఒక శక్తి ప్రవేశిస్తున్నట్లు అనుభవం చేసుకుని, ఆ శక్తిని మొత్తం విశ్వానికి ఇస్తున్నట్లు అనుభవం చేసుకోవాలి. అప్పుడు మీకు సేవలో మార్కులు జమఅవుతాయి, ఆరోగ్యం కూడా బాగుంటుంది.

**718. బేహద్ సేవలో సమయం ఉపయోగించడం వలన ఏవిధమైన సేవ జరుగుతుంది?**

మనల్ని చుట్టుముట్టిన సమస్యలన్నీ తొలగిపోతాయి.

**719. మీ రాజధాని ఎలా తయారవుతుంది?**

మీరు సేవ చేసేటప్పుడు ఒకవేళ ఎవరైనా నిందించినా కానీ, అలజడి చేసినా కానీ ఆ సమయంలో మీరు, ఇముడ్చుకొని, సహించారంటే మీ రాజధాని తయారైపోతుంది. ఇముడ్చుకోవటంలో నష్టం లేదు, లాభమే జరుగుతుంది. ఎందుకంటే ఆ సమయంలో మీకు స్థూలసేవ లేదా వాచా సేవా లేదా సాధనాల ద్వారా సేవ చేసేటప్పుడు ఎవరైనా ఆటంకం కలుగజేస్తే మీరు ఆ విఘ్నాన్ని సహనశక్తితో ఇముడ్చుకుంటే సహనశక్తి అనే ఖాతాలో మార్కులు జమ అయిపోతాయి. ఇది కూడా ఒక సేవే!

**720. వ్యర్థం వ్యతిరేకత సమాప్తి అయితే వచ్చే లాభం ఏమిటి?**

జ) విజయీమాల తయారైపోతుంది మరియు బ్రాహ్మణ పరివారం ద్వారా, శివబాబా ద్వారా ఆశీర్వాదాలు లభిస్తాయి.

**721. ఎవరు ధర్మరాజపురికి వెళ్ళవలసిన అవసరం ఉండదు?**

కలియుగం మహావినాశనం అయిన తర్వాత అనగా సంగమయుగం పూర్తయిపోయిన తర్వాత జ్ఞానీ యోగీ ఆత్మలు, బయటి ఆత్మలందరు, శరీరాన్ని వదలి పరంధామానికి వెళ్ళిపోవాలి. భూలోకాన్ని వదలి పరంధామానికి వెళ్ళే ముందు భగవంతుడు సంగమయుగంలో ఏర్పాటు చేసిన సూక్ష్మవతనంలో ఆత్మలందరినీ ఆపి ముఖ్యంగా జ్ఞానయోగీ ఆత్మలకు ఒక సెకను దృష్టి ఇచ్చి, పాత సంస్కారాలను భస్మం చేసి అప్పుడు పరంధామానికి పంపుతారు. ఈ సూక్ష్మవతనాన్ని ధర్మరాజు పురి అంటారు.

## 722. అన్ని ధర్మాలవారికి జ్ఞానం ఎందుకు తెలయజేయాలి?

ఇప్పుడు ప్రతి వర్గం యొక్క ఒక్కొక్క రత్నాన్ని తయారు చేయండి ఒక వర్గం కూడా మిస్ అవ్వకూడదు. ఎందుకు? ఇప్పుడు అంతిమ సమయం సమీపంగా వస్తుంది కనుక మా వర్గం ఉండిపోయింది అని ఏ వర్గం వారు కూడా నిందించకూడదు. ఒక్కొక్క వర్గంలో విశేష ఆత్మలను తయారుచేయాలి, వారు మైక్‌గా పని చేయాలి, ఎందుకంటే సమయం సమీపంగా వచ్చేకొలదీ అన్ని ధర్మాల వారి, అన్ని వర్గాల వారి నోటినుండి ఒకే ధ్వని వస్తుంది – తండ్రి వచ్చారు అని. ఎందుకంటే ఈ సంగమయుగంలోనే సర్వ ధర్మస్థాపక ఆత్మలకి, అన్ని వర్గాల వారికి బీజం వేయాలి. ఇంత శక్తి వారిలో వచ్చిన తర్వాత మరలా తమతమ సమయాలలో ఆ వర్గం లేక ధర్మం యొక్క స్థాపనకి నిమిత్తం అవుతారు. అన్ని బీజాలు మీరే తయారుచేయాలి. అప్పుడు వారు తమ తమ సమయాలలో ఆయా వర్గాలకు నిమిత్తం అవుతారు. ఎందుకంటే బీజం బాబా మరియు బ్రాహ్మణ ఆత్మలు కాండం, సర్వ ఆత్మలు బీజం మరియు కాండం నుండే వస్తాయి. విదేశీయులు మరియు దేశీయులు ఈవిధమైన పుష్పగుచ్ఛం బాబా దగ్గరకి తీసుకురండి. ఒక్కొక్క ఉదాహరణని తీసుకురండి, వారి ద్వారా అనేకులు స్వతహాగానే వస్తారు. కానీ ఒక్కొక్క పవర్‌ఫుల్ మైక్‌ని తయారుచేయాలి. ఇలా బీజం అనండి లేక ధర్మం లేక వర్గం వారిని ఇలా వెరైటీ పుష్పగుచ్ఛాన్ని తయారుచేయాలి. ఒకరు కూడా మిస్ అవ్వకూడదు అప్పుడే విశ్వకళ్యాణకారి లేదా సర్వాత్మల ఉద్ధరణకి నిమిత్తమైన ఆత్మలు అని అంటారు. ఒక శాఖ కూడా తక్కువ అవ్వకూడదు. అన్ని శాఖలూ కావాలి. మీ క్రొత్త ప్రపంచంలో ఏ వర్గాలు ఉండవు కానీ ఆ ఆత్మలు కూడా ద్వాపరయుగంలో లేక కలియుగంలో స్థాపనకి నిమిత్తం అవుతారు కనుక వారికి కూడా శక్తి మీ నుండే లభించాలి. ఎలా అయితే ధర్మపితలందరు బాబా ప్రత్యక్షత జెండా ఎగరవేయడంలో సహయోగి అవుతారో అదేవిధంగా అన్ని వర్గాల వారు కూడా ప్రత్యక్షతా జెండా ఎగురవేయడంలో సహయోగి అవుతారు. అప్పుడే సర్వుల సహయోగంతో సుఖమయ ప్రపంచం అంటారు. సహయోగి అవుతున్నారు కానీ ఇప్పుడు విశేష ఆత్మలను సహయోగిగా చేయండి.

## 723. శివబాబా దగ్గర ఏ సూక్ష్మ ఆటోమేటిక్ మెషిన్ ఉంది? అది ఎలా పనిచేస్తుంది?

మీ దగ్గర ఏవైతే ఉన్నాయో వాటిని సఫలం చేసుకోండి. బాప్‌దాదాకి అవసరం లేదు కానీ మీ కోసం మీరు జమ చేసుకోండి. బాప్‌దాదా అయితే దాత. సఫలం చేసుకోవటం అంటే జమ చేసుకోవటం ఎందుకంటే బాప్‌దాదా సమయప్రమాణంగా ప్రతి బిడ్డ యొక్క జమాఖాతా చూసారు, ప్రతి ఒక్కరి జమాఖాతా బాబా దగ్గర ఉంది. కనుక జమాఖాతాలో ఏమి చూసారు? కొంతమంది పిల్లలు అనుకుంటున్నారు – మేము చాలా జమ చేసుకున్నాము, అది జమ చేసుకున్నాము, ఇది జమ చేసుకున్నాము అని చాలా వర్ణన చేస్తున్నారు కానీ బాబా యొక్క ఖాతాలో వారు ఎంత భావిస్తున్నారో, ఎంత చెప్తున్నారో దానికంటే తక్కువ జమ అవుతుంది. ఎందుకు? అదే మొదటి

పాఠం – " నేను మరియు నాది" నేను చేసాను, ఇది నా సేవ, ఇది నా కార్యం. కనుక ఇలా జమ చేసుకునే సమయంలో చాలా జమ చేసుకుంటున్నాము అని భావిస్తున్నారు కానీ అది స్వతహాగా జమఖాతా నుండి తొలగి వ్యర్ధఖాతాలో జమ అయిపోతుంది. ఇది ఆటోమేటిక్ సూక్ష్మ మిషనరీ. బాబా చేయించారు, బాబా సేవ, నా సేవ కాదు, నేను చేసాను అని కాదు. నేను ఇది చేసాను, నేను ఇది చేస్తాను ఇలా నేను, నేను అని వర్ణన చేయకండి. బాబా, బాబా అంటే కోటిరెట్లు జమ అవుతుంది. నేను, నాది అంటే అది ట్రాన్స్‌ఫర్ అయ్యి వ్యర్ధఖాతాలో జమ అయిపోతుంది. ఈ ఆటోమేటిక్ మిషనరీ చాలా వేగంగా పని చేస్తుంది. మీకు తెలియదు కూడా. దీని యొక్క పరిశీలన కూడా సత్యమైన మనస్సుతో చేసుకోవాలి. నేను అనే భావానికి అతీతం అయ్యి చేయించేవారు చేయిస్తున్నారు. ఆదిరత్నాలకు ఆదిలో సేవలోకి వచ్చినప్పుడు ఏ భావం ఉండేది? ఏ మాట వచ్చేది? నేను అనే బావం ఉండేదా? బాబా అన్నారు అప్పుడే వారసులుగా అయ్యారు. ఈనాడు సేవకు ఆది అయ్యారు అంటే అది బాబా, బాబా అని అనిన దాని యొక్క ఫలితానికి రుజువు.

### 724. బ్రహ్మాబాబా ఎప్పుడెప్పుడు బేహద్ వైరాగిగా ఉన్నారు?

సమయాన్ని శిక్షకునిగా చేసుకోకండి. అనగా బయటి గవర్నమెంటువారు పరీక్షల తారీఖు నిర్ణయించిన తర్వాత చదువుకోవటం ప్రారంభిస్తే పాస్ అవ్వటం కష్టం అదేవిధంగా అంతిమ వినాశన సమయంలో మనం త్యాగం చేసినా లాభం ఉండదు. బ్రహ్మాబాబా సమయాన్ని శిక్షకునిగా చేసుకోలేదు. ధనాన్ని నాది అని భావించి వ్యక్తిగతంగా ఒక్క రూపాయి కూడా ఉపయోగించుకోలేదు. బోళానాధుడైన శివబాబా బండారా అని భావించేవారు. కన్యలకు, మాతలకు భాద్యత అప్పగించారు. ఎన్నిరకాలుగా ప్రకృతి దాసీ అయినా అనగా ప్రకృతినుండి లభించే వస్తు వైభవాలు ఎగ్రస్టా సాధనాలను ఆయన ఉపయోగించుకోలేదు. ఏ విశేషమైన వస్తువును సేవలో తప్ప స్వయానికి ఉపయోగించుకోలేదు.

### 725. ఇతరులకు శక్తినిచ్చే సేవ ఎప్పుడు చేయలేరు?

బేహద్ వైరాగ్యవృత్తి లేకుండా విశ్వానికి శక్తినిచ్చే సేవ ఎటువంటి పరిస్థితిలోను చేయలేరు.

### 726. ఆఫీస్‌లో పని చేసే మనం ఆ స్థానంలో ఏ స్థితితో ఉండాలి?

ఆఫీస్‌లో పనిచేసే వారందరికి బాస్ ఉంటారు. కానీ నా బాస్ శివబాబా అనే భావన ఉండాలి.

### 727. మనకు ఎప్పుడైనా ఆపద వచ్చినప్పుడు కన్నీళ్ళు వచ్చినప్పుడు వాటిని శివబాబా ఏవిధంగా భావిస్తారు?

మనకు ఆపదలు వచ్చినప్పుడు, మనస్సుతో శివబాబాకు తెలియజేస్తాం. ఆ సమస్య ఆధారంగా కన్నీళ్ళు వస్తాయి. ఆ కన్నీళ్ళను శివబాబా తన హృదయంలో ముత్యాల వలె దాచుకుంటారు

కానీ, ఆ సమయంలో సహయోగం చేయరు. ఎందుకంటే, కర్మల ఖాతా యోగం ద్వారానైనా, భోగం ద్వారానైనా అంటే అనుభవించైనా భస్మం చేసుకోవాలని తెలియజేసారు. కాబట్టి ఆ సమయంలో శివబాబా సహయోగి అవ్వరు, కానీ ఒక్క అడుగు యోగానికి ఉపక్రమించినప్పుడు ఆయన సహయోగి అయిపోయి పెద్ద కష్టం తక్కువ సమయంలో చిన్నదిలా అయిపోతుంది. దేవతలంటే ఇచ్చేవారు కాబట్టి, మనకు ఏవిధమైన ఖాతాలు ఉండకూడదు. అన్ని బాబాకు తెలియజేసి, మన ఖాతాలను మనమే భస్మం చేసుకోవాలని ఉపాయం చెప్తున్నారు.

### 728. పరంధామంలో ఉన్నప్పుడు ఆత్మ ఏ స్థితిలో ఉంటుంది?

ఆలోచనా స్వరూపంగా ఉండదు. అనగా సంకల్ప రహితంగా ఉంటుంది. ఆలోచనా స్వరూపంలో ఉంటే, నేను సంగమయుగంలో భగవంతుడు చెప్పినట్లు నడవలేని కారణంగా స్వర్గంలోకి వెళ్ళకుండా ఇక్కడే ఉండిపోవలసి వచ్చిందని, దు:ఖిస్తుంది. భగవంతుని ప్రక్కన అటువంటి దు:ఖం ఉండకూడదని ఆ పరంధామ స్థానమంతా సంకల్ప రహితంగా ఉంటుంది, ఒక్క శివబాబాకి తప్ప.

### 729. యోగయుక్త మాట అని దేనిని అంటారు?

మాట మధురంగా, శివబాబా సమానంగా, సదా ప్రతీ ఆత్మ పట్ల శుభభావంతో ఉన్నప్పుడు దానిని యోగయుక్త మాట అంటారు.

### 730. ఏది దివ్యగుణం?

సాధారణ మాటలు కూడా మధురంగా మాట్లాడటం, ఇది కూడా దివ్యగుణం.

### 731. గీతాపాఠశాలలు తెరిచేవారు ఎలా ఉండాలి? అందులో ఏ భావన ఉండకూడదు?

గీతాపాఠశాలలు తెరిచేవారు రకరకాల సంకల్పాలతో తెరుస్తున్నారు లేక నడిపిస్తున్నారు. కొందరు సత్యమైన మనస్సుతో సేవ కోసం గీతాపాఠశాలలు తెరుస్తున్నారు కానీ కానీ వృద్ధి అయిన తర్వాత కొందరికి అక్కడక్కడ భావనలు కల్తీ అయిపోతున్నాయి బాప్‌దాదా చూస్తున్నారు – కొంతమంది గీతాపాఠశాలలను తమ కుటుంబపాలన కోసం కూడా తెరుస్తున్నారు, కుటుంబపాలన కూడా అవుతుంది మరియు నిమిత్తంగా సేవ కూడా జరుగుతుంది అని. కానీ గీతాపాఠశాల అంటే నిమిత్తంగా అయ్యి సేవ చేయటం ఎందుకంటే ఏ ఆత్మలైనా కానీ బాబా స్నేహం కారణంగా వస్తారు అందువలన నిమిత్తులై కార్యవ్యవహారాన్ని నడిపించటం చాలా అవసరం. ఒకే ఒక నిస్వార్ధ సేవాభావనతో చేసేవారిదే సత్యమైన గీతాపాఠశాల. బాప్‌దాదా ఇలా శుభభావనతో

గీతాపాఠశాల నడిపించేవారిని చూసి తమ సమయాన్ని సఫలం చేసుకుంటున్నారు అని చాలా సంతోషిస్తున్నారు. అదే శుద్ధ భావనతో డబల్ కార్యాన్ని సంభాళిస్తున్నారు, మరే భావన యొక్క కల్తీ వారిలో లేదు. పేరు యొక్క భావన, లౌకిక కుటుంబ పాలన యొక్క భావన ఏదీ ఉండదు. ఇటువంటి శుద్ధభావన, సేవా భావన గల నిమిత్త ఆత్మలకు బాప్‌దాదా చాలా – చాలా – చాలా శుభాకాంక్షలు ఇస్తున్నారు – మంచిగా ఉన్నారు మరియు మంచిగానే ఉంటారు అని. కానీ పరిశీలించుకోండి – ఏ భావన కలవకూడదు. సేవా భావన తప్ప మరే భావన రానివ్వకూడదు.

**732. కుటుంబంలో ఉంటూ జ్ఞానంలో ఉన్నవారిని చూసి ఇతరులు ఏమనుకుంటారు?**

మేము కూడా మీ వలె కొన్ని నియమాలు పాటించాలా అని అనుకుంటారు. వాస్తవానికి టీచర్స్‌కి ఉండే నియమాలు వేరుగా మరియు విద్యార్థులకు ఉంటే నియమాలు వేరుగా తీసుకోవచ్చు. కుటుంబసభ్యులు అనగా మాతలు కూడా ఈ జ్ఞానంలో ఉండే వారిని చూసి ప్రతీ ఇంటిని కూడా సేవాకేంద్రాలుగా చేసుకోవచ్చని బాబా అంటున్నారు. ఈ జ్ఞానంలో ముఖ్య విషయం మనసా పవిత్రత. అనగా మనస్సులో శివపరమాత్మునితో స్నేహం ఉంటే అదే మనసాపవిత్రత. ఈ ఒక్క నియమం అధారంగా ప్రతీ ఇల్లు శివాలయం చేసుకోవచ్చు.

**733. ఒక నెల ఏవిధమైన భట్టీలు పెట్టుకోమని శివబాబా మనకు ఆజ్ఞ ఇచ్చారు?**

స్వ ఉన్నతిలో సర్వ ఖజానాలు జమ చేసుకోవాలనే భట్టీ పెట్టుకోమని శివపరమాత్మ తెలియజేస్తున్నారు. స్వ ఉన్నతి అనగా ఆత్మ పరివర్తన. ఆత్మ పరివర్తనా భట్టీ. సర్వ ఖజానాలు అనగా శాంతి, సుఖం, ఆనందం, దయ మొదలైనవి. ఈ భట్టీలో అంతర్ముఖిగా అయ్యి మనస్సు యొక్క మౌనంతో పాటు స్థూల మౌనం కూడా పెట్టుకోవటం మంచిది.

**734. ఏవిధమైన మౌనం పెట్టుకోవాలి?**

మనస్సు యొక్క మౌనం. మాటల మౌనం బయటవారు కూడా పెట్టుకుంటున్నారు.

**735. అమృతవేళ ఏ ఆత్మలని శివబాబా కార్యానికి నియమిస్తారు?**

అమృతవేళ ముఖ్యంగా ప్లానింగ్ బుద్ధితో ఉన్న ఆత్మలను శివబాబా తన కార్యానికి నిమిత్తం చేస్తారు. వారికి సేవ యొక్క కొత్త కొత్త పద్ధతులు బుద్ధికి టచ్ అవుతాయి. ప్లానింగ్ బుద్ధి ఆత్మలకు ఈ వరదానం లభించింది. కాబట్టి ఆ కార్యానికి నిమిత్తం అవ్వండి.

**736. ఏ మూడు ఖాతాలను శివబాబా చూస్తున్నారు?**

1. మనకు ఎంత సత్యమైన మనస్సు ఉందో నిస్వార్ధ భావంతో విశ్వకళ్యాణం ఎలా చేస్తున్నారో శివబాబా చూస్తున్నారు. 2. మాటలలో, కర్మలలో యోగయుక్త స్థితి మరియు యుక్తీయుక్త స్థితి ద్వారా సేవ చేసి ఎంత పుణ్యఖాతాను పెంచుకుంటున్నారో చూస్తున్నారు. 3. సేవలో వారికి వారు ఎంత సంతుష్టమయ్యారు, ఇతరులు ఎంత సంతుష్టమయ్యారు. దీని ద్వారా ఇరువురికి పుణ్యఖాతా ఎంత జమ అయ్యిందో బాబా చూస్తున్నారు. ఇలా జ్ఞాన యోగాలతో నిండి ఉన్న ప్రతీ ఆత్మ యొక్క మూడు ఖాతాలు భగవంతుడు ప్రతి సమయం పరిశీలించి దాని ద్వారా మార్కులు జమ చేస్తారు.

**737. మీ ఖజానాలు ఏవిధంగా రక్షింపబడుతున్నాయి?**

మీ ఖజానాలకు నిప్పంటుకోదు. నీటిలో మునగవు, ఎవరూ దొంగిలించలేరు. శాంతి, పవిత్రత, సుఖం, ఆనందం, దయ మొదలైన ఖజానాలు ఈ సంగమయుగంలో తప్ప ఇంకెప్పుడూ లభించవు.

**738. విశ్వానికి మనం ఎప్పుడు ప్రియమవుతాము?**

శివపరమాత్మకు ప్రియంగా ఉంటే మొత్తం విశ్వానికి మంచిగా అనిపిస్తాం.

**739. పురుషార్థం అని దేనిని అంటారు? ఎటువంటి వారితో స్నేహం చేయకూడదు?**

పురుషార్ధం అంటే వ్యర్ధకర్మ ఉండకూడదు. ఎవరిలో అయితే వ్యర్ధ సంకల్పాలు, వ్యర్ధ మాటలు, వ్యర్ధ కర్మలు, వ్యర్ధ సంబంధసంప్రదింపులు ఉంటాయో వారితో స్నేహం చేయకూడదు. మేము వారితో కలవటం లేదు వారే వచ్చి మాతో కలుస్తున్నారు అని మీరంటారు కానీ ఎవరైనా పనికిరాని వస్తువు ఇస్తే తీసుకుంటారా? వ్యర్ధ సంబంధ సంపర్కాలు కూడా ఖాతాని ఖాళీ చేసేస్తాయి. ఇది ఒక సూక్ష్మ లెక్క.

**740. ఇంటి ఖర్చులు వ్యక్తిగత ఖర్చులు తగ్గించుకొని సెంటర్ నడిపితే వచ్చే లాభమేమిటి?**

ఈ పాండవులు మరియు మాతలే సేవ యొక్క స్థాపనలో, ఆదిలో సేవాకేంద్రాలు తెరిచే సమయంలో, బీదజీవితం ఉన్నప్పుడు ఆ బీద జీవితంలో సేవాకేంద్రాలు తెరిచారు. అలాంటి అవసర సమయంలో ఈ సేన తమ తనువు, మనస్సు, ధనాలతో నిమిత్తమై సేవాస్థానాలను స్థాపించారు. అవసర సమయంలో ఎవరైతే సహయోగి అవుతారో వారి 8 అణాలు, 8 కోట్లు అయిపోతాయి. బాప్‌దాదాకి జ్ఞాపకం ఉంది – వారు స్వయం బంధనాలలో ఉంటూ కూడా ఒక గిన్నెతో పిండి, ఒక గిన్నెతో పంచదార, ఒక గిన్నెతో నెయ్యి, ఇలా గిన్నెలు, గిన్నెలు తెచ్చేవారు. అంటే ఎంత సత్యమైన మనసో ఆలోచించండి! తమ ఇంటి ఖర్చుతో బాప్‌దాదా యొక్క సేవాకేంద్రం నడిపించేవారు.

తమ వ్యక్తిగత జమఖాతా నుండి తమ ఖర్చులు తగ్గించుకుని సేవాకేంద్రాలను స్థాపించారు. అంటే వీరికి ఎంత భాగ్యం! ఆవిధంగా సమయానికి సహయోగి అయిన ఆత్మలకు బాప్‌దాదా కూడా నమస్తే చెప్తున్నారు. వీరి అనుభవం చాలా మంచిది, భాగవతం అంతా వీరిదే. అందువలన బాప్‌దాదా సంతోషిస్తున్నారు.

### 741. అంతిమ సంపూర్ణ స్థితి అనగానేమి?

అంతిమ సంపూర్ణస్థితి - దేహంలో ఉంటూ విదేహిస్థితి యొక్క అనుభవం. ఇలా మూడు రకాల స్థితులను చూశారు. పురుషార్థిస్థితిలో ఎక్కువమందిని చూసారు. పురుషార్థానికి ప్రాలబ్ధం - జీవన్ముక్తి, అంతే కానీ సెంటర్‌కి నిమిత్తంగా అవ్వటం లేదా మంచి ఉపన్యాసకులుగా అవ్వటం లేదా డ్రామానుసారం వేర్వేరు విశేషసేవలకి నిమిత్తంగా అవ్వటం.... ఇవి ప్రాలబ్ధం కాదు. ఇవి ముందుకి వెళ్ళడానికి, సర్వుల ద్వారా ఆశీర్వాదాలు పొందడానికి సహాయపడేవి. కానీ ప్రాలబ్ధం అంటే జీవన్ముక్తి. ఏ బంధన ఉండకూడదు.

### 742. ఎవరెవర్ని ఎక్కడెక్కడికి శివబాబా మారుస్తారు? వారు ఏమి వదిలివేయాలి?

మధువనం వారిని సెంటర్‌కి, సెంటర్‌లో ఉండేవారిని మధువనం పంపుతారు. జోనల్ ఇన్‌చార్జిలను, టీచర్లను బాబా సమయప్రమాణంగా సేవాకేంద్రాలను మారుస్తారు. మీ బీరువాలో ఉన్న ధనం, విలువైన వస్తువులు అన్నీ వదిలేసి బాబా చెప్పిన చోటికి వెళ్ళిపోవాలి. ఆత్మ పరంధామం నుండి ఒంటరిగా వచ్చింది తిరిగి ఒంటరిగా బాబా వెంట వెళ్ళిపోతుంది అదేవిధంగా బాబా సేవ కోసం త్యాగం చేశాను, బాబా సేవ పూర్తయినవెంటనే నాది అనేది ఏదీ లేకుండా అన్నీ వదిలి బాబా ఆజ్ఞను పాటించిన వారే సుపుత్రులు, ధైర్యవంతులు. లౌకిక గవర్నమెంట్ వారు కూడా ఉన్నతాధికారులను కూడా బదిలీ చేస్తుంటారు. ఎందుకంటే అక్కడి ప్రజానీకం మరియు ఉద్యోగులు ఇరువురు మోహంలో చిక్కుకుని తమ కర్తవ్యాన్ని మరచిపోతారు కాబట్టి వారిని వేరేస్థానానికి మారుస్తారు. అదేవిధంగా ఇక్కడ భగవంతుని కర్తవ్యం ధర్మస్థాపన. అనగా చెప్పినది మన కర్మలో చేసి ప్రజానీకానికి ఆనందం అనుభవం అయ్యే విధంగా భగవంతుని దగ్గరకు చేర్చటం.

### 743. ఎప్పుడు సూక్ష్మం, స్థూలంలోకి మారిపోతుంది?

సూక్ష్మంగా ఏ అవగుణం ఉన్నా కానీ పరిస్థితి వచ్చినప్పుడు అది స్థూలంలోకి వచ్చేస్తుంది కనుక సంకల్పంలో ఏవిధమైన అపవిత్రత దాగి ఉందో పరిశీలన చేసుకుని తొలగించుకోవాలి. ఏవిధంగా అయితే దొంగతనం చేయాలనే సంకల్పం కలిగిన వ్యక్తికి సమయం, పరిస్థితులు అనుకూలించినప్పుడు దొంగతనం చేసేస్తాడు కదా, అదేవిధంగా అవగుణం ఏదైనా నాలో సూక్ష్మంగా దాగి ఉందేమో అని జాగ్రత్తగా పరిశీలించుకోవాలి.

### 744. ఎవరికి సాధనాలు లభించలేదు?

భగవంతునికి పిల్లలైన తర్వాత త్యాగం ద్వారా సేవలో ముందుకి వెళ్తున్నప్పుడు ఆ సేవావృద్ధి కోసం అనేక సాధనాలు బాబా ద్వారా సమకూరతాయి. వాటిని స్వయం కోసం ఉపయోగించుకోకూడదని బాబా అనేక వాణిల్లో చెప్పారు. స్వ సుఖాల కోసం వాటిని ఉపయోగించుకుని భవిష్య ప్రాప్తిని పోగొట్టుకున్నవారు ఉన్నారు మరికొంతమంది స్వయానికి ఉపయోగించుకోకుండా విశ్వకళ్యాణం కోసం ఉపయోగించి ఎక్కువ ప్రాలబ్ధ జీవితాన్ని పొందుతున్నారు కానీ ఇక్కడ ముఖ్యంగా గమనించవలసిన విషయం – ఏ ఒక్కరికైనా సాధనాలు లభించలేదంటే వారు సేవలోను, స్వ పురుషార్థంలోను సోమరులుగా అయిపోయారని అర్థం.

### 745. బాప్‌దాదా సలహా మనకు ఎప్పుడు అందుతుంది?

ప్రకృతి యొక్క ఆటను చూస్తూ నడవండి, భయపడకండి. మీరు సాధారణమైన వారు కాదు, అలౌకికమైనవారు. సాధారణమైనవారు అలజడిలోకి వస్తారు, భయపడతారు. అలౌకికమైనవారు, మాస్టర్‌సర్వశక్తివంతులు ఆటను చూస్తూ తమ విశ్వకళ్యాణకార్యంలో బిజీగా ఉంటారు. మనస్సు, బుద్ధిని ఖాళీగా ఉంచితే భయపడతారు. మనస్సు, బుద్ధితో లైట్‌హౌస్ అయ్యి ప్రకాశాన్ని వ్యాపింపచేసే కార్యంలో బిజీగా ఉంటే బిజీగా ఉన్న ఆత్మకు భయం అనిపించదు. సాక్షి స్థితి ఉంటుంది. ఒకవేళ ఏదైనా అలజడి వచ్చినా మీ బుద్ధిని సదా స్పష్టంగా ఉంచుకోవాలి, ఎందుకు, ఏమిటి అనే విషయాలతో బుద్ధిని బిజీగా ఉంచకూడదు, నింపి ఉంచకూడదు, ఖాళీగా ఉంచాలి, ఒకే బాబా మరియు నేను ..... ఎప్పుడైతే సమయం అనుసారంగా ఉత్తరాలు లేక టెలిఫోన్, టి.వి. ఏవైతే సాధనాలు ఉన్నాయో వాటి ద్వారా కూడా సందేశం అందని సమయంలో కూడా బాప్‌దాదా యొక్క సలహా మీకు స్పష్టంగా అందుతుంది. కనుక ఈ విజ్ఞాన సాధనాలను ఎప్పుడు ఆధారంగా చేసుకోకండి. ఉపయోగించుకోండి కానీ వాటి ఆధారంగా మీ జీవితాన్ని తయారుచేసుకోకండి. అప్పుడప్పుడు విజ్ఞాన సాధనాలు ఉన్నప్పటికీ ఉపయోగించుకోలేరు. అందువలన శాంతి సాధన ఉంటే ఎక్కడ ఉన్నా కానీ, ఎటువంటి పరిస్థితి అయినా కానీ చాలా త్వరగా మరియు స్పష్టంగా ఉపయోగపడుతుంది. కానీ మీ బుద్ధి యొక్క లైన్ స్పష్టంగా ఉంచుకోవాలి.

### 746. సేవలో యోగయుక్త స్థితి వుంటే వచ్చే లాభమేమిటి? సేవ చేసేటప్పుడు మనకు ప్రాప్తి జమ అవ్వదు - ఎప్పుడు?

మనస్సుని తేలికగా వదిలేయకండి ఎందుకంటే మనస్సు పైకి కనిపించదు కానీ లోపల చాలా మోసం చేస్తుంది. బ్రాహ్మణజీవితం యొక్క ఆంతరంగిక వారసత్వం అయిన సదా సుఖ స్వరూపం, శాంతి స్వరూపం, మనస్సు యొక్క సంతుష్టత వీటిని అనుభవం చేసుకోవడానికి మనసా పవిత్రత కావాలి. బాహ్య సాధనాల ద్వారా లేదా సేవ ద్వారా మిమ్మల్ని మీరు సంతోషం చేసుకోవడం – ఇది కూడా మిమ్మల్ని మీరు మోసం చేసుకోవడం.

బాప్‌దాదా చూస్తున్నారు – అప్పుడప్పుడు పిల్లలు వీటి ఆధారంగా తమని తాము మంచిగా, సంతోషంగా భావించి మోసపోతున్నారు మరియు మోసగిస్తున్నారు కూడా. మోసపోతున్నారు మరియు మోసగిస్తున్నారు ఇది కూడా ఒక గుహ్య రహస్యం. ఏమౌతుందంటే బాబా దాత, దాత యొక్క పిల్లలు మీరు. కనుక సేవ యుక్తీయుక్తంగా చేయకపోయినా, కల్తీ ఉన్నా, కొంచెం స్మృతి మరియు కొంచెం బాహ్యసాధనాలు లేదా సంతోషం ఆధారంగా చేస్తున్నారు, మనస్సుతో చేయడంలేదు, బుద్ధి ఆధారంగా చేస్తున్నారు అయినా కానీ సేవ యొక్క ప్రత్యక్షఫలం లభిస్తుంది, ఎందుకంటే బాబా దాత కనుక. వారు దానిలోనే సంతోషపడతారు – ఓహో! మాకు ఫలం లభించేసింది, మా సేవ మంచిది అని. కానీ అలాంటి వారికి సదాకాలికంగా మనస్సు యొక్క సంతుష్టత ఉండదు మరియు ఆత్మ యోగయుక్త శక్తిశాలి స్మృతి యొక్క అనుభవం చేసుకోలేదు. వీటి నుండి వంచితంగా ఉండిపోతారు. ఏమి లభించకుండా అయితే ఉండదు, ఏదోకటి అయితే లభిస్తుంది కానీ జమ అవ్వదు. సంపాదించుకున్నారు, తినేసారు మరియు సమాప్తి అయిపోయింది. అందువలన ఈ ధ్యాస కూడా ఉంచుకోవాలి. సేవ చాలా బాగా చేస్తున్నారు, ఫలం కూడా మంచిగా వచ్చింది అంటే తినేసారు, సమాప్తి అయిపోతుంది. జమ ఏమయ్యింది? మంచి సేవ చేసారు, మంచి ఫలితం వచ్చింది, ఆ సేవకి ఫలం లభించేసింది, జమ ఏమీ అవ్వలేదు. అందువలన జమ చేసుకునే విధి – మనసా, వాచా, కర్మణాలో పవిత్రత. పునాది – పవిత్రత. సేవలో కూడా పునాది – పవిత్రత. స్వచ్ఛంగా, శుభ్రంగా ఉండాలి. ఏవిధమైన భావం యొక్క కల్తీ ఉండకూడదు. భావంలో కూడా పవిత్రత, భావనలో కూడా పవిత్రత ఉండాలి. హోలీ అంటేనే పవిత్రత అని అర్ధం. అపవిత్రతను కాల్చేయాలి.

## 747. జ్వాలారూపీ తపస్సులో మరియ దాత స్థితిలో లాభమేమిటి?

సమయప్రమాణంగా మనస్సు యొక్క, సంబంధసంపర్కాల యొక్క మిగిలిపోయిన కర్మలఖాతాను జ్వాలా రూపంతో భస్మం చేసుకోండి. సంలగ్నత ఉంది, దీనిలో బాప్‌దాదా కూడా పాస్ చేస్తున్నారు కానీ ఇప్పుడు సంలగ్నతను అగ్ని రూపంలో తీసుకురండి.

విశ్వంలో ఒకవైపు భ్రష్టాచారం, అత్యాచారం యొక్క అగ్ని ఉంటుంది, రెండవవైపు పిల్లలైన మీ యొక్క శక్తిశాలి యోగం అంటే సంలగ్నత యొక్క అగ్ని జ్వాలారూపంలో ఉండ టం అవసరం. ఈ జ్వాలారూపం ఈ భ్రష్టాచారి, అత్యాచారం యొక్క అగ్నిని సమాప్తి చేస్తుంది మరియు సర్వ ఆత్మలకు సహయోగం ఇస్తుంది. మీ యొక్క సంలగ్నత జ్వాలా రూపంగా ఉండాలి అంటే యోగం శక్తిశాలిగా ఉండాలి అప్పుడు ఆ స్మృతి అగ్ని ఆ అగ్నిని సమాప్తి చేస్తుంది. మరియు రెండవవైపు ఆత్మలకు పరమాత్మ సందేశం యొక్క శీతల స్వరూపాన్ని అనుభవం చేయిస్తుంది. బేహద్‌వైరాగ్యవృత్తిని ప్రజ్వలితం చేస్తుంది. ఒకవైపు భస్మం చేస్తుంది, రెండవ వైపు శీతలం కూడా చేస్తుంది. బేహద్‌వైరాగ్యవృత్తి యొక్క అలను వ్యాపింపచేస్తుంది. నాకు యోగం అయితే ఉంది,

బాబా తప్ప ఇంకెవ్వరు లేరు అని పిల్లలు అంటారు, చాలా మంచిది కానీ సమయం అనుసారంగా ఇప్పుడు జ్వాలారూపంగా అవ్వండి. స్మృతిచిహ్నంలో ఏదైతే శక్తుల యొక్క శక్తిరూపం, మహాశక్తిరూపం. సర్వశస్త్రధారి రూపాన్ని చూపించారో ఆ మహాశక్తి రూపాన్ని ఇప్పుడు ప్రత్యక్షం చేయండి. పాండవులైనా, శక్తులైనా అందరూ సాగరం నుండి వెలువడిన జ్ఞాన నదులు, సాగరులు కాదు, నదులు, జ్ఞాన గంగలు. కనుక జ్ఞాన గంగలూ! ఇప్పుడు ఆత్మలకు మీ జ్ఞానం యొక్క శీతలత ద్వారా పాపాల అగ్ని నుండి ముక్తుల్ని చేయండి. వర్తమాన సమయంలో బ్రాహ్మణుల యొక్క కార్యం ఇదే. అన్నింటికంటే ఎక్కువగా బ్రాహ్మణ ఆత్మలైనా, ఇతరులు ఎవరైనా కానీ సంబంధ, సంపర్కంలోకి వస్తారో వారికి మాస్టర్ దాత అయ్యి ఏదోకటి ఇస్తూ వెళ్ళండి. నిస్వార్థంగా అయ్యి సంతోషం ఇవ్వండి, శాంతి ఇవ్వండి, ఆనందం యొక్క అనుభూతి చేయించండి, ప్రేమ యొక్క అనుభూతి చేయించండి. ఇవ్వండి, ఇవ్వటం అంటే స్వతహాగానే తీసుకోవడం, ఎవరు, ఏ రూపంలో, ఏ సమయంలో సంబంధ, సంపర్కంలోకి వచ్చినా ఏదోకటి తీసుకుని వెళ్ళాలి. మాస్టర్ దాత అయిన మీ దగ్గరికి వచ్చినవారు ఖాళీగా వెళ్ళకూడదు.

**748. ఏ విషయాన్ని ఇతరులు అంగీకరిస్తే స్వర్గ ప్రవేశానికి అధికారి అయిపోతారు?**

సంగమయుగంలో ఒక్కరోజులో అయినా శివపరమాత్మయే మా తండ్రి అని అంగీకరిస్తే చాలు స్వర్గ ప్రవేశానికి అధికారులు అయిపోతారు.

**749. అన్నింటికంటే విశేష గుణమేది?**

మనస్సు యొక్క స్వచ్ఛత.

**750. దేనికి మార్కులు జమ అవుతాయి?**

మనం సేవ చేసేటప్పుడు మధ్యలో సాధన అనగా బాబా స్మృతి లేని కారణంగా అలసట యొక్క ప్రభావం మనస్సుపై, శరీరంపై పడుతుంది. మధ్యమధ్యలో గంటకి మూడు నిమిషాలు భగవంతుని స్మృతి చేసి మిగిలిన 57 నిమిషాలలో చేసిన సేవ యొక్క కష్టం సంతోషంలోకి మారిపోతుంది మరియు మనస్సుకి, శరీరానికి కూడా ఆనందం, ఆరోగ్యం అనుభవమౌతుంది కాబట్టి స్మృతి లేకుండా గంటల కొలదీ సేవ చేసి రోజంతా సేవ చేశాం అనుకుంటారు కానీ స్మృతి లేకుండా చేసిన కర్మణా సేవకు చాలా తక్కువ మార్కులు జమ అవుతాయి. ఈ విషయంపై ప్రతి ఒక్కరు తప్పక ధ్యాస పెట్టండి. ఉదా – మనకు దాహం వేసినప్పుడు కొంచెం మంచినీళ్ళు అయినా తాగకపోతే ముందుకి వెళ్ళే కొలదీ ఆ దాహం ఎక్కువైపోయి స్పృహ తప్పి పడిపోతాం అదేవిధంగా మధ్యమధ్యలో స్మృతి అనే నీటిని మధ్యమధ్యలో ఆత్మకు అందిస్తూ ఉండాలి. ఇదే భగవంతుడైన శివపరమాత్మ మనకు ఇచ్చిన సేవావిధానంలో వరదానంలాంటిది.

**751. మనం బాబాని ఏవిధంగా స్మృతి చేయాలి?**

మనం బాబా అనే మాటను ఒక మంత్రంలా కాదు, మనస్పూర్వకంగా నా బాబా అని రావాలి.

**752. సంగమయుగం ఏయే విషయాలకు ఆధారం?**

సత్య, త్రేతాయుగాల్లో శ్రేష్ఠ దేవతా పదవి ద్వారా 21 జన్మలకు ఆధారం. ద్వాపర కలియుగాల్లో అనగా 2500 సం॥రాలలో 63 జన్మలు పూజలందుకునే స్మృతిచిహ్నాంలా తయారవుతాం.

**753. ఎప్పుడు మీరు దాతగా అవ్వలేరు?**

సంగమయుగం అంతిమం వరకు భగవంతుడు ఇచ్చిన ఖజానాలను మీ కోసమే జమ చేసుకుంటూ ఉంటే మీరు దాతగా అవ్వలేరు. ఈ యుగంలో దాతగా అవ్వకపోతే భవిష్యత్తులో వచ్చే శ్రేష్ఠ పదవి మరియు శాశ్వత ప్రాప్తి నుండి వంచితులైపోతారు. దాతగా అవ్వండి మీ దాత గుణం ఇతరుల భాగ్యాన్ని చాలా త్వరత్వరగా తయారుచేస్తుంది. వారే మీకు ప్రజలుగా, భక్తులుగా వస్తారు.

**754. ఎన్ని ఖజానాలు జమ అవ్వాలి? వాటికి వేర్వేరు మార్కులు ఉంటాయా?**

సమయం కూడా ఒక ఖజానా, మాట కూడా ఒక ఖజానా, సంకల్పం కూడా ఒక ఖజానా. ఇలా ప్రతి ఖజానాకు వేర్వేరు మార్కులుంటాయి. అన్ని ఖజానాలకు మార్కులు ఎక్కువ జమ అయినప్పుడు పాస్‌విత్‌ఆనర్ అనగా శిక్షలు లేకుండా పాస్ అవుతారు. ఉదా – లౌకికం వారయితే నాలుగు రకాల వ్యాపారాలు ఉంటే ప్రతి వ్యాపారానికి లాభనష్టాలు చూసుకుంటారు కదా, ఒక్క వ్యాపారంలో నష్టంవచ్చినా మిగిలిన మూడు వ్యాపారాలలో వచ్చిన లాభం అంతా పోతుంది. అదేవిధంగా ఇక్కడ ప్రతి జమ ఖాతాను పరిశీలించుకుంటూ, జమ చేసుకుంటూ పరివర్తన అవ్వండి.

**755. సంకల్పశక్తి యొక్క ప్రభావాన్ని తెలుపుము?**

సంకల్పశక్తి చాలా గొప్పశక్తి, పిల్లలైన మీ దగ్గర ఉన్నది – శ్రేష్ఠసంకల్పశక్తి. సంకల్పాలు అయితే అందరి దగ్గర ఉంటాయి కానీ శ్రేష్ఠశక్తి, శుభభావన, శుభకామన యొక్క సంకల్పశక్తి, మనస్సు, బుద్ధిని ఏకాగ్రం చేసే శక్తి – ఇవి మీ దగ్గరే ఉంటాయి. ఎంత ముందుకు వెళ్తూ ఉంటారో అంతగా ఈ సంకల్పశక్తిని ఎంతగా జమ చేసుకుంటూ ఉంటారు, వ్యర్ధంగా పోగొట్టుకోరు. వ్యర్థంగా పోవటానికి ముఖ్య కారణం – వ్యర్ధసంకల్పాలు. బాప్‌దాదా చూసారు – ఎక్కువమంది పిల్లలలో రోజంతటిలో ఇప్పటికీ వ్యర్థం ఉంది. ఎలా అయితే స్థూల ధనాన్ని పొదుపుగా ఉపయోగించేవారు సదా సంపన్నంగా ఉంటారు మరియు వ్యర్థంగా పోగొట్టుకునేవారు ఎక్కడో అక్కడ మోసపోతారు. అదేవిధంగా శ్రేష్ఠసంకల్పంలో ఎంత శక్తి ఉందంటే దాని ద్వారా మీ

గ్రహణ శక్తి, తరంగాలను అందుకునే శక్తి చాలా పెరుగుతుంది. వైర్‌లెస్, టెలిఫోన్ మొదలైన విజ్ఞాన సాధనాలు ఏవిధంగా పని చేస్తాయో అదేవిధంగా ఈ శుద్ధ సంకల్పాల ఖజానా కూడా కార్యం చేస్తుంది. లండన్‌లో ఉన్న ఏ ఆత్మ యొక్క తరంగాలు అయినా మీకు ఎలా అందుతాయంటే వైర్‌లెస్, టెలిఫోన్, టి.వి. ఇలా చాలా సాధనాలు వచ్చాయి వాటి కంటే కూడా స్పష్టంగా మీరు గ్రహించగలరు. ఏకాగ్రతా శక్తి ద్వారా గ్రహణశక్తి పెరుగుతుంది. ఈ ఆధారాలన్నీ (సాధనాలు) సమాప్తి కానున్నవి ఈ సాధనాలన్నీ దేని ఆధారంగా పని చేస్తాయి? కరెంట్ ఆధారంగా. సుఖ సాధనాలన్నింటిలో ఎక్కువ కరెంట్ ఆధారంగానే పనిచేస్తాయి. మరయితే మీ ఆధ్యాత్మిక ప్రకాశం, ఆత్మిక ప్రకాశం ఈ పని చేయలేవా! దగ్గరవి లేదా దూర తరంగాలను కూడా గ్రహించగలరు. కానీ ఇప్పుడు మనస్సు, బుద్ధి రెండూ ఏకాగ్రం అవ్వాలి. ఏకాగ్రతా శక్తి ద్వారానే గ్రహణ శక్తి పెరుగుతుంది. చాలా అనుభవాలు చేసుకుంటారు. నిస్వార్ధంగా, స్వచ్ఛంగా, స్పష్టంగా సంకల్పం చేయగానే అవి చాలా త్వరగా అనుభవం చేయిస్తాయి. శాంతిశక్తి ముందు విజ్ఞాన శక్తి ఒంగిపోతుంది. విజ్ఞానంలో కూడా ఏదో లోపం ఉంది దానిని తొలగించుకోవాలి అని ఇప్పుడు కూడా భావిస్తున్నారు. అందువలన బాప్‌దాదా మరలా ధ్యాస ఇప్పిస్తున్నారు – ఇదే అంతిమ స్థితి మరియు అంతిమ సేవ. ఈ సంకల్పశక్తి సేవను చాలా తీవ్రం చేస్తుంది. అందువలన సంకల్పశక్తిపై మరింత ధ్యాస పెట్టండి. పొదుపు చేయండి మరియు జమ చేసుకోండి, ఇది చాలా పనికొస్తుంది. ఈ సంకల్పశక్తి ద్వారానే ప్రయోగిగా కాగలరు. విజ్ఞానానికి గొప్పతనం ఎందుకు ఉంది? ప్రయోగంలోకి వస్తుంది కనుకనే విజ్ఞానం మంచిగా పని చేస్తుంది అని అందరు భావిస్తున్నారు. అదేవిధంగా శాంతిశక్తిని ప్రయోగించడానికి ఏకాగ్రతాశక్తి కావాలి. ఏకాగ్రతకి ముఖ్య ఆధారం – మనస్సుని అదుపులో ఉంచుకునే శక్తి. దీని ద్వారా మనోబలం పెరుగుతుంది. మనోబలానికి గొప్ప మహిమ ఉంది. మంత్రతంత్రాల వారు కూడా మనోబలం ద్వారా అల్పకాలిక అద్భుతాలు చూపిస్తారు. కానీ మీది విధిపూర్వకమైనది, మంత్రతంత్రాలు కాదు. మీరు విధిపూర్వకంగా కళ్యాణం యొక్క అద్భుతాన్ని చూపిస్తారు, అదే వారికి వరదానం అయిపోతుంది. సంకల్పశక్తి యొక్క ప్రయోగం ఆత్మలకు వరదానంగా సిద్ధిస్తాయి. కనుక మొదట మనస్సుని అదుపులో ఉంచుకునే నియంత్రణాశక్తి ఉందా అని పరిశీలించుకోండి. విజ్ఞాన శక్తి స్విచ్ ఆన్ చేస్తే సెకనులో పనిచేస్తుంది, ఆఫ్ చేస్తే ఆగిపోతుంది. అదేవిధంగా ఒక సెకనులో మనస్సుని ఎక్కడ కావాలంటే, ఎలా కావాలంటే, ఎంత సమయం కావాలంటే అంత సమయం అదుపు చేయగలుగుతున్నారా? దీని ద్వారా స్వయం కొరకు మరియు సేవ కొరకు కూడా చాలా మంచి, మంచి సిద్ధి రూపాలు కనిపిస్తాయి.

### 756. సేవలో ఏ ధ్వని రావాలి?

ఇప్పటి వరకు చాలా సంవత్సరాలు గడిచిపోయాయి మొత్తం విశ్వంలో ఉన్న ఆత్మలలో కనీసం తక్కువలో తక్కువ 33 కోట్ల ఆత్మలకు భగవంతుడు వచ్చారనే సందేశం అందాలి. వీరి టీచర్

భగవంతుడు, బ్రహ్మాకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయాన్ని నడిపించేవారు స్వయం భగవంతుడు అనే విషయం స్పష్టం అయ్యే వరకు స్థూలంగా నిమిత్తంగా నడిపించే వారి వికర్మలు వినాశనం కావు, పాత ప్రపంచం కూడా వినాశనం అవ్వదు. భగవంతుడైన శివపరమాత్మ ఒక దివ్యవాణిలో ఏమి తెలియజేశారంటే యజ్ఞం యొక్క అంతిమంలో సత్యమైన నిస్వార్థమైన జ్ఞాని యోగి ఆత్మల ద్వారానే ఈ యజ్ఞం సమాప్తి అవుతుందని తెలియజేశారు. వర్తమానం బావుంది అని సంతోషిస్తే అంతిమంలో పదవిని, సాంప్రదాయాన్ని, సాధనాలను పోగొట్టుకుని ఏమీ పొందలేదని మనస్సుని ముక్కముక్కలుగా చేసుకుని అరవవలసి వస్తుంది. జ్ఞానంలో ఉంటూ అజ్ఞానంగా ప్రవర్తించేవారికి భగవంతుడైన శివపరమాత్మ హెచ్చరిక చేస్తున్నారు.

## 757. సమస్యలు ఎందుకు వస్తాయి?

మనస్సు ఏకాగ్రం అవ్వాలని బాప్‌దాదా ఏదైతే అభ్యాసం చెప్పారో దానిని చేయాలి ఎందుకంటే సమస్య అకస్మాత్తుగా వస్తుంది కనుక ఆ సమయంలోనే మనోబలం ఉంటే సమస్య సమాప్తి అయిపోతుంది, సమస్య పాఠం చదివించడానికి నిమిత్తం. రోజంతటిలో ఈ వ్యాయామాన్ని అభ్యసిస్తూ ఉండండి.

## 758. బాబా పరంధామానికి అందరిని ఏవిధంగా తీసుకోని వెళతారు?

ఎలాగైనా కానీ మిమ్మల్ని నేను నాతోపాటు పరంధామానికి తీసుకువెళ్ళాల్సిందే. కొట్టి అయినా సరే, ప్రేమతో అయినా సరే తీసుకువెళ్ళాల్సిందే. అజ్ఞానులను అయితే కొట్టటం ద్వారా (శిక్షించటం) మరియు పిల్లలైన మిమ్మల్ని ప్రేమతో తీసుకువెళ్తాను. అదేవిధంగా బాప్‌దాదా ఇప్పుడు కూడా చెప్తున్నారు – ఏమి చేసి అయినా కానీ మహానాత్మలను ఫరిస్తా రూపంలో ప్రపంచం ముందు ప్రత్యక్షం చేయవలసిందే.

## 759. ఏ విషయంలో మనకు శ్రమ ఉండదు?

పురుషార్థంలో కష్టం ఉంటుంది కానీ వరదానంలో శ్రమ ఉండదు, వరదానాలు ఎప్పుడు లభిస్తాయంటే ఈశ్వరీయ జ్ఞానం ద్వారా ఆత్మల మనస్సుని ఆనందం చేసినప్పుడు మరియు బాబా ఆజ్ఞ ప్రకారం నడిచినప్పుడు శివబాబా నుండి ఆశీర్వాదాలు లభిస్తాయి. ఈ రెండు రకాల ఆశీర్వాదాలు పొందిన బ్రాహ్మణాత్మలు పురుషార్థంలో బలహీనంగా ఉన్నా కానీ, కష్టపడి పురుషార్థం చేసి జమ చేసుకున్న దాని కంటే ఎక్కువ మార్కులు జమ అవుతాయి.

## 760. సంకల్పశక్తి ఎప్పుడు పెరుగుతుంది?

అన్నీ లభిస్తున్నప్పటికీ త్యాగం చేయగలడాన్నే త్యాగం అని అంటారు. సమయానుసారం లేదా సమస్యల అనుసారం త్యాగం చేయడాన్ని శ్రేష్ఠ త్యాగం అని అనరు. ఆది నుండి చూడండి –

తనువు, మనస్సు, ధనం, సంబంధాలు సర్వప్రాప్తులు ఉన్నప్పటికీ త్యాగం చేసారు. శరీరాన్ని కూడా త్యాగం చేసారు. అన్ని సాధనాలు ఉన్నప్పటికీ స్వయం పాతవాటిలోనే ఉన్నారు. సాధనాలు ప్రారంభమయినప్పటికీ సాధనలో స్థిరంగా ఉన్నారు. బ్రహ్మాబాబా యొక్క ఈ తపస్సు పిల్లలైన మీ భాగ్యంగా తయారు చేసింది. డ్రామానుసారం త్యాగానికి ఉదాహరణగా బ్రహ్మాబాబాయే నిమిత్తమయ్యారు. మరియు ఈ త్యాగమే సంకల్పశక్తి ద్వారా సేవ చేసే విశేష పాత్రనిచ్చింది. క్రొత్త, క్రొత్త పిల్లలు సంకల్పశక్తి ద్వారా తీవ్ర వృద్ధిని పొందుతూ ఉన్నారు.

**761. అడ్వాన్స్ పార్టీ బాబాను ఏవిధంగా అడుగుతున్నారు?**

మేమందరం తయారైపోయాము క్రొత్త సృష్టి యొక్క 9 లక్షల ఆత్మలకు సంకల్పశక్తిచే జన్మ ఇవ్వటానికి మేమందరం తయారుగా ఉన్నామని ఎడ్వాన్స్‌పార్టీ వారు శివబాబాకి చెప్తున్నారు.

**762. ఎప్పుడు బ్రహ్మాబాబాను అనుసరించాలి? ఏ స్థితిలో శివబాబాను అనుసరించాలి?**

కర్మలో బ్రహ్మాబాబాను, స్థితిలో నిరాకారి శివబాబాను అనుసరించాలి.

**763. బాబా మనకు ఏవిధమైన మాలీష్ చేస్తారు?**

మీరు బుద్ధితో, శరీరంతో అలసిపోయినప్పుడు శివతండ్రి మనకు మాలిష్ చేస్తారు అనగా ఇంతకుముందు వాణీలో కూడా చెప్పబడింది – మధ్యమధ్యలో కొన్ని సెకనులు కానీ, నిమిషాలు కానీ తీసి స్మృతి చేస్తే భగవంతుని శక్తి మాలిష్ రూపంలో ఆత్మకి మరియు శరీరానికి అందుతుంది. ప్రయోగం చేసి చూడండి మీకే అనుభవం అవుతుంది.

**764. కోపం వచ్చినప్పుడు మన మనస్సులో ఏ స్మృతి రావాలి?**

మనస్సులో నా మధురమైన బాబా, నా మధురమైన బాబా అని అనేకసార్లు అనుకోవాలి అప్పుడు బాబాలో ఉన్న మధురత మనలో నిండుతుంది.

**765. సైన్స్ బాబా సేవలో ఎప్పుడు ఉపయోగపడుతుంది?**

సైన్స్ వారు ఇంత శ్రమ చేస్తున్నారు. చాలా శ్రమ చేస్తున్నారు కదా! అందరికంటే ఎక్కువ లాభం బ్రాహ్మణులకు లభించాలి కదా! సంగమయుగం ప్రారంభం అయినప్పటి నుండే ఈ సైన్స్ సాధనాలు కూడా పెరుగుతున్నాయి. సత్యయుగంలో దేవతారూపంలో ఉన్న మీకు ఈ విజ్ఞానం సేవ చేస్తుంది. కానీ సంగమయుగంలో కూడా సైన్స్ సాధనాలు బ్రాహ్మణులైన మీకు లభిస్తున్నాయి. మరియు సేవలో, బాబా ప్రత్యక్షతలో కూడా ఈ సైన్స్ సాధనాలు చాలా విశాలరూపంతో సహయోగి అవుతాయి.

## 766. 108 మాల ఎప్పుడు తయారౌతుంది?

సంబంధ సంపర్కాల వారి నుండి ఏవైతే ఆశీర్వాదాలు లభించాలో అవి ఇప్పటి వరకు లభించలేదు. పురుషార్ధం ఎంతగా చేసినా కానీ, పురుషార్ధం మంచిగా ఉన్నా కానీ పురుషార్ధంతో పాటు ఆశీర్వాదాల ఖాతా జమ అవ్వకపోతే దాత స్థితి, దయా హృదయం యొక్క స్థితి అనుభవం అవ్వవు. కనుక స్వ పురుషార్ధం మరియు వెనువెంట బాప్‌దాదా యొక్క పరివారంలో చిన్నవారి, పెద్దవారి యొక్క ఆశీర్వాదాలు కూడా లభించాలి. ఆశీర్వాదాలు పొందటం అంటే పుణ్యఖాతాను జమ చేసుకోవటం. దీనికి కూడా అదనపు మార్కులు వస్తాయి. సేవ ఎంతైనా చేయండి, సంలగ్నతతో సేవలో ముందుకి వెళ్ళండి కానీ సేవతో పాటు నిర్మానత మరియు కలుపుగోలు స్వభావం వీటి ద్వారా పుణ్యఖాతాను జమ చేసుకోవటం చాలా చాలా అవసరం. బాప్‌దాదా పిల్లలందరిలో ఈ విశేషతను చూడాలనుకుంటున్నారు. ఆ తర్వాత, నేను చాలా చేశాను, నేను ఇది చేశాను, అది చేశాను కానీ వెనుక నెంబరు ఎందుకు వచ్చింది? అని అనకండి. అందువలన బాప్‌దాదా ముందుగానే సైగ చేస్తున్నారు - వర్తమాన సమయంలో ఈ పుణ్యఖాతాను చాలా చాలా జమ చేస్కోండి. వీరు ఇలాగే ఉంటారు, వీరు మారరు అని అనకండి. ప్రకృతిని మార్చగలుగుతున్నప్పుడు, ప్రకృతిని సర్దుకోగలుగుతున్నప్పుడు బ్రాహ్మణాత్మను సర్దుకోలేరా? వ్యతిరేకతను సర్దుకోండి. నిర్మాణం మరియు నిర్మానం యొక్క సమానత ఇదే.

## 767. అడ్వాన్స్ పార్టీ ఏ కర్మకు నిమిత్తమవుతుంది?

ఎడ్వాన్స్ పార్టీ యొక్క పాత్ర ఇప్పటి వరకు గుప్తంగా ఉంది, వారు ఏమి చేస్తున్నారు? అని మీరు అనుకుంటున్నారు కదా! సంపూర్ణంగా అయి దివ్య జన్మ ద్వారా కొత్త సృష్టికి నిమిత్తం అవ్వండి అని వారు మిమ్మల్ని ఆహ్వానిస్తున్నారు. అందరు తమ పాత్రతో ఆనందంగా ఉన్నారు. మేము సంగమయుగం నుండి వచ్చాము అని మాత్రం స్మృతిలేదు. దివ్యత, పవిత్రత, పరమాత్మ యొక్క సంలగ్నత ఉంటుంది కానీ జ్ఞానం పూర్తిగా ప్రత్యక్షంగా ఉండదు. అతీత స్థితిలో ఉంటారు కానీ ఒకవేళ జ్ఞానం కనుక ప్రత్యక్షం అయిపోతే అందరు పరుగు పెట్టుకుని మధువనానికి వచ్చేస్తారు కదా! వీరి పాత్ర అతీతమైనది, జ్ఞానం యొక్క శక్తి ఉంటుంది, శక్తి తక్కువ అవ్వలేదు. నిరంతరం మర్యాదాపూర్వక ఇంటి వాతావరణం, తల్లి, తండ్రుల నుండి సంతుష్టత మరియు స్థూల సాధనాలన్నీ కూడా వారికి ప్రాప్తించాయి. మర్యాదలో చాలా పక్కాగా ఉంటారు. నెంబరువారీగా ఉంటారు కానీ విశేషాత్మలు పక్కాగా ఉన్నారు. మా పూర్వ జన్మ లేదా పునర్జన్మ గొప్పగా ఉండి ఉంటుంది మరియు ఉంటుంది అని అనుకుంటారు. ఎక్కువమంది యొక్క ముఖ కవళికలు కూడా రాయల్ ఫ్యామిలీ యొక్క తృప్తి ఆత్మలుగా, సంపన్న ఆత్మలుగా, హర్షిత ఆత్మలుగా మరియు దివ్య గుణాలతో సంపన్న ఆత్మలుగా కనిపిస్తాయి. ఇదీ వీరి చరిత్ర. కానీ వతనంలో ఏమి జరిగింది? హోలీ ఎలా జరుపుకున్నారు ? మీరు చూసే ఉంటారు, హోలీలో రకరకాల రంగులను పళ్లాలతో నింపి ఉ

ంచుతారు. అలాగే వతనంలో కూడా చాలా ప్రకాశవంతమైన రంగుల వజ్రాలు మెరుస్తూ ఉన్నాయి, కానీ అవి బరువుగా లేవు, రంగుపొడిని చేతిలోకి తీసుకుంటే అది తేలిగ్గా ఉంటుంది కదా అదేవిధంగా అనేక రంగురంగుల వజ్రాలు పళ్లాలలో నిండి ఉన్నాయి. వారందరు వచ్చినప్పుడు వతనంలో ఏ స్వరూపంలో ఉంటారో తెలుసా? తేలికైన ప్రకాశమయ శరీరంతో మెరుస్తూ ఉంటారు. బాప్‌దాదా అందరినీ తమ తమ సంగమయుగి శరీరంలోకి ప్రత్యక్షం చేసారు. అలా వారు సంగమయుగి శరీరంలోకి ప్రవేశించగానే ఒకరినొకరు కలుసుకోవటం ప్రారంభించారు. ఎడ్వాన్స్ పార్టీ యొక్క జన్మలోని విషయాలు మరిచిపోయారు, సంగమయుగి విషయాలలోకి వచ్చేసారు. ఇలా పరస్పరం సంగమయుగీ విషయాలు చెప్పుకుంటూ ఉంటే ఎంత సంతోషంలోకి వచ్చేస్తారో తెలుసు కదా! చాలా సంతోషంలో ఒకరికొకరు చర్చించుకుంటున్నారు. వీరు చాలా మజాలోకి వచ్చేసారు, సరే కలుసుకోనివ్వండి అని బాప్‌దాదా చూసి అనుకున్నారు.పరస్పరంలో తమ జీవిత కథలను ఒకరికొకరు చెప్పుకుంటున్నారు. బాబా ఇలా చెప్పారు, బాబా నాకు ఇంత ప్రేమ ఇచ్చారు. శిక్షణ నిచ్చారు, బాబా ఇలా చెప్పారు, ఇలా బాబా – బాబా, బాబా – బాబా.... ఇదే మాట్లాడుకుంటున్నారు.

### 768. మన పొరపాట్లను బాబాకు ఏవిధంగా తెలియజేయాలి?

సత్యమైన మనస్సుతో, అనుభూతితో (పశ్చాత్తాపం) బాప్‌దాదా ముందు చెప్పండి. పొరపాటు అయిపోయింది అని చెప్పేశాను, అవును నా వలన పొరపాటు జరిగింది, ఇలా ఏదో ఆజ్ఞాపించినట్లు చెప్పటం కాదు. అనుభూతి శక్తితో, సత్యమైన మనస్సుతో బాబాకి చెప్పండి. బుద్ధితో కాదు, మనస్సుతో చెప్పండి. మనస్సుతో బాబా ముందు పశ్చాత్తాప పడితే మనస్సు ఖాళీ అయిపోతుంది, మురికి సమాప్తి అయిపోతుంది. విషయాలు పెద్దవేమీ కాదు, చిన్నవే కానీ మీ మనస్సులో ఇలాంటి చిన్న చిన్న విషయాలు ప్రోగవుతూ ఉంటే వాటితో మీ మనస్సు నిండిపోతుంది. ఇక ఖాళీ ఉండదు కదా! మనస్సు ఖాళీగా లేకపోతే మనోభిరాముడు ఎక్కడ కూర్చుంటారు! కూర్చోవడానికి స్థలం ఉండాలి కదా! కనుక సత్యమైన మనస్సుకి యజమాని రాజీ అవుతారు. నేను ఎలా ఉన్నా, ఏవిధంగా ఉన్నా నీవాడిని అని అంటారు. నెంబర్‌వారీగా ఉండవలసిందే అని బాప్‌దాదాకి కూడా తెలుసు. అందువలన బాప్‌దాదా ఆ దృష్టితో మిమ్మల్ని చూడరు. కానీ సత్యమైన మనస్సు ఉండాలి మరియు రెండవది – బుద్ధి లైన్ సదా క్లియర్‌గా ఉండాలి, లైన్‌లో భంగపాటు ఉండకూడదు, కట్ అవ్వకూడదు. బాప్‌దాదా ఒక్కొక్కసారి అదనపు శక్తినివ్వాలి, ఆశీర్వాదాలు ఇవ్వాలి, సహాయంఇవ్వాలి అనుకుంటారు కానీ ఒకవేళ లైన్‌లో భంగపాటు ఉంటే అది లభించదు. లైన్ స్పష్టంగా, స్వచ్ఛంగా లేకుండా కట్ అయిపోతూ ఉంటే బాబా నుండి లభించవలసిన ప్రాప్తి లభించదు. కొంత మంది పిల్లలు అంటున్నారు, కొంతమంది అనటం లేదు కానీ అనుకుంటున్నారు – కొన్ని కొన్ని ఆత్మలకు చాలా సహయోగం లభిస్తుంది, బ్రాహ్మణుల

సహయోగం కూడా లభిస్తుంది, పెద్దవారి సహయోగం కూడా లభిస్తుంది, బాప్‌దాదా సహయోగం కూడా లభిస్తుంది కానీ మాకు తక్కువ లభిస్తుంది అంటున్నారు. కారణం ఏమిటి? బాబా అయితే దాత, సాగరుడు ఎవరు ఎంత తీసుకోవాలనుకుంటే అంత తీసుకోవచ్చు. బాబా ఖజానాకి తాళం లేదు, కాపలాదారి ఎవరూ లేరు. బాబా అనగానే అన్నీ హాజరైపోతాయి. బాబా అనండి మరియు తీసుకోండి, దాత కదా! దాత కూడా మరియు సాగరుడు కూడా! ఇక ఏమి లోటు ఉంటుంది? కానీ ఈ రెండు విషయాలు ఉండాలి - సత్యమైన మనస్సు, స్వచ్ఛమైన హృదయం.

### 769. ఈజీ సంస్కారం నేర్చుకోవడం వలన వచ్చే లాభాలు ఏమిటి?

ఎటువంటి సమయమో, ఎటువంటి వ్యక్తియో, ఎటువంటి పరిస్థితియో అలా వారిని పరిశీలిస్తూ మిమ్మల్ని మీరు ఈజీ చేసుకోవటమే ఈజీ సంస్కారం. అఫీషియల్ (హోదా) గా ఉండటం మంచిదే కానీ టూమచ్‌గా (అతిగా) ఉండకూడదు.

### 770. బ్రాహ్మణ ఆత్మలు శివపరమాత్మ స్మృతి ద్వారా ఏ భాగ్యాన్ని పొందుతారు?

బ్రాహ్మణ ఆత్మలు శివపరమాత్మ స్మృతి ద్వారా కోట్ల సంపాదన చేసుకోవచ్చు. కోట్లు అనగా ధనం కాదు, అవైతే బయటివారి దగ్గర కూడా ఉన్నాయి. భగవంతుడు ఇచ్చే భాగ్యం కోటానుకోట్లు సంపాదించుకున్నప్పుడు ప్రతి జన్మకు అది విడదీయరాని నీడలా వెంటాడుతూ ఉంటుంది కనుక ప్రతిరోజు ఎన్ని కోట్ల ప్రాప్తిని శివబాబా నుండి పొందారో మీలో మీరు పరిశీలించుకోండి.

### 771. శివబాబా ఎక్కడెక్కడ చక్రం త్రిప్పుతారు? బ్రహ్మాబాబా చిత్రం గురించి శివబాబా ఏవిధంగా తెలియచేసారు?

ప్రతి ఒక్క సెంటర్‌లో, ప్రతి ఒక్క ప్రవృతి స్థానంలో అక్కడ ఇక్కడ బ్రహ్మాబాబా చిత్రాలు చాలా పెట్టి ఉన్నాయి. అవ్యక్త బాబా యొక్క చిత్రాలైనా లేదా బ్రహ్మాబాబా యొక్క చిత్రాలైనా నలువైపుల చిత్రాలే చిత్రాలు కనిపిస్తున్నాయి. మంచి విషయం. కానీ చిత్రాన్ని చూసి చరిత్ర జ్ఞాపకం వస్తుంది కదా! అని బాప్‌దాదా అనుకుంటున్నారు. లేక రావటం లేదా? కేవలం చిత్రాన్నే చూస్తున్నారా? చిత్రాన్ని చూసి ప్రేరణ అయితే వస్తుంది కదా! అయితే బాప్‌దాదా మరేమీ చెప్పటంలేదు, కేవలం ఒకే మాట చెప్తున్నారు - అనుసరించండి చాలు. ఆలోచించకండి, ఇది కాదు అది చేద్దాం, ఇలా కాదు అలా చేద్దాం, అలా కాదు ఇలా చేద్దాం ఇలా ఎక్కువ ప్లాన్స్ తయారుచేయకండి. బాబా ఏదైతే చేసారో దానిని అనుసరించాలి అంతే. అనుసరించటం రావటం లేదా! ఈనాటి వైజ్ఞానికులు ఫోటోస్టాట్ మిషన్‌ని తయారుచేశారు కదా! ఇక్కడ ఫోటోస్టాట్ మిషన్ ఉంది కదా? బ్రహ్మాబాబా యొక్క చిత్రం పెట్టుకుంటున్నారు. భలేపెట్టుకోండి, బాగా పెట్టుకోండి, పెద్దపెద్దవి పెట్టుకోండి కానీ ఆ ఫోటోని అనుసరించటం అయినా చేయండి.

## 772. మాయ అంతిమంలో ఏయే రూపాలలో వస్తుంది?

సెంటర్స్‌లో విషయాలు మారవు, సెంటర్స్ మారవు, స్థానం మారదు, ఆత్మలు మారరు కానీ మనం మారాలి. ముందు మాయ మనల్ని వంగింపచేస్తుంది తర్వాత మాయే మన ముందు తల వంచుతుంది. స్వమానంలో ఉండాలి అనగా ఆత్మాభిమాని స్థితిలో ఉండి ఇతరాత్మలకు గౌరవాన్ని ఇవ్వండి దీనినే సన్మానం చేయటమే సన్మానం పొందటం అంటారు. ఇదే సన్మానం యొక్క స్వమానం యొక్క, తండ్రి సంబంధం యొక్క సూక్ష్మఅర్థం అంతేకానీ పైపైకి చూపించే సన్మానాలు అనగా ధనం ఖర్చుచేసి వస్త్రాలతో అలంకరించుకోవటం బ్రాహ్మణాత్మలకు శోభించదు అలా స్థూలంగా సన్మానం చేయించుకుంటే అప్పటి వరకు ఉన్న ప్రాప్తి సమాప్తి అయిపోతుంది. ఆకలేస్తుంది కదా అని పచ్చిగా ఉన్న ఫలాన్ని తింటే రుచి యొక్క పసందు అనుభవం అవ్వదు. ఈ అలవాటే ముగ్గిన ఫలాన్ని తిననివ్వదు.

## 773. ఇతరులను మనం ఎలా పరివర్తన చేయాలి?

ఈరోజులలో ప్రపంచంలో అయినా, బ్రాహ్మణ ప్రపంచంలో అయినా ప్రతి ఒక్కరికీ ధైర్యం మరియు సత్యమైన ప్రేమ అవసరం, పై, పై ప్రేమ, స్వార్థ ప్రేమ కాదు.

1. సత్యమైన ప్రేమ మరియు 2. ధైర్యం కావాలి. ఎవరైనా కానీ సంస్కారానికి వశమై, పరవశమై 95% పొరపాటు చేసి, 5% మంచి చేస్తే మీరు మీరు ఆ 5% మంచిని తీసుకుని మొదట వారిలో ధైర్యాన్ని నింపండి. ఇది చాలా మంచిగా చేసారు అని ధైర్యం ఇవ్వండి. ఆ తర్వాత ఈ విషయం సరిచేస్కోండి అని చెప్తే వారు ఫీల్ అవ్వరు. అంతే కానీ మీరు ఇది ఎందుకు చేసారు, ఇలా ఎవరైనా చేస్తారా, ఇలా చేయకూడదు, ఇలా చెప్తే వారు మొదటే తెలియకుండానే సంస్కారానికి వశం అయ్యి ఉన్నారు, బలహీనంగా ఉన్నారు కనుక నీరసం అయిపోతారు, ఉన్నతి చేసుకోలేరు. కనుక 5% మంచికి ధైర్యం ఇవ్వండి. ఈ విషయం మీలో మంచిగా ఉంది, ఇది మీరు చాలా మంచిగా చేయగలరు అని అనండి ఆ తర్వాత వారి సమయం మరియు స్వరూపం తెలుసుకుని విషయం చెప్తే పరివర్తన అయిపోతారు. ధైర్యం ఇవ్వండి ఎందుకంటే పరవశం అయిన ఆత్మలో ధైర్యం ఉండదు. బాబా మిమ్మల్ని ఎలా పరివర్తన చేసారు? మీ యొక్క లోపాలు వినిపించారా, మీరు వికారీలు, మీరు మురికివారు... అని అన్నారా? మీరు ఆత్మ అని స్మృతి ఇప్పించారు మరియు ఈ శ్రేష్టస్మృతితో మీలో సమర్థత వచ్చింది, పరివర్తన చేసుకున్నారు. ధైర్యంతో స్మృతి ఇప్పించండి. స్మృతి అనేది సమర్థతను స్వతహాగానే ఇప్పిస్తుంది.

**774. ప్రపంచంలో వారందరికీ శివబాబా నుండి ఈ సంగమయుగంలో ఎంతెంత ప్రాలబ్ధం జమ అవుతుంది? పూర్తిగా వివరించండి?**

ఈరోజు మీరు అర్పణ చేసారు, రేపే వినాశనం అయిపోతే మీవి సఫలం అయినట్లా లేక వ్యర్థం అయినట్లా? వాటిని సేవలో ఉపయోగించలేదు అంటే సఫలం అయినట్లా? మీరు ఎవరి కోసం సఫలం చేసుకున్నారు? బాప్‌దాదా దగ్గర సఫలం చేసుకున్నారు కదా! బాప్‌దాదా అయితే అవినాశి, వినాశనం అవ్వరు. అవినాశి బాబా దగ్గర, అవినాశి ఖాతాలో ఈరోజు మీరు జమ చేసుకున్నారు, ఒక గంట ముందే జమ చేసుకున్నారు అయినా కానీ అవినాశి బాబా దగ్గర మీ ఖాతా ఒకటికి కోటానుకోట్లరెట్లు జమ అయిపోతుంది. ఒకటికి కోటానుకోట్ల రెట్లు ఇవ్వడానికి బాబా బంధించబడి ఉన్నారు. బాబా అయితే వెళ్ళిపోరు కదా! పాత సృష్టి మాత్రమే వినాశనం అవుతుంది కదా! కానీ మీరు మనస్ఫూర్తిగా చేయాలి. కష్టంగా చేసిన దానికి లేక ఒకరిని చూసి పోటీగా చేసిన దానికి మాత్రం పూర్తిగా లభించదు. లభించటం అయితే తప్పక లభిస్తుంది. ఎందుకంటే దాతకి ఇచ్చారు కనుక లభిస్తుంది కానీ పూర్తిగా లభించదు.

**775. వినాశనం గురించి శివబాబా మనకు ఏవిధంగా తెలియచేసారు?**

వినాశనం గురించి శివబాబా ఒక గంట ముందు కూడా చెప్పరు. ఇప్పుడు సమయం అకస్మాత్తుగా సమాప్తి అవుతుంది. అకస్మాత్తుగా జరగకపోతే అది పరిక్ష ఎలా అవుతుంది? కొంతమంది సంగమయుగం యొక్క ఆయుష్షు 100 సంవత్సరాలు అని చెప్పారు కానీ అది భగవంతుడు చెప్పిన విషయంగా గుర్తుంచుకోరు ఎందుకంటే అనేక వాణీలలో భగవంతుడు ఫలానా తారీఖున, ఫలానా చోట, ఫలానా సమయంలో, ఫలానా విధి ద్వారా వినాశనం అవుతుందని ఎక్కడా చెప్పలేదు ఎందుకంటే వినాశనం ఆధారంగా పరివర్తన అయితే మార్కులు జమ అవ్వవు. పరిక్షాపేపర్ ముందుగా తెలిసిపోతే అందరు పాస్ అయిపోతారు కదా! అది న్యాయం కాదు కదా! కష్టపడి చదువుకున్న విద్యార్థికి, సోమరిగా తిరిగే విద్యార్థికి పేపర్‌లో వచ్చే ప్రశ్నలు ముందుగా తెలిసిపోతే ఆ స్థానంలో న్యాయం జరగనట్లే కదా! ఈ లోకం యొక్క లౌకికమర్యాదలే అంత బలంగా ఉన్నప్పుడు అలౌకిక భగవంతుని యొక్క మర్యాదలు ఎంత బలంగా ఉండాలి? కనుక జాగ్రత్తగా నడుచుకోండి.

**776. శివబాబా మన ద్వారా ఎందుకు ప్రత్యక్షం అవుతారు?**

ఒక జ్యోతిస్వరూపం సాక్షాత్కారమైతే ఇతరులకు ఆ స్వరూపం భగవంతుడిదని తెలియదు కదా! ముఖ్యంగా ద్వాపర, కలియుగాలలో వచ్చే ఆత్మలకు భగవంతుని పిల్లలుగా పరిగణింపబడుతున్న మనలో శివబాబా కనిపిస్తారు అసలు కారణమిది మరియు భగవంతుడు భాగ్యవిధాత కనుక

మనకు భాగ్యాన్ని ఇవ్వటంకోసం మన ద్వారా చేయిస్తారు. ఏవిధంగా అయితే భక్తులు దేవతా విగ్రహాల ద్వారా భగవంతుడిని చూడగలుగుతారో అదేవిధంగా అంతిమంలో చైతన్య దేవతలైన మన ద్వారా భగవంతుడుని చూడగలుగుతారు. ఇది మన అదృష్టంగా భావించి శివపరమాత్మ ఆజ్ఞ ప్రకారం నడుచుకోవాలి.

### ౭౭౭. విశ్వపరివర్తన ఎందుకు ఆగివుంది?

జ్ఞానీ, యోగీ ఆత్మల పాత స్వభావ, సంస్కారాలు దైవీ సంస్కారాల రూపంలో పరివర్తన అయ్యేంతవరకు ఆగి ఉంది. ఏవిధంగా అయితే ఒక వాహనం పూర్తిగా తయారయ్యే వరకు అమ్మకానికి షోరూమ్‌లో పెట్టరు కదా అదేవిధంగా మనం యదార్థంగా భగవంతుని యొక్క శక్తులు, ప్రాప్తులు పొందకపోతే పొందేవరకు వినాశనం, విశ్వ పరివర్తన ఆగి ఉంటుంది కానీ తప్పక పొందుతాము సమయానుసారం.

### ౭౭౮. సాధనాలకంటే ముందుగా బాబా దగ్గరకు ఏది చేరుతుంది?

సాధనాలు సాకారరూపంలో ఒక చోట నుండి మరొక చోటుకి పంపవలసి ఉంటుంది, సంకల్పం ఒకేసారి పరంధామంలో ఉన్న శివపరమాత్మ దగ్గరకు చేరుకుంటుంది అది కూడా మనస్సుతో చేస్తేనే చేరుతుంది, పైపైకి చూపించడానికి చేస్తే ఆ సంకల్పం భగవంతుని దగ్గరకు చేరదు, ప్రాప్తి కూడా రాదు.

### ౭౭౯. శివబాబాని మహిమ చేయకుండా, ప్రజలు బ్రహ్మాకుమారీ, కుమారులను ఎందుకు మహిమ చేస్తున్నారు?

జ. సేవానిమిత్తం ఎక్కడికి వెళ్ళినా కానీ ఫరిస్తా రూపం యొక్క సాక్షాత్కారం అవ్వాలి. ఈ దేవత ఎవరు? వీరు మాకు ఒక సెకను శాంతి యొక్క అనుభవం చేయించారు, సుఖం యొక్క అనుభవం చేయించారు.... వీటి ద్వారానే సాక్షాత్కారాలు ప్రారంభమవుతాయి. ప్రతీ విషయంలో బాబా, బాబా, బాబా అని అనాలి. నేను అనేది తీసుకురాకండి. అప్పుడు సాక్షాత్కారాలు ప్రారంభమవుతాయి. ఈ నాది అనే భావన రావటం వలన ప్రజలు బ్రహ్మాకుమారీల యొక్క మహిమ చేస్తున్నారు. బాబా యొక్క మహిమ తక్కువ చేస్తున్నారు.

### ౭౮౦. సెంటర్లు పెరగటం మంచి విషయమే కానీ, ఇంకా మనం ఏయే విషయాలపై ధ్యాస పెట్టాలి?

శక్తుల యొక్క సహయోగం ఇవ్వండి. శక్తుల ద్వారా పాలన ఇవ్వండి. శక్తులను పెంచండి. ఎక్కువ వాదనలు చేసి శిక్షణలు ఇవ్వకండి. శక్తినివ్వండి. వారి యొక్క బలహీనతలు చూడకండి. వారిలో ఏ విశేషత లేదా శక్తి లోపంగా ఉందో అది నింపుతూ వెళ్ళండి. ఈరోజుల్లో నిమిత్తఆత్మలు

ఈ పాలనకి నిమిత్తం అయ్యే అవసరం ఉంది. జిజ్ఞాసువులు పెరగటం, సెంటర్లు పెరగటం అనేది సాధారణ విషయం కానీ ప్రతీ ఆత్మను బాబా యొక్క సహాయం ద్వారా శక్తిశాలిగా తయారుచేయాలి. ఇప్పుడు ఇది అవసరం ఉంది. సేవ అయితే అందరు చేస్తున్నారు, సేవ చేయకుండా ఉండలేకపోతున్నారు కానీ సేవలో శక్తిస్వరూపం యొక్క వైబ్రేషన్స్ ఆత్మలకు అనుభవమవ్వాలి. శక్తిశాలి సేవ చేయాలి. సాధారణ సేవ అయితే ఈరోజుల్లో ప్రపంచంలో చాలామంది చేస్తున్నారు. కానీ మీ విశేషత ఏమిటంటే శక్తిశాలి సేవ చేయాలి. బ్రాహ్మణాత్మలకు కూడా శక్తి యొక్క పాలన అవసరం ఉంది.

### 781. మనకు ఇతరుల నుండి ఆశీర్వాదాలు ఎప్పుడు లభిస్తాయి. దాని వలన మనకు లాభమేమిటి?

ఆశీర్వాదాలు అనేవి చేతితో దీవించినట్లుగా ఉండాలి. ఎవరికి మనం దు:ఖం ఇవ్వకుండా ఉండాలి, ఇతరులకు దు:ఖం ఎప్పుడు వస్తుందంటే మనం ఏ విషయంలోనైనా మోసం చేసినప్పుడు. మనం మంచిగా ఉన్నా ఇతరులు మనల్ని మోసం చేసి దు:ఖం ఇస్తారు అటువంటి సమయంలో మన మనస్సు అలజడి అవ్వకుండా ఏదోక జన్మలో నేను మోసం చేసి ఉంటాను ఆ చెడు కర్మ యొక్క ఫలం వీరి ద్వారా తీరిపోతుందనే సంతోషంలో ఉన్నప్పుడు అనగా వెనుకటి జన్మల కర్మలఖాతా తీరిపోతుంది అనే సంతోషం ఉన్నప్పుడు మనకు దు:ఖం రాదు. ఒకవేళ మనకు ఖాతా లేదు అయినా వారి స్వభావం ఇతరులను అలా నిందిస్తూనే ఉంటారు ఆ సమయంలో ఆ నిందను తీసుకోకుండా ఉంటే మనం వర్తమాన సమయంలో తెలిసీ, తెలియక చేసిన సూక్ష్మపాపం ఎవరైతే మనకు దు:ఖాన్నిచ్చారో వారి ఖాతాలో జమ అయిపోతుంది మనకు ఏవిధమైన పాపం ఉండదు మనం దు:ఖ పడకుండా ఉంటే దు:ఖం ఇచ్చిన వారికి పాపం తయారవ్వదు, కొంత సమయం తర్వాత వారు పశ్చాత్తాప పడి మీకు సహయోగి అయిపోతారు ఇది శివబాబా మీకిచ్చే వరదానం లేదా గ్యారంటీ. మనం దు:ఖం ఇవ్వకూడదు, దు:ఖం తీసుకోకూడదు. ఈ ఒక్క నియమం ఆధారంగా ఆశీర్వాదాలు వస్తాయి. ఇలా జ్ఞానంలో ఉన్నా, లేకపోయినా ప్రతి ఒక్కరు విధిగా మీ ఇంట్లో ప్రయోగం చేసి చూడండి అప్పుడు మీ ఇల్లు ఆశ్రమంలా తయారైపోతుంది.

### 782. మీ వద్దకు కొంచెం క్రోధం, లోభం, మోహం, అభిమానం పొరపాటున వచ్చినా కానీ వాటిని తిరిగి ఎవ్వరికి ఇవ్వాలి?

శివబాబాకే అర్పణ చేయాలి. శివలింగంపై అనేక ఆకులు వేస్తారు కదా అది సూక్ష్మంగా దీనికే గుర్తు. ఉదాహరణకు సముద్రం చాలా విశాలమైనది ఎక్కడెక్కడి నుండో వచ్చే చెత్త చెదారం సముద్రంలో కలిసిపోతుంది. ఈ కాలుష్యాన్ని కలుపుకోవటం వలన సముద్రమేమీ కాలుష్యం అవ్వదు కదా! అదేవిధంగా సముద్రం కంటే విశాలమైన శివపరమాత్మకు మన అవగుణాలను మనస్సుతో తెలిపి అర్పణ చేసేయాలి.

**783. వి.ఐ.పి ల సేవ గురించి శివబాబా ఏమి తెలియజేసారు?**

కొన్ని సెంటర్స్‌లో వి.ఐ.పి సేవ చాలా చేస్తున్నారు కానీ విద్యార్థుల యొక్క పాలన తక్కువ చేస్తున్నారు అందువలన విద్యార్థులు పెరగటం లేదు. వారికి ఉత్సాహ, ఉల్లాసాలను ఇచ్చి సేవ అప్పచెప్పాలి. క్లాస్ విద్యార్థులు ఎంత పెరుగుతారో అంతగా రాజధాని త్వరగా తయారవుతుంది.

**784. బ్రాహ్మణ జీవితంలో రమణీయత ఎప్పుడు ఉండదు?**

సంపన్నంగా, సంపూర్ణంగా అయ్యేటందుకు సహజవిధి – మనస్ఫూర్వకమైన స్నేహం. ఎవరు ఎంత జ్ఞానీగా ఉన్నా కానీ ఒకవేళ మనస్ఫూర్వకమైన స్నేహం లేకపోతే బ్రాహ్మణజీవితంలో రమణీయత ఉండదు. కేవలం జ్ఞానిగా ఉండి స్నేహం లేకపోతే శ్రమ చేయవలసి వస్తుంది. జ్ఞానమనేది బీజం, స్నేహమనేది నీరు. శివబాబా నుండి స్నేహం పొందటంతో పాటు పరివారంతో నుండి కూడా స్నేహం యొక్క సహయోగం ఉండాలి. శివబాబా స్వర్గంలోకి రారు, పరివారం మాత్రమే మీ వెంట వస్తుంది కనుక ధర్మంతో పాటు రాజ్యం కూడా స్థాపన అవుతుంది కనుక ప్రతి ఒక్కరితో మనస్ఫూర్వకమైన స్నేహం చేయటమే రాజధాని స్థాపన కావటం.

**785. శివబాబా సంస్కారాలు ఏవి?**

విశ్వకళ్యాణం, శుభ భావన, శుభ కామన. భగవంతుని నామం సదాశివ. సదా అనగా నిరంతరం శివ అనగా శుభాన్నిచ్చువాడు. భగవంతుడు ఎవరికీ ఎప్పుడు అశుభం ఇవ్వరు.

**786. పవిత్రత యొక్క గుప్త రహస్యం తెలుపుము?**

కేవలం బ్రహ్మచర్య వ్రతం పవిత్రత కాదు అది పునాది లాంటిది, ఆహారం అనగా పరమాత్మ స్మృతిలో తయారుచేసుకుని పరమాత్మ స్మృతిలో స్వీకరించాలి. విహారంలో అనగా వ్యవహారికంలో నమ్రత, మధురత, నిరాడంబరత కలిగి ఉండాలి. సంసారంలో అనగా భగవంతుడిని కూడా ఒక జీవిత భాగస్వామిగా చేసుకుని తనువు, మనస్సు, ధనం ఆయన యజ్ఞంలో ఉపయోగించుకోవాలి, సంస్కారంలో అనగా దైవీ సంస్కారాలు తప్ప చెడు సంస్కారాలు నామమాత్రంగా కూడా ఉండకూడదు. పై అన్ని విషయాలలో పవిత్రత ఉంటేనే సంపూర్ణ పవిత్రత. లౌకిక జీవితంలో ఆరోగ్యము, ఆనందము, ఐశ్వర్యము వీటిలో ఏది లోపించినా శాంతి ఉండదు కదా! అదేవిధంగా పైన చెప్పిన పవిత్రతలో ఏది లోపించినా సంపూర్ణం అవ్వలేము.

**787. ఒక నెలలో బాబా సమానంగా అవ్వాలంటే ఏ స్లోగన్ జ్ఞాపకం ఉంచుకోవాలి?**

దు:ఖం ఇవ్వకండి, దు:ఖం తీసుకోకండి. ఇలా ఒక నెల చేస్తే మీ జీవితం సుఖవంతంగా , బాబా సమానంగా అయిపోతుంది.

**౭౮౮. ఎటువంటి రోజు రానున్నది?**

అందరి నోటి నుండి శివతండ్రి వచ్చేసారు, శివతండ్రి వచ్చేసారు అనే మాట వచ్చే రోజు రానున్నది. మీరు బాబాని విశ్వం ముందు ప్రత్యక్షం చేసినా, చేయకపోయినా డ్రామాలో భగవంతుడు స్వయంగా ఆ విషయం యొక్క ప్రత్యక్షతను ఆయనే రచించేసుకున్నారు మనం చేయటానికే సమయం ఇచ్చారు. మనం చేస్తే మనం పొందుతాము.

**౭౮౯. సేవా ప్లాన్స్‌లో రావల్సిన సఫలత ఎందుకు రావటంలేదు?**

సేవ మరియు స్వ ఉన్నతి రెండు వెనువెంట లేకపోతే సేవలో సఫలత రాదు.

**౭౯౦. శివబాబా సద్గురువు పాత్రలోకి వస్తే ఏవిధమైన విధి నిర్వర్తింపబడుతుంది?**

శివబాబా సద్గురువు పాత్రలోకి వచ్చినప్పుడు ఈ డ్రామా సమాప్తి అయిపోతుంది.

**౭౯౧. బ్రాహ్మణుల సంఘటనకి ఆధారం ఏమిటి?**

ఆత్మికప్రేమ.

**౭౯౨. కృతి అనగానేమి?**

కృతి అనగా కర్మలో సదా ప్రతి ఆత్మకు సుఖం ఇవ్వటం. ఎవరు మిమ్మల్ని నిందించినా, మీకు దు:ఖం ఇచ్చినా మీరు ఫీల్ అవ్వకండి. మీ కర్తవ్యాన్ని మర్చిపోకండి. సహనశీలతా శక్తిలో ఎంత శక్తి ఉందంటే నిందించేవారు కూడా మీకు దగ్గరైపోతారు.

**౭౯౩. ఇప్పుడు ప్రపంచంలో బ్రహ్మకుమారీల ద్వారా ఎవరు కనిపిస్తున్నారు?**

ప్రపంచంలో ఇప్పుడు బ్రహ్మకుమారీలు కనిపిస్తున్నారు. బ్రహ్మకుమారీలు బాగా మాట్లాడుతారు అని పొగుడుతున్నారు కానీ బ్రహ్మకుమారీలను మర్చిపోయి తయారుచేసిన తండ్రి ఎంత మంచివాడు, గొప్పవాడు అనేది చూడాలి అప్పుడే విశ్వపరివర్తన జరుగుతుంది. మా ద్వారానే శివబాబా కనిపించాలనే ప్లాన్ తయారుచేసుకోండి.

**౭౯౪. మీ గురించి ఎవరు చెప్పాలి?**

భగవంతుడు వచ్చేసారు, భగవంతుడు అందరివాడు అంటూ మీరు ఇతరులకు చెప్తారు కానీ వారు దానిని సాధారణంగా భావిస్తారు. అందువలన మీ గురించి ఇతరులు చెప్పాలి. అధికారం కలిగివారు కూడా మీ గురించి చెప్పాలి. వారు మొదట మిమ్మల్ని శివశక్తి స్వరూపంగా గ్రహించాలి అప్పుడు మీ ద్వారా తండ్రి ప్రత్యక్షమవుతారు. ఇలా మధ్యవర్తులను తయారుచేయండి. శివతండ్రి వచ్చేసారు అనే మాట అందరి నోటి నుండి రావాలి.

**౭౨౫. ఏ సెంటర్ ఫలీభూతం అవుతుంది?**

మాతలు ఉన్న సెంటర్. మాతలు ఏ సెంటర్‌లో ఉంటే ఆ సెంటర్ ఫలీభూతం అవుతుంది ఎందుకంటే వారి హృదయం విశాలంగా ఉంటుంది, భావన కూడా చాలా విశాలంగా ఉంటుంది వారు తీవ్రపురుషార్థం ద్వారా తీవ్రశక్తిని సంపాదించుకోలేకపోయినప్పటికీ బాబా వీరి విశాల హృదయానికి, విశాల భావనకు రాజీ అయిపోతారు.

**౭౨౬. అంతిమ సమయం అనేది ఎవరెవరికి వస్తుంది?**

యువకులకైనా, వృద్ధులకైనా, ఆరోగ్యవంతులకైనా, రోగులకైనా, ధనవంతులకైనా, పేదవారికైనా ఎవరికైనా ఎప్పుడైనా, ఎక్కడైనా మరణమనే అంతిమ సమయం రావచ్చు. అదే సత్యయుగమైతే ప్రతి ఒక్కరు 150 సంవత్సరాలు పూర్తిగా జీవిస్తారు. ఈ విషయాలు జయించాలంటే మధ్యమధ్యలో అశరీరి స్థితిని అనుభవం చేసుకోండి. అశరీరి స్థితి అనగా నేను పవిత్ర ఆత్మను, నేను శాంత స్వరూప ఆత్మను, నేను శివశక్తి స్వరూప ఆత్మను ఇలా ఆత్మ యొక్క దివ్యగుణాల అనుభూతి అశరీరిగా తయారుచేస్తుంది. ఇలా చాలా కాలం యొక్క అభ్యాసం ఫరిస్తా నుండి దేవత అయ్యే స్థితి తయారవుతుంది.

**౭౨౭. ఏది అంతిమ పేపర్ పరీక్ష ?**

నష్టోమోహా స్మృతిస్వరూప ఇదే అంతిమ పరీక్ష.

**౭౨౮. బాబా మనముందు ఎప్పడు హాజరవుతారు?**

ఏదైనా విషయం వస్తే మీరు మనస్సుతో బాబా,నా బాబా అనండి. బాబా హాజరైపోతారు. మీ సమస్యను పరిష్కరిస్తారు. మనస్సుతో చెప్పాలి. బాబా ఈ విషయం ఇది, బాబా ఇది చేయండి ...ఇలా మనస్సుతో చెప్తే బంధీ అయ్యి ఉంటారు. కానీ మనస్సుతో చెప్పండి అంతేకానీ అవసర సమయంలో స్మృతి చేసి తర్వాత మర్చిపోకండి.

**౭౨౯. బాబా అందరికీ మధువనం వచ్చేయమనన సందేశం ఎప్పడు లభిస్తుంది?**

ఒకవేళ బాప్‌దాదా అందరు వచ్చేయండి, ఏదీ ఆలోచించకండి, సేవ గురించి,సేవాకేంద్రం గురించి, సహయోగుల గురించి ఏదీ ఆలోచించకండి వచ్చేయండి అంటే వచ్చేస్తారా? (అలాగే వచ్చేస్తాము) అని చెప్పారు. మంచిది. ఆ రోజు కూడా వస్తుంది. వచ్చేయండి అని బాబా నుండి ఆర్డర్ వస్తుంది. ఎందుకంటే బాబాకి పిల్లలంటే ఇష్టం కదా! వేరు చేయరు. వెంట తీసుకువెళ్తారు. ఎవరైతే పక్కాగా ఉంటారో వారే ఉంటారు.

**800.** **అన్ని సేవల కంటే ఏ సేవ శ్రేష్ఠమైనది?**

మనసాసేవ.

**801.** **ఏది అందరిలో చాలా పాపం తయారుచేస్తుంది?**

మాతలలో, కుమారీలలో, కుమారులలో అధర్ కుమారీ,కుమారులలో ఎవ్వరిలో అపవిత్రత ఉండకూడదు. బ్రాహ్మణులు అంటేనే పవిత్రాత్మలు. ఒకవేళ ఏదైనా అపవిత్ర కార్యం జరిగితే ఇది చాలా పాపం. ఈ పాపం యొక్క శిక్ష కూడా చాలా కఠినంగా ఉంటుంది. ఇది ఇలా నడుస్తూ నే ఉంటుంది అని అనుకోకండి. కొద్దిగా అయితే ఉంటుంది పర్వాలేదు అనుకోకండి. ఇది మొదటి సబ్జక్ట్. నవీనత కూడా పవిత్రతయే. బ్రహ్మాబాబా కూడా పవిత్రత విషయం గురించే నిందలు పడ్డారు. అయిపోయింది పర్వాలేదు అనుకోకండి, ఇలా వదిలేది లేదు. దీనిలో సోమరిగా కాకండి. ఏ బ్రాహ్మణాత్మ అయినా అనగా సమర్పణ అయిన వారైనా, సేవాధారులైనా, కుటుంబంలో ఉండేవారైనా ఈ విషయంలో తేడా వస్తే ధర్మరాజు కూడా వదిలేది లేదు. బ్రహ్మాబాబా కూడా ధర్మరాజుకి తోడు వస్తారు. కుమారీలు ఎక్కడ ఉంటున్నా, సేవాకేంద్రంలో ఉంటున్నా మధువనంలో ఉంటున్నా కానీ సంకల్పమాత్రంగా గాయం అయినా చాలా పెద్దది. మనస్సుని పవిత్రంగా ఉంచుకోండి. తనువుని పవిత్రంగా ఉంచుకోండి అని పాట పాడతారు కదా! పాట ఉంది కదా! మనస్సు పవిత్రంగా ఉంటే జీవితం కూడా పవిత్రంగా ఉంటుంది. కనుక మనస్సులో అయినా తేలికగా అవ్వకండి. కొంచెమే కదా జరిగింది, ఏముందిలే అని అనుకోకండి. కొంచెం అయినా కానీ ఎక్కువే. బాప్‌దాదా అఫీషియల్‌గా (సూక్ష్మంగా) సైగ చేస్తున్నారు. ఈ విషయంలో తేడా ఉంటే రక్షించుకోలేరు. ఈ విషయం యొక్క లెక్కాచారాన్ని బాబా మంచిగా తీస్తారు. ఎవరైనా కానీ అందువలన జాగ్రత్తగా,ధ్యాసతో వినండి. అందరు ధ్యాసతో విన్నారా! రెండు చెవులతో వినండి. వృత్తిలో కూడా టచ్ అవ్వకూడదు. దృష్టిలో కూడా టచ్ అవ్వకూడదు, సంకల్పంలోనే లేకపోతే వృత్తి,దృష్టిలో ఎలా వస్తుంది! ఎందుకంటే సమయం యొక్క సంపన్నత సమీపంగా వస్తుంది. కనుక పూర్తిగా పవిత్రంగా అవ్వాలి. ఆ లెక్కతో చూస్తే ఇలాంటి విషయాలు తెల్ల కాగితంపై నల్లమచ్చ వంటివి.

**802.** **బాబాని ప్రత్యక్షం చేసేందుకు ప్లాన్ ఏమిటి?**

బాబాని ప్రత్యక్షం చేసేటందుకు ప్లాన్ ఏమిటంటే మీ ప్రాక్టికల్ జీవితం. ఇతర కార్యక్రమాలు ఏవైతే చేస్తున్నారో అవి మిమ్మల్ని మీరు బిజీగా ఉంచుకోవడానికి. అది అయితే మంచిదే కానీ బాబా ప్రత్యక్షం అయ్యేది మీ నడవడిక మరియు ముఖం ద్వారా.

**803.** **ప్రపంచం ముందు ఏ మాటను ప్రత్యక్షం చేయాలి?**

శివపరమాత్మ ఆశీర్వాదం ఏదైనా చేయగలదు అనే మాటను ప్రత్యక్షం చేయండి.

**804. పొరపాటు చేసినప్పుడు ఏ విధంగా సగం పాపం క్షమించబడుతుంది?**

సత్యమైన మనస్సుకే యజమాని రాజీ అవుతారు. చలించినా, ఊగినా కానీ సత్యం మాట్లాడతారు మరియు ఎవరైతే సత్యం మాట్లాడతారో వారి యొక్క పొరపాటు సగం క్షమించబడుతుంది. అందువలనే బాప్‌దాదాకి ఈ విశేషత మంచిగా అనిపిస్తుంది. ఎందుకంటే ఎవరైతే అసత్యం మాట్లాడతారో అసత్యం ఎలాంటిదంటే లోపల మనస్సు తినేస్తూ ఉంటుంది. ఏదైనా ముల్లు కాలులో గ్రుచ్చుకుంటే ఏమౌతుంది? లోలోపలే గ్రుచ్చుకుంటూ ఉంటుంది కదా! అలాగే అసత్యం మాట్లాడేవారికి లోపల ఎప్పుడు సంతోషం ఉండదు. ఏదోక సమస్య వస్తూనే ఉంటుంది. అందువలన స్పష్ట ఆత్మగా అవ్వటం ద్వారా స్పష్టత అనేది శ్రేష్టంగా చేస్తుంది. సహాయం లభిస్తుంది. లిఫ్ట్ లభిస్తుంది కనుక మీ యొక్క విశేషతను ఎప్పుడు తక్కువ చేసుకోకూడదు. ఈ విశేషత మీకు సహాయం చేస్తుంది.

**805. అన్నింటికంటే బాబాకు చాలా ఇష్టమైనది ఏది?**

సత్యత అందుకే భక్తిలో కూడా సత్యమే భగవంతుడు అంటారు. (గాడ్ ఈజ్ ట్రూత్).

**806. సాధనాలు ఏ విధంగా సుఖాన్నిస్తాయి?**

సాధనాలు కర్మేంద్రియాలకు సుఖాన్నిస్తాయి. అతీంద్రియసుఖం సాధనాలు ఆధారంగా లభించదు. అది శివపరమాత్మ స్నేహం ద్వారానే లభిస్తుంది.

**807. మొత్తం ప్రపంచం మీ ద్వారా ఎలా తయారవుతుంది?**

సంగమయుగంలో తయారుచేసుకున్న మీ సంస్కారాలే భవిష్యప్రపంచాన్ని తయారుచేస్తాయి అనగా మీరు నిస్వార్ధంతో అందరికీ స్నేహిగా ఉంటే కొంతమంది ఆవిధంగా తయారైపోతారు, మీరు స్వార్ధంతో ఉంటే కొంతమంది ఆవిధంగా తయారైపోతారు మొత్తం ప్రపంచానికి ఈ సంగమయుగం యొక్క ఆచారాలే ఆధారమౌతాయి.

**808. 16108 మాలలో పాతవారే వస్తారా? కొత్తవారు కూడా వస్తారా? ఎలా?**

16 వేల మాలలోకి, 108 మాలలోకి పాతవారే రావలసి ఉంటుంది. క్రొత్తవారైతే వెనుక వస్తారు. కొంతమంది లాస్ట్ సో ఫాస్ట్ కూడా ఉంటారు. కొంతమంది లాస్ట్ సో ఫాస్ట్, ఫాస్ట్ సో ఫస్ట్ వచ్చేస్తారు. కొంతమంది దీనికి ఉదాహరణగా ఉంటారు కానీ కొద్ది మందే ఉంటారు. మిగిలిన వారు మీరే ఉంటారు, ప్రతి కల్పం మీరే తయారయ్యారు, మీరే తయారవ్వాలి. విదేశంలో కూర్చున్నా, దేశంలో కూర్చున్నా, ఎక్కడ కూర్చున్నా కానీ ఎవరైతే చాలా సమయం పక్కా నిశ్చయబుద్ధిగా ఉంటారో వారు తప్పక అధికారులు అవుతారు.

## 809. ఎవరిని వేదికపైకి తీసుకురావాలి?

బాప్‌దాదా ఒక సూచన ఇస్తున్నారు - (క్వాంటిటీ) సంఖ్యను పెంచేసేవ మరియు (క్వాలిటీ) లక్షణాలు కలిగిన వారి సేవ రెండు రకాలైన సేవలు చేయండి కానీ లక్షణాలు కలిగిన వారి సేవకు సహయోగులు అవ్వండి. సేవావేదికపైకి లక్షణాలు కలిగిన వారిని తీసుకురండి. క్వాలిటీ మరియు క్వాంటిటీ రెండు సేవలు ఉండాలి. అంతే కానీ సంఖ్య వెనకపడి లక్షణాలు కలిగిన వారిని మర్చిపోకండి. ఎందుకంటే సమయం సమీపంగా వస్తుంది. లక్షణాలు కలిగినవారి కార్యం ద్వారానే బాబా యొక్క ప్రత్యక్షత జరుగుతుంది.

## 810. అందరిలో అంతిమ పరివర్తన ఏవిధంగా వస్తుంది?

అంతిమ సమయంలో శివబాబా ఒక్కరే, ఒక్కరే, ఒక్కరే అనే మాట అందరి నోటి నుండి వస్తుంది. అది ఎప్పుడు జరుగుతుందంటే బ్రాహ్మణ పరివారం ఏకీరసస్థితి కలిగినవారిగా తయారయినప్పుడే. అందరిలో ఏకీరసస్థితియే ఒక్కరిని ప్రత్యక్షం చేస్తుంది. ఏవిధంగా అయితే రాజకీయశక్తిలో అందరు కలిసి ఉన్నప్పుడు ఆ పార్టీ విజయపంథాలో ముందుకు వెళ్ళిపోతుంది అదేవిధంగా ఇక్కడ కూడా బాబా ప్రత్యక్షత మనకంటే ముందుగా వెళ్ళిపోతుంది.

## 811. సేవ యొక్క సఫలతకు విశేషమైన ఆధారం ఏమిటి?

చేయించే బాబా చేసే ఆత్మనైన నా ద్వారా చేయిస్తున్నారు కేవలం నేను నిమిత్తం.

## 812. సేవ చేస్తూ ఏ లోపం వలన హద్దుభావం వస్తుంది?

స్మృతి లేకుండా సేవ చేస్తే హద్దుభావం వస్తుంది.

## 813. ఏ పొజిషన్‌లో మనం ఉండాలని శివబాబా తెలియచేస్తున్నారు?

మీరు అన్ని కార్యాలు చేస్తూ ముక్తి స్థితిలో అతీతంగా, సాధనాలకు వశం కాకుండా పదవి యొక్క గౌరవానికి కూడా వశం కాకుండా ఉన్నప్పుడే శివబాబాకి ప్రియంగా అవుతారు. ఇవన్నీ కూడా మాయ యొక్క అపోజిషన్ (వ్యతిరేకత).

## 814. సృష్టిలో ఏ ఒక్కరికి శరీరం ఉండదు?

శివతండ్రి ఒక్కరికే సృష్టిలో శరీరం ఉండదు.

**815. ఏయే విషయాలు ధారణ చేస్తే అందులో యోగం, ధారణ, సేవ కూడా వచ్చేస్తాయి?**

అన్నింటికంటే సహజ పురుషార్థం – ఆశీర్వాదాలు ఇవ్వటం మరియు ఆశీర్వాదాలు తీసుకోవటం అనగా దు:ఖం ఇవ్వకూడదు, దు:ఖం తీసుకోకూడదు. ఎవరినీ నిందించకూడదు, ఎవరైనా మిమ్మల్ని నిందించినా స్వీకరించకూడదు. ఎవరినీ ఏ విషయంలోను అగౌరవపరచకూడదు. గౌరవాన్ని స్వీకరించకూడదు. ఇవన్నీ మీరు ఆశీర్వాదాలు ఇవ్వటం, ఇతరుల నుండి తీసుకోవటంలో జమ అయిపోతాయి దీనిలో యోగం, ధారణ, సేవ కూడా సహజంగా వచ్చేస్తాయి.

**816. ఏదైనా కష్టం వచ్చినప్పుడు మనం ఎవరిని ఏ విధంగా పిలవాలి?**

బాబా, నా శివబాబా అని పిలిస్తే ఆ కష్టం సమాప్తి అయిపోతుంది.

**817. శివపరమాత్మతో కలసి కంబైండ్ స్వరూపంలో ఉంటే వచ్చే లాభం ఏమిటి?**

ఎవరైతే ఎక్కువ సమయం భగవంతునికి స్నేహి, సహయోగిగా ఉంటూ లీనమౌతారో అటువంటి వారికి ప్రతి సమయం భగవంతుడు తిరిగి అనేక రెట్లు సహయోగి అయిపోతారు.

**818. శివపరమాత్మ బ్యాంక్‌లో ధనాన్ని జమ చేసుకుంటే వచ్చే లాభం ఏమిటి?**

శివపరమాత్మ బ్యాంక్‌లో ధనాన్ని జమ చేసుకుంటే కోటానుకోట్ల రెట్లు అయ్యి ప్రతి జన్మలో మీకు ప్రాలబ్దరూపంలో వెంట వస్తుంది.

**819. అష్టరత్నాల్లో ఏయే నెంబర్ల పేర్లు తెలుపబడ్డాయి?**

మొదటి లక్ష్మీ,నారాయణుల నెంబర్ మాత్రమే నిర్ణయమయ్యింది మిగిలిన నెంబర్లు ఏ అక్కయ్య, ఏ అన్నయ్య అనేది ప్రకటించబడలేదు. అంతిమ సమయంలో నష్టోమోహ అనే ఒక్క సెకను యొక్క పరీక్షలో పాస్ అవుతారో వారే మిగిలిన అష్టరత్నాలు. దాదీ, దీదీలు అంటే బాబాకి ప్రేమ ఉంది కానీ ఫలానా దాదీ, ఫలానా దీదీ అష్టరత్నాల్లోకి వస్తారని బాబా ఇప్పటి వరకు ఎప్పుడు చెప్పలేదు. ముందు, ముందు కూడా చెప్పరు. అంతిమ సమయంలో మాత్రమే మిగిలిన ఆ నెంబర్లు నిర్ణయించబడతాయి. మీరు ఫలానా, ఫలానా వారు అష్టరత్నాలు అని ఊహించుకుని పేర్లు తెలపకండి. అలా తెలిపితే శ్రీమతంలో మన్మతం కలిపినట్లు.

**820. బాబా దగ్గరికి వచ్చిన క్రొత్తవారి ఫోన్ నెంబర్లు ఎందుకు తీసుకోవాలి?**

ఏవైనా ప్రోగ్రామ్స్ జరిగినప్పుడు వారిని మరలా పిలిచి వారిని మరింత ముందుకు తీసుకువెళ్ళడం కోసం వారి ఫోన్ నెంబర్లను తీసుకోవాలి.

**821. పరమాత్మ శివుని యొక్క హృదయ సింహాసనం మనకి ఎప్పుడు లభిస్తుంది?**

సత్యయుగంలో విశ్వమహారాజు అధిష్టించి పాలన చేసే స్థూల సింహాసనం కంటే ఈ సంగమయుగంలో శివపరమాత్మ అమూల్యమైన హృదయసింహాసనం మీ ఒక్కరికే లభిస్తుంది ఇదే గొప్ప సింహాసనం.

**822. బ్రాహ్మణులుగా పిలవబడే మీరు అలజడిగా ఉంటే విశ్వానికి ఏ విధంగా నష్టం వాటిల్లుతుంది?**

మనలో స్వార్థం, ధనం యొక్క ఆశ, పేరు, గౌరవం కావాలనే కోరికలతో ఉంటే ఆ తరంగాలు విశ్వం యొక్క వాయుమండలంలో వ్యాపించి అభాగ్యశాలి, అజ్ఞానీ ఆత్మలను పాడు చేయడానికి మీరే నిమిత్తం అవుతారు ఎందుకంటే ఆ తరంగాలు వారి హృదయంలోకి వెళ్ళి ఆ చెడు కార్యాలు చేయిస్తాయి. మీరు మంచి చేస్తే వారు కూడా మంచి చేస్తారు. ఉదాహరణకు మీరు ధరించిన వస్త్రానికి సెంట్ రాసుకున్నారనుకోండి చుట్టుప్రక్కల, మీకు కొంచెం దగ్గరలో ఉన్న వ్యక్తులు సెంట్ రాసుకోకపోయినా ఒక వ్యక్తి రాసుకున్న సెంట్ యొక్క తరంగాలు వాయుమండలంలో ప్రవేశించి ఇతరుల ముక్కు రంధ్రాలకు సోకి ఆ సెంట్ యొక్క అనుభూతిని కలిగిస్తుంది. వాస్తవానికి ఆ సంగటనలో ఒక్కరే సెంట్ రాసుకున్నారు అయినా కానీ అందరికీ చేరింది ఎందుకంటే ఈ వాయుమండలంలో అనేక అణువులు ఉంటాయి అవి ఒకరి నుండి ఒకరికి కొన్ని విషయాలు తీసుకువెళ్తాయి కనుక జ్ఞానీ, యోగీ ఆత్మల ఆలోచనలలో దివ్యత లేకపోతే వారికే కాకుండా మొత్తం ప్రపంచానికి నష్టం వాటిల్లితుందని శివపరమాత్మ మనకు విధిని తెలియచేస్తున్నారు.

**823. ఏయే బిడ్డలపై బాబాకు ప్రేమ ఉంటుంది?**

ఈ సృష్టిలో ఉన్న చివరి బిడ్డపై కూడా భగవంతునికి ప్రేమ ఉంటుంది. ఆ ప్రేమే లేకపోతే ఈ ప్రపంచమే ఉండదు.

**824. శివబాబా వినాశనం యొక్క పరదాని ఎంత సమయంలో తెరువగలరు?**

ఒక్క సెకనులో తెరవగలరు.

**825. సత్యమైన జ్ఞానీ ఆత్మ అని ఎవరిని అంటారు ?**

జ్ఞానం యొక్క పాయింట్స్‌ని వర్ణన చేసి ఉపన్యాసం చెప్పేవారు చాలామంది ఉన్నారు కానీ ప్రతి వాక్యాన్ని అనుభవ స్వరూపంగా చేసుకునేవారే సత్యమైన జ్ఞానీఆత్మలు.

**826. బ్రాహ్మణాత్మలకు తేలికపాటి మరణం ఎప్పుడు లభిస్తుంది?**

ఎవరైతే రోజంతటిలో ఎక్కువ నిరాకారిస్థితిని అనగా ఆత్మానుభూతిని అనుభవం చేసుకుంటారో వారికి మరణించేసమయంలో ఏవిధమైన బాధ ఉండదు. దేహ సంబంధీకులు జ్ఞాపకం రారు. ఈ శరీరం పాతది అయిపోయింది ఈ ఆత్మకి మరోచోట మంచి పాత్ర లభిస్తుంది. ఈ శిధిలమైపోయిన శరీరం నుండి వేరే తల్లి గర్భంలో నూతన శరీరంలోకి వెళ్తున్నాను అనే ఆనందంలో మరణాన్ని కూడా మహత్యంలా భావించి శరీరాన్ని సులువుగా వదిలేస్తారు.

**827. మనల్ని ఏ బ్యాడ్జ్ పెట్టుకోమని శివబాబా తెలియ చేసారు?**

మనస్సులో నేను పరివర్తన అవ్వాలనే బ్యాడ్జ్ పెట్టుకోవాలని శివబాబా తెలియచేసారు కేవలం షోగా బ్యాడ్జ్ పెట్టుకోవటం కాదు.

**828. ఏయే శక్తులు ఇప్పుడు అలజడిలో ఉన్నాయి?**

ఈనాడు మూడు శక్తులు అలజడిలో ఉన్నాయి. ధర్మశక్తి అయినా కానీ, రాజ్యశక్తి అయినా కానీ, విజ్ఞాన శక్తి అయినా కానీ ఆ విజ్ఞానం కూడా ఇప్పుడు ప్రకృతిని యదార్ధ రూపంలో నడిపించలేకపోతుంది. ఇదంతా జరగవలసి ఉంది అని అంటున్నారు. ఎందుకంటే విజ్ఞానశక్తి ప్రకృతి ద్వారా పని చేస్తుంది. కనుక విజ్ఞాన సాధనాలు ఉన్నా కానీ, ప్రయత్నిస్తున్నా కానీ ఇప్పుడు ప్రకృతి అదుపులో ఉండటంలేదు. ప్రకృతి ఆడే ఈ ఆటలన్నీ ఇక ముందు ఇంకా పెరిగిపోతాయి. ఎందుకంటే ప్రకృతికి కూడా ఆదిలో ఉన్నంత శక్తి ఇప్పుడు లేదు.

**829. ఇప్పుడు ఎటువంటి సమయం రానున్నది?**

ఇప్పుడు ప్రమాదకరమైన సమయం రానున్నది అనగా ఆ సమయంలో సాధనాలు అనగా టెలిఫోన్, వైరెలెస్ ఇవేమీ పని చేయవు. భగవంతుని ప్రేరణాశక్తి ఒక్కటే నడుస్తుంది. ఎవరైతే శాంతిశక్తిలో ఉంటారో వారికే ప్రేరణ ఆజ్ఞ రూపంలో లభిస్తుంది. మనస్సులో కానీ, బుద్ధిలో కానీ ఏ ఆత్మ గురించి ఆలోచించకూడదు.

**830. సమయంపై విజయం పొందేందుకు మనలో ఏ శక్తులు అవసరం?**

సమయంపై విజయం పొందేటందుకు మనస్సులో, బుద్ధిలో గ్రహణశక్తి మరియు ప్రేరణ పొందే శక్తి రెండు చాలా అవసరం. ఎటువంటి పరిస్థితులు వచ్చినా ఎక్కడో దూరంగా ఉన్నా కానీ స్వచ్ఛమైన మరియు స్పష్టమైన బుద్ధి ఉంటే బాబా యొక్క సైగ, సలహా, శ్రీమతం గ్రహించగలరు. ఇది చేయాలి, ఇది చేయకూడదు అని ప్రేరణ వస్తుంది.

### 831. అనుభవ శక్తి గురించి బాబా ఏం చెప్పారు?

యోగం సమయంలో మంచిగా అనుభవం అవ్వటం మరలా కర్మ చేసే సమయంలో, వ్యవహారం చేసే సమయంలో, సంబంధంలోకి వచ్చిన సమయంలో అనుభవం తక్కువ అవ్వకూడదు. పరీక్ష అనేది అకస్మాత్తుగా వస్తుంది ఎందుకంటే అంతిమ ఫలితానికి ముందు కూడా మధ్యమధ్యలో పరీక్షలు వస్తాయి.

### 832. విజ్ఞానశక్తి గురించి శివబాబా ఏం తెలియచేసారు?

విజ్ఞానశక్తి కూడా అతిలోకి వెళ్ళిపోతుంది. విజ్ఞానంపై శాంతిశక్తి విజయం పొందుతుంది. శాంతిశక్తి ద్వారా దూరంగా కూర్చున్న ఏ ఆత్మకైనా సహయోగం ఇస్తున్నారు, శక్తిని కూడా ఇస్తున్నారు మరియు భ్రమించే మనస్సుని శాంతి చేస్తున్నారు. బ్రహ్మాబాబాను చూసారు కదా, ఎవరైనా అనన్యమైన పిల్లలు కొద్దిగా అలజడిగా ఉన్నా లేదా శారీరక కర్మలఖాతాతో ఉన్నా ఉదయమే లేచి ఆ పిల్లలకు శక్తినిచ్చేవారు మరియు వారు అనుభవం చేసుకునేవారు. అలాగే అంతిమంలో ఈ శాంతిసేవ యొక్క సహయోగం చేయవలసి ఉంటుంది. పరిస్థితులనుసారంగా ఇది చాలా ధ్యాసలో ఉంచుకోండి. శాంతిశక్తి మరియు మీ శ్రేష్టకర్మల యొక్క శక్తి జమ చేసుకునే బ్యాంక్ ఇప్పుడే తెరవబడుతుంది, ఇక ఏ జన్మలో జమ చేసుకునే బ్యాంక్ ఉండదు. ఒకవేళ ఇప్పుడు జమ చేసుకోకపోతే ఇక జమ చేసుకునే బ్యాంకే లేకపోతే దేనిలో జమ చేసుకుంటారు! అందువలనే జమాశక్తిని ఎంతగా సంపాదించుకోవాలనుకుంటున్నారో అంతగా సంపాదించుకోండి. ప్రజలు కూడా ఏది చేయాలనుకుంటున్నారో అది ఇప్పుడే చేయండి అంటున్నారు. ఏది ఆలోచించాలని అకుంటున్నారో అది ఇప్పుడే ఆలోచించండి. ఇప్పుడు ఏదైతే ఆలోచిస్తున్నారో ఆ ఆలోచన ఆలోచన రూపంలోనే ఉండిపోతుంది కానీ ఎప్పుడైతే సమయం యొక్క సమీపత దగ్గరగా వస్తుందో అప్పుడు ఈ ఆలోచన పశ్చాత్తాప రూపంలో మారిపోతుంది. ఇది చేస్తున్నాను, ఇది చేయాలి...... అనే ఈ ఆలోచన ఉండదు, అది పశ్చాత్తాప రూపంలోకి మారిపోతుంది. అందువలన బాప్‌దాదా ముందే సైగ చేస్తున్నారు. ఏది జరిగినా కానీ ఒక సెకనులో శాంతిలోకి వెళ్ళిపోండి.

### 833. ఏ విషయంపైనైనా ఎన్ని రోజులు ధ్యాస పెట్టుకుంటే ఆ విషయం స్వతహా సంస్కారమవుతుంది?

ఒక నెల ధ్యాస పెట్టుకుంటే అది స్వతహా సంస్కారం అయిపోతుంది, నెలలో ఒక్క రోజు కూడా వదలకూడదు.

**834. బాబా ఏ విషయంలో బంధింపబడి ఉన్నారు?**

బాబా మీకు సహాయం చేయడానికి బంధింపబడి ఉన్నారు. బాబాకి పరిక్ష పెట్టకండి. కర్మ చేస్తూ కర్మయోగి జీవితం కూడా మధ్యమధ్యలో రివైజ్ చేసుకోండి. శాంతి యొక్క సంకల్పం చేయగానే స్వరూపమైపోవాలి. భగవంతుడు సహాయం చేస్తారా? లేదా? అని భగవంతుడిని పరీక్షించకండి. బాబా ఆజ్ఞ ప్రకారం ఒక్క అడుగు ముందుకు వేస్తే భగవంతుడు తప్పక సహయోగి అవుతారు. పరిశీలించుకుని ప్రయోగం చేసి చూడండి. ముఖ్య విషయమేమిటంటే శివబాబా వాక్యాలలో చెప్పిన ప్రకారం మనం ఒక్క అడుగు వేయాలి.

**835. దేని ద్వారా పుణ్యఖాతా స్వతహాగా జమ అవుతుంది?**

మనస్సుతో అయినా, వాణీతో అయినా, కర్మతో అయినా సంబంధ సంపర్కంలోకి వస్తూ కూడా సదా నిస్వార్థంగా మరియు బేహద్ వృత్తి, స్వభావం, భావం మరియు భావనతో సేవ చేయాలి. దీని ద్వారా పుణ్యఖాతా స్వతహాగానే జమ అయిపోతుంది.

**836. జమ చేసుకునే బ్యాంక్ ఎప్పుడు మూసేస్తారు?**

సంగమయుగం తర్వాత ఈ జమ చేసుకునే ఈశ్వరీయబ్యాంక్ ఉండదు. భగవంతుడు కూడా ఉండరు. మీ భాగ్యరేఖ ఎంత కావాలంటే అంత ఈ సంగమయుగంలోనే స్వయమే గీసుకోండి.

**837. మాల దేనికి స్మృతిచిహ్నం?**

భగవంతుడైన శివపరమాత్మతో స్నేహిగా, సహయోగిగా మరియు తోడుగా ఉన్నదానికి గుర్తు.

**838. ఏది శ్రేష్ఠ పదవి?**

లక్ష్మీనారాయణుల కుటుంబంలో అనగా 16108 మాలలో రావటం కూడా శ్రేష్ఠ పదవి.

**839. ఏ ఆత్మ తరంగాలు ఇతర ఆత్మలకు చేరవు?**

వీరు ఇలాంటి వారు, అలాంటి వారు అని మీకు తెలుసు అయినా కానీ మిమ్మల్ని మీరు సదా అతీతంగా అంటే వారి తరంగాల నుండి అతీతంగా మరియు బాబాకి ప్రియంగా అనుభవం చేస్కోండి. అప్పుడు మీ యొక్క అతీతం మరియు బాబాకి ప్రియం అయిన స్థితి యొక్క తరంగాలు ఆ ఆత్మని చేరుకోనప్పటికీ వాయుమండలంలోకి అయితే తప్పక వెళ్తాయి. ఒకవేళ వారు ఎవరైనా పరివర్తన అవ్వకపోతే ఆ ఆత్మ యొక్క ప్రభావం కూడా మీపై పడుతుంది, వ్యర్థ సంకల్పాల రూపంలో వాయుమండలంలో వ్యాపిస్తాయి. అందువలన మీరు అతీతం మరియు బాబాకి ప్రియంగా అయ్యి ఆ ఆత్మకు కూడా కళ్యాణం జరగాలనే శుభ భావన, శుభ కామన పెట్టుకోండి.

**840. విజ్ఞానం దేనిగురించి ఉంది?**

మీ సేవ కొరకు మరియు మీ పురుషార్థం కొరకు ఉంది. మీరు సంపన్నమైతే విజ్ఞానం సమాప్తి అయిపోతుంది. పరిశుద్ధమైన మీ రాజ్యంలోకి ఆ విజ్ఞానం వచ్చేస్తుంది.

**841. ముస్ముందు ప్రపంచంలో హాహా కారాలు వచ్చినప్పుడు మీచే బాబా ఏం చేయిస్తారు?**

మున్ముందు సమయం అతి హా హా కారాలతో ఉంటుంది అని బాప్‌దాదాకి తెలుసు. మీరు అందరికీ శక్తినివ్వవలసి ఉంటుంది, వారికి శక్తినివ్వటంలోనే మీ పురుషార్థం తీవ్రం అయిపోతుంది. ఇక కొద్ది సమయంలో సర్వశక్తులను ఇవ్వవలసి ఉంటుంది, ఇటువంటి ప్రమాదకర సమయంలో ఎంతమందికి మీరు ఇవ్వగలరో, కొద్దిమందికి ఇవ్వగలిగినా లేదా ఎక్కువమందికి ఇవ్వగలిగినా వారే ద్వాపర, కలియుగాల్లో వారి యొక్క భక్తులుగా అవుతారు. సంగమయుగంలో ప్రతి ఒక్కరు తమ భక్తులను కూడా తయారు చేసుకుంటున్నారు ఎందుకంటే ఇచ్చినటువంటి సుఖం మరియు శాంతి వారి హృదయాలలో నిండిపోతుంది కనుక భక్తుల రూపంలో మీకు బదులు తీర్చుకుంటారు.

**842. ధర్మరాజు అయిన శివబాబా మనల్ని ఎప్పుడు కన్నెత్తి చూడరు?**

స్వచ్ఛమైన, మనస్ఫూర్వకమైన స్నేహం శివబాబాతో ఉంటే భోళానాధుడైన శివబాబా అంతిమంలో ధర్మరాజు రూపంలో అందరికీ వారివారి కర్మల ఆధారంగా శిక్షలు వేసినప్పుడు మనకు శిక్షలు పడవు ఇదే ధర్మరాజు కన్నెత్తి చూడకపోవటం.

**843. అతీంద్రియ సుఖం మనకు ఎప్పుడు అనుభవం అవ్వదు?**

ఎప్పుడైతే శుభభావన, శుభకామన లేకుండా అపవిత్రంగా ఉంటే సంపూర్ణ పవిత్రత యొక్క ఫలమైన అతీంద్రియసుఖం అనుభవం అవ్వదు.

**844. ఏ మాటలు సమాప్తిచేస్తే పరోపకారి అవుతారు?**

పరచింతన, పరదర్శనం, పరమతం ఈ మూడు పర అనే మాటలను సమాప్తి చేస్తే పరోపకారి అయిపోతారు.

**845. ఏయే విషయాలు అపవిత్రతలోకి వస్తాయి?**

పవిత్రత అంటే కేవలం బ్రహ్మచర్యవ్రతమే కాదు వ్యర్థసంకల్పాలు, వ్యర్థమాటలు కూడా అపవిత్రతయే. క్రోధం యొక్క అంశం కూడా అపవిత్రతా రూపంలోకి వస్తుంది.

## 846. ఏ మూడు విషయాలు అభ్యాసం చేయాలి? వాటి వలన లాభం ఏమిటి?

సమయం కొద్దిగా ఉంది మరియు అతిలోకి వెళ్ళిపోతుంది కదా, అప్పుడు వైరాగ్యం వచ్చేస్తుంది, వైరాగ్య సమయంలో దానంతట అదే వేగం పెరుగుతుంది అని.కానీ బాప్‌దాదా చెప్పారు కదా, చాలా సమయం యొక్క పురుషార్థం ఉండాలి. ఒకవేళ కొద్ది సమయమే పురుషార్థం ఉంటే ప్రాలబ్ధం కూడా కొద్ది సమయమే లభిస్తుంది., 21 జన్మల ప్రాలబ్ధం తయారవ్వదు.బాప్‌దాదా చెప్పిన మూడు మాటలు సదా జ్ఞాపకం ఉంచుకోండి - ఒకటి, అకస్మాత్తు, రెండు ఎవరెడి మరియు మూడు చాలాకాలం యొక్క అభ్యాసం.ఈ మూడు మాటలు సదా బుద్ధిలో ఉంచుకోండి. ఎవరికైనా ఎప్పుడైనా, ఎక్కడైనా అంతిమసమయం ఉండచ్చు.చూడండి, ఎంతమంది బ్రాహ్మణాత్మలు చనిపోతున్నారు, వారికి తెలుసా ఏమిటి! అందువలనే చాలా సమయం యొక్క పురుషార్థం ద్వారా పూర్తిగా 21 జన్మల వారసత్వం పొందవలసిందే. ఈ తీవ్రపురుషార్థాన్ని స్మృతిలో ఉంచుకోండి. మొదటి నెంబర్, మొదటి జన్మ, మీ రాజ్యం యొక్క స్మృతి ఉంచుకోండి.

## 847. శివబాబా బ్రహ్మాబాబాలో ప్రవేశించిన వెంటనే ఏ అద్భుతాలు జరిగాయి? అవి తిరిగి మరలా ఎప్పుడు జరుగుతాయి? మనస్సుకు శక్తినిచ్చే మనసాసేవ ఎప్పుడెప్పుడు చేయాలి?

ఎలా అయితే ఆదిలో శివబాబా బ్రహ్మాబాబాలో ప్రవేశించగానే ఇంట్లో కూర్చునే శక్తినిచ్చేవారు. కొంతమందికి సాక్షాత్కారాలు జరిగాయి, కొంతమందికి ఫలానా స్థానానికి వెళ్ళండి అనే మాట వినిపించేది, కొందరికి ప్రేరణ వచ్చి నేను వెళ్ళి వినాలి అనుకునేవారు, ఇలా పరుగు పెట్టుకుంటూ వచ్చారు కదా! ఇలా ఆదిలో వచ్చినవారు ఎంత పక్కాగా ఉన్నారు! ఆదిలో ఏదైతే జరిగిందో అది అంతిమంలో తిరిగి జరగనున్నది. అందువలనే ఇప్పుడు మనసాశక్తి యొక్క మనసాసేవను పెంచుకోండి. ఆ సమయంలో మీ ఉపన్యాసం ఎవరూ వినరు, కోర్స్ ఎవరూ వినరు, పరిస్థితులు చాలా గంభీరంగా ఉంటాయి. మనసాశక్తినిచ్చే సేవ చేయాల్సి ఉంటుంది. అందువలన ఇప్పుడు అభ్యాసం చేయండి. కేవలం అమృతవేళలోనే కాదు, కర్మ చేస్తున్నా కానీ మధ్యమధ్యలో మనస్సుని అదుపు చేసి అన్ని వైపుల నుండి ఏకాగ్రం చేసి శక్తినిస్తున్నాను అని ప్రయత్నించండి.ఇది చాలా అవసరం అవుతుంది.చివరికి దు:ఖహర్త, సుఖకర్త అయిన మీ చిత్రాలు కూడా తయారవుతాయి.మరి చైతన్యంలో తయారవ్వరా?అంతర్ముఖి అయ్యి మధ్యమధ్యలో 5 నిమిషాలు తీయండి. కేవలం అమృతవేళ మాత్రమే కాదు; రాత్రి, పగలు ఈ అభ్యాసం ఉండాలి. రాత్రి మెలకువ వచ్చినప్పుడు ప్రయత్నించండి, మరలా వెళ్ళి పడుకోండి కానీ కొద్ది సమయం ప్రయత్నం చేయండి, ఇతర పనుల కొరకు లేస్తూ ఉంటారు కదా ఆ సమయంలో ఈ అభ్యాసం కూడా చేయండి. అప్పుడే మీ పూజ జరుగుతుంది. లేకపోతే మీకు పూజ నామమాత్రంగా జరుగుతుంది. పెద్ద,పెద్ద మందిరాలు తయారవ్వవు, నామమాత్రంగా మందిరాలు తయారవుతాయి.

**ల848. ఏకాగ్రత అభ్యాసం ద్వారా ఏవిధమైన లాభం ఉంటుంది?**

శివబాబా ఆదిలో ధ్యానంలో చాలా దృశ్యాలు చూపించేవారు. అంతిమసమయంలో ఏదైనా అలజడి జరిగినప్పుడు అన్ని సంకల్పాలు బయటికి వస్తాయి. చెడు సంకల్పాలు మరియు తోడునిచ్చే సంకల్పాలు కూడా బయటికి వస్తాయి. ఆదిలో బాప్‌దాదా పిల్లలకు చూపించారు – ఎవరైనా చెడు దృష్టి ఉన్నవారు వెనుక వస్తున్నా కానీ వారికి లైట్ కనిపించేది. మనుష్యులు కనిపించేవారు కాదు, లైట్ కనిపించేది, ఫరిస్తా రూపమే కనిపించేది. అలాగే మీకు ఏకాగ్రతా అభ్యాసం ఉంటే మీరు వారి ఎదురుగా కూర్చున్నా కానీ వారికి కనిపించరు; లైటే కనిపిస్తుంది – ఇలా జరుగుతుంది. కానీ ఇప్పటినుండి అభ్యాసం చేయండి. మంచిది. ఇప్పుడు మూడు నిమిషాలు మనస్సుని ఏకాగ్రం చేసే అభ్యాసం చేయండి. ఈ వ్యాయామం చేయండి.

**849. బంధనాలలో ఉన్న ఆత్మలను బాబా ఏ విధంగా చూస్తారు?**

బంధనాలలో ఉన్నవారు వారి కఠినమైన బంధనాలలో కూడా గుప్తరూపంలో భగవంతుని నుండి ప్రాప్తిని సంపాదించుకుంటున్నారు అది ఎలా అంటే మాతలు సంసారంలో ఉంటూ ఎన్నో పరిస్థితులను ఎదుర్కోవల్సి వస్తుంది అటువంటి అలజడి సమయంలో కూడా మనస్సుని భగవంతుడైన శివపరమాత్మపై లగ్నం చేయటం వలన వారికి ప్రాప్తి చాలా ఎక్కువగా ఉంటుంది. వారి చరిత్ర చాలా విచిత్రరూపంలో ఉంటుంది. బంధనాలలో లేనివారు భగవంతుడి పిల్లలైనప్పటికీ వ్యర్ధంగా సమయం గడిపేస్తే ప్రాప్తి తక్కువగా ఉంటుంది.

**850. దివ్య గుణాలు ధారణ చేస్తూ ఉంటే మనకు కల్పములో ఏ విధమైన మహిమ జరుగుతుంది?**

సర్వగుణసంపన్నులుగా మహిమ జరుగుతుంది.

**851. మనస్సుతో నా బాబా అంటే ఏ విధమైన శక్తి వెంటనే మీ ముందు హాజరవుతుంది?**

పరివర్తనాశక్తి. వ్యతిరేకత అనే అవగుణం మంచి గుణంలోకి మారిపోతుంది.

**852. క్రోధం విషయంలో వ్యాపించబడే తరంగాల యొక్క విశేషతలు తెలుపుము?**

మొత్తం సంవత్సరం అంతా ఎవరైతే సదా నవ్వుతూ ఉంటారో, ఏ విషయం వచ్చినా ఎందుకంటే కొంతమంది అక్కయ్యలు, అన్నయ్యలు, ఆత్మికసంభాషణ చేసేటప్పుడు ఒకవేళ అక్కడ ఆవేశపూరితంగా మాట్లాడకపోతే వారు అర్ధం చేసుకోవటంలేదు అంటున్నారు, మారరు అంటున్నారు. మొదటే మీరిలా వారు మారరు అనే భావన పెట్టుకుంటే వారికి మొదటే మీ

యొక్క ఆ తరంగాలు చేరిపోతాయి అందువలనే ఈ సంవత్సరంలో క్రోధం మరియు క్రోధం యొక్క పిల్లలకు వీడ్కోలు ఇవ్వండి. ఇస్తారా? ఆవేశం కూడా ఉండకూడదు. బాబా అడుగుతున్నారు – సమయానుసారం కోపంలోకి వస్తున్నారు, పని చేయించడానికి లేదా వారిని సరిచేయడానికి కానీ వారు సరి అవుతున్నారా? కోప్పడటం ద్వారా ఎవరైనా సరి అయ్యారా? ఆ జాబితా చెప్పండి. ఇంకా కోపంలోకి వస్తున్నారు కానీ సరి అవ్వటంలేదు. మనస్సులో వ్యతిరేకత వచ్చేస్తుంది. పెద్దవారైతే మాట్లాడలేరు కనుక మనస్సులో వ్యతిరేకతలోకి వస్తున్నారు అదే చిన్నవారైతే ఏడ్చేస్తున్నారు.

**853. బాప్‌దాదా యొక్క దృష్టిలో విశేషత ఏమిటో తెలుపుము?**

శివపరమాత్మ మధువనంలో ఒక వృద్ధ మహిళ శరీరంలో అనగా దాదీ శరీరంలో ప్రతి సంవత్సరం నిర్దేశించిన రోజులలో సాయంత్రం 7 గంటల నుండి 11 గంటల వరకు జ్ఞానం చెప్తారు. భగవంతుడిని స్థూలంగా కలుసుకుని ఆ మహావాక్యాలు వినడానికి ఒక్కసారిగా ప్రపంచం నలువైపుల నుండి సుమారు 20,000 మంది భగవంతుని దర్శనం కోసం వస్తారు ఆ సమయంలో భగవంతుడు ఎదురుగా ఉన్న వారిని మాత్రమే చూడటం కాదు ప్రపంచం నలువైపుల ఈ స్థానానికి రాకుండా విజ్ఞాన సాధనాల ద్వారా కూడా చూడకుండా ఏకాగ్రతాశక్తిలో యోగం ద్వారా ఆ స్థానంలో ఉంటూ మనస్సుతో భగవంతుడిని గుప్త రూపంలో చూస్తున్న వారిని కూడా భగవంతుడు చూస్తారు. ఆయన దృష్టి దూరంగా ఉన్న ప్రతి బిడ్డకు కోటానుకోట్ల భాగ్యాన్ని ప్రసాదిస్తుంది. ఇది భగవంతుని యొక్క విశాలమైన శుభభావనతో కూడిన దృష్టి.

**854. శివబాబాని స్నేహంతో స్మృతి చేసిన దానికి జ్ఞానం ఆధారంగా స్మృతి చేసిన దానికి తేడా తెలుపుము?**

శివబాబాకి ప్రతి బిడ్డ హృదయంలో ఉండేవారే. వారు నెంబర్‌వారీగా ఉండచ్చు, నెంబర్‌వన్ కాకపోవచ్చు అయినా కానీ బాప్‌దాదాకి ప్రతి కల్పం ఆ పిల్లవాడు ప్రియమైనవాడే అందువలనే బాబాకి ప్రియంగా అయిన భాగ్యం సదా స్మృతి ఉంచుకోండి. చిన్న విషయం, ఏదైనా కష్టం వస్తే నా బాబా అని అధికారంతో అనండి అంటే బాబా తప్పకుండా బందీ అయిపోతారు కానీ మనస్సులో ఇతర విషయాలు పెట్టుకోకూడదు నా బాబా అని మరలా మనస్సులో బలహీనతను కూడా ఉంచుకుంటే బాబా సహయోగం ఇవ్వరు. స్వచ్ఛంగా ఉన్న హృదయమే బాబాకి ఇష్టం. మురికి ఉన్నవారి హృదయంలోకి బాబా రారు మరియు స్నేహంతో స్మృతి చేయండి. కేవలం జ్ఞానం ఆధారంగా కాదు, చెప్పాను కదా, జ్ఞానమనేది బీజం కానీ స్నేహమనేది నీరు. కేవలం జ్ఞానం ఆధారంగా తెలుసుకున్నారు కానీ మనస్పూర్వకమైన ప్రేమను అనుభవం చేసుకోకుండా, ప్రేమతో బాబాని స్మృతి చేయకపోతే ప్రత్యక్షఫలం రాదు అంటే అనుభవం అవ్వదు. అనుభవీ

స్వరూపమనేది ఫలం కానీ నీరు లేకపోతే కనుక అది ఎండిపోయిన చెరుకు అయిపోతుంది. భలే కోర్సు చెప్పండి, ఉపన్యాసం చెప్పి రండి మరియు బహుమతులు తీసుకుని రండి, రోజంతటిలో మూడు,నాలుగు ఉపన్యాసాలు చెప్పండి కానీ బాబాపై మనస్పూర్వకమైన స్నేహం కనుక లేకపోతే ఫలం రాదు ఎందుకంటే బాబాపై మనస్పూర్వకమైన స్నేహం ఉన్న దానికి గుర్తు ప్రతి బ్రాహ్మణ పరివారంపై కూడా స్నేహం ఉంటుంది. స్నేహం లేకపోతే కనుక విఘ్నాలు ఎక్కువగా వస్తాయి ఎందుకంటే నీరు వేయకపోతే కనుక ఫలం ఎలా వస్తుంది! కొంతమంది పిల్లలు జ్ఞానమైతే అర్థం చేసుకున్నాము, బాబాతో సర్వ సంబంధాలు కూడా పెట్టుకుంటున్నాము కానీ అనుభవం అవ్వటంలేదు అని అంటున్నారు.అనుభవం అనేది ఫలం,ఎండిపోయిన జ్ఞానీలుగా అవ్వద్దు.స్నేహిగా అంటే బాబాకి స్నేహిగా అయితే పరివారానికి స్వతహాగానే స్నేహిగా అవుతారు.



## 855. పరవశమైన వారిని మనం ఏ విధంగా పాలన చేయాలి?

మొదటి విషయం - సదా శుభచింతకులుగా ఉండాలి. ఎవరిలో అయినా బలహీనత చూసినా లేదా వినినా శుభచింతకులుగా అయ్యి వారికి సహయోగాన్ని ఇవ్వాల్సిందే. బలహీనతను చూడకూడదు కానీ సహయోగాన్ని ఇవ్వాల్సిందే. అటువంటి వారినే శుభ చింతకులు అని అంటారు. పక్కాగా ఉంటారు కదా! సహయోగాన్నిచ్చే దాతలు కనుక దయాహృదయులై సహయోగాన్ని ఇవ్వండి. వారిని వేరు చేయటం, అసహ్యించుకోవటం చేయకూడదు. క్షమించాలి. పరవశమైనవారిని ఎప్పుడు అసహ్యించుకోకూడదు. సహయోగాన్ని ఇవ్వాలి. శుభచింతకులుగా అవ్వాలి.

రెండవ విషయం - శుభచింతన; ఈరోజుల్లో బాప్‌దాదా చూసినదేమిటంటే చాలా మంది పిల్లలలో చాలా వ్యర్థసంకల్పాలు నడుస్తున్నాయి, దీనిలో జమ చేసుకున్న శక్తులు వ్యర్థంగా వెళ్ళిపోతున్నాయి అందువలనే శుభచింతన చేయాలి. ఏదోక స్వమానం అంటే మీ బిరుదుని మనస్సుకి హోమ్‌వర్క్‌గా ఇచ్చుకోండి. మనస్సు యొక్క దినచర్యను తయారు చేసుకోండి. అమృతవేళ బాబా యొక్క కలయిక తర్వాత మనస్సుకి ఏదోక స్వమానాన్ని ఇచ్చుకోండి మరలా మధ్యలో మీకు 12-13 సార్లు సమయం లభిస్తుంది కనుక ఆ సమయంలో అనుభవం చేసుకోండి మరియు మరలా రివైజ్ చేసుకోండి. ఇలా మనస్సుని బిజీగా ఉంచుకోవటం ద్వారా సమయమనేది వ్యర్థసంకల్పాలలో గడవదు. శ్రమ చేయాల్సిన అవసరం కూడా ఉండదు మరియు ప్రతి సమయం సంగమయుగం యొక్క మజా ఏదైతే ఉందో ఆ మజాలో ఉండగల్గుతారు కనుక రెండవది - శుభచింతన.పరిశీలన చేసుకోండి మరియు పరివర్తన చేసుకోండి.

మూడవ విషయం- శుభవృత్తి. అశుద్ధవృత్తి ద్వారా వాయుమండలంలో కూడా అశుద్ధత వ్యాపిస్తుంది కనుక శుభవృత్తి ఉండాలి.

నాల్గవ విషయం - ప్రతి ఒక్కరు ఈ బాధ్యత తీసుకోవాలి - నేను ఇతరులను చూడకూడదు మరియు నా పని ఏమిటంటే శుభవాయుమండలాన్ని తయారుచేయటం. ఎప్పుడైనా వాయుమండలంలో చెడువాసన వస్తే ఏమి చేస్తారు? సువాసనను వ్యాపింపచేస్తారు కదా! చెడువాసనను సహించలేరు,

సువాసనను ఇచ్చే ఏదొక సాధనాన్ని ఉపయోగిస్తారు అలాగే సాధారణ వాయుమండలాన్ని మరియు అశుద్ధ వాయుమండలాన్ని మార్చాల్సిందే. చిన్నవారైనా, క్రొత్తవారైనా కానీ ఈ బాధ్యత అందరికీ ఉంది. నేను శుభవాయుమండలాన్ని తయారుచేయాల్సిందే అనే ధృడసంకల్పం చేయాలి. ఈ ప్రతిజ్ఞ ప్రత్యక్షతను చేస్తుంది. ప్రతిజ్ఞ చేస్తున్నారు దీనికి శివబాబా సంతోషిస్తున్నారు

## 856. ఉదయం కళ్ళు తెరవగానే బాబాని చూస్తే వచ్చే లాభం ఏమిటి?

ఉదయం కళ్ళు తెరవగానే మొట్టమొదట శివబాబాని చూస్తే రోజంతా బావుంటుంది. బయట వారు కూడా ఉదయం లేవగానే మొదట ఎదురుగా పెట్టుకున్న దేవీదేవతా చిత్రాలను, ఇష్టమైన వారినో చూస్తారు కదా!

## 857. బాబా నావారు అనే మాట ఎంతమంది మనస్సుల నుండి వస్తుంది?

బ్రహ్మాకుమారీల జ్ఞానం మంచిది అంటున్నారు కానీ ఆ జ్ఞానం ఇచ్చేవారు ఎవరు! నడిపించేవారు ఎవరు! ఆధారం ఎవరు! మీ బాబా అనే మాట విని వీరి బాబా అని అంటున్నారు కానీ ఆయన నాకు కూడా తండ్రి అనే బాబా యొక్క ప్రత్యక్షత ఇప్పుడు గుప్తంగా ఉంది. బాబా,బాబా అంటున్నారు కానీ నా బాబా, నేను బాబా వాడిని, బాబా నావారు అనే మాట కోట్లలో కొద్దిమంది నుండే వస్తుంది.

## 858. ఏయే విషయాలు ఫరిస్తాగా తయారవనీయడం లేదు?

బ్రహ్మాబాబా గురించి చెప్తుంటే బ్రహ్మాబాబాలో శివబాబా ఉండేవారు కదా అంటున్నారు లేదా శివబాబా గురించి చెప్తుంటే శివబాబా అయితే నిరాకారుడు, అతీతుడు మేమైతే స్థూలశరీరధారులం అని అంటున్నారు. ఇంత పెద్ద సంఘటనలో ఉంటున్నాము, ప్రతి ఒక్కరి సంస్కారాల మధ్య ఉండేవారము అని అంటున్నారు కానీ సంస్కారాలను కలుపుకోవటం అంటే ఫరిస్తాగా అవ్వటం. సంస్కారాలను చూసి కొంతమంది పిల్లలు బలహీనంగా కూడా అయిపోతున్నారు, బాబా చాలా మంచివారు, బ్రహ్మాబాబా కూడా చాలా మంచివారు జ్ఞానం కూడా చాలా మంచిది, ప్రాప్తులు కూడా చాలా మంచివి అంటున్నారు కానీ స్వభావ, సంస్కారాలను కలుసుకోవటం అంటే సర్వులకు ప్రియంగా అవ్వటం. కొంతమందికే ప్రియంగా అవ్వటం కాదు, ఎందుకంటే కొంతమంది పిల్లలు

కొంతమందితో వారి విశేషతను చూసి ప్రియంగా అనిపిస్తున్నారు అని అంటున్నారు, వీరి ఉపన్యాసం బావుంటుంది, వీరిలో ఈ విశేషత చాలా బావుంది, వీరి వాణీ చాలా బావుంది అంటున్నారు కానీ ఫరిస్తాగా అవ్వటంలో ఇవే విఘ్నాలుగా వస్తాయి. ప్రియంగా చేయండి కానీ నేను ఆత్మను అతీతమైనవాడిని ఇలా అతీతస్థితిలో ప్రియంగా చేయండి. విశేషత వలన ప్రియంగా అవ్వటం కాదు. వీరి ఈ గుణం నాకు మంచిగా అనిపిస్తుంది అంటున్నారు భలే ఆ విశేషతను ధారణ చేయండి కానీ దాని వలన ప్రియంగా అవ్వటమనేది తప్పు.ఫరిస్తా అంటే అందరికీ ప్రియంగా ఉండాలి.ప్రతి ఒక్కరు నావారు అనే అనుభవం చేసుకోవాలి. ఫరిస్తాస్థితిలో రెండు విషయాలు విఘ్నం వేస్తున్నాయి. ఒకటి – దేహభ్రాంతి, ఇదైతే అందరికీ అనుభవమే, 63 జన్మల నుండి మరలా, మరలా దేహభ్రాంతి ప్రకటితమవుతూ ఉంది మరియు రెండవది – దేహాభిమానం. దేహభ్రాంతి మరియు దేహాభిమానం. జ్ఞానంలో ముందుకి వెళ్తూ అప్పుడప్పుడు స్వయం పట్ల కూడా దేహాభిమానంలోకి వచ్చేస్తున్నారు, ఆ అభిమానం అనేది క్రిందికి పడేస్తుంది. ఏమి దేహాభిమానం వస్తుంది? ఏదోక విశేషత ఉంటుంది కదా, ఆ విశేషత కారణంగా అభిమానం వస్తుంది, నేనేమి తక్కువ, నా ఉపన్యాసం అందరికీ ఇష్టమనిపిస్తుంది, నా సేవ ఎక్కువగా ప్రభావం వేస్తుంది, ఇలా ఏదోక కళ యొక్క అభిమానం అంటే నా సంభాళనాశక్తి చాలా మంచిది, నేను చాలా బాగా కోర్స్ చెప్పగలను ఇలా జ్ఞానంలో ముందుకి వెళ్ళేకొలది, సేవలో ముందుకి వెళ్ళేకొలది స్వయం గురించి కూడా ఈ అభిమానం వస్తుంది మరియు ఇతరుల గుణం లేదా కళ లేదా విశేషతను చూసి కూడా ప్రియంగా అయిపోతున్నారు కానీ ఏమి స్మృతి వస్తుంది? దేహాభిమానమే స్మృతి వస్తుంది కదా! ఫలానా వారి బుద్ధి చాలా మంచిది, నా సంభాళనాశక్తి చాలా మంచిది అనే ఈ అభిమానం సేవలో లేదా పురుషార్థంలో ముందుకి వెళ్ళేవారికి అభిమాన రూపంలో వస్తుంది కనుక ఇది కూడా పరిశీలన చేసుకోవాలి మరియు అభిమానం ఉన్నవారికి అభిమానాన్ని పరిశీలించుకునే సాధనం ఏమిటంటే – అభిమానం ఉన్నవారి ఆలోచనను, వారి సలహాను, వారి కళను, వారి సంభాళనను ఎవరైనా అవమానపరిస్తే వారికి చాలా తొందరగా ఆ అవమానం అనుభవం అయిపోతుంది మరియు మరొక సూక్ష్మ గుర్తు ఏమిటంటే వారికి క్రోధం యొక్క అంశమైన గర్వం కూడా ఉత్పన్నం అయిపోతుంది; అది ఫరిస్తాగా అవ్వనివ్వదు.

వర్తమాన సమయానుసారంగా బాప్‌దాదా మరలా సైగ చేస్తున్నారు – మీ సంగమయుగం యొక్క చివరి స్వరూపమైన ఫరిస్తాస్థితిని ఇప్పుడు జీవితంలో ప్రత్యక్షం చేయండి, సాకారంలోకి తీసుకురండి. ఫరిస్తాగా అవ్వటం ద్వారా అశరీరీగా అవ్వటం చాలా సహజం అయిపోతుంది.

స్వయాన్ని పరిశీలించుకోండి – సూక్ష్మ రూపంలో కూడా స్వయం యొక్క లేదా ఎవరి విశేషత యొక్క అభిమానం అయితే లేదు కదా?

**౮౫౯. ఎగస్ట్రా (అదనపు) ఆశీర్వాదాలు ఎవ్వరికి లభిస్తాయి?**

కర్మయోగి అయ్యి నడవాలి, కర్మ వదలకూడదు కానీ కర్మలో యోగాన్ని కలిపి కర్మ మరియు యోగం యొక్క సమానతను ఉంచుకోవాలి. సమానత ఉంచుకునేవారికి ఎగ్స్ట్రా (అదనపు) ఆశీర్వాదాలు లభిస్తాయి. బాగా ఆలశ్యం అనే బోర్డ్ ఇక ముందు పెడతారు కానీ ఎవరైతే ఆలశ్యంగా వచ్చారో వారు ఈ కొద్ది సమయంలో చాలా పురుషార్థం చేసుకోవచ్చు, ధైర్యం ఉన్న పిల్లలకు బాబా సహాయం చేస్తారు అనే వరదానాన్ని బాప్‌దాదా ఇస్తున్నారు.

**౮౬౦. ఏ సమయం కొద్దిగా ఉంది?**

తీవ్రపురుషార్థం చేసే సమయం కొద్దిగా ఉంది.

**౮౬౧. ఏ మూడు విషయాలు సంపూర్ణంగా ధారణ చేస్తే మీ భవిష్యరాజ్యం వస్తుంది?**

1.అకస్మాత్తు అనగా మన మరణం కానీ, ప్రకృతి ఆపదలు ఆకస్మికంగా జరుగుతాయని గుర్తుంచు కోవాలి. 2. ఎవరెడీ అనగా మోహం లేకుండా బాబా ఆజ్ఞ అనుసరించి అది ఎటువంటి సమయమైనా కానీ తయారుగా ఉండాలి. 3.చాలా కాలం యొక్క అభ్యాసం ఉండటం అంటే భగవంతుని ఆజ్ఞాకారిగా ఉండటం ద్వారా పూర్తి ఫలితాన్ని పొందుతారు. పై మూడు విషయాలు పాటించటం ద్వారా స్వర్గం భూమిపై ప్రత్యక్షం అవుతుంది మరియు సర్వాత్మలకు వారసత్వం ఇచ్చే ఆత్మికతండ్రి ప్రత్యక్షమైపోతారు.

**౮౬౨. ప్రపంచం వారికి తినడానికి లేకపోయినా మీకు బాబా పప్పు, రొట్టె ఏవిధంగా పెడతారు?**

ఎవరికైతే సత్యమైన మనస్సు, స్వచ్ఛమైన మనస్సు, విశాలమైన మనస్సు ఈ మూడు విషయాల యొక్క విశేష ధారణ ఆది నుండి అంతిమం వరకు మీలో ఉంటే ఏ సమయంలోనైనా ప్రపంచ పరిస్థితులు ఏవిధంగా ఉన్నా కానీ మీ అందరికీ పప్పు, రొట్టె బాబా పెడతారు. ఇది బాబా యొక్క గ్యారంటీ. బ్రహ్మాబాబాకి సింధు పాకిస్థాన్‌లో ఉన్న హైదరాబాద్‌లో మత కల్లోలాలు, గొడవలు వగైరా జరుగుతున్నప్పుడు చాలామందికి కాయగూరలు లభించనప్పుడు కూడా 5 రూపాయలకే బండి నిండా కాయగూరలు బ్రహ్మాబాబా ముందుకు తీసుకువచ్చేవారు. ఇదే భగవంతుని అద్భుతం.పైన చెప్పిన మూడు విషయాలు మనలో ఉంటే అన్యనమైన పిల్లలైన మనకి కూడా ఆహారానికి ఏ లోటు లేకుండా శివబాబా చేస్తారు.

## 863. మనస్సు విశాలంగా ఉంటే ఏయే పనులు జరుగుతాయి?

పరిశీలించుకోండి – తనువు, మనస్సు, ధనం, సంబంధ సంపర్కాలలో సత్యంగా, విశాలంగా ఉండాలి. మనస్సు విశాలంగా ఉంటే ఏ కోరిక అయినా లేదా అవసరం అయినా తీరిపోతుంది. చేసి చూడండి. ఎక్కడ హృదయం విశాలంగా ఉంటుందో అక్కడ కోరికలన్నీ పూర్తి అయిపోతాయి. మనస్సుని చిన్నగా చేసుకుంటే రచన అంతా చిన్నది అయిపోతుంది. బాబాయే రాజీ అయిపోతే ఇక లోటు ఏముంటుంది!

## 864. సాకారంలో బాబా మధువనం వచ్చినప్పుడు ముఖ్య అతిథులకు కనుసుకున్నప్పుడు పుణ్యం గురించి ఏ విధంగా తెలియచేసారు?

మీరు ఏ వృత్తి చేస్తున్నా కానీ విశ్వపరివర్తనా కార్యంలో సహయోగిగా ఉండండి. వృత్తిపరంగా మీ దగ్గరకు చాలామంది వస్తారు కదా! మీరు మరేమీ చేయలేకపోయినా కానీ మీ విజిటింగ్ కార్డులు ముద్రించుకుంటారు కదా, వాటి వెనుక జ్ఞానం యొక్క ఒక సూక్తి పెట్టండి, టెన్షన్ నుండి ముక్తులు కావాలంటే ఫలానా చోటుకి వెళ్ళండి అని సేవాకేంద్ర చిరునామాను ముద్రించి పంచండి. ఆసక్తి ఉన్నవారు వస్తారు. ఇంట్లో కూర్చుని ఉండగానే సేవ అయిపోతుంది. కొన్ని దేవాలయాల దగ్గర పెద్ద పెద్ద వారు కూడా చెప్పులు జాగ్రత్త చేసే చోట ఉంటారు, ఎందుకని పుణ్యం లభిస్తుంది అని. కానీ మీరు ఈ చిన్న పద్ధతి ద్వారా ఈశ్వరీయ సేవలో సహయోగిగా కావటం ఎంత పుణ్యం!

## 865. భక్తి గురించి శివబాబా ఏ విధంగా తెలియచేసారు?

నా సంస్కారం అంటున్నారు, రావణుని సంస్కారాలను నావి అంటున్నారు, ఈ మాటను కాల్చేయండి. పక్షిని వండుకునేటందుకు త్రాడుతో కట్టేసి కాలుస్తారు, ఆ పక్షి ఉడికిపోతుంది కానీ త్రాడు మాత్రం కాలదు. మీరు ఆత్మ అవినాశి, శరీరం వినాశి అని మొదటి పాఠం చదువుకున్నారు కదా! ఇలాంటి పండుగలు, శాస్త్రాలను తయారుచేసేవారు కూడా బాబాకి పిల్లలే కదా కానీ మీరు గారాభ పిల్లలు; ఆ పిల్లల అద్భుతం కూడా తక్కువేమీ కాదు. పిండిలో ఉప్పు అంత నిజం ఉంటుంది కానీ దాని గురించి కథలు పెద్దగా తయారుచేసేశారు. ప్రతి పండుగని స్మృతిచిహ్నంగా తయారుచేశారు కానీ చాలా సూక్ష్మ విషయాలకు స్థూల రూపాన్ని ఇచ్చేశారు. కానీ స్మృతిచిహ్నాన్ని అయితే తయారుచేశారు కదా! భక్తిలో కూడా తక్కువ చేయలేదు కదా! భక్తిలో ద్వాపర, కలియుగాల్లో కూడా కొన్ని విషయాలు స్మృతిలో ఉంచుకున్నారు. వాటి ద్వారా మనిషిని అతి వికారిగా చేయకుండా రక్షించారు. కనుక బాప్‌దాదా కూడా ఇటువంటి సామాగ్రి, శాస్త్రాలు లేదా పండుగలు తయారుచేసే పిల్లలకు కూడా ఫలం ఇస్తారు. ఏదైనా కానీ భక్తిలో కూడా ఎంతోకొంత స్మృతి చేస్తారు కదా, కొద్ది సమయం అయినా వికారాల నుండి రక్షణగా ఉంటారు.

**866. పుణ్యఖాతా, ఆశీర్వాదాల ఖాతా ఎప్పుడు ఏ విధంగా జమ అవుతుంది?**

మీ పురుషార్థం, సర్వులను సంతుష్టం చేసే పురుషార్థం మరియు సేవ యొక్క పురుషార్థం ఈ మూడు రకాల పురుషార్థాల ద్వారా ఖజానాలను జమ చేసుకోగలరు. ఖజానాలు జమ చేసుకోవటంలో, విశేషంగా సంబంధ సంపర్కాలలోకి రావటంలో నిమిత్తభావం, నిర్మాణభావం, నిస్వార్థభావం, ప్రతి ఆత్మ పట్ల శుభభావన మరియు శుభ కామన కలిగి ఉండటం అవసరం. సేవలో లేదా సంబంధ సంపర్కాలలో ఈ అన్ని భావనలు ఉంటే పుణ్యఖాతా మరియు ఆశీర్వాదాల ఖాతాను చాలా సహజంగా జమ చేసుకోగలరు.

**867. విశ్వంలోని ఆత్మలందరూ ఇప్పుడు ఏ విషయాన్ని కోరుకుంటున్నారు?**

ఆధ్యాత్మికశక్తి కావాలని కోరుకుంటున్నారు ఆ ఆధ్యాత్మికశక్తినిచ్చేవారు శివపరమాత్మ పిల్లలైన మీరే. మీరు తప్ప ఎవరు ఇవ్వలేరు.

**868. కుటుంబంలో ఉండేవారు జ్ఞానంలో నడవడం వలన ప్రజలపై ఎటువంటి ప్రభావం పడుతుంది?**

బ్రహ్మకుమారీ కుమారులుగా అవ్వటం అంటే అన్నీ వదిలివేయాలి అని ఒకప్పుడు అనుకునేవారు కానీ ఇటువంటి వారిని చూసి మేము కూడా ఈ జ్ఞానాన్ని ఆచరించవచ్చు అని వారికి ధైర్యము వచ్చింది.

**869. ఒక కుమారి 21 కుటుంబాలను ఉద్ధరిస్తుందని అంటారు? దాని అర్థమేమిటి?**

మీరు మీ యొక్క 21 జన్మలను ఉద్ధరించుకున్నారు మరియు మీరు ఎవరికైతే నిమిత్తమయ్యారో వారి యొక్క 21 జన్మలను కూడా ఉద్ధరిస్తున్నారు కనుకనే అలా అంటారు.

**870. బేహద్ వైరాగ్యం అనేది సదాకాలికంగా ఉండడం వలన వచ్చే లాభమేమిటి?**

రోజురోజుకి సమస్యలు చాలా పెరగనున్నాయి, సమయాన్ని బట్టి వైరాగ్యం రావటం గొప్ప విషయం కాదు అది బయట వారికి కూడా స్మశానానికి వెళ్ళినప్పుడు వస్తుంది జ్ఞానులైన మీకు భగవంతుని ఆజ్ఞానుసారంగా ఈ సంగమయుగంలోనే ప్రకృతి మీకు దాసీ అయిపోతుంది, సాధనాలు పెరిగిపోతాయి. సాధనాలు ఎందుకు పెరుగుతాయంటే ముందు మనస్సు ద్వారా, తనువు ద్వారా, సమయం యొక్క త్యాగం ద్వారా భగవంతునికి సహయోగి అయిన కారణంగా. కానీ వాటిని మన విశ్రాంతి కోసం ఉపయోగిస్తే వైరాగ్యం సమాప్తం అయినట్లే. ఈ భోగాల వలన అంతకు ముందు సంపాదించుకున్న పుణ్యం కూడా సమాప్తి అయిపోతుంది. ఈ విషయంపై చాలా, చాలా ధ్యాస పెట్టుకోండి. మీలో బేహద్‌వైరాగ్యం లేకపోతే స్వయానికి, విశ్వానికి శక్తినిచ్చే సేవ చేయలేరు. భగవంతుడు అన్నీ సృష్టించి

అందరికీ ఇచ్చారు, భగవంతుని పిల్లలైన మనం ఈ ఒక్క విషయాన్ని ఆచరిస్తే భగవంతుని సమానం అయిపోతాము అనగా భగవంతుడిగా అయితే అవ్వము, భగవంతుడు ఒక్కరే కానీ దేవతలుగా అంటే ఇచ్చేవారిగా అయిపోతాము. ఈ చిన్న యుగంలో ఇచ్చేవారిగా దాతగా అయిపోయి మిగిలిన యుగాల్లోని జన్మలలో ఇతరుల నుండి సర్వసుఖాలు తీసుకుంటాం.

**871. ఏ విశేషతల ఆధారంగా గుల్జార్ దాది శివబాబాకు రెండవ రథం అయ్యారు?**

ఈ బిడ్డకు(గుల్జార్ దాది) చిన్నతనం నుండి వరదానం ఉంది. ఈ బిడ్డకు ధ్యానం యొక్క వరదానం చిన్నతనం నుండి ఉంది. ఈ బిడ్డలో ఉన్న సరళత మరియు సహనశీలత యొక్క విశేషత కారణంగానే ఈమెకు నిమిత్తంగా అయ్యే పాత్ర లభించింది.

**872. ప్రజల నుండి, మాకు జ్ఞానం అందించలేదనే నింద రాకుండా ఉండాలంటే మనం ఏవిధమైన సేవ చేయాలి?**

విశ్వం యొక్క మూలమూలల్లో బాబా యొక్క కల్పపూర్వపు పిల్లలు దాగి ఉన్నారు బాప్‌దాదా విన్నారు, విదేశాలలో ప్రతి ఒక్కరు తమ తమ స్థానాలలో, గ్రామాలలో, పట్టణాలలో మిగిలిఉన్న ఆత్మలకు సందేశాన్ని అందించే ప్లాన్ తయారుచేస్తూ ఉంటారు. దానికి శుభాకాంక్షలు, శుభాకాంక్షలు. లేకపోతే సమాప్తి కానున్నది, పరిస్థితులు మారిపోతాయి అప్పుడు మీ అందరికీ అంటే భారతవాసీయులకి, విదేశీయులకి చాలా చాలా నిందలు వస్తాయి. మా తండ్రి వచ్చారు కానీ మీరు మాకు చెప్పలేదు అని నిందిస్తారు. అందువలన ఇప్పుడు సందేశం ఇస్తూ ఉన్నారు కానీ ఇంకా ఎక్కువగా ఏ మూల మిగిలిపోకుండా ఉండేటందుకు ప్రయత్నించండి.

**873. మొట్టమొదట్లో బ్రహ్మాబాబా దగ్గరకి ఎన్ని రకాల సంస్కారాల వాళ్ళు వచ్చారు? వారు ఎలా పరివర్తన అయ్యారు?**

ఆదిలో బ్రహ్మాబాబా సంస్కారాల ఆటలు ఎన్ని చూశారో! కానీ బాబా సహయోగం ద్వారా ముందుకి వెళ్ళారు మరియు ఇతరులను తీసుకువెళ్ళారు. దానికి ఫలితంగా ఈరోజు ఎంతమంది అయ్యారో చూడండి. కదిలించే విషయాలు వచ్చినా కానీ అచంచలంగా ఉన్నారు దాని పరిణామంగా ఎన్ని సేవాకేంద్రాలు తెరవబడ్డాయి, ఎన్ని కార్యక్రమాలు జరుగుతున్నాయి!

**874. శివ తండ్రి ఇప్పటివరకు పిల్లల్ని విశ్వం ముందు ప్రత్యక్షం చేసారు? తిరిగి మనం ఆయన ఋణం ఏవిధంగా తీర్చుకోవాలి?**

మన తండ్రి వచ్చేశారు అని బ్రహ్మాబాబా, శివబాబా ఇద్దరినీ ప్రత్యక్షం చేస్తాం. అందరి నోటి నుండి బాబాని ప్రత్యక్షమవ్వాలి. ఇప్పుడు ఈ సంవత్సరంలో ఇదే ధృఢ సంకల్పం పెట్టుకోండి

బాబాని ప్రత్యక్షం చేసి తీరుతాం. సగం పని చేశారు, తండ్రి పిల్లలను విశ్వం ముందు ప్రత్యక్షం చేశారు, ఇప్పుడిక పిల్లల పని ఏమిటంటే భగవంతుడు వచ్చేశారు అనే ధ్వని విశ్వంలోని ప్రతి ఒక్కరికీ చేరాలి.

**875. ఎవరికి సహాయం అందించడానికి శివబాబా బంధించబడి వున్నారు?**

ఎవరైతే మనస్సుతో నా బాబా అంటారో వారికి బాబా యొక్క సహయోగం లభిస్తుంది. ఒక్కసారి మనస్సుతో నా బాబా అని అన్నారంటే వేయిసార్లు శక్తిశాలి సహాయం అందించడానికి బాబా బంధించబడి ఉన్నారు.

**876. ఏ విధి పాటించని కారణంగా చింత వస్తుంది?**

నాది అనే దానిని నీదిగా చేశారంటే నిశ్చింతాచక్రవర్తిగా అయిపోయారంతే. ఒకే మాట తేడా; నాది – నీది. ఆ ఒక్క మాటను మార్చేస్తే నిశ్చింతా చక్రవర్తి అయిపోతారు. సహజం కదా! నిశ్చింతా చక్రవర్తిగా అయ్యారు కదా? లేక ఇప్పటికీ చింత ఉందా? ఒకవేళ ఎప్పుడైనా ఉల్లాసానికి బదులు చింత వస్తుంటే నీది అని అనడానికి బదులు నాదిగా భావిస్తున్నారు కనుకనే చింత వచ్చింది.

**877. బాబా హృదయసింహాసన అధికారి ఆత్మతో కల్పమంతా ఎవరు సంబంధంలో ఉంటారు?**

ఎవరైతే హృదయసింహాసనాధికారులుగా ఉంటారో వారు ద్వాపర కలియుగాల్లో కూడా సంబంధంలో ఉంటారు. దగ్గరగా ఉంటారు. అందువలన ప్రేమను నిలుపుకునేవారుగా, సదా హృదయ సింహాసనాధికారులుగా ఉండండి మరియు జన్మజన్మల హక్కుని తీస్కోండి.

**878. ప్రపంచం వారి యొక్క అరుపులు బాబాకి ఏవిధంగా అందుతున్నాయి? మనల్ని బాబా వారికి ఏవిధంగా సేవ చేయమంటున్నారు?**

ప్రపంచంలోని వారు దు:ఖి, అశాంతిగా ఉన్నారు. వారికి మనసాసేవ చేసి వారికి కూడా ఎంతోకొంత సహాయం ఇస్తూ ఉండండి ఎందుకంటే పిల్లలు పిలవటం, అరవటం బాప్‌దాదా సహించలేకపోతున్నారు. వారు కూడా మీ పరివారమే కదా! దు:ఖం, అశాంతి బాగా పెరిగిపోతున్నాయి కనుక ఇప్పుడు దయాహృదయులు అవ్వండి. దాంతో పాటు నడుస్తూ, తిరుగుతూ మరియు అమృతవేళ ఆత్మలకు మనసాసేవ తప్పక చేస్తాం అని సంకల్పం చేయండి. ఈ సంకల్పం చేయగలరా? సదాకాలికంగా సంస్కారాలను సమాప్తి చేసుకుంటాం అని సంకల్పం ఎలాగైతే తీసుకున్నారో అలాగే ఈ సంకల్పం తీసుకోండి. సదాకాలికంగా తీసుకున్నారు కదా లేక కొద్ది

సమయానికి కాదు కదా. ఎలాగైతే సంస్కారాలను సమాప్తి చేసుకుని బాబా సమానంగా అవుతారో అలాగే దాత యొక్క పిల్లలై మాస్టర్ దాత స్వరూపంతో మనసా సేవ కూడా చేయాలి. దీనికోసం తయారేనా? మనసాసేవ చేయడానికి తయారేనా? మనసాసేవ కూడా చేస్తాం అనేవారు చేతులెత్తండి. రోజంతటిలో ఎంత సమయం లభించినా కానీ మనసాసేవ తప్పక చేయాలి ఎందుకంటే పిల్లలైన మీరే సుఖమయ ప్రపంచాన్ని తీసుకురావాలి. బాబా ఈ సేవ కోసమే పిల్లలైన మిమ్మల్ని తన కుడిభుజంగా చేసుకున్నారు.

## 879. యోగంలో మన మనస్సు ఎలా ఉండాలి?

ఒక గంట యోగం చేయాలనుకుంటే ఆ గంటసేపు మనస్సు అలజడి చేయకూడదు. ఆత్మ యజమాని, మనస్సు యజమాని కాదు, మనస్సు ఆత్మకు సహయోగి. సహయోగిని ప్రేమతో ఆజ్ఞాపించండి. మనస్సుని జయించినవారిగా అవ్వండి ఎందుకంటే వ్యర్ధ సంకల్పాలు వచ్చేస్తున్నాయి అని బాప్‌దాదా దగ్గరకి చాలామంది పిల్లల యొక్క సమాచారం వస్తుంది. వద్దనుకుంటున్నారు కానీ వచ్చేస్తున్నాయి. అంటే యజమాని అని అంటారా?

## 880. బ్రహ్మాబాబాకి దేనిపై ప్రేమ ఉంది?

బ్రహ్మాబాబా ఒకరోజు కూడా మురళీని మిస్ చేయలేదు. దేని కారణంగానైనా బొంబాయి వెళ్తున్నా కానీ మురళీ వ్రాసి వెళ్ళేవారు, దానిని మాతేశ్వరి (మమ్మా) చదివేవారు. ఆఖరు రోజు ఆరోగ్యం సరిలేదు, ఉదయం క్లాస్ చేయలేదు కానీ సాయంత్రం క్లాస్ చేసిన తర్వాత అవ్యక్తమయ్యారు. అంటే బ్రహ్మాబాబాకి దేనిపై ప్రేమ ఉంది? మురళీతో. బ్రహ్మాబాబాపై మాకు చాలా ప్రేమ ఉంది కొంతమంది పిల్లలు భావిస్తున్నారు కానీ బాబాకి దేనిపై ప్రేమ ఉందో మీకు కూడా దానిపై ప్రేమ ఉండాలి కదా! అందువలన మురళీ చదువుకోవాలి, క్లాస్‌లో చదవాలి. సాకులు కాకుండా ఏదైనా కష్టం లేదా కారణం ఉండి మురళీ వినకపోతే ఎవరి ద్వారానైనా వినండి.

## 881. సంగమయుగంలో ప్రాప్తి సత్యయుగ ప్రాలబ్ధం కంటే ఏవిధంగా గొప్పది?

సంగమయుగం యొక్క ప్రాప్తి సత్యయుగి ప్రాలబ్దం కంటే గొప్పది. మీ భాగ్యంలో లీనమైపోండి. ఏది జరుగుతున్నా కానీ మీ భాగ్యాన్ని స్మృతిలోకి తెచ్చుకోండి. అప్పుడు ఏ మాట వస్తుంది? ఓహో

నా శ్రేష్ఠ భాగ్యం! ఎందుకంటే భాగ్యాన్ని ఇచ్చిన దాత స్వయంగా మీ తండ్రి. భాగ్యవిధాత ద్వారా ప్రతి ఒక్కరికి భాగ్యం లభించింది.

**882. పిల్లల్ని కలుసుకోవడానికి శివబాబా, బ్రహ్మాబాబా ఎంత దూరం నుండి వస్తున్నారు? మనం బాబాని కలుసుకోవడానికి ఎంత దూరం నుండి వస్తున్నాం? తేడా తెలుపుము?**

దేశ విదేశాలు, ఎన్నో దేశాల నుండి పిల్లలందరు ఇక్కడ కలిసారు కానీ అందరి కంటే దూరం నుండి వచ్చిన వారు ఎవరు? అమెరికా వారు దూరం నుండి వచ్చినట్లా? మరయితే బాబా ఎక్కడి నుండి వచ్చారు? అమెరికా అయితే ఈ లోకంలోనే ఉంది కానీ బాప్‌దాదా ఎక్కడ నుండి వచ్చారు? పరంధామం నుండి, బ్రహ్మాబాబా కూడా సూక్ష్మవతనం నుండి వచ్చారు. మరయితే ఎవరు దూరం నుండి వచ్చినట్లు? అందరి కంటే దూరం ఎవరిది? ఇది తండ్రి మరియు పిల్లల యొక్క ప్రేమ దృశ్యం. నా బాబా అని మీరన్నారు మరియు నా పిల్లలు అని బాబా అన్నారు. కేవలం ఒకరిని తెలుసుకోవటం ద్వారా ఎంత వారసత్వం లభించింది! ప్రపంచంలోని వారు సుఖం కోసం, శాంతి కోసం వెతుకుతూ ఉన్నారు. ఎక్కడ శాంతి లభిస్తుంది, ఎక్కడ సుఖం దొరుకుతుంది అని వెతుకుతూ ఉన్నారు కానీ మీ జీవితం సుఖశాంతి సంపన్నంగా అయిపోయింది.

**883. ఏ పుణ్యం మిమ్మల్ని ముందుకు తీసుకువెళ్తుంది?**

స్మృతిలో ఉండండి మరియు మీకు ఏవైతే ప్రాప్తులు లభించాయో ఆ ప్రాప్తులతో ఇతరులకు సేవ చేయండి. ఎంత సేవ చేస్తారో అంతగా ఆశీర్వాదాలు లభించి అవి మిమ్మల్ని ముందుకి తీసుకువెళ్తాయి. సందేశం ఇస్తూ వెళ్ళండి ఆ తర్వాత వారి అదృష్టం. కానీ మీరు సందేశం ఇవ్వండి. మీ పుణ్యాన్ని జమ చేసుకుంటూ ఉండండి. ఆ పుణ్యమే మిమ్మల్ని ముందుకి తీసుకువెళ్తూ ఉంటుంది.

**884. శివబాబా మనసా సేవ గురించి ఈ వాణిలో ఏవిధంగా తెలియచేసారు?**

మీ మనసా శక్తి ద్వారా సృష్టిలో ఎవరైతే మీ భక్తులు ఉన్నారో లేదా అనేక దు:ఖి, అశాంతి ఆత్మలు ఉన్నారో వారు మిమ్మల్ని జ్ఞాపకం చేస్తూ ఉన్నారు. ఓ పూర్వీకులూ మాకు కొంచెం సమయం

శాంతినివ్వండి, దోసిలితో కొంచెం సుఖం ఇవ్వండి, రక్షించండి అంటున్నారు. కనుక ఇక్కడ కూర్చుని ఉండగానే ఆ ఆత్మలను ఎదురుగా తెచ్చుకోండి. రక్షించండి! రక్షించండి! అనే పిలుపు వినవస్తూ ఉంది. అటువంటి ఆత్మలకు మీ మనసాశక్తి ద్వారా సుఖశాంతి కిరణాలను ప్రసరింపజేయండి. రోజంతటిలో మాటిమాటికి ఈ మనసాసేవ చేస్తూ ఉండండి. ఎందుకంటే బాబాతో పాటు పిల్లలైన మీరు కూడా విశ్వసేవకులు. రోజంతా వాణి ద్వారా ఎలాగైతే సేవకు నిమిత్తమవుతున్నారో అలాగే మధ్యమధ్యలో మనసాసేవ యొక్క అభ్యాసం కూడా చేస్తూ ఉండండి. దీనిలో మీకు కూడా లాభం ఉంది, ఎందుకంటే మీ మనస్సు సదా సేవలో నిమగ్నమై ఉంటే మధ్యమధ్యలో మీ దగ్గరకి వచ్చే మాయా సంకల్పాలు లేదా వ్యర్థ సంకల్పాల నుండి రక్షించబడతారు.

**885. భక్తుల గురించి బాబా ఏమి తెలియచేసారు?**

భక్తులు కూడా తక్కువ బుద్ధి కలిగినవారేమీ కాదు, వారు కూడా మిమ్మల్ని అనుసరించి మీ స్మృతిచిహ్నాన్ని చాలా మంచిగా తయారుచేశారు. ద్వాపరయుగంలో మొట్టమొదటి జన్మ, సహజంగానే సతోప్రధానంగా ఉంటారు ఎందుకంటే పరంధామం నుండి ఆత్మ అప్పుడే వస్తుంది కనుక. ఈరోజు భక్తుల వైపుకి కూడా బాబా దృష్టి వెళ్ళింది. చాలా యుక్తీయుక్తంగా కాపీ చేశారు భక్తులు. మొట్లమొదట్లో ఉండే మీయొక్క విశేష భక్తులు మీ ప్రత్యక్ష కర్మ ఏవిధంగా ఉందో అదేవిధంగా స్మృతిచిహ్నాన్ని చాలా మంచిగా తయారుచేశారు. మీది ప్రత్యక్షమైనది, వారిది స్మృతిచిహ్నం.

**886. మనసాసేవ కూడా ఒక విశేష సమయంలోనే ఎందుకు చేయాలి?**

ట్రాఫిక్ కంట్రోల్, అమృతవేళ నిశ్చితమైనవి, ఆ సమయాలలో చేస్తున్నారు. అదేవిధంగా మీ పనులనుసారంగా మనసాసేవకి కూడా సమయాన్ని నిశ్చితం చేసుకోవటం ప్రస్తుత సమయాన్ని బట్టి చాలా అవసరం. సమయం తీయండి, దయాహృదయులు అవ్వండి. కళ్యాణకారి అవ్వండి. మీ స్వమానం ఏమిటి? విశ్వకళ్యాణకారి. అయితే దయ వస్తుంది కదా? లేక దానికదే అయిపోతుందా? దీనిలో సోమరిగా అవ్వకండి ఎందుకంటే మీరు ఎందరికి శక్తినిస్తారో వారందరు మీ భక్తులవుతారు.

**887. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలు ఏవిధంగా భయపడుతున్నారు?**

ప్రజలైతే ప్రకృతి యొక్క అలజడి చూసి రేపు ఏమవుతుందో అని భయపడతారు. కానీ మీకు తెలుసు, జరగబోయేది అంతా మంచిదే అని ఎందుకంటే సృష్టిచక్రంలో ఇప్పుడు సంగమయుగం

అంటే అమృతవేళ జరుగుతుంది. అమృతవేళ తర్వాత ఏమి వస్తుంది? ఉదయం. అంధకారం సమాప్తి అయిపోయి వెలుగు వస్తుంది. అందువలన మీకు సంతోషం, మా రాజ్యం, సుఖమయ రాజ్యం అక్కడ ప్రకృతి కూడా సుఖమయంగా ఉంటుంది అటువంటి రాజ్యం ఇక రానే వచ్చింది అని సంతోషంగా ఉంది కదా! ఆ రాజ్యంలో దు:ఖం, అశాంతి యొక్క నామరూపాలు ఉండవు. ఎందుకంటే ఇప్పుడు సంగమయుగంలో మీరు ప్రకృతిజీత్‌గా అవుతున్నారు.

### ౮౮౮. ప్రతి మాటలో ఏవిధమైన అనుభవాన్ని ఇతరులకు కలిగించాలి?

ప్రతి మాటలో నేర్పించేవారు అనుభవమవ్వాలి. వీరు ఏదైతే మాట్లాడుతున్నారో వీరికి నేర్పించినవారు, వీరిలో శక్తినింపేవారు సర్వశక్తివంతుడైన తండ్రి, భగవంతుడు అని తెలియాలి. వీరు భగవంతుని పిల్లలు, భగవంతుని విధ్యార్ధులు, భగవంతుడిని అనుసరించే అనుచరులు కాదు, ఒక అడుగులో కోటానుకోట్ల సంపాదన చేసుకునేవారు.

### ౮౮౯. అదనపు పుణ్యం ఏ విషయం ధారణ చేస్తే మనకు లభిస్తుంది?

మధువనంలో ఉండే ప్రతి బిడ్డపై బాప్‌దాదాకి విశేష ప్రేమ ఉంటుంది, ఎందువలన? బాబా స్థాపన చేసిన యజ్ఞం యొక్క సేవలో స్వయాన్ని సమర్పితం చేసుకున్నారు. మధువనం వారికి 1. తమ పురుషార్ధం యొక్క ఫలం లభిస్తూ ఉంది మరియు 2. మధువనానికి వచ్చే బ్రాహ్మణులు లేదా కొత్తఆత్మలకి సేవ చేస్తారు, యజ్ఞ సేవ ఇది, సాధారణ సేవ కాదు కనుక ఆ యజ్ఞసేవకు కూడా అదనపు పుణ్యం లభిస్తుంది. ఏ మధువన నివాసీ అయినా కానీ అమృతవేళ నుండి రాత్రి వరకు బాప్‌దాదా యొక్క శ్రీమతానుసారంగా నడిస్తే దానికి అదనపు పుణ్యం లభిస్తుంది, అది వారికి తెలిసినా తెలియకపోయినా, ఈ విషయంలో సోమరిగా ఉన్నా కానీ మధువన సేవ యొక్క పుణ్యం తప్పక లభిస్తుంది. మధువననివాసి అవ్వటం సాధారణ విషయం కాదు. ఎవరు ఏ పని చేస్తున్నా కానీ, శుభ్రం చేయిస్తున్నా కానీ ఆ సాధారణ పని యొక్క పుణ్యం కూడా ఎక్కువే లభిస్తుంది ఎందుకంటే స్వయంగా బాబా రచించిన యజ్ఞం కనుక. ఈ యజ్ఞం ద్వారానే మధువనంలో అందరికీ పరమాత్మ ప్రేమ ప్రాప్తిస్తుంది. అందువలన మధువనంలో తప్ప బాబా మరెక్కడా రారు. బాబా రావటం, కలుసుకోవటం అనే పాత్ర మధువనానికే నిర్ణయం అయ్యి

ఉంది. కనుక మధువనంలో ఉండే ప్రతి ఒక్కరు మీ పుణ్యఖాతా గురించి తెలుసుకోండి, గ్రహించండి మరియు ఆ మహాన్ ప్రాప్తి స్వరూపులు అవ్వండి. ఇక్కడ ఏది జరిగినా కానీ మీ పని ఏమిటంటే అది పెద్దవారికి చెప్పటం. పెద్దవారికి చెప్పేశారు అంటే మీ మనస్సు నుండి తీసేశారు. మీ భాద్యత పూర్తయిపోయింది. ఏదైనా సరిగ్గా జరగటం లేదు అని మీకు అనిపిస్తే దానిలో మీకు పాపం తయారవ్వదు. ఎవరు భాద్యులో వారికి తయారవుతుంది. మీరు నిశ్చింతగా ఉండండి. పెద్దవారికి చెప్పట మీ పని, కానీ ఆ తర్వాత ఏమి జరిగింది, ఏమి జరగలేదు, ఇలా ఎందుకు అవ్వలేదు, అలా ఎందుకు అవ్వలేదు వీటి గురించి మీకు అవసరం లేదు, వీటి వలన మరిన్ని వ్యర్థ సంకల్పాలు వస్తాయి. మీ భాద్యత మీరు నెరవేర్చండి. విషయం పెద్దవారికి వరకు చేర్చండి, అది కూడా పద్ధతి ప్రకారం మధువననివాసి బ్రాహ్మణులు మీరు, ఉన్నతమైనవారు మీరు కనుక మీ కర్తవ్యం ఏమిటో తెలుసుకుని ఆ కర్తవ్యాన్ని చేయండి. మీ కర్తవ్యం గురించి విని అందరు నేర్చుకునేవిధంగా ఉండాలి.

## ౮౨౦. స్నేహం ఏవిధంగా ఉండాలి?

ఎవరైతే మీటింగ్‌కి వచ్చారో వారందరు ఒక విషయంలో ముందుకి వెళ్ళాలి. ఎవరు, ఎంతమంది మీకు సేవ కోసం సహయోగిగా ఉన్నారో వారిని సదా మీ సంతోషం మరియు ప్రాప్తి ద్వారా సంతుష్టంగా ఉంచాలి. ఒకవేళ వారికి శిక్షణ ఇస్తున్నా కానీ శిక్షణతో పాటు స్నేహాన్ని కూడా ఇవ్వండి. ఆ స్నేహం ఆధారంగా వారు తమని తాము ముందుకి తీసుకువెళ్ళగలరు. మీ స్నేహాన్ని వారు లోకువగా తీసుకునేటంత ఇవ్వకండి, స్నేహం కారణంగా ఏది చేసినా కానీ క్షమించేయటం లాంటి స్నేహం ఇవ్వకండి.

## ౮౨౧. మన శక్తి ద్వారా వాయుమండలాన్ని మారిస్తే ఏవిధమైన ఫలితం ఉంటుంది?

ఉండడానికి, తినడానికి సౌకర్యాలు సెంటర్‌లో కల్పిస్తున్నారు కానీ వారిలో ఎంత శక్తి నింపాలంటే వారు బాబా నుండి శక్తిని తీసుకుని మీ సేవాస్థానం యొక్క వాయుమండలాన్ని బాగా తయారుచేయాలి దాని ద్వారా అక్కడికి ఎవరు వచ్చినా కానీ మొదట ఆ వాయుమండలం యొక్క ఆకర్షణలోకి వచ్చేయాలి. ఎందుకంటే ఈరోజుల్లో అందరు ఇదే కోరుకుంటున్నారు రాగానే ఏదో

అనుభవం అయ్యేవిధంగా ఉండాలనుకుంటున్నారు. చూడగానే ఏదో అనుభవం అవ్వాలి. వినే అనుభవం అయితే అవుతుంది, యోగం యొక్క అనుభవం కూడా అవుతుంది కానీ వాయుమండలం యొక్క అనుభవమవ్వాలి. ఈ ధ్యాస నిమిత్త ఆత్మలు పెట్టుకోవాలి, వారికి ఇది విశేష సేవ. స్వయం యోగయుక్తంగా అయ్యి వాయుమండలంలో మంచి స్థితిలో ఉంటే కనుక ఆ ప్రభావం సేవాస్థానంపై స్వతహాగానే పడుతుంది. ఎలాగైతే బాప్‌దాదా లేదా నిమిత్తమైన ఉన్నత ఆత్మల యొక్క వాయుమండలం, తరంగాలు ప్రభావం వేస్తాయి కదా! బాప్‌దాదా వచ్చినప్పుడు వాయుమండలం మారిపోతుంది కదా! అలాగే ప్రతి బిడ్డ వాయుమండలాన్ని తయారుచేయాలి. ఎందుకంటే ఇప్పుడు మీ సేవాకేంద్రాల యొక్క వాయుమండలం మారినప్పుడే విశ్వం యొక్క వాయుమండలం మారుతుంది. మీ సేవాస్థానాలే నిమిత్తం.



పరమాత్మ శివుడు ఈ భూమిపై అవతరించారు
నివాసం పరంధామం
కర్తవ్యం ధర్మస్థాపన
భగవంతుని సత్య స్వరూపం
సత్య యుగం
కలి యుగం
ప్రజాపిత బ్రహ్మా
సంగమ యుగం
జ్యోతిబిందు శివపరమాత్మ ప్రజాపిత బ్రహ్మాకు
చేయించిన కలియుగ మహావినాశనం మరియు
సత్యయుగ స్థాపన యొక్క దివ్య సాక్షాత్కారాలు